తెలంగాణ రాష్ట్ర సాధన

# ఉద్యమ డైరీ

(2009-2014)



పిట్టల రవీందర్

తెలంగాణ రాష్ట్రసాధన

# ఉద్యమ డైరీ

(2009-2014)

## పిట్టల రవీందర్

**హోం ల్యాండ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్,**

*ఇం.నెం. 5-9-22/4, హిల్‌ఫోర్ట్,*

*ఆదర్శ్‌నగర్, హైదరాబాద్ - 63 ఫోన్ 040 64525234*

**తెలంగాణ రాష్ట్రసాధన**

# ఉద్యమ డైరీ – (2009-2014)

**– పిట్టల రవీందర్**

*సహకారం*

**సంపత్ నాగేందర్**

*ప్రచురణ*

**హెూం ల్యాండ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్**

***ఇం.నెం.5-9-22/4, హిల్‌ఫోర్ట్, ఆదర్శనగర్,***

***హైదరాబాద్-63, ఫోన్: 040-64525234, 040-23243599***

© *హెూం ల్యాండ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్*

©

*ప్రథమ ముద్రణ:* **సెప్టెంబర్, 2015**

*రెండవ ముద్రణ:* **అక్టోబర్, 2015**

*ప్రతులు*

**3000**

*వెల*

**రూ. 225/-**

*ప్రతులకు*

**అన్ని ప్రధాన పుస్తక విక్రయ కేంద్రాలలో**

*కవర్‌పేజీ డిజైన్*

**పరమేశ్వర్**

*పేజినేషన్*

**గోలి సమ్మిరెడ్డి**

**విజేత గ్రాఫిక్స్-9394322782**


*ముద్రణ*

**చిన్మయి ప్రింటర్స్**

**మలక్‌పేట, హైదరాబాద్ – 9866417353**

తెలంగాణ కోసం
విలువైన
ప్రాణాలను
ధారపోసిన
అందరికీ
ఉద్యమ జోహార్లు





**ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి**
**టీఎస్‌పీఎస్సీ చైర్మన్**

నాకు మూడు దశాబ్దాల నుండి పిట్టల రవీందర్ సన్నిహిత మిత్రుడు. నేను, అల్లం నారాయణ, పిట్టల రవీందర్...ముగ్గురమూ కలిసి ఒకే సందర్భంగా 'జీవగడ్డ' సాయంకాలం దినపత్రికలో జర్నలిస్టులుగా మా ప్రయాణాన్ని కలిసి మొదలుపెట్టాం. అప్పటి నుండి మా అనుబంధం కొనసాగుతున్నది. పిట్టల రవీందర్ లోతైన అధ్యయనశీలత కలిగిన మిత్రుడు. ఆయన తన ఉద్యమ అనుభవాలను పుస్తకంగా తీసుకురావాలని చాలాసార్లు సూచించాను. సరైన సమయంలో, సందర్భంలో ఈ పుస్తకాన్ని తీసుకు వచ్చినందుకు మిత్రుడు పిట్టల రవీందర్‌ను అభినందిస్తున్నాను.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం మిగిలిన అస్తిత్వ ఉద్యమాలకు చాలా భిన్నమైనది. ఈ ఉద్యమం అకాడమీషియన్‌లను ఉద్యమకారులుగా, ఉద్యమ కారులను అకాడమీషియన్లుగా మార్చింది. ఇది మంచి పరిణామం. ఉద్యమ కారులు చరిత్ర రాసుకోవాలి. అకాడమీషియన్లు ప్రజలను ప్రేరేపిస్తూ, కదిలించే పనిచేయాలి. తెలంగాణ చరిత్రపై లోతైన విశ్లేషణ ఇంకా జరగాల్సిఉంది.

తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో పూర్తిగా మమేకమై, కోదండరామ్‌తో రాముడివెంట లక్ష్మణుడిలాగా, నీడలా పది సంవత్సరాలు కలిసి నడిచిన పిట్టల రవీందర్ ఒక సీనియర్ జర్నలిస్టుగా, ఒక సానుకూల దృక్పథంతో ఆ పనిని సమర్థవంతంగా చేయగలడని నా నమ్మకం.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఒక బలమైన ప్రజాఉద్యమంగా మారింది. భారతదేశంలో ప్రజాస్వామిక ఉద్యమాలకు ఇది ఒక ప్రతీకగా నిలుస్తుంది. ప్రజల ప్రజాస్వామికమైన ఒక డిమాండు రాజ్యాంగబద్ధంగా ఏ విధంగా సాధ్య పడుతుందనే అంశంపై తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నేపథ్యం నుండి సమగ్రమైన అధ్యయనం జరగాలి. అట్లాంటి విశ్లేషణ చేయగలిగిన సమర్థుల్లో పిట్టల రవీందర్ ఒకరు.

తెలంగాణ చరిత్రకు ప్రామాణికత లేదనే ప్రచారం, వాదన అభ్యంతర కరమైనది. ఆందోళనకరమైన అంశం కూడా ప్రామాణికత లేకుండా చరిత్ర ఉండదు. పిట్టల రవీందర్ తీసుకువచ్చిన 'ఉద్యమడైరీ' తెలంగాణ చరిత్ర ప్రామాణికతను నిలబెట్టే ఒక ప్రయత్నం. ఈ పుస్తకం చూస్తే తెలంగాణ రాష్ట్రసాధన చరిత్రకు ఉన్న ప్రామాణికత ఏమిటో తెలుస్తది. సిన్సియర్‌గా ఆ ప్రయత్నం చేసిన మిత్రుడు పిట్టల రవీందర్ అభినందనీయుడు.



అల్లం నారాయణ
ప్రెస్ అకాడమీ చైర్మన్

కొత్తగా ఏర్పాటైన రాష్ట్రంలో, కొత్తగా వచ్చిన ప్రభుత్వం మనకు మంచి చేస్తున్నదా, చెడుచేస్తున్నదా? అనే మీమాంసలో చర్చోప చర్చల్లో కూరుకుపోతున్న మనం ఇక్కడి దాకా మనలను తీసుకువచ్చిన, మనతో నడిచివచ్చిన చరిత్రను రికార్డు చేయడాన్ని మర్చిపోతున్నాం. తెలంగాణలో మాత్రమే ప్రత్యేకంగా కనిపించే పోరాట వారసత్వ మూలాలను అర్థం చేసు కోకుండా చరిత్రను సరైన కోణం నుండి రికార్డు చేయలేము. వర్తమాన చరిత్రను అర్థం చేసు కోలేము. భవిష్యత్తు చరిత్రను నిర్మించలేము.

నిజాం పాలనాకాలంలో భావప్రకటనా స్వేచ్ఛలేని సమయంలోనూ హైదరా బాద్‌లో భాగ్యారెడ్డివర్మలాంటివారి చొరవతో సంస్కరణోద్యమాలు, కులనిర్మూల నోద్యమాలు, బాల్యవివాహాలు, మద్యపాన వ్యతిరేక ఉద్యమాలు కూడా జరిగాయి.. అందువల్ల తెలంగాణ చరిత్ర విశిష్టమైనది. విచిత్రమైనది. భిన్నమైనదికూడా.. అందువల్ల ఈ చరిత్రలో చాలా ఖాళీలున్నాయి.

కమ్యూనిస్టులు, ఆర్యసమాజ్, స్టేట్ కాంగ్రెస్‌లాంటి పోరాటాలు ఒకే అస్తి త్వంతో కనిపించినప్పటికీ వాటికి వేర్వేరు రూపాలు, పార్శ్వాలు భిన్నంగా ఉంటాయి. 1969తర్వాత ఉద్యమంలో ఖాళీలున్నాయనే అభిప్రాయం సరికాదు. తెలంగాణ సమాజానికి విద్యుత్ ప్రవాహంలాంటి ఒక ప్రత్యేక లక్షణం ఉంటుంది. ఇక్కడ ఏ పరిణామాలైనా వేగవంతంగా కదులుతాయి. 1996లో ఉద్యమం ఒక ఆకాంక్షగా మొదలై, ఒక డిమాండుగా మారి, ఒక రాజకీయ ప్రక్రియగా రూపాంతరం చెందడం... ప్రజలు తమ ప్రజాస్వామిక డిమాండును సాధించుకోవడానికి ఇంతటి చైతన్యాన్ని ప్రదర్శించడం చరిత్రలో ప్రపంచంలో మరెక్కడా ఇంత స్పష్టంగా కనిపించదు.

పిట్టల రవీందర్ ఒక మంచిపనిచేసాడు. భావి చరిత్రకారులకు, మనల్ని మనం వెనక్కి తిరిగి చూసుకోవడానికి, ఎప్పుడేం జరిగిందో తెలుసుకోవడానికి, ఏ యే పోరాటరూపాలు, ఎప్పుడెప్పుడు చేసినం, ఎందుకు చేసినమో గమనం లోకి తెచ్చుకోవడానికి, జ్ఞాపకం చేసుకోవడానికి, స్మృహలోకి తెచ్చుకో వడానికి, గుర్తుంచుకోవడానికి, యాదికి తెచ్చుకోవడానికి, మతికి ఉంచు కోవడానికి ఈ పుస్తకం చాలా ఉపయోగపడుతుంది. అందుకు పిట్టల రవీందర్ అభినందనీయుడు.



**సి. విఠల్**
**టీఎస్‌పీఎస్సీ సభ్యులు**

అరవై సంవత్సరాల సుదీర్ఘ చరిత్రను కలిగిఉన్న తెలంగాణ రాష్ట్రసాధన మహోద్యమ చరిత్ర కావాల్సిన రీతిలో యథాతథంగా రికార్డు కాలేదు. 1969లో జరిగిన వీరోచితమైన పోరాటంలో 369 మంది చనిపోయారని గుర్తుకు చేసు కుంటాంగానీ, వారిపేర్లు, ఎవరు, ఎప్పుడు, ఏ గ్రామంలో చనిపోయారులాంటి సమగ్రమైన వివరాలు ఇప్పటికీ లేవు. సేకరించే ప్రయత్నం చేసినా సమగ్ర సమాచారం దొరకలేదు. 1969 కాలంలో జరిగిన సంఘటనలు కూడా పూర్తిగా రికార్డు కాలేదు. కానీ ఈ మలిదశ ఉద్యమంలో 2001 నుండి 2014వరకు జరిగిన పోరాటంలో, ముఖ్యంగా 2009 నుండి రాష్ట్రం ఏర్పడేవరకు జరిగిన సంఘటనలన్నింటికీ కూడా ఇక్కడ కూర్చున్నవాళ్లందరమూ భాగస్వాములం. సజీవ సాక్షులం. మిత్రులు పిట్టల రవీందర్‌గారైతే ఉద్యమ వివరాలు, సంఘటనలు, పత్రికల్లో వచ్చిన వార్తాకథనాలు ఎప్పటికప్పుడు తనవెంటఉండే డైరీలో రాసుకునేవారు. ఒక సరైన సమయంలో తెలంగాణ ఉద్యమంలో జరిగిన సంఘటనలను నెమరువేసుకోవడానికి ఆసక్తిగా ఉన్న సమయంలో యథాతథంగా రికార్డు చేస్తూ ఈ 'ఉద్యమ డైరీ'ని తీసుకువచ్చినందుకు మిత్రుడు పిట్టల రవీందర్‌గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

---



**టంకశాల అశోక్**
**సీనియర్ జర్నలిస్టు**

ఉద్యమంలో చాలా బిజీగా ఉండికూడా ఈ పుస్తకాన్ని తీసుకువస్తున్నందుకు ముందుగా పిట్టల రవీందర్ గారిని అభినందిస్తున్నాను. ముఖ్యంగా ఉద్యమ చరిత్రను రికార్డు చేయడంలో 5 రకాల అవకాశాలున్నాయి.

1. ఇప్పుడు పిట్టల రవీందర్ 'ఉద్యమ డైరీ' రూపంలో తీసుకువచ్చిన సంఘటనలు, సమయ సందర్భాలకు సంబంధించిన సమాచార సమాహారం.
2. కంపైలేషన్ మరియు డాక్యుమెంటేషన్. ఈ ప్రయత్నం మనదగ్గర జరగాల్సినంతగా జరగడంలేదు.
3. అనుభవాలను రాయడం. ఉద్యమంలో వివిధ స్థాయిల్లో పూర్తిగా మమేకమైనవాళ్లు, ఉద్యమాన్ని నిశితంగా పరిశీలిస్తున్నవాళ్లు తమ అనుభవాలను వీలైనంత తొందరగా రికార్డు చేయాలి.
4. సంస్థలు, పార్టీలు, జేఏసీ, ఇతర సంఘాలు ఉద్యమంలో సంఘపరంగా తాము నిర్వహించిన పాత్రను రికార్డు చేయాలి. విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్నవాళ్లు, పరిశోధనలు చేస్తున్నవాళ్లు సిద్ధాంతపరమైన అవగాహనల నేపథ్యం నుండి తమ అభిప్రాయాలను క్రోడీకరించడం కూడా అవసరం.
5. ప్రజా ఉద్యమాలను రికార్డు చేయడంలో మౌఖిక చరిత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఉద్యమంలో భాగస్వాములైన ప్రజలు, ఉద్యమంలో బాధలు అనుభవించినవాళ్లు, ఉద్యమం వల్ల నష్టపోయినవాళ్లు తాము చూసిన ఉద్యమాన్ని గురించి ఏమను కుంటున్నారనేది కూడా చాలా ముఖ్యం. చరిత్రను రికార్డు చేయడంలో, తెలంగాణ పునర్నిర్మాణంలో ఇది కూడా ఒక ముఖ్యమైన భాగమనే అంశాన్ని చరిత్రకారులు గుర్తించాలి.

నమస్తే తెలంగాణ

# తెలంగాణ చరిత్రను అక్షరబద్ధం చేయాలి

- మేధావులు, ప్రొఫెసర్లు ఇందుకు పూనుకోవాలి
- తెలంగాణ ప్రజలే తెలంగాణ చరిత్ర నిర్మాతలు
- 'తెలంగాణ రాష్ట్ర సాధన-ఉద్యమ డైరీ' పుస్తకావిష్కరణలో వక్తలు



[illegible]

[illegible]

**సమగ్ర చరిత్ర రావాలి: చక్రపాణి**

[illegible]

**తెలంగాణ చరిత్రపై స్పృహ పెంచిన టీఎన్జీవోస్: కోదండరాం**

[illegible]

ఈనాడు

# 'సమగ్ర తెలంగాణ ఉద్యమ చరిత్ర' రూపకల్పన కష్టం కాదు

- ప్రామాణికం లేదనడం అర్థరహితం
- 'ఉద్యమ డైరీ' ఆవిష్కరణ సభలో టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ చక్రపాణి
- అచ్చులోకి రాని సమాచారం చాలాఉంది: కోదండరాం



'తెలంగాణ సాధన ఉద్యమ డైరీ'ని ఆవిష్కరించిన టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ చక్రపాణి. చిత్రంలో కోదండరాం, అల్లం నారాయణ, విఠల్ తదితరులు

ఈనాడు – హైదరాబాద్

తెలంగాణ చరిత్రను సృష్టించింది ప్రజలేనని.. ఆ చరిత్రను రాయడం కష్టమేమీకాదని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఘంటా చక్రపాణి చెప్పారు. పాత్రికేయుడు పిట్టల రవీందర్ రచించిన 'ఉద్యమ డైరీ'ని శనివారం హైదరాబాద్‌లో రాజకీయ ఐకాస ఛైర్మన్ కోదండరాం, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రకు ప్రామాణికం ఎక్కడనే కొత్త వాదన కొందరు లేవనెత్తుతున్నారని, ఇది అంటే గన వంగోసే విషయమన్నారు. మన చరిత్రను మనమే రాసుకుందామని తెలిపారు. ఆచార్య కోదండరాం లాంటి వారు కలిస్తే సమగ్ర తెలంగాణ ఉద్యమ చరిత్రను కొద్దికాలంలోనే రాసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కేవలం ఘటనలు కాకుండా తెలంగాణ ఉద్యమం బలమైన ప్రజాఉద్యమంగా ఎందుకు మారిందో లోతైన విశ్లేషణతో కూడిన పుస్తకాలు రావాలన్నారు. అందుకు కోదండరాం పూనుకోవాలని ఆయన కోరారు. రాజకీయ ఐకాస ఛైర్మన్ కోదండరాం మాట్లాడుతూ పోటీపరీక్షలు, ఇతర ఏకారణాలకైనా తెలంగాణ చరిత్ర తెలుసుకోవాలన్న ఆసక్తి బాగా పెరిగిందన్నారు. వాస్తవానికి 1969 ఉద్యమంపైనా రావాల్సినన్ని పుస్తకాలు రాలేదని చెప్పారు. 'ఉద్యమ డైరీ' పునాదిగా మరిన్ని గ్రంథాలు వెలువడే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ తెలంగాణ చరిత్రలో పూరించాల్సిన ఖాళీలు చాలా ఉన్నాయన్నారు. సీనియర్ పాత్రికేయుడు టంకశాల అశోక్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను సంఘటనల సమాహారంతోపాటు డాక్యుమెంటేషన్ చేయడం, వ్యక్తిగతంగా, భాగస్వాములైన వారు, సంస్థలు, పార్టీలు, చరిత్రకారులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు కూడా రాయాల్సి ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ సభ్యుడు సి.విఠల్ మాట్లాడుతూ 1969లో 369 మంది మృతిచెందితే వారి పేర్లు, ఊర్లు, తేదీలు లేవన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
www.sakshi.com

# తెలంగాణ చరిత్రపై ఆంగ్ల రచనలు రావాలి

- తెలంగాణ ఎందుకొచ్చిందని ఇతర రాష్ట్రాల వాళ్లు అడుగుతున్నారు
- ఉద్యమ చరిత్ర ప్రపంచానికి తెలిసేలా మరిన్ని రచనలు రావాలి
- ఉద్యమంపైన పుస్తకావిష్కరణలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి
- తెలంగాణ చరిత్ర తెలుసుకోవాలన్న తపన బాగా పెరిగింది: కోదండరాం

సాక్షి, హైదరాబాద్: "తెలంగాణ చరిత్ర తెలియక పోవడం వల్ల ప్రత్యేక రాష్ట్రం ఎందుకు వచ్చిందని ఇతర భాషల వారు అడుగుతున్నారు. [illegible]

### ఉద్యమ చరిత్రపై తపన పెరిగింది

[illegible]



శనివారం హైదరాబాద్‌లో 'తెలంగాణ రాష్ట్ర సాధన-ఉద్యమ స్ఫూర్తి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఘంటా చక్రపాణి. చిత్రంలో [illegible], కోదండరాం, [illegible]

[illegible]

## భావితరాలు తెలుసుకునేలా..

[illegible]

THE HINDU

# ‘Democracy still alive in Telangana’

Staff Reporter

HYDERABAD: Telangana Joint Action Committee chairman M. Kodandaram felt that the situation in Telangana State is still conducive to democracy and dialogue, despite elevated police violence against Maoist cadre in the recent times.

Speaking on the sidelines of a book release event here on Saturday, Mr. Kodandaram said the situation before 2002 was much more frightening, as people could not even discuss amongst themselves, let alone organise meetings.

Telangana movement has eased the situation, and created a democratic environment conducive to debates and open discussions, he said, while answering a question about the State's repression in the backdrop of the killing of two Maoists Sruthi and Vidyasagar, alleged to have been captured and tortured by the police.

Nevertheless, the use of violence must be condemned, as it would only aid the increase of violence in the whole society, he said.

Speaking after release of the book 'Telangana Rashtra Sadhana- Udyama Diary' by Pittala Ravinder here on Saturday, Mr. Kodandaram, who is set to retire from his teaching job at the Osmania University this month-end, said there is a need to document various incidents and experiences which have not been recorded so far.

Telangana State Public Service Commission Chairman Ghanta Chakrapani, who released the book, said the history of Telangana movement needed a much deeper analysis, and an authentic version. The movement which had begun in 1948 should be compiled in a comprehensive way up to the State formation, he said.

Telangana Press Academy chairman Allam Narayana noted that Telangana society has a continuing history since Nizam's era, and in its latest and final moment, has served as a means to understand the ill effects of globalisation.



*Telangana State Public Service Commission Chairman Ghanta Chakrapani releasing 'Udyama Diary' in the presence of Telangana Press Academy chairman Allam Narayana, TJAC chairman M. Kodandaram Reddy and P. Ravinder in the city on Saturday.*

— PHOTO: MOHAMMED YOUSUF

# తెలంగాణ రాష్ట్ర సాధన - నేపథ్యం - పరిణామాలు



'పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం' ప్రజాస్వామిక వ్యవస్థకు ఉన్న మౌళికమైన లక్షణాలలో అత్యంత ముఖ్యమైనది. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ, పరిపాలనలో వికేంద్రీకరణ సాధించే ఉద్దేశ్యంతోనే ఫెడరల్ వ్యవస్థకు భారతదేశంలో అవకాశం కల్పించు కున్నాము.. రాజ్యాంగ వ్యవస్థ పటిష్టంగా ఉండటానికి ఈ సమాఖ్య వ్యవస్థ అత్యంత కీలకమైన అంశంగా మారింది. మన రాజ్యాంగ వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తిని ఇనుమ డింపజేస్తున్నది. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించగలగడానికి కూడా ఇదే సమాఖ్య విధానం ఉపయోగపడుతున్నది. ప్రతిప్రాంతం, ఆయా ప్రాంతాల లోని భిన్నమైన సంస్కృతులను కలిగిఉన్న ప్రజలు తమ అస్థిత్వాన్ని కాపాడుకుండా, దేశ సమగ్రతను, ఐక్యతను ఇనుమడింపజేయటానికి ఇదే ప్రాతిపదిగా పనిచేస్తున్నది.

బ్రిటిష్ పాలనాకాలంనుండే భారత దేశంలో రాష్ట్రాలను ఏర్పాటు చేయడం ప్రారంభమయ్యింది. అయితే బ్రిటిష్ పాలనా కాలంలో కేవలం తమ పరిపాలనా సౌలభ్యం, ఆర్థిక అవసరాలు ఆధారంగానే ప్రాంతాలమధ్యన విభజన జరిగింది. ప్రజల యొక్క అభిప్రాయాలుగానీ, వారి అవసరాలుగానీ, ప్రజల ఆచార వ్యవహారాలుగానీ, సంస్కృతిని గానీ రాష్ట్రాల విభజనకు ఆ రోజుల్లో ప్రాతిపదికగా చూడలేదు. అందువల్లనే అభివృద్ధిలోనూ, మానవ సమాజ వికాసంలోనూ ప్రాంతాల మధ్యన, ప్రజల మధ్యన అంతరాలు తొలగిపోలేదు.

స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంతో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ అంశం తెరమీదికి వచ్చింది. పరిపాలనా వికేంద్రీకరణ, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రాంతాలమధ్యన అభివృద్ధిలో సమతుల్యతను సాధించడం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు ప్రేరణగా నిలిచాయి. అయితే వలసపాలనకున్న స్వభావాలను అర్థం చేసుకుని, ప్రాంతాలమధ్యన ఏర్పడిన వైవిధ్యతలను పరిగణలోకి తీసుకుని రాష్ట్రాలను ఏర్పాటు చేసిఉంటే చాలావరకు ప్రజల ఆకాంక్షలు నెరవేరిఉండేవి. ప్రతిప్రాంతానికీ, అక్కడి ప్రజలకు ఉండే ప్రత్యేక అవసరాలను గుర్తించి,వాటి పరిష్కారానికి కృషిచేసేవిధంగా ప్రయత్నించకుండా, భాష అనే ఏకైక ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్వ్యస్థీరకణ

నిర్వహించడంతో సమైక్య భావనలో కొత్త సమస్యలకు బీజం పడింది. ఫలితంగా భిన్నమైన సంస్కృతికి సంబంధించిన సమూహాలు, భిన్న సామాజిక వ్యవస్థలు, ఒకే రాష్ట్రంలో భాగస్వాములు కావాల్సివచ్చింది. ఈ వైవిధ్యత భిన్న ప్రాంతాల మధ్యన, సంస్కృతులను పాటించే ప్రజల మధ్యన నిరంతర ఘర్షణకు కారణ మయ్యింది. ఈ పరిణామాలు 'భిన్నత్వంలో ఏకత్వం' సాధించే సమైఖ్య భావనకు ఆటంకంగా పరిణమించింది.

ప్రజల నుండి వ్యక్తమయ్యే ప్రాంతీయ అస్థిత్వాన్ని వారి దృష్టికోణం నుండి ఆలోచించి పరిష్కరించేందుకు ప్రయత్నించకుండా అణచివేసే ప్రయత్నాలే జరిగాయి. చారిత్రక పరిణామాల నేపథ్యం నుండి తెలంగాణ డిమాండును పాలకులు అర్థం చేసుకుని, తగిన పరిష్కారానికి పూనుకుని ఉంటే ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు పరిష్కారం మరింత సులభంగా, మరింత ముందుగానే లభించిఉండేది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే భిన్నమైన చరిత్ర, సంస్కృతులు, ఆచారవ్యవహారాలతో కలగలసిన ఉమ్మడి రాష్ట్రం. తెలంగాణప్రాంతం రాచరిక వ్యవస్థ కారణంగా విద్యాపరంగానూ, సామాజికంగానూ ఎదగలేకపోయింది. కానీ ఆంధ్రా ప్రాంతం ఇందుకు భిన్నంగా .. బ్రిటిష్ పాలనక్రింద కొనసాగడంవల్ల విద్యావిషయంలోనూ, అభివృద్ధిలోనూ, ఆధునికతలోనూ తెలంగాణ ప్రాంతంకంటే కొంత పరిణతిని సాధించగలిగింది. అందువల్ల ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల మధ్యన అనేక విషయాల్లో స్పష్టమైన వైరుధ్యాలు, వైవిధ్యాలు అప్పటికే నెలకొనిఉన్నాయి. భిన్నమైన చరిత్ర, సంస్కృతులు, ఆచారవ్యవహారాలు, సామాజిక సంబంధాలను కలిగిఉన్న ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాలను కలిపి 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రాన్ని నిలబెట్టడానికి తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక హక్కులను కల్పించారు. ఉమ్మడి రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన సందర్భంలో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంవల్ల ప్రజలమధ్యన, ప్రాంతాలమధ్యన ఈ ఉమ్మడి రాష్ట్రం ఐక్యతను సాధించలేకపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు సందర్భంలో తెలంగాణప్రాంత ప్రజలకిచ్చిన హామీలు, రక్షణలు, హక్కులు అమలు చేయకపోవడానికి ఆంధ్రా ఆధిపత్య వర్గాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ప్రాతిపదికగా మారిపోయాయి.

హరిత విప్లవ ప్రభావ ఫలితంగా ఆంధ్రాలోని రెండు సామాజిక వర్గాలు వ్యవసాయికంగా బాగుపడి, ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. వ్యవసాయ రంగంద్వారా అందుబాటులోకి వచ్చిన మిగులుతో వ్యాపార, వాణిజ్యరంగాల్లో

ఈవర్గాలు  స్థిరపడేందుకు ప్రయత్నించాయి. ఇందుకు రాజకీయాలపై ఆధిపత్యాన్ని సాధించుకున్నాయి. ప్రచార, ప్రసారసాధనాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. మీడియాపై గుత్తాధిపత్యాన్ని సాధించాయి. సినిమా రంగాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నాయి. క్రమంగా విద్యా,వైద్య తదితర సేవారంగాలకు వ్యాపారాలను విస్తరించుకున్నాయి. మొదట మద్రాసు, ఆ తర్వాత హైదరాబాద్‌ను ఒక ధీర్ఘకాలిక దృష్టితో వలసకేంద్రాలుగా మార్చుకున్నాయి. వలస ప్రాంతాలపై పట్టును పదిలపరుచుకునేందుకు రాజకీయ ఆధిపత్యాన్ని, అధికారాన్ని స్థిరీకరించుకున్నాయి.. నిర్ణయాధికారంలో తెలంగాణ రాజకీయ నాయకత్వం భాగస్వామ్యం కాకుండా తమకున్న ఆధిపత్యాన్ని నిరంతరం అమలులో ఉంచాయి. ప్రభుత్వ పాలనలో తెలంగాణ ప్రజలు భాగస్వాములు కాకుండా నిలువరించారు.  ఇదే సమయంలో తెలంగాణ వనరుల (నీళ్ళు, నిధులు, నియామకాలు) దోపిడీని వేగవంతం చేసారు. క్రమంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక నయా వలసాధిపత్య వర్గం వేళ్లూనుకున్నది. సామాజికశక్తుల బలం, రాజకీయ ఆధిపత్యం, ఆర్థిక వెసులుబాటు, తదితర సౌకర్యాలతో ఈవర్గం స్థిరపడింది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కేవలం కొంతమంది ఆధిపత్య శక్తుల ప్రయోజనాలకోసమే ఏర్పడిందనే భావన తెలంగాణ సమాజంలో ఆలోచనలు రేకెత్తించింది. దీనికి తోడుగా రాష్ట్ర ఏర్పాటు సమయంలో కేంద్రప్రభుత్వం తెలంగాణ ప్రాంతానికి, ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలు, రక్షణలు, హక్కులు హరించబడినాయి. పెద్దమనుషుల ఒప్పందం, ఆరుసూత్రాల పథకం, రాష్ట్రపతి ఉత్తర్వులు ... ఇట్లా ప్రతి విషయంలోనూ తెలంగాణ సమాజం సీమాంధ్ర పాలనలో భంగపడింది. బుద్ధిపూర్వక నిర్లక్ష్యానికి, అవమానాలకు గురయ్యింది. తెలంగాణ సమాజం రక్తమోడ్చి నిర్మించుకున్న చరిత్ర, ప్రత్యేక సంస్కృతి, భాష, అస్థిత్వం... విస్మరణకు గురయ్యింది.  కృష్ణా, గోదావరిలాంటి నదులున్నా నీళ్లులేక పొలాలు బీళ్లువారుతున్నాయి. పుష్కలమైన నేలబొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజలు నిత్యం తీవ్రమైన కరెంటు కొరతతో కునారిల్లిపోతున్నారు.. నీళ్లు, కరెంటు లేక వేలసంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఉపాధి అవకాశాలు లేక లక్షలాదిమంది బతుకుదెరువుకోసం ముంబాయి. భివాండి, దుబాయిలాంటి ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాష యాస సీమాంధ్ర ఆధిపత్య సినిమాలకు కామెడీ సరుకయ్యింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలోని ప్రభుత్వ భూములు ఆంధ్రా పెట్టుబడీదారులకు ధారాదత్తం అయ్యాయి. తెలంగాణ ప్రజలు తమ భూమిమీద తామే పరాయివారయ్యారు.

ఈ నేపథ్యంలో వలసాధిపత్యం నుంచి బయటపడటానికి, ప్రత్యేక రాష్ట్రం ఒక మార్గంగా తెలంగాణ ప్రజలు భావించారు. కాబట్టి తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం వలసదోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటం. దానివల్ల తెలంగాణ తన వనరులను తాను అనుభవించగలదు, తన అస్తిత్వాన్ని (సంస్కృతిని) తాను కాపాడుకోగలదు. మూడవది పై రెండింటికి కావాల్సిన రాజకీయ అధికారాన్ని పొందగలదు. ఇది తెలంగాణ ఉద్యమం వెనుక ఉన్నటువంటి స్థూలమైన ఆలోచన. అందుకే తెలంగాణ డిమాండుకు ఒక స్పష్టమైన సైద్ధాంతిక పునాది ఉన్నది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం వలసాధిపత్యానికి, ఆత్మగౌరవానికి మధ్య జరిగిన పోరాటం. ప్రత్యేక రాష్ట్ర డిమాండు ప్రజాస్వామికమైనది, రాజ్యాంగబద్ధమైనది. న్యాయసమ్మతమైనది. అందుకే గడచిన 60సంవత్సరాలుగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రజల్లో నాటుకుపోయిన ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష చల్లారలేదు. ఈ డిమాండుకు నేపథ్యంగా పనిచేస్తున్న అంశాలను ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. ఇక్కడి ప్రజల ఆకాంక్షలను ప్రజాస్వామిక స్ఫూర్తి ఆధారంగా, రాజ్యాంగ నిర్దేశాలకు లోబడి పరిష్కరించే ప్రయత్నం జరగలేదు. నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకంటే, ఒక ప్రాంత ప్రజలు ఆరు దశాబ్దాలుగా నిరంతరంగా వివిధ రూపాలలో వ్యక్తం చేస్తున్న బలమైన అభిప్రాయాలకంటే, గుప్పెడుమంది సీమాంధ్ర ఆధిపత్య శక్తుల ప్రయోజనాలనే ప్రధానం చేయడంవల్లనే ఇక్కడి ప్రజల్లో ఈ పాలకులపైన విశ్వాసం తొలగిపోయింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు పట్ల ఇక్కడి ప్రజల్లో మరింత పట్టుదల పెరిగింది.

మన దేశంలో ఏ డిమాండుకు, ఏ పోరాటానికి ఇంత చరిత్ర లేదు. ఏ ఉద్యమాల వెనుక కూడా ఇంత సుధీర్ఘమైన పోరాటం లేదు. తెలంగాణ ప్రాంతం ఒక ప్రత్యేక దేశంగా ఉండి, ఒక ప్రత్యేక రాష్ట్రంగా మారి మళ్లీ ప్రత్యేక అస్తిత్వాన్ని సాధించుకోవడానికి తెలంగాణ సమాజం పోరాటం చేసినంతటి చరిత్ర ఎవ్వరికీ లేదు. తమ దోపిడీకి, తమ ఆధిపత్యానికి, తమ ఆర్థిక ఎదుగుదలకు తెలంగాణ ప్రాంతాన్ని శాశ్వితంగా వలస కేంద్రంగానే కొనసాగించాలని సీమాంధ్ర ఆధిపత్యశక్తులు కోరుకున్నాయి. అందుకే వలస శక్తులు తెలంగాణను స్వతంత్ర్యంగా ఉంచటానికి ఇష్టపడలేదు.

1996లో ప్రారంభమైనదనుకుంటున్న మలిదశ తెలంగాణ ఉద్యమం ఒక ఆకాంక్షగానే మొదలయ్యింది. సాంస్కృతిక, సాహిత్య రూపాలలో భావవ్యాప్తి జరిగింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర సమితి

(టిఆర్ఎస్) ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షకు ఒక బలమైన రాజకీయ వ్యక్తీకరణ తోడయ్యింది. ఈ రాజకీయ పరిణామాలతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్ష ఒక రాజకీయ డిమాండుగా పరిణామం చెందింది. 2009 నవంబర్ 29వతేదీన చంద్రశేఖర్‌రావు ఆమరణ దీక్ష నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం ఒక పూర్తిస్థాయి ప్రజాఉద్యమంగా మారింది. తెలంగాణ సమాజం మొత్తంగానే ఈ ఉద్యమంలో తమ ఉనికిని ప్రదర్శించింది. పాత్రను నిర్వహించింది. తెలంగాణ ప్రజానీకం ఎక్కడివారక్కడ, ఎవరికివారుగా స్వచ్ఛందంగా పాలుపంచుకున్నారు. ప్రపంచీకరణలో భాగంగా అమలులోకివచ్చిన నూతన పారిశ్రామిక, ఆర్థిక విధానాల నేపథ్యంలో ఎదురైన సంక్షోభాలనుండి బయట పడటం కోసం అంతర్గత వలస దోపిడీని, ఆధిపత్యాన్ని ఎదిరించడమే ఏకైక లక్ష్యంగా ప్రజలు రాష్ట్ర సాధన ఉద్యమ పథాన్ని ఎంచుకున్నారు. స్వయంపాలన ద్వారా మాత్రమే తమ సమస్యలకు పరిష్కారం వెతుక్కునేందుకు మార్గం సుగమమం అవుతుందని ప్రజలు గాఢంగా భావించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం అంతిమ సారంలో తమ బ్రతుకుదెరువు పోరాటంగా ప్రజలు నిశ్చయించుకున్నారు. ఉద్యమంలో పెద్దయెత్తున భాగస్వాములయ్యారు. జేయేసీ ఎప్పుడు, ఎట్లాంటి పిలుపులిచ్చినా స్వచ్ఛందంగా స్పందించారు. నిరహారదీక్షలతో తమ కడుపులు మాడ్చుకున్నారు. బంద్‌లు, రాస్తారోకోలు నిర్వహించి స్వీయహింసను తట్టుకున్నారు. ప్రజాస్వామిక స్ఫూర్తితో, శాంతియుత పద్ధతుల్లో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయారు. ప్రజా ఉద్యమం నుండి ఎదురైన ఒత్తిడికి తలవంచిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర డిమాండును గుర్తిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు స్వయంగా కేంద్రప్రభుత్వమే ప్రకటించింది. ఈ ప్రకటనతో తెలంగాణ డిమాండు ఒక రాజ్యాంగ హక్కుగా అంగీకారం పొందింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఒక ఆకాంక్షగా ప్రారంభమై, రాజకీయ డిమాండు మారి, ఒక రాజ్యాంగ హక్కుగా మారడం తెలంగాణ ప్రజా ఉద్యమంలోని మూడు కీలక పరిణామాలుగా గుర్తించవలసిఉన్నది.

"పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటంలోనూ, అమలు పరచడంలోనూ రాజ్యాంగ వ్యవస్థలు (పాలనావ్యవస్థ, న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థలు) విఫలమైనప్పుడు .. ప్రజలే స్వయంగా పూనుకుని తమ హక్కులను రక్షించుకోవాలి. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం కుప్పకూలిపోతుంది." అంటూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చెప్పిన మాటలు 'సహాయ నిరాకరణ' 'సకల జనుల సమ్మె'లాంటి వినూత్న కార్యక్రమాలను రూపకల్పన

చేయడంలో స్ఫూర్తినిచ్చాయి. ఈరెండు కార్యక్రమాలు ఏకకాలంలో మూడు ప్రధానమైన లక్ష్యాలతో నిర్వహించుకున్నాము. 1) తెలంగాణపై పార్లమెంటులో బిల్లుపెట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడిని పెంచడం. 2) సీమాంధ్ర ఆధిపత్యంలో మగ్గుతూ, తెలంగాణ ఉద్యమానికి అడుగడుగునా అడ్డుపడుతున్న విద్రోహశక్తులకు దాసులుగా పనిచేస్తున్న తెలంగాణ రాజకీయ నాయకత్వాన్ని ఉద్యమక్రమంలోకి సమీకరించడం. 3) తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అనేక రూపాలలో వ్యతిరేకిస్తున్న సీమాంధ్ర శక్తులకు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, ఆధిపత్య మూలాలలను తెలంగాణలో నిలువరించడం.

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ చెప్పినట్లుగా ... తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఉండవలసిన మూడుపార్శ్వాలలో ... భావవ్యాప్తి, ఉద్యమం, రాజకీయప్రక్రియ ..తెలంగాణ ప్రాంత మేధావులు, విద్యావంతులు, కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, అడ్వకేట్లు, సబ్బండవర్గాల ప్రజలు తెలంగాణ భావజాలవ్యాప్తిలో నిరంతరంగా తమ కర్తవ్యాన్ని నిర్వహించారు.

తెలంగాణపై అధికారాన్ని చెలాయించడానికి వారికి ఉన్న మార్గాలన్నింటినీ తెలంగాణ ఉద్యమం మూసివేసింది. వారికి అనుకూలంగా పనిచేసే చిన్న చిన్న సంఘాలు ఇక్కడ పనిచేయలేని పరిస్థితి ఏర్పడింది. వారి తరపున నిలబడే ఎమ్మెల్యేలు ఇక్కడ ఊళ్లల్లో తిరగలేని పరిస్థితి వచ్చింది. వారి పార్టీలు తెలంగాణలో మనుగడ సాగించలేని పరిస్థితి వచ్చింది. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా నిలబడలేని ఒక సంక్షోభ స్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు పనిచేయలేని పరిస్థితులు ఎదురయ్యాయి. స్వయంగా ముఖ్యమంత్రి, ప్రతిపక్షనాయకుడు తెలంగాణ ప్రజల ప్రశ్నలకు జవాబులు చెప్పలేక ముఖం చాటేసుకునే దుస్థితిని ఎదుర్కోవలసివచ్చింది. 2004, 2009 ఎన్నికల సందర్భంలో తెలంగాణ ప్రజలకిచ్చిన హామీల అమలు విషయంలో ఇక్కడి ప్రజల నుండి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సమాధానం చెప్పవలసిన తప్పనిసరి స్థితికి నెట్టబడ్డాయి. రాష్ట్రంలోని రాజకీయపార్టీలన్నీ ఒక సంక్షోభ పరిస్థితుల్లోకి చేరుకున్నాయి.

తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయడానికి, తెలంగాణ ప్రజలఐక్యతను, సంఘటిత శక్తిని విడదీయడానికి సీమాంధ్ర పాలకపక్షాలు అమలు జరిపిన రాజకీయ కుట్రల విషయంలో తెలంగాణ ఉద్యమ సమాజం సర్వత్రా అప్రమత్తంగా వ్యవహరించింది. మానుకోట ప్రజా ప్రతిఘటన, మిలియన్‌మార్చ్,

సహాయ నిరాకరణ, సకల జనుల సమ్మె, సంసద్ యాత్ర, సాగరహారం (తెలంగాణ మార్చ్), సమరదీక్ష, సంసద్‌యాత్ర (ఛలో ఢిల్లీ), అసెంబ్లీ ముట్టడి, సకల జన భేరిలాంటి వినూత్నమైన ఉద్యమ కార్యక్రమాలతో పార్టీలు, ప్రభుత్వాలు ఉక్కిరి బిక్కిరయ్యాయి. తెలంగాణ సమాజంలోని అన్నివర్గాల ప్రజలు వలసా ధిపత్యానికి, వనరుల దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా సంఘటితమయ్యారు. వేయికి మందికి పైగా యువతీయువకులు బలవంతపు మరణాలకు బలయ్యారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకంటే తెలంగాణ రాష్ట్ర సాధనే ప్రధానమనుకున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు, విద్యుత్ ఉద్యోగులు, ప్రైవేటురంగంలోని కార్మికులు ... ఇట్లా తెలంగాణ సమాజంలోని సకల జనులు ఉద్యమంలో భాగమయ్యారు.

సంక్షోభంలోకి చేరుకున్న సమయంలో తెలంగాణపై అంతిమంగా ఒక నిర్ణయం తీసుకోక తప్పలేదు. అన్ని పార్టీలు తెలంగాణ ఏర్పాటుపై అంతర్గతంగా చర్చలు, తీర్మానాలు చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోల్లో కూడా పెట్టారు. కేంద్ర ప్రభుత్వం ఆ దిశలో అడుగులు కదిపిన వెంటనే ఎవ్వరిని అడిగి తెలంగాణ ఇస్తున్నారనే తిరకాసు ప్రశ్నలు మొదలుపెట్టారు. అయినా సీమాంధ్ర ఆధిపత్య శక్తులు పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందేవరకూ అడుగడుగునా అడ్డుతగిలారు. పరోక్షంగానైనా వాళ్ల అధికారాలను కాపాడుకునే ప్రయత్నం చేసారు. అందులోభాగంగానే తెలంగాణకు ప్రత్యేకప్యాకేజీని అమలు చేస్తే సరిపోతుందన్నారు. ఆతర్వాత హైదరాబాద్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఉంచాలన్నారు. కేంద్రపాలితప్రాంతం చేయాలన్నారు. శాశ్వితంగా ఉమ్మడి రాజధానిగా ఉంచాలన్నారు. రాయలతెలంగాణ నినాదాన్ని తెరమీదికి తీసుకువచ్చి ఆంధ్రా ప్రజల మధ్యన చిచ్చుపెట్టే ప్రయత్నం చేసారు. సమైక్య ఉద్యమం పేరుమీద తెలంగాణ పోరాటాన్ని కాపీకొట్టే ప్రయత్నం చేసారు. డిసెంబర్ 9, 2009రోజున కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన వెంటనే రాజీనామా డ్రామాలతో అడ్డుకునే ప్రయత్నం చేసిన సీమాంధ్ర నాయకులు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఉవ్వెత్తున నడుస్తున్న సందర్భంలో ... సీమాంధ్ర ప్రజలకు వాస్తవ పరిస్థితులను అర్థం చేయించడంలో విఫలమయ్యారు. తీరా రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో అక్కడి ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. ఇందుకు సహకరించే ప్రయత్నంలో సీమాంధ్ర మీడియా నైతిక విలువలకు, ప్రజాస్వామిక స్ఫూర్తికి, జర్నలిజం విలువలకు తిలోదకాలు పలికింది.

*అంతిమంగా తెలంగాణ ప్రజలు సుధీర్ఘకాలంపాటు అనేక రూపాల్లో కొనసాగించిన ఉద్యమం రాష్ట్ర సాధన లక్ష్యాన్ని అధిగమించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నది. అయితే ఉద్యమ క్రమంలో తెరమీదికి వచ్చిన అనేక అంశాలను, సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలందరూ సమిష్టిగా ఆలోచించి, అడుగులు కలపాల్సిఉన్నది. అరవై సంవత్సరాల సుధీర్ఘకాలంపాటు కొనసాగిన అన్యాయాలు, నిర్లక్ష్యాలు, వివక్షలు, సమస్యలు స్వల్పవ్యవధిలోనే పరిష్కారం కావడం సాధ్యంకాదు. అయితే ఇందుకు అవసరమైన దీర్ఘకాలిక ప్రణాళిక, కార్యాచరణ రూపొందించుకోవాలి. ఇది జరగాలంటే తెలంగాణలో మిగిలిఉన్న సీమాంధ్ర ఆధిపత్య మూలాలు సమూలంగా తొలగిపోవాలి. సంపూర్ణతెలంగాణ రాష్ట్రంగా నిలదొక్కుకోవాలి. ఈ దిశలో ప్రతిఒక్కరూ కృషి చేయాలి.*

*తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పాలుపంచుకున్న* ***పిట్టల రవీందర్*** *ఏర్చి, కూర్చి అందిస్తున్న ఈ* ***'ఉద్యమ డైరీ'*** *ఉద్యమ క్రమాన్ని మన కళ్లముందు నిలుపుతుంది. ఉద్యమంలో జరిగిన పరిణామాలను గుర్తుకు చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చివరిదశ ఉద్యమ తీరుతెన్నులను ఎవరికివారుగా విశ్లేషించుకోవడానికి, అర్థం చేసుకోవడానికి ఈ* ***'ఉద్యమ డైరీ'*** *లో ఇచ్చిన సమాచారం ఒక ప్రామాణికంగా పనికివస్తుంది. ఉద్యమ జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి, ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించడానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగ పడుతుందనడంలో సందేహం లేదు. ప్రతిఇంటిలో ఉండదగిన* ***'ఉద్యమ డైరీ'*** *ని అందిస్తున్న మిత్రుడు* ***పిట్టల రవీందర్****కు అభినందనలతో ...*

**–యం. కోదండరామ్,**
**తెలంగాణ జేయేసీ చైర్మెన్.**

***15 సెప్టెంబర్ 2015,***
***హైదరాబాద్***

# ఇది మరో చిరు ప్రయత్నం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరిదశలో దాదాపు ఐదు సంవత్సరాల పాటు కొనసాగిన ఉద్యమ క్రమాన్ని, నేపథ్యాన్ని, పరిణామాలను, పర్యవసానాలను ... మొత్తంగా ఉద్యమ చరిత్రను ఐదు సంపుటాలుగా వెలువరించాలని 'హైలాండ్ పబ్లికేషన్స్' వారు ని ర్ణయించింది. ఈ ఐదేండ్ల ఉద్యమంలో క్రియాశీలకంగా పాలు పంచుకున్న పిట్టల రవీందర్‌పై ఆ బృహత్తర బాధ్యతను అప్పగించాము. పిట్టల రవీందర్ రాసిన 'తెలంగాణ ఉద్యమంలో తెరవెనక దృశ్యాలు' పేరుతో గత సంవత్సరం ప్రచురించిన పుస్తకానికి పాఠకులనుండి విశేష స్పందన లభించింది. ఈ పుస్తకం ప్రస్తుతం రెండవ ముద్రణలో సిద్ధమవుతున్నది. ఆ ప్రోత్సాహంతోనే ఈ పుస్తకాన్ని తీసుకువస్తున్నాము.

తెలంగాణ రాష్ట్ర సాధన చివరిదశ ఉద్యమంలో 2009 సంవత్సరాంతంలో చోటుచేసుకున్న వరుస పరిణామాల క్రమం నుండి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ముగిసే 2014 మార్చి వరకూ జరిగిన ముఖ్యమైన పరిణామాలను ఇందులో పొందు పరుస్తున్నాము. ఈ పుస్తకం కేవలం సంఘటనలకు సంబంధించిన పరిమితమైన సమాచార కూర్పుగా మాత్రమే చూడాలి. ఇది ఐదు సంవత్సరాల ఉద్యమక్రమాన్ని గుర్తుకు చేసుకునేందుకు అందిస్తున్న ముడి సరుకు మాత్రమే. అంతకు మించి ఇది ఉద్యమ విశ్లేషణకు సంబంధించిన ప్రయత్నంగానో, ఉద్యమ చరిత్రకు సంబంధించిన రికార్డుగానో భావించవలసిన అవసరం లేదు.

అనేకమంది వ్యక్తులు, శక్తులు, అనేక సంస్థలు, సంఘాలు, ఆయా సందర్భాలను బట్టి, తమకున్న అవకాశాలమేరకు అందరూ ఉద్యమంలో ఏదోవిధంగా, ఏవో పద్ధ తుల్లో భాగస్వాములయ్యారు. తమ ఉనికిని, ప్రత్యేకతలను ఉద్యమకార్యాచరణలో చాటుకున్నారు. అన్నింటికన్నా ఉన్నతంగా అనేక మంది తమ ప్రాణాలను ధారపోసారు. అనేకమంది అనేక రకాలుగా త్యాగాలు చేసారు. అందువల్లనే ఉద్యమం అంతిమ లక్ష్యాన్ని చేరుకోగలిగింది. అట్లాంటి వారినెవరినైనా ఈ పుస్తకంలో ప్రస్తావించలేక పోతే, అది బుద్ధిపూర్వకంగా చేసింది ఎంతమాత్రమూ కాదని సవినయంగా మనవి చేస్తూ, ఈ పుస్తక ప్రచురణకు మేము నిర్దేశించుకున్న పరిమితులను గుర్తుకు చేస్తూ, సహృదయంతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాము.

ఈ పుస్తకాన్ని తీసుకురావడంలో సలహాలు, సూచనలను ఆహ్వానించడం జరిగింది. అట్లాగే రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకభూమికను పోషించిన తెలంగాణ జేయేసీ భాగస్వామ్యసంస్థలు, వ్యక్తులు, ప్రజా సంఘాలు, ఇతర సంస్థలనుండి వారి వారి భాగస్వామ్యానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలను అందించవలసిందిగా

పలుమార్లు ఎస్సెమ్మెస్‌ల రూపంలో కోరడం జరిగింది. స్పందించి, విలువైన సమాచారాన్ని అందించినవారందరికీ ధన్యవాదాలు. అట్లాగే సోషియల్ మీడియా మాధ్యమం ద్వారా ఈ పుస్తకం కవర్ పేజీపై కూడా అనేకమంది సలహాలు, సూచనలు చేసారు. కొంతమంది మిత్రులు తమ అభ్యంతరాలను కూడా వెలిబుచ్చారు. వారికికూడా ధన్యవాదాలు.

భవిష్యత్తు తరాలకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ క్రమాన్ని గుర్తుకు చేసే సంఘటనల సమాహారంగా, చివరిదశ తెలంగాణ ఉద్యమ చరిత్ర రచనకు పూనుకునే రచయితలకు ఒక సహాయకారిగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు తమ ఉద్యమానుభవాలను నెమరువేసుకోవడానికి పనికివచ్చే ఒక జ్ఞాపికగా... ఏ మాత్రం ఉపయోగపడినా మా ఈ ప్రయత్నం ఫలించినట్లేనని ఆశిస్తూ ...

**-ప్రచురణకర్తలు**

# ప్రత్యేక అభినందనలు



2009-2014 మధ్యకాలంలో దాదాపు ఐదు సంవత్సరాలపాటు నిర్విరామంగా కొనసాగిన తెలంగాణ రాష్ట్ర సాధన ప్రజాఉద్యమం అనేకానేక ప్రత్యేకతలను నమోదు చేసుకున్నది. చిత్రవిచిత్రా లను రికార్డు చేసింది. అసాధ్యాలెన్నిం టినో సుసాధ్యం చేసింది. అనామకులను కున్న వాళ్లెందరినో అందలం ఎక్కిం చింది. అంతా మేమే అనుకున్న వాళ్లెందరినో అనామ కులుగా మిగిల్చింది. అశక్తులనెందరికో అనేక రూపాల్లో అద్భుతమైన శక్తియుక్తులను అందజేసింది. చరిత్ర హీనులనదగిన వారినెందరినో అందల మెక్కించింది. చరిత్రకారులమని విర్రవీగినవా రెందరినో చరిత్రలో మిగలకుండా చేసింది. మొత్తంగా చివరిదశ అనదగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం కోటానుకోట్ల తెలంగాణ ప్రజలందరికీ మహోన్నత మైన 'ఉద్యమకారుల' హోదాను ప్రసాదించింది. ఈ తరం తెలంగాణ ప్రజలందరికీ ఎవరికివారు చెప్పుకోదగిన చరిత్రను భవిష్యత్తు తరాలకు అందజేసుకోగలిగే మహాద్భా గ్యాన్ని కలిగించింది. చివరిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఒక్కొక్కరిదీ ఒక్కొక్కచరిత్ర. అది ఒక ఒడువని ముచ్చట. తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో 'అన్‌సంగ్ హీరోస్' ఎందరో ... అందరిలో కొందరిని గురించి ప్రత్యేకంగా ఇక్కడ ప్రస్తావించుకోవడానికి ఇది ఒక అనువైన సందర్భం. అందుకే ఈ ప్రస్తావన.

పిట్టల సంపత్ నాగేందర్, మా పెద్దన్నయ్య పిట్టల రాజేందర్, పిట్టల నాగ మణిలకు పెద్దకొడుకు. మా కుటుంబంలో మా తర్వాత తరానికి అందరిలో ఈయనే పెద్దవాడు. అందరిలాగానే సంపత్ మీద మా కుటుంబం మొత్తం పెద్దపెద్ద ఆశలే పెట్టుకున్నది. ఆయన కూడా పెద్దపెద్ద కలలేకన్నాడు. పోటీపరీక్షల్లో పోటీపడ్డాడు. ఆశించిన ఫలితాలు రాక డీలాపడ్డాడు. మళ్లీ ఏదో ప్రయత్నం. మళ్లీ నిరాశ. ఇట్లా చాలా సంవత్సరాలు పోటీ పరీక్షలతో కుస్తీపట్టి, ఫలితాలు చేతికందక జీవితంతో రాజీపడాలనుకున్నాడు. తాను చదివిన స్కూల్లోనే గత్యంతరంలేక తానుకోరుకున్న రాధికను పెళ్లిచేసుకుని ఇద్దరూ స్వంత స్కూల్లో బడిపంతుళ్లయ్యారు. కుటుంబ నేపథ్యం, సామాజిక పరిస్థితులు, తెలంగాణ రాజకీయ నాయకత్వ వైఫల్యం, సీమాంధ్ర వలస పాలన ... అన్నీ కలగలిసి ఆయన కలలుకూడా లక్షలాది మంది తెలంగాణ బిడ్డల కలలలాగానే నిజం కాలేదు. అందుకు అనుకూలమైన పరిస్థితులు ఎన్నడూ ఎదురుపడలేదు. వీరికిద్దరు చాలా చురుకైన పిల్లలు ... అభిరాజ్, యువరాజ్.

సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో ప్రైవేటు పాఠశాలల శ్రమ, ఆ పాఠశాలల

నిర్వహకుల త్యాగాలు వెలకట్టలేనివి. చరిత్రలో లిఖించదగినవి. కానీ కార్పోరేటు కోరల్లో అవి ఇప్పుడు పూర్తిగా చతికిలబడిపోయాయి. ఒకప్పుడు కోల్‌బెల్ట్ యువతీ, యువ కులకు ఉపాధిహామీగా పనికివచ్చిన ప్రైవేటు పాఠశాలలు ఇవ్వాళ్ల శిథిలాలుగా, శకలాలుగా మిగిలిపోయాయి. ఓనర్లుగాకాక, కేవలం పాఠశాలల కరెస్పాండెంట్లుగా పదిమందికీ ఉపాధిహామీని నిలబెట్టి, వేలాదిమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిం చిన వాళ్లు ఇవాళ పొట్టచేతపట్టుకుని ఉపాధికోసం కార్పోరేటు కళాశాలల చుట్టూ తిరుగుతున్న వాస్తవం కోల్‌బెల్ట్‌లో గుండెలను కలచివేస్తున్న దృశ్యం. కోల్‌బెల్ట్ ప్రాంతా లలో మహారాజాపోషకులుగా స్థానిక ప్రైవేటు పాఠశాలలను నిలబెట్టుకున్న సింగరేణి గని కార్మికులు కూడా కార్పోరేటు మాయాజాలవలల్లో, గ్లోబలైజేషన్ కోరల్లో విలవిల్లాడుతున్న పరిస్థితి. ఇదే క్రమంలో సంపత్ నాగేందర్‌కు కొలువు ఇచ్చిన బడి మూతబడింది. వారి కుటుంబం తెలంగాణ నడిబజారున పడింది.

అప్పటికే తిరగదోడిన రోగం ముదిరింది. దానికి మనోవేదన తోడయ్యింది. ఒకేసారి అన్నీ కమ్ముకున్నయ్. ఉద్యోగం లేదు. కుటుంబం నిలువడానికి నీడలేదు. బతుకుదెరువు కనిపించేలేదు. స్వయంగా నడువలేని స్థితి. కదలలేని పరిస్థితి. మరో వైపున ఉధృతంగా ఉప్పెనలా సాగుతున్న తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం. తనతోటి వాళ్లంతా ఉద్యమంలో పనిచేస్తుంటే, తనకోసం కాకపోయినా కనీసం తెలంగాణ కోసమైనా తనవంతుగా ఏమైనా చేయాలనే తాపత్రయం, బెడ్‌మీదనుండి కనీసం లేవలేని స్థితిని చూసుకుని తనలోతాను కుమిలిపోతున్న దుస్థితి సంపత్ నాగేందర్‌ది. తమ కండ్లముందు సమర్థుడైన యువకుడు శారీరకంగా, మానసికంగా కృంగిపోతుంటే, ఏమీ చేయలేని అసహాయస్థితికి అందరమూ తల్లడిల్లిపోయాము. సంపత్ నాగేందర్‌లో ముందుగా మనోధైర్యం నింపడానికి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో మమేకం చేయడమే ఏకైక మార్గంగా నాకు అనిపించింది. నా దగ్గర అదనంగా ఉన్న ఒక కంప్యూటర్‌ను గోదావరిఖనిలో ఉంటున్న సంపత్ నాగేందర్‌కు పంపించాను. ఉద్యమ వార్తలను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసే పనిలోకి నిమగ్నం చేసాము. జేయేసీ ఆఫీసులో ఉన్న దినపత్రికల ఉద్యమ వార్తలన్నింటి పేపర్ క్లిప్పింగులను పంపించాము.

దాదాపు రెండు సంవత్సరాలు నిరంతరంగా సంపత్ నాగేందర్ చేసిన కృషి, ఈ పుస్తకానికి వెన్నెముక ...

# అభినందనలు

ఉన్నట్టుండి ఒక రోజున తెలంగాణ జేయేసీ ఆఫీసు లోకి ఒక అబ్బాయిని కోదండరామ్ గారు పంపించారు. ఈ పిల్లవాన్ని ఏదైనా కంప్యూటర్ ట్రేనింగ్‌కి ఉప యోగించుకోవాలని సూచించాడు. ఉద్యమ మిత్రులు కొందరు తమదగ్గర అదనంగా ఉన్న ఒక పాత కంప్యూటర్, ప్రింటర్, స్కానర్ వగైరాలు జేయేసీ ఆఫీసుకు సమ కూర్చారు. కృష్ణ కంప్యూటర్‌తో అసలు పరిచయంలేదు. కాబట్టి ఆయనను జేయేసీ ఆఫీసులోనే ఏదోఒక పనికి వినియోగించుకోవాలని, కొంతకాలం ఆ పిల్లవాడు జేయేసీ లోనే తలదాచుకుంటాడని కోదండరామ్ కోరారు. కృష్ణ తో ఏం పనిచేయించాలా ...!? అనే ఆలోచన నుండి వచ్చిందే ఈ 'ఉద్యమ డైరీ' పుస్తకానికి అవసరమైన ముడిసరుకుల సమీకరణ ప్రయత్నం.

రోజూ వివిధ దినపత్రికల్లో వచ్చే వార్తలకు సంబంధించిన క్లిప్పింగులను సేకరించే పనిని కృష్ణ కు అప్పగించాం. ఆఫీసులో అందుబాటులో ఉన్న దినపత్రికలను డైనింగ్ టేబుల్ మీద వేసుకుని క్లిప్పింగులుగా కట్ చేసే పనిని కృష్ణ ప్రారంభించాడు. పేపర్ క్లిప్పింగులు కట్ చేస్తున్న క్రమంలోనే ఆయనకు వార్తలు చదవాలనే కుతూహలం పెరిగింది. ఉద్యమ వార్తలన్నీ చదవడం మొదలుపెట్టి, వార్తల క్లిప్పింగులు తయారుచేయడంకంటే ... ఉద్యమ చరిత్రను చదవడంమీద కృష్ణ దృష్టి మళ్లింది. ఉస్మానియా క్యాంపస్‌లో విద్యార్థిఉద్యమంపై పోలీసులు అణచివేత చర్యలు, శరపరంపరగా కొనసాగుతున్న ఆత్మబలిదానాలు, ప్రతిరోజూ గన్‌పార్క్‌వద్దనుండి సాగిపోతున్న శవాల ఊరేగింపులు, పోలీసు కేసులు, జేయేసీ ఆఫీసుకు వందలాదిగా వచ్చిపోతున్న ఉద్యమ బాధితుల విభిన్న కథనాలు, అనుభవాలు ... ఉప్పెనలా ఉరకలెత్తుతున్న ఉద్యమ ఉధృతి... క్షణం తీరికలేకుండా నిద్రాహారాలుమాని జేయేసీ నాయకత్వం అమలు పరుస్తున్న ఉద్యమ కార్యాచరణ, కండ్లముందు కనిపిస్తున్న ఇట్లాంటి వాస్తవపరిస్థితులన్నీ ఇంటర్ వరకు చదువుకున్న కృష్ణ మనస్సును కదిలించివేసాయి. పత్రికల్లో వస్తున్న ఉద్యమ వార్తాకథనాలు చదువుతూ మూగగా రోదిస్తున్న కృష్ణ పరిస్థితిని జేయేసీ ఆఫీస్ సబార్డినేట్ బండి యాదగిరి కనిపెట్టాడు. ఆ విద్యార్థి ఆలోచనల్లో వస్తున్న మార్పులను గమనించాడు. కానీ స్థిరంగా ఒక అంచనాకు రాలేకపోయాడు. హఠాత్తుగా ఒకరోజున నేను మా ఊరికి వెళ్లిపోతు న్నానని భుజానికి బ్యాగు తగిలించుకుని మధ్యాహ్నం సమయంలో ఆఫీసులో మా యాదగిరికి మాత్రమే చెప్పి బయలుదేరాడు.

తెలంగాణ జేయేసీ ఆఫీసు నుండి బయటకు వెళ్లిన సుమారు గంటన్నరతర్వాత కృష్ణ నుండి మళ్లీ యాదగిరికి ఫోన్‌వచ్చింది. "హైదరాబాద్ నుండి హన్మకొండకు వెళ్లే బస్సులో ప్రయాణిస్తున్న. తెలంగాణ కోసం చచ్చిపోతున్న. పురుగులమందు తాగిన." ఇదీ ఆ ఫోన్‌కాల్ సారాంశం. యాదగిరి వెంటనే నాకు ఫోన్ చేసిండు. కోదండరామ్‌కు

సమాచారం చేరింది. ఉద్యమ కార్యక్రమాలలో అందరమూ వేరువేరు జిల్లాలలో ఉన్నాం. అందరమూ కృష్ణ తో మాట్లాడేందుకు ప్రయత్నం చేసాం. కానీ ఆయన సెల్‌ఫోన్ స్విచ్ఆఫ్ చేసి ఉంది. కోదండరామ్‌గారి వ్యక్తిగత సహాయకునిగా స్వచ్ఛందంగా పని చేస్తున్న రతన్‌రావ్ రంగంలోకి దిగాడు. అందరమూ ఎవరికివారుగా ఆ పిల్లవాని ఆచూకి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాం. బోడుప్పల్, ఘట్కేసర్, భువనగిరి, జనగాం, తదితర ప్రాంతాల జేయేసీ నాయకులందరినీ సంప్రదించి విషయాన్ని వివరించినం. హై–వే పెట్రోలింగ్ పోలీసులు, జనగామ, రఘునాధపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ తదితర ప్రాంతాల పోలిస్‌స్టేషన్ సిబ్బంది అందరినీ అలర్ట్ చేసినం. హన్మకొండ అన్ని బస్సులను ఆపించి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. దాదాపు రెండుగంటల నిర్విరామ శ్రమ తర్వాత స్టేషన్‌ఘన్‌పూర్‌వద్ద ఆపిన బస్సులో కృష్ణ అపస్మారకస్థితిలో పోలీసులకు కనిపించాడు. వెంటనే వరంగల్ యం.జి.యం. ఆసుపత్రికి తరలించారు. అర్థరాత్రివరకూ అక్కడి వైద్యుల ప్రయత్నం ఫలించింది. తెల్లవారుజామున నాలుగు గంటలకు కృష్ణ క్షేమంగా ఉన్నాడనే సమాచారం మాకు అందేవరకూ మాకెవ్వరికీ కంటిమీద కునుకు లేదు. ఆసుపత్రినుండి హుజురాబాద్ ప్రాంతంలోని వాళ్ల స్వంతఊరికి చేరుకున్న కృష్ణ మళ్లీ తెలంగాణ జేయేసీ ఆఫీసులోకి అడుగుపెట్టలేదు.

ప్రాణాపాయపరిస్థితులనుండి గట్టెక్కిన కృష్ణ ధారవోసిన శ్రమనే ఈ పుస్తకానికి ప్రాణవాయువు ...

# తెలంగాణ ఉద్యమం - ఒక అవగాహన

సమాజంలో ఫ్యూడల్ వ్యవస్థయొక్క ఆధిపత్యం పతనమవుతున్నకొద్దీ ప్రజల్లో ప్రజాస్వామిక ఆకాంక్షల వ్యక్తీకరణకు అవకాశం దొరికి, మనిషిలోపల ఉన్న సృజనాత్మకత వెలుగులోకివస్తుంది. భూస్వామ్య వ్యవస్థలో ప్రజలకు తమ శక్తి, యుక్తులపై విశ్వాసం సడలిపోయి, దానినుండి తప్పించుకోవడానికి 'ఖర్మ' సిద్ధాంతాన్ని ఆశ్రయిస్తారు. ఫ్యూడల్ పెత్తనంలో దానిచుట్టూ అల్లుకుని ఆ సమాజం నడుస్తూ ఉంటుంది. మనిషి తాను నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ తాను పూర్వజన్మలో చేసుకున్న పాపపుణ్యాలే కారణమని, ఈ జన్మలో తన జీవితానికి దేవుడు ఇంతే రాసిఉంచాడని, తన జీవితాన్ని బాగుపర్చుకునే అవకాశాలు తనచేతిలో లేవని, తన జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను ఎదుర్కోవడం, అనుభవించడం తప్ప మరో మార్గంలేదని ... సర్దుకుపోయే సిద్ధాంతాన్ని అలవర్చుకున్నాడు. ఆధునిక సమాజంలో ఫ్యూడల్ వ్యవస్థ అంతమై, ప్రజాస్వామిక వ్యవస్థ అమలులోకి రావడం ప్రారంభం కావడంతో మనుషులు దీనినుండి బయటపడి స్వతంత్రంగా ఆలోచించడం మొదలుపెడతారు. ఆధునిక భావాలను స్వీకరించడం ప్రారంభమవుతుంది. ఇందులో నుండి ఒక మధ్యతరగతి మేథావివర్గం ఉద్భవిస్తుంది. ఈ మధ్యతరగతి మేథావివర్గం మనిషిని కేంద్రం చేసి ఆలోచించే భావజాలాన్ని పెంపొందిస్తుంది. ఈ ఆధునిక భావజాలం నుండి తనచుట్టూ ఉన్న పరిస్థితులకు కారణాలను వెతికే ప్రయత్నం మొదలవుతుంది. ప్రజాస్వామిక భావన పునాదిగా తనచుట్టూ ఉన్న పరిస్థితులకు కారణాలపై సమాజాన్ని ప్రశ్నించడం మొదలవుతుంది. మనుషుల మధ్యన పెరుగుతున్న అంతరాలు, స్వేచ్ఛ, సమానత్వం, స్వయంపాలన, అణచివేత, దోపిడీ, వలసాధిపత్యం తదితరమైన మౌళికమైన అంశాలు చర్చకు వస్తాయి. ఇవన్నీ సాదాసీదా, కనీస మానవీయమైన అంశాలు మాత్రమే కాదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను మార్చే విప్లవ భావాలుకూడా. అందుకే సమాజంలోని ఆధిపత్య శక్తులు ఈ ప్రశ్నలను, ప్రశ్నించే స్వభావాన్ని, ప్రశ్నించే గొంతులను అంతసులభంగా ఆమోదించవు. తెలంగాణ రాష్ట్ర డిమాండు ఈ ప్రశ్నలన్నింటికీ ఏకైక సమాధానంగా తెలంగాణ సమాజం ముందుకువచ్చింది. ఈ డిమాండు పాలకులు, పీడితులు అనే రెండు వర్గాలను విడమరిచి నిలిపింది. ఈ పరిస్థితులు ఇరువర్గాలమధ్యన ఘర్షణకు దారితీసాయి. ఈ ఘర్షణలో ఉద్యమ వర్గం బలంగా నిలబడి నిలదొక్కుకున్న ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సాధ్యపడింది.

ప్రశ్నించే స్వభావం వందలఏండ్లుగా తెలంగాణలో ఒక పోరాట పరంపరగా,

సాంప్రదాయంగా కొనసాగుతున్నది. వర్తమాన తరానికి అందివచ్చిన చరిత్ర జ్ఞాపకాలలో తెలంగాణ రైతాంగ పోరాటం, ముల్కీ ఉద్యమం, 1969నాటి తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన రైతుకూలీ ఉద్యమం, రాడికల్ ఉద్యమం, నక్సల్బరీ వెలుగులో తెలంగాణ అందిపుచ్చుకున్న సాయుధ పోరాట పంథా, సింగరేణి గని కార్మికోద్యమం, యేడాదిన్నర క్రితంవరకూ నడిచిన తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం. ఇవన్నీ కూడా తెలంగాణ ప్రజానీకంలో ఉన్నతమైన ప్రజాస్వామిక విలువలను పాదుకొల్పాయి. ఈ ఉద్యమాల ప్రభావంతోనే తమ చుట్టూ ఉన్న వ్యవస్థలన్నిటినీ ప్రజాస్వామీకరించుకునే ప్రయత్నం చేసారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ధనిక, పేద తారతమ్యం లేకుండా భాగస్వాములు కాగలిగారు. కుల, మతాల పట్టింపులు వదులుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఏకైక లక్ష్యంగా ప్రజలు తమ సంఘటిత శక్తిని, ఉమ్మడి ఆకాంక్షను బలంగా నిరూపించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు, మహిళలు, ఆదివాసీలు, దళితులు, ముస్లీం మైనారిటీలు ఇట్లా తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలు ప్రజలు తమ వనరులపై తమకే అధికారం కావాలని, విధాన నిర్ణయాలలోనూ, పరిపాలనలోనూ తమకు భాగస్వామ్యం కావాలని, అంతర్గత వలసాధిపత్యం అంతం కావాలని కోరుకున్నారు. తరతరాలుగా తాము అనుభవిస్తున్న అణచివేతకు, పేదరికానికి, పరాయీకరణకు తెలంగాణ రాష్ట్ర సాధన ఒక్కటే మార్గ మమని వీరు మనసావాచా నమ్మారు. అందుకే మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం అత్యున్నతమైన ప్రజాస్వామిక స్ఫూర్తిని ప్రజల్లో నింపగలిగింది.

1989 నుండి 1996దాకా జరిగిన ప్రయత్నాలు, 1996 నుండి 2001 దాకా తెలంగాణలో ప్రజా సంఘాలు నిర్వహించిన పాత్ర చాలా ముఖ్యమైనది. చంద్రబాబు నాయుడు అనుసరించిన తీవ్రమైన అణచివేత విధానాలు ఇందుకు కారణం. అత్యంత తీవ్రమైన నిర్బంధ పరిస్థితుల నేపథ్యం నుండి తెలంగాణ అంశాలపై మధ్యతరగతి మేధావివర్గంలో ఒక చర్చ ప్రారంభమయ్యింది. ఈ చర్చ నగరాలనుండి గ్రామీణ ప్రాంతాలవరకూ విస్తరించగలిగింది.

2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస)ఏర్పాటు కూడా ఈ పరిస్థితులకు ఒక పూర్వరంగాన్ని సిద్ధం చేసింది. తెలంగాణ ఆకాంక్షలకు, ఆ ఆకాంక్షతో ముడివడి ఉన్న అనేకానేక అంశాలకు ఒక రాజకీయ వ్యక్తీకరణ తోడుకావడం ఉద్యమ శక్తులకు అత్యంత మనోధైర్యాన్ని అందించిందనడంలో ఎలాంటి అనుమానాలకు తావులేదు. ఇది ఎవ్వరూ కాదనలేని చారిత్రక సత్యము. ప్రారంభంలో 'తెరాస' అనుసరించిన ఎత్తుగడలు, వ్యూహాలు కూడా ఇందుకు దోహదపడ్డాయి. అయితే సరళీకరణ విధానాల అమలు తర్వాత మధ్యతరగతి ప్రజానీకంలో ప్రశ్నించే శక్తి క్రమంగా క్షీణించిపోతున్నది.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఇన్నేళ్ల సుదీర్ఘ పోరాటంలో సాధించిన విజయాలు కూడా విస్మరించడానికి వీలులేదు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో మనకున్న ప్రత్యేక అస్థిత్వాలను నిలబెట్టుకోవడంలో, ప్రకటించుకోవడంలో తెలంగాణ ఉద్యమం ఘణనీయమైన ఫలితాలను సాధించింది.

ఇన్ని సంవత్సరాల తెలంగాణ ఉద్యమ కార్యాచరణలో కేవలం తెలంగాణ భౌగోళిక విభజనకు సంబంధించిన అంశమే కాకుండా అంతర్లీనంగా అనేకమైన మౌళిక అంశాలు తెరమీదికి వచ్చాయి. తెలంగాణ వనరుల దోపిడీ, ఆత్మగౌరవం, అణచివేత, భాషాసంస్కృతులు, వలసాధిపత్యం, రాజకీయ ఆధిక్యత, తదితరమైన అనేక అంశాలు తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యాయి

1969లో జరిగిన తెలంగాణ ఉద్యమానికి, వర్తమానకాలంలో మనకళ్లముందు జరిగిన రాష్ట్రసాధన అంతిమ ఉద్యమానికి అనేక విషయాల్లో తేడాలున్నాయి. అప్పటి ఉద్యమం కేవలం ఉద్యోగ, ఉపాధి, స్థానికతలాంటి సమస్యలు కేంద్రంగా, ఉద్యోగులు విద్యార్థుల భాగస్వామ్యంతో జరిగితే, ఇటీవలి ఉద్యమం విశాల ప్రజానీకం ప్రత్యక్ష ప్రమేయంతో, అనేకమైన సామాజిక, సాంస్కృతిక,ఆర్థిక, సాంఘిక, రాజకీయ అంశాలచుట్టూ అల్లుకుని కొనసాగింది. 1996 నుండి నిరంతరంగా, నిలకడగా, అత్యంత ప్రజాస్వామికంగా, అంతకంటే శాంతియుతంగా ఉద్యమం కొనసాగడం ప్రపంచ ఉద్య మాల చరిత్రలోనే అత్యంత అరుదైనది. తెలంగాణ రాష్ట్ర డిమాండు అత్యంత న్యాయ సమ్మతమైనది, రాజ్యాంగబద్ధమైనది కావడమే ఇందుకు ప్రధాన కారణంగా మనం గుర్తించాలి.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని కేవలం నాలుగు లేదా ఐదు దశాబ్దాల చరిత్రగా చూడలేము. ఇది దాదాపు వంద సంవత్సరాల నేపథ్యం నుండి పరిశీలించవలసి ఉన్నది. సమ్మక్క-సారలమ్మ వేసిన సాలు నుండి మొదలుకొంటే, రాంజీగోండ్, కొమురంభీం, బందగీ, తుర్రేభాజ్ఖాన్, ముగ్దుం మొహీనొద్దీన్, చాకలి ఐలమ్మ, భాగ్యరెడ్డివర్మ, కాళోజీ, జయశంకర్‌లాంటి అనేకమంది పాదుకొల్పిన వందలఏండ్లనాటి పోరాటాల చరిత్ర మనకు ఉన్నది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం అనేక వందల ఏళ్ల పోరాటాలకు కొనసాగింపుగా జరిగిన ఉద్యమంగా మనం గుర్తించాలి. గతంలోకంటే వర్తమానం కాలంలో జరిగిన తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమానికి ఒక గుణాత్మకమైన మార్పు ఉన్న విషయాన్ని మనం గమనించాలి. ఇది కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, భాషలకు, సంస్కృతులకు అతీతంగా ఈ ఉద్యమం విస్తృతమై సాగింది. తెలంగాణ గడ్డమీద పుట్టిన ప్రతిబిడ్డలోనూ ఉద్యమ స్ఫూర్తి తొణకిసలాడింది. ఎవరికివారుగా, ఎవరి పద్ధతుల్లో వారు, ఎక్కడికక్కడ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాలుపంచుకున్న

ప్రజాసమూహాలను మనం గమనించాం. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విద్యార్థులు, గ్రామీణ మహిళలు, రైతులు, కూలీలు, చిరువ్యాపారులు, యువకులు ... ఇట్లా సమాజంలోనే సబ్బండవర్ణాల ప్రజలు తెలంగాణ ఉద్యమంలో భాగస్వాము లయ్యారు.

దాదాపు ఐదు సంవత్సరాలకుపైగా నిరంతరంగా కొనసాగిన తెలంగాణ ప్రజా ఉద్యమం ప్రపంచ చరిత్రలోనే అత్యంత అరుదైనదిగా భావించడంలో అతిశయోక్తిలేదు. ప్రజలు తమ సాంస్కృతిక ప్రతీకలను, సాంప్రదాయాలతోపాటు ప్రతి సందర్భాన్ని ఉద్య మంలో భాగం చేయడం ప్రపంచ ఉద్యమాలలోనే అత్యంత అరుదైన సంఘటన. సహాయనిరాకరణ, సకల జనుల సమ్మె, పల్లెపల్లెపట్టాలపైకి, రోడ్ల దిగ్బంధం, వంటా-వార్పు, మిలియన్‌మార్చ్, తెలంగాణ మార్చ్, మానుకోట ప్రజా ప్రతిఘటన, తెలంగాణ సమరదీక్ష, :సంపూర్ణ తెలంగాణ సాధన దీక్ష, సంసద్ యాత్ర, ఛలో అసెంబ్లీ, మానవ హారం, జైల్‌భరో లాంటి అనేకానేక ఉద్యమ కార్యక్రమాలలో రాజకీయపార్టీల ప్రమే యంతో నిమిత్తం లేకుండానే ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఉద్యమంలో తెలంగాణ ప్రజలు తమ సంఘటిత శక్తిని చాటిచెప్పారు. సకల జనుల సమ్మెకాలంలో ఉద్యోగులు, ఉపా ధ్యాయులు ముఖ్యంగా సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్, మున్సిపల్ కార్మికులు ప్రదర్శిం చిన తెగింపు అన్నివర్గాల ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపింది. సుధీర్ఘ పోరాటాల అనుభవం ఉన్న సింగరేణి గని కార్మికులు దాదాపు 35రోజులపాటు బొగ్గు ఉత్పత్తిని స్తంభింపజేసి మొత్తం దేశానికే తమ ప్రాముఖ్యతను చాటిచెప్పగలిగారు. సింగరేణి గనికార్మికవర్గం ఒకదశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గడగడ లాడించగలిగింది.

ప్రపంచీకరణలో భాగంగా అమలులోకివచ్చిన నూతన పారిశ్రామిక, ఆర్థిక విధానాల నేపథ్యంలో ఎదురైన సంక్షోభాలనుండి బయటపడటం కోసం అంతర్గత వలస దోపిడీని, ఆధిపత్యాన్ని ఎదిరించడమే ఏకైక లక్ష్యంగా ప్రజలు రాష్ట్ర సాధన ఉద్య మ పథాన్ని ఎంచుకున్నారు. తెలుగుదేశం పార్టీ పాలనలో తెలంగాణ ప్రజలు అనుభవించిన అణచివేత కూడా ఇందుకు ఎంతగానో దోహదకాకరిగా పనిచేసింది. స్వయంపాలన ద్వారా మాత్రమే తమ సమస్యలకు పరిష్కారం వెతుక్కునేందుకు మార్గం సుగమమం అవుతుందని ప్రజలు గాఢంగా భావించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం అంతిమ సారంలో తమ బ్రతుకుదెరువు పోరాటంగా ప్రజలు నిశ్చయిం చుకున్నారు.

తెలంగాణ రాజకీయ నాయకత్వం ఉద్యమకాలంలో, ఉద్యమ ప్రజలకంటే ఎంతో వెనుకబడిపోయారు. తెలంగాణ రాజకీయ నాయకులు వేసుకున్న ముసుగులన్నీ ఉద్యమ సందర్భంలో ఒక్కొక్కటిగా తొలగిపోయాయి. పార్టీలమీదా, ఆ పార్టీల ప్రతి

నిధులమీదా ప్రజలకు ఉద్యమం పూర్తి స్పష్టతను ఇచ్చింది. ఉద్యమ మిత్రులు ఎవ్వరో, అంతర్గత శత్రువులు ఎవ్వరో ప్రజలు తెలుసుకున్నారు. ఇది తెలంగాణ ఉద్యమం సాధించిన చారిత్రక విజయం. నిజాం నిరంకుశ పాలనలో వేళ్లూనుకున్న కరడు గట్టిన భూస్వామ్య వ్యవస్థ ... ప్రపంచీకరణ విధానాలు వేగవంతంగా అమలు జరుగు తున్న నేపథ్యంలో సామాన్య ప్రజానీకం అనుభవిస్తున్న జీవన విధ్వంసం ... ఈ రెండు విపరీత పరిణామాల మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. తెలంగాణ ప్రజల ప్రత్యేక అస్థిత్వ ఆకాంక్ష ఎక్కడ, ఎప్పుడు మొదలయ్యిందనే చర్చ కంటే ... అది నెరవేరడానికి తెలంగాణ ఉద్యమ సమాజం ప్రదర్శించిన దీక్ష, పట్టుదల, ప్రదర్శించిన ఐక్యత, నిరూపించిన సంఘటితశక్తిలాంట వాస్తవాలు అతి కీలకమైనవి.

2009 నవంబర్ మాసాంతంలో కెసిఆర్ ఆమరణ దీక్ష పార్టీ పునరుజ్జీవనానికి, తెలంగాణ ఉద్యమం పతాకస్థాయికి చేరడానికి దోహదం చేసింది. ఈ సందర్భంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన వైఖరులు తెలంగాణ ప్రజల్లో ఆగ్రహావేశాలను రగిల్చాయి. ఫలితంగా తెలంగాణ ప్రజాసమూహాలన్నీ ఉద్యమపథంలోకి వచ్చి చేరాయి. విద్యార్థులు పోరాటపంథాను ఎంచుకున్నారు. ఉద్యోగులు భగ్గుమన్నారు. దాదాపు పదిరోజులపాటు రాష్ట్రంలో ప్రభుత్వం పూర్తిగా స్థంభించిపోయింది. జనజీవనం అతలాకుతలం అయ్యింది.

ఫలితంగా 2009 డిసెంబర్ 9వతేదీనాడు "తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు" స్వయంగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అంతకుముందు దాదాపు మూడురోజులపాటు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వము, కేంద్ర ప్రభుత్వంలోని ముఖ్యులు రాత్రింబవళ్లు వరుసగా సమావేశాలు నిర్వహించుకుని "డిసెంబర్ 9 ప్రకటన" నిర్ణయానికి వచ్చారు. ఆ మరుసటి రోజునే ఉభయ సభల్లోనూ ప్రభుత్వం తరఫున కేంద్రమంత్రులు ఇదే విషయాన్ని ధృవీకరిస్తూ ప్రకటనలు చేసారు. ఎన్నడూ ఉద్యమంలో ప్రజాసమూహాలతో కలిసిరాని తెలంగాణ ప్రాంతానికి చెందిన నాయకులు, పార్టీలు సంబరాలు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ సభలను కూడా భారీగా నిర్వహించుకున్నది. ఇదే అదనుగా సీమాంధ్ర ప్రాంతానికి చెందిన నాయకులందరూ జెండాలను, ఎజెండాలను పక్కకుపెట్టి తెలంగాణ వ్యతిరేక వైఖరితో ఏకోన్ముఖంగా కదిలి, మూకుమ్మడి రాజీనామాలతో ఏకకాలంలో రాజకీయ, రాజ్యాంగ సంక్షోభాలకు తెరలేపారు. ఇట్లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ తెలంగాణ రాజకీయ నాయకత్వం తగిన చొరవనుగానీ, త్యాగనిరతినిగానీ, బుద్ధికుశలతనుగానీ ప్రదర్శిం చకపోవడంతో ... సీమాంధ్ర ఆధిపత్య రాజకీయాల ఒత్తిళ్లకు కేంద్రం తలదించు

కున్నది. ఏదిఏమైనా డిసెంబర్ 9నాడు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో తెలంగాణ "రాజకీయ డిమాండు" ఒక "రాజ్యాంగ హక్కు"గా మారింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనే "ఆకాంక్ష" నుండి, ఒక రాజకీయ వ్యక్తీకరణతో "డిమాండు"గా మారి, ప్రజా ఉద్యమ ప్రభావంతో ఒక "రాజ్యాంగ హక్కు"గా మారడం ... సుధీర్ఘ ఉద్యమ చరిత్రలో సాధించిన పాక్షిక విజయాలుగానే భావించాలి.

ప్రజలు పోరాడి సాధించుకున్న ఒక హక్కును అమలు చేయాల్సిన బాధ్యత రాజ్యాంగ వ్యవస్థలపై ఉంటుంది. కానీ భారతదేశ రాజ్యాంగ వ్యవస్థలన్నీ తెలంగాణ విషయంలో పూర్తిగా విఫలమయ్యాయి. అందుకే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లుగా ... "పౌరుల హక్కులను ఆమలు చేయడంలో రాజ్యాంగ వ్యవస్థలు విఫలమైనప్పుడు ప్రజలే తమ హక్కులను పోరాడి రక్షించుకోవాలి". పౌరుల హక్కులకు రక్షణగా నిలవాల్సిన మన ప్రజా ప్రతినిధులు తమ బాధ్యతలను విస్మరించినప్పుడు ప్రజలు ప్రత్యామ్నాయాన్ని ఆలోచించక తప్పదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించడంలో తెలంగాణ రాజకీయ నాయకత్వం విఫలం కావడంతో తెలంగాణలో క్రియాశీలరాజకీయ వ్యవస్థలన్నీ ధ్వంసమై, కుప్పకూలి ... ఉద్యమ ప్రభావం మీద ఆధారపడి మనుగడ కొనసాగించాయి. రాష్ట్ర సాధన పోరాట ప్రభావంతో తెలంగాణలో పౌరజీవనం అతలాకుతమయ్యింది. ప్రభుత్వ పాలన దాదాపు స్థంభించిపోయింది. అన్నివర్గాల ప్రజల్లో, అన్ని స్థాయిల్లో మానసిక విభజన జరిగిపోయింది. సమైక్య భావనకు అర్థం లేకుండా పోయింది. ప్రజా ఉద్యమానికి కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఏ. ప్రభుత్వం తలవంచక తప్పలేదు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ పరిధిలోని సి.డబ్ల్యు.సి తీర్మాణం, కేంద్ర కేబినెట్ నిర్ణయం, రాష్ట్ర అసెంబ్లీ అభిప్రాయం, పార్లమెంటు అంగీకారం, రాష్ట్రపతి ఆమోదం ... కదానివెనుక ఇంకొకటిగా వేగంగా జరిగిపోయాయి. "తెలంగాణ" భారత సమాఖ్యలోని 29వ రాష్ట్రంగా జూన్ 2, 2014నాడు అవతరించింది. జై తెలంగాణ ...

**('తెలంగాణ ఉద్యమంలో తెరవెనక దృశ్యాలు పుస్తకం నుండి స్వల్ప మార్పులతో...')**

# ముఖ్యమైన పరిణామాలు

# తెలంగాణ రాష్ట్ర సాధన చివరి దశ ఉద్యమంలో ప్రధాన ఘట్టాలకు సంబంధించిన వివరాలు

| | |
|---|---|
| 09-10-2009 | ఫ్రీజోన్ వివాదంపై సుప్రీం కోర్టు తీర్పు. హైదరాబాద్ 6వ జోన్‌లో భాగమైనప్పటికి రాష్ట్రపతి ఉత్తర్వు లోని 14ఎఫ్ నిబంధన అనుసరించి పోలీస్ అధికారుల నియామకాల విషయంలో మాత్రం ఫ్రీజోన్‌గా పరిగణించాలని తీర్పునిచ్చింది. |
| 11-10-2009 | ఫ్రీజోన్ పై సుప్రీం కోర్టు తీర్పుకు నిరసనగా తెలంగాణ ఎన్జీఓల సంఘం ఆధ్వర్యంలో టిఎన్‌జివో భవన్ నుంచి ఛలో అసెంబ్లీ కార్యక్రమం, పోలీసులు అడ్డగించడంతో గన్ పార్కువద్ద ధర్నా. |
| 21-11-2009 | సిద్ధిపేటలో తెలంగాణ ఉద్యోగుల గర్జన, భారీ బహిరంగ సభ, కెసిఆర్ ఆమరణదీక్ష ప్రకటన. |
| 28-11-2009 | నిరహారదీక్షలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుండి కరీంనగర్ బయలుదేరివెళ్లిన కె.సి.ఆర్. కరీంనగర్‌లోని టిఆర్ఎస్ ఆఫీసు (తెలంగాణ భవన్) ను చుట్టుముట్టేందుకు భారీగా పోలీసుల మోహరింపు, ప్రతిఘటించిన తెలంగాణఉద్యమకారులు. రాత్రంతా హైడ్రామా ... |
| 29-11-2009 | ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం సిద్దిపేటలో ఆమరణ నిరాహార దీక్షకు సిద్దమై కరీంనగర్ నుంచి బయలుదేరిన కేసీఆర్ ను పోలీసులు అల్గునూరువద్ద అరెస్టు చేసి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. తెలంగాణలో ఈ సంఘటనతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎల్. బి. నగర్‌వద్ద శ్రీకాంతాచారి ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యా యత్నం. ఆసుపత్రికి తరలింపు. |
| 30-11-2009 | ఖమ్మం జిల్లా జైల్‌నుంచి కెసిఆర్‌ను జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించిన పోలీసులు |
| 01-12-2009 | నిజామాబాద్ జిల్లాలో కానిస్టేబుల్ కిష్టయ్య సెల్ టవర్‌పైకి ఎక్కి రివాల్వర్‌తో కాల్చుకుని మృతి. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరునిగా చరిత్రలో నిలిచిపోయిన కానిస్టేబుల్ కిష్టయ్య. |
| 03-12-2009 | ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శ్రీకాంతాచారి మృతి. ఖమ్మం జిల్లా ప్రధాన ఆసుపత్రి నుండి కెసిఆర్‌ను భారీ బందోబస్తు మధ్య |

హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించిన పోలీసులు.

05-12-2009 అసెంబ్లీలో తెలంగాణపై చర్చ. కెసిఆర్ దీక్షను విరమింపజేయాలనివినతి.

7-12-2009 ముఖ్యమంత్రి రోశయ్య అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం, తెలంగాణ బిల్లు పెడితే మద్దతిస్తామన్న అన్ని రాజకీయ పార్టీలు.

9-12-2009 తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామన్న కేంద్ర హోంమంత్రి చిదంబరం, అర్ధరాత్రి నిరాహార దీక్ష విరమించిన టీఆర్ఎస్ అధినేత కేసీఆర్.

10-12-2009 చిదంబరం ప్రకటనను వ్యతిరేకించిన సీమాంధ్ర నేతలు, మూకుమ్మడి రాజీనామాలు.

23-12-2009 చిదంబరం మరో ప్రకటన. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు భిన్న వైఖరులు తీసుకున్న కారణంగా విస్తృత సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉందని ప్రకటన

24-12-2009 చిదంబరం ప్రకటనపై తెలంగాణలో ఆగ్రహావేశాలు, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి (జేఏసి) ఏర్పాటు.

25-12-2009 బంజారాహిల్స్ లోని రావి నారాయణరెడ్డి హాల్‌లో జేయేసీ స్టీరింగ్ కమిటీ తొలి సమావేశం.జేయేసీ కన్వీనర్‌గా ప్రొఫెసర్ యం. కోదండరామ్ ఏకగ్రీవంగా నియామకం.

30-12-2009 చిదంబరం మూడో ప్రకటన. జనవరి 5న ఢిల్లీకి రావాలని ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది రాజకీయ పార్టీలకు పిలుపు.

03-01-2010 లక్షలాదిమందితో ఉస్మానియా ఆర్ట్సకళాశాలవద్ద విద్యార్థి గర్జన సమావేశం.

05-01-2010 ఢిల్లీలో హోంమంత్రి చిదంబరంతో ఎనమిది పార్టీల నేతల సమావేశం.

06-01-2010 ఇందిరాపార్క్‌వద్ద జేయేసీ ఆధ్వర్యంలో రిలే నిరహారదీక్షలు ప్రారంభం.

25-01-2010 ఆదర్శనగర్ న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలంగాణ జేయేసీ కార్యాలయం ప్రారంభం.

04-02-2010 తెలంగాణ కోసం 500 కి.మీ.పొడవునా రాజీవ్ రహదారిపై మానవహారం

జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ (రిటైర్డ్ న్యాయవాది, సుప్రీంకోర్టు) అధ్యక్షతన సంప్రదింపుల కమిటీ ఏర్పాటు

| | |
|---|---|
| 08-02-2010 | జమాతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో నిజాం కళాశాల గ్రౌండ్‌లో 'తెలంగాణ ముస్లీం గర్జన', |
| | వరంగల్‌కాకతీయ యూనివర్సిటీలో 'విద్యార్థి పొలికేక' |
| 15-02-2010 | ఓయూలో కాల్పులు - రణరంగమైన క్యాంపస్ |
| | 15మంది తెలంగాణ ఎమ్మెల్యేల రాజీనామా |
| 16-02-2010 | ఓయూలో మళ్లీ పోలీసుల దాడి |
| 21-02-2010 | ఉద్రిక్తంగా అసెంబ్లీ ముట్టడి, యాదయ్య ఆత్మహత్యాయత్నం, తర్వాత ఆసుపత్రిలో మృతి |
| 23-02-2010 | ఢిల్లీలో న్యాయవాదుల ధర్నా, పోలీసుల దాడి |
| 12-03-2010 | జేఏసినుండి తెలుగుదేశం పార్టీ బహిష్కరణ |
| 19-03-2010 | జేయేసీ పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటు |
| 21-03-2010 | తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో ఉద్యమ బస్సు యాత్ర ప్రారంభం. |
| 23-03-2010 | తెలంగాణ ఉద్యమ బస్సుయాత్ర హన్మకొండలో అర్ధరాత్రి ముగింపు. |
| 09-04-2010 | రెండవ విడత ఉద్యమ బస్సుయాత్ర కొమురవెల్లి దేవస్థానం నుండి ప్రారంభం |
| 12-04-2010 | మంచిర్యాలవద్ద ఉద్యమ యాత్ర ముగింపు |
| 28-04-2010 | జర్నలిస్టుల రిలే నిరహారదీక్షలు |
| 02-05-2010 | బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆర్టీసీ జేయేసీ ఏర్పాటు |
| 04-05-2010 | బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సింగరేణి జేయేసీ ఏర్పాటు |
| 07-05-2010 | తెలంగాణ ఫిల్మ్ జేయేసీ ఏర్పాటు |
| 08-05-2010 | గ్రేటర్ హైదరాబాద్ జేయేసీ ఏర్పాటు |
| 28-05-2010 | జగన్ ఓదార్పుయాత్ర విఫలం - రణరంగమైన మానుకోట రైల్వేస్టేషన్ - ప్రజా ప్రతిఘటన |
| 10-06-2010 | రంగారెడ్డి జిల్లా జేయేసీ ఆవిర్భావం |
| 12-06-2010 | తెలంగాణ జేయేసీ తొలి విస్తృతస్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం |
| 02-07-2010 | 'తెలంగాణ సాధన దీక్షా వారం' ప్రారంభం |
| 02-07-2010 | ఉప ఎన్నికల నోటిఫికేషన్ జారీ |
| 04-07-2010 | తెలంగాణ వ్యాపితంగా తెలంగాణ అమర వీరుల సంస్మరణ సభలు |
| 09-07-2010 | నామినేషన్లకు చివరి రోజు, జేయేసీ ఆధ్వర్యంలో 'తెలంగాణ గ్రామ కట్టడి'. |

| | |
|---|---|
| 27-07-2010 | పోలింగ్ |
| 29-07-2010 | తెలంగాణ భవన్‌లో తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటీ ప్రత్యేక సమావేశం |
| 30-07-2010 | మొత్తం 12స్థానాల్లోనూ తెలంగాణ వాదమే గెలిచింది- అపూర్వ మెజారిటీ |
| 31-07-2010 | ఉస్మానియా క్యాంపస్ నుండి గన్‌పార్క్‌వరకు విద్యార్థుల ర్యాలీ-భగ్నం చేసిన పోలీసులు |
| 01-08-2010 | ఓయూలో ఇషాన్‌రెడ్డి ఆత్మార్పణం |
| 18-08-2010 | ఆత్మహత్యలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ |
| 01-10-2010 | తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావం |
| 05-12-2010 | తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ర్యాలీ, మహాసభ (ఆర్టీసీ కల్యాణమంటపంలో...) |
| 16-12-2010 | వరంగల్‌లో టిఆర్ఎస్ మహాగర్జన సభ |
| 31-12-2010 | చిదంబరం చేతికి శ్రీ కృష్ణకమిటీ నివేదిక |
| 06-01-2011 | శ్రీకృష్ణకమిటీ నివేదిక ప్రకటన |
| 18-01-2011 | జేఏసీ ఆధ్వర్యంలో రహదారుల దిగ్బంధనం |
| 22-01-2011 | తెలంగాణ వ్యాప్తంగా రిలే దీక్షలు ప్రారంభం |
| | 'తెలంగాణ వర్తమాన ఉద్యమం – మన కర్తవ్యం' అన్ని జిల్లాలలో విద్యావంతుల వేదిక సదస్సులు |
| 17-02-2011 | తెలంగాణ వ్యాప్తంగా సహాయనిరాకరణ కార్యక్రమం మొదలు. ఉద్యోగులకు సంఘీభావ ర్యాలీలు |
| 21-02-2011 | రణరంగమైన రాజధాని, విద్యార్థుల చలో అసెంబ్లీ... న్యాయవాదుల చలో రాజ్‌భవన్. |
| | తెలంగాణలో 48 గంటల బంద్. |
| 23-02-2011 | తెలంగాణతో... దద్దరిల్లిన పార్లమెంట్ |
| 25-02-2011 | తెలంగాణపై లోక్‌సభలో మళ్లీ లొల్లి |
| 27-02-2011 | గర్జించిన తెలంగాణ కవులు |
| 01-03-2011 | తెలంగాణలో "పల్లె పల్లె పట్టాలపైకి" విజయవంతం |
| 04-03-2011 | సహాయ నిరాకరణ విరమణ |
| 10-03-2011 | మిలియన్ మార్చ్ సక్సెస్... ట్యాంక్‌బండ్‌పై ఉద్యమ స్ఫూర్తి ప్రదర్శించిన ప్రజలు |

| | |
|---|---|
| 17-03-2011 | అసెంబ్లీకి మాసికం |
| 28-04-2011 | జూపల్లి ప్రారంభించిన 'తెలంగాణ ప్రజాభియాన్ యాత్ర' |
| 09-05-2011 | తెలంగాణ కోసం నక్సలైట్‌నవుతా!: నగారా సభలో నాగం |
| 19-05-2011 | ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద టీజేఏఫ్ ధర్నా |
| 29-05-2011 | ఢిల్లీలో జేఏసి రౌండ్‌టేబుల్ సమావేశం |
| 06-06-2011 | జేఏసీ కార్యాలయం మార్పు |
| 19-06-2011 | 'హైదరాబాద్ కుక్స్ ఆన్ రోడ్స్' సక్సెస్ |
| 21-06-2011 | తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సారు అస్తమయం |
| 22-06-2011 | 'తెలంగాణ జాతిపిత' జయశంకర్ సారుకు కన్నీటి వీడ్కోలు |
| 04-07-2011 | తెలంగాణ నేతల మూకుమ్మడి రాజీనామా... |
| 05-07-2011 | జేఏసీ ఆధ్వర్యంలో 48 గంటల బంద్ |
| 06-07-2011 | ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో కోదండరాం అరెస్ట్ |
| 10-07-2011 | ఓయూలో మీడియాపై ఆంక్షలు |
| 11-07-2011 | ఓయూలో విద్యార్థుల సామూహిక దీక్షలు ప్రారంభం |
| 13-07-2011 | ఇందిరాపార్కు వద్ద టీ కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల నిరసన |
| 14-07-2011 | ఓయూలో విద్యార్థుల దీక్ష విరమణ, రైల్‌రోకో విజయవంతం |
| 15-07-2011 | సీఎంకు జేఏసీ సకల జనుల సమ్మె నోటీసు |
| 20-07-2011 | తెలంగాణ కోరుతూ ఢిల్లీలో యాదిరెడ్డి ఆత్మహత్య |
| 23-07-2011 | తెలంగాణ ఎమ్మెల్యేల రాజీనామాల తిరస్కరణ |
| 03-08-2011 | 14ఎఫ్‌పై దద్దరిల్లిన తెలంగాణ |
| 12-08-2011 | 14ఎఫ్ రద్దు.. తెలంగాణలో సంబరాలు |
| 09-09-2011 | 'తెలంగాణ నగారా సమితి' ఆవిర్భావం |
| 12-09-2011 | కరీంనగర్‌లో టిఆర్ఎస్ 'జన గర్జన' సభ |
| 13-09-2011 | సకలం బంద్.. సకల జనుల సమ్మె ఆరంభం |
| 16-09-2011 | సింగరేణిలో సకల జనుల సమ్మె పరిశీలనకు వెళ్లిన పిట్టల రవీందర్‌పై దాడి |
| 19-09-2011 | జాతీయ రహదారుల దిగ్బంధం సంపూర్ణం |
| 22-09-2011 | ఖమ్మంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ పోరుగర్జన సవాళ్లు' సదస్సు |

24-09-2011 48 గంటల రైల్‌రోకో

25-09-2011 ఢిల్లీ జేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష భేటీ

02-10-2011 ఢిల్లీ రాజ్‌ఘాట్‌లో జేఏసీ మౌనదీక్ష

09-10-2011 సకల జనుల సమ్మె పరిశీలనకు వెడుతున్న కోదండరామ్, మల్లేపల్లి లక్ష్మయ్య, పిట్టల రవీందర్‌తో పాటు పలువురు నేతల అరెస్టు – ప్రజల ప్రతిఘటన – కొత్తగూడెంలో మూడురోజులపాటు పిట్టల రవీందర్ ప్రవేశాన్ని నిషేధించిన ప్రభుత్వం.

11-10-2011 ఉద్యోగుల మహాధర్నాతో దద్దరిల్లిన హైదరాబాద్

14-10-2011 కరీంనగర్‌లో ఉపాధ్యాయ మహాగర్జన

15-10-2011 రైలురోకోపై సర్కారు ఉక్కుపాదం–తెలంగాణ అరెస్ట్

16-10-2011 రైల్‌రోకో రెండో రోజు ఉద్రిక్తం

17-10-2011 బాన్సువాడ ఉపఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం

24-10-2011 సకల జనుల సమ్మె సమాప్తం

01-11-2011 ఢిల్లీలో కొండా లక్ష్మణ్ బాపూజీ సత్యాగ్రహ దీక్ష

07-11-2011 కొండా లక్ష్మణ్ బాపూజీ సత్యాగ్రహ దీక్ష విరమణ

15-11-2011 ఎంపీల రాజీనామాల తిరస్కరణ

10-12-2011 జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ అంతటా 'జాగరణ' కార్యక్రమం

06-01-2012 చంద్రదండు స్వైరవిహారం, ఖాకీల లాఠీచార్జీల మధ్య చంద్రబాబు వరంగల్ పర్యటన

19-01-2012 బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ పోరు యాత్ర ప్రారంభం,

20-01-2012, రెండురోజులపాటు లోటస్‌పాండ్‌లో జేయేసీ మేధోమథనం.

10-03-2012 ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ పుస్తకావిష్కరణ – పలువురి అరెస్టు

26-05-2012 మూడు రోజుల మానుకోట స్ఫూర్తి యాత్ర – మహబూబాబాద్ నుండి ప్రారంభం

29-05-2012 పరకాలలో టీఆర్ఎస్‌కే జేఏసీ మద్ధతు – ప్రకటన

15-06-2012 పరకాలలో టీఆర్ఎస్ గెలుపు

21-06-2012 జయశంకర్ వర్ధంతి సభ

| | |
|---|---|
| 24-05-2012 | తెలంగాణ జర్నలిస్టుల ఫోరం సదస్సు |
| 28-06-2012 | సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో టిజిబికెఎస్ విజయం |
| 07-07-2012 | జేయేసీ విస్తృతస్థాయి సమావేశంలో 'తెలంగాణ మార్చ్' పై నిర్ణయం |
| 23-07-2012 | సిరిసిల్ల ఓ రణక్షేత్రం.. విజయమ్మకు చెప్పులు,చీపుళ్లతో స్వాగతం |
| 22-08-2012 | విద్యుత్ దీక్ష... టీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు, |
| 25-08-2012 | పాల్వంచ నుండి సిపిఐ ప్రజాపోరుయాత్ర ప్రారంభం |
| 04-09-2012 | ఢిల్లీలో బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మూడు రోజుల పోరుదీక్ష ప్రారంభం, |
| 16-09-2012 | సాగరహారం (తెలంగాణ మార్చ్)కు మద్దతుగా కరీంనగర్‌లో జనం 'కవాతు' |
| 17-09-2012 | భూపాలపల్లిలో 1000వ రోజుకు చేరిన తెలంగాణ రిలే నిరహార దీక్షలు, జేయేసీ కన్వీనర్ రమేష్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు |
| 20-09-2012 | ఆదిలాబాద్‌లో 1000వ రోజుకు చేరిన తెలంగాణ రిలే నిరహార దీక్షలు, జేయేసీ చైర్మన్ కారింగుల దామోదర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు |
| 21-09-2012 | తెలంగాణ బాపూజీ కొండాలక్ష్మణ్ ఆకస్మిక మృతి |
| | సుల్తానాబాద్‌లో 1000వ రోజుకు చేరిన తెలంగాణ రిలే నిరహార దీక్షలు, జేయేసీ కన్వీనర్ పారుపెల్లి వైకుంఠపతి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు |
| 22-09-2012 | బోధన్‌లో 1000వ రోజుకు చేరిన తెలంగాణ రిలే నిరహార దీక్షలు, జేయేసీ చైర్మన్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు |
| 23-09-2012 | సిద్ధిపేటలో 1000వ రోజుకు చేరిన తెలంగాణ రిలే నిరహార దీక్షలు, జేయేసీ చైర్మన్ డా॥ పాపయ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు |
| | బోడుప్పల్‌లో 1000వ రోజుకు చేరిన తెలంగాణ రిలే నిరహార దీక్షలు. |
| 28-09-2012 | నక్లెస్‌రోడ్‌లో సాగరహారానికి ('తెలంగాణ మార్చ్' కు) షరతులతో ప్రభుత్వం అనుమతి ... |

| | |
|---|---|
| 28-09-2012 | జెఏసీ కోఆర్డినేటర్ పిట్టల రవీందర్‌ను పోలీసుల కిడ్నాప్, రహస్యప్రాంతంలో నిర్బంధం |
| 30-09-2012 | జనసంద్రమైన నెక్లెస్‌రోడ్, విజయవంతమైన తెలంగాణ మార్చ్ |
| 02-10-2012 | బాపూఘాట్ వద్ద జెఎసి మౌనదీక్ష |
| 16-10-2012 | హైదరాబాద్‌లో ప్రధాని పర్యటన సందర్భంగా నల్ల బెలూన్లు ఎగరేసిన జేయేసీ |
| 30-10-2012 | కదం తొక్కిన తెలంగాణ కలాలు, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 'ఆత్మగౌరవ ర్యాలీ' |
| 01-11-2012 | కోదండరాం గృహనిర్బంధం, నాగం అరెస్టు... ఐదు గంటలు దీక్ష... |
| 22-12-2012 | హైదరాబాద్‌లో ధూంధాం దశాబ్ది ఉత్సవాల్లో పోటెత్తిన పాట |
| 28-12-2012 | తెలంగాణకు నెలలోపే పరిష్కారం. ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో షిండే |
| 18-01-2013 | మింట్ కాంపౌండ్‌వద్ద విద్యుత్ ఉద్యోగుల జేయేసీ ఆధ్వర్యంలో భారీయెత్తున 'స్మృతిదీక్ష' |
| 24-01-2013 | మెడికల్ జాక్ ఆధ్వర్యంలో వరంగల్లులో సదస్సు |
| 27-01-2013 | ఇందిరాపార్క్‌వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రెండు రోజుల 'సమరదీక్ష' |
| 21-03-2013 | సడక్ బంద్ సక్సెస్.. కోదండరామ్‌తో సహా పలువురి నేతల అరెస్టు |
| 24-03-2013 | హైదరాబాద్‌లో తెలంగాణ విద్యావంతుల వేదిక 4వ రాష్ట్ర మహాసభ |
| 27-04-2013 | 'సంసద్ యాత్ర'కు బయలుదేరిన ప్రత్యేక రైలు. |
| 28-04-2013 | ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద సత్యాగ్రహ దీక్ష |
| 03-06-2013 | మహబూబ్‌నగర్‌లో బి.జె.పి బహిరంగసభ- నగరా సమితి బిజెపిలో విలీనం |
| 13-06-2013 | తీవ్ర నిర్బంధాల నడుమ 'ఛలోఅసెంబ్లీ'. |
| 26-06-2013 | ఫిల్మ్ ఛాంబర్‌లో జాతీయపార్టీల రాష్ట్ర నాయకులతో జేయేసీ సమావేశం. |
| 29-06-2013 | 'ఛలో అసెంబ్లీ' సందర్భంగా పోలీసుల దుశ్చర్యలపై 'ప్రజాకోర్టు' నిర్వహణ |
| 04-07-2013 | ఢిల్లీలో జాతీయపార్టీల నాయకులతో జేయేసీ రౌండ్ టేబుల్ సమావేశం |

| | |
|---|---|
| 13-07-2013 | 'టివివి' ఆధ్వర్యంలో సాగర్‌లో రెండురోజుల 'తెలంగాణ సమాలోచన' ప్రారంభం |
| 19-07-2013 | జేయేసీ ఆధ్వర్యంలో 'జన చైతన్య యాత్ర' ప్రారంభం |
| 30-07-2013 | యుపిఏ అనుమతితో సిడబ్ల్యుసి తెలంగాణకు అనుకూలంగా తీర్మాణం - ప్రకటన |
| 31-07-2013 | తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'తెలంగాణ రాష్ట్రం-వర్తమాన సవాళ్లు' అంశంపై జాతీయస్థాయి సెమినార్. |
| 19-08-2013 | ఇందిరాపార్క్‌వద్ద జేయేసీ వారంరోజుల 'శాంతి దీక్షలు' ప్రారంభం |
| 29-08-2013 | 'హమారా హైదరాబాద్' సదస్సుగా కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 120వ జయంతి |
| 01-09-2013 | నుండి 04-09-2013 వరకు జిల్లాలలో ర్యాలీలు, దీక్షలు |
| 04-09-2013 | ముల్కీ అమరుల సంస్మరణ ర్యాలీలు |
| 07-09-2013 | ఏపీఎన్‌జిఓల సేవ్ ఆంధ్రప్రదేశ్ సభ-ఎల్.బి. స్టేడియంలో, -తెలంగాణ బంద్ విజయవంతం |
| 28-09-2013 | మహబూబ్‌నగర్‌లో బీజేపి 'తెలంగాణ గర్జన' |
| 29-09-2013 | 'సకలజన భేరి'లో మార్మోగిన తెలంగాణ నినాదం |
| 03-10-2013 | సిడబ్ల్యుసి తీర్మానాన్ని యధాతథంగా ఆమోదించిన కేంద్ర కేబినెట్ |
| 08-10-2013 | నోట్ తయారీకి మంత్రుల బృందం ఏర్పాటు |
| 11-10-2013 | ఢిల్లీలో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ('జీవోఎం') మొదటి భేటి |
| 16-10-2013 | అల్వాల్‌లో 1000వ రోజుకు చేరిన తెలంగాణ రిలే నిరహార దీక్షలు, జేయేసీ కన్వీనర్ పట్లోల్ల సురేందర్‌రెడ్డి, ఏర్పుల దయాకర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు |
| 19-10-2013 | జీవోఎంకు 11 అంశాలపై టీజేఏసి సవివరంగా నివేదిక |
| 28-10-2013 | శాంతిభద్రతలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు |
| 31-10-2013 | జీవోఎం విధివిధానాలపై అభిప్రాయాలు చెప్పాలని పార్టీలకే కేంద్రం లేఖలు |
| 06-11-2013 | 12న జీవోఎంతో చర్చకు ఐదు పార్టీలకు పిలుపు |
| 12-11-2013 | జీవోఎంతో విడివిడిగా పార్టీల భేటీలు |
| 04-12-2013 | ఢిల్లీ ఏ.పి. భవన్‌లో జేయేసీ స్టీరింగ్ కమిటీ సమావేశం |

| | |
|---|---|
| 05-12-2013 | రాయల తెలంగాణను వ్యతిరేకిస్తూ తెలంగాణ బంద్, తెలంగాణ ముసాయిదా బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం |
| 06-12-2013 | రాష్ట్రపతి భవన్‌కు తెలంగాణ బిల్లు, |
| 12-12-2013 | హైదరాబాద్ చేరిన తెలంగాణ బిల్లు |
| 16-12-2013 | అసెంబ్లీలో తెలంగాణ బిల్లు, నాటకీయ పరిణామాల మధ్య చర్చ ప్రారంభం |
| 24-12-2013 | 'తెలంగాణ ప్రజా ఫ్రంట్' అధ్యక్షుడు ఆకుల భూమయ్య దుర్మరణం |
| 03-01-2014 | తెలంగాణ బిల్లుపై చర్చించేందుకు ఈ ప్రత్యేకంగా సమావేశమైన శాసన సభ మూడు వాయిదాలతో 15 నిముషాలు మాత్రమే కొనసాగి మరునాటికి వాయిదా పడింది. |
| 07-01-2014 | తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద "సంపూర్ణ తెలంగాణ సాధన దీక్ష" నిర్వహించారు. తెలంగాణ బిల్లులో చేపట్టాల్సిన 13 సవరణలను ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఆమోదించారు. |
| 08-01-2014 | రాష్ట్ర విభజన బిల్లుపై ఎట్టకేలకు ఈ రోజు మధ్యాహ్నం స్పీకర్ ఆదేశాల మేరకు మంత్రి వట్టి వసంతకుమార్ చర్చను ప్రారంభించారు. |
| 09-01-2014 | ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ, శాసన మండలిలో తెలంగాణ బిల్లుపై వాడివేడి చర్చ కొనసాగింది. |
| 25-01-2014 | ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును తిరస్కరిస్తూనే, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేందుకు సిఫారసు చేయవద్దని రాష్ట్రపతికి విజ్ఞప్తిచేసే తీర్మాణాన్ని శాసన సభలో తేవడానికి వీలుగా స్పీకర్, మండలి చైర్మన్‌లకు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి నోటీసు లిచ్చారు. |
| 30-01-2014 | తెలంగాణ బిల్లుపై అసెంబ్లీలో చేపట్టిన చర్చ ఈ రోజుతో ముగిసింది. సభలో తీవ్ర గందరగోళం కొనసాగుతుండగానే ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మాణాన్ని మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు శాసన సభ స్పీకర్ నాదేండ్ల మనోహర్ ప్రకటించారు. |
| 03-02-2014 | ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఇరు ప్రాంతాలకు "సమన్యాయం" చేయాలని డిమాండ్ చేసారు. |

| | |
|---|---|
| 04-02-2014 | టిఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్‌రావు ఢిల్లీలో ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్‌ను కలిసి బిల్లులో చేపట్టవలసిన సవరణలపై చర్చించారు. |
| | బిజెపి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి అత్యవసర సమావేశం జరిగింది. |
| 05-02-2014 | పార్లమెంటు ఉభయ సభలు ప్రారంభం. |
| | రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని రాష్ట్రపతి కలిసి కోరిన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి. |
| | విభజనను ఆపాలని కోరుతూ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీని కలిసిన వైకాపా అధినేత వై.యస్. జగన్ మరియు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు. |
| | ప్రధాని మన్మోహన్‌ను వేర్వేరుగా కలిసిన తెలంగాణకు చెందిన మంత్రులు, కాంగ్రెస్, టిడిపి ఎమ్మెల్యే, ఎంపీలు. |
| | ముంబాయిలో శివసేన అధినేత ఉద్దవ్ థాకరేను కలిసి విభజను ఆపాలని కోరిన చంద్రబాబు. |
| 06-02-2014 | తెలంగాణ బిల్లుకు ఆమోదం తెలిపిన జీవోయం. |
| | తెలంగాణ, సమైక్యాంధ్ర నినాదాలతో పార్లమెంటు ఉభయ సభలు వాయిదా. |
| | పార్లమెంటులో బిల్లు ప్రవేశపెడితే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించిన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి. |
| | సమన్యాయం చేయాలని చెన్నైలో జయలలిత, కరుణానిధిలను కలిసిన చంద్రబాబు. |
| 07-02-2014 | ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా వేసిన తొమ్మిడి ఫిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. |
| | రాష్ట్ర విభజన బిల్లును కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. బిల్లులో ప్రభుత్వ పరంగా 32 సవరణలను తీసుక రావాలని కేబినెట్ నిర్ణయించింది. |
| | టిఆర్ఎస్ పార్టీ తరుపున తొలి రాజ్యసభ సభ్యునిగా కె. కేశవరావు ఎన్నికైనారు. |

| | |
|---|---|
| 10-02-2014 | తెలంగాణ, సమైకాంధ్ర నినాదాలతో ఉభయ సభలు మళ్లీ వాయిదా. |
| | కోల్‌కత్తాలో మమతాబెనర్జీని కలిసి విభజన ఆపాలని కోరిన టిడిపి అధినేత చంద్రబాబు. |
| | సీమాంధ్రకు చెందిన ఆరుగురు పార్లమెంటు సభ్యులను పార్టీనుండి బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించింది. |
| | తెలంగాణ బిల్లు లోపభూయిష్టంగా వుందని బిజెపి అగ్రనేత ఎల్‌కె అధ్వాని అభ్యంతరం. |
| | వామపక్షనేతలు ప్రకాశ్ కారత్, ఏబి బర్ధన్‌లను కలిసి విభజన ఆపాలని కోరిన చంద్రబాబు |
| 12-02-2014 | లోక్‌సభలో ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్ సభ వాయిదా. |
| 13-02-2014 | మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభలో సభా వ్యవహారాల జాబితాలోని 20-ఎ అంశం అయిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ శిండే. |
| | లోక్‌సభలో పెప్పర్‌స్ప్రే చల్లిన విజయవాడ ఎంపీ లగడపాటి రాజగోపాల్. |
| 16-02-2014 | నరేంద్రమోడి, ములాయంసింగ్ యాదవ్, శరద్‌యాదవ్‌లను వేర్వేరుగా కలిసి విభజనను అడ్డుకోవాలని కోరిన టిడిపి అధినేత చంద్రబాబు. |
| 17-02-2014 | ఢిల్లీలో సేవ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో వైయస్ జగన్, ఎపిఎన్‌జిఓలు వేర్వేరుగా ధర్నా కార్యక్రమాలు. |
| 18-02-2014 | మధ్యాహ్నం 3 గంటలనుంచి 4.20 గంటల వరకు అధికార, ప్రతిపక్షాల సంపూర్ణ మద్దతుతో 35 సవరణలతో కూడిన "ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీరణ బిల్లు-2014" కు లోక్‌సభ ఆమోదం. |
| 19-02-2014 | రాజ్యసభకు చేరిన "ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీరణ బిల్లు-2014" ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తన పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా. |
| 20-02-2014 | రాజ్యసభలో "ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీరణ బిల్లు-2014" కు ఆమోదం. |
| 21-02-2014 | కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని కలిసి కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ జేయేసీ నేతలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ నాయకులు. |

| | |
|---|---|
| 26-02-2014 | హైదరాబాద్‌కు చేరుకున్న టిఆర్ఎస్ అధినేత కెసిఆర్. |
| | "ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీరణ బిల్లు-2014" కేంద్ర న్యాయశాఖ తుది పరిశీలన తర్వాత హోంశాఖకు చేరింది. |
| 28-02-2014 | రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం. |
| 01-03-2014 | "ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీరణ బిల్లు-2014" కు రాష్ట్రపతి ఆమోదం. |
| | రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ప్రారంభం, గవర్నర్ చేతికి పాలన భాద్యతలు. |
| | తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశం, తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వామి అవుతూ జేయేసీ తన పాత్రను కొనసాగిస్తుందని ప్రకటించిన కోదండరాం. |
| 02-03-2014 | చట్టంగా రూపొందిన "ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీరణ బిల్లు-2014". |
| | భద్రాచలం డివిజన్‌లోని ఏడు మండలాలను ఆంధ్రాలో కలుపుతూ ఆర్డినెన్స్ తేవాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న కెసిఆర్. |

* * *

# సంక్షిప్త వివరాలు

**9 అక్టోబర్ 2009:**

ఫ్రీజోన్ వివాదంపై సుప్రీం కోర్టు తీర్పు. హైదరాబాద్ 6వ జోన్‌లో భాగమైన ప్పటికి రాష్ట్రపతి ఉత్తర్వు లోని 14ఎఫ్ నిబంధన అనుసరించి పోలీస్ అధికారుల నియామకాల విషయంలో మాత్రం ఫ్రీజోన్‌గా పరిగణించాలని తీర్పునిచ్చింది.

**11 అక్టోబర్ 2009:**

ఫ్రీజోన్ పై సుప్రీం కోర్టు తీర్పుకు నిరసనగా తెలంగాణ ఎన్జీఓల సంఘం ఆధ్వర్యంలో టిఎన్‌జివో భవన్ నుంచి ఛలో అసెంబ్లీ కార్యక్రమం, గన్ పార్కువద్ద ధర్నా.

**13 అక్టోబర్ 2009:**

ఫ్రీజోన్ పై సుప్రీం కోర్టు తీర్పుకు నిరసనగా తెలంగాణ ఎన్జీఓల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నా.

**21 నవంబర్ 2009:**

సిద్ధిపేటలో తెలంగాణ ఉద్యోగుల గర్జన, భారీ బహిరంగ సభ, కెసిఆర్ ఆమరణదీక్ష ప్రకటన.

**28 నవంబర్ 2009 :**

నిరహారదీక్షలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుండి కరీంనగర్ బయలుదేరివెళ్లిన కె.సి.ఆర్. కరీంనగర్‌లోని టిఆర్ఎస్ ఆఫీసు (తెలంగాణ భవన్)ను చుట్టుముట్టేందుకు భారీగా పోలీసుల మోహరింపు, ప్రతిఘటించిన తెలంగాణ ఉద్యమకారులు. పలువురి ఆత్మహత్యా ప్రయత్నం. రాత్రంతా హైడ్రామా ...

**29 నవంబర్ 2009 :**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం సిద్దిపేటలో ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమై కరీంనగర్ నుంచి బయలుదేరిన కేసీఆర్‌ను పోలీసులు అల్గునూరువద్ద అరెస్టు చేసి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. తెలంగాణలో ఈ సంఘటనతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సిద్ధిపేటలోని దీక్షాశిబిరం వద్ద ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం. ఎల్.బి. నగర్‌వద్ద శ్రీకాంతాచారి ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యా యత్నం. తీవ్రగాయాలతో ఆసుపత్రికి తరలింపు. కెసిఆర్ దీక్షకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల ఆందోళనలు.

**30 నవంబర్ 2009 :**

ఖమ్మం జిల్లా జైల్‌నుంచి కెసిఆర్‌ను జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించిన పోలీసులు

కెసిఆర్ ఆమరణదీక్షకు మద్దతుగా, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే

డిమాండ్‌తో తెలంగాణ వ్యాప్తంగా ఉద్యోగుల పెన్‌డౌన్.

**01 డిసెంబర్ 2009:**

నిజామాబాద్ జిల్లాలో కానిస్టేబుల్ కిష్టయ్య సెల్ టవర్‌పైకి ఎక్కి రివాల్వర్‌తో కాల్చుకుని మృతి. తన చావుతోనైనా తెలంగాణ ప్రకటించాలని లేఖ. సెల్‌టవర్‌పై నుండి దాదాపు రెండు గంటలపాటు తెలంగాణ నినాదాలు. వేలాదిమంది ప్రజలు, మీడియా సమక్షంలోనే ఆత్మహత్య. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరునిగా చరిత్రలో నిలిచిపోయిన కానిస్టేబుల్ కిష్టయ్య.

ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కెసిఆర్ జ్యూస్ తాగి దీక్షను విరమించినట్లు మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం. నిరసనగా భగ్గుమన్న ఉస్మానియా క్యాంపస్. ఉస్మానియా క్యాంపస్‌తో పాటు అనేక చోట్ల పెద్ద ఎత్తున కెసిఆర్ దిష్టిబొమ్మల దహనం. ఆసుపత్రిలోనే కెసిఆర్ తన దీక్షను కొనసాగిస్తున్నట్లు టిఆర్ఎస్ ముఖ్యనేతల ప్రకటన.

**03 డిసెంబర్ 2009:**

ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శ్రీకాంతాచారి మృతి. ఖమ్మం జిల్లా ప్రధాన ఆసుపత్రి నుండి కెసిఆర్‌ను భారీ బందోబస్తు మధ్య హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించిన పోలీసులు.

**05 డిసెంబర్ 2009:**

అసెంబ్లీలో తెలంగాణపై చర్చ. కెసిఆర్ దీక్షను విరమింపజేయాలని వినతి.

**7 డిసెంబర్ 2009:**

ముఖ్యమంత్రి రోశయ్య అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం, తెలంగాణ బిల్లు పెడితే మద్దతిస్తామన్న అన్ని రాజకీయ పార్టీల అగ్రనేతలు.

**9 డిసెంబర్ 2009:**

తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామన్న కేంద్ర హోంమంత్రి చిదంబరం, అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి రోశయ్యకు సూచన. తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఉదయం నుండి సాయంత్రం వరకు తెలంగాణ మేథావులు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు, కులసంఘాల ప్రతినిధులతో సుధీర్ఘ సమావేశం. కెసిఆర్ దీక్షను విరమింపజేయాలని సూచన. అదేరోజు అర్ధరాత్రి నిరాహార దీక్ష విరమించిన టీఆర్ఎస్ అధినేత కేసీఆర్.

**10 డిసెంబర్ 2009:**

రాష్ట్రంలో మారిన రాజకీయం, చిదంబరం ప్రకటనను వ్యతిరేకించిన సీమాంధ్ర నేతలు, మూకుమ్మడిగా రాజీనామాల సమర్పణ.

**11 డిసెంబర్ 2009:**

సీమాంధ్రలో అక్కడి నాయకుల ప్రోద్భలంతో కృత్రిమ ఉద్యమం ప్రారంభం. లగడపాటి రాజగోపాల్ నాయకత్వంలో పలు కార్యక్రమాలు.

**23 డిసెంబర్ 2009:**

చిదంబరం మరో ప్రకటన. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు భిన్న వైఖరులు తీసుకున్న కారణంగా విస్తృత సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య. కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటన

**24 డిసెంబర్ 2009:**

చిదంబరం ప్రకటనపై తెలంగాణలో ఆగ్రహావేశాలు, బంద్‌లు, కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, బీజేపి, వివిధ తెలంగాణ ప్రజా సంఘాలు, సంస్థలతో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి (జేఏసి) ఏర్పాటు. తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ యం. కోదండరామ్ జేయేసీ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా నియామకం.

**25 డిసెంబర్ 2009:**

బంజారాహిల్స్ లోని రావి నారాయణరెడ్డి హాల్‌లో జేయేసీ స్టీరింగ్ కమిటీ తొలి సమావేశం. ఉద్యమ కార్యాచరణ ప్రకటన.

**30 డిసెంబర్ 2009:**

చిదంబరం మూడో ప్రకటన. జనవరి 5న ఢిల్లీకి రావాలని ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది గుర్తింపు పొందిన (కాంగ్రెస్, తెలుగుదేశం,టిఆర్ఎస్., బి.జె.పి., సి.పి.ఐ., సి.పి.ఐ.(యం), ఎం.ఐ.ఎం., లోక్‌సత్తా) రాజకీయ పార్టీలకు పిలుపు.

తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (తెలంగాణ జేయేసీ) విస్తృతస్థాయి సమావేశం మొట్టమొదటిసారిగా 25 డిసెంబర్ 2009 (శుక్రవారం) రోజున మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం ఏడున్నర గంటల వరకు బంజారహిల్స్ రోడ్‌నెంబర్14లోని రావి నారాయణరెడ్డి హాల్‌లో జేయేసీ కన్వీనర్ ప్రొఫెసర్ యం. కోదండరామ్ అధ్యక్షతన జరిగింది. ఉద్యోగ సంఘాల జేయేసీ నాయకులు వి. శ్రీనివాస్‌గౌడ్ నాయకులను వేదిక మీదికి ఆహ్వానించగా, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్ సమావేశాన్ని సమన్వయపరిచారు.

జేయేసీ మొదటి సమావేశంలో నాయకులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు స్థూలంగా ...

**కె. జానారెడ్డి**

జేయేసీ కార్యక్రమాలను రూపకల్పన చేసుకోవడానికి ప్రాతిపదికను రూపొందించుకోవాలి. రాజకీయ పార్టీల కార్యక్రమాలు, ప్రజాసంఘాల కార్యక్రమాలను

సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందరం కల్సి చర్చించుకోవల్సి ఉంది. పరస్పర సహకారం, అవగాహనతో ముందుకుపోదాం. ప్రత్యక్షకార్యాచరణ మన అందరి లక్ష్యం కావాలి.

**కె.సి.ఆర్.**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ప్రజలను మానసికంగా సిద్ధం చేయాలి. జేయేసీ ఏర్పాటు ద్వారా రాజకీయపార్టీలన్నీ తమతమ జెండాలను, ఎజెండాలను పక్కకుపెట్టి ఒక మంచి సందేశాన్ని ప్రజలకు ఇవ్వగలిగాము. ఇది తెలంగాణ విజయానికి తొలిమెట్టు. మన లక్ష్యం ఢిల్లీ మెడలువంచి తెలంగాణ సాధించుకోవడం. తెలంగాణ పల్లెలను కదిలించాలి. విద్యార్థులమీద జరుగుతున్న అణచివేతను ఎదిరించాలి. ఉద్యోగులు పెన్‌డౌన్ చేయాలి. నిర్మాణ కమిటీ రూపొందించుకోవాలి. అన్ని సంఘాలను జేయేసీలోకి సమన్వయం చేసుకోవాలి. నాగం జనార్ధన్‌రెడ్డిపై ఉస్మానియా క్యాంపస్‌లో జరిగిన దాడిని ఖండిద్దాం. తెలుగుదేశం పార్టీకి చెందిన తెలంగాణ ప్రాంత నాయకులు జేయేసీలోకి రావాలని కోరుదాం. కమ్యూనిస్టు పార్టీలను కూడా పోరాటంలో కలిసి రావాలని కోరుదాం. పార్టీలకు అతీతంగా అందరి సహకారం తీసుకుందాం. కులసంఘాలు, ప్రజాసంఘాలు తమ సూచనలు అందించండి.

**సి.హెచ్. విద్యాసాగర్ రావు**

ఎట్టి పరిస్థితుల్లోనూ భారతీయ జనతా పార్టీ జేయేసీతో కలిసి పనిచేస్తుంది. ప్రభుత్వం అణచివేతకు వ్యూహరచన చేస్తున్నది. సమాజానికి కూడా ఒక ఆత్మ ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రాంత నాయకుల పాత్ర ప్రధానమైనది. ప్రత్యేకతెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనతర్వాత మాత్రమే మళ్లీ ఓట్లు అడగాలి. ఆచరణ సాధ్యమైన కార్యాచరణను మాత్రమే రూపొందించుకోవాలి. విద్యార్థుల్లో ఆవేశం పెరుగుతున్నది. విద్యార్థులను ఏడురోజులపాటు ఎంగేజ్ చేద్దాం. తెలంగాణ ఏర్పాటు తర్వాత జరగాల్సిన పరిణా మాలను వివరించాలి.

**ప్రొఫెసర్ రమా ఎస్. మెల్కొటే**

తెలంగాణలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మూడు ముఖ్యమైన విధానాలు అమలు చేయాలి.

భూసంస్కరణలు అమలు జరగాలి. భూమి పంపిణీ, వ్యవసాయం అభివృద్ధి తదితర విషయాలు గ్రహించాలి.

ఉచిత విద్యావిధానం అమలు జరపాలి. వైద్య, ఆరోగ్య వ్యవస్థను పూర్తిగా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. రాబోయే తెలంగాణ ఎట్లా ఉంటుందో ప్రజలకు వివరించాలి. తెలంగాణ ఒక సెక్యులర్ రాష్ట్రంగా ఉండాలి. పౌరసమాజం పాత్ర చాలా ముఖ్యమైనది. తెలంగాణ చరిత్రపైన ఆంధ్రాప్రాంత ప్రజలకు అవగాహనలేదు.

తెలంగాణ పట్ల ఆంధ్రాప్రాంతంలో అవగాహన కల్పించాలి.

**రాజేందర్ రెడ్డి (న్యాయవాదుల జేయేసీ)**

తెలంగాణ జేయేసీ చేపట్టే కార్యక్రమాలన్నింటికీ మద్దతు ఇస్తాం.

**బి.వి. మోహన్‌రెడ్డి (ఎమ్మెల్సీ)**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు లేకుండా ఉద్యమం ముందుకుపోదు. జేయేసీతో ఉద్యమంలో కలిసి పనిచేయాలని పి.ఆర్.టి.యులో నిర్ణయం తీసుకున్నాం. జేయేసీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ కార్యక్రమాలు ఉండాలి. ఢిల్లీలో కూడా కదలికను తీసుకురావాలి. నాయకులు మోసం చేయకుండా చూసుకోవాలి.

**రత్నమాల**

తెలంగాణ కోసం మహిళా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతాం. జిల్లా స్థాయిలో మహిళా జేయేసీ కమిటీలను ఏర్పాటు చేస్తాం.

**రవి పులి (ఎన్నారై జేయేసీ)**

మేము అమెరికాలో ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజల బాధలు మాకు తెలుసు. అందుకే తెలంగాణ ఎన్నారై జేయేసీ ఏర్పాటు చేసాం. అయినా ఆంధ్రా ప్రాంత ప్రజలతో మాకు వైరంలేదు.

**మధు కె. రెడ్డి (తెలంగాణ డెవెలప్‌మెంట్ ఫోరం–టిడిఎఫ్)**

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుగారు ఆమరణ దీక్షచేసి ఉద్యమానికి ఊపునిచ్చారు. 'ఫాస్ట్‌ట్రాక్ డెవెలప్‌మెంట్ మోడ్స్'ను తెలంగాణలో అమలు చేయాలి. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కృషి చేద్దాం.

**దాసోజు శ్రావణ్‌కుమార్ (తెలంగాణ పీఆర్పీ)**

Educate and struggle ఇప్పుడు జరగాల్సిఉన్నది. తెలంగాణ వస్తే లాభాలేమిటో ప్రజలకు వివరించాలి. కళాబృందాలను రంగంలోకి దింపాలి. SMS/ e-mail campaign జరగాలి. Telangana vision రూపొందించుకోవాలి. చిన్న రాష్ట్రాల ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుంది. తెలంగాణ ఏర్పాటైతే అన్ని రంగాల్లో జరిగే అభివృద్ధిని ప్రచారం చేయాలి. సమైక్యాంధ్ర భావన వెనుకఉన్న కుట్రలను తిప్పికొట్టాలి. సహాయ నిరాకరణ, pen down, gun down, too down లాంటి కార్య క్రమాలు రూపొందించాలి. కార్మికసంఘాలను కలుపుకోవాలి. IT professionals ఆహ్వానించాలి.

**మల్లేపల్లి లక్ష్మయ్య (సీనియర్ జర్నలిస్టు)**

తెలంగాణకు అడ్డు ఎవరు? వ్యాపార, వాణిజ్య వర్గాలు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఉద్యమాలు జరుపుతున్నారు. ఆంధ్రా ఉత్పత్తులను నిషేధించాలి.

ట్రాన్స్‌పోర్టు, ఫాస్ట్‌ఫుడ్, సినిమాలను బహిష్కరించాలి. హైదరాబాద్‌లో స్లమ్స్‌ను పూర్తిగా విస్మరించాం. వాళ్లను ఆర్గనైజ్ చేయాలి. విద్యార్థి, యువకులను సమీకరించి గ్రామానికి ఐదుగురు చొప్పున పంపిద్దాం. జేయేసీ ఇచ్చే కార్యక్రమాలను అమలు చేయడానికి వీరు పనిచేయాలి.

**ప్రొఫెసర్ లక్ష్మణ్ (ఉస్మానియా విశ్వవిద్యాలయం)**

ఆత్మహత్యలు వద్దని జేయేసీ తరఫున అన్నిపార్టీలు, సంఘాలు కలిసి ఒక ఉమ్మడి విజ్ఞప్తిని విడుదల చేయాలి. అమరుల పేరిట స్మారకస్తూపాలు నిర్మించాలి. ఆమోద యోగ్యం, ఆచరణసాధ్యం అయ్యే కార్యక్రమాలనే రూపొందించుకోవాలి.

**మధుయాష్కీ గౌడ్ (ఎం.పీ)**

భారతదేశం మొత్తంలో తెలంగాణ మినహా మరోచర్చ లేదు. పోరాటం ఈ స్థాయికి రావడానికి కారణం కేసీఆర్ గారు. ఉద్యమంలో కలిసిరాకపోయినా ఫర్వాలేదుగానీ, ఉద్యమానికి ద్రోహం చేయకండి. బందిపోటులాగా పారిపోయివచ్చిన ఆంధ్రావాళ్లకు రహస్యంగా సహకరిస్తారా? చిదంబరం ప్రకటన వచ్చిన వెంటనే ఆంధ్రా ప్రజల్లో స్పందన లేదు. ఒకరోజు గడిచిన తర్వాత మాత్రమే డబ్బులు పంచి ఉత్తుత్తి ఉద్యమానికి తెరలేపారు. తెలంగాణ ప్రజాబలం ముందు మీ ధనబలం పనికిరాదు. తెలంగాణ వస్తే ఆంధ్రాకు నీళ్లురావని, ఉద్యోగాలు రావని రెచ్చగొట్టారు. మీడియా సహకారంతో అధిష్టానాన్ని తప్పుదోపపట్టించారు. అక్కడ కౌగిలించు కుంటున్నారు. ముద్దులు పెట్టుకుంటున్నారు. కనీసం ఇక్కడ మనం చేతులు కలపాలి. పిడికిళ్లు బిగించాలి. ఇంటిదొంగలను గుర్తుపట్టాలి. రాష్ట్రంలో ప్రభుత్వం ఉండదు. కేంద్రంలో కదలిక ఉన్న ది. రాష్ట్ర ఏర్పాటు మాత్రమే తెలంగాణ సమస్యలకు పరిష్కారం. తెలంగాణ జేయేసీకి అసలైన ముగింపు తెలంగాణ ఏర్పాటు తర్వాతనే!

**కె.సి.ఆర్.**

మంత్రులందరూ రాజీనామాలు చేసిన తర్వాత కూడా ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఎట్లా ఉన్నట్లు!? ఈ రాష్ట్రంలో ప్రస్తుతం రాజ్యాంగ సంక్షోభం నెలకొనిఉన్నది. తొమ్మిదవ తేదీనాటి ప్రకటనకే కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉండాలని తీవ్రస్థాయిలో డిమాండు చేద్దాం. విశ్వవిద్యాలయాల్లోకి పోలీసులను రానివ్వవద్దని ముఖ్యమంత్రిని, హోంమంత్రిని అఖిలపక్షం కలిసి కోరుదాం. జేయేసీలో పటిష్టమైన నిర్ణయాలు జరగాలి. తూ.చా.తప్పకుండా అవి అమలు జరగాలి. ఇందుకు మేధావుల కమిటీ, panel discussion, structural limited committee, large scale committee ... ఏర్పాటు చేసుకుందాం. మంగళవారం (డిసెంబర్ 29) నుండి నిరవధిక బంద్ ప్రకటిద్దాం.

**ఆర్. దామెదర్‌రెడ్డి (కాంగ్రెస్ ఎమ్మెల్యే)**

జేయేసీని పటిష్టంగా నిర్మించుకోవాలి. పార్టీలమధ్య, నాయకులమధ్య సమన్వయం జరగాలి. నాలుగుకోట్ల మంది ప్రజలను సమన్వయం చేయాలి. సిద్ధాంతాలు పక్కకు పెట్టాలి. ఇది సమిష్టి నాయకత్వం. ప్రజాసంఘాల సూచనలు, సలహాలతో ముందుకు పోవాలి. త్యాగాలకు సిద్ధంగా ఉన్నాం. ఆందోళన మాత్రమే సరిపోదు. బాధ్యతగా ముందుకు పోవాలి. ఉద్యమాలను కొనసాగించాలి. గ్రామాలలో నిరసన కార్యక్రమాలు కొనసాగించాలి. అవసరమైతే నాలుగుకోట్ల మందిని హైదరాబాద్‌కు తరలించి దిగ్బంధంచేయాలి.

**ఉపేందర్ (ఓయూ జేయేసీ)**

కొంతమంది రాజకీయ నాయకులు ద్వందవైఖరితో పనిచేస్తున్నారు. అందరినీ కలుపుకుని పోవాలని జేయేసీకి మా విజ్ఞప్తి. జేయేసీలో చేరినవారు, జేయేసీ నిర్ణయాలకు విరుద్ధంగా పనిచేస్తే వారిని ఏం చేయాలో కూడా నిర్ణయించాలి. ఉద్యమానికి ద్రోహం చేస్తే ఎట్లాంటి శిక్ష ఉంటుందో ముందుగానే నిర్ణయం జరగాలి. తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల విద్యార్థులు మీతో ఉంటారు.

**రాజేష్ (ఓయూ జేయేసీ)**

నాయకులు తమ పదవులను వదిలేసారు. విద్యార్థులు తమ జీవితాలనే వదిలేసారు. విద్యార్థుల్లో అభద్రతాభావం ఉన్నది. విద్యార్థి ఉద్యమం ప్రజాఉద్యమంలో భాగం మాత్రమే. తెలంగాణ ఉద్యమంలో అనేకమార్లు దగా జరిగింది. ఈ సారి అట్లా జరగకుండా చూడాలి.

**మహ్మద్ మసూద్ అహ్మద్**

ఆంధ్రావాళ్లు మనమీద పెత్తనం చేస్తున్నరు. తెలంగాణ ప్రజలు ఆకలితో అలమటిస్తున్నరు. భారత స్వాతంత్రోద్యమం లాగా మన ఉద్యమం కొనసాగాలి.

**బ్రదర్ జాన్ (క్రిస్టియన్ పాథర్)**

పండుగకంటే ముఖ్యం తెలంగాణ. అందుకే ఇవ్వాళ్ల క్రిస్‌మస్ పండుగ అయిన ప్పటికీ ఈ మీటింగుకు వచ్చినం. తెలంగాణ రాష్ట్రం కోసం రోజూ ప్రార్థనలు చేస్తున్నము. తెలంగాణ నాయకులకు మంచి బుద్ధి కలిగించాలని దేవున్ని కోరుతున్న.

**అందెశ్రీ (కవి, గాయకుడు)**

మనం గుంపులుగా మారకపోతే శత్రువును ముంపునకు గురిచేసేదెప్పుడు? ఈ మీటింగులు జనాలలో పెట్టండి. ఉద్యమంలో దళితబహుజనులను భాగస్వాములను చేయాలి. ఎక్కువ, తక్కువలు మరవకపోతే ముందుకు పోలేం. ప్రాణ నష్టం లేకుండా విజయం రాదు. ముందు మీరు ఐక్యంగా ఉండండి, మేము కోటి పాటలతో కోలాటం

ఆడుతాం ... (జైబోలో తెలంగాణ పాటను మొదటిసారిగా పాడి అందరినీ ఉర్రూ తలూగించారు.)

**సూర్యం (న్యూ డెమొక్రసీ)**

ఈ సభా నిర్వహణపట్ల మా నిరసనను వ్యక్తం చేస్తున్నాము. అరుణోదయ కళాకారుడు కృష్ణను నకిరేకల్ దగ్గర పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నాం. సెటిలర్స్‌తో ర్యాలీలు జరుపుతున్నాం. తప్పు జరిగిన సందర్భాలలో సరిదిద్దుకునే ప్రయత్నం జరగాలి. ప్రత్యేకాంధ్ర ఉద్యమాన్ని బలపరచాలి. గ్రామాలలో రాజకీయాలకు అతీతంగా మీటింగులు జరగాలి. నల్లజెండాలు ఎగురవేయాలి. బస్సుల్లో, రైళ్లలో, బస్టాండుల్లో మీటింగులు నిర్వహించాలి. పొయ్యి వెలగవద్దు, ముద్ద ముట్టవద్దు. సహాయ నిరాకరణ పాటించాలి.

**సుధాకర్‌రెడ్డి (ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధి)**

ఉపాధ్యాయులు ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించాలి. భవిష్యత్తులో మీరే తెలంగాణ హీరోలు.

**కె. స్వామిగౌడ్ (టీఎన్జీవో అధ్యక్షులు)**

పదవులకు రాజీనామాలు చేసివచ్చిన నాయకులను మళ్లీ ఎన్నికల్లో గెలిపించుకుంటాము. ఆంధ్రా అధికారుల నుండి ఫోన్ వస్తే ఆన్సర్ చేయము. సహాయ నిరాకరణ చేయాలని క్రిందిస్థాయి శ్రేణులకు పిలుపునివ్వండి. ఆంధ్రా వ్యాపార సంస్థలను బహిష్కరించాలి. నాయకులు వారి భార్యలను, కుటుంబసభ్యులను ఉద్య మంలోకి తీసుకురావాలి. తెలంగాణలో ప్రతి ఇంటి గోడకు తెలంగాణ నినాదం రాయాలి. ఇంటిపైన తెలంగాణ జెండా ఎగురవేయాలి. జేయేసీ తరపున తెలంగాణ అమరుల కుటుంబాలను ఆదుకునేందుకు ఒక నిధిని ఏర్పాటు చేయాలి. అందుకు అందరూ ఒకరోజు జీతాన్ని విరాళంగా ఇవ్వాలి. జేయేసీ ఇచ్చే ఏ పిలుపునైనా అమలుచేస్తాం.

**మందకృష్ణ మాదిగ (ఎం.ఆర్.పి.సి.)**

యాభయి సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఒక దశకు చేరుకున్నం. అనేక కారణాలవల్ల రాజకీయప్రక్రియ అనేక సందర్భాలలో విఫలమయ్యింది. అయితే తెలంగాణ డిమాండును దేశం గుర్తించేలాగా చేయగలిగాము. పోరాటం కూడా అవసరమే అని ఇప్పుడు గుర్తించాము. సమైక్యాంధ్ర ఉద్యమం ప్రజాఉద్యమం కాదు. మీడియా ఆ ప్రయత్నం చేస్తున్నది. ఉద్యమాలను అణచడానికి పోలీసు బలగాలను దించుతున్నారు. విద్యార్థి జేయేసీ విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అణగారిన కులాల ఐక్యవేదిక తనవంతుపాత్రను నిర్వహిస్తున్నది. కళాకారుల జేయేసీ ఏర్పాటు జరగాలి. మన మంత్రుల రాజీనామాలు గౌరవాన్ని పెంచాయి. ఉద్యమం నిరుత్సా

హంగాలేదు. ప్రజలు ఉద్యమంలో ఉన్నారు. నిర్మాణాత్మకంగా వారిని మార్చుకోవాలి. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో జేయేసీల నిర్మాణం జరగాలి. ఉద్య మంతోపాటు నిర్మాణం కూడా పదిరోజుల్లో పూర్తిచేసుకోవాలి. ఒకే టెంటుకింద అన్ని పార్టీల నాయకులు, ఒకే లక్ష్యంతో ఉమ్మడి నిరాహారదీక్షలు జరగాలి.

**హనుమాండ్లు (ఐక్య కార్యాచరణ కమిటీ)**

ప్రజలు ఐక్యతను కోరుకుంటున్నారు. అందరినీ కలుపుకుని ముందుకు పోవాలి.

**వేణుగోపాల్‌రెడ్డి (ఎ.పి.టి.ఎఫ్)**

గ్రామాల్లో ప్రజలను చైతన్యపరచడంలో ఉపాధ్యాయులు కీలకంగా పనిచేస్తున్నారు. హైదరాబాద్‌ను దిగ్బంధం చేసే కార్యక్రమాన్ని తీసుకోవాలి. సెటిలర్స్‌ను బెదిరించే కార్యక్రమాలను చేయకుండా ఉద్యమకారులను నిలువరించాలి.

**ఓరుగంటి వెంకటేశం (తెలంగాణ బీసీ సంగ్రామ సమితి)**

బడుగు,బలహీన వర్గాలను ఉద్యమంలో కలుపుకునిపోవాలి. తెలంగాణ రాష్ట్రం కోసం బలహీనవర్గాలను సమీకృతం చేయాలి.

**01 జనవరి 2010:**

**'నా రక్తం.... నా తెలంగాణ' గిన్నీస్ రికార్డు**

'నా రక్తం... నా తెలంగాణ' నినాదంతో ఎబివిపి చేపట్టిన మహారక్తదాన శిబిరం గిన్నీస్ రికార్డు నెలకొల్పింది. తెలంగాణ వ్యాప్తంగా 143 రక్తదాన శిబిరాలలో 18.650 మంది తెలంగాణ కోసం రక్తదానం చేసినట్లు ఎబివిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడియం రాజు తెలిపారు. గిన్నీస్ బుక్‌లో గత రికార్డు 17.900 మంది రక్తదానంను అధిగమించి సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు నగర కార్యదర్శి రామకృష్ణ వివరించారు. విద్యార్థులతో పాటు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే లక్ష్మినారాయణ, గాయకులు అందెశ్రీ, ఎన్ఆర్ఐలు, న్యాయవాదులు రక్తదానం చేశారు.

**129 రాజీనామాలు తిరస్కరించారు.**

రాష్ట్ర విభజనపై తెలంగాణ, సీమాంధ్రకు చెందిన 222 మంది రాజీనామాలు చేయగా అందులో 92 మంది రాజీనామాలు వెనెక్కు తీసుకున్నారని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 129 మంది రాజీనామాలను తిరస్కరించినట్లు స్పీకర్ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

బంజాహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి హాల్‌లో తెలంగాణ జేయేసీ ప్రత్యేక సమావేశం. హాజరైన కెసిఆర్, కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి పార్టీలకు చెందిన శాసన సభ్యులు, సీనియర్ నాయకులు. మంత్రులు తమ పదవులకు రాజీనామాలు చేయాలని ఉద్యమకారుల డిమాండ్.

**02 జనవరి 2010:**

తెలంగాణ వ్యాప్తంగా జేయేసీల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీలు, ప్రదర్శనలు, సభలు మరియు సమావేశాలు.

కరీంనగర్ జిల్లా గోదావరిఖని పట్టణ చౌరస్తాలో వేలాది మంది విద్యార్థుల ర్యాలి, బహిరంగ సభ. హాజరైన జేయేసీ నాయకులు మల్లెపల్లి లక్ష్మయ్య, పిట్టల రవీందర్.

**03 జనవరి 2010:**

ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల మైదానంలో తెలంగాణ విద్యార్థి గర్జన. అన్ని ప్రాంతాల నుండి తరలివచ్చిన లక్షలాది మంది విద్యార్థులు. హాజరైన అన్ని పార్టీల నాయకులు.

**5 జనవరి 2010**

ఢిల్లీలో హోంమంత్రితో 8 పార్టీల నేతల భేటి. రాష్ట్రంలో పరిస్థితులు చక్కదిద్దాలని, ఆందోళనలకు స్వస్తి పలికి శాంతియుత వాతావరణం నెలకొనేలా చూడాలని అన్ని పార్టీల ఏకాభిప్రాయం. హేతుబద్ద వ్యవధిలోపు చర్చలకు అన్ని పార్టీలు అంగీకరించాయి.

**12 జనవరి 2010:**

బంజారహిల్‌లోని రావి నారాయణరెడ్డి మెమోరియల్ హాల్‌లో తెలంగాణ జేయేసీ సమావేశం. రాజకీయ నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేయాలని ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, ఉద్యమకారుల డిమాండ్. అర్థాంతరంగా ముగిసిన సమావేశం.

**13 జనవరి 2010:**

సోమాజీగూడలోని ఎన్‌కెఎం గ్రాండ్ హోటల్‌లో తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని పార్టీల భాగస్వామ్యంతో ఇందిరాపార్కు వద్ద రిలే దీక్షలు కొనసాగించాలని నిర్ణయం.

**16 జనవరి 2010:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండ్‌తో రిలో దీక్షలు ప్రారంభం. హాజరైన అన్ని పార్టీల నాయకులు.

**25 జనవరి 2010:**

న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలుగుదేశం పార్టీ సీనియర్ శాసన సభ్యుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసం (క్వార్టర్ నెం.188)లో తెలంగాణ జేయేసీ కార్యాలయం ప్రారంభం.

**27 జనవరి 2010:**

న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని జేయేసీ కార్యాలయంలో రాత్రి 8 గంటలకు తొలిసారి సమావేశం నిర్వహించుకున్న తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి.

**28 జనవరి 2010:**

తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటిలో భాగంగా ప్రముఖులతో జేయేసీ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు.

ఇందిరా పార్కువద్ద జేయేసీ ఆధ్వర్యంలో 13 రోజుల పాటు కొనసాగిన రిలే నిరాహార దీక్షల ముగింపు.

ఫిబ్రవరి 1 నుండి అన్ని జిల్లాలలో నిరవధిక రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని జేయేసీ స్టీరింగ్ కమిటి నిర్ణయం.

**30 జనవరి 2010**

**కమిటీ ఏర్పాటుకు సన్నహాలు**

తెలంగాణాపై సంప్రదింపులకు వేయనున్న కమిటీ కూర్పుపై కాంగ్రెస్ కోర్ కమిటీ ప్రధానమంత్రి నివాసంలో సోనియా, అంటోని, చిదంబరం, అహ్మద్‌పటేల్ మరియు వీరప్ప మొయిలీలు సుధీర్ఘ చర్చలు జరిపారు. ప్రణబ్ ముఖర్జీ ఈ సమావేశానికి రాకపోవడంతో నిర్ణయాన్ని ప్రకటించలేదు. ప్రణబ్ అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాత కమిటీపై ప్రకటన చేయనున్నారు.

**కాలపరిమితితో కూడిన ప్రకటనకు జేఏసి డిమాండ్**

తెలంగాణ జేఏసి కార్యాలయంలో స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ పై ఫిబ్రవరి మొదటి వారంలో కమిటీ వేస్తామని కేంద్రమంత్రి చిదంబరం ప్రకటించడంతో అప్పటివరకు ఉద్యమాన్ని యధావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై కాలపరిమితితో కూడిన ప్రకటన చేయాలని జేఏసి కన్వినర్ ప్రొ॥ కోదండరాం డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1వతేది నుండి 7వ తేది వరకు ఉద్యమ ప్రణాళికను ప్రకటించారు.

**1 ఫిబ్రవరి 2010:**

తెలంగాణ వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద పికెటింగ్

**2 ఫిబ్రవరి 2010:**

అసెంబ్లీ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల దీక్షలు.

ఖమ్మంజిల్లా ఇల్లందులో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భారీ బహిరంగసభ.

**3 ఫిబ్రవరి 2010:**

అదిలాబాద్ – మహబూబ్‌నగర్ ఏడవ నెంబర్ జాతీయ రహదారి పై సుమారు 550కిలోమీటర్ల పొడవునా మానవహారం. రోడ్డుకు ఇరువైపులా లక్షలాదిగా బారులు తీరిన విద్యార్థులు, ఉద్యమకారులు.

**04 పిబ్రవరి 2010:**

**తెలంగాణ కోసం 500 కి.మీ. మానవహారం**

తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఆరు జిల్లాలకు చెందిన లక్షలాది మంది చేతులు కలిపారు. అదిలాబాద్ నుండి ఆలంపూర్ వరకు (అదిలాబాద్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలు) 500 కిలోమీటర్ల మేర మానవహారంగా రూపొందారు. ఇది దేశంలోనే ఇప్పటివరకు అతి పొడవైన మానవహారం రికార్డయ్యింది.

**సంప్రదింపుల కమిటీ**

2009 డిసెంబర్ 9 నుండి 2010 జనవరి 5 వరకు జరిగిన పరిణామా లన్నింటినీ అనుసరించి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని తరగతుల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు, వర్గాలతో విస్తృత స్థాయి సంప్రదింపులు జరపడానికి కేంద్ర ప్రభుత్వం 5గురు సభ్యులతో కూడిన కమిటీని ప్రకటించింది.

**అధ్యక్షులు: జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ (రిటైర్డ్ న్యాయవాది, సుప్రీంకోర్టు)**

**సభ్యులు:**

1. ప్రొ॥ డా॥ రణబీర్ సింగ్, వైస్ ఛాన్సలర్ (జాతీయ న్యాయ విశ్వ విద్యాలయము)

2. డా॥ అబుసలే షరీఫ్, సీనియర్ రీసెర్చ్ ఫెలో, (అంతర్జాతీయ ఆహారవిధాన పరిశోధన సంస్థ, ఢిల్లీ)

3. డా॥ రవీందర్ కౌర్, ప్రొఫెసర్, మానవ–సమాజిక శాస్త్రాల విభాగం, ఐఐటి – ఢిల్లీ

4. వినోద్ కె. దుగ్గల్, రిటైర్డ్ ఐ.ఏ.ఎస్., హోంశాఖ మాజీ కార్యదర్శి.

శ్రీకృష్ణతో సంప్రదించాక కమిటీ విధివిధానాలు ప్రకటించనున్నట్లు కేంద్రం తెలిపింది

హైదరాబాద్ – కరీంనగర్, హైదరాబాద్ – వరంగల్ రహదారులపై వంటా–వార్పు, ఆటా–పాటా కార్యక్రమాలు

**5 ఫిబ్రవరి 2010:**

హైదరాబాద్–కోదాడ 9వ నెంబర్ జాతీయ రహదారిపై మానవహారం.

**6 ఫిబ్రవరి 2010:**

హైదరాబాద్‌లో తెలంగాణ ప్రతినిధుల సదస్సు.

**7 ఫిబ్రవరి 2010:**

వరంగల్‌లో కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల "పొలికేక". దద్దరిల్లిన ఓరుగల్లు. కదంతొక్కిన వేలాది మంది విద్యార్థులు.

**08 ఫిబ్రవరి 2010:**

**జమాతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో 'తెలంగాణ ముస్లీం గర్జన'**

హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో తెలంగాణ గర్జన జరిగింది. ఈ సభ ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు తెలుపుతూ భారీ సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ఈసందర్భంగా టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే జనాభా నిష్పత్తి ప్రకారం ముస్లీంలకు 12% రిజర్వేషన్‌లు అమలు చేస్తామన్నారు. అలాగే సీమాంధ్రుల పాలనలో అన్యాక్రాంతమైన నాలుగు లక్షల కోట్ల విలువైన వక్ఫ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు.

ఈసభకు జమాతె రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మాలిక్ మొహసీత్ ఖాన్ అధ్యక్షత వహించగా, కాంగ్రేస్ సీనియర్ నాయకులు జి.వెంకటస్వామి, ప్రజాగాయకుడు గద్దర్, టీడీపీ నేత నాగం జనార్ధన్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్, సియాసత్ పత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్, మాజీ మంత్రి బషీరుద్దీన్‌బాబు ఖాన్, కంచె అయిలయ్య, జమాతె ప్రధాన కార్యదర్శి మౌలానా ఫయీాం అహ్మద్, పీఆర్పీ ఎమ్మెల్యేలు అనిల్, మహేశ్వర్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కాంగ్రేస్ ఎంపీలు జి. వివేక్, పొన్నం ప్రభాకర్, టీఆర్ఎస్ నేతలు నాయిని నర్సింహారెడ్డి, బోయినపల్లి వినోద్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈసభలో 11తీర్మానాలు చేశారు.

**కాకతీయ యూనివర్సిటీలో 'విద్యార్థి పొలికేక'**

వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో 'విద్యార్థి పొలికేక' సభ జరిగింది. ఈసభకు భారీ సంఖ్యలో విద్యార్థులు, తెలంగాణవాదులు తరలివచ్చారు. ఈసభకు తరలి వస్తూ తెలంగాణ ఆకాంక్షను, ప్రభుత్వ వైఖరికి నిరసన తెలియజేస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈసభలో విమలక్క బృందం ధూంధాం అలరించింది. ఈసభకు స్వామి అగ్నివేశ్, ప్రొఫెసర్ జయశంకర్, ప్రముఖ కవి అందెశ్రీ, మందకృష్ణ మాదిగ పలువురు జేఏసి నేతలు పాల్గొన్నారు. ఈ సభ రసాభాస కాగా అర్ధాంతరంగా నిలిచిపోయింది. సభాస్థలి నుంచి పోలీసులు అందరినీ పంపించేశారు.

**10 ఫిబ్రవరి 2010:**

**నిరసనలు ఆపేది లేదు: కోదండరాం**

శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలు ప్రకటించకుండా కేంద్రం తాత్సారం చేయడాన్ని జేఏసి కన్వినర్ ప్రొఫెసర్ కోదండరాం ఖండించారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టేంతవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు.

ఫిబ్రవరి 10, 11 తేదీలలో అత్మహత్యలకు పాల్పడవద్దని కోరుతూ కొవ్వత్తుల ప్రదర్శన

ఫిబ్రవరి 12వ తేదీ మసీదుల్లో ప్రార్థనలు, శివరాత్రి జాగరణ

ఫిబ్రవరి 14వ తేదీన చర్చిల్లో ప్రార్థనలు

**11 ఫిబ్రవరి 2010:**

**జిల్లా జేయేసీ బాధ్యులను కన్వీనర్ కోదండరామ్ ప్రకటించారు.**

జిల్లాలు – జేఏసి బాధ్యులు

కరీంనగర్ – పిట్టల రవీందర్

వరంగల్ – కత్తి వెంకటస్వామి

ఆదిలాబాద్ – శ్రీధర్ దేశ్‌పాండె

నిజామాబాద్ – మల్లెపల్లి లక్ష్మయ్య

మెదక్ – దేవిప్రసాద్

నల్గొండ – సుధీర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ – స్వామిగౌడ్

ఖమ్మం – గోవర్ధన్

హైదరాబాద్ – శ్రీనివాస్‌గౌడ్

రంగారెడ్డి – విఠల్

**13 పిబ్రవరి 2010:**

**శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలు ప్రకటించిన కేంద్రం**

తెలంగాణ, సమైక్యాంధ్ర సమస్యను పరిష్కరించడానికి కేంద్రం ఏర్పాటు చేసిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలను ఎట్టకేలకు కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఇందులో ఈ క్రింది అంశాలను పరిశీలించాలని సూచించింది.

1. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు, సమైక్యాంధ్రప్రదేశ్ కొనసాగింపు.. అనే రెండు డిమాండ్లకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న పరిస్థితిపై పరిశీలన.

2. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం నుంచి చోటు చేసుకున్న పరిణామాలు.. అవి వివిధ ప్రాంతాల్లో అభివృద్ధిపై చూపిన ప్రభావంపై సమీక్ష

3. రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజలైన మహిళలు, పిల్లలు, విద్యార్థులు, మైనార్టీలు, ఇతర వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్డు కులాలు, తెగలపై చూపిన ప్రభావంపై పరిశీలన.

4. మొదటి మూడు అంశాలను పరిశీలించే సమయంలో కమిటీ దృష్టికి వచ్చే, తప్పనిసరిగా పరిష్కరించాల్సిన ఇతర కీలక అంశాల గుర్తింపు

5. పై అంశాలకు సంబంధించి అన్ని వర్గాల అభిప్రాయాలు తెలుసుకోవడం, ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితిని పరిష్కరించి, అన్ని వర్గాల ప్రజల బాగు కోసం రాజకీయ పార్టీల నుంచి, ఇతర సంస్థల నుంచి పరిష్కార మార్గాలను కోరడం, సాధ్యమైన పరిష్కారాలను గుర్తించడం, కార్యాచరణ ప్రణాళికను, రోడ్‌మ్యాప్‌ను సూచించడం.

6. పరిశ్రమలు, వర్తకం, కార్మికసంఘాలు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలతో పాటు సమాజంలోని ఇతర సంస్థలతో ఈ అంశాలపై సంప్రదించి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సంబంధించి సమగ్రాభివృద్ధిపై వారి అభిప్రాయాలను సమీకరించడం.

7. కమిటీ అవసరమని భావించిన ఇతర సూచనలు, లేదా సిఫారసులు చేయడం.

పై అంశాలపై పరిశీలించిన అనంతరం ఒక నివేదికను రూపొందించి 2010 డిసెంబర్ 31లోగా కేంద్రానికి సమర్పించాలి. కేంద్రం సూచించిన శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలపై ఇరు ప్రాంతాలలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

**విధివిధానాలపై పలువురి అభిప్రాయాలు:**

విధివిధానాలు తీవ్ర అభ్యంతరకరంగా, తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయి. ఇది రోశయ్య, కమిటీ కంటే అధ్వాన్నం, శనివారం భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తాం.. **– జేఏసి కన్వీనర్ కోదండరాం**

విధివిధానాలు మోసపూరితంగా ఉన్నాయి. తెలంగాణ అంశాన్ని, ప్రజలను మరోసారి దగా చేశాయి. సమైక్యాంధ్ర అని అన్నప్పుడు ఈ దిక్కుమాలిన కమిటీయే అవసరం లేదు. తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ నాయకులకు చీమూ, నెత్తురూ ఉంటే ... ఆ పార్టీ అధిష్టానం తెలంగాణపట్ల అనుసరిస్తున్న నాన్చివేత ధోరణికి నిరసనగా తమ పదవులకు వెంటనే రాజీనామాలు చేయాలి. **– టీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

విధివిధానాలను సమర్థిస్తున్నాం. వారికిచ్చిన గడువుకంటే కొంత ముందే నివేదిక వచ్చే విధంగా సహకరిస్తే బాగుంటుంది. అయినా రాజీనామాలు కోరడానికి కేసీఆర్ ఎవరు?.. **– పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్**

తెలంగాణ, సమైక్యాంధ్ర రెంటిపైనా ఏం చర్చిస్తారు? రాజ్యాంగ సంక్షోభం సృష్టిస్తేనే తెలంగాణ వస్తుంది. తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ సమస్యగా గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇవ్వాలి. **– టీడీపీ నేత నాగం జనార్ధన్‌రెడ్డి**

తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ప్రతికూలంగా ఉన్నాయి. సీమాంధ్ర ఎంపీలు చెప్పినట్లుగా వీటిని రూపొందించినట్లుగా విధివిధానాలు కనబడుతున్నాయి.

**– ఎంపీ మధుయాష్కీ**

విధివిధానాలతో ప్రయోజనం లేదు. ఇప్పటివరకు తెలంగాణ వస్తది కదా... సోనియా ఇస్తది కదా... అనే ఆశతో ఉంటిమి. ఇది చాలా నిరాశ కలిగింది.

**– సీడబ్ల్యూసి నేత జి.వెంకటస్వామి**

కమిటీ ఏమాత్రం తెలంగాణకు ఉపయోగపడేది కాదు. ఖచ్చితంగా తెలంగాణ సాధించాలి. అవసరమైతే అంతా రాజీనామాలు చేయాలి.

**– కాంగ్రేస్ నేత ఉప్పునూతల పురుషోత్తం**

ఈ కమిటీ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షలను వివరించి ప్రజల చిరకాల వాంఛ నెరవేరేలా చూస్తాం. తెలంగాణ ఏర్పాటుకు ఏమాత్రం విఘాతం కలిగినా పదవులకు రాజీనామా చేసేందుకు అందరి కంటే ముందుంటాం. **– ఎంపీ పొన్నం ప్రభాకర్**

విధివిధానాలు తెలంగాణ ఏర్పాటు ఖాయమన్న విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. వీటిని ఉపయోగించుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుచేసుకోడానికి ప్రజలు కృషి చేయాలి. **– మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

రాజకీయ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఏడాదే రాజ్యాంగ ప్రక్రియ కూడా ప్రారంభం కావాలి. కొన్ని అభ్యంతరాలున్నా తెలంగాణ ఏర్పాటు తథ్యం, బాధ్యత గల పార్టీగా రాజీనామాలపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. డిసెంబర్ 9నాటి ప్రకటనకు అనుగుణంగానే కమిటీ ఏర్పాటైంది. అర్థంచేసుకోవాలి.

**– ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి**

కమిటీ విధివిధానాలను స్వాగతిస్తున్నాం. సోనియాపై నాకు నమ్మకం ఉంది. తెలంగాణను మోసగించాల్సిన అవసరం హైకమాండ్‌కు లేదు. అభివృద్ధి విషయం లో తెలంగాణ వివక్షకు గురైంది. **– హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి**

తెలంగాణ ప్రక్రియను ముందుకు తీసుకుపోయే దిశగా కేంద్ర వైఖరి స్పష్టంగా ఉంది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కలిగించేలా విధివిధానాలను ఖరారు చేశారు.

**– చీఫ్‌విప్ మల్లు భట్టి విక్రమార్క**

కమిటీ విధివిధానాలు తెలంగాణకు అనుకూలంగా లేవు. కేంద్రం తెలంగాణ

విషయంలో ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు వేస్తోంది. చాలా అసంతృప్తిగా ఉంది. **–అసీఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు**

విధివిధానాలు పచ్చి బూటకం, మోసం, అణచివేతకు, ఆధిపత్యానికి అసమాన తలకు గురైన తెలంగాణ అంశాన్ని పక్కనబెట్టి, రాష్ట్రాన్ని కలిపి ఉంచేందుకే ఈప్రకటన అసమంజసం. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులందరూ రాజీనామా చేయాలి.

**– తెలంగాణ జర్నలిస్టుల ఫోరం కన్వీనర్ అల్లం నారాయణ**

ఒక రాజకీయ నిర్ణయం తీసుకొని పరిష్కరించాల్సిన తెలంగాణ సమస్యను కాంగ్రెస్ మరింత జటిలం చేస్తుంది. రాజకీయ నాయకులు పరిష్కరించలేని సమస్యను, పదవీ విరమణ చేసిన మాజీ న్యాయమూర్తి ఎలా పరిష్కరిస్తారు. కాలయాపన చేయకుండా తెలంగాణపై వెంటనే నిర్ణయానికి రావాలి.

**–బీజేపి అధికార ప్రతినిధి రవిశంకర్ ప్రసాద్**

కమిటీ వల్ల ప్రయోజనం లేదు.

**–బీజేపి జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.హరిబాబు**

విధివిధానాలను ఆహ్వానిస్తున్నాం.

**–సీపీఎం కార్యదర్శి బీవీ రాఘవులు**

సంతృప్తికరంగా లేవు.

**– సీపీఐ కార్యదర్శి కె.నారాయణ**

తెలంగాణ ప్రస్తావన లేకుండా శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలు ఉంటాయా..! అసెంబ్లీ ఇక రణరంగమే అవుతుంది. ఇకపై ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సిందే.

**– సీపీఐ ఎల్పీనేత గుండా మల్లేశ్**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా కేంద్రం ప్రకటించిన విధివిధానాలకు జేఏసిలోని రాజకీయ పార్టీలే బాధ్యత వహించాలి. జేఏసి నిర్లిప్తతను గమనించే కేంద్రం ధైర్యంగా ప్రత్యేక రాష్ట్రానికి వ్యతిరేకంగా విధివిధానాలు ప్రకటించింది. ప్రజాప్రతినిధులు రాజీనామాలను ఆమోదింపజేసుకుని ఉద్యమాన్ని ఉధృతం చేయాలి.

**–ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ**

తెలంగాణ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్, తెస్తామని చెప్పిన టీఆర్ఎస్‌లు... ఈ ప్రాంత ప్రజలను మోసం చేశాయి. ఇతర పార్టీలను నాశనం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది. **–టీడీపీ నేత తుమ్మల నాగేశ్వరరావు**

రాజ్యాంగ సంక్షోభంతోనే తెలంగాణ సాధ్యం. ఎంపీలు, ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామాలు చేసి ఆమోదించుకోవాలి. విధివిధానాల్లో సమైక్యాంధ్ర పదం ఎందుకు వాడారు? **–ముథోల్ ఎమ్మెల్యే వేణుగోపాలాచారి**

శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలు ఎవ్వరికీ అనుకూలంగా లేవని, అందరూ కమిటీ విధివిధానాలను స్వాగతించాలని సీమాంధ్ర నేతలు కోరగా, కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని టీడీపీ అభ్యంతరం వ్యక్తం చేశారు.

**15 ఫిబ్రవరి 2010:**

**ఓయూలో కాల్పులు - రణరంగమైన క్యాంపస్**

శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలను వ్యతిరేకిస్తూ రాజీనామాలు చేసిన ఎమ్మెల్యేలను అభినందిస్తూ, మిగిలిన ఎమ్మెల్యేలు కూడా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేస్తూ ఓయూ విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. ఆదివారం సాయంత్రం 6గంటలు దాటాకా ఆర్ట్స్ కళాశాల నుంచి తార్నాక వైపుగా కదిలారు. పోలీసులు వ్యూహాత్మకంగా ముందే మీడియాను ప్రత్యక్ష ప్రసారానికి ఓబీ వ్యాన్లను క్యాంపస్‌లోనికి అనుమతించలేదు. విద్యార్థుల ప్రదర్శనను ఆర్ట్స్ కళాశాల వద్దే అడ్డుకున్నారు. సరిగ్గా అదే సమయానికి కరెంటు పోయింది. పోలీసులపై కొన్ని రాళ్లు పడ్డాయి. దీంతో రగడ మొదలైంది. పోలీసులు లాఠీచార్జి చేశారు. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో బాష్పవాయువు ప్రయోగించారు. రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. ఈ సన్నివేశాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని లాఠీ చార్జి చేశారు. రాత్రి 10:45 గంటల సమయంలో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల సమీపంలో మరోసారి మీడియాను లక్ష్యంగా చేసుకుని లాఠీలకు పనిచెప్పారు.

ఈ ఉద్రిక్త వాతావరణం క్యాంపస్ పక్కనే ఉన్న మాణికేశ్వర్ నగర్‌కు పాకింది. అక్కడ కూడా పలుసార్లు పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ ఘటనల్లో సుమారు 50మంది విద్యార్థులు, 20మంది మీడియా ప్రతినిధులు, పదుల సంఖ్యలో పోలీసులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న జేఏసి కన్వీనర్ కోదండరాం, ఎమ్మెల్యేలు సమ్మయ్య, కిషన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీలు చుక్కా రామయ్య, కె. నాగేశ్వర్‌లు అక్కడి చేరుకోగా వారిని క్యాంపస్‌లోకి పోలీసులు అనుమతించలేదు.

**ఓయూ కాల్పుల ఘటనపై మానవహక్కుల కమీషన్ విచారణ**

అర్ధరాత్రి సమయంలో జేఏసి కన్వీనర్ కోదండరాం తదితరులు మానవహక్కుల కమీషన్ జస్టిస్ సుభాషణ్‌రెడ్డిని కలిశారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు 9మంది సభ్యులతో ఒక కమిటీ నియమించారు. ఈ కమిటీలో జర్నలిస్టు మల్లెపల్లి లక్ష్మయ్య, న్యాయవాదులు రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజేంద్రరెడ్డి, ఎస్.రవీందర్, ప్రొఫెసర్లు గాలి వినోద్ కుమార్, జ్యోతికిరణ్, వాణిరెడ్డిలను సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ సోమవారం ఉదయంలోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

కాగా తమపై రాళ్లు రువ్వడంతో ఆత్మరక్షణ కోసమే లాఠీచార్జి జరపాల్సి వచ్చిందని జాయింట్ పోలీస్ కమీషనర్ పి.సీతారామాంజనేయులు చెప్పారు. అర్ధరాత్రి

సమయంలో పరిస్థితిని పోలీస్ కమీషనర్ ఏకే ఖాన్ సమీక్షించారు. మీడియా పై లాఠీ చార్జి చేయడాన్ని తప్పుపడుతూ 24గంటల్లోగా విచారణ జరిపి నివేదిక అందజేయాలని కమీషనర్ ఏకే ఖాన్‌ను హెూంమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు.

**లాఠీచార్జ్‌ని ఖండించిన నేతలు:**

ఉస్మానియా క్యాంపస్‌లో విద్యార్థులపై, మీడియాపై పోలీసుల దమనకాండను పలువురు నేతలు తీవ్రంగా ఖండించారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఎంపీ విజయశాంతి, ఈటెల రాజేందర్, ఏలేటి హరీశ్వర్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పోలీసు అధికారి సీతారామాంజనేయులు కావాలనే విద్యార్థులను దగ్గరుండి మరీ కొట్టిస్తున్నారని వారు ఆరోపించారు. గాయపడిన వారిని ఆస్పత్రి కూడా తరలించడానికి 108ను కూడా అనుమతించకపోవడం దారుణమన్నారు. ఈ సంఘటనపై జేఏసి కన్వీనర్ కోదండరాం, బీజేపి నేత దత్తాత్రేయ, సీపీఎం నేత వెంకటేశ్వరరావు, పీఆర్పీ నేత చిరంజీవి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, విరసం నేత వరవరరావులతో పాటు జర్నలిస్టుల సంఘాలు, టీజేఎఫ్, ఏపీయూడబ్ల్యూజే తీవ్రంగా ఖండించాయి. పోలీసుల తీరుకు నిరసనగా విద్యార్థిజేఏసి బంద్‌కు పిలుపునిచ్చింది.

**15మంది తెలంగాణ ఎమ్మెల్యేల రాజీనామా**

తెలంగాణ జేఏసి తీర్మాణం మేరకు శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలకు నిరసనగా తెలంగాణకు చెందిన 15 మంది ఎమ్మెల్యే తమ రాజీనామా పత్రాలను స్పీకర్‌కు అందజేశారు. అంతకుముందు వారందరూ జేఏసీ కార్యాలయంలో సమావేశమై, అక్కడి నుండి గన్‌పార్క్‌వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, అసెంబ్లీకి వెళ్లారు. వారిలో...

టీఆర్ఎస్(10): ఈటెల రాజేందర్, కల్వకుంట్ల రామారావు, తన్నీరు హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, గడ్డం అరవిందరెడ్డి, కావేటి సమ్మయ్య, నల్లాల ఓదెలు.

కాంగ్రేస్ (2): రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, చెరుకు ముత్యంరెడ్డి

టీడీపీ (1): చెన్నమనేని రమేష్

ప్రజారాజ్యం(1): ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

బీజేపి (1): యండల లక్ష్మీనారాయణ

**16 ఫిబ్రవరి 2010:**

**ఓయూలో మళ్లీ పోలీసుల దాడి**

ఆదివారం జరిగిన దారుణం నుంచి కోలుకోకముందే సోమవారం మళ్లీ

పోలీసులు విద్యార్థులపై విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం మెస్‌ల వద్దకు పోలీసులు రావడాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగిన విద్యార్థులపై పోలీసులు మళ్లీ లాఠీచార్జి చేశారు. బాష్పవాయు గోళాలు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంతంలో మీడియా ప్రతినిధులు నిలిపిన 20 ద్విచక్రవాహనాలపై పోలీసులు పెద్ద పెద్ద బండరాళ్ల వేసి ధ్వంసం చేసి వాటికి నిప్పంటించి వాటి చుట్టూ తిరుగుతూ పైశాచిక ఆనందాన్ని పొందారు. 'నా కొడకుల్లారా... మీరు చేయబట్టే ఇదంతా బయటకు తెలుస్తుందిరా... ఇక్కడి ఉండి రిపోర్టు చేస్తార్రా?.. ఆఫీసులకు ఫోన్ చేసి మాట్లాడుతార్రా? అంటూ జర్నలిస్టులను వెంటాడి వెంటాడి తరిమి తరిమి కొట్టారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్ రిపోర్టర్ నర్సింగరావుకు తీవ్రగాయాలయ్యాయి.

పాత్రికేయులపై దాడిని నిరసిస్తూ జర్నలిస్టు సంఘాలు ధర్నాకు దిగారు. జర్నలిస్టులపై దాడులకు నిరసనగా ఓయూ పోలీస్‌స్టేషన్ ఎదుట జీటీవి ఎడిటర్ శైలేష్‌రెడ్డి ఆమరణ దీక్ష చేపట్టారు. క్రైం రిపోర్టర్ల ఫోరం సభ్యులు హోంమంత్రిని కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. దాడులపై విచారణ చేపట్టేందుకు హైపవర్ కమిటీని వేయనున్నట్లు  హోంమంత్రి సబితారెడ్డి తెలిపారు. పోలీసులు క్యాంపస్‌ను ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా హైకోర్టు ఆదేశించింది.

### క్యాంపస్‌కు చేరుకున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

ఓయూలో మీడియాపై పోలీసుల దాడులను నిరసిస్తూ జర్నలిస్టు యూనియన్ నాయకులు నేరుగా క్యాంపస్‌కు వచ్చారు. లోనికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో తార్నాక పోలీస్‌స్టేషన్ దగ్గర బైఠాయించారు. సిటీ జాయింట్ పోలీస్ కమీషనర్ సీతారామాంజనేయులుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆతర్వాత బలవంతంగా క్యాంపస్‌లోకి చొచ్చుకెళ్లారు. వీరిలో ఐజేయూ సెక్రటరీ జనరల్ శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ అమర్‌నాథ్, ప్రెస్‌అకాడమీ మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం కన్వీనర్ అల్లం నారాయణ, ఏపీయూడబ్ల్యూజే నాయ కులు పి.శశికాంత్, తదితరులు ఉన్నారు.

### 21 ఫిబ్రవరి 2010:

### ఉద్రిక్తంగా అసెంబ్లీ ముట్టడి, యాదయ్య ఆత్మహత్యాయత్నం

తెలంగాణ సాధన కోసం విద్యార్థి జేఏసి ఇచ్చిన అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిచ్చింది. దీంతో ఓయూలో ఉదయం 11గంటల సమయానికి క్యాంపస్‌లో వేల సంఖ్యలో విద్యార్థులు పోగయ్యారు. జాతీయజెండాలు చేతబూని జైతెలంగాణ నినాదాలు చేస్తూ విద్యానగర్‌వైపు ఉన్న గేటు వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించి ఉన్న పోలీసులు వారిని బయటకు వెళ్లనివ్వలేదు. దీంతో పోలీసులకు, విద్యార్థులకు మద్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అందులో కొందరు పోలీసు వలయాన్ని ఛేదించు

కుని వెళ్లినా వారిని పోలీసులు మళ్లీ పట్టుకుని వెనెక్కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిరిపురం యాదయ్య అక్కడే అందరూ చూస్తుండగానే ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని పోలీసుల వైపు పరిగెత్తాడు. తోటి విద్యార్థులు, పోలీసులు మంటలు ఆర్పి తొలుత అతన్ని గాంధీ అస్పత్రికి అనంతరం కాంచన్‌బాగ్‌లోని అపోలో అస్పత్రికి తరలించారు. యాదయ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ఆస్పత్రికి వచ్చిన మంత్రి సబితా రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు విద్యార్థులు విఫలయత్నం చేశారు.

### తార్నాక వద్ద యుద్ధం

యాదయ్య ఆత్మహుతియత్నంతో సాయంత్రం ఓయూలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విద్యార్థి జేఏసి నేతలు మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి ఇకపై ఎవ్వరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, సీమాంధ్ర పెట్టుబడి దారుల ఆస్తులపై దాడులు చేయాలని పిలుపునిచ్చారు. దీంతో వందల సంఖ్యలో విద్యార్థులు పోలీసుల వలయాన్ని ఛేదించుకుని తార్నాక సెంటర్‌కు చేరుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిపై బాష్పవాయుగోళాలను, రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారు. విద్యార్థులు పోలీసులపై రాళ్ల వర్షం కురిపించారు. ఇలా రాత్రి 9గంటల వరకు యుద్ధవాతావరణం కొనసాగింది.

### నిజాంకాలేజీ వద్ద...

ఓయూ వద్ద పోలీసు వలయాన్ని ఛేదించిన సుమారు 200 మంది విద్యార్థులు బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీకి చేరుకున్నారు. అప్పటికే అక్కడ గుమిగూడిన విద్యార్థులతో కలిసి అసెంబ్లీ ముట్టడికి యత్నించగా పోలీసులు వారిని అడ్డుకుని కాలేజీ లోపలికి పంపించారు. ఇక్కడ కొంతమంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడి పరిస్థితులను గమనించడం కోసం ఎత్తయిన భవనాలపై నిఘా కెమరాలను ఏర్పాటు చేశారు.

సైఫాబాద్ పీజీ కాలేజీ, చింతల్‌బస్తీ డిగ్రీ కాలేజీల వద్ద భారీగా పోలీసులను మోహరించి విద్యార్థులను బయటకు రాకుండా కట్టడిచేశారు. పాతబస్తీలోని సిటీ కాలేజీ వద్ద పోలీసులకు, విద్యార్థులకు మద్య తోపులాట జరిగింది. సికింద్రాబాద్ పీజీ కాలేజీ విద్యార్థులపై పోలీసులు రెండు సార్లు లాఠీచార్జి చేశారు. దీంతో సతీష్ అనే విద్యార్థికి తల పగిలింది. రామంతపూర్, ఉప్పల్ పరిసరాల్లో ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహం చెందిన విద్యార్థులు హబ్సీగూడ, రామంతపూర్ ప్రాంతాలలో వ్యాపార సంస్థలపై దాడులు చేశారు. జామై ఉస్మానియా వద్ద ఆందోళనకారులు మూడు బస్సులకు నిప్పంటించారు.

అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నా... 17మంది విద్యార్థులు మాత్రం శనివారం సాయంత్రానికి అసెంబ్లీ వద్దకు చేరుకుని పోలీసులకు, ప్రభుత్వానికి

వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనల్లో నగరంలో 550 మంది విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు.

తెలంగాణ జిల్లాల నుంచి వస్తున్న విద్యార్థులను ఎక్కడికక్కడే పోలీసులు అడ్డుకున్నారు. వరంగల్ జిల్లాలో 500 మందిని అరెస్టు చేశారు. హన్మకొండ కాంగ్రెస్ కార్యాలయంపై కొందరు విద్యార్థులు రాళ్లు రువ్వారు. నల్గొండ జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన బీటెక్ విద్యార్థి శ్రీనివాస్(23) శనివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని తన బలిదానంతోనైనా తెలంగాణ రావాలంటూ సూసైడ్ నోట్ రాశాడు.

**23 ఫిబ్రవరి 2010:**

## ఢిల్లీలో న్యాయవాదుల ధర్నా

పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఢిల్లీ చేరిన రెండు వేల మంది తెలంగాణ న్యాయవాదులు జంతర్‌మంతర్ వద్ద శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో న్యాయవాదులతో పాటు జేఏసి కన్వీనర్ కోదండరాం, బీజేపీ అధికార ప్రతినిధి ప్రకాశ్ జవదేకర్, సమాజ్‌వాది మాజీ నేత అమర్‌సింగ్ తదితరులు సంఘీభావం తెలిపారు. శ్రీకృష్ణ కమిటీని రద్దు చేయాలని, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాలని, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న తెలంగాణేతరుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తీర్మానాలు చేశారు. ఇండియాగేట్ వద్ద తెలంగాణ అమరవీరులకు కొవ్వత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. న్యాయవాదులు అనూహ్యంగా మధ్యాహ్నం 3గంటలకు పార్లమెంట్ ముట్టడిని తలపెట్టారు. పార్లమెంట్ వెళ్లే దారిలో హైసెక్యూరిటీ జోన్‌లోకి ప్రవేశించారు. అక్కడ పోలీసులు వారిని అడ్డుకున్నారు. శ్రీకృష్ణ కమిటీ గోబ్యాక్, పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, లాయర్లకు మధ్య పలుమార్లు ఘర్షణ జరిగింది. 200మంది న్యాయవాదులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక రైలు ద్వారా ఢిల్లీకి చేరుకున్న న్యాయవాదులు పోలీసులు నిర్బంధాల మధ్య జంతర్‌మంతర్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు.

అనంతరం న్యాయవాదులు కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డిని ఘెరావ్ చేశారు. తాను తెలంగాణ విషయంలో ఎందుకు జోక్యం చేసుకోవట్లేదని ప్రశ్నించగా, తన స్థాయిలో తాను ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాధానం చెప్పారు. తాను తెలంగాణకు కట్టుబడి ఉన్నానని, అన్ని కోణాలను దృష్టిలో ఉంచుకొనే వ్యవహరిస్తున్నానని వారికి సర్ధిచెప్పారు. ఈ ధర్నా కార్యక్రమంలో ముగ్గురు లాయర్లు అస్వస్థతకు గురయ్యారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన లింగం అనే లాయర్‌కు గుండెపోటు రాగా, వరంగల్ జిల్లాకు చెందిన శ్రీనివాసులు, సత్యం అనే ఇద్దరు న్యాయవాదులు సొమ్మసిల్లి పడిపోయారు.

వీరిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

**26 ఫిబ్రవరి 2010:**

**కమిటీ తిరస్కరిస్తున్నాం: జేఏసి**

శ్రీకృష్ణ కమిటీని తిరస్కరిస్తున్నట్లు తెలంగాణ జేఏసి కన్వీనర్ కోదండరాం పునరుద్ఘాటించారు. తమకు కమిటీ సభ్యులపై వ్యతిరేకత లేదని, విధివిధానాలే తెలంగాణకు అనుకూలంగా లేవని చెప్పారు. జేఏసి తరపున కమిటీకి విజ్ఞాపనలు ఇవ్వటం లేదని, జేఏసీ భాగస్వాములెవ్వరూ కమిటీ ముందుకు వెళ్లరని తెలిపారు. రాజీనామాలకు ప్రజాప్రతినిదులు వెనుకడుగు వేయడాన్ని నిరసిస్తూ హెూళీ సందర్భంగా ఈనెల 28న కాముని దహన కార్యక్రమాన్ని నిర్వహించాలని జేఏసి పిలుపునిచ్చింది.

**28 ఫిబ్రవరి 2010:**

కామదహనం సందర్భంగా ఇందిరా పార్కు వద్ద తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో సీమాంధ్ర ఆధిపత్య శక్తుల దిష్టిబొమ్మల దహనం.

**03 మార్చి 2010:**

**హైదరాబాద్ తెలంగాణదే: పీసీసీ అధ్యక్షుడు బొత్స**

విభజన స్వరం వినిపిస్తున్న ఉత్తరాంధ్ర మంత్రి బొత్స సత్యనారాయణ మరిన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం శాసనసభ ప్రాంగణంలో బొత్స విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తెలంగాణలో అంతర్భాగమేనని స్పష్టం చేశారు. ఎందుకు కలిసి ఉండాలో చెప్పడంలో సమైక్యవాదులు విఫలమవుతున్నా రన్నారు. తానేదో కొత్తగా మాట్లాడుతున్నానని ఉలిక్కిపడడం మాని, వాస్తవాలు తెలుసుకోవాలని టీడీపీ నేతలకు హితవు పలికారు.

**04 మార్చి 2010:**

హైదరాబాద్‌లో శ్రీకృష్ణ కమిటి పర్యటన. తెలంగాణ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు. నిరసన వ్యక్తం చేస్తూ సింగరేణి గని కార్మికుల సమ్మె.

**08 మార్చి 2010**

**జేఏసికి టీడీపీ గుడ్‌బై**

చంద్రబాబు నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆ పార్టీకి చెందిన పలువురు మండలస్థాయి పార్టీ నాయకులు టీఆర్ఎస్, జేఏసిలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాము జేఏసిలో ఉండి తెలంగాణ కోసం పోరాడుతున్నామని, జేఏసి నుంచి బయటకు వెళ్లిన కాంగ్రెస్‌తో కుమ్మక్కై టీఆర్ఎస్ తమను టార్గెట్ చేయడం ఏంటని అభిప్రాయా పడ్డారు. న్యాయవాదులతో తమపై టీఆర్ఎస్ దాడి చేయించిందని, దాన్ని జేఏసి సమర్థించిన తర్వాత తాము జేఏసిలో ఎందుకు ఉండాలి అనే అభిప్రాయం వ్యక్తం

చేశారు.

**నీళ్ల కోసమే రాయలతెలంగాణ: జయశంకర్**

రాయల తెలంగాణ నినాదం కేవలం జలాల కోసమే తప్ప వారికి తెలంగాణపై ప్రేమలేదని, ఆంధ్రవారితో కలిసిఉండలేని వారు తెలంగాణ వారితో ఎలా కలిసిఉంటారని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. సమైక్యాంధ్ర నినాదానికి కాలం చెల్లిందని ఆవిషయాన్ని సీమాంధ్ర నేతలు కూడా గుర్తించాలని జేఏసి కన్వినర్ కోదండరాం అన్నారు. మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి రాయల తెలంగాణ ప్రతిపాదన నేపథ్యంలో వీరిరువురు వేర్వేరుగా విలేకరులతో పై విధంగా స్పందించారు.

**12 మార్చి 2010:**

అర్ధరాత్రిదాకా కొనసాగిన జేయేసీ ప్రత్యేక సమావేశం, హాజరైన కెసిఆర్. జేయేసీ నుండి తెలుగుదేశం పార్టీని బహిష్కరించాలని పట్టుబట్టిన టిఆర్ఎస్, జేయేసీలో భిన్నాభిప్రాయాలు. చివరకు జేయేసీ నుండి టిడిపిని బహిష్కరిస్తున్న జేయేసీ ప్రకటన.

**21 మార్చి 2010:**

జేయేసీ ఆధ్వర్యంలో గన్‌పార్కు నుండి తెలంగాణ ఉద్యమ బస్సుయాత్ర ప్రారంభం. నల్గొండ, ఖమ్మం మీదుగా అర్ధరాత్రి మణుగూరుకు చేరుకున్న యాత్ర. మనుగూరులో భారీ బహిరంగ సభ.

**22 మార్చి 2010:**

జేయేసీ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ ఉద్యమయాత్ర రెండవ రోజు భద్రాచలంలో ప్రారంభమై పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లందు, బయ్యారం తదితర ప్రాంతాల మీదుగా ఖమ్మం చేరుకున్నది.

**23 మార్చి 2010:**

జేయేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమయాత్ర మూడవ రోజు ఉదయం ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రారంభమై గార్ల, డోర్నకల్, కురవి, మహబూబాబాద్, గూడూరు, నర్సంపేట, గిర్నిబాయి, మిల్స్‌కాలనీ, పోచమ్మమైదాన్, యం.జి.యం. హన్మకొండ చౌరస్తా, అంబేద్కర్‌చౌక్ నుండి అమరవీరుల స్థూపం వద్ద తెల్లవారుజామున ముగిసింది.

**01 ఏప్రిల్ 2010:**

తెలంగాణ జేయేసీ నిర్మాణ కమిటి మరియు స్టీరింగ్ కమిటి సమావేశం. రెండవ విడత ఉద్యమయాత్ర నిర్వహించాలని నిర్ణయం.

**05 ఏప్రిల్ 2010:**

తెలంగాణ జేయేసీ జిల్లా జేయేసీల కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం.

**08 ఏప్రిల్ 2010:**

తెలంగాణ జేయేసీ తలపెట్టిన ఐదు రోజుల 'తెలంగాణ ఉద్యమ బస్సుయాత్ర'ను గన్‌పార్క్‌వద్ద ఈ రోజు సాయంత్రం జేయేసీ చైర్మెన్ కోదండరామ్ జెండా ఊపి ప్రారంభించారు. జేయేసీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్ నాయకత్వంలో బయలుదేరిన బస్సుయాత్ర హైదరాబాద్ నుండి కొమురవెల్లికి చేరుకున్నది.

**09 ఏప్రిల్ 2010:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో ప్రారంభమైన 'తెలంగాణ ఉద్యమ బస్సుయాత్ర' ఈ రోజు ఉదయం శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో పెద్దపట్నం, పూజలు ముగించుకున్న అనంతరం బయలుదేరింది. ఉదయం 10 గంటలకు కొమురవెల్లిలో బయలుదేరిన 'తెలంగాణ ఉద్యమ బస్సుయాత్ర' చేర్యాల, నంగునూరు, హుస్నాబాద్, ముల్కనూరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి నుండి రాత్రి హుజురాబాద్ చేరుకున్నది.

**10 ఏప్రిల్ 2010:**

**'తెలంగాణ ఉద్యమ బస్సుయాత్ర'కు అపూర్వ స్పందన**

తెలంగాణ జేయేసీ గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'తెలంగాణ ఉద్యమ బస్సుయాత్ర'కు ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తున్నది. మూడవరోజు బస్సు యాత్ర హుజురాబాద్ నుండి బయలుదేరి కందుగుల, ఉప్పల్, కమలాపూర్, మర్రిపెల్లిగూడెం, జమ్మికుంట, వీణవంక, చల్లూరు, మామిడాలపల్లి, మానకొండూర్ మీదుగా అర్ధరాత్రివరకు కరీంనగర్‌కు చేరుకున్నది.

**11 ఏప్రిల్ 2010:**

తెలంగాణ జేయేసీ నిర్వహిస్తున్న 'తెలంగాణ ఉద్యమ బస్సుయాత్ర' నాలుగవ రోజు కరీంనగర్ పట్టణంలోని ధర్నాచౌక్ నుండి ప్రారంభమయ్యింది. ఉదయం 10 గంటలకు కరీంనగర్‌లో ప్రారంభమైన బస్సుయాత్ర చొప్పదండి, ధర్మారం, వెల్గటూరు, లక్షెట్టిపేట, సిసిసి–నస్పూర్, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి మీదుగా మంచిర్యాలకు రాత్రి చేరుకున్నది.

**12 ఏప్రిల్ 2010:**

తెలంగాణ జేయేసీ నిర్వహిస్తున్న ఉద్యమ యాత్ర ఐదవ రోజు మంచిర్యాలలో ప్రారంభమై మంద్రమర్రి, బెల్లంపల్లి, గోలేటి, రెబ్బెన, ఆసిఫాబాద్ మీదుగా కాగజ్‌నగర్‌లో ముగిసింది.

**17 ఏప్రిల్ 2010:**

**తెలంగాణ రాకపోతే అంతర్యుద్ధమే: కేసీఆర్**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరగకపోతే రాష్ట్రంలో అంతర్యుద్ధం జరుగుతుందని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కమిటీ ముందు తేల్చిచెప్పారు. డిసెంబర్ 31 తర్వాత తెలంగాణకు వ్యతిరేకంగా కమిటీ నివేదిక వస్తే రాష్ట్రంలో జరుగబోయే అంతర్యుద్ధానికి కమిటీయే కారణమవుతుందన్నారు. టీఆర్ఎస్ బృందం శుక్రవారం నాడు నాలుగు గంటలపాటు కమిటీ ముందు తమ వాదనలు వినిపించింది.

**28 ఏప్రిల్ 2010:**

"తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు" నినాదంతో తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండ్ కోసం తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఒక రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు.

**02 మే 2010:**

హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సదస్సులో ఆర్టీసీ జేయేసీ ఏర్పాటు.

**04 మే 2010:**

హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జేయేసీ కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సింగరేణి జేయేసీ ఏర్పాటు.

**07 మే 2010:**

సికింద్రాబాద్‌లోని తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో తెలంగాణ సినిమా జేయేసీ ఏర్పాటుపై సన్నాహక సమావేశం.

**19 మే 2010:**

ఓదార్పు యాత్ర పేరుతో వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన మానుకోట యాత్ర సీమాంధ్ర అధిపత్య శక్తులు తెలంగాణపై చేస్తున్న దండయాత్రగానే భావిస్తామని ఈ రోజు జరిగిన తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి అభిప్రాయపడింది.

**21 మే 2010:**

తెలంగాణ జేయేసీ కార్యాలయంలో తెలంగాణ విద్యార్థి జేయేసీ, తెలంగాణ జేయేసీ సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్ తలపెట్టిన మానుకోట ఓదార్పు యాత్రను అడ్డుకొని తీరుతామని విద్యార్థి సంఘ నాయకులు హెచ్చరించారు.

**23 మే 2010:**

ప్రైవేట్ సెక్టార్ ఎంప్లాయిస్ జేయేసీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో

తెలంగాణ రాష్ట్ర సాధన సదస్సు జరిగింది.

**24 మే 2010:**

ఒక ప్రాంతం ప్రజలు తీవ్రమైన నిరసన వ్యక్తం చేస్తున్న పట్టించుకోకుండా ఓదార్పు యాత్ర పేరుతో వైయస్. జగన్ చేయతలపెట్టిన మానుకోట పర్యటన దురంకారంతో కూడినదని, అది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని జేయేసీ చైర్మన్ కోదండరాం అభ్యతరం వ్యక్తం చేసారు. జగన్ యాత్ర నేపథ్యంలో పరిస్థితులను సమీక్షించేందుకు హన్మకొండలోని టిఎన్‌జివో భవన్‌లో జరిగిన వరంగల్ జిల్లా జేయేసీ ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరైనారు. జేయేసీ సమన్వయకర్త పిట్టల రవీందర్, జిల్లా ఇంచార్జి డా॥ కత్తి వెంకటస్వామి, మాదు సత్యం, తదితరులు కూడా హాజరైనారు.

**25 మే 2010:**

ఓదార్పుయాత్ర పేరుతో ఈ నెల 28న వైయస్. జగన్ తలపెట్టిన మానుకోట పర్యటనకు నిరసనగా వరంగల్ జిల్లా జేయేసీ ఇచ్చిన పిలుపు మేరకు నేడు వరంగల్ జిల్లా బంద్ సంపూర్ణంగా జరిగింది.

మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన ఒక గోనెసంచి మూట సంచలనం సృష్టించింది. “ఈ మూటలో బాంబులున్నాయని, ఎవరూ ముట్టుకోకూడదని” హెచ్చరిస్తూ ఒక చీటి అక్కడ పోలీసులకు లభించింది. సుమారు రెండు గంటల ప్రయత్నం తర్వాత వరంగల్ నుండి వచ్చిన ప్రత్యేక బాంబ్ స్క్వాడ్ మూటను విప్పి చూడగా అందులో పాత చెప్పులు కనిపించాయి. జగన్ యాత్రకు వస్తే మానుకోట ప్రజలు పాత చెప్పులతో బుద్ధి చెప్పాలని సంచిలో దొరికిన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

**26 మే 2010:**

మానుకోట బస్టాండులో బాంబ్ కలకలం. 8 గంటల హైడ్రామా.

**27 మే 2010:**

జగన్ చేపట్టిన ఓదార్పు యాత్రకు నిరసనగా మహబూబాబాద్‌లో నీళ్లటాంక్ ఎక్కి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విద్యార్థి.

**28 మే 2010:**

**రణరంగమైన మానుకోట**

అధిష్టానం ఆజ్ఞను, తెలంగాణవాదుల హెచ్చరికలను, పార్టీ నేతల అభ్యంత రాలను, సన్నిహితుల సలహాలను, మంత్రుల విన్నపాలను బేఖాతరు చేస్తూ... జగన్ ఉదయమే వరంగల్ పర్యటనకు సిద్ధమయ్యారు. తెల్లవారుజామునే తల్లి విజయలక్ష్మి

దీవెనలు అందుకున్నారు. తర్వాత కాసేపటికి టాస్క్‌ఫోర్స్ డీసీపీ కమలాసన్‌రెడ్డి జగన్ ఇంటికి వచ్చారు. యాత్రను విరమింపజేసేందుకు అరగంటసేపు ప్రయత్నించారు. అయితే అందుకు జగన్ ససేమిరా అన్నారు. ఏడు గంటలకు జగన్ బంజారాహిల్స్ సాగర్ సొసైటీలోని తన ఇంటి నుంచి, 30 కార్ల కాన్వాయ్‌తో, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు బయల్దేరారు. ఎమ్మెల్యేలు కూస శ్రీశైలం గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాస్, మాజీ మంత్రి మూలింటిమారెప్ప తదితరులు ఆయన వెంట ఉన్నారు. ఉదయం 7.20 సమయంలో జగన్ కాన్వాయ్ స్టేషన్‌కు చేరుకుంది. ఆయన అక్కడికి రాగానే పోలీసులు వలయంగా ఏర్పడ్డారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు 'వైఎస్సార్ అమర్ రహే, జగన్ నాయకత్వం జిందాబాద్' అని నినాదాలు చేస్తూ జగన్‌కు స్వాగతం పలికారు. జగన్ స్టేషన్‌లోకి ప్రవేశించే సమయంలో తొక్కిసలాట జరగడంతో ప్రయాణీకులు భయాందోళనలకు గురయ్యారు. అసౌకర్యానికి లోనయ్యారు. పోలీసులు నానా తిప్పలు పడి, జగన్‌ను సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లోని సెకండ్ ఏసీ చైర్ కార్‌లోకి ఎక్కించారు. ఇంతలో ఇంటర్‌సిటీ రైలు వెళ్లే మార్గంలో పేలుడు పదార్థాలు అమర్చారన్న వదంతులు వ్యాపించాయి. దీంతో 7.40కి బయల్దేరాల్సిన రైలు దాదాపు అరగంట ఆలస్యంగా బయల్దేరింది.

జగన్‌ను అడ్డుకునేందుకు అప్పటికే మహబూబాబాద్ చేరుకున్న తెలంగాణ వాదులు, టీఆర్ఎస్ నాయకులు, ఉస్మానియా, కాకతీయ విద్యార్థి జేఏసీ నేతలు పెద్ద సంఖ్యలో రోడ్డుమీదకు వచ్చారు. అటు జగన్ వర్గీయులు ఎమ్మెల్యేలు కొండా సురేఖ, కవిత, ఎమ్మెల్సీలు కొండా మురళి, పద్మావతి, మాజీ మంత్రి రెడ్యానాయక్, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తదితర అనేకమంది కాంగ్రెస్ నాయకులు, తమ అనుచరులతో భారీగా మానుకోట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వెయిటింగ్ రూంలో వీరంతా కూర్చున్నారు. ఈవిషయాన్ని తెలుసుకున్న తెలంగాణ వాదులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో రైల్వేస్టేషన్‌కు వచ్చారు. 'జై తెలంగాణ, జగన్ గో బ్యాక్' అని నినదిస్తూ వెయిటింగ్ రూం వద్దకు దూసుకెళ్లారు. తెలంగాణ వాదులకు, కాంగ్రెస్ శ్రేణులకు మధ్య వాగ్వాదం, ఘర్షణ, తోపులాటలు జరిగాయి. కాంగ్రెస్ గుంపులో ఉన్న కొందరు యువకులు ఆందోళనకారులను కొట్టారు. ప్లాట్‌ఫాంపై పరుగులు తీశారు. దీంతో, అప్పటిదాకా రెండో ప్లాట్‌ఫాంపై ఉండి నినాదాలకే పరిమితమైన మిగితా తెలంగాణ వాదులు రాళ్ల దాడికి దిగారు. రెండు వైపుల నుంచి పడిన రాళ్లతో స్టేషన్ యావత్తూ ధ్వంసం కావడం మొదలైంది. ఇంతలో ఉన్నట్టుండి కాల్పుల మోత మొదలైంది. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరుపుతున్నారని అందరూ అనుకున్నారు. కాని కాల్పులు జరుపుతున్నది పోలీసులు కాదని గుర్తించే సరికి పది నిమిషాల సమయం పట్టింది. నాయకులంతా కూర్చున్న వెయిటింగ్ రూం నుంచి కొందరు చేతిలో తుపాకులతో నేరుగా తెలంగాణ వాదులపై కాల్పులు జరిపారు.

1.30కి మొదలైన కాల్పులు 40 నిమిషాల పాటు కొనసాగాయి. ఒకవైపు కాల్పులు, మరోవైపు రాళ్ల దాడితో మానుకోట రైల్వేస్టేషన్ రణరంగంగా మారింది. కొండా దంపతుల అంగరక్షకులతో పాటు, వెయిటింగ్ రూంలో ఉన్న వారే కాకుండా, ఆ ప్రాంతంలో ఉన్న గన్ లైసెన్స్ ఉన్న వారు కూడా కాల్చినట్లు అనిపించింది. ఈ కాల్పుల్లో 13 మందికి తూటా గాయాలయ్యాయి.

వీరిలో వీఎస్ లక్ష్మిపురానికి చెందిన బహుజన్ స్టూడెంట్ ఫ్రంట్ నాయకుడు బొందకోల ఫౌల్‌రాజ్(20)కు తీవ్ర గాయాలయ్యాయి. ఆందోళనకారులు ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని, వైద్య పరిభాషలో దీన్ని బ్రెయిన్ డెడ్‌గా పరిగణిస్తారని డాక్టర్లు పేర్కొన్నారు. కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఖమ్మం జిల్లా వాసి పి.సురేష్(21), దిడ్డి వెంకటేశ్వర్లు(15), భూక్యా శోభన్‌బాబు, తోట రవి, ప్రభు సహా 13 మందికి తూటా గాయాలయ్యాయి. ఆరుగురు కానిస్టేబుళ్లు, కాంగ్రేస్ ఎంపీటీసీ ముత్యం వెంకన్న సహా 25 మందికి రాళ్ల దెబ్బలు తగిలాయి. ఘర్షణ ఎంతకూ ఆగకపోవడంతో వెయిటింగ్ రూంలో ఉన్న కాంగ్రేస్ నేతలు అంగరక్షకుల సాయంతో బయటకు వచ్చారు. వారి అనుచరులు రాళ్లతో తెలంగాణ వాదులపై ఎదురుదాడి చేశారు. ఒక దశలో కొండా సురేఖ కూడా రాళ్లు విసిరారు. కేసీఆర్ సహా పలువురు నాయకులపై బూతు పురాణం అందుకొని ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. రైల్వేస్టేషన్ రణరంగంగా మారడంతో కాంగ్రేస్ నేతలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, సొంత వలయం నడుమ స్టేషన్ నుంచి పరుగులు తీశారు. అప్పటిదాకా రైల్వేస్టేషన్‌కే పరిమితమైన ఉద్రిక్తత తర్వాత మొత్తం పట్టణానికి వ్యాపించింది. కోర్టు ప్రాంతంలో ఇంటిలిజెన్స్ సీఐ సత్యనారాయణ వాహనంపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. కాంగ్రేస్ శ్రేణుల వాహనాలకూ ఇదే పరిస్థితి ఎదురైంది. జగన్ మీడియా సంబంధీకులదిగా చెబుతున్న ఓ కారుకు నిప్పుపెట్టారు. ఫైర్ సర్వీసెస్ వాహనంలో కొండా సురేఖ వెళుతున్నారని అనుమానించిన దానిపై రాళ్లు రువ్వారు. దీంతో పట్టణంలో 144 సెక్షన్ విధించారు.

**జగన్ అరెస్టుకు ఆదేశాలు**

జగన్ వరంగల్ యాత్రకు అనుమతి లేదని, ఆయన జిల్లాలో అడుగుపెడితే అరెస్టు చేస్తామని ఎస్పీ అంతకుముందే ప్రకటించారు. మరోవైపు జగన్ ప్రయాణిస్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.05కు నల్గొండ జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి స్టేషన్‌కు చేరుకుంది. జగన్ వెంట ఉన్న డీసీపీ కమాలసన్‌రెడ్డి ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతూ వచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకూ రైలును అక్కడే నిలిపి ఉంచారు. రైలును పేల్చేస్తామనే బెదిరింపులతో ముందుకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని, అందువల్ల యాత్రను రద్దు చేసుకోవాలని కమలాసన్‌రెడ్డి, స్థానిక పోలీసులు జగన్‌ను మరోసారి కోరారు. అందుకు ఆయన

నిరాకరించడంతో 1.40గంటలకు (శాంతిభద్రతలకు భంగం... సెక్షన్ 151 కింద) జగన్‌ను అరెస్టు చేశారు. అరెస్టు సందర్భంగా జగన్ అనుచరులు కొద్దిసేపు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అదే సమయంలో తెలంగాణవాదులు అక్కడకు చేరుకుని 'జగన్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. మరోవైపు పోలీసులు జగన్‌ను రైల్వేస్టేషన్ నుంచి బయటకు తీసుకువచ్చి, ప్రత్యేకంగా రప్పించిన వాహనాల్లో హైదరాబాద్‌కు తిప్పి పంపారు. ఆయనకు ఇంటివరకూ తీసుకెళ్లి, వ్యక్తిగత పూచికత్తుపై బెయిల్ లాంచనాలు పూర్తిచేసి, విడిచిపెట్టారు.

## ధిక్కారంపై అధిష్టానం సీరియస్

జగన్ ధిక్కారాన్ని అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ నియామకం తర్వాత రాష్ట్రంలో నెలకొన్న ప్రశాంతత, జగన్ దుందుడుకు తనంతో ఒక్కసారిగా ఎగిరిపోయిందని భావించింది. తాజా పరిణామాలతో పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు రావడంతోపాటు.. ఉప ఎన్నికల్లో విజయావకాశాలూ దెబ్బతిన్నాయనే అభిప్రాయం నెలకొంది. వీటన్నింటి నేపథ్యంలో.. జగన్ వ్యవహారంపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై నివేదిక సమర్పించాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి వీరప్ప మొయిలీని ఆమె ఆదేశించారు. జగన్ ధిక్కారంపై ఢిల్లీకి భారీగానే ఫిర్యాదులు వెళ్లాయి. ఆయన బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని కట్టడి చేయకపోతే పార్టీకే ప్రమాదమని తెలంగాణ ఎంపీలు లేఖ రాసినట్లు తెలిసింది. జగన్ వైఖరిపై తెలంగాణ నేతల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

## జగన్‌కు తెలంగాణ సెగ

అటు కాంగ్రెస్ అధిష్టానం.. ఇటు తెలంగాణ ప్రజలు.. వద్దు వద్దంటున్నా వరంగల్ జిల్లాలో ఆరు రోజుల ఓదార్పు యాత్ర కోసం శుక్రవారం బయలుదేరిన ఎంపీ జగన్‌ని తెలంగాణ వాదం నీడలా వెంటాడింది. తెలంగాణ వాదుల నుంచి నిరసన జ్వాలలు ఆయనకు తప్పలేదు. కొందరు రైలులోనే ఆయనతోపాటు ప్రయాణిస్తే.. మరికొందరు దారిలోని రైల్వే స్టేషన్లకు తరలివచ్చారు. ఈ క్రమంలో ఆయనకు భువనగిరి, వంగపల్లి స్టేషన్లలో చేదు అనుభవాలు ఎదురయ్యాయి. వంగపల్లిలో దారుణ పరాభవానికి గురయ్యారు. తెలంగాణ వాదులు ఆయన వెనుకాలే చేరి.. గో బ్యాక్ అనే నినాదలు చేయటమే కాక, హైదరాబాద్ బయలుదేరే వరకూ వెంటాడారు. బూతులు తిట్టి శాపనార్థాలు పెట్టారు. తక్కువ సంఖ్యలో ఉన్న జగన్ అనుచరుల నుంచి కనీస ప్రతిఘటన కూడా రాలేదు. పోలీసులు ఆయనను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించారు.

జగన్ కారణంగా దాదాపు 40నిమిషాలు ఆలస్యంగా రైలు కదిలింది. దీంతో

'హెలికాప్టర్‌లో వెళ్లొచ్చు కదా.. ట్రైన్‌లో వచ్చి మమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఎందుకు? అయినా వైఎస్ చనిపోయి ఏడాది కావస్తుండగా.. ఇప్పుడు పరామర్శలు ఏమిటి?' అని ప్రయాణీకులు మండిపడ్డారు. అ తరువాత రైలు వంగపల్లి స్టేషన్‌లో ఆగగానే మొదట రైల్వే హమాలీలు ప్లాట్‌ఫాంపై నుంచి జై తెలంగాణ నినాదాలు చేశారు. జగన్‌ని ఇక్కడే అరెస్టు చేసి వాహనాల వద్దకు తరలించారు. నిరసనకారులు జగన్ బృందాన్ని వెంబడించి, ఆయన కారు ఎక్కే సమయంలో రాయటానికి వీల్లేని భాషలో బండ బూతులు తిట్టారు. మహిళలు శాపనార్థాలు పెట్టారు. నోరు కొట్టుకుంటూ గేలిచేశారు. స్టేషన్ నుంచి వాహనాల శ్రేణి రోడ్డుపైకి చేరుకున్న వెంటనే హైదరాబాద్ వైపు వరకు వారు వెంటాడారు.

## యాత్ర గొడవతో పలు రైళ్లు రద్దు

కడప ఎంపీ జగన్ చేపట్టిన ఓదార్పు యాత్ర సందర్భంగా తలెత్తిన గొడవల కారణంగా పలు మార్గాల్లో కొన్ని రైళ్లు పూర్తిగా, మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. బాంబు బెదిరింపుల కారణంగా ఇంకొన్ని రైళ్లు అలస్యంగా నడిచాయి. ఫలితంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సహా దక్షిణమధ్య రైల్వే పరిధిలోని పలు స్టేషన్లలో ప్రయాణీకులు నానా అవస్థలు పడ్డారు.

## మళ్లీ వస్తే జనమే చూసుకుంటారు: కేసీఆర్

'మళ్లీ ఓదార్పు యాత్రకు వస్తాడా? బుల్లెట్లు తగిలి యువకులు గాయాలపాలై రక్తం ఓడుతుంటే.. మళ్లీ వస్తానంటే ఏమైనా అర్థముందా? ప్రజల రక్తం మీద, గుండెల మీద నడుచుకుంటూ వస్తాడా? ఇది వలసవాద దురహంకార, పెత్తందారి పోకడలకు మచ్చుతునక! మళ్లీ రానీ.. ప్రజలే చూసుకుంటారు. దాని జవాబు దానికుంటుంది' అంటూ జగన్‌పై టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు.

## కొండా సురేఖ ఆత్మహత్యాయత్నం

వైఎస్ జగన్ చేపట్టిన యాత్ర రద్దయిందని, జగన్‌ను పోలీసులు అరెస్టు చేశారని తెలుసుకున్న మాజీ మంత్రి, పరకాల ఎమ్మెల్యే కొండా సురేఖ తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. తెలంగాణవాదులు రైలు మార్గాన్ని అడ్డుకుంటే.. హెలికాప్టర్‌లోనైనా జగన్‌ను జిల్లా పర్యటనకు తీసుకువస్తామని ఓదార్పు యాత్రను కచ్చితంగా జరిపి తీరుతామని ప్రకటించారు. మీడియాతో మాట్లాడుతుండగానే.. ఉన్నట్లుండీ తన ప్రసంగాన్ని ఆపి సురేఖ.. జగన్‌ను అరెస్టు చేసి, ఓదార్పు యాత్రను అడ్డుకున్నందుకు నిరసనగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ అప్పటివరకు చేతిలో ఉంచుకున్న నిద్రమాత్రలను నోట్లో వేసుకున్నారు. ఆమె వెంట ఉన్న పార్టీ శ్రేణులు వెంటనే తేరుకుని నోట్లో పడిన మాత్రలను బయటకు లాగేశారు. ఆ వెంటనే ఆమె స్పృహ కోల్పోయారు. దీంతో కొండా అనుచరులు ఓ ప్రైవేటు వాహనంలో ఆమెను

మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధమయ్యారు. స్థానిక కోర్టుల సమూహం వద్ద గుమిగూడిన తెలంగాణవాదులు ఆమె వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో రూటు మార్చి ఇల్లందు మీదుగా మధ్యాహ్నం 12.30కి ఖమ్మం మమత ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యాధికారులు ఒకే ఒక మాత్ర మింగిందని స్పష్టం చేశారు. వారి వెంట ఉన్న ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి స్వల్పంగా గుండెపోటు వచ్చినట్లు చెప్పడంతో ఆమెకూ చికిత్స చేశారు. మహబూబాబాద్ నుంచి ఖమ్మం వస్తుండగా రాళ్ల వర్షం కురిపించారని, బుల్లెట్ ప్రూఫ్ వాహనం కావడంతో ప్రాణాలతో బయటపడ్డామని మహబూబాబాద్ ఎమ్మెల్యే కవిత చెప్పారు.

## నిరసనలు, బంద్‌లు, విధ్వంసాలతో దద్దరిల్లిన ఓరుగల్లు

వరంగల్ జిల్లా అట్టుడికింది. వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా, కాల్పుల ఘటనకు నిరసనగా ర్యాలీలు, రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనాలతో దద్దరిల్లింది. మానుకోటలో కాల్పుల అనంతరం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు రోడ్లమీదకు వచ్చారు. ఆందోళనలు చేపట్టారు. పలు చోట్ల స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బస్సులను అడ్డుకున్నారు. కొన్ని బస్సుల అద్దాలను పగలగొట్టారు. రోడ్లపై టైర్లను వేసి తగులబెట్టారు. జగన్‌యాత్రను నిరసిస్తూ బీజేవైఎం కార్యకర్త ఒకరు గొంతుకోసుకున్నారు. ఆందోళనకారులు ఎక్కడపడితే అక్కడ పట్టాలపై బైఠాయించడంతో 14 రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. కేయూలో శుక్రవారం జరగాల్సిన లా పరీక్షను విద్యార్థులు బహిష్కరించారు. దేవరుప్పుల, తొర్రూరులలో వైఎస్ విగ్రహస్థాపన కోసం నిర్మించిన గద్దెలను ధ్వంసం చేశారు. ఉద్యోగులు విధులు బహిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 200మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ కింద ఆంక్షలు విధించారు. హైదరాబాద్‌లో సీఎంతో మాట్లాడేందుకు వచ్చిన తెలంగాణ న్యాయవాదులకు అవకాశం ఇవ్వకపోవడంతో న్యాయవాదులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. సీఎం డౌన్‌డౌన్, విద్యార్థి మృతిపై కొండా సురేఖ దంపతులను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు.

**08 జూన్ 2010:**

తెలంగాణ జేయేసీ గ్రేటర్ హైదరాబాద్ కమిటి సన్నాహక సమావేశం.

**09 జూన్ 2010:**

ఆంధ్ర రాష్ట్ర సమితి నాయకులతో తెలంగాణ జేయేసీ ముఖ్యనాయకుల ప్రత్యేక సమావేశం. తెలంగాణ న్యాయమైన డిమాండ్ గురించి సీమాంధ్ర ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ జేయేసీ నాయకులు ఆంధ్ర ప్రాంతంలో పర్యటించాలని

కోరిన ఆంధ్ర రాష్ట్ర సమితి నాయకులు.

**10 జూన్ 2010:**

తెలంగాణ జేయేసీలో భాగంగా రంగారెడ్డి జిల్లా జేయేసీ ఏర్పాటు. చైర్మన్‌గా వెదిరె చెల్మారెడ్డి ఎన్నిక.

**12 జూన్ 2010:**

తెలంగాణ జేయేసీ విస్తృతస్థాయి స్టీరింగ్ కమిటి సమావేశం.

**21 జూన్ 2010:**

తెలంగాణ జేయేసీ మూడవ దశలో చేపట్టిన మూడు రోజుల ఉద్యమ యాత్ర ప్రారంభం.

**01 జూలై 2010:**

జూలై 2 నుండి 9వ తేది వరకు "తెలంగాణ సాధన దీక్షా వారం"గా పాటించాలని ఈ రోజు జరిగిన తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశంలో నిర్ణయించారు. జూలై 2న తెలంగాణ ఆత్మగౌరవ జెండావిష్కరణ, 3న అలాయిబలాయి, 4న అమరవీరుల స్మారక దినం, 5న తెలంగాణ దీక్షా కంకణం, 6న విద్యార్థుల మానవ హారం, 7న తెలంగాణ జులూస్, 8న సర్వమత ప్రార్థనలు, ప్రతిజ్ఞలు, 9న తెలంగాణ కట్టడి.

**02 జూలై 2010:**

**ఉప ఎన్నికల నోటిఫికేషన్ జారీ**

ఉప ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసింది. తొలిరోజున మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. పీసీసీ చీఫ్ డి.శ్రీనివాస్ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి కాంగ్రేస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్ జిల్లా వేములవాడ నుంచి కాంగ్రేస్ అభ్యర్థి పంజల రాములు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా డాక్టర్ కె.పద్మరాజన్ నామినేషన్లు దాఖలు చేశారు. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి మొత్తం ఐదు జిల్లాల్లో కలిసి మొత్తం 1069 కేసులు నమోదు చేయాలని ఈసీ ఆదేశాలిచ్చింది. ఇవికాక ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటివరకు 792 మందిని అరెస్టు చేశారు. ఎన్నికల్లో నేరాలకు పాల్పడతారన్న అనుమానంతో ముందు జాగ్రత్తగా 4217 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

గ్రేటర్ హైదరాబాద్ జేయేసీ ఏర్పాటు. చైర్మన్‌గా డా॥ ఆయాచితం శ్రీధర్, కన్వీనర్‌గా ఎం.బి. కృష్ణయాదవ్ ఎన్నిక.

జేయేసీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మహిళా జేయేసీ ఏర్పాటుపై సన్నాహక

సమావేశం.

తెలంగాణ సాధన దీక్షా వారంలో భాగంగా జేయేసీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఒక రోజు దీక్ష.

**11 జూలై 2010:**

**తెలంగాణ విలన్ ఎన్టీఆర్: ప్రొ.జయశంకర్**

మాజీ సీఎం ఎన్టీఆర్ తెలంగాణకు విలన్ అని ప్రొఫెసర్ కె.జయశంకర్ ఆరోపిం చారు. తెలంగాణకు జరిగిన అన్యాయానికి 1982లోనే ఎన్టీఆర్ పునాది వేయగా చంద్రబాబు, వైఎస్ఆర్, రోశయ్యలు కొనసాగించారని ధ్వజమెత్తారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'శ్రీకృష్ణ కమిటీకి సమర్పించిన నివేదిక' పుస్తకాన్ని జయశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలతోనే తెలంగాణను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఓదార్పు యాత్ర చేస్తున్న జగన్ వెంట జనం లేరని, తండ్రి సంపాదించిన కోట్ల రూపాయలు ఉన్నాయని కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే పి.శంకర్‌రావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయిని నర్సింహారెడ్డి, ప్రొ.ఘంటా చక్రపాణి, ముస్లీం ఫోరం ఫర్ తెలంగాణ అధ్యక్షులు మహ్మద్ లతీఫ్ ఖాన్, ఉద్యోగ సంఘాల నేతలు విఠల్, శ్రీనివాస్‌గౌడ్, పద్మాచారి, యాదయ్య, శంకర్, శ్రీధర్ దేశ్‌పాండే, దుర్గాభాయి తదితరులు పాల్గొన్నారు.

**17 జూలై 2010:**

కరీంనగర్ సమీపంలోని తెలంగాణ భవన్‌లో కరీంనగర్ జిల్లా జేయేసీ స్టీరింగ్ కమిటి నాయకులతో టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ప్రత్యేక భేటి. ఉప ఎన్నికల పై చర్చ.

**27 జూలై 2010:**

ఉప ఎన్నికల పోలింగ్.

**29 జూలై 2010:**

టిఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో తెలంగాణ జేయేసీ విస్తృత స్థాయి స్టీరింగ్ కమిటి సమావేశం. టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో అన్ని స్థానాల్లో టిఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని అన్నారు. ఉప ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీలతో సమాంతరంగా గ్రామస్థాయి వరకు జేయేసీ కమిటీలను విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

**30 జూలై 2010:**

**12 స్థానాల్లోనూ తెలంగాణ వాదమే గెలిచింది.**

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అమరులైన ఆత్మ బంధువులకు అశ్రు నయనాలతో

ఓట్ల హారతి పడుతూ.. పదవులు త్యాగం చేసిన తాజా మాజీలను 'భారీ మెజార్టీ'లను బహుమానాలుగా కట్టబెడుతూ తెలంగాణ ఓటర్లు ఉప ఎన్నికల్లో తమదైన తీర్పు ఇచ్చారు. ప్రత్యేక వాదానికి ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర సమితేనని తేల్చిచెబుతూ, కాంగ్రెస్, టీడీపీలను పరాజయం పాల్జేశారు. వీటిలో 11 స్థానాలు టీఆర్ఎస్, 1బీజేపీ కైవసం చేసుకోగా.. ఎనిమిదింటిలో టీడీపీ, రెండింటిలో కాంగ్రెస్ డిపాజిట్లు కోల్పోయింది. సిద్ధిపేటలో టీఆర్ఎస్ అభ్యర్థి హరీష్‌రావు 95,858ఓట్ల రికార్డు మెజారిటీతో గెలిచారు.

'ప్రత్యేక రాష్ట్రం కావాలని తెలంగాణ ప్రజలు గుండెలు చీల్చి చెప్పిన తీర్పు ఇది. కాంగ్రెస్, టీడీపీలు తెలంగాణ ప్రజలతో ఆడుకుంటే, ఇలాగే మోసం చేస్తే.. టీఆర్ఎస్ స్థానాలు ఈ రోజు 11, అవి రేపు 111 అవుతాయి.. అప్పుడూ ప్రత్యేక పరిస్థితులే ఉంటాయి' అని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు.

**31 జూలై 2010:**

## ఓయూలో ఇషాన్‌రెడ్డి ఆత్మార్పణం

ఉప ఎన్నికల్లో 'డీఎస్' ఓడినందుకు గర్వపడుతూ ఓయూ క్యాంపస్‌లో బీటెక్ విద్యార్థి ఆత్మబలిదానం చేసుకున్నాడు. శుక్రవారం ఉప ఎన్నికల ఫలితాలు వెలుబడిన కొద్ది గంటల్లోనే ఇషాన్ ఆత్మార్పణం చేసుకోవడం విద్యార్థి లోకాన్ని కంటతడి పెట్టించింది. శనివారం తెల్లవారుజామున యూనివర్సిటీ లైబ్రరీ ముందున్న చెట్టపొదలో ఇషాన్ మృత దేహాన్ని చూసి విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు. మృత దేహం పక్కన ఉన్న సూసైడ్ నోట్ ఆధారంగా మృతుడు మెదక్ జిల్లా న్యాలకల్ మండలం బసంతపురం గ్రామానికి చెందిన ఇంద్రసేనారెడ్డి, సరోజల కుమారుడు ఇషాన్‌రెడ్డి(21)గా గుర్తించారు. ఇషాన్ శుక్రవారం రాత్రి సూసైడ్ నోట్ రాసి లైబ్రరీ ముందున్న చెట్టపొదల్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

## సూసైడ్ నోట్ సారాంశం

జైతెలంగాణ.. జైజై తెలంగాణ తెలంగాణ ఉద్యమ వందనం.. ఉప ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించిన ప్రజలందరికీ శుభాకాంక్షలు. నేను ఇలా చేస్తున్నందుకు మన్నించాలి. డీఎస్ ఓడిపోతే ప్రాణాలు అర్పిస్తానని మైసమ్మ తల్లికి మొక్కుకున్నాను. అందుకే ఆత్మత్యాగం చేస్తున్నాను. ఇదీ నాకు గర్వంగా ఉంది. మా ఇంట్లో తమ్ముళ్లు ఉన్నారు. వాళ్లు కూడా నా... మా... మన... తెలంగాణ ఆశయాన్ని నెరవేరుస్తారు. ఇప్పటినుంచైనా తెలంగాణ ఉద్యమంలో ముస్లీంలు కలిసిరావాలని కోరుతున్నాను. తెలంగాణ ద్రోహులు కాంగ్రెస్ పార్టీ నుంచి డీఎస్, జానారెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఐటీ మినిష్టర్, టీడీపీ నుంచి నాగం జనార్ధన్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, టి.దేవేందర్‌గౌడ్, శ్రీహరి. ఈ తొమ్మిది మందిని తెలంగాణ నుంచి బహిష్కరించడం లేదా చంపడం చేయాలి. జేఏసిని కోరుతున్నాను. నాలాగే 400 మంది చనిపోయారు.

కేసీఆర్‌జీ నేను రెండు విషయాలు కోరుతున్నాను మనకు ఇంకా డిసెంబర్ వరకు సమయం ఉంది. తెలంగాణ కోసం తిరిగి పోరాటం చేయాలి. ప్రాజెక్టుల కోసం బాబు డ్రామాలు ఆడుతున్నాడు. నా మృత దేహాన్ని ఆర్ట్స్ కళాశాల వద్ద పెట్టాలి. అక్కడి నుంచి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించాలి. ఇవి నా చివరి అక్షరాలు. చివరగా తన దేహానికి పోస్టుమార్టం చేయకూడదని కోరాడు.

సూసైడ్ నోట్ చదివిన విద్యార్థులు ఉద్వేగంతో పెద్దపెట్టున నినాదాలు చేశారు.

## సందర్శించిన ప్రముఖులు

ఇషాన్‌రెడ్డి ఆత్మబలిదానం చేసుకున్న విషయం తెలిసిన నాయకులు క్యాంపస్‌లోని లైబ్రరీ ప్రాంతానికి వచ్చి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. తెలంగాణ జేఏసి చైర్మన్ కోదండరాం, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీష్‌రావు, నాయిని నర్సింహారెడ్డి, వినోద్, ప్రకాశ్, సోలిపేట లింగారెడ్డి, మోతె శోభన్‌రెడ్డి, బీజేపి నేతలు బండారు దత్తాత్రేయ, డాక్టర్ కె.లక్ష్మణ్, విద్యాసాగర్‌రావు, రాంచందర్‌రావు, విద్యార్థి జేఏసి నాయకులు పిడమర్తి రవి, రాజారాం యాదవ్, పున్నకైలాస్‌నేత, ఎర్రోళ్ల శ్రీనివాస్, సునీల్‌శెట్టి, జగన్, మర్రి అనిల్, ప్రజా సంఘాల నేతలు అందెశ్రీ, మదుప్రియ, జయరాజ్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

## ఇంకెన్నాళ్లు...? కోందండరాం

విద్యార్థుల బలిదానాలు బాధాకరమని తెలంగాణ జేఏసి కన్వినర్ కోదండరాం అన్నారు. తెలంగాణ టీడీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీమాంధ్ర నేతలకు ఇంకా ఊడిగం చేస్తూనే ఉంటారా? రాష్ట్ర సాధనలో పాలు పంచుకుంటారా? తేల్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఎంతకాలం సమైక్యాంధ్ర నేతల తొత్తులుగా ఉంటారని ఆయన ప్రశ్నించారు. ఉద్యమంలోకి కలిసిరావాలని కోరారు.

## కంటతడి పెట్టిన కేసీఆర్

ఇషాన్‌రెడ్డి బలిదానం చేసిన స్థలానికి చేరుకున్న టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బోరున విలపించారు. మృతుడి బంధువులతో కలిసి క్యాంపస్ ప్రధాన రహదారిలో బైఠాయించారు. విద్యార్థులు, నాయకులతో కలిసి ఇషాన్‌రెడ్డి మృతదేహాన్ని అంబులెన్స్‌లో చేర్చే వరకు అక్కడే ఉన్నారు.

## అంతిమయాత్రలో అడుగడుగునా అడ్డంకులు

ఇషాన్‌రెడ్డి అంతిమయాత్రకు పోలీసులు అడుగడుగునా అవాంతరాలు చెప్పారు. ఇషాన్‌రెడ్డి అఖరి కోరిక తీర్చాలని మానవ హక్కుల కమీషన్ నుంచి అనుమతి తీసుకుని ఆయన అంతిమయాత్రను ఓయూ నుంచి విద్యానగర్, నల్లకుంట, బర్కత్‌పురా, నారాయణగూడ మీదుగా గన్‌పార్క్‌కు చేరుకుంది. ఊరేగింపులో కేసీఆర్‌తో సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. గన్‌పార్క్‌లో నివాళులు అర్పించిన అనంతరం

వెళ్లిపోయారు. సైఫాబాద్ పీజీ కళాశాల విద్యార్థులు నల్లబ్యాడ్జీలు ధరించి ఇషాన్‌రెడ్డి అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. మీ త్యాగం వృథా కానివ్వమంటూ ప్రతిజ్ఞ చేశారు. ఇషాన్ మరణానికి టీడీపీ, కాంగ్రెస్‌లే బాధ్యత వహించాలంటూ ఆ పార్టీల దిష్టిబొమ్మలను ఏబీవీపీ కార్యకర్తలు దహనం చేశారు.

**02 ఆగస్టు 2010:**

ఉప ఎన్నికల్లో గెలుపొందిన 12 మంది తెలంగాణ ఎమ్మెల్యేలు తిరిగి ప్రమాణ స్వీకారం చేసారు.

**08 ఆగస్టు 2010:**

నగరంలో బోనాల జాతర ప్రారంభం.

**12 ఆగస్టు 2010:**

తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి నేతలు రాష్ట్ర గవర్నర్‌ను కలిసి తెలంగాణలో ఆత్మహత్యలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా వినతి పత్రం సమర్పించారు.

**17 ఆగస్టు 2010:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష ధోరణి వల్లే తెలంగాణలో ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నదని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మాత్రమే ఆత్మహత్యల నివారణకు ఏకైక పరిష్కారమని ఆత్మహత్యల నివారణ కమిటి కన్వీనర్ ప్రొ॥ ఘంటా చక్రపాణి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు.

**18 ఆగస్టు 2010:**

**ఆత్మహత్యలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ**

ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఎవరూ ఆత్మబలిదానం చేసుకోవద్దని పలు తెలంగాణ సంఘాలు కోరాయి. ఆత్మహత్యలకు వ్యతిరేకంగా బుధవారం గన్‌పార్క్ వద్ద సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించారు. అక్కడ తెలంగాణ జర్నలిస్టుల ఫోరం కన్వీనర్ అల్లం నారాయణ అందరితో ప్రతిజ్ఞ చేయించాడు.

ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాల ముందు జరిగిన సామూహిక ప్రతిజ్ఞలో జేఏసి కన్వీనర్ కోదండరాం పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర కీలకమని, మనమీద మనం శిక్షలు విధించుకోవడం సరికాదని అన్నారు.

సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ టీచర్స్ జేఏసి ఆధ్వర్యంలో ఆత్మహత్యలు చేసుకోవద్దని జేఏసి కోకన్వీనర్ మల్లెపల్లి లక్ష్మయ్య ప్రతిజ్ఞ చేయించారు.

హైదరాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ ఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు, తెలంగాణవాదులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఆత్మహత్యలు చేసుకుని కుటుంబ సభ్యులకు క్షోభను మిగిల్చవద్దని టీఎన్జీవోల సంఘం నాయకురాలు అరుణ, జిల్లా కార్యదర్శి హరిబాబు కోరారు.

తిరుమలగిరి రవాణా శాఖ జోనల్ కార్యాలయంలో టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు శ్యామ్యూల్‌పాల్ తెలంగాణ కోసం ఆత్మహత్యలకు పాల్పడవద్దంటూ ప్రతిజ్ఞ చేయించారు.

## “ఆంధ్రా ఉత్పత్తుల బహిష్కరణ – సహాయనిరాకరణోద్యమం” సదస్సు

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రాత్రి మూలవాసి జేఏసి, అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటి సంయుక్త ఆధ్వర్యంలో “ఆంధ్రా ఉత్పత్తుల బహిష్కరణ – సహాయనిరాకరణోద్యమం” అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కేశవరావు జాదవ్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రా రాములు ప్రసంగిస్తూ తెలంగాణ ప్రజలు సీమాంధ్రుల సినిమాలను చూడొద్దని పిలుపునిచ్చారు. తెలంగాణలోని వనరులు పరిరక్షించుకోవడానికి సింగరేణి ఓపెన్‌కాస్ట్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని కోరారు.

## 28 ఆగస్టు 2010:

హైదరాబాద్‌లోని జేయేసీ కార్యాలయంలో సింగరేణి జేయేసీ ప్రత్యేక సమావేశం. సింగరేణి చైర్మన్‌ను కలిసి సింగరేణి గని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించిన తెలంగాణ జేయేసీ నాయకులు కోదండరాం, మల్లెపల్లి లక్ష్మయ్య, పిట్టల రవీందర్, గురిజాల రవీందర్‌రావు లతో పాటు సింగరేణి జేయేసీ నాయకులు మునీర్, ముక్తార్ పాషా, మోహన్‌రావు, చంద్రమౌళి, ప్రతాప్ కుమార్, మాధవ్‌నాయక్, జి. శ్రీనివాస్, డా॥ శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## డిమాండ్స్:

1. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొంటున్న గని కార్మికులను, కంపనీ ఉద్యోగులను, తెలంగాణ ప్రాంతానికి చెందిన సింగరేణి అధికారులను వేదిస్తున్న సింగరేణిలోని సీమాంధ్ర అధికారులపై చర్య తీసుకోవాలి. 2. సింగరేణిలో ఓపెన్‌కాస్టు గనుల నిర్మాణాన్ని నిలిపివేయాలి. 3. సింగరేణిలో అండర్‌గ్రౌండ్ గనులు, ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలి. 4. గతంలో బోర్డు తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా సింగరేణిలో 610 జి.వో.ను అమలు చేస్తూ స్థానిక రిజర్వేషన్ పద్ధతిని పాటించాలి. 5. డిస్మిస్డ్, డిపెండెంట్, మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల పిల్లలకు కంపనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. 5. సింగరేణి నిర్వహణలో కోల్‌బెల్ట్

ప్రాంతంలో ప్రత్యేకంగా ఒక మెడికల్ కళాశాలను, మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసి సింగరేణి గని కార్మికుల పిల్లలకు ప్రత్యేకంగా సీట్లను కెటాయించాలి. 6.ఓపెన్ కాస్టు గనులలో ఓవర్‌బర్డెన్ మట్టి తొలగింపు పనులను స్థానికులకే కాంట్రాక్టు ఇవ్వాలి. 7. ఓపెన్ కాస్టులలో కాంట్రాక్టు ఉద్యోగ నియామకాలలో భూనిర్వాసితులకు, సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువకులకు ప్రాధాన్యతనివ్వాలి.

**30 ఆగస్టు 2010:**

సెప్టెంబరు 17 తేదీని విలీన దినంగా లేక విమోచన దినంగా... ఎట్లా జరపాలనే అంశంపై ఈ రోజు జరిగిన తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశంలో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. ఈ రోజును అమరవీరుల సంస్మరణగా జరుపుకోవాలని జేయేసీ చైర్మన్ కోదండరాం సూచించారు. విలీనం అనడం సరికాదని బిజెపి ప్రతినిధి వనం ఝాన్సీ తమ పార్టీ అభ్యంతరాన్ని వ్యక్తం చేసారు. ఆ రోజున జాతీయ జెండాను ఎగురవేయడంపై న్యూ డెమోక్రసీ నేత పి. సూర్యం తమ పార్టీ అభ్యంతరాన్ని వ్యక్తం చేసారు.

**01 సెప్టెంబరు 2010:**

తెలంగాణ జేయేసీ, ఉస్మానియా విద్యార్థి జేయేసీల సంయుక్త సమావేశం తెలంగాణ జేయేసీ కార్యాలయంలో జరిగింది. భవిష్యత్తుల జరుగబోయే ఉద్యమ కార్యాచరణలో కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

**02 సెప్టెంబరు 2010:**

తెలంగాణ జేయేసీ, ఉస్మానియా విద్యార్థి జేయేసీల సంయుక్త సమావేశం తెలంగాణ జేయేసీ కార్యాలయంలో జరిగింది.

**నిర్ణయాలు:**

1) సెప్టెంబరు 3వ తేదీ నాడు ముల్కీ అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలి. 2) 4వ తేదీ నాడు ప్రభుత్వ కార్యాక్రమాలన్నింటిని బహిష్కరించి ఊరేగింపులు నిర్వహించాలి. స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలి. 3) 5వ తేదీ నాడు తెలంగాణ బంద్ నిర్వహించాలి. గ్రూప్-1 పరీక్షలు బహిష్కరించాలి.

**09 సెప్టెంబరు 2010:**

కాళోజీ జయంతి సందర్భంగా గన్‌పార్కువద్ద నివాళి.

**11 సెప్టెంబరు 2010:**

తెలంగాణ ఉద్యమంపై విషం చిమ్ముతున్న సీమాంధ్ర మీడియా వైఖరిపై చర్చ నిర్వహించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు కె. శ్రీనివాస్ రెడ్డి, దేవులపల్లి అమర్‌లకు జేయేసీ తరుపున లేఖను అందించిన చైర్మన్

కోదండరాం, కోఆర్డినేటర్ పిట్టల రవీందర్.

**19 సెప్టెంబరు 2010:**

తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం.

**26 సెప్టెంబరు 2010:**

**కోటి బతుకమ్మల జాతర పోస్టర్, సీడీ ఆవిష్కరణ**

ఆర్థికంగా, రాజకీయంగా నష్టపోతే పుంజుకోవచ్చు కాని సాంస్కృతికంగా నష్టపోతే పుంజుకోలేమని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన కోటి బతుకమ్మల జాతర సీడీ, వాల్‌పోస్టర్‌ను జాగృతి అధ్యక్షురాలు కె.కవితతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆక్టోబర్ 7న నల్గొండ జిల్లా సూర్యాపేట, 8న ఖమ్మం జిల్లా భద్రాచలం, 9న వరంగల్ జిల్లా పరకాల, 10న కరీంనగర్ జిల్లా గోదావరిఖని, 11న ఆదిలాబాద్ జిల్లా నిర్మల్, 12న నిజామాబాద్ జిల్లా వెల్మల్, 13న మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి, 14న మెదక్ జిల్లా ఓడీఎఫ్ ఎద్దులమైలారం, 15న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌లలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు షెడ్యూల్ ప్రకటించారు.

**30 సెప్టెంబరు 2010:**

**ఉద్యోగులకు బాసటగా జేఏసి ధర్నా**

తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, అధికారులపై ప్రభుత్వ రాజకీయ వేధింపులకు నిరసనగా తెలంగాణ జేఏసి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జేఏసి కన్వినర్ కోదండరాం మాట్లాడుతూ హక్కుల కోసం అడిగితే బదిలీలు, సస్పెండ్‌లు చేయడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. సీమాంధ్ర ప్రభుత్వం కావడం వల్లనే ఉద్దేశ పూర్వకంగా వేధిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వ వేధింపులు ఆపకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగ సంఘాల జేఏసి కన్వినర్ స్వామిగౌడ్ మాట్లాడుతూ ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు కూడా మనుగడ సాగించలేదని, వెంటనే స్పందించకుంటే ఈ ప్రభుత్వా నికి అదే గతి పడుతుందని హెచ్చరించారు. ఈ ధర్నాలో బీజేపి నేత విద్యాసాగర్‌రావు, టీఆర్ఎస్ నేత దాసోజు శ్రావణ్‌కుమార్, జేఏసి నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావం**

ప్రజా యుద్ధనౌక గద్దర్ సారథ్యంలో 'తెలంగాణ ప్రజా ఫ్రంట్' ఆవిర్భవించింది. పలు ప్రజా, మహిళా, దళిత, విద్యార్థి సంఘాల ఉమ్మడి రూపంగా అవతరించింది.

ఎవరికీ ప్రత్యామ్నాయం కాదంటూనే... 'ఏక వ్యక్తి' నాయకత్వంపై సందేహాలు వ్యక్తం చేసింది. తెలంగాణ వనరుల పరిరక్షణ, పార్లమెంటులో ప్రత్యేక రాష్ట్ర బిల్లు ప్రవేశ పెట్టడమే లక్ష్యమని ఫ్రంట్ ప్రకటించింది. తెలంగాణ ప్రజా ఫ్రంట్‌కు ఉస్మానియా జేఏసి నేతలు మద్దతు ప్రకటించారు. దీనిని తెలంగాణ అమర వీరుల కుటుంబాల ప్రతినిధి రఘుమా రెడ్డి స్వాగతించారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి కత్తి పద్మారావు మద్దతు పలికారు. తెలంగాణ రాష్ట్రానికి గద్దర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రబల శక్తిగా మారాలని ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ ఆకాంక్షించారు. వీరంతా టీఆర్ఎస్ నాయకత్వంపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విమర్శలు, ఆరోపణలు గుప్పించారు. అన్నింటికీ మించి ఫ్రంట్‌తో కలిసి పనిచేసేలా టీడీపీని ఒప్పిస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు.

**04 అక్టోబరు 2010:**

"తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టుల" నినాదంతో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మీడియా మార్చ్.

**05 అక్టోబరు 2010:**

తెలంగాణ జేయేసీ చైర్మన్ కోదండరాం అమెరికా పర్యటన.

**11 అక్టోబరు 2010:**

సింగరేణి జేయేసీ స్టీరింగ్ కమిటి భూపాలపల్లిలో ప్రత్యేక సమావేశం. ముఖ్య అతిధిగా హాజరైన జేయేసీ కోఆర్డినేటర్ పిట్టల రవీందర్. సింగరేణి సమస్యలపై ఉద్య మించాలని నిర్ణయం.

**14 అక్టోబరు 2010:**

తెలంగాణ నాలుగు జిల్లాలోని అన్ని సింగరేణి ప్రాంతాలలో కార్మిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి జేయేసీ ఆధ్వర్యంలో ధర్నాలు.

**22 అక్టోబరు 2010:**

వరంగల్ జిల్లా మహబూబాబాద్‌లో స్థానిక జేయేసీ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన అమరవీరుల స్మారక స్థూపానికి భూమి పూజ నిర్వహించిన జేయేసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పిట్టల రవీందర్.

**23 అక్టోబరు 2010:**

సిద్దిపేటలో జరిగిన తెలంగాణ విద్యావంతుల వేదిక మెదక్ జిల్లా మహాసభ. మహసభకు హాజరైన జేయేసీ చైర్మన్ కొదండరాం, వేదిక ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్.

**24 అక్టోబరు 2010:**

సూర్యాపేటలో జరిగిన తెలంగాణ విద్యావంతుల వేదిక నల్గొండ జిల్లా మహాసభ. హాజరైన జేఏసీ చైర్మన్ కొదండరాం, వేదిక ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్.

**25 అక్టోబరు 2010:**

"తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు" నినాదంతో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం సదస్సు.

రంగారెడ్డి తూర్పు జిల్లా ఆధ్వర్యంలో చైర్మన్ వెదిరె చెల్మారెడ్డి అధ్యక్షతన కొత్తపేటలోని అంబేద్కర్ భవన్‌లో సదస్సు. హజరైన జేయేసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పిట్టల రవీందర్, తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్.

**27 అక్టోబరు 2010:**

భూపాలపల్లిలో 303రోజులకు చేరిన తెలంగాణ రిలే నిరాహారదీక్షలు. ప్రత్యేక సదస్సు ముఖ్య అతిధిగా హాజరైన జేయేసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పిట్టల రవీందర్.

**28 అక్టోబర్ 2010:**

రంగారెడ్డి జిల్లా తాండూరులో జరిగిన తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా మహాసభ.

**29 అక్టోబరు 2010:**

**హైదరాబాద్ రాష్ట్ర విద్యుత్ బోర్డు శతాబ్ది ఉత్సవాలు**

హైదరాబాద్ రాష్ట్ర విద్యుత్ బోర్డు శతాబ్ది ఉత్సవాల్లో జైతెలంగాణ నినాదం మిన్నంటింది. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసి శుక్రవారం ఇక్కడ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ ఉత్సవాలను విద్యుత్ ఉద్యోగుల జేయేసీ నాయకుడు కె.రఘు అధ్యక్షత వహించారు. డిసెంబర్ 31 తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తీరాలంటూ పలువురు నినదించారు. లేని పక్షంలో తెలంగాణ పదిజిల్లాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించారు. సీఎం రోశయ్య ఇంటికి కరెంటు తీసేస్తామని స్పష్టం చేశారు.

అయ్యా పీఎం గారూ, సీఎం గారూ ఈరోజు తెలంగాణ బెబ్బులిలా లేచి కూర్చుని ఉంది. కాంట్రాక్టు ఉద్యోగులను జూనియర్‌లైన్‌మెన్‌గా నియమించాలని హైకోర్టు తీర్పు చెప్పినా ఇక్కడ అమలు చేయకుండా ఆంధ్రాలో అమలు చేశారు. మంచిగ అయితే సరే సరే లేకుంటే కట్కాలు బంద్‌జేత్తే వారే దారికత్తరు. పదేళ్ల కింద కేసీఆర్ ఒక్కడే ఇప్పుడు అందరూ కేసీఆర్లే. అధికారులను పిలిచినా ఒక్కరు రాలేదు. వాళ్లకు సిగ్గులేదు. 1956లో ఏ తెలంగాణ అయితే ఆంధ్రలో కలిపారో.. ఆ తెలంగాణే కావాలి దానికి ఇంచ్ తగ్గినా ఒప్పుకోం...

**– కేసీఆర్ (టీఆర్ఎస్)**

సీపీఐది ఒకే మాట.. ఒకే నినాదం... ఒకే గొంతు కమిటీ ఎలాంటి నివేదిక ఇచ్చినా రాజకీయ ప్రక్రియ ద్వారానే తెలంగాణ ఏర్పాటవుతుంది. ఆ ప్రక్రియలో సీపీఐ ముందుంటుంది. **–కె. నారాయణ (సీపీఐ)**

కమిటీ నివేదికతో సంబంధం లేకుండా పార్లమెంటులో బిల్లుపెట్టాలి. ఓపెన్‌కాస్టు బొగ్గు తవ్వకాల వల్ల తెలంగాణ శ్మశానంగా మారుతోంది.

**– బండారు దత్తాత్రేయ (బీజేపి)**

హైదరాబాద్ రాష్ట్ర విద్యుత్ బోర్డు శతాబ్ది ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించకపోవడమే తెలంగాణ వివక్షకు నిదర్శనం. తెలంగాణ కోసం జరుగుతున్న పోరాటంలో ఉద్యోగులకు ఎన్నో కష్టాలు ఎదురవుతున్నాయి. వారికి మెమోలు జారీ అవుతున్నాయి. అయినా వాటి గురించి ఎవరూ పట్టించుకోవద్దు. న్యాయం కోసం జరిగే పోరాటంలో కష్టాలు తప్పవు.

**– కోదండరాం (టీజేఏసి)**

**టీ–జేఏసి డిమాండ్లు**

ప్రత్యేక తెలంగాణపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలి

ఐమాక్స్ థియేటర్ సమీపంలో హైదరాబాద్ రాష్ట్ర విద్యుత్ బోర్డు స్మారక కేంద్రాన్ని ఏర్పాట చేయాలి.

శంకర్‌పల్లి, కరీంనగర్ ప్రాజెక్టులకు గ్యాస్‌ను, సత్తుపల్లి ప్రాజెక్టుకు బొగ్గును కేటాయించాలి. వీటీపీఎస్, ఆర్టీపీపీలకు కేటాయింపులు వెంటనే రద్దు చేయాలి.

కాంతనపల్లి, దుమ్ముగూడెం హైడల్ ప్రాజెక్టులను వెంటనే చేపట్టాలి. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విద్యుత్కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

సీపీడీసీఎల్ పరిధి నుంచి అనంతపురం, కర్నూల్ సర్కిళ్లను తప్పించాలి.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి. హైకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను జూనియర్ లైన్‌మెన్‌లుగా రెగ్యులరైజ్ చేయాలి.

**31 అక్టోబరు 2010:**

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కాలేజీలో "తెలంగాణ రిటైర్డ్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్" ఆవిర్భావ సదస్సు. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం, అధ్యక్షునిగా ఎన్నికైన జి. వెంకటరెడ్డి.

**01 నవంబరు 2010:**

**తెలంగాణ విద్రోహంగా...రాష్ట్ర అవత'రణం'**

రాష్ట్ర అవతరణ దినోత్సవానికి వ్యతిరేకంగా తెలంగాణవాదులు కదం తొక్కారు. వారి నిరసనలు, ఆందోళనలతో తెలంగాణ అట్టుడికిపోయింది. నగరంలో ఓయూ

విద్యార్థులు గన్‌పార్క్‌వరకు నిర్వహించ తలపెట్టిన ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. పలు సంఘాలు ధర్నాలు, నిరసన సభలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో భారీ బందోబస్తు మధ్య ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి రోశయ్య పాల్గొన్నారు. తెలంగాణవాదులు పలు చోట్ల నల్లబ్యాడ్జీలు, నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపారు. నల్లబెలూన్లు వదిలారు. నల్ల జెండాలు ఎగురవేశారు.

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో తెలంగాణ విద్రోహదినంలో భాగంగా "రహదారులపై జనదండోరా" కార్యక్రమం. అనేక చోట్ల నల్ల బెలూన్ల ఎగురవేత.

**02 నవంబరు 2010:**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి తొలిసారిగా తెలంగాణ జేయేసీ కార్యాలయ సందర్శన.

**07 నవంబరు 2010:**

హుస్నాబాద్‌లో జరిగిన తెలంగాణ విద్యావంతుల వేదిక కరీంనగర్ జిల్లా మహాసభ. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొ॥ ఘంటా చక్రపాణి, పిట్టల రవీందర్.

**12 నవంబరు 2010:**

తెలంగాణ విద్యావంతుల వేదిక మహబూబాబాద్ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో కెసముద్రంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సాధన సదస్సులో పాల్గొన్న దేశ్‌పతి శ్రీనివాస్, పిట్టల రవీందర్.

**13 నవంబరు 2010:**

ఖమ్మంలో జరిగిన తెలంగాణ విద్యావంతుల వేదిక మూడవ రాష్ట్ర సదస్సు. గౌరవాధ్యునిగా కోదండరాం, అధ్యక్షునిగా మల్లెపల్లి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్ పిట్టల రవీందర్ ఏకగ్రీవ ఎన్నిక.

**16 నవంబరు 2010:**

రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్మించిన యమలోకంలో తెలంగాణ సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది.

**17 నవంబరు 2010:**

హైదరాబాద్‌లో ప్రజా ఉద్యమాల సంఘీభావ కమిలి ఏర్పాటు.

**20 నవంబరు 2010:**

టిఎన్జీఓ భవన్‌లో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం విస్తృత స్థాయి సమావేశం.

**05 డిసెంబరు 2010:**

**తెలంగాణ పాత్రికేయుల మహాసభ**

తెలంగాణ రాష్ట్రం సాధించే వరకు కలిసే ఉద్యమిస్తామని పలు రాజకీయ

పక్షాలు, ప్రజా సంఘాల నేతలు ప్రకటించారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో ఆర్టీసీ కళాభవన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా వందలాది మంది జర్నలిస్టులు అమరవీరుల స్మారకస్థూపం గన్‌పార్కునుండి ఆర్టీసీ కళాభవన్ వరకు భారీ ర్యాలిని నిర్వహించారు.

ఆలోచనలు, దారులు వేరైనా లక్ష్యసాధనలో కలిసిసాగుతామని, వ్యక్తిగత బేధాలు ఎవ్వరికి లేవని ప్రజా ఫ్రంట్ అధ్యక్షుడు గద్దర్ స్పష్టం చేశారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ సహాయనిరాకరణ చేపట్టాలని కోరారు.

కాంగ్రెస్ ఎంపీ మధుయాష్కీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రకటిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే రాష్ట్ర రాజకీయాలే ఆటంకాలుగా ఉన్నాయని చెప్పారు.

టీడీపీ నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబు మాట తప్పిననాడు తెగతెంపులు చేసుకుంటామని ప్రకటించారు.

బీజేపి నేతలు దత్తాత్రేయ, విద్యాసాగర్‌రావులు మాట్లాడుతూ డిసెంబర్ 9 ప్రకటనకు కట్టుబడి పార్లమెంటులో బిల్లు పెడితే తమ పార్టీ మద్దతు ఇస్తుందని తెలిపారు.

విమలక్క మాట్లాడుతూ తెలంగాణ వేచ్చే వరకు తెగించి కొట్లాడతామని పేర్కొన్నారు.

తమ మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని తెలంగాణ కోసం అంతా కలిసి పనిచేస్తామని కేసీఆర్, గద్దర్, విమలక్క, దత్తాత్రేయ, విద్యాసాగర్‌రావులు చేతులు కలిపి అభివాదం చేశారు.

ఏపీయూడబ్ల్యూజేలో కొనసాగాల్సిన అవసరం లేదని ప్రత్యేకంగా తెలంగాణ పాత్రికేయుల సంఘం ఏర్పాటు చేసుకోవాలని కేసీఆర్ సూచించారు. యూనియన్‌కు తొలి విరాళంగా రూ. 10లక్షలు ప్రకటించారు.

రాష్ట్రీయ లోక్‌దళ్ నేత అజిత్‌సింగ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉద్యోగ సంఘాల నేతలు, జేఏసీ నేతలు, వివిధ పత్రికల సంపాదకులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

**16 డిసెంబరు 2010:**

**బిల్లు పెట్టాల్సిందే: మహా గర్జనలో కేసీఆర్**

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన చేసి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఇక తాము మరింత కాలం వేచి ఉండే ప్రసక్తే లేదని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ప్రకటించారు. శ్రీకృష్ణ కమిటీకీ సంబంధం లేకుండా పార్లమెంటులో బడ్జెట్ సమావేశాలలో బిల్లు పెట్టాల్సిందేనని అల్టిమేటం జారీ చేశారు. ఈమేరకు గురువారం వరంగల్‌లో శ్రీకాంతాచారి ప్రాంగణంలో జరిగిన టీఆర్ఎస్ 'తెలంగాణ మహాగర్జన' సభలో తీర్మానం చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు బిల్లును పెట్టకపోతే గాంధీమార్గంలో సత్యాగ్రహంతో మొదలు పెట్టి మహోద్యమంగా మలుస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెనుఅగ్రహాన్ని చవిచూస్తాయని హెచ్చరించారు. రాబోయే వారం రోజుల్లో తెలంగాణ రాజకీయ జేఏసి సమావేశాన్ని ఏర్పాటు చేసి డిసెంబర్ 31 తర్వాత ఉద్యమ స్వరూపం ఎలా ఉండాలన్న దాన్ని నిర్ణయిస్తామని ప్రకటించారు.

మహోగ్ర ఉద్యమాన్ని నిర్మించైనా, ఆకాశాన్ని బద్దలు కొట్టైనా సరే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుందామని కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఓపిక, సహనాన్ని పరీక్షించవద్దని కోరారు. శ్రీకృష్ణ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత బడ్జెట్ సమావేశాల వరకు గడువు ఇస్తామని, బడ్జెట్ సమావేశాలలో బిల్లు పెట్టాల్సిందేనని స్పష్టం చేశారు.

డిసెంబర్ 31 తర్వాత ఏమవుతుంది? జనవరి 1 వస్తుంది. అన్న గవర్నర్ నర్సింహన్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. అత్యున్నత స్థానంలో ఉన్న ఆయన అలా మాట్లాడటం తగదన్నారు. డిసెంబర్ 31 తర్వాత తెలంగాణ ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకుని అదనపు బలగాలను తెప్పిస్తున్నట్లు డీజీపీ అరవిందరావు చెప్పడం సరికాదని, పోలీసు లాఠీ, తూటాలకు తెలంగాణ ప్రజలు భయపడబోరని స్పష్టం చేశారు. ఆయనకు నిబద్ధత ఉంటే తమ సభకు హాజరై ప్రజల ఫోటోను, ప్రజల అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెప్పాలని, తెలంగాణ ఇస్తే గొడవ ఉండదని నివేదించాలని సూచించారు.

తెలంగాణ ప్రజలు నారాజ్ కావద్దని, ఆగం కూడా కావద్దని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. కీలెరిగి వాతపెట్టాలని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా ఇంటికి ఒక్కరు చొప్పున 25లక్షల మందికి పైగా సభకు హాజరయ్యారని కేసీఆర్ అన్నారు. జనం సముద్ర కెరటాల్లా వచ్చారని, దేశ చరిత్రలో ఇంతపెద్ద సభ ఎక్కడ జరగలేదని కేసీఆర్ చెప్పారు.

## పోరాటంలో న్యాయం ఉంది: అగ్నివేశ్

తాను ఆంధ్రా ప్రాంతంలోని శ్రీకాకుళంలో పుట్టానని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరుకుంటున్నానని అఖిల భారత ఆర్యసమాజ్ అధ్యక్షుడు స్వామి అగ్నివేశ్ చెప్పారు. తెలంగాణ ప్రజల పోరాటంలో న్యాయం ఉందని, ఇది సహేతుకమైన సుదీర్ఘ పోరాటమని వ్యాఖ్యానించారు. 55 ఏళ్ల తెలంగాణ పోరాటానికి ఇది చివరి అంకమన్నారు.

తెలంగాణ వచ్చే వరకు పోరాటం తప్పదని, అలుపెరుగని పోరాటం చేయాలని

టీఆర్ఎస్ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. మహగర్జన సభలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. భారీ సంఖ్యలో సభకు హాజరైన జనాన్ని చూస్తూ... "సభ ఒక తుఫానులా కనబడుతోంది. ఈ రోజు ప్రాముఖ్యాన్ని, చారిత్రక వాస్తవాలను మరిచిపోతే నష్టమే. గత డిసెంబర్ 9 ప్రకటనకు కారకులెవరు? ఎవరి వల్ల ప్రకటన వచ్చింది? ఎవరి వల్ల ఆగిపోయింది? ఆ ప్రకటన ఆషామాషీ కాదు, కేసీఆర్ ఇచ్చిన పిలుపు స్ఫూర్తితోనే తెలంగాణ ఆబాలగోపాలం తరలివచ్చింది. కొద్ది రోజులుగా రాష్ట్రంలో సంభవిస్తున్న పరిణామాలను గమనిస్తే ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తే చాలని యాచకులుగా అర్థిస్తున్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఉన్న తెలంగాణ మంత్రుల ప్రతిపత్తి, ప్రాముఖ్యత ఏమిటి? కోరలు తీసిన హోంశాఖను ఇచ్చారు. లా అండ్ ఆర్డర్ వారి చేతుల్లో పెట్టుకున్నారు. లాఠీ వారి చేతిలో ఉంచుకుని అక్కరకు రాని టోపి మన చేతిలో పెట్టారు. పాపం ఆ అమ్మాయి (సబితాఇంద్రారెడ్డి) మాత్రం ఏం చేస్తుంది? అని ప్రశ్నించారు. తెలంగాణ కాంగ్రెస్, టీడీపీ నేతలు రాజ్యాధికారం కోసమో, తెలంగాణ కోసమో కాకుండా పదవుల కోసం యాచకులుగా మారారని విమర్శించారు.

తెలంగాణ జేఏసి చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ... "కండ్లుండి చూసే వారికి, చెవులుండి వినే వారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సభ మొత్తం చూస్తేచాలు. తెలంగాణ గుండె చప్పుడు వినిపిస్తుంది. శ్రీకృష్ణ కమిటీ వచ్చింది కదా ఏమవుతుందని అందరూ అడుగుతున్నారు. డిసెంబర్ 31 తర్వాత కొట్లాడి తెలంగాణ తెచ్చుకోవాలని చెప్పేందుకే ఇక్కడికొచ్చా... మన శక్తి చూపకపోతే ఎలా అనుకుని సమ్మక్క, సారలమ్మ జాతరలాగా ఎవరికి వారే వచ్చింద్రు. మనం ఇంతమందిమి రోడ్ల మీదికి వస్తే అపుతదా ఈ ప్రభుత్వం.. ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడగలం, కొట్లాడగలం, తెలంగాణ తెచ్చుకోగలం..." అని చెప్పారు.

తెలంగాణ విద్యార్థి జేఏసి కన్వీనర్ పిడమర్తి రవి మాట్లాడుతూ... "డిసెంబర్ 31 తర్వాత శాంతియుతంగా ఉంటాం. కేసీఆర్ ఒక్క మాట చెబితే చాలు హైదారాబాద్‌లో ఒక్క అంధ్రా వారు కూడా ఉండరు. కాని మా విధానం అదికాదు. ఇక జనవరి నుంచి కురుక్షేత్రమే. ఇప్పటి వరకు ఉద్యమంలో ఒక పార్శ్వాన్నే సీమాంధ్రులు చూశారు. కేసీఆర్ నాయకత్వంలో ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నాం" అని ప్రకటించారు. టీఆర్ఎస్ జిల్లా కన్వీనర్ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఈ మహా గర్జనకు అధ్యక్షత వహించారు.

**18 డిసెంబరు 2010:**

తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్ నాయకత్వంలో హుజురాబాద్ డివిజన్ మరియు జిల్లా కమిటి నాయకులు శంకరపట్నం మండలం మొలంగూరులోని గ్రానైట్ మైనింగ్ క్వారీలను సందర్శించారు.

**23 డిసెంబరు 2010:**

తెలంగాణ ద్రోహుల జాబితాను ప్రకటించిన తెలంగాణ జేయేసీ.

**31 డిసెంబరు 2010:**

**చిదంబరం చేతికి నివేదిక - జనవరి 6న వెల్లడిస్తాం**

గడువు ముగియడానికి ఒక్కరోజు ముందుగానే జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ తన నివేదికను కేంద్రానికి సమర్పించింది. కమిటీ సభ్యులు ఐదుగురు బుధవారం ఉదయం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో చివరి సమావేశం జరిపారు. రెండు గంటల పాటు చర్చించారు. కమిటీ నివేదికపై సంతకాలు చేసిన అనంతరం నార్త్‌బ్లాక్‌లోని హోంమంత్రి చిదంబరంను కలిసారు. మధ్యాహ్నం సుమారు 3గంటలకు చిదంబరంకు 600 పేజీల్లో ఉన్న నివేదికను అందజేశారు. నివేదికపై విలేకరులు శ్రీకృష్ణను అడుగగా మీ ప్రశ్నలన్నీ కేంద్రాన్నే అడగండని దాటవేసారు. చిదంబరం మాట్లాడుతూ జనవరి 6న అఖిలపక్షానికి నివేదిక ప్రతులను అందజేసి, అనంతరం ఇంటర్నెట్‌లో పెడతామని చెప్పారు. అప్పటి వరకు మీడియాలో ఊహాగానాలు వద్దని సూచించారు. సకాలంలో నివేదిక అందించిన కమిటీ సభ్యులకు చిదంబరం కృతజ్ఞతలు తెలిపారు.

**06 జనవరి 2011:**

**సమైక్యానికే కమిటీ మొగ్గు**

"విలీనం నాటి నుంచి ఉన్న కొన్ని బలమైన, సహేతుక కారణాల వల్ల తెలంగాణలో కొనసాగుతున్న అసంతృప్తిని పరిగణలోకి తీసుకుంటే, రాష్ట్ర విభజన డిమాండ్ పూర్తిగా అసంబద్ధమేమి కాకపోయినా... అన్ని కోణాలను పరిశీలించాక.. మొగ్గు.. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడం వైపే ఉందని మేం గుర్తించాం!"

– శ్రీకృష్ణ కమిటీ

**కమిటీ చేసిన సిఫార్సులు:**

(కేంద్రం ముందు శ్రీకృష్ణ కమిటీ ఆరు ప్రతిపాదనలు ఉంచింది. ఒక్కో ప్రతిపాదనలోని లాభనష్టాలు, సాధ్యాసాధ్యాలనూ చర్చించింది. ఆ వివరాలు క్లుప్తంగా...)

1. రాష్ట్రంలో యథాతథ స్థితిని కొనసాగించడం

(దీనివల్ల తెలంగాణలో తీవ్రస్థాయిలో భావోద్వేగాలు, హింసాత్మక ఆందోళనలు చెలరేగే అవకాశం ఉంది. ఈ అనిశ్చితిని మావోయిస్టు ఉద్యమం తమకు అనుకూలంగా మార్చుకునే ప్రమాదం ఉంది.)

2. సీమాంధ్ర, తెలంగాణగా విభజించి... హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడం. తగిన కాల వ్యవధిలో రెండు రాష్ట్రాలు వేర్వేరు రాజధానులు

ఏర్పాటు చేసుకోవడం.

(హైదరాబాద్‌ను కోల్పోయేందుకు తెలంగాణ ప్రజలు అంగీకరించరు. ఆందోళనల నేపథ్యంలో ఇక్కడ పరిపాలనకు నష్టం వాటిల్లుతుంది. హైదరాబాద్‌తో సీమాంధ్రకు భౌగోళిక సంధానం తెగిపోతుంది.)

3. రాయలతెలంగాణ, కోస్తాంధ్రగా విభజించి.. హైదరాబాద్‌ను రాయల తెలంగాణలో చేర్చడం.

(దీనిని తెలంగాణవాదులే కాదు, సమైక్యవాదులు కూడా అంగీకరించే పరిస్థితి లేదు. తెలంగాణలో ఒక్కరంటే ఒక్కరు కూడా దీనికి సరే అనలేదు.)

4. ఆంధ్రప్రదేశ్‌ను సీమాంధ్ర, తెలంగాణగా విభజిస్తూ.. హైదరాబాద్ మహా నగర పరిధిని విస్తరించి, దానిని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడం. అటు ఆగ్నేయంలో నల్లగొండ ద్వారా గుంటూరుతో, ఇటు దక్షిణాన కర్నూలుతో భౌగోళిక సంబంధం ఉండేలా యూటీ పరిధిని విస్తరించడం.

(మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని కొన్ని గ్రామాలను కోల్పోయేందుకు తెలంగాణవాదులు అంగీకరించరు. ఇప్పటిదాకా రాష్ట్రంలో భాగమైన ప్రాంతాలను కేంద్రం చేతిలో పెట్టేందుకు సీమాంధ్రులూ అంగీకరించకపోవచ్చు)

5. రాష్ట్రాన్ని ఇప్పుడున్న సరిహద్దుల ప్రకారం తెలంగాణ, సీమాంధ్రగా విభజించడం. హైదరాబాద్‌ను తెలంగాణకు రాజధానిగా ప్రకటించి... సీమాంధ్రకు కొత్త రాజధానిని ఏర్పాటు చేయడం.

(దేశవ్యాప్తంగా ప్రత్యేక రాష్ట్రాలు కావాలనే డిమాండ్లకు మరింత ఊతం ఇచ్చినట్లవుతుంది. నక్సలిజం, మత ఛాందసవాదం పెరిగే అవకాశం వల్ల.. ఇది అంతర్గత భద్రతపైనా ప్రభావం చూపుతుంది.)

6. రాష్ట్రాన్ని ఉమ్మడిగానే ఉంచి... తెలంగాణ సామాజిక అభివృద్ధికి కొన్ని నిర్దిష్టమైన రాజ్యాంగ బద్ధమైన చర్యలు తీసుకోవడం, రాజకీయ సాధికారత కోసం చట్టబద్ధమైన ప్రాంతీయ మండలి ఏర్పాటు.

(3ప్రాంతాల ప్రయోజనాలను పరిశీలిస్తే.. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడమే ఉత్తమం. విభజించినంత మాంత్రాన ప్రస్తుత సమస్యలకు పరిష్కారం లభించదు. తెలంగాణ సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం రాజ్యాంగ/చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి.)

**భగ్గుమన్న ఓయూ**

ఉస్మానియా వర్సిటీ రణరంగమైంది. శ్రీకృష్ణ కమిటీ నివేదిక అంశాలను బహిర్గతమైన కొద్ది సేపటికే వర్సిటీ భగ్గుమంది. మధ్యాహ్నం మొదలై.. రాత్రి దాకా

సాగిన ఈ ఘర్షణల్లో 300 బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. పదిహేను రౌండ్లు రబ్బరు బుల్లెట్లు సంధించారు. కమిటీ తెలంగాణ ప్రజల మనోభావాలను, విద్యార్థుల బలిదానాలను గుర్తించలేదంటూ రాజ్‌భవన్ ముట్టడికి ప్రయత్నించడంతో ఉద్రిక్తతలు తలెత్తాయి. ఈ సందర్భంగా మూడు బస్సులను ఆందోళనకారులు దగ్ధం చేశారు. మొత్తం ఘటనల్లో 24 మంది పోలీసులకు, ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయని, రబ్బరు బెల్లెల్లు తగిలి ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయని నగర పోలీస్ కమీషనర్ ఏకే ఖాన్ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఓయూ విద్యార్థి జేఏసి తెలంగాణ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చింది.

### ఇందిరాపార్కు వద్ద జేఏసి ధర్నా: సహాయనిరాకరణవైపుగా కదులుదాం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చే వరకు పోరాటం ఆగదని తెలంగాణ జేఏసిలోని భాగస్వామ్య పక్షాలు స్పష్టం చేశాయి. పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టేవరకు పోరు సాగిస్తామని తేల్చిచెప్పాయి. ఇకపై సహాయ నిరాకరణవైపు సాగుదామని గురు వారం ఇక్కడ ఇందిరాపార్కు వద్ద జరిగిన జేఏసి ధర్నాలో పాల్గొన్న పలువురు వక్తలు ఉద్ఘా టించారు. పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టాలనే డిమాండ్‌తో తెలంగాణ జేఏసి ఈ ధర్నా నిర్వహించింది. ధర్నాకు జేఏసి చైర్మన్ కోదండరాం అధ్యక్షత వహించరు.

టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడుతూ కమిటీ నివేదిక వ్యతిరేకం కాదని అన్నారు. కమిటీ నివేదికను కేంద్రం సానుకూలంగా తీసుకొని ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. కమిటీ నివేదిక ఆగమాగంగా ఉందన్నారు. 1956 కంటే ముందున్న తెలంగాణ ఇవ్వాలి అనే ఒక్క సిఫారసు తప్ప నివేదికలో మిగిలినదంతా చెత్తేనని విరుచుకుపడ్డారు. హైదరాబాద్ రాజధానితో కూడిన తెలంగాణను మాత్రమే ఒప్పుకుంటామన్నారు.

గద్దర్ మాట్లాడుతూ ఎవ్వరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. అందరం కలిసి శాంతియుతంగా సహాయనిరాకరణను సాగిద్దామని ప్రతిపాదించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్, బీజేపి నాయకులు దత్తాత్రేయ, విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నేతలు స్వామిగౌడ్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం నేత అల్లం నారాయణ, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు మల్లెపల్లి లక్ష్మయ్య, పిట్టల రవీందర్, ఎమ్మెల్సీ చుక్కా రామయ్య, ఎమ్మెల్యే కేటీఆర్, టీఆర్ఎస్వీ బాల్క సుమన్, బీజేపి నాయకురాలు వనం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

### 04 జనవరి 2011:

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల నాయకులతో శాంతి చర్చలు

జరుపాలని చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకంగా టివిఎస్జీవో ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజుల పాటు నిరసన ప్రదర్శనలు.

### 07 జనవరి 2011:

### రగిలిన తెలంగాణ

ఉస్మానియా వర్సిటీ రెండో రోజు కూడా రగిలింది. వరుసగా రెండో రోజు కూడా రబ్బరు బుల్లెట్లు పేలాయి. పోలీసులపైకి రాళ్లు వచ్చి పడ్డాయి. ఆందోళనకారుల చేతిలో పలు బస్సులు ధ్వంసమయ్యాయి. మరికొన్ని దహనమయ్యాయి. విద్యార్థుల నుంచి పెట్రోల్ బాంబులు ఎగిరిపడ్డాయి. నిరసనలు... నినాదాలతో.. తుపాకీ పేలుళ్లతో... బాష్పవాయు గోళాల ప్రయోగంతో వర్సిటీ రణరంగమైంది. మొత్తంగా ఉదయం నుంచి రాత్రిదాకా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉద్రిక్తత రాజ్యమేలింది.

అటు రాజకీయ పార్టీలు తీవ్ర మంతనాలు జరిపాయి. యూనివర్సిటీలో బలగాలను వెనెక్కు రప్పించాలని, మీడియాపై ఆంక్షలు ఎత్తివేయాలని పెద్దఎత్తున డిమాండ్లు వచ్చాయి. అన్ని పార్టీలు తమ తమ నేతలతో సమావేశాలు జరిపాయి. తెలంగాణ ప్రాంత కాంగ్రేస్ నేతలు శుక్రవారం రాజధాని నగరంలోని నిజాంక్లబ్‌లో సమావేశం కాగా, ఇదే ప్రాంత టీడీపీ నేతలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో భేటి అయ్యారు. వర్సిటీ నుంచి బలగాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ రాజ్‌భవన్ ముందు టీడీపీ నేతలు మెరుపు ధర్నా చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగరేణిలో సమ్మె చేసేందుకు కార్మిక సంఘాలు సై అన్నారు. ఈనెల 10 నుంచి కార్యాచరణ మొదలు పెడతామని ప్రకటించాయి.

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో తెలంగాణ బిల్లు పెట్టాలని లేనిపక్షంలో సర్పంచ్ మొదలు... ఎంపీల వరకు ప్రజాప్రతినిధులందరూ ఆఖరి అస్త్రంగా మూకుమ్మడి రాజీనామాలు చేయాలని తీర్మానించారు. ఓయూలో కాల్పులకు నిరసనగా శనివారం తెలంగాణ వ్యాప్తంగా రాస్తారోకోలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. ఓయూలో మఫ్టీ పోలీసులే రాళ్లేసారని,, పోలీసులు పేల్చింది అసలైన బుల్లెట్లేనని కోదండరాం ఆరోపించారు. ఓయూలో బలగాలను తొలగించాలని లాయర్లు, లెక్చరర్లు హెచ్చార్సీని ఆశ్రయించారు.

### 11 జనవరి 2011:

### 'వరంగల్' ముట్టడి రక్తసిక్తం

వరంగల్‌లో కలెక్టరేట్ ముట్టడి రక్తసిక్తంగా మారింది. తోపులాట, పోలీసుల లాఠీచార్జితో సీఐ, ఇద్దరు పోలీసులు సహా 17మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా రాజకీయ జేఏసి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వరంగల్‌లో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జరిగింది. టీఆర్ఎస్, బీజేపి సహా అన్ని జేఏసీల ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉద్యోగులు హన్మకొండ

బాలసముద్రంలోని ఏకశిల పార్క్‌లో పెద్దసంఖ్యలో గుమిగూడారు. అక్కడ సమావేశం అనంతరం వేలాది మంది విద్యార్థులు కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరారు. అప్పటికే పెద్దఎత్తున మోహరించిన పోలీసులు ర్యాలీని అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ గేట్లు దూకి కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులకు, ఉద్యమకారులకు మద్య తీవ్ర తోపులాట జరిగింది. తోపులాటలో అడ్డుగా వేసిన ముళ్లకంచె పై పడడంతో కొంతమందికి తీవ్రగాయాలయ్యాయి.

కాజీపేటకు చెందిన టీఆర్ఎస్ యువజన విభాగం ఉపాధ్యక్షుడు పాలడుగుల అనిల్ ఈ కంచెలో చిక్కుకున్నాడు. ఆయనకు గుచ్చుకున్న కంచెను తొలగించేందుకు వీలుకాకపోవడంతో కట్టర్‌తో తీగలను కత్తిరించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేశారు.

### బస్తీల్లో విద్యార్థుల కోసం పోలీసుల వేట

'మీ బస్తీల్లో విద్యార్థులు ఉన్నారా? ఉంటే చెప్పండి... ఒక్కరి ఆచూకీ చెబితే రూ.300 ఇస్తాం.. అంటూ పోలీసులు వర్సిటీ పరిసర బస్తీల్లో తిరుగుతున్నారని, తెలియదని చెప్పినా వినిపించుకోకుండా లాఠీలతో కొడుతున్నారని స్థానికులు చెప్పారు. మానికేశ్వర్‌నగర్‌లో విలేకరులు ఆరాతీయగా పోలీసులు కొట్టిన లాఠీ దెబ్బలను బస్తీవాసులు చూపించారు. ఈ దాడులను ఏపీ పౌరహక్కుల సంఘం ఖండించింది.

తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని సిగ్మా హాస్పిటల్ ఆడిటోరియంలో "తెలంగాణ ఉద్యమం, మీడియా వైఖరి"పై సదస్సు జరిగింది. ఈ సదస్సులో జేఏసీ నాయకులు కోదండరాం, మల్లెపల్లి లక్ష్మయ్య, పిట్టల రవీందర్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం నాయకులు అల్లం నారాయణ, పి.వి. శ్రీనివాస్, క్రాంతి, పల్లె రవికుమార్, సీనియర్ జర్నలిస్టులు కె.రామచంద్రమూర్తి, జహీర్‌అలిఖాన్, గౌరీశంకర్, శైలేస్‌రెడ్డి, ఘంటా చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

### 12 జనవరి 2011:

### ఏబీవీపీ 'ఛలో ఉస్మానియా' ఉద్రిక్తం

పారా మిలిటరీ దళాలను వెనెక్కు పిలువాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ పిలుపు మేరకు మంగళవారం జరిగిన ఛలో ఉస్మానియా కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ఆర్ట్స్ కళాశాల నుంచి తార్నాకవైపు విద్యార్థులు వెళుతున్న సమయంలో లాఠీ చార్జి జరిగింది. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఈ సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. విద్యార్థులను అరెస్టు చేశారు. ఓయూ జేఏసి విద్యార్థులు కేకే, జైపాల్‌రెడ్డి, డీఎస్, మధుయాష్కీల వేషాధారణలో ఉన్న వారికి శిరోముండనం చేశారు.

దానికి ముందు జైపాల్, డీఎస్‌లకు పిండప్రధానం చేశారు. సీమాంధ్ర నేతల డబ్బుకు అమ్ముడుపోయి తెలంగాణను అడ్డుకున్నారంటూ సోనియా ఫ్లెక్సీకి చెప్పుల దండలు వేశారు. పదిరోజుల్లో ప్రజాప్రతినిధులంతా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కళ్లకు గంతలు కట్టుకుని ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎన్‌సీసీ గేటు వరకు కవాతు నిర్వహించారు.

## క్యాంపస్ నుంచి బీఎస్ఎఫ్ బలగాల ఉపసంహరణ

ఓయూ నుంచి బీఎస్ఎఫ్ బలగాలను ఉపసంహరించాలని పోలీసులు నిర్ణయించారు. వీరి సేవలను అసెంబ్లీ, సచివాలయం, వీఐపీ జోన్లలో వాడుకోవాలని అధికారులు నిర్ణయించారు. బగ్‌షాట్ వెపన్లను వాడటంతో దూసుకెళ్లే ఇనుపగండ్లు శరీరంలో సున్నిత ప్రదేశాలలో తాకితే ప్రాణాలకే ప్రమాదం ఉన్నందున వాటిని వాడరాదని నిర్ణయించారు. ఈనెల 17 నుంచి తెలంగాణ ఉద్యమం తీవ్రం కానుందని నిఘా వర్గాల సమాచారం. ఓయూలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బాష్పవాయుగోళాలను వాడాలని, తప్పని పరిస్థితిలోనే రబ్బరు బుల్లెట్లు వాడాలని నిర్ణయించారు.

## 18 జనవరి 2011:

## రహదారుల దిగ్బంధం సక్సెస్

పార్లమెంటులో బిల్లు పెట్టాలంటూ రాజకీయ జేఏసి ఇచ్చిన పిలుపుమేరకు తలపెట్టిన రహదారుల దిగ్బంధం సంపూర్ణంగా జరిగింది. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆందోళనకారులు రాస్తారోకోల వల్ల గ్రేటర్ హైదరాబాద్‌కు పలు జిల్లాల నుంచి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో పాటు టీఆర్ఎస్, బీజేపి, న్యూడెమాక్రసీ పార్టీల ప్రతినిధులు రాస్తారోకోల్లో పాల్గొన్నారు. జేఏసి చైర్మన్ ప్రొ.కోందండరాం, విమలక్క, రత్నమాల, దత్తాత్రేయ, గోవర్ధన్‌లతో సహా పలువురిని పోలీసులు అరెస్టు చేశారు.

నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో సీమాంధ్ర విద్యార్థుల జేయేసీ నాయకుల సమావేశం. న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తెలంగాణ జేయేసీ ఆఫీసుపై దాడికి విఫల యత్నం. జేయేసీ కో-ఆర్డినేటర్ పిట్టల రవీందర్ నాయకత్వంలో తెలంగాణ మాల మహానాడు నాయకులు గొల్లపల్లి నాగరాజు, బైరి రమేశ్ తదితరులు సీమాంధ్ర విద్యార్థి నాయకులను తరిమికొట్టారు.

## 19 జనవరి 2011:

తెలంగాణ ప్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ టిఎన్జీవో ఆధ్వర్యంలో నేటి నుండి మూడు రోజుల పాటు పెన్‌డౌన్ సమ్మె.

## 20 జనవరి 2011:

### ఫిబ్రవరి 1 నుంచి సహాయనిరాకరణకు సిద్ధం కండి: కేసీఆర్

తెలంగాణలోని అన్ని గ్రామాల్లో ఈనెలాఖరు వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగించి, ఫిబ్రవరి 1 నుంచి సహాయ నిరాకరణకు సిద్ధం కావాలని తెలంగాణలోని వివిధ వర్గాల ప్రజానీకానికి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు విరివిగా పాల్గొని ఉద్యమానికి ఊపందించి, పాలనను స్తంభింపజేయాలని నిర్మల్‌లో జరిగిన సమావేశంలో కోరారు. కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి చరిత్రకారులుగా మిగులుతారో, లేదంటే చరిత్రహీనులై కాలగర్భంలో కలిసిపోతారో తేల్చుకోవాలన్నారు. ఈ సభలో వివిధ పార్టీలకు చెందిన 1500 మంది నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

### 'రాష్ట్ర విభజన కమిటీ' ఏర్పాటు

రాష్ట్ర విభజన సమయంలో తలెత్తే సమస్యల పరిష్కారం పేరిట తెలంగాణవాదులు, ప్రత్యేకాంధ్రవాదులతో 'రాష్ట్ర విభజన కమిటీ' ఏర్పాటైంది. 'కలిసి విడిపోదాం... విడిపోయి కలిసుందాం' అన్న నినాదంతో ఏర్పాటైన ఈ కమిటీకి ప్రముఖ స్వాతంత్రసమరయోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ నేతృత్వం వహిస్తారు. రాష్ట్ర విభజన వల్ల ఉత్పన్నయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పలు నిపుణుల కమిటీలను ఈ కమిటీ ఏర్పాటు చేస్తుంది. సామరస్యంగా చర్చించి ఇరు ప్రాంతాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కేంద్ర ప్రభుత్వానికి ఈ నిపుణుల కమిటీలు సూచిస్తాయి.

### 'పెన్‌డౌన్'తో స్తంభించిన కార్యాలయాలు

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు సామూహికంగా పెన్‌డౌన్ సమ్మె చేయడంతో బుధవారం ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. బాస్‌లు తమ చాంబర్లకే పరిమితమయ్యారు. ఉద్యోగులు భోజన విరామ సయమంలో తమ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు చేశారు. కార్యాలయాలన్నీ బోసిపోయి కన్పించాయి. నేడు, రేపు కూడా పెన్‌డౌన్ పాటిస్తామని ఉద్యోగసంఘాల జేఏసి ప్రకటించింది.

## 21 జనవరి 2011:

### 25 నుంచి నిరవధిక సమ్మె?

తమ డిమాండ్ల సాధన కోసం... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన పెన్, చాక్, టూల్ డౌన్ ఆందోళన గురువారానికి రెండో రోజుకు చేరుకుంది. దాంతో రెండో రోజు కూడా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలో కార్యకలాపాలు

సాగలేదు. పాలన స్తంభిస్తున్నప్పటికీ ఉద్యోగుల డిమాండ్ల విషయంలో ప్రభుత్వం మెట్టు దిగే సూచనలు కన్పించలేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నారు.

**22 జనవరి 2011:**

### తెలంగాణ వ్యాప్తంగా రిలే దీక్షలు ప్రారంభం

తెలంగాణ రాజకీయ జేఏసి ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులను సాంఘీక బహిష్కరణ చేయాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం పిలుపునిచ్చింది. తెలంగాణ ఇంజనీర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఎర్రమంజిల్‌లోని జలసౌధ వద్ద రిలే దీక్షలు ప్రారంభించారు. ఇక్కడ కపిలవాయి దిలీప్ కుమార్ దీక్షలను ప్రారంభించారు. ఓల్డ్ సిటీ తెలంగాణ జేఏసి ఆధ్వర్యంలో ఉర్ధూఘర్‌లో చేపట్టిన దీక్షలకు కోదండరాం, గద్దర్‌లు హాజరయ్యారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో విద్యార్థులు చేపట్టిన దీక్షలకు విమలక్క హాజరయ్యారు. మింట్ కంపౌండ్‌లో చేపట్టిన దీక్షలకు ఉద్యోగ సంఘాల నేత విఠల్ సంఘీభావం తెలిపారు. జేఎన్టీయూలో మెయిన్ గేట్ వద్ద విద్యార్థులు చేపట్టిన దీక్షలకు కోదండరాం, స్వామి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు సంఘీభావం తెలిపారు. నాంపల్లిలోని గగన్‌విహార్ కాంప్లెక్స్ కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన ఉద్యోగుల జేఏసి దీక్షలను స్వామిగౌడ్, దేవీ ప్రసాద్‌లు ప్రారంభించారు. తెలంగాణ వ్యాప్తంగా జిల్లాకేంద్రాలు, మండల కేంద్రాలు, పట్టణాలు, గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో జేఏసి ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి.

### 'తెలంగాణ వర్తమాన ఉద్యమం - మన కర్తవ్యం' సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం 'తెలంగాణ వర్తమాన ఉద్యమం-మన కర్తవ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొని ప్రసంగిస్తూ... తెలంగాణ ఉద్యమం నుంచి దృష్టిని మరల్చడానికే రచ్చబండ అనే రొచ్చు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. దానిని బహిష్కరించండి. ఈ కార్యక్రమానికి వచ్చే కాంగ్రేస్ ఎంపీలు, ఎమ్మెల్యేలను తరిమికొట్టండి' అని పార్టీ శ్రేణులకు కేసీఆర్ పిలుపునిచ్చారు. రచ్చబండ కార్యక్రమాన్ని జరగకుండా చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చెంప చెళ్లుమనిపించాలని, ఉద్యమ తీవ్రతను ఢిల్లీకి తెలియజేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేయేసీ చైర్మెన్ కోదండరామ్, మల్లేపల్లి లక్ష్మయ్య, పిట్టల రవీందర్, ఇతర జేయేసీ నేతలు పాల్గొన్నారు.

**12 ఫిబ్రవరి 2011:**

**17నుంచే సహాయనిరాకరణ: జేఏసి**

ఫిబ్రవరి 17.. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం. అదే రోజు నుంచి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో తెలంగాణ జేఏసి పిలుపుమేరకు సహాయనిరాకరణ నగారా మోగనుంది. ఆరోజు సెగకు ఈరోజే నిప్పు రాజుకుంది. బడ్జెట్ సమావేశాలలో కిరణ్ సర్కార్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ప్రకటన... రాజకీయ వర్గాల్లో సంచలనం రేపింది. కిరణ్ ప్రభుత్వంపై అవిశ్వాసం పెడతాం.. దాన్ని నెగ్గనీయండి. ఎవరు కాంగ్రెస్‌కు బ్రాంచ్ ఆఫీసో తేలిపోతుందని కేసీఆర్ టీడీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దాన్ని కొట్టిపారేసిన టీడీపీ, కాంగ్రెస్ కోసమే కేసీఆర్ అవిశ్వాసం జపం చేస్తున్నారని ఆరోపించింది. కాంగ్రెస్‌లో జగన్ వర్గం ఎవరో తేలితే తామే అవిశ్వాసం పెడతామని, దానికి టీఆర్ఎస్ మద్దతు ఇస్తే సరిపోతుందన్నారు.

జేఏసి సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా షెడ్యూల్‌ను ప్రకటించింది.

**13 ఫిబ్రవరి 2011:**

గ్రామగ్రామాన చాటింపులు, దీక్షా కంకణం

**14 ఫిబ్రవరి 2011:**

నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు

**15 ఫిబ్రవరి 2011:**

జైల్‌భరో

**16 ఫిబ్రవరి 2011:**

తెలంగాణపై నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ధర్నాలు

**17 ఫిబ్రవరి 2011:**

తెలంగాణ వ్యాప్తంగా సహాయనిరాకరణ కార్యక్రమం మొదలు. ఉద్యోగులకు సంఘీభావ ర్యాలీలు

(సహాయనిరాకరణ అంటే ఆర్టీసీ బస్సుల్లో టికెట్లు తీసుకోకుండా ప్రయాణించడం, అన్ని రకాల విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం, ఇంటి పన్నులు, ఇతర పన్నులు చెల్లించకపోవడం, రహదారులపై టోల్‌గేట్ బిల్లుల చెల్లింపులు నిరాకరించడం)

**18 ఫిబ్రవరి 2011:**

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు పికెటింగ్

**19 ఫిబ్రవరి 2011:**

రాస్తారోకోలు, ఎన్‌హెచ్–9 దిగ్బంధం, పట్టణాల్లో 'వాక్ ఫర్ తెలంగాణ' గ్రామాల్లో 'ప్రభాతభేరి'

**22 ఫిబ్రవరి 2011:**

**సార్వత్రిక సమ్మె – బంద్ ప్రారంభం**

శుక్రవారం జరిగిన జేఏసి స్టీరింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్న అనంతరం పై షెడ్యూల్‌ను ప్రకటించారు.

**అవసరమైతే 23 తర్వాత మళ్లీ ఆమరణ దీక్ష: కేసీఆర్**

సహాయనిరాకరణ ఉద్యమంలో జూలు విదిల్చి, ఉగ్రరూపం ప్రదర్శించాలని టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో పార్టీశ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఇదివరకటిలా కాకుండా సహాయనిరాకరణను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఈసారి తాడోపేడో తేల్చాలని అమసరమైతే 23 తర్వాత మళ్లీ ఆమరణ దీక్షకు కూర్చుంటా.. తెలంగాణ డిమాండ్‌తో పార్లమెంట్‌లో పోడియం వద్ద మేం ఇద్దరం ఎంపీలం వెళ్తాం అన్నారు.

**15 ఫిబ్రవరి 2011:**

**సహాయనిరాకరణలో ప్రజలు భాగస్వాములు కావాలి: కోదండరాం**

17 నుంచి నిర్వహించనున్న సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి హబ్సిగూడ చౌరస్తాలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ధూంధాం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సహాయ నిరాకరణలో పాల్గొనేందుకు ఉద్యోగులు సిద్దంగా ఉన్నారని, అదేవిధంగా ప్రజలు ఉద్యమానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.జయశంకర్, బీజేపి నేత విద్యాసాగర్ రావు, టీఆర్ఎస్ నేతలతో పాటు పలువురు జేఏసి ప్రతినిధులు పాల్గొన్నారు.

**జైల్‌భరో విజయవంతం**

జేఏసి ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ జిల్లాల్లో మంగళవారం జైల్‌భరో కార్యక్రమం విజయవంతం అయింది. కరీంనగర్ జిల్లాలో కలెక్టరేట్‌లో టీఎన్జీవో ఉద్యోగులు భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. బస్టాండు వద్ద రాస్తారోకో చేసిన ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు సహా పలువురిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. హుజురాబాద్‌లో తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడించిన టీఆర్ఎస్ నేత ఈటెల రాజేందర్ సహా పలువురిని అరెస్టు చేశారు. మెట్‌పల్లి, హుస్నాబాద్ తదితర మండలాల్లో

ఆందోళన చేసిన దాదాపు 300 మందిని కూడా అరెస్టు చేశారు. ఆందోళకారులు సుల్తానాబాద్ మండలం మంచరామిలో సోనియాగాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మంథని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. మహదేవపూర్, మంథని, సెంటినరీ కాలనీ, కమాన్‌పూర్‌లలో ధర్నాలు జరిగాయి.

ఆదిలాబాద్ జిల్లాలో ఓవైపు జేఏసి జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించగా మరో వైపు తెలంగాణవాదులు ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు, ధూంధాం కార్యక్రమాలు చేపట్టారు. వందల సంఖ్యలో తెలంగాణవాదులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదిలాబాద్, నిర్మల్, ఉట్నూరు తదితర ప్రాంతాలలో పలువురు పోలీస్‌స్టేషన్లకు వెళ్ళి స్వచ్ఛందంగా అరెస్టు అయ్యారు. ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. బెల్లంపల్లిలో జేఏసి దీక్షా శిబిరం వద్ద యాదగిరి శ్రీనివాస్ అనే యువకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు.

మహబూబ్‌నగర్ జిల్లాలో జేఏసి ఆధ్వర్యంలో జైల్‌భరో ఆందోళన జరిగింది. ధర్నాలు, రాస్తారోకోలు చేసిన వారిని పోలీసులు ఎక్కడిక్కడే అరెస్టు చేశారు. మరోవైపు ఉద్యోగులు కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలలో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వివిధ విద్యార్థి సంఘాలు, జేఏసి నాయకులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.

మెదక్ జిల్లాలో కూడా జైల్‌భరో కార్యక్రమం విజయవంతమైంది. సంగారెడ్డిలో కలెక్టరేట్ ముట్టడించి రాస్తారోకో నిర్వహించారు. టీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, బీజేపి జిల్లా అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు 150 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సిద్ధిపేటలో ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించిన టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుతో పాటు 400 మందిని, దుబ్బాకలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రామలింగారెడ్డిని, పటాన్‌చెరు వద్ద టీఆర్‌ఎస్ నేత రఘునందన్‌రావును, గజ్వేల్‌లో డిసిసి బ్యాంక్ మాజీ అధ్యక్షుడు ఎలక్షన్‌రెడ్డిని అరెస్టు చేశారు. సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ఉత్తర మండల కార్యాలయాన్ని ముట్టడించారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఈనెల 11వ తేదీన ఆత్మహుతియత్నం చేసిన వరంగల్ జిల్లా మద్దేరు మండలంలోని దూల్మిట్ట గ్రామ వికలాంగుడు చీరబోయిన కనకయ్య(27) సికింద్రాబాద్‌లోని గాంధీ ఈసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళ వారం మృతిచెందాడు.

**16 ఫిబ్రవరి 2011:**

**తెలంగాణ సంక్లిష్ట అంశం, జూన్ దాకా ఆగండి: ప్రధాని మన్మోహన్**

జూన్ దాకా ఆగండి! ఇదీ తెలంగాణ ప్రాంతానికి చెందిన పలువురు కాంగ్రెస్

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కాంగ్రెస్ పెద్దలు చెప్పిన మాట! ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయని, ఆ తర్వాత మే నెలలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నాయని పేర్కొన్న కాంగ్రెస్ పెద్దలు.. అవి పూర్తయిన తర్వాతే ఒక నిర్ణయానికి రాగలమని చెబుతున్నారు. అంత వరకు ఆగాలన్నారు. తెలంగాణ సమస్య సంక్లిష్టమైన సమస్య అని. దానిపై 'విస్తృత అభిప్రాయం' సాధించేందుకు కృషి చేస్తున్నామంటూ ప్రధాని మన్మోహన్ పేర్కొన్న నేపథ్యంలో తెలంగాణ ప్రాంత నేతల్లో గుబులు రేగింది. నివేదిక అధ్యయనం జరుగుతోందని, అదిపూర్తయిన తర్వాతనే సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభమవుతుందని మన్మోహన్ స్పష్టం చేశారు.

**తెలంగాణలో 'సహాయ నిరాకరణ'**

తెలంగాణ పార్టీలన్నీ జెండాలను పక్కన పెట్టి... ప్రత్యేక రాష్ట్రం కోసం ఈ ప్రాంత ఉద్యోగులు చేపట్టనున్న సహాయ నిరాకరణకు సంఘీభావం తెలిపాయి. గురువారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభా సమావేశాలను జరగనిచ్చే ప్రసక్తే లేదని, రాజకీయ పక్షాల నేతలందరూ ప్రకటించారు. తెలంగాణ ప్రస్తావన లేకపోతే, గవర్నర్ ప్రసంగ పాఠాన్ని చించివేస్తామని, 'సహాయ నిరాకరణ'కు పూనుకుంటున్న ఉద్యోగులపై చర్యలు తీసుకుంటే సహించేదిలేదని హెచ్చరించారు. టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ నేతలతో పాటు, వివిధ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టించి అయినా సరే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ మధుయాష్కీ అన్నారు. తెలంగాణ రాదంటే మళ్లీ ఎంపీగా పోటీచేయను, కేసీఆర్‌ను వచ్చి సోనియాను అడగమనండి. అప్పటికీ ఇవ్వకుంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తామని ఎంపీ సర్వే సత్యనారాయణ అన్నారు. గవర్నర్ తెలంగాణ వ్యతిరేకి, తెలంగాణ గడ్డపై మాట్లాడే హక్కు ఆయనకు లేదు. ఆయన ప్రసంగాన్ని అడ్డుకుంటాం. అక్కడి నుంచే మా 'సహాయనిరాకరణ' మొదలవుతుందని నాగం జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఏస్మాలకు భయపడేది లేదంటూ సర్కారును టీఆర్ఎస్ నేతలు ఈటెల రాజేందర్, నాయిని నర్సింహారెడ్డి హెచ్చరించారు. సీఎం గదికి విద్యుత్తును నిలిపివేస్తే తెలంగానే రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఆయనే దిగివస్తారని తెలంగాణ ఉద్యోగులకు ప్రజా గాయకుడు గద్దర్ సూచించారు.

ఉద్యోగ సంఘాల నేత స్వామిగౌడ్ మాట్లాడుతూ గురువారం నుంచి ఉద్యోగులు విధులకు హాజరై, సంతకాలు చేస్తారు కాని విధులు నిర్వర్తించబోరని ప్రకటించారు. ప్రజాస్వామ్య యుతంగా, చట్టబద్ధంగానే నిరసన తెలియజేస్తామని, వ్యవస్థను కుప్పకూల్చబోమన్నారు. సీమాంధ్ర ఉద్యోగులు తమ ఉద్యమానికి సహకరించాలని, తమ సీట్లల్లో కూర్చొని పని చేయవద్దని, తమ మనోభావాలు దెబ్బతీయవద్దని స్వామిగౌడ్

విజ్ఞప్తి చేశారు. సహాయ నిరాకరణను శాంతియుతంగా నిర్వహించాలని భావిస్తున్నామని, ప్రభుత్వం దానిని భగ్నం చేస్తే ఉద్యోగుల మధ్య గొడవలు ఆరంభమవుతాయని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఉద్యోగుల ఉద్యమానికి పలు రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో మద్దతు తెలిపాయి.

## తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ ఆవిర్భావం

దక్షిణ మధ్య రైల్వేలో కొత్తగా తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటైంది. దీని ఆవిర్భావ సభ బుధవారం సికింద్రాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, బీజేపి నేత దత్తాత్రేయ, ప్రజాగాయకుడు గద్దర్, కపిలవాయి దిలీప్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డిలతో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో రైల్వే ఉద్యోగులను అణచివేసేందుకు శాఖాపరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉద్యోగులను వేదింపులకు గురిచేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. రైల్వే జేయేసీ కన్వీనర్ గా ముత్తయ్యను ఎన్నుకున్నారు.

## దద్దరిల్లిన తెలంగాణ

తెలంగాణలో సహాయ నిరాకరణ వరుసగా మూడో రోజు విజయవంతంగా కొనసాగింది. ఉద్యోగుల ఆందోళనతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు కదలలేదు. అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు, ధర్నాలు కొనసాగాయి. తెలంగాణ ఎమ్మెల్యేలను దూషించిన గవర్నర్ నరసింహన్ తలలేని దిష్టిబొమ్మను రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో టీడీపీ నాయకులు దహనం చేశారు. ఇబ్రహీంపట్నంలో ఉద్యోగులు మానవహారం నిర్మించారు. దోమ మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ అధికారులను అడ్డుకున్నారు. తెలంగాణ రాష్ట్రం కోరుతూ చేవేళ్ల, ఇబ్రహీంపట్నం, పరిగి, వికారాబాద్‌లలో అంబెద్కర్, గాంధీ, జగ్జీవన్‌రాం విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలో భారీ రాస్తారోకో, పినపాక మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. టీఆర్ఎస్, టీడీపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, గవర్నర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం, ఖమ్మం తదితర చోట్ల ధర్నాలు నిర్వహించారు.

కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు విధులను బహిష్కరించి పలుచోట్ల ఆటాపాటా నిర్వహించారు. కోహెడలో వంటావార్పు నిర్వహించారు. కరీంనగర్ జడ్పీలో ఉద్యోగులు రాస్తారోకో చేశారు. జిల్లాలో పలుచోట్ల అంబెద్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ, గవర్నర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు మెట్‌పల్లిలో ఘనస్వాగతం

పలికారు.

మెదక్ జిల్లా దుబ్బాక మండలం హబ్సీపూర్ వద్ద రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రామలింగారెడ్డి, సిద్ధిపేట రాస్తారోకోలో మున్సిపల్ మాజీ చైర్మన్ కె.రాజనర్సులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్‌రెడ్డి చేగుంట నుంచి బస్సులో టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేశారు. మెదక్‌లో ఉద్యోగులు గాంధీ, అంబెద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. మండలాల్లో గవర్నర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు.

నల్గొండ జిల్లాలో ప్రధాన రహదారిపై రాస్తారోకోలు జరిగాయి. నార్కట్‌పల్లిలో మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, భువనగిరిలో సీపీఎం నేత నోముల నర్సింహయ్య 'సైకిల్‌యాత్ర', సభను తెలంగాణవాదులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కొందరు వేదికపైకి కోడిగుడ్లు విసిరారు. మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయంలో ఉద్యోగులు బతుకమ్మ ఆట ఆడారు. మునిసిపల్ కార్యాలయాల్లో కార్మికులు వంటా, వార్పులతో నిరసన తెలిపారు. తిప్పర్తి నుంచి నల్గొండ వరకు ప్రభుత్వ ఉద్యోగులు టికెట్ లేకుండా బస్సుల్లో ప్రయాణించారు.

ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ నినాదాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, ఆందోళనలతో మారుమోగింది. విద్యుత్ బిల్లుల కోసం వచ్చిన అధికారులను ప్రజలు నిర్బంధించారు. ప్రభుత్వ ఉద్యోగులు పనులు చేయకుండా ఆటపాట నిర్వహించారు. దీంతో జిల్లాలో ప్రభుత్వ పాలన పూర్తిగా స్తంబించిపోయింది. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. జాతినేతల విగ్రహాలకు వినతిపత్రం సమర్పించారు. టీడీపీ ధర్నాలో పాల్గొనేందుకు అదిలాబాద్‌కు వచ్చిన ఆ పార్టీ నేత నాగం జనార్ధన్‌రెడ్డిని తెలంగాణవాదులు, జేఏసీ నేతలు కలెక్టరేట్ చౌరస్తాలో అడ్డుకున్నారు. నిర్మల్‌లో ట్రాన్స్‌కో ఉద్యోగులు ర్యాలీ, టీఎన్జీవోలు బైక్‌ర్యాలీని నిర్వహించారు. సింగరేణిలో టూల్‌డౌన్ కొనసాగింది.

నిజామాబాద్ జిల్లాలో అటెండర్ నుంచి అధికారి వరకు విధులకు హాజరు కాలేదు. ఉద్యోగ సంఘాల నేతలు కలెక్టరేట్ చౌరస్తాలో భారీ రాస్తారోకో నిర్వహించారు. న్యాయవాదులు, పార్టీల నేతలు, ఆర్టీసీ ఉద్యోగులు ఊరేగింపుల్లో పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాలో ఆందోళనలు ఉదృతమయ్యాయి. అంతటా రాస్తారోకోలు నిర్వహించారు. ఉద్యోగులు, ఆందోళనాకారులు విధులు బహిష్కరించి రోడ్లపై బైఠాయించారు. రిలేదీక్షలు కొనసాగాయి. అనేక చోట్ల ధూంధాం కార్యక్రమాలు జరిగాయి. సంగెం మండలం ఎల్గూరు స్టేషన్‌కు చెందిన కరంబోతు భూక్యా మహేందర్(25) అనే పీజీ విద్యార్థి శుక్రవారం రాత్రి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జనగామలో లింగగిరి రాములు (34), ఆర్‌వోబీపై నుంచి దూకి ఆత్మహత్య

చేసుకున్నాడు. మహబూబాబాద్‌లో మారోజు నాగేంద్రచారి(28) చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

ఉద్యమాలతో పాలమూరు జిల్లా అట్టుడికిపోతోంది. విధులు నిర్వర్తించకుండా రోడ్లపైకి వచ్చిన ఉద్యోగులు ర్యాలీలు, రాస్తారోకోలతో కదం తొక్కారు. జాతినేతల విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. అంబెద్కర్ చౌరస్తా, పోస్టాఫీసు చౌరస్తాలలో మానవహారాలు నిర్మించారు. గోపాల్‌పేట, పానగల్ మండల కేంద్రాల్లో గవర్నర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హైదరాబాద్‌లో సహాయ నిరాకరణతో ప్రభుత్వ కార్యకలాపాలతో పాటు, జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో, 18 సర్కిళ్లలో పనులన్నీ నిలిచిపోయాయి. హైదరాబాద్ కలెక్టరేట్‌లో టీడీపీ నేత కె.విజయరామారావు పాల్గొని ఉద్యోగులకు మద్దతు పలికారు. తెలంగాణ ఏర్పాటు ప్రకటన రాకపోతే 23వ తేదీ నుంచి అత్యవసర సేవలను నిలిపివేయాలని జీహెచ్ఎంసీ జేఏసి చైర్మన్ తిప్పర్తి యాదయ్య ప్రకటించారు.

**17 ఫిబ్రవరి 2011:**

తెలంగాణ అడ్వకేట్స్ జేయేసీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలోని అన్ని కోర్టులతోపాటు, గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని కోర్టులన్నింటిలోనూ న్యాయవాదులు కేసులు వాదించకుండా, విధులను బహిష్కరించారు.

**21 ఫిబ్రవరి 2011:**

**రణరంగమైన రాజధాని**

రాజధాని రగిలింది. ఉస్మానియా వర్సిటీ రణరంగమైంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా... నగరంలో ఒకటే అలజడి. ఒకవైపు విద్యార్థుల ఛలో అసెంబ్లీ... మరోవైపు న్యాయవాదుల ఛలో రాజ్‌భవన్... వీరిని అడ్డుకునేందుకు పోలీసుల ఎత్తులు.. ఆ ఎత్తులను చిత్తు చేస్తూ విద్యార్థుల, న్యాయవాదుల పైఎత్తులు... బృందాలుగా విడిపోయిన విద్యార్థులు.. న్యాయవాదులు.. రకరకాల మార్గాల్లో తమ గమ్యం వైపు దూసుకుపోవడం.. పోలీసుల అరెస్టులు... లాఠీచార్జీలు... నినాదాలు.. తోపులాటలు.. రోజంతా రగడ! సచివాలయం, శాసనసభ, నాంపల్లి, బషీర్‌బాగ్, రాజ్‌భవన్, ఖైరతాబాద్ చౌరస్తా, పోలీస్ కంట్రోల్ రూం, నిజాం కాలేజీ హాస్టల్ వంటి కీలక ప్రాంతాలన్నీ అప్రకటిత కర్ఫ్యూను తలపించాయి. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులను అరెస్టు చేశారు. 20 మంది విద్యార్థులు గాయపడ్డారు.

క్యాంపస్ దాటి అసెంబ్లీవైపుగా బయలుదేరిన విద్యార్థుల ర్యాలీని పోలీసులు బారీకేడ్లు, ఇనుప కంచెలు నిలువరించాయి. పోలీసులు, విద్యార్థులు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. భద్రతా సిబ్బంది రబ్బరు బుల్లెట్లు, బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. తార్నాక, హబ్సిగూడవైపు తరలిన విద్యార్థులు కొంత విధ్వంసానికి

దిగారు. ఎనిమిది బస్సులు, కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. వర్సిటీ సమీపంలో ఎంఎంటీఎస్ రైలుపై కొందరు రాళ్లు రువ్వారు. ఒక బోగికి నిప్పంటించారు. విద్యార్థుల ఛలో అసెంబ్లీకి జేఏసి చైర్మన్ కోదండరాం, ప్రజాగాయకుడు గద్దర్ మద్దతు తెలిపారు.

రాజ్‌భవన్ సమీపంలో నెక్లెస్‌రోడ్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో కొందరు విధ్వంసం సృష్టించారు. అద్దాలను, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. రక్షణ వలయాన్ని ఛేదించుకుని విద్యార్థులు కొందరు అసెంబ్లీ దాకా చేరుకుని గేటు కూడా దాటి జైతెలంగాణ నినాదాలు చేశారు. దీంతో విద్యార్థుల అసెంబ్లీ విజయవంతమైంది. ఇక న్యాయవాదుల జేఏసి గవర్నర్‌నే పిలిపించుకుని చర్చించడంతో వారి లక్ష్యమూ నెరవేరింది.

ఇక పార్లమెంటులో తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ ఎంపీలు కలకలం సృష్టించారు. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగం ముగుస్తున్న సమయంలో ఒక్కసారిగా పది మంది ఎంపీలు లేచి నిలబడి 'జై తెలంగాణ' నినాదాలు చేశారు. సభలో బ్యానర్లు ప్రదర్శించారు. ఒక్కసారిగా సభలో అందరి దృష్టిని ఆకర్షించారు.

ఇక అసెంబ్లీ ఎలాంటి చర్చ జరగకుండానే మరోసారి వాయిదా పడింది. సభ్యులపై సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ విపక్షాలు చేసిన వినతిని సర్కారు తోసిపుచ్చింది. ఆ తర్వాత సభ జై తెలంగాణ నినాదాలతో దద్దరిల్లింది. తెలంగాణ ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రి వర్గ ఉపసంఘం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా సహాయ నిరాకరణ కొనసాగుతోంది. సహాయ నిరాకరణను విరమించి ప్రభుత్వానికి సహకరించాలన్న ప్రతిపాదనను ఉద్యోగ సంఘాల నేతలు తోసిపుచ్చారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చేదాకా ఆందోళనలు ఆగవని జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం స్పష్టం చేశారు. రెపటి నుంచి జరిగే 48 గంటల బంద్ తర్వాత కూడా ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. 24న సమావేశమై కార్యచరణను ప్రకటిస్తామన్నారు.

**నేతల స్వరం మారుతోంది**

'తెలంగాణకు నేను అడ్డంకి కాదు. ఈ అంశం రాష్ట్ర పరిధిలోని అంశమూ కాదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుపై కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తాను'

**– సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి**

'తెలంగాణ అంశంపై శాసనసభలో సవివరమైన, లోతైన చర్చ జరగాలి. ఒక సమస్య రాష్ట్రాన్ని కుదిపేస్తున్నప్పటికీ అసలు సమస్యే లేదన్నట్లుగా అసెంబ్లీని నడపడం సభకు ఏమాత్రం గౌరవం కాదు.' **– జేపీ నారాయణ (లోక్‌సత్తా)**

'టీఆర్ఎస్ కోరుతున్నట్లు రాష్ట్ర విభజనపై అసెంబ్లీలో ఓటింగ్‌కు తాము సిద్ధమే. దీనికి సంబంధించి ఓటింగ్ జరిగితే మా ఆత్మబోధనానుసారం ఓటు వేస్తాం. ఓటింగ్ జరపాలని మేం కూడా కోరుతున్నాం' **– పయ్యావుల కేశవ్ (టీడీపీ)**

'పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ గురించి ఒక్క ముక్క కూడా లేదు. కాంగ్రెస్ నేతలు మీ తలలు ఎక్కడ పెట్టుకుంటారు? పార్లమెంటు స్థంబన లేదా రాజీనామాలలో ఏదో ఒకటి తేల్చుకోండి' **– నాగం జనార్ధన్‌రెడ్డి**

## తెలంగాణ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతాం: అజిత్‌సింగ్

ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి జాతీయ స్థాయిలో మద్దతు ఉందని రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు అజిత్ సింగ్ అన్నారు. హన్మకొండలోని అంబెద్కర్ భవన్‌లో తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ప్రథమ మహాసభ జరిగింది. అందులో పాల్గొన్న అజిత్ సింగ్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలోనే తెలంగాణ అంశాన్ని పార్లమెంటులో లేవ నెత్తానన్నారు. జార్ఖండ్, ఉత్తరాంచల్, చత్తీస్‌ఘడ్‌లతో పాటు తెలంగాణను ఏర్పడాలన్న వాదన వినిపించానన్నారు. ఇక్కడ మీరు పోరాటం చేయండి. ఢిల్లీలో మీ తరపున మేం పోరాడుతాం అని అన్నారు.

## తెలంగాణలో 48 గంటల బంద్

తెలంగాణలో 48 గంటల బంద్‌కు తెలంగాణ జేఏసీ పిలుపునివ్వగా దీనికి అన్ని పార్టీలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు తమ సంపూర్ణ మద్దతు పలికాయి. ఈ సందర్భంగా అత్యవసర సర్వీసులకు ఆటంకం కల్గించొద్దని ఆందోళనకారులకు జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కొన్ని సూచనలు చేశారు. నిషేదాజ్ఞల ఉల్లంఘన పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెచ్చగొట్టే విధంగా ప్రసారాలు చేస్తున్న ఛానళ్లపై చర్యలు తీసుకుంటామని మీడియాను హెచ్చరించారు.

## నిరసనలతో దద్దరిల్లిన తెలంగాణ

పార్లమెంటులో వెంటనే బిల్లు పెట్టాలంటూ తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయవాదులు, విద్యార్థులు, యువజన వార్గాలు చేస్తున్న సహాయ నిరాకరణ ఉద్య మం ఐదవ రోజుకు చేరుకుంది.

కరీంనగర్‌లో ఉద్యోగులు సోమవారం విధులను బహిష్కరించారు. మంగళ వారం నుంచి 48గంటల బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా అంతటా మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో పలుచోట్ల కాంగ్రెస్, టీడీపీలకు చెందిన నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు. హైదరాబాద్‌లో విద్యార్థులపై లాఠీచార్జికి నిరసనగా విద్యార్థులు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. కరీంనగర్‌లో టీఆర్ఎస్ యువజన విభాగం ర్యాలీ నిర్వహించింది. కరీంనగర్ ఐఎంఎల్ డిపోలో కార్మికుల సహాయనిరాకరణతో రూ.2కోట్ల 50లక్షల మద్యం సరఫరా నిలిచిపోయింది. జిల్లాలో పన్ను వసూళ్లు ఆగిపోయాయి. పాలన స్తంబించింది. అదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు భారీఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఆదిలాబాద్ కోర్టు ఎదుట

న్యాయవాదులు గవర్నర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. డీటీవో కార్యాలయానికి తాళం వేశారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మాక్ అసెంబ్లీలు నిర్వహించారు. న్యూడెమాక్రసీ ఆధ్వర్యంలో సోనియా, మన్మోహన్, చిదంబరం, గవర్నర్ నరసింహన్ వేషధారులతో ప్రదర్శన నిర్వహించారు. భద్రాచలంలో యూపీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యార్థుల అరెస్టుకు నిరసనగా రహదారిపై ధర్నా చేపట్టడంతో కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. జడ్పీ కార్యాలయం ముందు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వంటా వార్పు నిర్వహించారు. నల్గొండ జిల్లాలో మోటర్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాజాపేట మండలంలో సీపీఎం నేత నోముల నర్సింహయ్య సైకిల్‌యాత్రను అడ్డుకున్నారు. వరంగల్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద మాక్ అసెంబ్లీని నిర్వహించారు. మహబూబాబాద్‌లో కరెంటు బిల్లులు కట్టవద్దని జేఏసి నాయకులు ప్రచారం చేశారు. బీజేపి కార్యకర్తలు వరంగల్ పోచమ్మైదానం నుంచి కాజీపేట వరకు రాంగ్‌రూట్‌లో ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు.

రంగారెడ్డి జిల్లా తాండూరులో ఉద్యోగులు మాక్ అసెంబ్లీని నిర్వహించారు. వికారాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు మద్దతుగా గ్రీన్ అండ్ సీడ్స్ అసోసియేషన్ గుమస్తా, హమాలీ సంఘాలు ర్యాలీని నిర్వహించాయి. ఈనెల 27 వరకు వ్యాపార కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. సబ్‌కలెక్టరేట్ వద్ద మంత్రులు జైపాల్‌రెడ్డి, సబితారెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మెదక్ జిల్లా సంగారెడ్డిలో ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సిద్దిపేట, మెదక్‌లలో మాక్ అసెంబ్లీని నిర్వహించారు.

బొల్లారంలో ఆదివారం అర్ధరాత్రి ఆత్మహత్యయత్నం చేసిన ముస్తాఫా(35) సోమవారం మృతి చెందాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్లకు చెందిన అశోక్(25) ఆత్మహత్య చేసుకున్నాడు.

**22 ఫిబ్రవరి 2011:**

**తెలంగాణ బంద్ తొలిరోజు సంపూర్ణం**

ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో తెలంగాణ పది జిల్లాలు సంపూర్ణంగా బందయ్యాయి. హైదరాబాద్ మొదలు సింగరేణి వరకు సమస్తం మూతపడ్డాయి, బస్సులు, రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో రవాణ వ్యవస్థ పూర్తిగా స్తంబించింది. పలు తెలంగాణ జిల్లాల్లో బస్టాండ్లలో క్రికెట్... రోడ్లపై బతుకమ్మలు ఆడారు. కొన్ని చోట్ల రైలు పట్టాలపై ఫిష్‌పేట్లను తొలగించారు. ఇక బంద్ సందర్భంగా ఉస్మానియా వర్సిటీ రణరంగమైంది. పోలీసులు ఎడాపెడా బాష్పవాయుగోళాలను ప్రయోగించడం.. విద్యార్థులు వాటిని క్రికెట్ బ్యాట్లతో తిప్పికొట్టడం.. రాళ్ల వర్షం.. లాఠీచార్జి జరిగింది. బంద్‌కు మద్దతుగా

ర్యాలీకి ప్రయత్నించిన నిజాం కాలేజీ విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే నిజాం కాలేజీ హాస్టల్ నుంచి విద్యార్థులు బయటకు వచ్చి అసెంబ్లీవైపు వెళ్లడానికి ప్రయత్నిస్తూ పోలీసులపై రాళ్లు రువ్వడంతో గందరగోళం నెలకొంది. ఉదయం 8గంటల వరకు తెలంగాణ నాయకులను కదలనివ్వకుండా పోలీసులు షాడోపార్టీలు వెంటపడ్డాయి. తర్వాత జేఏసి నేత కోదండరాంను లాలాపేటలో అరెస్టు చేసి కంచన్‌బాగ్ స్టేషన్‌కు తరలించారు. సికింద్రాబాద్‌లో టీఆర్ఎస్ నాయకుడు పద్మారావు ఇంటికొచ్చిన ఎమ్మెల్యేలు హరీష్‌రావు, విద్యాసాగర్‌రావు, టీఆర్ఎస్ నాయకులు నాయిని నర్సింహారెడ్డి అక్కడి నుంచి ర్యాలీకి వెళ్లడానికి ప్రయత్నించగా వారిని పోలీసులు అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వందేళ్ల చరిత్రలో తొలిసారిగా ఒక రాజకీయ అంశంపై 70వేల మంది సింగరేణి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో విద్యుత్, సిమెంటు పరిశ్రమలకు బొగ్గు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

కరీంనగర్ జిల్లాలో దుకాణాలు, పెట్రోల్‌బంక్‌లు, సినిమా హాళ్లు, హొటళ్లు.. అన్ని బందయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా మాడ్గులలో కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి ఇంటివద్ద మాక్ పార్లమెంటు నిర్వహించారు. అదిలాబాద్ జిల్లాలో ఒకటి రెండు చోట్ల ప్రైవేటు కార్యాలయాలు తెరవగా, తెలంగాణవాదులు వాటిపై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. మెదక్ జిల్లాలో బంద్ హింసాత్మకంగా మారింది. సంగారెడ్డి మండలంలో శ్రీచైతన్య విద్యాసంస్థల బస్సులు రెండింటిని తగులబెట్టారు. సిద్దిపేటలో ఉద్యానశాఖ కార్యాలయ ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. సీమాంధ్ర జిల్లాల నుంచి రావాల్సిన చాలా సర్వీసులు రద్దయ్యాయి.

**నిరసనలు... కేసులు... అరెస్టులు...**

బంద్ సందర్భంగా వివిధ ప్రాంతాలలో విధ్వంసాలకు పాల్పడిన వారిపై 114 కేసులు నమోదు చేశారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా 1978 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో మినహా బంద్ ప్రశాంతంగా జరిగిందని, రాష్ట్రంలో శాంతిభద్రతల సరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని డీజీపీ అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జిల్లాల్లో 231 చోట్ల రాస్తారోకో, 43 ప్రాంతాలలో దిష్టిబొమ్మ దహనాలు, 69 చోట్ల ధర్నాలు, 124 ప్రాంతాలలో ర్యాలీలు జరిగినట్లు ఆయన వివరించారు.

**పార్లమెంటులో తాడోపేడో**

తెలంగాణ వేడి మరోసారి పార్లమెంటును తాకింది. తెలంగాణను ఇస్తారా? అయితే ఎప్పట్లో? తేల్చి చెప్పండి? అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని టీఆర్ఎస్ అధినేత

కేసీఆర్ నిలదీయనున్నారు. కేంద్రంతో అమీతుమీ తేల్చుకునేందుకు లోక్‌సభలో బుధ వారం వాయిదా తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఆయన సిద్దమయ్యారు. అందుకు స్పీకర్ అనుమతి కూడా తీసుకున్నారు. కేసీఆర్‌కు బీజేపి నేత సుష్మా స్వరాజ్, ఎన్డీయే కన్వీనర్ శరద్‌యాదవ్, సీపీఐ నేత గురుదాస్ గుప్తాలు ఆయనకు హామీ ఇచ్చారు.

**తెలంగాణను జైలుగా మారుస్తున్నారు : ప్రొ.కోదండరాం**

శాంతియుతంగా ఉద్యమిస్తున్న తెలంగాణవాదులందరినీ ప్రభుత్వం అరెస్టులు చేసి తెలంగాణను జైలుగా మారుస్తున్నదని తెలంగాణ రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బంద్‌లో భాగంగా తార్నాకలో నిరసన తెలుపుతున్న కోదండరాంను అక్కడ అరెస్టు చేశారు.

**23 ఫిబ్రవరి 2011:**

**తెలంగాణతో... దద్దరిల్లిన పార్లమెంట్**

ప్రత్యేక తెలంగాణ డిమాండ్ సృష్టించిన ప్రకంపనలతో ఢిల్లీ సర్కార్ దద్దరిల్లింది. కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపి, టీడీపీ సభ్యులు ముక్తకంఠంతో చేసిన జై తెలంగాణ నినాదాలతో లోక్‌సభ మార్మోగింది. సభ పజావుగా సాగలేని స్థితిలో మూడు సార్లు వాయిదా పడింది. సొంత పార్టీ ఎంపీలే ప్రతిపక్ష స్థాయిలో ఆందోళనకు దిగడంతో రగిలిన తెలంగాణ సెగ... హస్తినలో కాంగ్రెస్‌కు బొబ్బలు కట్టించింది. కాంగ్రెస్ పార్టీకే చెందిన కొందరు ఎంపీలు సమైక్యాంధ్ర ఆవశ్యకతను తెలియజేస్తూ కరపత్రాలు పంచడంతో ఏం చేయాలో పాలుపోని సంకట స్థితిలో ప్రభుత్వం పడింది. ఈ పరిణామాలతో సభ్యులను శాంత పర్చేందుకు ప్రధాని సైతం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

సభ ప్రశ్నోత్తరాల ప్రారంభంలోనే ఉదయం 11గంటలకు టీఆర్ఎస్ ఎంపీలు కేసీఆర్, విజయశాంతిలు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. సభలో అప్పటికే తెలంగాణ సభ్యుల జైతెలంగాణ నినాదాలతో మార్మోగుతోంది. దీంతో సభ మూడు సార్లు వాయిదాపడింది. సభ తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్షనేత సుష్మాస్వరాజ్ మాట్లాడుతూ సొంత పార్టీ ఎంపీలే ఆందోళన చేస్తుంటే అర్థం చేసుకోకుండా చేతులు ముడుచుకుని ఎందుకు కూర్చుంటున్నారంటూ ప్రశ్నించారు. "తెలంగాణలో ఏం జరుగుతోంది ఏమైనా ఉంటే అది ఒక్క రబ్బరు బుల్లెట్ల కాల్పులు మాత్రమే" అంటూ దుయ్యబట్టారు. బిల్లు ప్రవేశపెడితే ఒక్క బీజేపీయే కాకుండా యావత్ ఎన్డీయే మద్దతిస్తుందని ఆమె ప్రకటించడంతో కాంగ్రెస్ పెద్దలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తర్వాత ఎంపీలు ప్రధానిని కూడా కలుసుకొని తెలంగాణలోని పరిస్థితులను వివరించారు. మీ హామీల వల్లే తెలంగాణలో అశాంతి రగులుతోందని ఆరోపించారు. చివరకు బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు ఆగాలని, ఆ తర్వాత పరిష్కారంపై ఒక అవగాహనకు

వద్దామని ప్రణబ్ సూచించడంతో శాంతించిన ఎంపీలు.. మార్చి 1 వరకు ఆగుతామని, ఆ తర్వాత మళ్ళీ సభను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

అంతకుముందు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ... రాష్ట్ర విభజనను ఒప్పుకోబోమని.. ఒకవేళ విభజిస్తే హైదరాబాద్‌ను తెలంగాణ రాజధానిగా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే తమ పార్టీ యూపీఏకి మద్దతు ఉపసంహరించు కుంటుందని హెచ్చరించారు. సమైక్యవాదులు కూడా సభలోపల, వెలుపల హల్‌చల్ సృష్టించారు. తెలంగాణ ఇస్తే 23 ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు తెరపైకి వస్తాయని సమాంధ్ర ఎంపీలు సభలో కరపత్రాలు పంచడం సంచలనం రేపింది. మే నెలలో తెలంగాణ సమస్యను కేంద్రం పరిష్కరిస్తుందని చెప్పిన లగడపాటి... ఒకవేళ అప్పటివరకు పరిష్కరించకపోతే 2014లో ప్రజలే పరిష్కరిస్తారని చెప్పారు.

**రెండో రోజు బంద్ విజయవంతం...**

తెలంగాణ పోరు దద్దరిల్లింది. ఇంతవరకు కనీవినీ ఎరగని రీతిలో 48 గంటల బంద్ విజయవంతమైంది. రాజధాని సహా 10 జిల్లాల్లో వరుసగా రెండో రోజు కూడా ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనడం విశేషం. ఒక వైపు సహాయ నిరాకరణ, మరోవైపు రెండు రోజుల బంద్ కారణంగా పాలన పూర్తిగా స్తంభించి పోయింది. సింగరేణితో సహా అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు సంపూర్ణంగా బంద్‌కావడంతో సర్కారు వందల కోట్లల్లో ఆదాయాన్ని కోల్పోయింది.

ఆదిలాబాద్ జిల్లాలో ఆరు ఆర్టీసీ డిపోల నుంచి ఒక్క బస్సు కూడా బయటకు వెళ్లలేదు. ఉద్యోగులు డిపోలకు తాళాలు వేసి బంద్‌లో పాల్గొన్నారు. ఈ రెండు రోజుల్లో రూ. 1కోటి. 40లక్షల ఆదాయం నష్టపోయింది. తెలంగాణవాదులు రోడ్లపై వంటా-వార్పు నిర్వహించి, ఆటపాటలతో నిరసన తెలిపారు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో నందిగ్రాం ఎక్స్‌ప్రెస్‌ను అడ్డుకున్నారు. భైంసా మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాంకిషన్‌పటేల్ రాజీనామా చేశారు.

మహబూబ్‌నగర్‌లో విద్యార్థులు తుంగభద్ర రైలును గంట సేపు నిలిపివేశారు. పోలీసులు వారిని నిలువరించేందుకు ప్రయత్నించినా దేవరకద్ర వరకు పలు చోట్ల చైను లాగుతూ రైలును ఆపారు. న్యాయవాదులు రోడ్డుపై వంటా-వార్పు నిర్వహించారు. జర్నలిస్టులు ర్యాలీతో బంద్‌కు మద్దతు పలికారు. ఆర్టీసీ ఉద్యోగులు బస్టాండ్‌లో కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు జడ్పీ కార్యాలయం ముందు మాక్ అసెంబ్లీని నిర్వహించారు. నందిన్నె, మల్దకల్‌లలో గవర్నర్, మంత్రుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆత్మకూరు మండలం వాల్మీకి నగర్‌కు చెందిన బోయ భద్రన్న(52) ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహుతికి

పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీకే చెందిన నేతలు విధ్వంసం సృష్టించారు. టీడీపీ కార్యాలయానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు.

నల్గొండ జిల్లాలో ఏడు డిపోలలో 725బస్సులు నిలిచిపోయాయి. రూ.కోటి ఆదాయం కోల్పోయింది. హైదరాబాద్ – విజయవాడ రహదారిపై తెలంగాణవాదులు వంటా–వార్పు నిర్వహించారు. తిప్పర్తిలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో రాజకీయ నాయకులు, జర్నలిస్టులు క్రికెట్, కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. పలు చోట్ల ఉద్యోగులు మాక్ అసెంబ్లీని నిర్వహించారు. మరోవైపు సీపీఐ దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. నూతనకల్ మండలం వెంకిపల్లిలో టీచర్లు రోడ్డుపైనే పాఠాలు చెప్పారు. శాలిగౌరారంలో విద్యుత్ సిబ్బందిని నిర్బంధించారు.

రంగారెడ్డి జిల్లా తాండూరులో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. జాతీయ రహదారులపై వంటావార్పు జరిగింది. వికారాబాద్‌లో మన్మాడ్ ఎక్స్‌ప్రెస్‌ను 20 నిమిషాలు ఆపారు. ఆర్టీసీ డిపోలకు తాళం వేయడంతో ఒక్క బస్సు బయటకు రాలేదు. టీఆర్ఎస్, టీజేఏసి మోటర్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పలుచోట్ల సోనియా, సీఎం, గవర్నర్, లోక్‌సత్తా ఎమ్మెల్యే జేపీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. పరిగి ఆర్టీసీ డిపో ఎదుట ధూంధాం నిర్వహించారు. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ కార్యాలయంపై దాడి చేసి తగులపెట్టడానికి ప్రయత్నించారు.

మెదక్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సంగారెడ్డితో పాటు జిల్లాలో ఎక్కడా బస్సులు నడవలేదు. కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. టీజేఏసి మౌన ప్రదర్శన చేసింది. పలుచోట్ల జరిగిన వంటావార్పు కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీష్‌రావు, పద్మాదేవేందర్ తదితర టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. కొడపాక మండలం మేదినీపూర్‌లో జరిగిన రాస్తారోకోలో గద్దర్, విమలక్క, పటాన్‌చెరు రాస్తారోకోలో టీఆర్ఎస్ నేత రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు. న్యాయవాదులు, విద్యుత్ తదితర విభాగాల ఉద్యోగులు నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో వ్యాపార, విద్యాసంస్థలు పూర్తిగా సహకరించాయి. ఖమ్మంలో టీజేఏసి బ్యానర్ ప్రదర్శన, బస్టాండ్ సెంటర్‌లో అతిపెద్ద మానవహారం, విద్యుత్ ఉద్యోగుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. సోనియా, మన్మోహన్, గవర్నర్, సీఎం, చంద్రబాబు, మంత్రి వెంకట్‌రెడ్డి బొమ్మలకు ఉరివేసినట్లు ప్రదర్శన నిర్వహించారు. వికలాంగులు సైతం ట్రైసైకిళ్లతో ర్యాలీలో పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో రోడ్లన్నీ వెలవెలబోయాయి. అన్ని రకాల వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఉద్యోగులు, న్యాయవాదులు, డాక్టర్లు,

వ్యాపారులు రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. వైద్యులు సైతం ఆస్పత్రులను మూసివేశారు. అయితే అత్యవసర సేవల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

కరీంనగర్ జిల్లా జనజీవనం స్తంభించిపోయింది. ఆర్టీసీ డిపోలకు తాళాలు వేయడంతో బస్సులు రోడ్డెక్కలేదు. కరీంనగర్‌లో టీడీపీ ర్యాలీని విద్యార్థి జేఏసి అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. బంద్‌లో భాగంగా ఓదెల, కొలనూరులలో తెంగాణ, సింగరేణి, భాగ్యనగర్ రైళ్లను నిలిపివేశారు. జిల్లాలోని పలుచోట్ల సోనియా, గవర్నర్, సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. తాడికల్‌లో సోనియా దిష్టిబొమ్మను ఇంటింటా చెప్పులతో కొట్టించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. హుస్నాబాద్ లో నిర్వహించిన ధూంధాంకు గద్దర్ హాజరయ్యారు. వేములవాడ మండలం శాత్రాజుపల్లి, ధర్మపురి, కరీంనగర్‌లలో మహిళల దీక్షా శిబిరాలను జాగృతి అధ్యక్షురాలు కవిత సందర్శించి సంఘీభావం తెలిపారు. తెలంగాణ కోసం కమాన్‌పూర్ మండలం బేగంపేటలో నగునూరి తిరుమల్ (19) అనే డిగ్రీ విద్యార్థి పురుగుల మందు తాగి, జమ్మికుంట మండలం నాగంపేటలో పంజాల ఉమ (22) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

వరంగల్ జిల్లాలో బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. బస్సులు, ఆటోలు నడవలేదు. తాళ్లపూసపల్లి వద్ద మణుగూరు ఫ్యాసింజర్ బోగిని దగ్ధం చేశారు. ధర్మసాగర్ సమీపంలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ను అరగంట ఆపారు. సుబేదారిలోని అమరవీరుల స్థూపం వద్ద 'లక్షగళ గర్జన – లక్షగళ నివాళి' కార్యక్రమాన్ని నిర్వహించారు. హన్మకొండలో పొన్నాల లక్ష్మయ్య ఇంటిని ముట్టడించేందుకు యత్నించగా జరిగిన పోలీసు లాఠీచార్జిలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పెద్ది సుదర్శన్ రెడ్డి గాయపడ్డారు. ఉద్యోగుల సహాయ నిరాకరణ కొనసాగింది. జిల్లా అంతటా ర్యాలీలు, రాస్తారోకోలు, వంటావార్పులు నిర్వహించారు.

హైదరాబాద్‌లో రెండో రోజు జనజీవనం స్తంభించింది. ఆర్టీసీ బస్సులను నడపలేదు. తెలంగాణవాదులు రోడ్డుపైనే వంటావార్పు చేసి నిరసన తెలిపారు. కొన్ని చోట్ల విధ్వంసం జరిగింది. ఓయూలో ఆందోళనలు, నిరసనలతో అట్టుడికిపోయింది. బీహెచ్ఈఎల్ ఉద్యోగులు 8వేల మంది విధులను బహిష్కరించి బంద్‌లో పాల్గొన్నారు.

**సహాయ నిరాకరణ నిరవధికం: ప్రొ.కోదండరాం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు సహాయ నిరాకరణ కొనసాగుతుందని తెలంగాణ జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం ప్రకటించారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న నిరసనలను యథావిధిగా కొనసాగించాలని గురువారం జేఏసి స్టీరింగ్ కమిటీ సమావేశం తర్వాత అదనంగా చేపట్టే కొత్త కార్యక్రమాలను వెల్లడిస్తామని అన్నారు. టీఆర్ఎస్, బీజేపి, సీపీఐ ఎమ్మెల్యేలను బలవంతంగా బయటకు పంపి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సిగ్గుచేటని

అన్నారు. తెలంగాణ ఇస్తే దేశంలో కొత్తగా 24 రాష్ట్రాల డిమాండ్లు వస్తాయని పార్లమెంటులో కరపత్రాలు పంచడంపై కోదండరాం మండిపడ్డారు. గతంలో మూడు రాష్ట్రాలు కొత్తగా ఏర్పడినపుడు ఎన్ని డిమాండ్లు ముందుకొచ్చాయని ప్రశ్నించారు.

### ప్రభుత్వ బెదిరింపులకు భయపడం: ఉద్యోగ సంఘాల నేతలు

తెలంగాణ కోసం సహాయనిరాకరణ చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం చేసే 'నో వర్క్.. నో పే' బెదిరింపులకు భయపడేది లేదని ఉద్యోగ సంఘాల నేతలు దేవిప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్‌లు తేల్చిచెప్పారు. తాము విధుల్లో ఉన్నప్పుడు చేసిన అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వలేదన్నారు. గతంలో సమ్మె చేసి విరమించిన తర్వాత పెండింగ్‌లో పడిన తమ పనిని తామే చేసుకున్నామని చెప్పారు. 'నోవర్క్ నోపే'కు రాష్ట్రంలో తావే లేదని, ఒకవేళ అదే జరిగితే తాము విధుల్లో చేరాక పెండింగ్‌లో ఉన్న పాత పనిని చేయబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### త్వరగా తేల్చండి: అధిష్టానానికి మంత్రుల లేఖ

తెలంగాణలో పరిస్థితి బాగాలేదని, విభజనపై త్వరగా తేల్చాలని తెలంగాణ మంత్రులు యూపీఏ అధినేత్రి సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీ, ఏకే ఆంటోని, ఆస్కార్ ఫెర్నాండేజ్, అహ్మద్ పటేల్, హోంమంత్రి చిదంబరం తదితరులకు లేఖలు రాశారు. దీనిపై మంత్రి ముఖేష్ గౌడ్ మినహా అందరూ సంతకాలు చేశారు. సహాయ నిరాకరణలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని, ఇక ఏమాత్రం ఉపేక్షించినా లాభం లేదని లేఖ ద్వారా వివరించారు.

## 25 ఫిబ్రవరి 2011:

### తెలంగాణపై లోక్‌సభలో మళ్లీ లొల్లి

పార్లమెంటు సమావేశాలు ప్రారంభమై నాలుగోరోజు కూడా తెలంగాణ అంశం ఉభయసభలో మార్మోగింది. వాయిదా తీర్మానాన్ని అనుమతించాలంటూ టీఆర్ఎస్ ఎంపీలు కేసీఆర్, విజయశాంతి గురువారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం కాగానే డిమాండ్ చేశారు. ఐదు నిమిషాలు ఓపిక పట్టిన స్పీకర్ సభను 11.15వరకు వాయిదా వేశారు. అనంతరం సుష్మాస్వరాజ్‌ను, కేసీఆర్ ను పిలిపించి బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు ఓపిక పట్టాలని కోరారు. దీంతో కేసీఆర్, విజయశాంతి సభ నుంచి వెళ్లిపోయారు. రాజ్యసభలో బీఎస్పీ సభ్యుడు బ్రజేశ్ పాఠక్ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రసంగంలో తెలంగాణ ఏర్పాటుకు మద్దతిస్తున్నామని ప్రకటించారు. బీజేపి సభ్యుడు వెంకయ్యనాయుడు, కాంగ్రెస్ సభ్యుడు జేడీ శీలం కూడా ఈ అంశాన్ని త్వరగా తేల్చాలని కోరారు. మార్చి 1 తర్వాత కేంద్రంతో తాడోపేడో తేల్చుకుంటామని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు.

## బిల్లుకు తొలి ఓటు నాదే: టీడీపీ ఎంపీ రమేష్ రాథోడ్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెడితే అందరికంటే ముందు తాను ఓటేస్తానని, తమ పార్టీకి చెందిన నామా నాగేశ్వర్‌రావు, గుండు సుధారాణిలు కూడా అనుకూలంగా ఓటు వేస్తారని టీడీపీ ఎంపీ రమేష్ రాథోడ్ ప్రకటించారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, అధికార పార్టీ ఎంపీలు నాటకాలాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మార్చి 5 వరకు సహాయ నిరాకరణ: ఉద్యోగ సంఘాలు

తమ డిమాండ్లపై ప్రభుత్వానికి విధించిన గడువు ముగిసినప్పటికీ ఎలాంటి స్పందన లేనందున సహాయ నిరాకరణను మార్చి 5 వరకు కొనసాగించాలని, అప్పటి వరకు స్పష్టమైన ప్రకటన రాకపోతే మెరుపు సమ్మెను ప్రారంభించి నిరవధికంగా కొనసాగించాలని ఉద్యోగ సంఘాల జేఏసి నిర్ణయించింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే అవసరమైతే సచివాలయానికి తాళాలు వేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సచివాలయ తెలంగాణ ఉద్యోగుల జేఏసి హెచ్చరించింది.

## పోలీసు శాఖలోనూ సహాయ నిరాకరణ

తెలంగాణ రాష్ట్రం కోసం ప్రభుత్వోద్యోగులు ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో తాజాగా పోలీసు శాఖలోని కొన్ని జిల్లాల మినిస్టీరియల్ సిబ్బంది చేరారు. దీంతో పోలీసు ఉన్నతాధికారుల్లో కలవరం ప్రారంభమైంది. మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో కొంత మంది మినిస్టీరియల్ సిబ్బంది సహాయ నిరాకరణలో భాగంగా ఆలస్యంగా కార్యాలయానికి రావడంతో ఎస్పీ వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో జేఏసి కలుగజేసుకుని ఎస్పీ కార్యాలయ ముట్టడించగా వెనక్కి తగ్గారు. దీన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణ మిగితా జిల్లాల్లో కూడా ఒకటి, రెండు రోజుల్లో జరుగవచ్చున్న సమాచారం నిఘా వర్గాల ద్వారా ప్రభుత్వానికి అందింది. దీంతో డీజీపీ అరవిందరావు అప్రమత్తమయ్యారు.

## తెలంగాణ 'లా' విద్యార్థుల ధర్నా

పార్లమెంటులో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఓయూ 'లా' విద్యార్థులు గురువారం ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వీరు పార్లమెంటు వద్దకు వెళుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## టార్గెట్ కాంగ్రెస్: జేఏసీ భేటీలో వాడివేడి చర్చ

ఇకపై అధికారం కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయాలని తెలంగాణ జేఏసి నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్

తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని తప్పుబట్టింది. సహాయ నిరాకరణకు సహకరించకపోగా... బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వానికి సహకరించడం పట్ల ధ్వజమెత్తింది. తెలంగాణ కాంగ్రేస్ మంత్రులు, ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకుని ఉద్యమించాలని, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించింది. ఈ మేరకు జేఏసి కార్యచరణను చైర్మన్ ప్రొ.కోదండరాం ప్రకటించారు.

ఈనెల 25, 26 తేదీల్లో ర్యాలీలు, 27న కాంగ్రేస్ నేతల వైఖరిని ఎండగడుతూ మీడియా సమావేశాలు, 28న మండల, జిల్లా స్థాయిలలో కాంగ్రేస్ నేతల దిష్టిబొమ్మల దహనాలు చేయాలని పిలుపునిచ్చింది. మార్చి రెండో వారంలో 'ఛలో హైదరాబాద్' నిర్వహిస్తామన్నారు.

బీజేపి సీనియర్ నేత వనం ఝాన్సీ మృతికి సంతాపంగా ప్రకటిస్తూ తీర్మానం చేశారు. తెలంగాణ కోసం టీఆర్ఎస్ ఎంపీలు పోడియం వద్దకు వెళ్లగా, వారికి మద్దతు తెలిపిన సుష్మాస్వరాజ్, ఎన్డీయే పక్షాలు, సీపీఐకి అభినందనలు తెలుపుతూ తీర్మానాలు చేశారు. సహాయ నిరాకరణ చేస్తున్న ఉద్యోగులకు రాజకీయ పార్టీల నుంచి ఆశించినంత మద్దతు లభించలేదనే అభిప్రాయం వ్యక్తమైంది.

## అసెంబ్లీలో సస్పెండైన ఎమ్మెల్యేలకు సన్మానం

'గవర్నర్‌కు మాకు మధ్య ఆస్తి తగాదాల్లేవు. వ్యక్తిగతంగా విభేదాల్లేవు. తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయడానికే ఆయనొచ్చారు. తెలంగాణ ప్రజలను అవమానపరుస్తూ, అవహేళన చేస్తూ రాజ్యంగేతర శక్తిగా మారారు.' అని ఎమ్మెల్యే హరీష్‌రావు మండిపడ్డారు. శాసన సభలో ఫిబ్రవరి 17న ఘటనలో సస్పెండైన టీఆర్ఎస్, టీడీపీ ఎమ్మెల్యేలు హరీష్‌రావు, విద్యాసాగర్, రేవంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డిలను గురువారం తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కమిటీ సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు చుక్కా రామయ్య, దిలీప్ కుమార్, జేఏసి ప్రతినిధి ప్రకాశ్, టీపీఎఫ్ ఉపాధ్యక్షుడు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## సెటిలర్ల హక్కులను పరిరక్షిస్తాం: కోదండరాం

'మనం అందరం కలిసి పోరాడుదాం రండి.. తెలంగాణ ఏర్పడితే మీరూ మాలో మమేకమేనని సీమాంధ్ర సెటిలర్లకు జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు కాలనీలో మేము సైతం.. తెలంగాణ కోసం పోరాడుతామని హౌజింగ్ బోర్డు కాలనీలో సీమాంధ్రులు తెలంగాణ రాష్ట్ర సాధనలో దీక్షలకు పూనుకున్నారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి జేఏసి చైర్మన్ విద్యావెంకట్, సమన్వయకర్తగా కోచైర్మన్ పన్నాల హరీష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం, శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ సిటిలర్లు

అభద్రతాభావాన్ని విడనాడి, అందరం సమిష్టిగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్నదమ్ముల్లా పోరాడుదాం రండని పిలుపునిచ్చారు. మీ భవిష్యత్తుకు మా భరోసా అని హామి ఇచ్చారు.

**25 ఫిబ్రవరి 2011:**

**మార్చి మొదటి వారంలో తేలుతుంది: కేసీఆర్**

తెలంగాణపై మార్చి మొదటి వారంలో ఏదో ఒకటి తేలుతుందని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారు. కేంద్రం చాలా సీరియస్‌గానే ఉందని, అయితే ఏ ప్రకటన చేస్తుందో వేచి చూడాలని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, జిల్లాల నేతలతో ఒకసారి, హైదరాబాద్ నేతలలో మరోసారి సమావేశ మయ్యారు. ఢిల్లీ మానసిక స్థితి తెలంగాణకు అనుకూలంగానే ఉందని చెప్పారు. రాష్ట్ర విభజనకు మానసికంగా సిద్దమవుతున్నారన్నారు. ఈనేపథ్యంలో మార్చిలోనే ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.

**'పల్లె పల్లె... పట్టాలపైకి': జేఏసి పిలుపు**

'తెలంగాణ కోసం చేపట్టిన సహాయ నిరాకరణ కార్యక్రమాల్లో భాగంగానే మార్చి ఒకటిన 'పల్లె పల్లె పట్టాలపైకి' అనే పేరుతో రైలు రోకోలు నిర్వహిస్తామని జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం ప్రకటించారు. కేంద్రంపై ఒత్తిడిని తెచ్చి, తెలంగాణపై నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితిని కల్పించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రైలు రోకో కార్యక్రమం మార్చి 1న ఉదయం 6 గంటలకు ప్రారంభమ వుతుందని చెప్పారు. ప్రస్తుతానికి 24గంటలు అనుకుంటున్నామని, ఇందులో మార్పులు ఉంటాయని చెప్పారు. రైలు రోకో విజయవంతం చేసుకున్నాక పెద్ద ఎత్తున 'ఛలో హైదరాబాద్' కార్యక్రమంపై దృష్టి పెడాతమని చెప్పారు.

**తెలంగాణ వద్దన్నది ఆద్వానీయే: చంద్రబాబు**

'హైదరాబాద్ తెలంగాణలోనే ఉన్నప్పుడు ప్రత్యేక రాష్ట్రం ఎందుకని బీజేపి అగ్రనేత అద్వాని 2004కు ముందే చెప్పారు. ఇప్పుడేమో టీడీపీ అడ్డుపడ్డందుకే ఇవ్వ లేదని చెబుతున్నారు. ఆరోజు మాది సమైక్యవాదమనే విషయం తెలుసు. ఆ తర్వాత మేం మా విధానం మార్చుకున్నాం' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఎవరి రాజకీయాలు వారు చేస్తూ.. మధ్యలో తమ పార్టీపైనే దాడులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.

**బుద్ధిలేని అధిష్టానం: జేసీ**

'అధిష్టానం బుద్ధిలేని పనిచేసింది. కాంగ్రెస్ స్వయంకృతాపరాధం వల్లనే రాష్ట్రానికి ఈ ఖర్మ పట్టింది. కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం 2009 డిసెంబర్

9న చేసిన తెలంగాణ ప్రకటన చేయకుంటే బాగుండేది. ఎవరినడిగి ఆ నిర్ణయం తీసుకున్నారు? హైకమాండ్‌లో ఎవరేం చేస్తున్నారో తెలియడం లేదు' అంటూ మాజీ మంత్రి జే.సి. దివాకర్‌రెడ్డి అధిష్టానంపై ఘాటుగా వ్యాఖ్యానించారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో విలేకరులతో ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విభజన తప్పని పక్షంలో హైదరాబాద్‌పై ప్రజాభిప్రాయ సేకరణ తప్పనిసరి అన్నారు.

### కేంద్రానికి వాస్తవాలు చెప్పండి: సీఎంకు పొన్నం విజ్ఞప్తి

తెలంగాణ ప్రాంతంలో ఉన్న వాస్తవ పరిస్థితిని, ప్రజల ఆకాంక్షలను కేంద్రానికి తెలియజేయాలని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్ పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం విద్యార్థులు, ఉద్యోగులు, న్యాయవాదులు, సాధారణ ప్రజలు ఉద్యమంలో పాల్గొంటున్నారు. 15 మంది రాష్ట్ర మంత్రులు, 11 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా తెలంగాణ కోసం పోరాడుతున్నారు. కాబట్టి వాస్తవాలను అధిష్టానానికి చెప్పాలన్నారు.

### తెలంగాణ ప్రజలది ఆత్మగౌరవ పోరాటం: ప్రొ.కోదండరాం

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రజల ఆత్మగౌరవ పోరాటమని రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం అన్నారు. శుక్రవారం వాటర్‌బోర్డులో అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఉధృతమవుతున్న ఉద్యమంతో కాంగ్రెస్ ప్రభుత్వ దిగివచ్చి తెలంగాణ ఇవ్వాల్సిందేనని అన్నారు. ప్రస్తుత ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు, అధికారులు, సిబ్బంది కలిసిరావడం హర్షణీయమన్నారు.

పార్లమెంటులో తెలంగాణ బిల్లుపెట్టాలని, 610 జీవోను వెంటనే అమలు చేయాలని కోరుతూ మెట్రోవాటర్‌బోర్డులో చీఫ్ ఇంజనీర్లు నిరాహార దీక్ష చేపట్టారు. సహాయ నిరాకరణలో భాగంగా శుక్రవారం జరిగిన ఈ దీక్షకు పలువురు రాజకీయ నాయకులు, జేఏసి నాయకులు సంఘీభావం తెలిపారు.

ఖైరతాబాద్‌లోని మునిసిపల్, ఆర్అండ్‌బి శాఖ ఉద్యోగుల సహాయ నిరాకరణ ఉద్యమానికి జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ తెలంగాణ ఉద్యమం ఒక రైలు అయితే ఉద్యోగులు ఇంజన్ పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

ఎర్రమంజిల్‌కాలనీలోని పంచాయితీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలో సహాయ నిరాకరణ చేస్తున్న ఉద్యోగులకు టీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయ నిరాకరణ చేస్తున్న నాలుగు లక్షల ఉద్యోగులకు తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజల మద్దతుంటుందని స్పష్టం చేశారు.

### శ్రీకృష్ణ కమిటీ సభ్యుల దిష్టిబొమ్మల దహనం

తెలంగాణ విషయంలో శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందని, పెద్దమొత్తంలో డబ్బు మూటలు చేతులు మారాయని ఆరోపిస్తూ విద్యుత్ ఉద్యోగులు శ్రీకృష్ణ కమిటీ సభ్యుల దిష్టిబొమ్మలకు శవయాత్ర, దహన సంస్కారాలు నిర్వహించారు. సహాయ నిరాకరణలో భాగంగా విద్యుత్ ఉద్యోగుల జేఏసి అధ్యక్షుడు రఘు నేతృత్వంలో మింట్ కంపౌండ్‌లో వినూత్నంగా జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ఉద్యోగులు పాల్గొన్నారు. కమిటీ సభ్యుల దిష్టిబొమ్మలకు పాడెలు కట్టి శవయాత్ర నిర్వహించి, శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు నిర్వహించారు.

### ఓయూ విద్యార్థుల ఐక్యవేదిక ఆవిర్భావం

విద్యార్థి జేఏసీలకు ప్రత్యామ్నాయంగా విద్యార్థి ఐక్యవేదిక ఆవిర్భవించింది. జేఏసిల పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ దీన్ని ఏర్పాటు చేశారు. వారంతా ఇక ప్రత్యేక సంఘం పెట్టుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు విద్యార్థులు ఓయూ ఆర్ట్స్ కాలేజీలో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఐక్యవేదికలో ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ఉద్యోగులు, ప్రొఫెసర్లు, డాక్టర్లను భాగస్వాములుగా చేస్తామని తెలిపారు.

### 26 ఫిబ్రవరి 2011:

### 10లక్షల మందితో 10న హైదరాబాద్ ముట్టడి

'పార్లమెంటులో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పది లక్షల మందితో మార్చి 10న హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం. ఆలోగా నిర్ణయం తీసుకోకుంటే జరిగే పరిణామాలకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత' అని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హెచ్చరించారు. తెలంగాణ ఇంటర్ విద్య జేఏసి ఆధ్వర్యంలో శనివారం నాంపల్లిలోని ఇంటర్ విద్యా డైరెక్టరేట్ వద్ద ప్రారంభమైన ఉద్యోగుల సామూహిక నిరాహార దీక్ష శిబిరానికి కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దాదాపు రెండు వేల మంది అధ్యాపకులు, సిబ్బంది ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ ఇంటర్ బోర్డులో ఏడుగురు జాయింట్ డైరెక్టర్లు, ఐదుగురు డిప్యూటీ డైరెక్టర్లు ఉండగా అందరూ ఆంధ్రా వాళ్లేనని ఆయన చెబుతూ.. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల్లో ఒక్కరూ అర్హులు లేరా? అని నిలదీశారు.

తెలంగాణలో ఎక్కడికి వెళ్లినా తెలంగాణ నినాదమే వినిపిస్తున్నదని బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ఇదే చివరి పోరాటమని, తెలంగాణ వచ్చుడో... కాంగ్రెస్ చచ్చుడో ఖాయమని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ ద్రోహులు తగిన మూల్యం చెల్లిస్తారని గద్దర్ అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ మన చేతుల్లో

లేదని జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం అన్నారు. తెలంగాణ పాలు తాగిన కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెలను రాజీనమా చేసే వరకు తరిమికొట్టాలని పీఓడబ్ల్యూ నేత సంధ్య పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జనరల్ సెక్రటరీ అధ్యక్షత వహించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ నేత సూర్యం, జైబోలో తెలంగాణ చిత్ర దర్శకుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## హోరెత్తిన సచివాలయం

సచివాలయ ప్రాంగణం రణరంగమైంది. ఉద్యోగ జేఏసి నేతలను శనివారం చర్చలకు పిలిచి సచివాలయ గేటు వద్దనే అడ్డుకోవడంతో ఆందోళన ప్రారంభమైంది. ఉద్యోగులకు మద్దతుగా మంత్రి శంకర్‌రావు సైతం బైఠాయింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన పరిణామాలతో రెండు గంటల పాటు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్నం 1గంటకు చర్చలకు పిలిచారు. దీంతో జేఏసి అగ్రనేతలైన స్వామీగౌడ్, దేవిప్రసాద్, విఠల్, శ్రీనివాస్‌గౌడ్ రాగా తొలుత వారిని అడ్డుకుని అనంతరం అనుమతించారు. జేఏసి మహిళా నేతలైన రేచల్, మమత, రంజనలతో పాటు ఏలూరి శ్రీనివాసరావు తదితరులు మరో వాహనంలో రాగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన చేస్తున్న వారి వాహనాన్ని సాగర్‌లో ఎత్తిపారేస్తామంటూ దుర్భాషలాడారు. దీంతో నేతలు గేటు వద్దే బైఠాయించారు. విషయం తెలుసుకున్న జేఏసి చైర్మన్ కోదండరాం, టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, తెలంగాణ విమోచన సమితి నేత దిలీప్‌కుమార్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అక్కడికి చేరుకొని అందోళన చేస్తున్న వారికి మద్దతు తెలిపారు. ఈ ఆందోళనల నేపథ్యంలో మంత్రి వర్గ ఉపసంఘంతో చర్చలను బహిష్కరించారు. మహిళా నేతలను దూషించిన పోలీసులపై చర్యలు తీసుకుంటామని డీసీపీ సబర్వాల్ ఇచ్చిన హామీతో ఆందోళనను విరమించారు. కాగా తమను గేటు వద్ద అడ్డుకున్న అధికారులను సస్పెండ్ చేసేవరకు ప్రభుత్వంతో చర్చలకు వెళ్లబోమని జేఏసి నేతలు తెలిపారు.

## సహాయ నిరాకరణపై హైకోర్టులో పిటీషన్

సహాయ నిరాకరణ, పెన్‌డౌన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టులో శనివారం పిటీషన్ దాఖలైంది. అనంతపురం జిల్లాకు చందిన పి.నారాయణ అనే వ్యక్తి ఈ పిటీషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ, ఆర్థికశాఖల కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చారు. సహాయ నిరాకరణతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున ఉద్యోగులపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి వేతనాల్లో కోత పెట్టాలని పిటీషన్‌లో కోరారు.

## 27 ఫిబ్రవరి 2011:

## గర్జించిన తెలంగాణ కవులు

తెలంగాణ కవులు గర్జించారు. సీమాంధ్రుల పెత్తనంలోని సమైక్యపాలనను ఇక ఎంతమాత్రం సహించేది లేదని మరోసారి స్పష్టం చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేద్దామన్నారు. లక్ష్యం సాధించేంత వరకు విశ్రమించరాదని ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో ఆదివారం తెలంగాణ రచయితల వేదిక, సింగిడి తెలంగాణ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'తెలంగాణ కవుల గర్జన' సభ జరిగింది. పెద్ద సంఖ్యలో కవులు, రచయితలు హాజరయ్యారు. సభకు కవి జూలూరి గౌరీ శంకర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ప్రజాగాయకుడు గద్దర్, సినీ దర్శకుడు బి.నర్సింగరావు, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, వార్త పత్రిక సంపాదకులు టంకశాల అశోక్, కవులు జూకంటి జగన్నాథం, సంగిశెట్టి శ్రీనివాస్, నందిని సిద్ధారెడ్డి, జిలుకర శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఉద్యోగులు చేస్తున్న సహాయ నిరాకరణకు సహకరిద్దామని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ బిల్లును వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. మార్చి 1న రైలు రోకోను, 10న జరిగే మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలన్నారు.

## 01 మార్చి 2011:

## తెలంగాణలో "పల్లె పల్లె పట్టాలపైకి" విజయవంతం

తెలంగాణ ఉద్యమం రైలు పట్టాలనెక్కింది. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో తెలంగాణ జేఏసి ఇచ్చిన 'పల్లె పల్లె పట్టాలపైకి' ఆందోళనలతో తెలంగాణ అట్టుడికింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే రైళ్లపై తీవ్ర ప్రభావం పడింది. ఉత్తర–దక్షిణ భారతానికి మధ్య రైల్వేలింకు దాదాపుగా తెగిపోయినట్లుగా అధికారులు వెల్లడించారు. ఈ ఆందోళనతో రైల్వే శాఖకు సుమారు రూ.10కోట్ల నష్టం వాటిల్లిందని అంచనావేస్తున్నట్లు దక్షిణమధ్యరైల్వే పీఆర్వో చంద్రిమారాయ్ తెలిపారు. తెలంగాణ జేఏసి పిలుపు మేరకు జరిగిన రైలురోకో ప్రశాంతంగా ముగిసింది. రైల్‌రోకోలో పాల్గొన్న 1706 మందిని వివిధ ప్రాంతాలలో అరెస్టు చేశామని, 343 మందిని ముందస్తు అరెస్టులు చేశామని డీజీపి అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌పీసీ 151 ప్రకారం 151 కేసులు నమోదు చేశామని రైల్వే చట్టాల ప్రకారం ఐదు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణ జిల్లాల్లో 148 ప్రాంతాల్లో రైల్‌రోకో జరిగిందని వివరించారు. టీడీపీకి చెందిన 10మంది ఎమ్మెల్యేలు నాగం జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద రైల్‌రోకో నిర్వహించగా వారిని రైల్వే చట్టాల ప్రకారం సీఆర్‌పీఎఫ్‌లో కైసు నమోదైందని తిలిపారు.

### సహాయ నిరాకరణతో సర్కారు ఖజానాకు తూట్లు

సహాయ నిరాకరణ సెగ ప్రభుత్వ ప్రధాన ఆదాయ వనరులను తాకింది. సర్కారు ఖజానాకు వేల కోట్ల రూపాయలు తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, మద్యం అమ్మకాలు, రిజిస్ట్రేషన్ల ఆదాయానికి గండికొట్టింది. ఈ 15రోజుల్లో రూ.330కోట్ల వ్యాట్ ఆదాయం తగ్గింది. తెలంగాణ పదిజిల్లాల్లో హైదరాబాద్ మినహాయిస్తే మిగితా 9జిల్లాల్లో వ్యాట్ వసూళ్లకు బ్రేక్ పడింది. హైదరాబాద్‌లో ఈ–పేమెంట్ అమలులో ఉండడం, బ్యాంకులు పనిచేయడంతో వసూళ్లు జరిగాయి. మద్యం డిపోలలో పనిచేసే సిబ్బంది కూడా సహాయ నిరాకరణలో పాల్గొనడంతో మద్యం సరఫరాకు అంతరాయం ఏర్పడింది. డిస్టిలరీలు సైతం మూతపడ్డాయి. ఉద్యోగులతో చర్చించి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోకపోతే మద్యం ఆదాయానికి గండిపడనుంది. తెలంగాణ జిల్లాల్లో రిజిస్ట్రేషన్లు, భూ క్రయవిక్రయాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఈ ప్రభావం రియల్ ఎస్టేట్‌పై పడింది. దాదాపు రూ.2వేల కోట్ల లావాదేవీలు నిలిచిపోయాయి. రోజుకు కనీసం రూ.5కోట్ల నుంచి రూ.10కోట్ల వరకు ఆదాయం తగ్గిందని చెబుతున్నారు.

### సహాయ నిరాకరణపై సర్కారుకు హైకోర్టు నోటీసులు

సహాయ నిరాకరణలో పాల్గొనే ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టులో దాఖలైన పిటీషన్‌కు మూడు వారాల్లోగా కౌంటరు వేయాలని ప్రభుత్వానికి, ఉద్యోగ సంఘాల జేఏసీలకు హైకోర్టు మంగళ వారం నోటీసులు జారీచేసింది. పిటీషనర్ తరపు న్యాయవాది పీవీ కృష్ణయ్య వాదిస్తూ.. సహాయనిరాకరణ వలన ఇప్పటివరకు రూ.3వేల కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని, ప్రజా సంక్షేమం కుంటుపడిందని అన్నారు. ఇందులో పాల్గొన్న ఉద్యో గుల జీతభత్యాల్లో కోత విధించాలన్నారు. వాదనలు విన్న హైకోర్టు డివిజన్ బెంచ్ కౌంటర్ దాఖలు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి, టీఎన్జీవో సంఘాల నాయకులకు నోటీసులు జారీ చేసింది.

### 03 మార్చి 2011:

### ఈనెల 5 వరకు సహాయ నిరాకరణ

తెలంగాణ ఉద్యోగులు చేపట్టిన సహాయ నిరాకరణను ఈనెల 5 వరకు కొనసాగించాలని, తర్వాత కొనసాగింపుపై ఏరోజుకారోజు నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసి నిర్ణయించింది. ఈనెల 10న జరిగే మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని తీర్మానించింది. తెలంగాణ బిల్లుపై ప్రభుత్వ స్పందన రాకపోతే ఈనెల 12 తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్లాలని కూడా జేఏసి యోచిస్తోంది. దీనిపై తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌తో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసి నేతలు చర్చలు జరిపారు. ఇందులో ఉద్యోగాల్లో 42% వాటా, సచివాలయం, అసెంబ్లీలతో పాటు ప్రభుత్వ ప్రధాన శాఖాధిపతుల కార్యాలయాల్లోని ఉద్యోగాల్లో 42% వాటా తదితర 9 డిమాండ్లను ఉంచారు. వీటిపై సానుకూలంగా స్పందిస్తే మిగితా 8 డిమాండ్లపై పరిశీలన జరుపుతామని పేర్కొన్నట్లు సమాచారం.

**05 మార్చి 2011:**

**సహాయ నిరాకరణ విరమణ**

పార్లమెంటులో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ గత నెల 17న తెలంగాణ ఉద్యోగులు సహాయ నిరాకరణకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగ సంఘాల జేఏసి నేతలు శుక్రవారం మంత్రివర్గ ఉపసంఘంతో ఓసారి, ముఖ్యమంత్రితో మరోసారి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఉద్యోగులకు సంబంధించిన పలు డిమాండ్లపై ప్రబుత్వం సానుకూలంగా స్పందించిందని, దీనిపై లిఖితపూర్వక హామీ ఇచ్చిందని, ఈ ఒప్పంద పత్రంపై జేఏసి నేతలు, మంత్రులు సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం...

రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుపై రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ కమిషన్ ఏర్పాటవుతుంది.

రాష్ట్రపతి ఉత్తర్వులోని 14(ఎఫ్)పేరా తొలగించాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి వినిపించేందుకుగాను జేఏసి నేతలను రాష్ట్రప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళుతుంది. ఈ సందర్భంగా ప్రధానిని కలిసే అవకాశం కూడా కల్పిస్తుంది.

రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుకు శాసనసభా సంఘం సహా మంత్రివర్గ ఉపసంఘం, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అధ్యక్షతన పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు

రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడి రాష్ట్రస్థాయి కార్యాలయాలు, శాఖాధిపతుల కార్యాలయాలు, సచివాలయంలో తెలంగాణ జిల్లాలకు చెందిన ఉద్యోగులకు తగిన వాటాను కల్పించేందుకుగానూ ఓ విధానాన్ని రూపొందిస్తారు.

ఔట్ సోర్సింగ్ నియామకాల్లో స్థానిక అభ్యర్థులకే అవకాశం లభిస్తుంది. సచివాలయంతోపాటు శాఖాధిపతుల కార్యాలయాలు, రాష్ట్రస్థాయి అధికారుల నియామకాలకు సంబంధించిన ఔట్ సోర్సింగ్ నియామకాల్లో 'ఫెయిర్ షేర్' ప్రాతిపదిక అమలవుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ కమిటీ ఏర్పాటు చేస్తారు.

**09 మార్చి 2011:**

**మిలియన్ మార్చ్ - ఆంక్షల దిగ్బంధంలో నగరం**

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేసేందుకు ఆందోళనకారులు... అనుమతి

లేదంటూ అడ్డుకునేందుకు పోలీసులు. ఎవరి ఏర్పాట్లు వారివి. ట్యాంక్‌బండ్‌పై మధ్యాహ్నం 1 గంటకు మొదలయ్యే మార్చ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుంది. దీంతో పోలీసులు భారీ స్థాయిలో ఆంక్షలు విధించారు. గురువారం 15 మార్గాల్లో రాకపోకలను నిషేధించారు. ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్, నారాయణగూడ ఫ్లైఓవర్‌లు బంద్. ఇక నక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే మార్గాలన్నీ పోలీసులు మూసేశారు. గురువారం ఎంఎంటీఎస్ రైలు సర్వీసులన్నీ రద్దు అయ్యాయి. ఇవే కాకుండా గోల్కొండ, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు వరంగల్, మణుగూరు, కర్నూలు, గుంటూరు, గుల్బర్గా, మిర్యాలగూడ, వికారాబాద్, వాడి, కామారెడ్డి, రేపల్లే, మహబూబ్‌నగర్, మిర్జాపల్లి, బోధన్, తాండూరులకు వెళ్లే అనేక ప్యాసింజర్‌లనూ దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. మొత్తంగా గురువారం తెలంగాణ దిగ్బంధంలో ఉంది.

మార్చ్ చేసి తీరుతామని టీడీపీ తెలంగాణ ఎమ్మెల్యేలు స్పష్టంగా ప్రకటించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ సంఘీభావం మాత్రమే ఉంటుందని, మార్చ్‌లో ప్రత్యక్షంగా పాల్గొనబోమని పీసీసీ అధ్యక్షుడు డీఎస్ తెలిపారు. కేసీఆర్ పాల్గొనే విషయమై ప్రకటన చేయలేదు. పార్టీ పరంగా తాము ఈ కార్యక్రమంలో పాల్గొంటామని టీఆర్ఎస్ ఎల్పీ నాయకుడు ఈటెల రాజేందర్ ప్రకటించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం కిరణ్‌ను కలిసి మార్చ్‌కు అనుమతివ్వాలని, అరెస్టు చేసిన వారిని వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జూనియర్ న్యాయవాదుల సంఘం మార్చ్‌కు పూర్తి మద్దతు ప్రకటించింది. గురువారం అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం పోలీసుల అధికారులతో చర్చించారు.

**ప్రతిజ్ఞ:**

'తెలంగాణ రాష్ట్రం కోసం అమరులైన వీరులు, త్యాగధనుల సాక్షిగా తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమిస్తున్న నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల కర్తవ్య దీక్షలో భాగస్వామినౌతాను. వనరులపై అధికారం, ఆత్మగౌరవం, స్వయంపాలన కొరకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ధ్యేయంగా శాంతియుతంగా, ప్రజాస్వామికంగా తుది వరకు పోరాడుతాం. వ్యతిరేక శక్తుల కుట్రలు, కుతంత్రాలు ఛేదిస్తాం. నిర్బంధాలను ఎదిరిస్తాం. అంతిమంగా తెలంగాణ తల్లి సంకెళ్లను బద్దలు కొట్టి వీరులుగా విజయం సాధిస్తాం. జై తెలంగాణ! జైజై తెలంగాణ!!' తెలంగాణ జేఏసీ తరఫున ఈ ప్రతిజ్ఞను జేఏసీ సమన్వయకర్త పిట్టల రవీందర్ రూపొందించారు.

## ఆంక్షలతో మిలియన్ మార్చ్‌ను ఆపలేరు

'మేం ఎవరి ఆస్తులూ, కొల్లగొట్టడం లేదు. భూములు ఆక్రమించుకోవడం లేదు. శాంతియుత నిరసనకే పూనుకున్నాం. దీన్ని సజావుగా నిర్వహించేందుకు వీలు కల్పించాలి. లేకుంటే పరిస్థితి ఇతర పరిణామాలకు దారితీస్తుంది' అని తెలంగాణ

జేఏసి హెచ్చరించింది. టీజేఎఫ్ నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కోదండరాం పాల్గొని మాట్లాడారు. మిలియన్ మార్చ్‌లో పాల్గొనేందుకు వస్తున్న తెలంగాణ ప్రజలను ఎక్కడికక్కడ అరెస్టు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోనే 10వేల మందిని అరెస్టు చేశారు. జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. మిలియన్ మార్చ్‌ను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు, చెక్‌పోస్టులు తెలంగాణ ప్రజలు ఉఫ్... అంటే గాల్లో కలిసిపోతాయి. జనాన్ని ఏ అడ్డంకులు ఆపలేవు. అని అన్నారు.

పోలీసులు అమానుషంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 'ముషీరాబాద్‌లో ఒక తెలంగాణవాది దొరకలేదని 7 సంవత్సరాల వయసున్న ఆయన కుమారుడిని అరెస్టు చేవారు. ఖమ్మం జిల్లాలో ఇంటర్ పరీక్షలు రాసేందుకు వస్తున్న విద్యార్థులను కూడా అరెస్టు చేశారు. ప్రయాణీకులను అనుమానంతో రైళ్ల నుంచి దింపేశారు' అని వివరించారు. గురువారం సాయంత్రం 4 గంటలకు టాంక్‌బండ్‌పై తెలంగాణ ప్రతిజ్ఞ జరుగుతుందని కోదండరాం తెలిపారు. హైదరాబాద్‌కు, టాంక్‌బండ్‌కు రాలేని వాళ్లు ఎక్కడికక్కడే 4 గంటలకు ప్రతిజ్ఞ నిర్వహించాలని సూచించారు.

### 10 మార్చి 2011:

### మిలియన్ మార్చ్ సక్సెస్... రణరంగమైన ట్యాంక్‌బండ్

తెలంగాణ రాజకీయ జేఏసి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'మిలియన్ మార్చ్' విజయవంతమైంది. తీవ్ర నిర్బంధం నడుమ ఊహించిన దానికన్నా ఎక్కువ మందే హాజరయ్యారు. జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం, టీఆర్ఎస్ నేత నాయని నర్సింహారెడ్డి వంటి సీనియర్ నేతలను పోలీసులు ముందే అరెస్టు చేసినా, పూర్తి స్థాయి నాయకత్వం అందుబాటులో లేకున్నా, హైదరాబాద్‌లో అనేక రోడ్లను దిగ్బంధించినా తెలంగాణ వాదులు ముందుకు కదిలారు.

మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్యాంక్‌బండ్‌పైకి ఎవరూ రాలేదు. ట్యాంక్ బండ్ చుట్టూ శత్రు దుర్భేద్యంగా కనిపించిన భద్రతా ఏర్పాట్లు ఆందోళనకారుల మూకుమ్మడి రాకతో చిత్తయ్యాయి. అసెంబ్లీ నుంచి టీఆర్ఎస్, టీడీపీ ఎమ్మెల్యేలు ట్యాంక్‌బండ్ దగ్గరకు వెళ్లేందుకు బయల్దేరినట్లు సమాచారంతో సగం మంది పోలీసులు అసెంబ్లీ దగ్గరకు చేరుకున్నారు. ఇదే అదనుగా అప్పటికే లిబర్టీ, జీహెచ్ఎంసీ నుంచి విడుతల వారిగా 100 నుంచి 200 మంది చొప్పున తెలంగాణ వాదులు ఉన్న కొద్ది మంది పోలీసులను తోసుకుని రావడం మొదలు పెట్టిరు. వ్యూహాత్మకంగా మూడు వైపుల నుంచి ట్యాంక్‌బండ్‌ను ముట్టడించారు. సికింద్రాబాద్ వైపు నుంచి దాదాపు 200 మంది న్యాయవాదులు, అంబేడ్కర్ విగ్రహం వైపు నుంచి 200 మంది న్యూడెమాక్రసీ, బీజేపి కార్యకర్తలు పోలీసులను తోసుకుని ట్యాంక్‌బండ్‌పైకి రాగలిగారు. అప్పటికే లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న బస్తీలో మకాం వేసిన బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు

కిషన్‌రెడ్డి, గల్లీలోంచి బయటపడి 500 మందితో కట్టపైకి వచ్చారు. అప్పటికే వేయి మందికి పైగా చేరడం, ఉన్న పోలీసు బలగాలను అసెంబ్లీ వద్దకు తరలించడంతో నిస్సహాయ పరిస్థితిలో పోలీసులు వెనక్కు తగ్గక తప్పలేదు.

దీంతో ఇందిరాపార్కు, కట్టమైసమ్మ, వైస్రాయ్ హోటల్, డీబీఆర్ మిల్లు.. ఇలా అన్నివైపుల నుంచి తెలంగాణవాదులు ట్యాంక్‌బండ్‌ను ఒక్కసారిగా కమ్ముకున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకల్లా వేలాది మంది ట్యాంక్‌బండ్‌పైకి చేరుకున్నారు.

నాయకులకు తప్పని సెగ: మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో కాంగ్రెస్ ఎంపీ మధుయాష్కీ అంబెద్కర్ విగ్రహం వద్దకు రాగా, రాజీనామా ఎందుకు చేయడం లేదని ఆయన్ను నిలదీసిన తెలంగాణవాదులు దాడికి దిగారు. పరుగులు తీయించారు. కొట్టుకుంటూ తరిమారు. తర్వాత కారు టాప్‌పై కూర్చొని.. ఉద్యమకారులకు చేతులు ఊపుతూ వచ్చిన కాంగ్రెస్ సీనియర్ నేత కే.కేశవరావుపై వాటర్‌ప్యాకెట్లు, చెప్పులు విసిరారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొద్ది సేపటి తర్వాత ట్యాంక్‌బండ్‌పైకి చేరుకోగా, ఆయనకు కూడా నిరసనసెగతప్పలేదు. కె.సి.ఆర్. కాన్వాయ్‌పై ఉద్యమకారులు చెప్పులు, ఖాళీ వాటర్‌బాటిల్స్ విసరడమేకాకుండా రాయలేని భాషలో బూతులు తిట్టారు. ఆ తర్వాత కేసీఆర్, దత్తాత్రేయ, గద్దర్, కవిత, హరీష్‌రావు తదితరులు వివిధ ప్రాంతాల్లో తెలంగాణ ప్రతిజ్ఞలు చేయించి, వెళ్లిపోయారు.

అప్పటిదాకా కొంత నిగ్రహంతో ఉన్న తెలంగాణవాదులు, సర్కారు నిర్బంధానికి వ్యతిరేకంగా తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. అరెస్టు చేసిన తమ నాయకులను వెంటనే ట్యాంక్‌బండ్ వద్దకు తెచ్చి విడిచిపెట్టాలంటూ డిమాండ్ చేశారు. పోలీసుల వైపు నుంచి ప్రతిస్పందన లేకపోవడంతో విగ్రహాలను ధ్వంసం చేశారు. సిద్దేంద్రయోగి, ఆర్థర్‌కాటన్, ముట్నూరి కృష్ణారావు, కందుకూరి వీరేశలింగం, అన్నమాచార్యులు, ఎర్రా ప్రగడ, బళ్లారి రాఘవ, శ్రీకృష్ణ దేవరాయలు, బ్రహ్మనాయుడు, గురజాడ అప్పారావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, త్రిపురనేని రామస్వామి చైదరిల విగ్రహాలను కూల్చివేశారు. కాగా మహాకవి శ్రీశ్రీ, సీఆర్ రెడ్డి, నన్నయ్య భట్టు, వేమన, తిక్కన విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేశారు. కూల్చిన కొన్ని విగ్రహాలను హుస్సేన్ సాగర్‌లో పడేసారు, కొన్నింటిని రోడ్డుపై పడేసారు.

ఈ దృశ్యాలను చిత్రీకరిస్తున్న విలేకరులపైనా వారు ఆగ్రహం ప్రకటించారు. అదీఇదీ అని తేడా లేకుండా దాదాపు అన్ని చానళ్ల, పత్రికల విలేకరులు, కెమెరా మెన్లపైనా దాడి చేశారు. కెమరాలు లాక్కొని హుస్సేన్ సాగర్‌లో విసిరేసారు. ఈ ఘటనల్లో దాదాపుగా 20 టీవీ కెమరాలు, 15 ఫోటో కెమెరాలు ధ్వంసమయ్యాయి. ఓ చానెల్‌కు చెందిన ఓబీ వ్యాన్‌ను పూర్తిగా దహనం చేశారు. 15 మంది మీడియా ప్రతినిధులు గాయపడ్డారు. వారించేందుకు ప్రయత్నించిన ఏసీపీ చక్రపాణి జీపును కూలదోశారు. మీడియాపై దాడి తగదని తెలంగాణ నేతలు ఎంత సర్దిచెప్పడానికి

ప్రయత్నించినా వినలేదు. సాయంత్రం 5.15 గంటల సమయంలో కోదండరాం ట్యాంక్‌బండ్‌పైకి చేరుకోగా... ఆందోళనకారులు ఆయనకు జేజేలు పలికారు. చేతులపై ఊరేగిస్తూ కేసీఆర్ నిల్చున్న పోతన విగ్రహం వద్దకు తీసుకెళ్లారు. అప్పుడు కోదండరాం మళ్లీ అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

దాదాపు రెండు గంటల తర్వాత పోలీసులు పెద్ద సంఖ్యలో రంగంలోకి దిగి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఆందోళనకారులపై లాఠీలు ఝుళిపించారు. అక్కడి నుంచి వెళ్లిపోయే క్రమంలో ఆందోళన కారులు ట్యాంక్‌బండ్‌పై ఉన్న లేపాక్షి ఎంపోరియాన్ని తగులబెట్టారు. అక్కడే ఉన్న ఆంధ్రబ్యాంకు ఏటీఎంను ధ్వంసం చేశారు. ఈ విధ్వంసానికి ఓ రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉన్న విద్యార్థి సంఘం నాయకులే ప్రధాన సూత్రదారులని పోలీసులు భావిస్తున్నారు.

**అణచివేత వల్లే ఆవేశం పెల్లుబుకింది**

విగ్రహాల ధ్వంసం, మీడియాపై దాడుల మీద నిరసన వ్యక్తమైంది. తెలంగాణ నేతలతో పాటు పలువురు దీన్ని ఖండించారు. అయితే.. తెలంగాణ సాధన ఉద్యమంలో 600లకు పైగా ప్రాణాలు పోయాయని, విగ్రహాలను పునర్నిర్మించుకోవచ్చు గానీ,, పోయిన ప్రాణాలు వస్తాయా? అన్న వాదన వినిపించింది. శాంతియుతంగా కార్యక్రమం నిర్వహించుకుంటామన్నా.. పోలీసులే దౌర్జన్యానికి దిగారని జేఏసి చైర్మన్ ప్రొ॥ కోదండరాం ఆరోపించారు. ఆయనను మిలియన్ మార్చ్‌లో పాల్గొననీయకుండా ఉ దయమే ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని జేఏసి కార్యాలయం వద్ద అరెస్టు చేశారు. కార్యక్రమం ముగిసిన తర్వాత విడిచిపెట్టారు. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలను ధ్వసం చేయడాన్ని కోదండరాం ఖండించారు. శాంతియుత ఆందోళనకు అంగీకరిస్తే ఇంత విధ్వంసం ఉండేది కాదని అన్నారు. తనపై దాడి సిగ్గుమాలిన చర్య అని కాంగ్రెస్ ఎంపీ మధుయాష్కీ మండిపడ్డారు. తెలంగాణ కోసం పోరాడుతున్నదెవరో, అడ్డుకుంటున్నదెవరో తెలుసుకోకుండా కొందరు యువకులు దాడికి ప్రయత్నించడం దారుణమని ఆయన అన్నారు. జేఏసి, గద్దర్ ఒక తేదీని నిర్ణయిస్తే రాజీనామాకు సిద్దమని యాష్కీ ప్రకటించారు. కాంగ్రెస్‌కే చెందిన మరో ఎంపీ కేశవరావు తనపై చేసిన దాడిని తప్పుపట్టబోనని అన్నారు.

అణచివేత వల్లే ఆవేశం పెల్లుబుకిందని, ఆది తెలంగాణ ఆకాంక్షను చాటి చెబుతోందని చెప్పారు. అసహనం పెరగడం వల్లే హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని అభిప్రాయపడ్డారు. అయితే విగ్రహాల ధ్వంసం సరికాదని ఆయన చెప్పారు. మరోవైపు మిలియన్ మార్చ్‌ను అడ్డుకునేందుకు బుధవారం రాత్రి నుంచే తెలంగాణ జిల్లాల్లో పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించి, హైదరాబాద్ బయలు దేరుతున్నట్లు అనుమానమొచ్చిన వారిని వేల సంఖ్యలో అరెస్టు చేశారు. అయినా వారిని తప్పించుకుని వేలాది మంది హైదరాబాద్‌కు చేరుకున్నారు.

## మిలియన్ మార్చ్ ప్రశాంతమే: కేంద్ర హోంశాఖ

హైదరాబాద్‌లో జరిగిన మిలియన్ మార్చ్ ఒకటి రెండు సంఘటనలు మినహా ప్రాశాంతంగా జరిగిందని కేంద్ర హోంశాఖ భావిస్తోంది. తెలంగాణ డిమాండ్‌పై కేంద్రం నిర్ణయం తీసుకునేందుకు సమయం పడుతుందని, ముందు కాంగ్రెస్ పార్టీ తన వైఖరి తేల్చుకోవాల్సి ఉన్నదని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు అన్నట్లు సమాచారం. శ్రీకృష్ణ కమిటీ నివేదికకు అనుగుణంగానే ఏ నిర్ణయమైనా తీసకుంటామని ఆయన చెప్పారు. 8–చాప్టర్‌లో భూగోళం బద్దలయ్యేంత విషయాలేవీ లేవని ఆయన అన్నారు.

## ఓయూలో ఉద్రిక్తత... గోడదూకి ట్యాంక్‌బండ్‌కు...

ఓయూలో ఉదయం 11.30కే ఎన్‌సీసీ గేటువైపు కొందరు విద్యార్థులు మిలియన్ మార్చ్‌లో పాల్గొనేందుకు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ జరిగిన తోపులాటలో గేటు విరిగిపోయింది. మరి కొందరు లేడీస్ హాస్టల్ వెనుక వైపు పీజేఆర్‌ఆర్ గేట్ ద్వారా వెళ్లేందుకు ప్రయత్నించగా, అక్కడా తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. దీంతో విద్యార్థులు పోలీసులపై రాళ్ల వర్షం కురిపించారు. పోలీసులు బాష్పవాయు ప్రయోగం చేశారు. విద్యార్థులు రాళ్లు రువ్వడం మానేసి శాంతియుతంగా తమ నిరసన వ్యక్తం చేస్తామని మోకాళ్లపై నడుచుకుంటూ ఎన్‌సీసీ గేటుకు అవతలి వైపున్న పోలీసుల వద్దకు వచ్చారు. అదే సమయంలో 500 మంది విద్యార్థినులు, 200 మంది తెలంగాణ టీచర్స్ ప్రతినిధులు గేట్ వైపు ర్యాలీగా వచ్చారు. దీనితో మళ్లీ రాళ్ల వర్షం, ఉద్రిక్తత మొదలయ్యాయి. ఇలా సాయంత్రం వరకు దఫదఫాలుగా రాళ్ల వర్షం, బాష్పవాయు గోళాల ప్రయోగం 4గంటల వరకు కొనసాగింది. విద్యార్థులను చెదరగొడుతూ వజ్ర వాహనంతో ఆర్ట్స్ కాలేజీ నుంచి బీ హాస్టల్ వరకు బాష్పవాయుగోళాలు పేల్చారు. అక్కడ దొరికిన వారిని దొరికినట్లు అరెస్టు చేశారు. ఇలా ఓవైపు బీకర పోరు సాగుతుండగానే విద్యార్థినులలో కొందరు హాస్టల్ వెనక గోడ దూకి ట్యాంక్‌బండ్‌కి వెళ్లిపోయారు. ఇలా దఫదఫాలుగా కొందరు విద్యార్థులు ముందే అనుకున్న వ్యూహం ప్రకారం ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు.

## తాలిబన్లను తలపిస్తున్నారు: సమైక్యాంధ్ర జేఏసీ

తాలిబన్లు బుద్ధ విగ్రహాలను ధ్వంసం చేసిన తరహాలో తెలంగాణవాదులు ట్యాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేశారని సీమాంధ్ర జేఏసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రత్యేక వాదుల మూర్ఖత్వానికి ఇది నిదర్శనమని విమర్శించాయి. ఈ దుశ్చర్యతో పాటు మీడియాపై దాడికి పాల్పడినవారిని తక్షణం అరెస్టు చేయాలని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి నేతలు, తదితరులు డిమాండ్ చేశారు.

## నిమ్స్‌లో గుండా మల్లేష్ హల్‌చల్

నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీపీఐ శాసనసభాపక్ష నేత గుండా

మల్లేష్.. మిలియన్ మార్చ్‌లో పాల్గొనడానికి టాంక్‌బండ్‌కు వెళతానంటూ పట్టుబట్టి హల్‌చల్ చేశాడు. బీపీ, షుగర్ ఒక్కసారిగా పెరగడంతో ఈనెల 8న చికిత్స కోసం ఆయన నిమ్స్‌లో చేరారు. టీవీలో మిలియన్ మార్చ్ ప్రసారాలు చూసి భావోద్వేగానికి గురయ్యారు. తాను అక్కడికి వెళతానంటూ బయలుదేరగా ఇప్పుడున్న పరిస్థితులలో అక్కడికి వెళ్లడం ఆరోగ్యానికి మంచిది కాదంటూ డాక్టర్లు వారించారు. దీంతో అక్కడే అస్పత్రి సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతుగా ఢిల్లీలో జరిగిన విద్యార్థి సంఘాల సంఘీభావ సదస్సుకు హాజరైన తెలంగాణ నెటిజన్స్ ఫోరం నాయకులు.

**11 మార్చి 2011:**

**మార్చ్ సందర్భంగా 26 కేసులు... 56 మంది అరెస్టు..**

టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. ఆయనతో పాటు తెలంగాణ జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం, కేటీఆర్, హరీష్‌రావు, న్యాయవాది కిరణ్‌లపై పోలీసులు హత్యాయత్నంతో పాటు పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ట్యాంక్‌బండ్‌పై గురువారం జరిగిన ఘటనల నేపథ్యంలో పైన తెలిపిన వారు తమపై హత్యాయత్నం చేసినట్లు ఏసీపి, ఎస్సైలు పిర్యాదు చేశారు. వారి పిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసులు క్రైమ్ నెంబర్ 59, 60, 61లు నమోదు చేశారు. ఇందులో ప్రథమ నిందితునిగా హరీష్‌రావును ఆ తర్వాత వరుసగా కేసీఆర్, కోదండరాం, కేటీఆర్, కిరణ్‌లను పేర్కొన్నారు. వీటిలో 307, 333, 382 సెక్షన్లు నాన్‌బెయిలబుల్ సెక్షన్లు కావడం విశేషం. అలాగే విగ్రహాల విధ్దంసానికి కారకులుగా మరో 59 మందిని గుర్తించి అరెస్టు చేశారు. ఇవే సెక్షన్లతో వారిపై 26 కేసులు నమోదు చేశారు.

ఇక విగ్రహాల విధ్వంసంతో పాటు ట్యాంక్‌బండ్‌పై గురువారం జరిగిన ఘటనలను శాసనసభ, శాసనమండలి, రాజ్యసభలు ముక్తకంఠంతో ఖండించాయి. రాష్ట్రంలో ఉభయ సభల్లోనూ సభ్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. విగ్రహాల విధ్వంసంపై శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడిన సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి.. జాతి గౌరవాన్ని దశదిశలా వ్యాపింపజేసిన మహనీయుల విగ్రహాలను కాపాడలేక పోయానని, ఇందుకు చింతిస్తున్నానని, బాధ పడుతున్నానని, ఖండిస్తున్నానని అన్నారు. మిలియన్ మార్చ్‌కు అనుమతి కోరిన ఉద్యమనాయకులే ఇందుకు బాధ్యత వహించాలని, వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కాపాడేందుకు కఠిన నిర్ణయాలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని, పోలీసుల వైఫల్యమేనని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. అయితే ముఖ్యమంత్రితో పాటు హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా పోలీసుల పనితీరుకు కితాబునిచ్చారు. వారు

పూర్తి సంయమనంతో వ్యవహరించారని, రాష్ట్ర పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారని, వారి తప్పేమీ లేదని కొనియాడారు. చంద్రబాబు విగ్రహాల ధ్వంసాన్ని ఖండించారు. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలను పునర్నిర్మించాలని, తెలంగాణ కవుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మిలియన్ మార్చ్‌లో తాము కూడా పాల్గొన్నందుకు బాధగా ఉందని, అవాంఛనీయ ఘటనలకు ప్రజలకు క్షమాపణ చెబుతున్నామని బీజేపి నేతలు కిషన్‌రెడ్డి, దత్తాత్రేయ తదితరులు విజ్ఞప్తి చేశారు. విగ్రహాల విధ్వంసానికి ప్రభుత్వమే దోషి అని విమర్శించారు.

ఇక మిలియన్ మార్చ్ సందర్భంగా జర్నలిస్టులపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు కోదండరాం,గద్దర్ చెప్పారు. ఇటువంటి దాడులను పునరావృతం కానివ్వబోమని, దాడికి చింతిస్తూ ఉద్యమకారులు, తెలంగాణ ప్రజల పక్షాన మీడియాను క్షమాపణ కోరుతున్నట్లు చెప్పారు. కేసీఆర్ తదితరులపై కేసుల నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి కేసీఆర్‌ను అరెస్టు చేయవచ్చన్న ఊహాగానాలతో ఆయన ఇంటివద్ద టీఆర్ఎస్ కార్యకర్తల హల్‌చల్ కొనసాగింది.

### 17 మార్చి 2011:

### అసెంబ్లీకి మాసికం

తెలంగాణ జేఏసి పిలుపు మేరకు గురువారం జూబ్లీ బస్టాండ్ వద్ద ఆంధ్రప్రదేశ్ శాసనసభకు నెల మాసికం నిర్వహించారు. ఈ సందర్భంగా 'సీమాంధ్ర సభ గోవిందా... కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం గోవిందా... సిగ్గులేని కాంగ్రెస్ సర్కారు గోవిందా' అంటూ నినాదాలిచ్చారు. గత నెల 17 నుంచి తెలంగాణ ప్రాంతానికి చెందిన సభ్యులు ఎవ్వరూ హాజరు కాకపోవడం వల్ల అది సీమాంధ్ర సభగా మారిపోయిందని, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చచ్చిపోయిందని ప్రజలు భావిస్తున్నారని, ఈ మేరకు సభకు నెల మాసికం నిర్వహించారు. జేఏసి ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణపై ఇది చలనంలేని ప్రభుత్వం. త్రిశంకు స్వర్గంలో ఉంటే శాశ్వతంగా పైకి పంపించడానికి నెల మాసికం నిర్వహించటం సంప్రదాయం అని అన్నారు. ఈ మేరకు పురోహితుల మంత్రోచ్చారణల మధ్య తెలంగాణ జేఏసి అసెంబ్లీకి మాసికం నిర్వహించారు.

### 23 మార్చి 2011:

### ప్రత్యేక తెలంగాణతో శాంతికి భంగం: 8వ చాప్టర్

తెలంగాణ రాష్ట్రం ఇస్తే శాంతికి భంగం కలుగుతుందని శ్రీకృష్ణ కమిటీ తన నివేదికలోని 8వ (రహస్య) చాప్టర్‌లో పేర్కొంది. తెలంగాణ రాష్ట్రం ఇస్తే రాష్ట్రంలో హిందూ, ముస్లీం ఉగ్రవాదాలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. మావోయిస్టులకు, మత ఘర్షణలకు తెలంగాణ కేంద్ర బిందువు అవుతుందని హెచ్చరించింది. తమ కమిటీకి వచ్చిన విన్నపాలు, తాము వివిధ ప్రాంతాల ప్రజలు,

రాజకీయ పార్టీలు, పోలీసు, పౌర ఉన్నతాధికారులతో జరిపిన చర్చల సందర్భంగా ఈ ఆందోళనలు వ్యక్తమయ్యాయని ఈ రహస్య అధ్యాయంలో పేర్కొంది. శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన 8వ చాప్టర్‌ని బయటపెట్టాలంటూ నిజామాబాద్‌కు చెందిన మాజీ ఎంపీ. ఎం.నారాయణరెడ్డి వేసిన పిటీషన్‌పై ఈనెల 16న వాదోపవాదాలు విన్న హైకోర్టు.. దీనిపై 58 పేజీల తుది తీర్పు వెలువరిస్తూ అందులోని కొన్ని అంశాలను ప్రస్తావించింది. దానిలో రహస్యంగా ఉంచాల్సిన సున్నితమైన, భద్రతాపరమైన అంశాలు ఏమీ లేవని తేల్చి చెప్పింది. 8వ చాప్టర్‌ను రెండు వారాల్లోగా బహిరంగ పర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

**రహస్య నివేదికలోని కొన్ని అంశాలు!:**

తక్షణ శాంతి భద్రతల సమస్యలు, దీర్ఘకాలిక అంతర్గత భద్రత పర్యవసానాలు మావోయిస్టులు/నక్సలైట్లు బలపడే అవకాశాలపై కమిటీ పరిశీలించింది. ఈ భయాందోళనలు వివిధ పార్టీలు, ఇతర గ్రూపుల నుంచి వచ్చిన వినతిపత్రాల్లో ఉన్నాయి. మేము వివిధ ప్రాంతాల్లో పర్యటించి ముఖాముఖి జరిపిన చర్చల్లో ప్రధానంగా ఈ అంశాలు ముందుకొచ్చాయి. ఈ అంశాలనే సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసులు, స్థానిక సంస్థల్లోని అధికారులు వ్యక్తీకరించారు. దీనిపై ఒక నోట్‌ను కేంద్ర హోం మంత్రిత్వశాఖకు పంపాం. ఈ కోణాలను దృష్టిలో పెట్టుకునే 8వ అధ్యాయంలో వివిధ ప్రత్యామ్నాయ మార్గాలు చూపాం.

తెలంగాణలోని విద్యాసంస్థల్లో అధికభాగం సీమాంధ్ర వారివే. ఇవి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్నాయి. తెలంగాణ కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులు వీటిని లక్ష్యంగా ఎంచుకోవచ్చు. ఇది ఆయా విద్యాసంస్థలు, బోధనా సిబ్బంది వలస పోవడానికి దారి తీయవచ్చు. అందువల్ల సామర్థ్యం కలిగిన అభ్యర్థుల కొరత ఏర్పడి, ఉపాధి, వ్యాపారాలపై ప్రభావం చూపుతుంది.

తెలంగాణలో సున్నపురాయి, గ్రానైట్ ఖనిజ సంపద అధికంగా ఉంది. థర్మల్ పవర్ స్టేషన్‌లు, ఫార్మా తదితరాలు ప్రధాన పరిశ్రమలు, వీటిలో చాలావరకు సీమాంధ్రకు చెందిన వారివే. తెలంగాణ వస్తే ప్రధాన పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పూర్తిగా ఈ ప్రాంతం వారికే ఇవ్వాల్సి వస్తుందనే ప్రచారం ఉంది. ఈ పరిశ్రమల్లో పనిచేస్తున్న నిపుణులైన ఉద్యోగుల్లో అధిక శాతం సీమాంధ్రకు చెందినవారే.

స్థానికంగా నిపుణులు లభించకపోవడంతో స్థానికులు, స్థానికేతరుల మధ్య యాజమాన్యం, కార్మికుల మధ్య ఘర్షణలు తలెత్తే అవకాశం ఉంది. విద్యుత్ ఉత్పత్తి కోసం తెలంగాణ ప్రాంత బొగ్గుపైనే ఆధారపడుతోంది. కాని సీమాంధ్ర.. బొగ్గుపై ఆధారపడుతూనే.. గ్యాస్, పవన, సౌర, అణు విద్యుత్ ఉత్పత్తివైపు వేగంగా దృష్టి సారిస్తోంది. ఇంధన కొరత, ప్రజల వలసలకు దారి తీస్తుంది.

తెలంగాణలో వ్యవసాయం ఎక్కువ భాగం భూగర్భ జలాలు, వర్షాలు, ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి ఉంది. వీటికి నిర్దిష్ట స్థాయిలో విద్యుత్ అవసరం. ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తోంది. తెలంగాణలోని చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా దీనివల్ల లబ్ది పొందుతున్నారు. తెలంగాణలోని నల్గొండ, మెదక్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ వంటి జిల్లాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయి. వీటికి విద్యుత్ అవసరం ఎక్కువ. తెలంగాణలో అధికంగా థర్మల్ విద్యుత్ ప్లాంట్లే అయినందున.. ఆర్థిక అసమతుల్యత వల్ల చిన్న, సన్నకారు రైతులకు ఇంధన కరువు సృష్టించే అవకాశం ఉంది. ఇది వ్యవసాయ ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. రైతులు నష్టపోయి, భూములు అమ్ముకొని, హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న పారిశ్రామిక వాడలకు వలసపోవాల్సిన స్థితి వస్తుంది.

ఇది జనాభాలో మార్పులకు దారితీస్తుంది. సరిపడ భూమి, నీరు కొరవడుతుంది. ఇది ప్రాంతీయ విభేదాలకు దారితీస్తుంది. హైదరాబాద్‌లో అశాంతి నెలకొంటుంది. దీని ప్రభావం పై ప్రాంతాల్లో నివసిస్తున్న రెండు వర్గాల మధ్య అభద్రతా భావం నెలకొనడానికి అవకాశం ఇస్తుంది. సమాజంలో అశాంతి, నిరుద్యోగం పెరగడం మత ఘర్షణలకు అవకాశం ఇస్తుంది. ఇది మిలిటెంట్లు.. జీహాదీ శక్తులకు బలం చేకూర్చుతుంది. అధిక సంఖ్యలో ఉన్న ముస్లింలకు, వారి ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయడానికి హిందూత్వ వాదులు హిందూ జనాభా పెరుగుదలపై దృష్టి సారిస్తారు.

పొలిటికల్ మేనేజ్‌మెంట్: పాలక పక్షంలోని నాయకుల మధ్య ఐక్యత అవసరం. బలమైన నాయకత్వం అవసరం ఉంది. టీఆర్ఎస్ శ్రేణులను కట్టడి చేయడానికి తెలంగాణకు చెందిన వారికి సీఎం, లేదా డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలి. దీంతో ఉద్యమం కొంత చల్లబడే అవకాశం ఉంది. ఇప్పటికే టీఆర్ఎస్ డిసెంబర్ 31 నుంచి సహాయనిరాకరణ, తెలంగాణ ఇవ్వకపోతే మహా యుద్ధం చేస్తామని ప్రకటించింది. దీనికి గద్దర్ మద్దతు ప్రకటించారు. ఈ ఆందోళనపై కాంగ్రెస్ నాయకత్వం ప్రజలకు ఏదో ఒకటి తేల్చి చెప్పాల్సి వస్తుంది. ఆందోళన కారులకు మద్దతు పలకవద్దని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఉద్బోధించాలి. సున్నితమైన అంశంపై కాంగ్రెస్ హైకమాండ్ వారికి సర్దిచెప్పి తదనంతర పరిణామాలను విశదీకరించాల్సి ఉంది.

కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత కేంద్రం ఈ అంశంపై చర్యలకు సిద్ధంగా ఉన్నామనే అంశాన్ని ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ నాయకులు, పరిశీలకుల ముందుకు తీసుకెళ్లాలి. మంత్రులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఈ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలి.

మీడియా మేనేజ్‌మెంట్: ఆంధ్రప్రదేశ్‌లో 13 ఎలక్ట్రానిక్ చానళ్లు ఉన్నాయి. ఐదు స్థానిక పత్రికలు ప్రజాభిప్రాయాన్ని మలచడంలో కీలక భూమిక పోషిస్తున్నాయి.

వీటిలో రెండు చానళ్లు మినహా మిగిలినవన్నీ సమైక్యాంధ్రకు మద్దతు పలుకుతున్న వారివే. వీటిలో భాగస్వాములు కూడా సీమాంధ్రకు చెందిన వారే! (ఆ రెండూ మినహా). ప్రధానంగా ఎడిటర్లు, సబ్-ఎడిటర్లు, చిత్ర పరిశ్రమలోనూ సీమాంధ్రకు చెందిన వారిదే పైచేయి. వారిలోనున్న సహకార ధోరణి సాధారణ మనిషిని మలచ గలుగుతోంది. అయినప్పటికీ స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న జర్నలిస్టులు అక్కడి సంఘటనలను, స్థానిక ప్రజల సెంటిమెంట్లను మాత్రమే రిపోర్టు చేయగలుగు తున్నారు. హైదరాబాద్ నగరం ఆందోళనకారులకు కేంద్రంగా మారింది. ఇక్కడ జరుగుతున్న ఆందోళనలను రిపోర్టు చేస్తున్న వారిలో ప్రత్యేక తెలంగాణకు మద్దతు పలికే జర్నలిస్టులే అధికంగా ఉన్నారు. అందుకే ఉస్మానియా జరిగిన అల్లర్లపై అధికంగా దృష్టి సారించారు.

అందుకే మీడియా మేనేజ్‌మెంట్ ఇందులో కీలక భూమిక పోషిస్తోంది. స్వల్ప సంఘటనలకు అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా వాస్తవిక అంశాలనే ముందుకు తేవాలి. అంతకు ముందు మీడియా తెలంగాణ ఉద్యమం తిరోగమనంలో ఉన్నట్లు చేసిన ప్రసారాలు మా దృష్టికి వచ్చాయి. ఒక్కో మీడియా ఒక్కో రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉన్నాయి. ప్రింట్ మీడియా, అధిక శాతం సీమాంధ్రకు చెందినవారివే.

స్థానిక అంశాలపై ఆయా పత్రికలు ప్రచురిస్తున్న అంశాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. అధిక శాతం ఎడిటర్లు సమైక్యాంధ్ర వాదులే. ఇదే విధానం ఎలక్ట్రానిక్ మీడియాలోనూ నెలకొంది. ప్రింట్ మీడియాకు రాజకీయ అనుబంధాలు బలంగా ఉన్నాయి. ఎడిటర్ల సలహాలు(ఒపీనియన్స్), బ్యానర్ హెడ్‌లైన్స్, ప్రాంతీయ వార్తలు, జిల్లా ఎడిషన్లను వాస్తవిక దృక్పథంతో చూసి తెలంగాణ ఉద్యమానికి కొంత ప్రాధాన్యం కల్పించాలి.

సంసిద్ధంగా ఉండాలి: కమిటీ సూచించిన సలహాల్లో దేన్ని అమలు చేయడానికి చూసినా పెద్ద ఎత్తున ఆందోళనలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ముందస్తుగా చేసిన సూచనలు అమలు చేయడంతో పాటు.. తగిన పోలీసు బలగాలను పూర్తి సాంకేతిక సహకారంతో కీలక ప్రదేశాల్లో వెంటనే మోహరించాలి. దీర్ఘకాలంపాటు ఆందోళనలు ఎదుర్కోడానికి సిద్ధపడాలి. పరిస్థితులను ఎప్పటిప్పుడు అంచనా వేయడానికి క్షేత్రస్థాయి నుండి ఇంటెలిజెన్స్ నివేదికలు తీసుకుని, పరిస్థితి విషమించకుండా సమస్యాత్మక ప్రదేశాల్లో అదనపు బలగాలను మోహరించాలి. (ముఖ్యంగా ఉస్మానియా, కాకతీయ, కృష్ణదేవరాయ తదితర వర్సిటీలు) ఆందోళనలకు ఉసిగొల్పుతున్న వారిని ముందుగా గుర్తించి అదుపులోకి తీసుకోవాలి. సీఎస్, డీజీపీలతో మేము జరిపిన చర్చల్లో ఎటువంటి ఆయుధాలు వినియోగించాలనే అంశం చర్చకు వచ్చింది. ఆందోళన కారులను తీవ్రంగా గాయపరిచే ఆయుధాలు కాకుండా... అదే సమయంలో ఆందోళనలను అతి తక్కువ సమయంలో నియంత్రించే విధంగా ఉండేవి వినియో

గించాలనే అంశంపై చర్చ జరిగింది. మొదటి రెండు నెలలు ఆందోళనలు ఉధృతంగా ఉండే అవకాశం ఉంది. నివేదిక ఇచ్చిన తర్వాత ప్రజల్లో ఉన్న భావోద్వేగాలపై ఊహాజనితమైన కథనాలు వచ్చే అవకాశం ఉంది.

### శ్రీకృష్ణ కమిటీపై కేసు పెట్టాలి: కోదండరాం

తెలంగాణపై అప్రజాస్వామిక నివేదిక ఇచ్చన శ్రీకృష్ణ కమిటీ సభ్యులపై ప్రభుత్వం సుమోటోగా కేసు పెట్టి విచారించాలని జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం డిమాండ్ చేశారు. శ్రీకృష్ణ కమిటీ సభ్యులందరి దిష్టిబొమ్మలను వచ్చే రెండు రోజుల్లో దహనం చేసి నిరసన తెలపాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసేందుకు శ్రీకృష్ణ కమిటీ సూచించిన 8వ చాప్టర్‌ని ప్రభుత్వం అమలు చేస్తూ అక్రమ అరెస్టులు, కేసులకు పాల్పడుతోందని ఆరోపించారు. అక్రమ కేసులను నిరసిస్తూ ఈనెల 26న హైదరాబాద్‌లో ధర్నా చేపడుతామన్నారు. తెలంగాణ ఇస్తే ముస్లీంలు, మావోయిస్టులు రెచ్చిపోతారని, నివేదికలో పిచ్చిరాతలు రాశారని, వారు తమ అన్నదమ్ములని ఉద్యోగ సంఘాల నేత స్వామీగౌడ్ వ్యాఖ్యానించారు.

### 27 మార్చి 2011:

### శ్రీకృష్ణ కమిటీ ఖర్చు కేంద్రం 20కోట్లు, రాష్ట్రం 2.5కోట్లు

రాష్ట్రంలో పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీకి కేంద్రం రూ.20 కోట్లు ఖర్చుపెట్టగా దానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2కోట్ల 50 లక్షల రూపాయలు ఖర్చు చేసి అనవసర ఆర్భాటం చేసింది. అత్యాధునిక హంగులతో తులతూగే లేక్‌వ్యూ అతిథిగృహంలోనే ఫర్నిచర్, మరమ్మత్తులు, కంప్యూటర్లు, ఇంటర్నెట్, ఏసీల పేరిట లక్షలకొద్దీ ఖర్చు చేయడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ ఆదీనంలో ఎన్నో విలాసవంతమైన వాహనాలు ఉన్నప్పటికీ కమిటీ అధ్యక్షుడు శ్రీకృష్ణ కోసం, సభ్య కార్యదర్శి దుగ్గల్ కోసం రూ. 50లక్షలు వెచ్చించి రెండు టయోటా క్యామ్రి కార్లు కొన్నారు. కంప్యూటర్ల కోసం 7.19లక్షలు, నెట్ కోసం మరో 6.5లక్షలు, 6ఎల్‌సీడీ టీవీలకు 4.2లక్షలు, రెండు టవర్ ఏసీలకు 3.81లక్షలు, గదుల డెకరేషన్ కోసం 3.15లక్షలు, పూల అలంకరణకు 2లక్షలు, ఆఫీస్ ఫర్నిచర్ కోసం 15లక్షలు ఖర్చు పెట్టారు. జిరాక్స్ మిషన్ల కోసం 6.5లక్షలు ఇలా మొత్తంగా 2.5కోట్లు ఖర్చు చేశారు. ఇందులో పెట్టిందెంతో, మెక్కిందెంతో తెలీదు. టెండర్లు పిలువలేదు. నామినేషన్ మీదనే పనులు నడిపించారు. ఒక్క దానికీ జీవో జారీ చేయలేదు. అన్ని నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.

### 13 ఏప్రిల్ 2011:

### ఆ విగ్రహాలు ఆధిపత్య చరిత్రకు ఆనవాళ్లు. 'విరుగుడు' పుస్తకావిష్కరణ

విగ్రహాల కూల్చివేత వెనుక గల ఆధిపత్య చరిత్రను విస్మరించి ఉద్యమంపై

విషం గక్కడం సరైందికాదని, కూల్చివేతకు దారి తీసిన నేపథ్యంపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని శాసన మండలి సభ్యుడు చుక్కా రామయ్య అన్నారు. విగ్రహాల కూల్చి వేతపై తెలంగాణ రచయితల వేదిక వెలువరించిన 'విరుగుడు' వ్యాస సంకలనాన్ని బుధవారం ట్యాంక్‌బండ్‌పై పోతన విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొ.కోదండరాం మాట్లాడుతూ.. విగ్రహాల ప్రతిష్టాపనకు ముందు నుంచే వాటిపట్ల అభ్యంతరాలున్నాయని వాటిని పరిగణలోకి తీసుకోకుండా పాలకులు ఇష్టానుసారం వ్యవహరించారని విమర్శించారు. విగ్రహాల కూల్చివేత వెనుక ఉన్న వాస్తవాలను దాచి వక్రీకరణలు చేయడం సరైంది కాదని బీజేపి సీనియర్ నేత బండారు దత్తాత్రేయ అన్నారు. విగ్రహాల కూల్చివేత గురించి మాట్లాడే వారు అరవై ఏండ్లుగా జరుగుతున్న వివక్ష, అణచివేత గురించి ఎందుకు మాట్లాడడం లేదని టీఆర్ఎస్ నేత హరీష్‌రావు ప్రశ్నించారు. వివక్ష ఉన్న చోట ప్రజల ఆగ్రహం పెల్లుబుకుతుందని తెరవే అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ అన్నారు.

## 16 ఏప్రిల్ 2011:

## జీవో 177 నిలిపివేత, ఒత్తిళ్లకు తలొగ్గిన సర్కార్

విపక్షాల నుంచే కాక.. రాష్ట్ర మంత్రులు సహా స్వపక్షం నుంచి సైతం తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో సర్కారు కాస్త వెనక్కు తగ్గింది. సీఎం అధ్యక్షతన శనివారం సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేం జరిగింది. ఈ వివరాలను రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రాంనారాయణరెడ్డి విలేకరులకు వెల్లడించారు. జీవో 177ను అబయెన్స్ (తాత్కాలిక నిలుపుదల)లో పెట్టాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలిపారు.

ఇదిలా ఉండగా తెలంగాణ ఉద్యమం నుంచి ఉద్యోగులను దూరం చేయాలనే ప్రభుత్వం 177జీవోను జారీ చేసిందని తెలంగాణ ఉద్యోగుల జేఏసి మండిపడింది. జీవోను పూర్తిగా రద్దు చేసేవరకు పోరాటం ఆగదని నేతలు స్పష్టం చేశారు. అబయెన్స్‌లో పెడితే సరిపోదని, పూర్తిగా రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈనెల 18 నుంచి ఆందోళనలు నిర్వహించాలని, వచ్చే నెల రెండో వారంలో ఉద్యోగ గర్జన సభను నిర్వహించాలని నిర్ణయించారు.

ఈ మేరకు ఉద్యోగ సంఘాల జేఏసి కార్యచరణను ప్రకటించింది. ఈనెల 18న జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, 19, 20 తేదీల్లో మంత్రులు, ఎంపీలు, జెడ్పీచైర్మన్లు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలిచ్చి, వారి నుంచి జీవోను రద్దు చేయాలనే డిమాండ్ లేఖలు తీసుకోవడం, 21న వివిధ పార్టీల నేతలతో ములాఖత్, 22న అన్ని పార్టీల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం, 23న కొవ్వత్తుల ప్రదర్శన, 25 నుంచి మే 5 వరకు జిల్లా పర్యటనలు చేసి ఉద్యమానికి ఉద్యోగులను సన్నద్ధం చేయడం, మే రెండో వారంలో ఉద్యోగ గర్జన.

**28 ఏప్రిల్ 2011:**

**జూపల్లి ప్రారంభించిన 'తెలంగాణ ప్రజాభియాన్ యాత్ర'**

తెలంగాణ ఏర్పాటు ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, ఇందుకోసం తాను ప్రాణ త్యాగానికి సైతం సిద్ధమని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో 800 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఇంకా ఈ పరిస్థితుల్లో చీమూ, నెత్తురూ లేకుండా పదవిలో కొనసాగలేనని, అందుకే తాను రాజీనామా చేశానని పేర్కొన్నారు. అధిష్టానంపై ఒత్తిడి తెచ్చేందుకు మంత్రి జూపల్లి మహబూబ్‌నగర్ జిల్లాలో తెలంగాణ ప్రజాభియాన్ పేరుతో గురువారం పాదయాత్రను ప్రారంభించారు. జిల్లాలో 1200 కిలోమీటర్లు కొనసాగనున్న ఈ పాదయాత్రను జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తాలో ప్రారంభించి 20 కిలోమీటర్ల మేర కొనసాగింది.

**09 మే 2011:**

**తెలంగాణ కోసం నక్సలైట్‌నవుతా!: నగారా సభలో నాగం**

'నాలో సహనం నశించబట్టే.. పార్టీ జెండాను పక్కనబెట్టి.. తెలంగాణ జెండా కింద ఉద్యమం ప్రారంభించాను. ఇక తెలంగాణ జెండా కిందే ఉద్యమం కొనసాగిస్తాను. తెలంగాణ సాధన కోసం జరిగే ఈ ఉద్యమంలో ఎవరికీ భయపడబోను' అని టీడీపీ టీ.ఫోరం కన్వీనర్ నాగం జనార్ధన్‌రెడ్డి ప్రకటించారు. జై తెలంగాణ అనే వాడిని నక్సలైట్‌గా చిత్రీకరించే పక్షంలో తెలంగాణ కోసం తాను నక్సలైట్‌గా మారడానికి సిద్ధమేనని ప్రకటించారు. నాగర్‌కర్నూల్‌లోని జెడ్పీ స్కూల్ గ్రౌండ్‌లో తెలంగాణ నగారా సభను నాగం సోమవారం నిర్వహించారు. పెద్దఎత్తున ప్రజలు హాజరైన ఈ సభా వేదిక నుంచి నాగం మాట్లాడుతూ.. కేంద్రం తెలంగాణకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఈ సభకు పార్టీకి చెందిన 6గురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. టీయూఎఫ్ తరపున విమలక్క, దిలీప్‌లు పాల్గొన్నారు.

**19 మే 2011:**

**ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద టీజేఎఫ్ ధర్నా**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద గురువారం తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో వందలాది మంది పాత్రికేయులు ధర్నా నిర్వహించారు. తెలంగాణపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'జై తెలంగాణ.. ఒక చేత్తో కలం.. మరొక చేత్తో ఉద్యమం' అని నినదించారు. తెలంగాణలో అన్ని పార్టీల నేతలు, ప్రజలు కలిసికట్టుగా పోరాడితేనే ప్రత్యేక రాష్ట్రం సులభ సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. టీజేఎఫ్ అధ్యక్షుడు అల్లం నారాయణ అధ్యక్షత వహించిన ఈ

కార్యక్రమంలో 700 మంది విలేకరులతో పాటు టంకశాల అశోక్, జావెద్ అలీ ఖాన్, ఎన్.వేణుగోపాల్, రత్నమాల, టిజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లె రవికుమార్ క్రాంతి, రమేశ్ హజారీ, ఎం.వి. రమణ, ఉద్యోగ సంఘాల నాయకులు స్వామిగౌడ్, దేవిప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, లెక్చరర్ల అసోసియేషన్ నాయకుడు సతీష్, న్యాయవాదుల జేఏసి నాయకులు, తెలంగాణ జేఏసి నాయకులు ప్రొ.కోదండరాం, మహిళా ఉద్య మ నేత సంధ్య, సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డిటీపీఎఫ్ అధ్యక్షుడు గద్దర్, కాంగ్రెస్ నేతలు కేకే, వివేక్, మంద జగన్నాథం, రాజయ్య, మధుయాష్కీ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, టీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కేటీఆర్, ఈటెల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, నల్లాల ఓదెలు, అరవిందరెడ్డి, బీజేపి నేత ప్రకాశ్ జవదేకర్, టీడీపీ నాయకులు వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

**29 మే 2011:**

**వెంటనే తెలంగాణ ఇవ్వాలి: ఢిల్లీలో జేఏసి రౌండ్‌టేబుల్**

కేంద్రం వెంటనే తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వాలని ఢిల్లీ జేఏసి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. శ్రీకృష్ణ కమిటీ నివేదిక 8వ అధ్యాయంపై జరిగిన ఈ సమావేశానికి ఢిల్లీ జేఏసి కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. జూన్ 1 నాటికి రాజీనామాలు చేసి ఉద్యమంలో పాల్గొనని నాయకులను సంఘ బహిష్కరణ చేస్తామని మల్లెపల్లి లక్ష్మయ్య, కత్తి వెంకటస్వామి ప్రకటించారు. రాజీనామాలు చేయని కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలకు తెలంగాణ సభల్లో వేదికలపై మాట్లాడే అవకాశం ఇవ్వమని అన్నారు. కోస్తాంధ్ర అవినీతి లాబీయే తెలంగాణను అణచివేస్తోందని కోదండరాం అన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో న్యాయవాది ప్రశాంత్‌భూషన్, నాగం జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డి, బీజేపి అధికార ప్రతినిధి నిర్మలా సీతారామన్, టీఆర్ఎస్ నేత వినోద్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ కమలాకర్, సీపీఐ నేత కౌర్, సీపీఐ ఎంఎల్ నాయకురాలు అరుణ, ప్రొఫెసర్లు మాడభూషి శ్రీధర్, కిషన్ మహాజన్, ఆస్కీ డైరెక్టర్ గౌతమ్ పింగ్లే, బీజేపి నేత శ్రీరాం వెదిరె, టీఎన్జీవో నేత శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**01 జూన్ 2011:**

**తెలంగాణకు ఇదే సమయం: ఎకనమిక్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను విభజించడానికి ఇదే సమయం.. అని ప్రముఖ ఆంగ్ల వాణిజ్య దిన పత్రిక 'ఎకనమిక్ టైమ్స్' పేర్కొంది. 'టైమ్ ఫర్ తెలంగాణ' పేరిట బుధవారం సంపాదకీయాన్ని ప్రచురించింది. రాష్ట్ర విభజనతో తెలంగాణకు, ఆర్థిక రంగానికి, కాంగ్రెస్‌కు మేలు జరుగుతుందని తెలిపింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు 14 రాష్ట్రాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య రెట్టింపయింది.

ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాలు భాషా లేదా జాతీయ ఉద్యమాల ద్వారానే ఏర్పడ్డాయి. అని గుర్తు చేసింది. బీహార్ కంటే జార్ఖండ్ పౌరుడు 50శాతం, మధ్యప్రదేశ్ కంటే చత్తీస్‌గడ్ 54శాతం, ఉత్తరప్రదేశ్ కంటే ఉత్తరాఖండ్ ఏకంగా 95శాతం మెరుగైన జీవితం సాగిస్తున్నాడని తెలిపింది. ఏర్పడ్డ కొత్తరాష్ట్రాలు తమ మాతృ రాష్ట్రాలకంటే చక్కటి పురోగతిని నమోదు చేస్తున్నాయని, అటవీ, ఖనిజ సంపదలకు నిలయమైన తెలంగాణ కూడా అదే విధంగా అభివృద్ధి చెందుతుందనడంలో సందేహం ఎందుకని? ప్రశ్నించింది. 'తెలంగాణ ఎందుకివ్వాలనే దానికి సూటి సమాధానం ఏమిటంటే.. ఈ ప్రాంత ప్రజలు తమకు సొంతంగా ఒక రాష్ట్రం కావాలని కోరుకుంటున్నారు' అని తెలిపింది. 'తెలంగాణ ఏర్పాటుతో కోల్పోయేది కొంత! వచ్చేది మాత్రం కొండంత. ఇక రంగంలోకి దిగండి' అని కాంగ్రెస్‌కు సూచించింది.

**06 జూన్ 2011:**

**జేఏసీ కార్యాలయం మార్పు**

తెలంగాణ జేఏసి కార్యాలయాన్ని టీడీపీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు క్వార్టర్స్ నుంచి ఖాళీ చేశారు. దానిని బీజేపి ఎమ్మెల్యే లక్ష్మినారాయణ క్వార్టర్ (నెం. 222)లో ఏర్పాటు చేశారు. గత నెల 14న జరిగిన జేఏసీ సమావేశంలో ఎర్రబెల్లిపైన, టీడీపీ పైన కేసీఆర్ తీవ్రంగా మండిపడిన నేపథ్యంలో జేఏసీ కార్యాలయాన్ని అక్కడి నుంచి ఖాళీ చేశారు.

**09 జూన్ 2011:**

**తెలంగాణ జేఏసి ఉద్యమ కార్యాచరణ**

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ జేఏసి ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఈనెల 25వ తేదీనాటికి కేంద్ర సానుకూల నిర్ణయం తీసుకోకపోతే.. తెలంగాణ ప్రాంతానికి చెందిన మంత్రులు, కాంగ్రెస్, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాలని డెడ్‌లైన్ విధించింది. ఒకవేళ వారు రాజీనామాలు చేయకపోతే గ్రామాలకు రానివ్వద్దని, వారికి సహకరించవద్దని ప్రజలకు పిలుపునిచ్చింది. చైర్మన్ కోదండరాం అధ్యక్షతన టీఎన్జీవో భవన్‌లో జేఏసి స్టీరింగ్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కాంగ్రెస్ మోసపూరిత వైఖరి, టీడీపీ ద్వంద్వ వైఖరిని విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించారు. తొలి ప్రచార యాత్ర సభ 13న హైదరాబాద్‌లో జరుగుతుందని తెలిపారు. 19న 'హైదరాబాద్ కుక్స్ ఆన్ రోడ్స్' అనే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జాతీయ రహదారుల దిగ్బంధం, రైలు రోకో కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. సార్వత్రిక సమ్మెతో ప్రభుత్వ పాలనను స్తంభింప జేస్తామన్నారు. లక్షలాది మందితో 'ఛలో హైదరాబాద్' నిర్వహించి నగరాన్ని దిగ్బంధిస్తామన్నారు.

## 14 జూన్ 2011:

### వరంగల్‌లో తెలంగాణవాదులపై విరుచుకుపడ్డ పోలీసులు

వరంగల్‌లో విద్యార్థులపై లాఠీలు మళ్లీ చెలరేగాయి. సుబేదారి రక్తమోడింది. జగన్‌కు, కొండా మురళికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో హెూరెత్తింది. డీఐజీ బంగ్లా సాక్షిగా సుమారు రెండు గంటలపాటు ఈ ప్రాంతం యుద్ధకాండను తలపించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 'సాగుపోరు'ను అడ్డుకున్న సందర్భంగా విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జికి నిరసనగా టీఆర్ఎస్ సహా వివిధ జేఏసీల ఆధ్వర్యంలో మంగళవారం సుబేదారిలోని అమరవీరుల స్థూపం వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ జంక్షన్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు ర్యాలీగా బయలుదేరారు. డీఐజీ బంగ్లా వద్దకు రాగానే వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో తోపులాట జరిగింది. దీంతో బారికేడ్లను ఛేదించుకుని కొందరు న్యాయవాదులు విగ్రహం వద్దకు చేరుకున్నారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహించిన విద్యార్థులు డీఐజీ బంగ్లా ఎదుటే కొండా మురళి దిష్టిబొమ్మను దహనం చేశారు. డీఐజీ బంగ్లాను ముట్టడించేందుకు ప్రయత్నించారు. దాంతో పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేశారు. దీంతో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. విద్యార్థులను, జేఏసీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక విగ్రహం వద్దకు చేరుకున్న కొంతమంది న్యాయవాదులు అక్కడ జగన్‌పార్టీ జెండాలను తొలగించి, ధర్నా నిర్వహించారు. శ్రీకృష్ణ కమిటీ నివేదికలోని 8వ చాప్టర్ అంశాలను పోలీసులు అక్షరాల అమలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ జరిగింది.

## 18 జూన్ 2011:

### వంటా వార్పుకు రంగం సిద్ధం

నిత్యం చీమలదండును తలపించే హైదరాబాద్ రోడ్లపైనే తెలంగాణ పొయ్యి వెలిగించేందుకు రంగం సిద్ధమైంది. తెలంగాణ రాజకీయ జేఏసి ఆధ్వర్యంలో జరుగనున్న పట్నం రోడ్లపై పొయ్యి పెడదాం (హైదరాబాద్ కుక్స్ ఆన్ రోడ్స్) కార్యక్రమం జరుగనుంది. మిలియన్ మార్చ్ తర్వాత అదే స్థాయిలో జరుగనున్న ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల దాకా కొనసాగుతుంది. హైదరాబాద్ నగరంలో ప్రధానంగా 150 కేంద్రాలను ఎంపిక చేసినా.. గల్లీలన్నీ చోట్ల కలిపితే వెయ్యి చోట్ల పొయ్యి వెలుగుతుందని గ్రేటర్ జేఏసి కన్వీనర్ డాక్టర్ శ్రీధర్, టీఆర్ఎస్ గ్రేటర్ నేత పద్మారావు, శ్రీనివాస్‌యాదవ్, సారంగపాణిలు ప్రకటించారు.

### అనుమతి లేదు: డీజీపీ

'పట్నం రోడ్లపై పొయ్యి పెడుదాం' కార్యక్రమానికి అనుమతి లేదని డీజీపీ

అరవిందరావు స్పష్టం చేశారు. తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో సీఎం కిరణ్‌తో డీజీపీ, ఇతర పోలీసు అధికారులు శనివారం రెండు సార్లు సమావేశమయ్యారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. వంటా వార్పు గురించి తమను ఎవరూ అనుమతి అడగలేదని, తామెవరికి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ముందస్తుగా ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని తెలిపారు. ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**19 జూన్ 2011:**

**'హైదరాబాద్ కుక్స్ ఆన్ రోడ్స్' సక్సెస్**

**ప్రశాంతంగా వంటా వార్పు... రోడ్ల పక్కన్నే భోజనాలు**

హైదరాబాద్ రోడ్లంటే వాహనాల బారులు.. హారన్ల రొదలు.. కాలుష్యపు పొగలు.. కానీ, ఆదివారం వాటిపై భిన్నమైన దృశ్యం ఆవిష్కృతమైంది. పొయ్యిల బారులు.. వంటల ఘుమఘుమలు.. తెలంగాణ సెగలతో రోడ్లన్నీ నిండిపోయాయి. ప్రత్యేక తెలంగాణ సెగ కేంద్ర ప్రభుత్వానికి తాకాలంటూ తెలంగాణ రాజకీయ జేఏసి ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'పట్నం రోడ్లపై పొయ్యి పెడదాం' కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, టీఆర్ఎస్ఎల్పీ నేత ఈటెల రాజేందర్ తదితర నాయకులు సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజకీయ కార్యక్రమంలో తొలిసారిగా పాల్గొన్న కేసీఆర్ భార్య శోభ తమ కుటుంబం తరపున పొయ్యి పెట్టారు. ఆమెతో కలిసి కేసీఆర్ గరిట తిప్పారు. వంట చేసి వడ్డించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వంటా వార్పులో టీఆర్ఎస్, బీజేపి, న్యూడెమాక్రసీలతో పాటు వివిధ పార్టీలకు, సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, వివిధ జేఏసీల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హైటెక్ సిటీ వద్ద జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ పాల్గొని తెలంగాణకు మద్దతు పలికితే.. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే విష్ణువర్దన్‌రెడ్డి జై తెలంగాణ నినాదాలు చేశారు. రాజీనామాకూ వెనకాడనన్నారు. మిలియన్ మార్చ్‌ను దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. కాగా, తెలంగాణ సాధనకు రాజీనామాలే సరైన విధానమని, రాజీనామాలు చేస్తే.. తెలంగాణ ప్రజల కాళ్లు మొక్కైనా జేఏసి తరపున లక్షల మెజారిటీతో మళ్లీ గెలిపిస్తామని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. వారి రాజకీయ భవిష్యత్తుకు ఎలాంటి ఢోకా ఉండదని, ఆ పూచీ తమదని భరోసా ఇచ్చారు. తెలంగాణపై తెగేదాకా లాగవద్దని, 1969 నాటి పరిస్థితులు పునరావృతమవుతాయని ప్రధాని మన్మోహన్‌ను హెచ్చరించారు.

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా కేంద్రం తక్షణం తెలంగాణ ప్రకటనకు

కట్టుబడి రాష్ట్ర ఏర్పాటు చర్యలు తీసుకోవాలని తెలంగాణ జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును జాప్యం చేస్తే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. చార్మినార్ సమీపంలో జరిగిన వంటావార్పు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీహెచ్ఈఎల్‌లో వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి లగడపాటి లాంటి సమైక్యవాదుల చెంపఛెళ్లుమనిపించారని, తెలంగాణ–హైదరాబాద్ వేర్వేరు కాదని చాటిచెప్పారని అన్నారు. ఆయన భరత్‌నగర్, మూసాపేట, కూకట్‌పల్లి, వివేకానందనగర్ ప్రాంతాల్లో వంటావార్పు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ డాక్టర్స్ జేఏసి ఆధ్వర్యంలో వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదండరాం పాల్గొని మాట్లాడుతూ.. లగడపాటి రాజ్‌గోపాల్ బలంతో కాకుండా భయంతో మాట్లాడుతున్నాడని అన్నారు. తెలంగాణ ఉద్యమం బలపడుతున్న ప్రతీసారీ లగడపాటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ బీజేపీ నేతలు విద్యాసాగర్‌రావు, దత్తాత్రేయ, యండల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. తామిచ్చే నాలుగో రాష్ట్రమే తెలంగాణ అని ఆపార్టీ నేతలు వ్యాఖ్యానించారు. ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి కోర్టుల వద్ద న్యాయవాదులు వంటావార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగం జనార్ధన్‌రెడితో పాటు గద్దర్ పాల్గొన్నారు.

సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ఆధ్వర్యంలో మాదాపూర్ హైటెక్‌సిటీలో పొయ్యి వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఐటీ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పెద్దసంఖ్యలో పాల్గొని, ప్రత్యేక రాష్ట్రంతో ఐటీ పరిశ్రమకు వచ్చే నష్టమేమి లేదన్నారు. తార్నాక, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, నారాయణగూడ, అమీర్‌పేట, గన్‌పార్క్, దిల్‌షుక్‌నగర్, అల్వాల్, మల్కాజిగిరి సికింద్రాబాద్, ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, జేఏసీ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీ విజయశాంతి, కోదండరాంలతో పాటు ఉద్యోగ సంఘాల నేతలు స్వామీగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, విఠల్, దేవిప్రసాద్‌రావులతో పాటు పలువురు జేఏసీ ప్రతినిధులు నగరంలో అనేక ప్రాంతాలలో జరిగిన వంటావార్పు కార్యక్రమాలలో పాల్గొని ప్రసంగించారు.

**21 జూన్ 2011:**

**తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సారు అస్తమయం**

'నా స్వప్నం తెలంగాణ' అని నినదించి 'పుట్టుక తనది.. చావు తనది.. బతుకు మాత్రం మొత్తంగా తెలంగాణది' అన్నట్లుగా తెలంగాణ గోసను చూడలేక

సకల సుఖాలను త్యజించి ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ప్రొఫెసర్ జయశంకర్ సారు. గత కొంత కాలంగా పేగు కేన్సర్‌తో బాధపడుతూ తేదీ 21-06-2011 మంగళవారం నాడు ఉదయం 11.15గంటలకు హన్మకొండలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఈ వార్త తెలుసుకున్న తెలంగాణ కన్నీటి సంద్రమైంది.

## పెద్దదిక్కును కోల్పోయాం: కేసీఆర్

"ప్రొఫెసర్ జయశంకర్ మృతి నన్ను కలచి వేసింది. తెలంగాణ సమాజం, ఉద్యమం, వ్యక్తిగతంగా నేను కూడా పెద్దదిక్కును కోల్పోయా"మని టీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు గద్గద స్వరంతో పలికారు. మంగళవారం ఏకశిలా పార్కులో ఉంచిన జయశంకర్ మృతదేహానికి ఆయన నివాళులు అర్పించి, కన్నీటిపర్యం తమయ్యారు. జయశంకర్ మృతి తనకు వ్యక్తిగంతంగా తీరని లోటని, ఉద్యమ వ్యూహరచనలో జయశంకర్ తోడుగా ఉండి తన అనుభవాన్ని పంచేవారని పేర్కొన్నారు.

## మూడురోజులు సంతాపదినాలు: కోదండరాం

ప్రొఫెసర్ జయశంకర్ మృతకి నివాళిగా మూడు రోజులు సంతాప దినాలుగా పాటించాలని తెలంగాణ రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ వాదులకు పిలుపునిచ్చారు. నల్లబ్యాడ్జీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలతో సంతాపం తెలియ జేయాలని సూచించారు. అధికారిక కార్యక్రమాలు జరపవద్దని విజ్ఞప్తి చేశారు. విరసం నేత వరవరరావు జయశంకర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి ఉద్యమానికి తీరని లోటని అన్నారు.

## జయశంకర్ సారుకు ప్రముఖుల నివాళి

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ మృతి పట్ల ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. జయశంకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జయశంకర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశాడు. ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కూడా సంతాపం ప్రకటించారు. 'జయశంకర్ కోట్లాది తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని శాసన మండలి చైర్మన్ చక్రపాణి నివాళులర్పించారు. జయశంకర్ మృతితో దేశం గొప్ప మానవతావాదిని కోల్పోయిందని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు.

జయశంకర్ మృతి జాతీయస్థాయి ప్రగతిశీల వర్గాలకు లోటని కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే ఆయనకు నిజమైన నివాళి అని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, రాష్ట్రానికి తీరని లోటని ఎంపీ హర్షకుమార్, జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి చేసిన కృషి మరవలేనిదని ఎంపీ

గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. పీసీసీ చీఫ్ బొత్స సత్యనారాయణ, మంత్రి జానారెడ్డి, చిరంజీవి, జూలకంటి రంగారెడ్డి సంతాపాన్ని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి తండ్రిని కోల్పోయామని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసి నేతలు స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దేవిప్రసాద్, విఠల్‌లు పేర్కొన్నారు. తన నిండు జీవితాన్ని తెలంగాణ అంకితం చేసిన మహామేధావి, తెలంగాణ స్వాప్నికుడని సినీ దర్శకుడు ఎన్.శంకర్ అన్నారు.

తెలంగాణ ఎందుకు కావాలో ప్రజలకు, ఉద్యమకారులకు తెలియజేసిన జయశంకర్ మృతి తీరని లోటని మంత్రులు శ్రీధర్‌బాబు, రఘువీరారెడ్డి, బస్వరాజు సారయ్య, పి.శంకర్‌రావు అన్నారు. తెలంగాణలో ప్రజల సాధికారతకు, నమ్మిన సిద్ధాంతం కోసం అంకితభావంతో పోరాడిన యోధుడు జయశంకర్ అని మాజీ ఎంపీ దాసరి నారాయణరావు అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ గొప్ప విద్యావేత్తను కోల్పోయిందని లోక్‌సత్తా అధినేత జేపీ పేర్కొన్నారు. కీలక దశకు చేరుకున్న ఉద్య మానికి తీరని లోటని ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారని టీటీడీపీ నేత నామా నాగేశ్వర్‌రావు అన్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ కూడా సంతాపాన్ని తెలియజేశారు. తెలంగాణ ఉద్యమానికి, విద్యారంగానికి జయశంకర్ మృతి తీరని లోటని బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, ఎండల లక్ష్మినారాయణ, ఇంద్రసేనారెడ్డి అన్నారు. కాంగ్రేస్ అధికార ప్రతినిధి తులసి రెడ్డి జయశంకర్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

వ్యక్తిత్వం గల వ్యక్తి అని రాఘవులు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని చూడకుండానే జయశంకర్ నిష్క్రమించడం విచారకరమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ సాధనే ఆయనకు సరైన నివాళి అని తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ నేతలు కె.దిలీప్‌కుమార్, విమల, చెరుకూరి శేషగిరిరావు అన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్ జయశంకర్‌కు నివాళులు అర్పించారు. టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వినోద్‌కుమార్, జగదీశ్‌రెడ్డిలు సంతాపం ప్రకటించారు. బీజేపి తెలంగాణ కమిటీ సుధాకరశర్మ, న్యూడెమాక్రసీ కార్యదర్శి రాయల సుభాష్, జై ఆంధ్ర మహాసభ కన్వీనర్ సుధాకర్, తెలంగాణ ముస్లీం రచయితల వేదిక లతీఫ్, తెలంగాణ భాషోపాధ్యాయ సంఘం నేత కనకయ్య, వర్కింగ్ జర్నలిస్టుల ఫోరం కార్యదర్శి నరేందర్‌రెడ్డి, తెలంగాణ జాక్టో నేతలు క్రిష్ణారెడ్డి, నరసింహమూర్తి, కోఆర్డినేషన్ కమిటీ నేత గోపాలకిషన్, వివేక్, పీఆర్‌టీయూ నేతలు వెంకటరెడ్డి, రవీందర్, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ కృష్ణమూర్తి, కవి జయధీర్ తిరుమలరావు, తెలంగాణ రచయితల సంఘం, సింగిడి, తెలంగాణ సెటిలర్స్ ఫ్రంట్ సుధాకర్ తదితరులు సంతాపం ప్రకటించారు.

### కాంగ్రెస్‌నేతలకు చేదు అనుభవం

తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులు అర్పించేందుకు వచ్చిన కాంగ్రెస్, టీడీపీ నేతలకు చేదు అనుభవం ఎదురైంది. జయశంకర్ భౌతికకాయం వద్దకు చేరుకోనే క్రమంలో తొలుత అడ్వకేట్స్ క్వార్టర్స్‌లోనూ.. అనంతరం ఏకశిల పార్కులోనూ వారిని విద్యార్థులు, తెలంగాణవాదులు అడ్డుకున్నారు. 'తెలంగాణ ద్రోహుల'ంటూ భౌతికదాడికి దిగారు. ఈ క్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్యపై మన్ను పడగా.. కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, వివేక్‌ల చొక్కాలు చిరిగిపోయాయి. టీడీపీ నేతలకు కూడా ఇదే భంగపాటు ఎదురైంది. పదవులకు రాజీనామా చేసి వచ్చి నివాళులు అర్పించాలని తెలంగాణవాదులు గట్టిగా డిమాండ్ చేయడంతో భౌతికకాయాన్ని సందర్శించుకోకుండానే ఆ పార్టీ ఎంపీ గుండు సుధారాణి, జిల్లా అధ్యక్షుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెనుదిరగాల్సి వచ్చింది.

### 22 జూన్ 2011:

### 'తెలంగాణ జాతిపిత' జయశంకర్ సారుకు కన్నీటి వీడ్కోలు

ఒక శకం ముగిసింది.. తెలంగాణ ఉద్యమ శిఖరం డాక్టర్ కొత్తపల్లి జయశంకర్‌కు యావత్ తెలంగాణ ప్రజానీకం కన్నీటి వీడ్కోలు పలికింది. ప్రొఫెసర్ జయశంకర్ పార్థివ దేహానికి వరంగల్ జిల్లా హన్మకొండలో అంత్యక్రియలు జరిగాయి. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాంలు పాడె మోసారు. హన్మకొండ బలసముద్రం నుంచి నాలుగు గంటల పాటు సాగిన స్ఫూర్తి యాత్ర పద్మాక్షిగుట్ట సమీపంలోని శివముక్తి స్థల్‌కు చేరుకున్నది. స్ఫూర్తియాత్ర సమయంలో మంత్రి శంకర్‌రావు పైన, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు గండ్ర వెంకటరమణారెడ్డి ఇంటిపైన తెలంగాణ వాదులు రాళ్ల దాడి చేశారు. ఎన్టీఆర్ విగ్రహంపై చెప్పులు విసిరారు. పోలీసులు లాఠీచార్జి చేయగా పలువురికి గాయాలయ్యాయి.

బుధవారం ఉదయం 11.30కు హన్మకొండ ఏకశిల పార్క్ నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర(స్ఫూర్తియాత్ర) బాలసముద్రం, సుబేదారి, అమరవీరుల స్థూపం, కాళోజీ జంక్షన్, నక్కలగుట్ట, హన్మకొండ పబ్లిక్‌గార్డెన్, చౌరస్తా, పద్మాక్షిగుట్ట సమీపంలోని శిమముక్తి స్థల్‌కు నాలుగు గంటల సుధీర్ఘయాత్ర అనంతరం చేరుకుంది. తర్వాత జయశంకర్ చితికి తన పెంపుడు కుమారుడు బ్రహ్మం నిప్పంటించారు. తెలంగాణ వాదులు, కేయూ విద్యార్థులు నినాదాలు, ఉద్యమ గీతాలాపనలతో శివముక్తి ధామ్ మార్మోగింది.

### 04 జూలై 2011:

### తెలంగాణ నేతల మూకుమ్మడి రాజీనామా...

రాజీనామా పత్రాలు సమర్పించిన 11 మంది మంత్రులతో సహా 81 మంది

ఎమ్మెల్యేలు..., 12మంది ఎంపీలు..., 15మంది ఎమ్మెల్సీలు.. ఇంకా మిగిలింది టీ-కాంగ్రెస్‌లో 11 మంది ఎమ్మెల్యేలే... మళ్లీ అగ్గి రాజుకుంది. తెలంగాణ రాజీనామాలతో మొదలైన మంట సరసరమని వ్యాపిస్తోంది. బంద్‌లు, ఆందోళనలు, రైలురోకోలు, సామూహిక నిరాహార దీక్షలు, సార్వత్రిక సమ్మె..

తెలంగాణ ఇవ్వాల్సిందేనంటూ సోమవారం ఒక్కసారిగా అధికార పార్టీకి చెందిన 42 మంది ఎమ్మెల్యేలు, 12 మంది ఎమ్మెల్సీలు, 10మంది ఎంపీలు రాజీనామా చేయడంతో కాంగ్రెస్ అధిష్టానానికి ఉద్యమ సెగ తిగిలింది. వీరికి తోడు.. తెలుగుదేశం పార్టీకి చెందిన తెలంగాణ ఎమ్మెల్యేలు 37 మంది, పీఆర్పీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు... వెరసి 81మంది ఎమ్మెల్యేల మూకుమ్మడి రాజీనామాలతో రాష్ట్రం పీకల్లోతు రాజకీయ సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఇది రాజ్యాంగ సంక్షోభంగా ముదిరేరోజు ముందుంది! దీనికి తోడు తెలంగాణ జేఏసీ తన ఉద్యమ కార్యచరణను ప్రకటించి మరింత వేడిని పెంచింది. రెండు రోజుల 'మెరుపు బంద్'కు పిలుపునిచ్చింది. రాజీనామాలకు తొలుత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే పి.విష్ణువర్దన్ రెడ్డి తెరలేపారు. సోమవారం 10.30గంటలకు ఆయన డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టివిక్రమార్కకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఆ తర్వాత ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు తరలివచ్చారు.

ఆర్టీసీ చైర్మన్ పదవికి ఎం.సత్యనారాయణ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 11 మంది మంత్రులు ఎమ్మెల్యే పదవులకు రాజీనామాలు సమర్పించిన అనంతరం మంత్రి పదవులకు రాజీనామాలు ఇచ్చేందుకు గవర్నర్‌ను కలవాలని అనుకున్నారు. అయితే... సీఎం కిరణ్ వారిని మంత్రి పదవుల్లో కొనసాగాలని కోరారు. ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు 10 మంది (9లోక్‌సభ+1రాజ్యసభ) తమ పదవులకు రాజీనామా చేశారు. టీడీపీకి చెందిన ఇద్దరు ఎంపీలు తమ రాజీనామాలను సమర్పించారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అర్ధరాత్రి దాటాకా ఫ్యాక్స్ ద్వారా తన లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ లేఖను స్పీకర్‌కు పంపించారు.

## ఉద్యమ కార్యచరణ ప్రకటించిన జేఏసి

రాజీనామాల అగ్గి రాజుకున్న వెంటనే తెలంగాణ జేఏసి బంద్ భేరి మోగించింది. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించింది. ఢిల్లీ గద్దె స్పందించి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై నిర్థిష్టమైన ప్రణాళిక ఇచ్చేదాకా పోరు కొనసాగుతుందని ప్రకటించింది. 5, 6 తేదీల్లో తెలంగాణ సంపూర్ణ బంద్‌కు పిలుపునిచ్చింది. 7వ తేదీన విద్యార్థులు ఎక్కడికక్కడ ప్రదర్శనలు నిర్వహించాలని సూచించింది. ఇక 8,9 తేదీల్లో ఉత్తర, దక్షిణ భారత దేశాల మద్య సంబంధాలు తెగిపోయేలా రైల్‌రోకో నిర్వహించనున్నట్లు ప్రకటిచింది. 10న హైదరాబాద్ మినహా తెలంగాణ వ్యాప్తంగా వంటా వార్పు కార్యక్రమం ఉంటుందని పేర్కొంది. జేఏసీ స్టీరింగ్ కమిటీ అత్యవసర సమావేశం

అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడుతూ.. " తెలంగాణ ఉద్యమం అత్యంత కీలక సందర్భానికి చేరుకుంది. ఉద్యమానికి మద్దతుగా వంద మందికిపైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజీనామాలు చేశారు. గతంలో ఇంత మంది కదిలిన దాఖలాలు లేవు. వారిని తెలంగాణ ఉద్యమం అభినందిస్తోంది. ఇంకా రాజీనామాలు చేయని వారు ఇప్పటికైనా కదలిరావాలి. లేకపోతే వారు ద్రోహులుగా మిగిలిపోతారు" అని ఆయన హెచ్చరించారు.

## వాహనాలపై 'రిజైన్డ్ తెలంగాణ ఎమ్మెల్యే' స్టిక్కర్లు

ఎమ్మెల్యే స్టిక్కర్ వాహనంపై ఉంటే దాని విలువే వేరు. అది అంటించి ఉన్న వాహనంలో వెళితే ఎవరూ ఆపరు. ఎక్కడా అడ్డుకోరు. దారిస్తారు. గౌరవిస్తారు. మరి ఇప్పుడు 'రిజైన్డ్ తెలంగాణ ఎమ్మెల్యే' స్టిక్కర్లు ఉంటేనే అందరూ గౌరవిస్తారు. దారిస్తారు. సలాం చేస్తారు. ఎవరూ అడ్డుకోరు.. రాళ్లేయరు.. టమోటాలు, కోడిగుడ్లు అసలే పడవు. మరి ఈ స్టిక్కర్లను రాజీనామాలకు ముందే కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీటిని తయారు చేయించి సిద్దంగా ఉంచుకున్నారు. సోమవారం అలా రాజీనామా చేశారో లేదో అలా వాళ్ల వాహనాలకు ఈ స్టిక్కర్లను అంటించుకున్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మొట్టమొదట ఈ స్టిక్కర్‌ను తన వాహనానికి అంటించుకుని ఆవిష్కరించారు.

## రాజీనామాలకు బీజేపీ నో

తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాల్సిన అవసరం లేదని  బీజేపి నిర్ణయించింది. అసలు రాజీనామాలు చేయాలా? వద్దా? అనే ప్రశ్నే ఉత్పన్నం కాదని స్పష్టం చేసింది. సోమవారం అందుబాటులో ఉన్న పదాధికారులు పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం అయ్యారు. అనంతరం తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, లక్ష్మినారాయణలు రాజీనామాలు చేయాల్సిన అవసరం లేదని ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. తెలంగాణ జేఏసి పిలుపునిచ్చిన 48గంటల బంద్‌కు బీజేపి సంపూర్ణ మద్దతు తెలిపింది.

## నేను రాజీనామా చేయను: సర్వే

అన్నంపెట్టిన తల్లికి తాను సున్నం పెట్టనని, తనకు రాజకీయంగా జన్మనిచ్చిన సోనియాగాంధీకి చెప్పకుండా రాజీనామా చేయనని ఎంపీ సర్వే సత్యనారాయణ అన్నారు. సోమవారం పార్లమెంట్‌కు వెళ్లి రాజీనామా చేసిన సహచర ఎంపీలకు ఆయన మద్దతు తెలిపారు. కాగా, ఆయనను కూడా రాజీనామాకు ఒప్పించేందుకు ఇతర ఎంపీలు ప్రయత్నించి విఫలమయ్యారు. సోనియా అధికారాన్ని ప్రశ్నించేలా రాజీనామా చేయడం తప్పన్నారు. తెలంగాణ ఇవ్వను అని చెప్పినపుడు రాజీనామా నిర్ణయం తీసుకోవాలన్నారు.

**05 జూలై 2011:**

**బంద్ స్వచ్ఛందం, సంపూర్ణం**

జేఏసి ఇచ్చిన 48గంటల బంద్‌లో భాగంగా మంగళవారం తెలంగాణ సమస్తం స్తంబించింది. రాజధానితో పాటు తెలంగాణలోని మొత్తం పది జిల్లాల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. బంద్‌తో రాజధాని వీధులు బోసిపోయాయి. ఉద్యోగుల గైర్హాజరీతో ప్రభుత్వ కార్యాలయాలు పలుచగా కనిపించాయి. ఒక్కరోజు బంద్‌తో ఫార్మా కంపెనీలకు రూ. 100కోట్ల నష్టం జరిగినట్లు బల్క్ డ్రగ్ ఉత్పత్తిదారుల సంఘం ప్రకటించింది. రెండు రోజుల బంద్‌తో రూ. 20వేల కోట్ల మేర లావాదేవీలు స్తంబించిపోతున్నట్లు అఖిల భారత బ్యాంక్ అధికారుల సంఘం పేర్కొంది. ఆర్టీసీలో తెలంగాణలోని 10 రీజియన్లలో 9700 బస్సులు నడవాల్సి ఉండగా కేవలం 44 బస్సులను మాత్రమే నడిపారు. హైదరాబాద్‌లో 29, ఖమ్మంలో 15బస్సులను మాత్రమే నడిపారు. నగరంలో ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు చేశారు. విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలన్నీ బంద్‌ను పాటించాయి. న్యాయవాదులు కోర్టులు బహిష్కరించారు. ఉపా ధ్యాయులు టెన్త్ సప్లిమెంటరీ స్పాట్ వాల్యుయేషన్‌ను బహిష్కరించారు.

**ఉస్మానియాలో మళ్లీ ఉద్రిక్తత**

ఉస్మానియా యూనివర్సిటీలో మరోమారు ఉద్రిక్తతలు తలెత్తాయి. రాళ్ల వర్షం.. బాష్పవాయు ప్రయోగాలతో దద్దరిల్లింది. 14ఎఫ్ రద్దుకోసం ఓయూలో నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులను పరామర్శించేందుకు బయలుదేరిన నాగం జనార్థన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడంతో గొడవ మొదలైంది. ఇది రాళ్ల దాడి, బాష్పవాయు ప్రయోగం దాకా వెళ్లింది. ఈటెల రాజేందర్, జూపల్లి కృష్ణారావులు టీషర్టులు ధరించి, బైక్‌పై హెల్మెట్లు పెట్టుకుని పోలీసుల కళ్లుగప్పి ఓయూ క్యాంపస్‌లోకి చేరుకున్నారు. విద్యార్థుల చేత దీక్షలు విరమింపజేశారు. మరోవైపు.. బుధవారం ఆర్ట్స్ కాలేజీ నుంచి గన్‌పార్క్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఓయూ విద్యార్థులు ప్రకటించారు.

**అదనపు బలగాలు వద్దు: హెచ్ఆర్సీ**

ఉస్మానియాలో అదనపు బలగాలను మోహరించవద్దని రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. గాయపడ్డ విద్యార్థులకు తక్షణమే తగిన వైద్య సేవలు అందజేయాలని సూచించింది. వర్సిటీలో జరిగిన సంఘటనలపై 24గంటల్లోగా నివేదిక సమర్పించాలని డీజీపి ని ఆదేశించింది. ఓయూలో బలగాలను ఉపసం హరించాలని కోరుతూ తెలంగాణ న్యాయవాదుల జేఏసీ దాఖలు చేసిన పిటీషన్‌పై కమిషన్ ఈ ఉత్తర్వులు ఇచ్చింది.

**99కి చేరిన తెలంగాణ ఎమ్మెల్యేల రాజీనామాలు..**

తెలంగాణ కోసం మొదలైన ఎమ్మెల్యేల రాజీనామాల స్కోరు 'సెంచరీ'కి

చేరువైంది. ప్రస్తుతానికి 99 వద్ద ఆగింది. మంగళవారం కూడా రాజీనామాల వెల్లువ కొనసాగింది. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 11 మంది తమ లేఖలను అసెంబ్లీ కార్యదర్శి రాజా సదారాంకు అందించారు. పార్టీ ఎంపీలు కేసీఆర్, విజయశాంతి తమ లోక్‌సభ సభ్యత్వాలకు రాజీనామాలు చేస్తూ ఫ్యాక్స్ చేయగా, టీడీపీకి చెందిన నామా నాగేశ్వర్‌రావు, రమేష్‌రాథోడ్ సోమవారం స్వయంగా లోక్‌సభ స్పీకర్‌ను కలిసి స్వయంగా రాజీనామా లేఖలు అందించారు. సీపీఐ ఎమ్మెల్యేలు నలుగురు, బీజేపీ ఎమ్మెల్యేలు ఇద్దరితో పాటు మంత్రి శంకర్‌రావుకూడా తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేశారు. దీంతో రాష్ట్రంలో రాజీనామాలు సమర్పించిన ఎమ్మెల్యేల సంఖ్య 99కి చేరింది. ఇప్పుడు అసెంబ్లీలో తెలంగాణకు చెందిన మిగిలిన ఎమ్మెల్యేల సంఖ్య 20కి తగ్గింది. రాజీనామా చేసిన ఎమ్మెల్సీల సంఖ్య 16కు చేరింది. ఇదిలా ఉండగా స్పీకర్ నాదేండ్ల మనోహర్ విదేశీ పర్యటనలో ఉండగా ఆయన తిరిగి వచ్చేవరకు రాజీనామాలపై వేచి చూడాల్సి ఉంది.

## తెలంగాణ జిల్లాల్లో కొనసాగుతున్న రాజీనామాలు

తెలంగాణలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నిజామాబాద్ జిల్లాలో జుక్కల్ జడ్పీటీసీ, పలువురు ఎంపీపీలు, ఎంపీటీసీలు తమ పదవులకు రాజీనామాలు సమర్పించారు. ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌తో పాటు 18మంది జడ్పీటీసీలు, 8మంది ఎంపీపీలు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు రాజీనామాలు చేశారు. నల్గొండ జిల్లా నడిగూడెం ఎంపీపీ రాజీనామా చేశారు. మెదక్ జిల్లా నిజాంసాగర్ జీఎస్ఆర్. సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, నారాయణఖేడ్ ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కర్‌లు తమ పదవులకు రాజీనామా చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 15 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా  చేశారు.

## 06 జూలై 2011:

## కోదండరాం అరెస్ట్

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో బంద్‌ను పర్యవేక్షించి మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాంను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులకు, కోదండరాంకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. మీడియాతో మాట్లాడుతున్న తనను ఏవిధంగా అరెస్టు చేస్తారని ఆయన పోలీసులను ప్రశ్నించారు. ఐదుగురు విలేకరులతో మాట్లాడటం కూడా తప్పా అని నిలదీశారు. పోలీసులు హింసను ప్రేరేపిస్తే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని కోదండరాం హెచ్చరించారు.

## రెండో రోజు బంద్ సక్సెస్

తెలంగాణ రాజకీయ జేఏసీ పిలుపునిచ్చిన 48గంటల బంద్ విజయవంతమైంది. తెలంగాణ వ్యాప్తంగా విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించాయి. వరంగల్ జిల్లాలో రామన్నపేటలో గుండు సుధారాణి ఇంటిని ముట్టడించారు. ఆమె రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ టీపీఎఫ్ నాయకురాలు శోభారాణి హన్మకొండ బస్టాండ్‌లోని వాటర్‌టాంక్‌పైకి ఎక్కారు. సబేదారిలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎబీవీపి కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ కోర్‌కమిటీ సభ్యుల ఫ్లెక్సీలపై కోడిగుడ్లు, టమోటాలు విసిరి అనంతరం దహనం చేశారు. జిల్లాలో పలుచోట్ల జైపాల్‌రెడ్డి, ఆజాద్, యూపీఏ ప్రభుత్వం దిష్టిబొమ్మలను దహనం చేశారు. తన ఆత్మహత్యతోనైనా ఢిల్లీ నేతలు కళ్లు తెరిచి తెలంగాణ ఇవ్వాలని కోరుకుంటూ ఇంజనీరింగ్ విద్యార్థి డి.శ్రీకాంత్ (22) ప్రాణాలర్పించారు.

మెదక్ జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు విధులు బహిష్కరించారు. ఎద్దులమైలారం అర్డినెన్స్ ఫ్యాక్టరీలో నాలుగు వేల మంది ఉద్యోగులు విధులు బహిష్కరించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఇంటిని ముట్టడించడానికి ప్రయత్నించారు. మిర్దొడ్డి తహసీల్దార్ కార్యాలయానికి మాజీ ఎమ్మెల్యే ఎస్.రామలింగారెడ్డి తాళం వేశారు. హత్నూర మండలంలో ఉపముఖ్యమంత్రి దామోదర్, జగ్గారెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. జిన్నారం మండలం గుమ్మడిదలలో జగ్గారెడ్డి ఫోటోకు పిండప్రధానం చేశారు. పటాన్‌చెరు వద్ద హైవేపై రాస్తారోకో నిర్వహించారు. కోదండరాం అరెస్టుకు నిరసనగా నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్ ముట్టడికి ప్రయత్నించారు.

మహబూబ్‌నగర్‌లో జైపాల్‌రెడ్డిపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. జిల్లాలో పలుచోట్ల ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. సోనియా, మన్మోహన్ చిత్రపటాలను దున్నపోతులకు కట్టి ఊరేగించారు. ఆలంపూర్‌లో మంత్రి టీజీ వెంకటేష్‌కు చెందిన ట్రాక్టర్లను టీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. నారాయణపేటలో చిదంబరం దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ అధ్యాపకుల ఫోరం, అర్టీసీ కార్మికులు వంటావార్పు నిర్వహించారు. జేఏసీలు బల్మూరులో ర్యాలీ, అచ్చంపేటలో కబడ్డీ పోటీలు నిర్వహించారు.

హైదరాబాద్‌లో హయత్‌నగర్ వద్ద రెండు ప్రైవేటు బస్సులను తెలంగాణవాదులు దహనం చేశారు. జేఏసీ నాయకులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సిబ్బందిని బయటకు పంపించారు. హైకోర్టు లాయర్లు విధులు బహిష్కరించారు. ఓయూ విద్యార్థుల ఆందోళన, కోదండరాం అరెస్టుతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓయూ నుంచి గన్‌పార్క్ వరకు ర్యాలీకి బయలుదేరిన విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో

లాఠీచార్జి, ఘర్షణ జరిగాయి. రాజేంద్రనగర్‌లో తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన పరకాల ప్రభాకర్, కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఇళ్ల వద్ద ధర్నాలు జరిగాయి. బలగాలను వెనక్కు పంపాలని టీడీపీ తెలంగాణ ఫోరం నేతలు రాజ్‌భవన్ ముట్టడించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే మణెమ్మ, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజేందర్ ఇళ్ల దగ్గర ధర్నాలు నిర్వహించారు. 14ఎఫ్‌ను తొలగించాలని నగరంలో సీపీఐ ప్రదర్శన నిర్వహించింది.

ఖమ్మం జిల్లాలో సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలిగింది. 1.65లక్షల టన్నుల ఉత్పత్తికి గాను కేవలం 5వేల టన్నుల బొగ్గును మాత్రమే తీయగలిగారు. కేంద్రం మొండివైఖరికి నిరసనగా ఈనెల 10వరకు విధులు బహిష్కరించాలని బార్ అసోసియేషన్ నిర్ణయించింది. డిప్యూటీ స్పీకర్ భట్టి, ఎమ్మెల్యే రేగా కాంతారావుల ఇళ్ల ముందు జేఏసీ ధర్నా చేసింది. మధిరలో భట్టికి పిండప్రధానం చేశారు. భట్టి ఫ్లెక్సీలు, బ్యానర్లు తగులబెట్టిన టీఆర్ఎస్ విద్యార్థినాయకులపై పోలీసులు సుమోటో కేసు నమోదు చేశారు. భద్రాచలంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ధర్నా చేశారు.

కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు విధులు బహిష్కరించారు. రాజీనామాలు చేయని నేతలతో పాటు సోనియా, చిదంబరం, సీఎం, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కోదండరాం అరెస్టుకు నిరసనగా రాస్తారోకోలు, ధర్నాలు చేశారు.

నిజామాబాద్‌లో బస్టాండ్ ఎదుట టీఆర్ఎస్, ఎన్సీపీ, జేఏసీ కార్యకర్తలు ఎమ్మెల్సీ రాజేశ్వర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. టెన్త్ సప్లిమెంటరీ స్పాట్ వాల్యుయేషన్‌ను జేఏసీ అడ్డుకుంది. ముదక్‌పల్లిలో జైపాల్‌రెడ్డి దిష్టిబొమ్మను, జక్రాన్‌పల్లిలో ఎమ్మెల్సీ రాజేశ్వర్, వేల్పూర్ తదితర చోట్ల సోనియా, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆర్మూర్‌లో కోర్టుకు న్యాయవాదులు తాళం వేశారు. పలుచోట్ల నాగేందర్, ముఖేష్‌గౌడ్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ఆదిలాబాద్ జిల్లాలో టీఆర్ఎస్ ఎడ్లబండ్ల ర్యాలీ, జేఏసీ ర్యాలీ, ఏబీవీపీ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించాయి. రాజీనామా చేయని ఎమ్మెల్యేలు, మంత్రుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కోదండరాం విడుదల కోరుతూ 10 మంది నెన్నెలలో వాటర్‌టాంక్ ఎక్కారు.

నల్గొండ జిల్లాలో సీపీఎం కార్యాలయంపై యువజన కాంగ్రేస్ దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేసింది. నల్గొండ, కోదాడల్లో సీపీఎం కార్యాలయాల వద్ద తెలంగాణవాదలు నిరసన తెలుపగా, మిర్యాలగూడలో ఎమ్మెల్యే జూలకంటి ఇంటి ఎదుట ధర్నా చేశారు. మునుగోడులో పెట్రోల్‌బంక్‌పై దాడి చేశారు. కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద ఆంధ్రా సరిహద్దులో టీఆర్ఎస్ గంటకుపైగా రాస్తారోకో చేసింది.

పలుచోట్ల సోనియా, జైపాల్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో జేఏసీ ప్రజాకోర్టు నిర్వహించి, రాజీనామా చేయని ప్రజాప్రతినిధులకు ఉరిశిక్ష వేయాలని తీర్పునిచ్చింది. నేరేడుచర్లలో జైపాల్, జూలకంటి పేర సమాధులు నిర్మించారు. రంగారెడ్డిజిల్లాలో రెండు రోజుల పాటు సంపూర్ణ బంద్ జరిగింది. ఆర్టీసీకి దాదాపు ఐదు కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి, ఎంపీ సర్వే సత్యనారాయణల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

**09 జూలై 2011:**

**ఉద్యమ బాటలో జేఏసీ**

తెలంగాణ జేఏసీ తన తాజా కార్యాచరణను ప్రకటించింది. కాంగ్రెస్, టీడీపీ తమతమ అజెండాలతో ముందుకు సాగుతుండడంతో.. తెలంగాణ జేఏసీ సొంతంగానే అడుగు ముందుకేసింది. ఆదివారం రాజీనామాలు చేయని ప్రజాప్రతినిధుల దిష్టిబొమ్మల దహనంతో మొదలు పెట్టి.. 12న హైదరాబాద్ మినహా తెలంగాణలో వంటా వార్పు, 14న ఒక రోజు రైల్‌రోకో, ఆగస్టు 1 నుంచి సార్వత్రిక సమ్మె నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సారి సమ్మె చాలా తీవ్రంగా ఉంటుందని, ప్రభుత్వ వ్యవస్థలు, ఏ స్థాయిలోనూ పనిచేయవని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర అన్ని రంగాలకు చెందిన వారు సమ్మెలో పాల్గొంటారని జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం ప్రకటించారు.

**10 జూలై 2011:**

**ఓయూలో మీడియాపై ఆంక్షలు**

ఉస్మానియాలో మీడియాపై పోలీసులు ఆంక్షలు విధించారు. వర్సిటీ లోపలికి వెళ్లి చేసే ప్రత్యక్ష ప్రసారాలను సోమవారం నుంచి అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం నుంచి విద్యార్థుల దీక్షలు ఉండటంతో ఈ ఆంక్షలు విధించనట్లు తెలిసింది. ఆదివారం అర్ధరాత్రి క్యాంపస్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ నిర్ణయాన్ని జర్నలిస్టు సంఘాలు తప్పుపడుతున్నాయి.

**ప్రభుత్వం వెర్రివేషాలు వేస్తోంది: కోదండరాం**

'వండుకుని తింటామన్నా.. అనుమతి కావాలట.. తెలంగాణ కోసం నిరసనగా తినకుండా ఉంటామన్నా.. అనుమతి తీసుకోవాలట.. అంతా విస్మయంగా ఉంది. ప్రభుత్వం ఇలా వెర్రివేషాలు వేస్తోంది.' అని తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాం ఎద్దేవా చేశారు. ఓయూలో విద్యార్థులు సామూహిక దీక్షలకు పూనుకుంటే వారికి సంఘీభావం తెలిపేందుకు తెలంగాణవాదుల్ని వెళ్లనీయకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. ఆదివారం గోదావరిఖనిలో జరిగిన జేఏసీ సమావేశంలో

మాట్లాడారు. ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించే శక్తి సింగరేణి లోకానికి ఉందని, ఆగస్టు ఉద్యమానికి అన్ని సంఘాలు ఓ నిర్ణయానికి వచ్చాయని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో లాయర్ల జేఏసీ నేతలు, సింగరేని కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**11 జూలై 2011:**

**ఓయూలో సామూహిక దీక్షలు ప్రారంభం**

తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఓయూ విద్యార్థి జేఏసీలు సంయుక్తంగా పిలుపునిచ్చిన సామూహిక నిరవధిక నిరాహార దీక్ష తీవ్ర ఉత్కంఠ మధ్య సోమవారం ప్రారంభమైంది. స్వతంత్ర జేఏసి ర్యాలీ.. విద్యార్థుల ఆందోళనలతో సాయంత్రం వరకు వర్సిటీలో ఉద్రిక్తత కొనసాగినా.. దీక్షలు మాత్రం ప్రశాంతంగా సాగిపోయాయి. క్యాంపస్‌కు వచ్చే అన్ని దారులను మూసేసినా.. కేయూ నుంచి 200 మంది విద్యార్థులకు అక్కడికి చేరుకున్నారు. పోలీసుల కళ్లుగప్పి జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాం, టీఎన్జీవో నాయకులు స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, విమలక్క, గజ్జెల కాంతంతో పాటు అనేక ప్రజా సంఘాల నాయకులు ఓయూకు చేరుకున్నారు. ఆ తర్వాత కోదండరాం విద్యార్థుల మెడలో పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభింపజేశారు. ఇదిలా ఉండగా విద్యార్థుల దీక్షకు సంఘీభావం తెలిపేందుకు అసెంబ్లీ నుంచి బయలుదేరిన టీఆర్ఎస్, టీడీపీ రెబల్ ఎమ్మెల్యేలు, బీజేపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ వద్దే పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో వారు అక్కడే ధర్నాకు దిగారు. తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలను విద్యానగర్ చౌరస్తాలో అరెస్టు చేసి వారిని 250 మంది పోలీసులు కాపలా కాశారు. అనంతరం వారిని నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**13 జూలై 2011:**

**టీ కాంగ్రేస్ ప్రజాప్రతినిధుల నిరసన ప్రారంభం**

తెలంగాణ సాధనకు పార్టీ అధిష్టానంపై ఒత్తిడి పెంచడమే ధ్యేయంగా.. కాంగ్రేస్ తెలంగాణ ప్రజాప్రతినిధులు చేపట్టిన 48గంటల నిరసన దీక్ష బుధవారం ఉదయం ఇందిరాపార్కు వద్ద ప్రారంభమైంది. దీక్షలో 5గురు మంత్రులు, 8 మంది ఎంపీలు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూర్చున్నారు. మెజారిటీ మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలు సంఘీభావం తెలిపి వెళ్లిపోయారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తల జై తెలంగాణ నినాదాలతో తొలిరోజు దీక్షా ప్రాంగణం హోరెత్తింది. ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెస్సార్, మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి తదితర కాంగ్రేస్ నేతలు హాజరై దీక్షకు సంఘీభావం తెలిపారు. టీపీఎఫ్ అధ్యక్షుడు గద్దర్, ఉద్యోగ సంఘాల నేతలు స్వామిగౌడ్, దేవిప్రసాద్, విఠల్, టీయూఎఫ్ నేత విమలక్క తదితరులు

వేదిక వద్దకు వచ్చి మద్దతు పలికారు. ఆగస్టు 1 నాటికి కేంద్రం స్పందించకపోతే నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని ఉద్యోగ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఎంపీలు కేకే, పొన్నం, గుత్తా, రాజయ్య, వివేక్, రాజ్‌గోపాల్‌రెడ్డి, మందా, బలరాం నాయక్, మంత్రులు జానా, పొన్నాల, సారయ్య, కోమటిరెడ్డి, గీతారెడ్డి, ఎమ్మెల్యేలు దామోదర్ రెడ్డి, జూపల్లి, బిక్షమయ్యగౌడ్, బాలూనాయక్, లింగయ్య, సోమారపు, శ్రీధర్, అరెపల్లి మోహన్, టి.రాజయ్య, ప్రసాద్, కవిత, కె.లక్ష్మారెడ్డిలు దీక్షలో కూర్చున్నారు.

ఆజాద్‌ను తక్షణమే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి బాధ్యతల నుంచి తప్పించాలని దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. తమ ప్రసంగాలలో ఆజాద్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

## 14 జూలై 2011:

### ఓయూలో విద్యార్థుల దీక్ష విరమణ

తెలంగాణ కోసం ఉస్మానియా వర్సిటీలో నాలుగు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులు.. ఎట్టకేలకు గురువారం తమ దీక్షను విరమించారు. నేతలు, ప్రజా సంఘాల చొరవతో విద్యార్థులు మెట్టుదిగారు. నాగం, హరీశ్వర్‌రెడ్డి, ఈటెల, దత్తాత్రేయ, గద్దర్, కోదండరాం, మల్లెపల్లి లక్ష్మయ్య, చక్రపాణి, సూర్యం, గోవర్ధన్, విమలక్క తదితరులు విద్యార్థులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. దీక్షల నాలుగోరోజు పలువురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వారిని ఆస్పత్రికి తరలించారు.

### రైల్‌రోకో విజయవంతం

తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన రైలు రోకో ప్రశాంతంగా ముగిసింది. జేఏసీ భాగస్వామ్య పక్షాలు టీఆర్ఎస్, బీజేపీ, న్యూడెమాక్రసీ, ప్రజా సంఘాలు ఈ ఆందోళనలో పాలుపంచుకున్నాయి. రైల్‌రోకోతో దక్షిణ మధ్య రైల్వేకు దాదాపు రూ. 2కోట్ల వరకు నష్టం వాటిల్లింది. జేఏసీ చైర్మన్ కోదండరాంతోపాటు పలువురు నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. పలు చోట్ల ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేవారు. తెలంగాణ వ్యాప్తంగా 49చోట్ల రైల్‌రోకోలు నిర్వహించినట్లు టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొ.ఎం.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## 15 జూలై 2011:

### సీఎంకు జేఏసీ సమ్మె నోటీసు

ఇది సకల జనుల సమ్మె! తెలంగాణలోని ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, మునిసిపల్, పంచాయితీరాజ్ సిబ్బంది, సింగరేణి, ఆర్టీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులతో పాటు సామాన్య ప్రజలు పాల్గొనే సమ్మె! ఈ నెలాఖరులోగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను

ప్రారంభిస్తున్నట్లు స్పష్టమైన ప్రకటన రాకపోతే ఆగస్టు 1 తర్వాత ఏ క్షణమైనా సకల జనుల సమ్మె ప్రారంభిస్తామని తెలంగాణ జేఏసి అల్టిమేటం ఇచ్చింది. జేఏసి చైర్మన్ ప్రొ,కోదండరాం నేతృత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయసంఘాల నేతలు శుక్రవారం ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిని కలిసి సమ్మె నోటీసు అందించారు. నా చేతుల్లో ఏమీ లేదు. నేను తెలంగాణకు అనుకూలం కాదు. వ్యతిరేకమూ కాదు. ముఖ్యమంత్రిగా నా బాధ్యత నిర్వహిస్తా. కేంద్రానికి ఇక్కడి విషయాలను నివేదిస్తానని సీఎం బదులిచ్చినట్లు కోదండరాం విలేకరులకు చెప్పారు.

**20 జూలై 2011:**

**తెలంగాణ కోరుతూ ఢిల్లీలో యాదిరెడ్డి ఆత్మహత్య**

దేశ రాజధానిలో పార్లమెంటు, రాష్ట్రపతి భవన్‌ల సమీపాన తెలంగాణ కోసం ఒక యువకుడు ప్రాణాలొదిలాడు. శాస్త్రి భవన్‌కు రాజ్‌పథ్‌కు మధ్య ఫౌంటెన్ పక్కన ఉన్న చెట్టుకు మందాడి యాదిరెడ్డి(31) ఉరేసుకున్నాడు. బుధవారం ఉదయం 7.30గంటలకు స్థానికులు గమనించి పోలీసులకు తెలిపారు. వారు మృతదేహాన్ని రామ్ మనోహర్ లోహియా అస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. సంఘటన స్థలం వద్ద డైరీ, మృతుడి ఆధార్ కార్డు కాపీ, ఒక లేఖ లభించినట్లు న్యూఢిల్లీ జిల్లా అదనపు డీసీపీ సెజు పి.కురువిల్లా చెప్పారు.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామవాసి అయిన ఈ యువకుడు ఈనెల 18న హైదరాబాద్ నుంచి ఢిల్లీ వచ్చాడు. మంగళవారం రాత్రి తన మిత్రుడు రాజ్‌కుమార్‌కు ఫోన్‌చేసి 'రేపు నువ్వో మంచి వార్త వింటావు' అని చెప్పాడు ఇవే అతని ఆఖరి పలుకులు. ఇక మృతదేహం వద్ద లభ్యమైన లేఖలోని పది పేజీలలో అన్నిట్లోనూ 'జై తెలంగాణ' అని రాసి ఉంది. ఇదే నినాదంతో లేఖను ప్రారంభిస్తూ.. అక్కడే తన ఈమెయిల్, ఆర్కుట్ ఐడీని కూడా పేర్కొన్నాడు. 'సోనియాజీ మా తెలంగాణ మాకివ్వండి సోనియాజీ, రాహుల్‌జీ, ప్రధానమంత్రి.. ఇది నా ఆఖరి కోరిక. దేశ మీడియా మొత్తం కెమరాలను తెలంగాణ వైపు తిప్పాలి. శ్రీకృష్ణ కమిటీ 8వ అధ్యాయం సరికాదు' అని లేఖలో పేర్కొన్నాడు. దానం నాగేందర్, సర్వే సత్యనారాయణ, జైపాల్‌రెడ్డిలు దొంగలని, తెలంగాణ ద్రోహులని దుయ్యబట్టాడు. జైపాల్‌రెడ్డి తన నియోజకవర్గం వాడేనని చెప్పుకోవటానికి సిగ్గుపడుతున్నానన్నాడు. తెలంగాణ కోసం తాను వెళ్లిపోతున్నానని, అందుకు క్షమించాలని తన తల్లిని వేడుకున్నాడు. ఏం చేస్తోంది తనకు అర్థం కావటం లేదని, తనను మన్నించాలని ఒక అమ్మాయిని కోరాడు. ఈ సమాచారం అందగానే కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి యాదిరెడ్డి మృతదేహాన్ని సందర్శించారు. అతని కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. రాజ్యసభ సభ్యుడు వీహెచ్ మృతుని బంధువులతో ఫోన్‌లో మాట్లాడారు.

గ్రామ సర్పంచ్, మృతుని బాబాయి, స్నేహితుడు ఢిల్లీ వచ్చేందుకు విమానం టిక్కెట్లు, ఇతర ఏర్పాట్లు చేశారు. కాగా తెలంగాణపై కాంగ్రెస్ తీరును నిరసిస్తూ ఏఐసీసీ వద్ద జేఎన్‌యూ విద్యార్థులు ధర్నా చేశారు.

యాదిరెడ్డి రెండేళ్లుగా హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదే క్రమంలో తెలంగాణ ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొనేవాడు. 'తెలంగాణ కోసం ఎన్నో ఉద్యమాలు జరుగుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతంలోని ప్రతీ ఒక్కరు ముక్తకంఠంతో నినదిస్తున్నరు. ఐనా కేంద్రం స్పందించటం లేదు. తెలంగాణ రాష్ట్రం రాకపోతే మన బతుకులు బాగుపడేది ఎట్లారా?' అని యాదిరెడ్డి మంగళవారం రాత్రి తన స్నేహితుడితో ఫోన్‌లో మాట్లాడాడు. తన ఆవేదనను ఢిల్లీలో వినిపించాలని భావించి ఈనెల 17న కాచిగూడలో రైలెక్కి ఢిల్లీ వెళ్లాడు. యాదిరెడ్డి అక్కడ ఆత్మహత్య చేసుకున్న వార్త అతని గ్రామంలో విషాదం నింపింది.

**22 జూలై 2011:**

**యాదిరెడ్డికి కన్నీటి వీడ్కోలు**

తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకున్న యాదిరెడ్డికి తెలంగాణవాదులు, ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నేతలు కన్నీటి వీడ్కోలు పలికారు. యాదిరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం స్వగ్రామం పెద్దమంగళారంలో జరిగాయి. మూడు గంటలకు పైగా అంతిమయాత్ర కొనసాగింది. టీడీపీ నేత టి.దేవేందర్‌గౌడ్, ఎమ్మెల్యేలు కేఎస్ రత్నం, మహేందర్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, హరీశ్వర్‌రెడ్డి, జాగృతి కవిత, జేఏసీ చైర్మన్ కోదండరాం, టీఆర్ఎస్ నేతలు ఈటెల, కేటీఆర్, హరీష్‌రావు, టీఎన్జీవో నేతలు స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బీజేపి నేత విద్యాసాగర్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు పాడెమోశారు. ఖననం చేసేముందు 'ఇకపై ఎవరూ ఆత్మబలిదానం చేసుకోరాదని ఆత్మస్థైర్యంతో రాష్ట్రాన్ని సాధించుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా యాదిరెడ్డి సంస్మరణ సభలు జరిగాయి. పదిజిల్లాల్లో యాదిరెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు.

**23 జూలై 2011:**

**తెలంగాణ ఎమ్మెల్యేల రాజీనామాల తిరస్కరణ**

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ప్రాంతానికి చెందిన వివిధ పార్టీల ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా చేసిన రాజీనామాలను అసెంబ్లీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ తిరస్కరించారు. భావోద్వేగాలతో నిర్ణయం తీసుకుని ఎమ్మెల్యేలు రాజీనామా చేసినందున వాటిని ఆమోదించడం లేదని స్పష్టం చేశారు. అన్ని కోణాల్లో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాజ్యాంగంలోని 190(3) అధికరణ

ఇచ్చిన అధికారం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన 12మంది మంత్రులతో పాటు 101 మంది మంది ఎమ్మెల్యేల రాజీనామాలను ఆయన ఒక్క కలం పోటుతో తిరస్కరించారు. కామన్‌వెల్త్ దేశాల స్పీకర్ల సదస్సులో పాల్గొనడానికి లండన్‌కు వెళ్లే ముందు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు శాసనసభ కార్యదర్శి రాజా సదారామ్ పేరిట మంగళవారం రాత్రి ఓ ప్రకటన విడుదలైంది. తమ తమ రాజీనామాలను స్పీకర్ తిరస్కరించారన్న విషయం తెలిసిన వెంటనే తెలంగాణకు చెందిన వివిధ పార్టీల నేతలు భగ్గుమన్నారు.

స్పీకర్ నిర్ణయం అప్రజాస్వామికమని, రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. ఎటువంటి విచారణ జరపకుండా, కనీసం రాజీనామా చేసిన ఒక్క ఎమ్మెల్యేను కూడా విచారించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ధ్వజమెత్తారు. స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో టీకాంగ్రెస్ నేతలు ఢిల్లీ పర్యటనను వాయిదా వేసుకోవాలని కొందరు సూచిస్తుంటే.. పూర్తిస్థాయిలో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలని మరికొందరు స్పష్టం చేస్తున్నారు. ఉద్వేశపూర్వకంగానే ఆయన రాజీనామాలను తిరస్కరించారని కేసీఆర్ ధ్వజమెత్తారు. స్పీకర్ కూడా సీమాంధ్రకు చెందిన వ్యక్తేనన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. కేంద్రం ఒత్తిడితోనే స్పీకర్ రాజీనామాలను తిరస్కరించారని టీడీపీ టీఫోరం కన్వీనర్ ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. ఆదివారం ఉదయం సమావేశమై భవిష్యత్తు కార్యాచరణలను నిర్ణయించుకుంటామని అన్ని పార్టీలు ప్రకటించాయి. రాజ్యాంగ విరుద్ధంగా, పక్షపాత ధోరణితో స్పీకర్ వ్యవహరించారని తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాం మండిపడ్డారు.

## తెలంగాణ అర్చక, ఉద్యోగ సమాఖ్య ఆవిర్భావం

ఆలయ అర్చకుల న్యాయమైన డిమాండ్లపై ఉద్యమించేందుకు తెలంగాణ అర్చక, ఉద్యోగ సమాఖ్య ఏర్పడింది. తెలంగాణ అర్చక సమాఖ్య, మతైక ఉద్యోగుల సంఘాలు విలీనమై ఏర్పడిన సంఘం సమావేశం ఇక్కడ జరిగింది. దీంట్లో కొత్త సమాఖ్యకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమాఖ్య అధ్యక్షుడిగా గంగు భానుమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా భాస్కరభట్ల రామశర్మ, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరశర్మ, కార్యదర్శిగా మల్లికార్జున్ నియమితులయ్యారు.

## తెలంగాణ న్యాయమైన డిమాండ్: అరుంధతీరాయ్

ఉద్యమాల చరిత్ర, తిరుగుబాట్లకు నాయకత్వం వహించిన చరిత్ర గల తెలంగాణలో నిజమైన ప్రజాస్వామిక తెలంగాణ అవతరిస్తుందని ఆశిస్తున్నట్లు ప్రముఖ రచయిత్రి, బుకర్ ప్రైజ్ గ్రహీత అరుంధతీరాయ్ వ్యాఖ్యానించారు. 'తెలంగాణ ఒక న్యాయమైన డిమాండ్' అని పేర్కొన్నారు. అదే సమయంలో, ఇలాంటి డిమాండ్లు కొన్ని గురుతర బాధ్యతలను మోయాల్సి ఉంటుందన్నారు. ప్రగతిశీల సాహిత్య ప్రస్థానంలో

25ఏళ్లు పూర్తిచేసుకున్న మంజీర రచయితల సంఘం రజతోత్సవ సభలు శనివారం సిద్దిపేటలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ సభలకు రాలేకపోయిన అరుంధతీరాయ్, మరసం నిర్వాహకులకు తన అభినందన సందేశం పంపించారు.

**26 జూలై 2011:**

**17 నుంచి సకల జనుల సమ్మె**

తెలంగాణ ఉద్యోగులు, కార్మికులు.. అన్ని వర్గాలవారు సమర శంఖాన్ని పూరించారు. ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాల్సిందేనంటూ ఈ ప్రాంతానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు.. కార్మికుల దగ్గరి నుంచి పారిశుధ్య కార్మికుల వరకు ప్రతి ఒక్కరూ ఆగస్టు 17నుంచి సమ్మె బాట పట్టనున్నారు. తాగునీటి సరఫరా నుంచి విద్యుత్తు పరఫరా వరకు.. పారిశుద్య సేవలతో సహా సమస్తం ప్రభావితం కానున్నాయి. రవాణా, విద్యావ్యవస్థలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు ఉద్యోగులు, కార్మికులు అందరూ ఈ సకల జనుల సమ్మెలో పాల్గొంటున్నారు. మొత్తం 134 ఉద్యోగ, కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నట్లు ప్రకటించాయి. దీంతో ఏడున్నర లక్షల మంది సెమ్మెలో పాల్గొననున్నారు. హైదరాబాద్‌లో ఆగస్టు 1న, జిల్లా కేంద్రాల్లో 2, 3 తేదీల్లోఅన్ని పార్టీలు, కార్మికులు, ప్రజాసంఘాలతో సమావేశాలు నిర్వహిస్తూనే మరోవైపు 2 నుంచే అన్ని జిల్లాల్లో ఉద్యమ యాత్రలను కూడా చేపట్టనున్నారు. 4, 5, 6 తేదీల్లో హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. ఆ తర్వాత 8 నుంచి 11 వరకు వర్క్ డౌన్ జరగనుంది. ఆగస్టు 12న మరోమారు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి సమ్మె సైరన్ మోగించాలని, 17 నుంచి నిరవధిక సమ్మెకు పూనుకోవాలని మంగళవారం జేఏసీ సమావేశం నిర్ణయించింది.

**తెలంగాణ కోసం 'అరుణోదయ' దప్పుల దరువు**

తెలంగాణ కోసం ఆరుణోదయ కళాకారులు గజ్జె కట్టారు. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను ఢిల్లీ గద్దె దాకా డప్పుకొట్టి వినిపించారు. పార్లమెంటులో బిల్లు పెట్టాలనే డిమాండ్‌తో అరుణోదయ చేపట్టిన డప్పుదరువు కళా ప్రదర్శనకు మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వేదికైంది. వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన కళాకారులు ఆడిపాడారు. ఉదయం 11 గంటలకు ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ చుక్కా రామయ్య ఈ కళా ప్రదర్శనను ప్రారంభించారు.

**03 ఆగస్టు 2011:**

**'14ఎఫ్' పై దద్దరిల్లిన తెలంగాణ**

పార్లమెంట్‌లో ప్రత్యేక తెలంగాణ బిల్లు తక్షణమే ప్రవేశపెట్టాలని, 14ఎఫ్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కూడా తెలంగాణ అంతటా విద్యార్థి

సంఘాలతో పాటు టీఆర్ఎస్, బీజేపీల ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ధర్నాలు జరిగాయి. నిజామాబాద్ జిల్లా జుక్కల్ తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రధాని, చిదంబరం, ఆజాద్‌ల దిష్టిబొమ్మలు దహనం చేశారు. జక్రాన్‌పల్లిలో 14ఎఫ్ జీవో దిష్టిబొమ్మను తగులబెట్టారు. నందిపేటలో జేఏసీ ఆధ్వర్యంలో డిజీపీ దినేష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో సీఎం, డీజీపీ దిష్టిబొమ్మలు తగులబెట్టారు. బిక్కనూరులో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు.

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. సకల జనుల సమ్మెను జయప్రదం చేయాలని పలుచోట్ల రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించగా, కొన్ని చోట్ల పోస్టర్లను విడుదల చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎమ్మెల్యేలు జోగు రామన్న, వేణుగోపాలాచారి, అరవిందరెడ్డితో పాటు టీఆర్ఎస్ నేత శ్రీహరిరావు, బీజేపీ నేత రావుల రాంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌తో పాటు జిల్లా అంతటా సీఎం, డీజీపీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. జగిత్యాల, మల్యాల, కొడిమ్యాల, రాయికల్, ధర్మపురి, గోదావరిఖని, ఇల్లంతకుంటలో చిదంబరం, చంద్రబాబు, ఆజాద్ దిష్టిబొమ్మలను కూడా దహనం చేశారు. సుల్తానాబాద్‌లో మాక్ కోర్టు నిర్వహించి సీఎం, చిదంబరం, దిష్టిబొమ్మలకు ఉరిశిక్ష విధించారు.

వరంగల్ జిల్లా వ్యాప్తంగా చిదంబరం, సీఎంల దిష్టిబొమ్మలను దహనం చేశారు. వరంగల్ చౌరస్తా, పోచమ్మమైదానం, గోపాలస్వామిగుడి, సుబేదారిలోని అమరవీరుల స్థూపం వద్ద సీఎం, చిదంబరం దిష్టిబొమ్మలను దహనం చేశారు. నర్సంపేటలో ఏబీవీపీ కార్యకర్తలు తలకిందులుగా నిలబడి రాస్తారోకో చేశారు.

మెదక్ జిల్లాలో సీఎం, డీజీపీ దిష్టిబొమ్మలను తగులబెట్టారు. జహీరాబాద్‌లో దిష్టిబొమ్మ దహనాలను పోలీసులు అడ్డుకోవడంతో విద్యార్థులు రాస్తారోకో చేశారు. నారాయణఖేడ్‌లో సీఎం, దిష్టిబొమ్మలను పాడెపై పెట్టి శవయాత్ర నిర్వహించారు. నల్గొండ జిల్లా సూర్యపేటలో ఆందోళనకారులు డీజీపీ, సీఎం ఫ్లెక్సీలను వినూత్నంగా ఊరేగించారు. జిల్లాలోని 59 మండలాల్లో 14ఎఫ్ రద్దుకోసం ఆందోళన కార్యక్రమాలు మిన్నంటాయి.

## 08 ఆగస్టు 2011:

### తెలంగాణ కోసం 'వర్క్ టు రూల్'

తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపు మేరకు ఈనెల 11 వరకు జరుగనున్న 'వర్క్ టు రూల్' ఆందోళన సోమవారం తెలంగాణ వ్యాప్తంగా విజయవంతంగా జరిగింది. తెలంగాణ బిల్లును పార్లమెంటులో పెట్టాలనే డిమాండ్‌తో

ఉద్యోగులు ఈనెల 17న జరుప తలపెట్టిన నిరవధిక సమ్మె సన్నాహకంగా ఈ వర్క్ టు రూల్‌ను చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించిన ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు జరిపారు.

**12 ఆగస్టు 2011:**

**14ఎఫ్ రద్దు.. తెలంగాణలో సంబరాలు**

14ఎఫ్ రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించడంతో తెలంగాణలో సంబరాలు చేసుకున్నారు. తెలంగాణలోని పదిజిల్లాల్లో ఆనందాన్ని వ్యక్తం చేశారు. పలు చోట్ల బాణాసంచా కాల్చారు. తెలంగాణవాదులు స్వీట్లు పంచారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధిద్దామన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతో ప్రారంభమైన తెలంగాణ పోరాటం, 14ఎఫ్ రద్దుతో ఒక విజయం సాధించిందన్నారు.

**17 ఆగస్టు 2011:**

**సకల జనుల సమ్మెకు సైరన్**

సకల జనుల సమ్మెకు సైరన్ మోత మోగిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాం ప్రకటించారు. తెలంగాణ ప్రాంత కాంగ్రెస్, టీడీపీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తారో.. లేదో స్పష్టంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వారితో రాజీనామా చేయించే ఆందోళన కార్యచరణను రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని వెల్లడించారు. తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్‌వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ రెబల్ ఎమ్మెల్యేలు, నాయకులు, ఉద్యోగసంఘాల నాయకులు, తెలంగాణవాదులు పాల్గొన్నారు. బుధవారం తెలంగాణ 9 జిల్లాల్లో బీజేపీ తెలంగాణ ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో దీక్షా శిబిరాలు నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా బుధవారం వివిధ ప్రాంతాలలో తెలంగాణవాదులు ధర్నాలలో పాల్గొన్నారు. జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. సకల జనుల సమ్మెకు మద్దతుగా ర్యాలీలు, ప్రదర్శనలను నిర్వహించారు.

**09 సెప్టెంబరు 2011:**

**'తెలంగాణ నగారా సమితి' ఆవిర్భావం**

తెలంగాణ ఉద్యమ పథంలో మరో వేదిక ఆవిర్భవించింది. టీడీపీ బహిష్కృత ఎమ్మెల్యే నాగం జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'తెలంగాణ నగారా సమితి' పేరిట శుక్రవారం సరికొత్త వేదిక ఏర్పడింది. అచ్చంపేట మండలంలోని ఉమావహేశ్వ రాలయంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, కొత్తవేదికపై ప్రకటన చేశారు. టీడీపీ నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్యేలలో వేణుగోపాలచారి మినహా హరీశ్వర్‌రెడ్డి, జోగు రామన్న నాగం వెంటే ఉన్నారు. దీంతో, గత కొంతకాలంగా

నాగం రాజకీయ భవిష్యత్తుపై కొనసాగుతున్న ఉహాగా నాలకు తెరపడింది.

**11 సెప్టెంబరు 2011:**

కంచన్‌బాగ్‌లోని బి.డి.ఎల్.లో తెలంగాణ రక్షణ సంస్థల జేయేసీ ఆధ్వర్యంలో సత్వరమే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సుమారు వెయ్యి పోస్టుకార్డులను ప్రధానమంత్రికి పోస్టు చేసారు. ఈ కార్యక్రమానికి జేయేసీ నాయకులు దానకర్ణాచారి నాయకత్వం వహించారు.

**12 సెప్టెంబరు 2011:**

**కరీంనగర్‌లో 'జన గర్జన' సభ సక్సెస్**

"సకల జనుల సమ్మెలో బస్సు పయ్య తిరగదు, బడిగంట మోగదు. సింగరేణిలో బొగ్గు పెళ్ల పెగలదు. రైలు చక్రం తిరగదు. ప్రభుత్వం స్తంభించిపోతుంది. సకల జనుల సమ్మె ఒక్క ఉద్యోగులకే పరిమితం కాదు. సమ్మె జరుగుతోందని ప్రజలు ఇళ్లల్లో కూర్చోకూడదు. ప్రతి ఒక్కరూ మంగళవారం ఉదయం నుంచి రోడ్లపైకి వచ్చి సమ్మెను విజయవంతం చేసే దిశగా ఉద్యమాలు చేపట్టాలి. ఉద్యోగులకు అండగా ఉంటామనే భరోసా ఇవ్వాలి. చీమలదండులా కదిలి ప్రభుత్వాన్ని స్తంభింపజేయాలి. ఉద్యోగులపై ఎస్మాను ప్రయోగిస్తే.. తెలంగాణ మొత్తం రగిలిపోతుంది. తెలంగాణ ప్రజలు అగ్గిబరాటాలుగా మారుతారు. ఏ ఒక్క ఉద్యోగిపై ఈగవాలినా సహించబోం. పిడికిలి ఎత్తిన న్యాయవాదుల మద్దతుతో న్యాయపోరాటం చేస్తామని సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని హెచ్చరిస్తున్నా!" అని కరీంనగర్‌లో జరిగిన టీఆర్ఎస్ జనగర్జన సభలో కేసీఆర్ అన్నారు.

"టీజీ మొఖం ఎట్ల పాడైంది.. సన్నాసీ! నీవో మంత్రివా? ఎన్ని గుండెలు నీకు? కండకావరంతో కోదండరాంను విమర్శిస్తావా? తెలంగాణ వారిపై పిచ్చికూతలు కూస్తే నాలుక కోస్తాం జాగ్రత్త. రాయపాటి చేసిన నకిలీ పొగాకు వ్యాపారం వల్ల చైనాలో ఆరుగురు అధికారులు ఉరిశిక్షకు గురయ్యారు. రాయపాటిని తమకు అప్పగించాలని చైనా ప్రభుత్వం కోరితే.. కాంగ్రెస్ పార్టీ ఆయనకు టికెట్ ఇచ్చి పార్లమెంటుకు పంపింది" అని కేసీఆర్ విమర్శించారు. ఈ సభలో జేఏసీ చైర్మన్ కోదండరాం, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దేవిప్రసాద్, విఠల్, ఎంపీ విజయశాంతి, బీజేపి నేతలు విద్యాసాగర్‌రావు, దత్తాత్రేయ, న్యూడెమాక్రసీ నేత సూర్యం , టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, వివిధ జేఏసీల చైర్మన్లు, కళాకారులు పాల్గొన్నారు.

**13 సెప్టెంబరు 2011:**

**సకలం బంద్.. సమ్మె ఆరంభం**

సకల జనుల సమ్మె మొదలైంది. మద్దతుగా జరిగిన రాస్తారోకోలు, ర్యాలీలతో తెలంగాణ దద్దరిల్లింది. కార్యాలయాలకు తాళాలు పడ్డాయి. బడి పిల్లలు రోడ్డెక్కారు.

ఉద్యోగులు విధులు బహిష్కరించి నినాదాలతో హోరెత్తించారు. సింగరేణి పూర్తిగా స్తంభించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మినహా.. మిగిలిన తెలంగాణ జిల్లాలన్నింటిలో ప్రభుత్వ కార్యాలయాలు దాదాపుగా మూతపడ్డాయి. కోర్టు విధులకు భంగం కలిగించవద్దు అని ఫుల్ కోర్టు ఆదేశించినప్పటికీ... లాయర్లు పట్టించుకోలేదు. విధులను బహిష్కరించారు. హైకోర్టు ఆవరణలో నినాదాలు చేశారు. మంగళవారం సమ్మె విజయవంతమైందని రాజకీయ జేఏసీ ప్రకటించింది. ఎస్మా నోవర్క్ నోపే నిబంధనలకు భయపడేది లేదని ఉద్యోగసంఘాలు తేల్చి చెప్పాయి. సమ్మె జరిగినన్ని రోజులు ఉద్యోగులు విధిగా తమతమ కార్యాలయాల వద్దకు వచ్చి.. దీక్షా శిబిరాల్లో పాల్గొనాలని, కార్యాలయాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హాజరు పట్టీల్లో సంతకాలు చేయాలని ఉద్యోగుల జేఏసీ సూచించింది. బుధ, గురువారాల్లో సినిమాహాళ్లు మూతపడనున్నాయి.

"సమ్మె చేసినందుకు ప్రభుత్వం జీతానికి కోత పెడితే.. అది చిన్న మొత్తాల పొదుపుగా భావించండి. తెలంగాణ వచ్చాక వడ్డీతో సహా ఆ మొత్తం చెల్లిస్తాం. మరో నెల జీతం బోనస్‌గా కూడా ఇస్తాం." **–కేసీఆర్, టీఆర్ఎస్**

"ఉద్యోగులు ఇంక్రిమెంట్ల కోసం పోరాడటం లేదు. తెలంగాణ కోసం కొట్లాడుతున్నారు. వారిపై కేసులు పెడితే తలెత్తే పరిణామాలకు ప్రభుత్వానిదే బాధ్యత"
**–కిషన్‌రెడ్డి, బీజేపీ**

"సమ్మెకు మద్దతు ఇవ్వాల్సిందిగా ఉద్యోగులు మాట మాత్రమైనా కోరనప్పటికీ.. మేం సంఘీభావం ప్రకటించాం. మా చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదు"
**–ఎర్రబెల్లి దయాకర్‌రావు, టీడీపీ**

"రాజీనామాలు చేశాక సచివాలయంలో అడుగు పెట్టలేదు. అయితే.. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మేరకు ప్రజలకు సేవ చేస్తున్నాం. మాది త్యాగం కాదా? మమ్మల్ని ఎందుకు అర్థం చేసుకోరు?" **– జానారెడ్డి, కాంగ్రెస్**

**తెలంగాణలో.... స..క..ల.. జ..ను..ల.. స..మ్మె..**

**ఆదిలాబాద్:** జిల్లాలో 8,100 మంది ఉద్యోగులు ఉన్నారు. కేవలం 210 మంది మాత్రమే విధులకు హాజరయ్యారు. ఉద్యోగులు విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం దీక్ష చేసింది. భోరజ్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు సిబ్బందిని తెలంగాణ నగార సమితి ఎమ్మెల్యేలు అడ్డుకుని కార్యాలయానికి తాళాలు వేసారు. నిర్మల్‌లో ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక జేఏసీ నిరాహార దీక్షలు చేపట్టింది. మందమర్రిలో ప్రజా సంఘాలు రోడ్లపై ఆటాపాటా నిర్వహించాయి.

**కరీంనగర్:** జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ తాళాలు పడ్డాయి. ఉద్యోగులు కార్యాలయాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. తరగతులు బహిష్కరించి

మానవహారాలు, ర్యాలీలతో కదం తొక్కారు. సింగరేణిలో 22వేల మంది కార్మికులు హాజరు కాలేదు. రామగుండం రీజియన్‌లో పది భూగర్భ బొగ్గుగనులు, నాలుగు ఓసీలలో 60వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లింది. రామగుండం-2 జీఎం కార్యాలయానికి, 2వ ఇంక్లైన్ బావికి కార్మికులు తాళం వేశారు. న్యాయవాదులు విధులను బహిష్కరించి ప్రదర్శనలు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాల్లో పరిపాలన పూర్తిగా స్తంభించింది. కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ ఉద్యోగులు ప్రదర్శన చేశారు. సిరిసిల్లలో 5వేల మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవ హారంగా ఏర్పడ్డారు.

**ఖమ్మం:** సుమారు 45వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు విధులకు గైర్హాజరయ్యారు. కార్యాలయాలకు తాళాలు వేయడంతో అధికారులు వెనుదిరిగారు. జెడ్పీ సీఈవో గంగారాం కార్యాలయం మెట్టపైనే కూర్చున్నారు. సమైక్యాంధ్రలో మిగిలేది బూడిదేనంటూ.. అశ్వారావుపేట వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ కాలేజీ విద్యార్థులు స్థానికులకు బూడిద పంచారు. ఖమ్మం పట్టణంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు రంగరాజు ఆధ్వర్యంలో ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. భద్రాచలంలో పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. కేటీపీఎస్‌లో భోజన విరామంలో గంటపాటు నిరసన చేపట్టారు. మధిరలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మణుగూరులో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ర్యాలీ నిర్వహించారు.

**మహబూబ్‌నగర్:** జిల్లాలో పాలన పూర్తిగా స్థంభించింది. జిల్లా కేంద్రంతో పాటు, మండల, డివిజన్ కేంద్రాలలో ప్రభుత్వ కార్యాలయాలు బోసిపోయాయి. కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాలకు తాళాలు వేశారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, డీఆర్డీఏ పీడీ, వ్యవసాయశాఖ జేడీలు మాత్రమే విధుల్లో పాల్గొన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు జెడ్పీ మైదానం వరకు ర్యాలీగా వచ్చి సమావేశం నిర్వహించారు. ఎంపీ మంద జగన్నాథం, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రతంగ్‌పాండురెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది గంటపాటు విదులు బహిష్కరించి సమ్మెకు మద్దతు పలికారు. న్యాయవాదులు, జ్యూడిషయరీ ఉద్యోగులు జిల్లా కోర్టు నుంచి జెడ్పీ వరకు ర్యాలీ నిర్వహించారు. అచ్చంపేట, కల్వకుర్తిలలో ఉద్యోగులు ర్యాలీలు, నిరసన దీక్షలు చేపట్టారు. కొడంగల్‌లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు.

**మెదక్:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో కలెక్టరేట్‌తోపాటు జిల్లాలో ఉద్యోగులంతా విధులు బహిష్కరించారు. ర్యాలీలు నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం మెయిన్‌గేట్‌తోపాటు, వివిధ మండలాల్లోని తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయశాఖ కార్యాలయాలకు తాళాలు వేశారు. అన్ని ప్రాంతాలలో విద్యార్థులు, టీఆర్ఎస్ కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించారు. దుద్దెడ వద్ద కాంగ్రేస్ నేత మల్లు రవి కారును అడ్డగించారు.

మెదక్ నుంచి శంకరంపేట అమరవీరుల స్థూపం వరకు టీఆర్ఎస్వీ విద్యార్థులు పాదయాత్ర నిర్వహించారు. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో కొన్ని పరిశ్రమలు కూడా పనిచేయలేదు.

**నల్గొండ:** జిల్లా వ్యాప్తంగా మొత్తం 59 మండలాల్లో సుమారు 30వేల మంది ఉద్యోగులు సమ్మెకు దిగడంతో పాలన పూర్తిగా స్తంభించిపోయింది. అన్ని చోట్లా ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటికీ తాళాలు వేశారు. ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాల రూపంలో ఆందోళనలు నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులంతా పెద్ద ఎత్తున ఆందోళనలో పాల్గొన్నారు. దాదాపు అన్ని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. కొన్ని పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సమ్మెకు ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు.

**నిజామాబాద్:** రెవెన్యూ మినహా మిగిలిన అన్ని శాఖలలో ఉద్యోగులు విధులు బహిష్కరించారు. కలెక్టరేట్‌కు తాళం వేసి రెండు గంటల పాటు ధర్నా చేశారు. వివిధ శాఖల ఉద్యోగులు కార్యాలయాల ముందు బైఠాయించారు. తర్వాత కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాలన పూర్తిగా స్తంభించింది. కలెక్టర్, జేసీ మినహా మిగిలిన శాఖల అధికారులెవరూ కార్యాలయాలకు వెళ్లలేదు. విద్యాసంస్థలు మూసివేశారు. సమ్మెకు మద్దతుగా టీఆర్ఎస్, బీజేపి వివిధ విద్యార్థి సంఘాల వారు, నేతలు ర్యాలీలు, ధర్నాలతో పాటు మానవహారాలు నిర్మించారు. న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఎమ్మెల్యేలు రవీందర్‌రెడ్డి, యండల లక్ష్మినారాయణ ర్యాలీల్లో పాల్గొని సమ్మెకు మద్దతు ప్రకటించారు.

**రంగారెడ్డి:** జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారులు దాదాపు 30వేల మంది సమ్మెలో పాల్గొన్నారు. కలెక్టరేట్ల ప్రధాన రహదారి వద్ద ఉద్యోగులంతా బైఠాయించి ఎస్మాగీస్మా జాంతానై.. తెలంగాణ దేనా హై, జై తెలంగాణ అంటూ నినాదాలతో హోరెత్తించారు. జెడ్పీ ఉద్యోగులంతా సమ్మెలో పాల్గొన్నారు. దీంతో కలెక్టరేట్, జెడ్పీ కార్యాలయాలు వెలవెలబోయాయి. కలెక్టర్, జేసీ మినహా అధికారులెవరూ కార్యాలయాలకు వెళ్లలేదు.

**వరంగల్:** జిల్లాలోని 35వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు విధులకు హాజరు కాలేదు. భూపాలపల్లిలోని సింగరేణి కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో గణనీయస్థాయిలో బొగ్గు ఉత్పత్తి పడిపోయింది. కలెక్టర్ కార్యాలయ పరిసర ప్రాంతాలు ఉద్యోగుల ర్యాలీలతో అట్టుడికిపోయింది. ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ తాళాలు వేశారు. ఉద్యోగులు ర్యాలీలు నిర్వహించారు. మహబూబాబాద్, జనగామ, నర్సంపేట, పరకాల, తొర్రూరు తదితర కేంద్రాల్లో ఉద్యోగులు పూర్తిగా సమ్మెలో భాగస్వాము

లయ్యారు. జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు విధులకు హాజరుకాలేదు. ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు రాస్తారోకో నిర్వహించి విద్యార్థులను చిత్రహింసలకు గురిచేసిన డిఎస్పీపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఎంజీఎంలో వైద్యులు విధులకు హాజరుకాలేదు. అత్యవసర సేవలు మినహా ఇతర కేసులను వైద్యులు చూడలేదు. భూపాలపల్లిలో 6321 మంది కార్మికులు విధులకు హాజరుకాకపోవడం వలన 5వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

హైదరాబాద్: జేఏసీ నేతలు ఊహించినట్లుగానే హైదరాబాద్‌లో మాత్రం సమ్మె పాక్షికంగానే జరిగింది. సచివాలయంలో 86శాతం మంది ఉద్యోగులు విధులకు హాజరైనట్లు అధికారవర్గాలు తెలిపాయి. సచివాలయంలో 34 విభాగాలలో మొత్తం 2868 మంది అధికారులు, ఉద్యోగులకు గాను 2369 మంది హాజరయ్యారు. హైదరాబాద్‌లో సగం వరకు స్కూళ్లు మూతపడ్డాయి. వివిధ కార్యాలయాల్లో అధికభాగం సీమాంధ్ర ఉద్యోగులు కూడా విధులకు దూరంగా ఉండిపోయారు.

**16 సెప్టెంబరు 2011:**

**నాలుగోరోజు సమ్మె తీవ్రం**

సకల జనుల సమ్మె రోజురోజుకూ ఉధృతమవుతోంది. సమ్మె నాలుగో రోజైన శుక్రవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు కె.స్వామిగౌడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ చర్యపై తెలంగాణ వాదుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో స్వామిగౌడ్‌ను పోలీసులు విడుదల చేయక తప్పలేదు. సమ్మెకు మద్ధతుగా గాంధీ అస్పత్రిలో ఆందోళన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన స్వామిగౌడ్‌ను పోలీసులు అరెస్టు చేసి చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈవార్త తెలుసుకున్న ఉద్యోగులతోపాటు కేసీఆర్, విజయశాంతి, నాగం జనార్ధన్‌రెడ్డి, కోదండరాం, తెలంగాణవాదులు భారీఎత్తున అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వ్యక్తిగత పూచీకత్తుపై పోలీసులు స్వామిగౌడ్‌ను విడుదల చేశారు.

సింగరేణి కార్మికులంతా తమ సమ్మెను యథాతథంగా కొనసాగిస్తూనే ఉన్నారు. అక్కడ బొగ్గుపెళ్ల కూడా కదలడం లేదు. దీంతో తీవ్ర విద్యుత్ కొరత అంచున దక్షిణాది రాష్ట్రాలున్నాయి. మరోవైపు.. ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కూడా శుక్రవారం నుంచి సమ్మెలోకి దిగారు. సాంఘీక సంక్షేమ గురుకులాల్లో సమ్మెను నిషేధించినప్పటికీ.. అక్కడి టీచర్లు కూడా పాఠాలు పక్కనపెట్టారు. ఇలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సమ్మె బాటపట్టడంతో ఈనెల 19 నుంచి జరగాల్సిన త్రైమాసిక పరీక్షలను సర్కారు వాయిదా వేసింది. ఇంకోవైపు సకల జనుల సమ్మెకు బాసటగా నిలవాలని తెలంగాణ ప్రాంతంలోని ప్రొఫెషనల్ కాలేజీల

యాజమాన్యాలు భావిస్తున్నాయి. కాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో ఎస్మాను ప్రయోగిస్తూ సర్కారు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉపాధ్యాయుల జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం తెలంగాణ ప్రాంతంలోని 1.7లక్షల మంది ఉపాధ్యాయులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. పాఠశాలలకు తాళాలు పడ్డాయి.

శనివారం (సెప్టెంబర్ 17) జాతీయ, తెలంగాణ పతాకాలను మండల కేంద్రాలలో ఎగురవేయాలని జేఏసీ పిలుపునిచ్చింది. ఈనెల 19న 'రహదారుల దిగ్బంధం'లో పాల్గొనాలని టీచర్లను వీరు కోరారు. 20, 21 తేదీలలో గ్రామ చైతన్య యాత్ర పేరుతో గ్రామాల్లో ఉపాధ్యాయులు పర్యటించి చైతన్య కార్యక్రమం నిర్వహించాలని.. 22న మండల కేంద్రాలలో మానవహారం నిర్వహించాలని టీచర్ల జేఏసీ పిలుపునిచ్చింది.

**17 సెప్టెంబరు 2011:**

**సమ్మె మరింత ఉధృతం..**

ఉద్యోగుల సమ్మె మరింత ఉధృతం కానుంది.. ఇప్పటికే సింగరేణి కార్మికులు సహా తెలంగాణ ప్రాంత ఉద్యోగులు తారాస్థాయిలో సమ్మె చేస్తుండగా.. 1.90లక్షల మంది వరకు ఉన్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఐకేపీ, ఎన్ఎంఆర్, ఎన్ఆర్ఈజీఎస్, కాంట్రాక్టు లెక్చరర్లు కూడా సోమవారం నుంచి సమ్మెలో పాల్గొంటున్నారు. ఆరు రోజులపాటు సమ్మె జరిగిన తీరును శనివారం జరిగిన సమావేశంలో జేఏసీ సమ్మెను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో తీసుకున్న నిర్ణయాలను కోదండరాం, ఉద్యోగ సంఘాల నేతలు వెల్లడించారు. హైదరాబాద్ సహా అన్ని తెలంగాణ జిల్లా, మండల కేంద్రాల్లో ఈనెల 20న మానవహారాలను, 21న అన్ని కేంద్రాల్లో కుటుంబసభ్యులతో సహా నిరాహార దీక్షలు చేయనున్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో 22న జరుగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని జేఏసీ నిర్ణయించింది. 23న అన్ని జిల్లాల్లో తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించనున్నారు. సమ్మె కారణంగా రవాణాశాఖలో 16వేలకు పైగా లావాదేవీలు నిలిచిపోయాయి. 22న నిర్వహించాల్సి ఉన్న రైల్‌రోకోను 24కు మారుస్తున్నట్లు కోదండరాం వెల్లడించారు. సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైవేలను దిగ్బంధించనున్నారు. అరెస్టులతో సింగరేణి భయ భ్రాంతులకు గురిచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించిన జేఏసీ నేతలు.. ఎట్టి పరిస్తితుల్లోనూ విధులకు హాజరుకావద్దని పిలుపునిచ్చారు. 19 నుంచి ఆర్టీసీ రథచక్రాలు ఆగిపోతాయని.. సీమాంధ్ర బస్సుల్నీ తిరగనీయమని ఆర్టీసీ ఉద్యో గుల జేఏసీ చైర్మన్ ఆనంద్ అన్నారు. 'మనం ఇప్పుడు యుద్ధంలో ఉన్నాం.. శత్రువును దెబ్బతీయడమే లక్ష్యం. ఇక దేనికీ వెరవకూడదు' అని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల

జేఏసీ నేత రఘు అన్నారు.

### సింగరేణిపై ఉక్కుపాదం..

సింగరేణిలో పోలీసు నిర్బంధం ముమ్మరమైంది. బొగ్గు బావులు, కార్మికుల కాలనీలు ఖాకీమయమయ్యాయి. ఓపెన్‌కాస్టు ఆపరేటర్లను బలవంతంగా ఓసీపీ సైట్లకు తీసుకెళుతున్నారు. అడ్డువచ్చిన ఉద్యమకారులను అరెస్టు చేస్తున్నారు. పనులకు వెళు తున్న కార్మికులను అడ్డుకున్న ఉద్యమకారులపై కేసులు నమోదు చేస్తున్నారు. సకల జనుల సమ్మె కారణంగా ఆరురోజులుగా సింగరేణి నుంచి బొగ్గు ఉత్పత్తి కాలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో అంధకారం తలెత్తే అవకాశాలుండడంతో సింగరేణిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది.

### విధులకు హజరయ్యే కార్మికులకు తాయిలాలు..

సమ్మె చేస్తున్న కార్మికులను పనిలోకి రప్పించేందుకు అధికారులు రకరకాల గిమ్మిక్కులు చేస్తున్నారు. విధులకు హాజరయ్యే ఓసీ కార్మికులకు సింగరేణి యాజమాన్యం తాయిలాలు ప్రకటిస్తోంది. మణుగూరు ఏరియాకు చెందిన కార్మికులకు ఆదివారం రికార్డు స్థాయిలో ప్లేడేలు ఇచ్చింది. ఒక్క పూట పనికి రెండు మస్టర్లను ఇస్తారు. వెయ్యి మందికిపైగా కార్మికులకు ప్లేడేలు ఇచ్చి డ్యూటీలు చేయించడం మణుగూరు చరిత్రలో ఇదే ప్రథమం. ఫలితంగా కార్మికుల హాజరు శాతం పెరిగింది.

### సింగరేణి కార్మికులపై పోలీసు దాడిపై హెచ్చార్సీలో కేసు: కేసీఆర్

సకల జనుల సమ్మెలో పాల్గొంటున్న సింగరేణి కార్మికులపై పోలీసుల దాడిపై సోమవారం మానవహక్కుల కమీషన్‌లో కేసు వేస్తానని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. సమ్మె చేయడం కార్మికుల హక్కు దానిని హరించే అధికారం పోలీసులకు లేదు. సింగరేణి నుంచి పోలీసులను వెంటనే ఉపసంహరించాలి. కార్మికులపై పోలీసు వేధింపులు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే విషయంపై అఖిలపక్ష నేతలు సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు.

## 19 సెప్టెంబరు 2011:

### జాతీయ రహదారుల దిగ్బంధం సంపూర్ణం

సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులు కూడా భాగస్వాములు కావడం, ఉదయం నుంచి సాయంత్రందాకా జాతీయ రహదారుల దిగ్బంధంతో కీలక దశలోకి ప్రవేశించింది. తెలంగాణలోని హైవేలన్నింటిపైనా ఆందోళనకారులు వచ్చి చేరారు. తెలంగాణ రాజకీయ జేఏసీతోపాటు.. జేఏసీలో కీలక భాగస్వామి అయిన టీఆర్ఎస్ నేతలు హైవేల దిగ్బంధాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేశారు. జహీరాబాద్ వద్ద హరీష్‌రావు, విజయశాంతి.. కోదాడ సమీపంలో ఎమ్మెల్యేలు

కొప్పుల ఈశ్వర్, దాస్యం వినయ్‌భాస్కర్‌లు ఎన్‌హెచ్-9ను దిగ్బంధించారు. ఆదిలాబాద్‌లో కేటీఆర్, ఈటెల రాజేందర్... మహబూబ్‌నగర్ జిల్లాలో ఆలంపూర్ వద్ద ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు ఎన్‌హెచ్-7పై రాకపోకలను అడ్డుకున్నారు. తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరాం హైదరాబాద్ శివార్లలోని ఎన్‌హెచ్-9 వద్ద జరిగిన దిగ్బంధంలో పాల్గొన్నారు. జాతీయ రహదారులతోపాటు.. రాష్ట్ర రహదారులపైనా ఆందోళనకారులు బైఠాయించారు. రోడ్లపైనే టెంట్లు వేశారు. వంటలు చేశారు. కబడ్డీ ఆడారు. నాగార్జున సాగర్ దాటిన తర్వాత నల్గొండ-గుంటూరు రహదారిపై పిట్టగోడ కట్టారు.

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల దాకా తాము కదలకుండా కూర్చుని.. వాహనాలను కట్టుకదలకుండా చూశారు. కళాకారులు పాటలు, నృత్యాలతో ఉత్సాహపరచగా.. నేతలు ఆవేశపూరిత ప్రసంగాలతో వేడి పుట్టించారు. శంషాబాద్ సమీపంలో ఎన్‌హెచ్-7పై ధర్నా చేసిన టీటీడీపీ నేతలు విమానాశ్రయం ముట్టడికి ప్రయత్నించడంతో ఉద్రిక్తతకు దారితీసింది. హైవేల దిగ్బంధం కార్యక్రమం విజయవంతమైనట్లు జేఏసీ ప్రకటించింది. తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల తొలిరోజు సమ్మె పూర్తిస్థాయిలో జరిగింది. హైదరాబాద్‌తో పాటు మొత్తం 10జిల్లాల్లో 59వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. 10వేల బస్సు సర్వీసులు రద్దయ్యాయి. ఆర్టీసీకి తొలిరోజే రూ.7కోట్లు నష్టం వాటిల్లింది. సకల జనుల సమ్మెలో భాగంగా పబ్లిక్, ప్రైవేట్, ఇంటర్నేషనల్, మిషనరీ తదితర అన్నిరకాల విద్యాసంస్థలను నిరవధికంగా మూసివేయాలని కోదండరాం హెచ్చరించారు.

### నిజాం కాలేజీ, ఓయూ క్యాంపస్‌లో రగడ

నిజాం కాలేజ్ రగిలింది. ఉస్మానియా వర్సిటీ మళ్లీ భగ్గుమంది. నినాదాలు, రాళ్లదాడి, లాఠీచార్జి, బాష్పవాయుగోళాలతో దద్దరిల్లింది. పోలీసులు ఒక అడుగు ముందుకేసి.. నిజాం కాలేజీ హాస్టల్‌లో ప్రవేశించి, విద్యార్థులపై విరుచుకుపడ్డారు. దీంతో 15మంది తీవ్రంగా గాయపడ్డారు. సమ్మెకు మద్దతుగా నిజాం కాలేజీ ఆవరణలో ఓయూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా ధర్నా ప్రారంభించారు. దీనికి సంఘీభావంగా హాస్టల్ నుంచి విద్యార్థులు ర్యాలీగా బయలుదేరారు. వీరిని డీసీపీ అకున్ సబర్వాల్ నేతృత్వంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు హాస్టల్‌లోనే ఉండి జై తెలంగాణ నినాదాలు చేసారు. ఇదిలా ఉండగా ఉస్మానియాలో బాష్పవాయు ప్రయోగం, లాఠీచార్జి దృశ్యాలను టీవీలో చూసిన విద్యార్థులు ఉద్వేగంతో ఒక్కసారిగా బయటకు వచ్చారు. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాటలు, వాదోపవాదాలు, విద్యార్థుల రాళ్ల దాడి మొదలైంది. దీంతో పోలీసులు రెచ్చిపోయి హాస్టల్‌లోకి వెళ్లి విచక్షణా రహితంగా లాఠీచార్జి చేశారు. ఈ సంఘటనలో బీఏ ఫైనల్ విద్యార్థి పవన్ తలపగిలింది. నర్సింహ, వినోద్‌లు కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఆంజనేయులు

ఎడమ చేయి, కాలు విరిగాయి. అనంతరం పోలీసులు 70మంది విద్యార్థులను అరెస్టు చేశారు.

అటు ఉస్మానియాలో ఉద్యోగులకు మద్దతుగా టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఛలో సచివాలయం అంటూ ప్రదర్శనకు బయలుదేరగా వీరిని ఎన్సీసీ గేటు వద్ద పోలీసులు అడ్డుకుని వెనెక్కి వెళ్లాలని సూచించారు. శాంతియుతంగా ర్యాలీ చేస్తామని విద్యార్థులు తెలిపినా పోలీసులు ఒప్పుకోలేదు. విద్యార్థులు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. కొంతసేపు తోపులాట జరిగింది. అనంతరం విద్యార్థులు రాళ్లు రువ్వారు. పోలీసులు లాఠీచార్జి చేశారు. నాలుగు రౌండ్ల బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. ఇలా పలు మార్లు విద్యార్థులు బయటకు రావడానికి ప్రయత్నించడంతో సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

## గద్దర్ అరెస్టుకు విఫలయత్నం

తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షుడు గద్దర్ను అరెస్టు చేసేందుకు సోమవారం పోలీసులు విఫలయత్నం చేశారు. మహబూబ్నగర్ జిల్లా ఎర్రవల్లిచౌరస్తాలో దిగ్బంధం కార్యక్రమంలో పాల్గొన్న గద్దర్ అనంతరం ఆలంపూర్ చౌరస్తావైపు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు జాతీయరహదారి మానవపాడు స్టేజీ వద్ద ఆయన కాన్వాయ్ను అడ్డుకున్నారు. గద్దర్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను అక్కడినుంచి తరలించకుండా 500మంది టీపీఎఫ్ కార్యకర్తలు ప్రతిఘటించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో ఆయనను విడుదల చేశారు.

## 21 సెప్టెంబరు 2011:

## తెలంగాణ పోరు.. 9వ రోజు.. జోరు

సర్కారు వెనుకడుగు వేసింది.. సకల జనుల సమ్మెను బలహీనం చేయడమే ధ్యేయంగా మంగళవారం తీసుకున్న నిర్ణయాలకు బుధవారం స్వస్తి పలికింది. దసరా సెలవులు యథాతథమని ప్రకటించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారులకు పాఠశాల విద్యాడైరెక్టర్ సమాచారం పంపారు. ఆర్టీసీ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు పైనా ప్రభుత్వం దిగివచ్చింది. నలుదిశలా వెల్లువెత్తిన నిరసనలకు తలొగ్గి తొలగింపు ఉత్తర్వులను పక్కన పెట్టింది. ఇక ఆర్టీసీ తెలంగాణ జేఏసీ, ఎన్ఎంయూ తెలంగాణ ఫోరం నేతలతో మంత్రి బొత్స జరిపిన చర్చలు విఫలమయ్యాయి. సమ్మెను విరమించుకునే ప్రసక్తే లేదని నేతలు తేల్చి చెప్పారు.

ఆర్టీసీ చర్యలను నిరసిస్తూ తెలంగాణ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్ భవన్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. ఎండీ చాంబర్ వద్దే ఆందోళనకు దిగిన ఎమ్మెల్యేలు హరాష్రావు, విష్ణువర్ధన్రెడ్డిలను, జేఏసీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. తాము సమ్మెలోకి వస్తున్నట్లు తెలంగాణ వైద్య ఆరోగ్య జేఏసీ ప్రకటించింది. దానికి

ఓ రోజు ముందే గాంధీ ఆస్పత్రిలో ఔట్‌పేషెంట్ సేవలను వైద్యులు బంద్ చేశారు. వరంగల్ నిట్ కళాశాల అధ్యాపకులు నిన్న సమ్మెలో పాల్గొన్నారు. సమ్మెకు మద్దతుగా 24న క్షవరాలు చేసే ప్రసక్తే లేదని తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంఘం ప్రకటించింది. 26 నుంచి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని స్వామిగౌడ్ చెప్పారు. 24, 25 తేదీలలో రైల్‌రోకోలను నిర్వహించనున్నట్లు జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు. సమ్మె నేపథ్యంలో ఆర్టీసీలో డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టుల భర్తీ, పీసెట్ వెబ్ కౌన్సిలింగ్‌లు వాయిదా పడ్డాయి. తెలంగాణ వ్యాప్తంగా ఉద్యోగులు సకుటుంబ సమేతంగా మహా దీక్ష చెపట్టారు. పలు చోట్ల ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలు దహనం చేశారు.

**22 సెప్టెంబరు 2011:**

**సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ పోరు గర్జన**

సకల జనుల సమ్మెకు ఖమ్మం జిల్లా లాల్‌సలాం చేసింది. ప్రత్యేక రాష్ట్రం వచ్చేవరకు పోరు ఆగదని గర్జించింది. "కాంగ్రెస్ మంత్రులు, రాజీనామా చేయని ప్రజాప్రతినిధులు దొంగలు. తెలంగాణకు వారే అడ్డంకి. వారిని నిలదీయండి" అంటూ జేఏసీ భాగస్వామ్య పక్షాలు పిలుపునిచ్చాయి. పదిరోజులు పూర్తిచేసుకున్న సకల జనుల సమ్మెకు మద్దతుగా గురువారం న్యూడెమాక్రసీ ఆధ్వర్యంలో పోరుగర్జన సభ నిర్వహించింది. సభలో కోదండరాం మాట్లాడుతూ.. "మేము తలచుకుంటే రైలు పట్టాలుండవు, బస్సులు తిరగవు, విమానాలు కూడా ఎగరవు" అన్నారు. తమ సహనాన్ని తప్పుగా అంచనా వేయవద్దని రేణుకను, అభిషేక్ సంఘ్విని హెచ్చరించారు. ఉపవాసం ఉండి ఉద్యోగులను బతికించుకుంటామని నాగం జనార్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. జీతం, కొలువు మాకు ఎంటికతో సమానమని స్వామిగౌడ్ అన్నారు. న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి పోటు రంగారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో టీఆర్ఎస్ నేతలు ఈటెల రాజేందర్, విజయరామారావుతో పాటు ఎమ్మెల్యే వేణుగోపాలాచారి, బీజేపి నేత విద్యాసాగర్‌రావు, సినీనటుడు ఆర్.నారాయణమూర్తి, న్యూడెమాక్రసీ నేతలు సూర్యం, గోవర్ధన్, ఉద్యోగసంఘాల నతేలు శ్రీనివాస్‌గౌడ్, జేఏసీ పక్షాల నేతలు పాల్గొన్నారు.

**24 సెప్టెంబరు 2011:**

**సకల జనుల సమ్మె 12వ రోజు..**

ఎటు చూస్తమన్న బంద్! ఏంచేస్తమన్న బంద్! బస్సు బంద్.. రైలు బంద్.. ఆటో బంద్! సకల జీవన చక్రం బంద్! శనివారం తెలంగాణ వ్యాప్తంగా సకలజనుల సమ్మెతో పాటు రైల్‌రోకో సంపూర్ణంగా జరిగింది. ఉద్యమం పట్టాలపైకి చేరింది. అక్కడ ఆటపాటలు, అన్న పానీయాలు! రైల్వే శాఖ ముందే రద్దు చేయడంతో.. రోకో చేసేందుకు ఒక్క రైలూ రాలేదు!ఉద్యమ వేడి కేంద్రాన్ని తాకాలంటే రైల్‌రోకో సరైన

మార్గమని తెలంగాణ జేఏసీ భావిస్తోంది. దీనిని మరో 48గంటలు పొడిగించాలని కూడా యోచిస్తోంది. అవసరమైతే నిరవధికం చేసే అవకాశమూ కనిపిస్తోంది. ఇక.. సకల జనుల సమ్మెలోకి మరిన్ని వర్గాలు అడుగుపెట్టాయి. క్షురకులు ఒక రోజు సమ్మెకు దిగారు. సచివాలయంలోని అటెండర్లు, లిఫ్టుబాయ్స్, డ్రైవర్లు సమ్మెకు సై అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసు ఇచ్చారు. దేవుడిపై ప్రమాణం చేసి మనస్ఫూర్తిగా ఉద్యమంలోకి వచ్చేదాకా తెలంగాణ కాంగ్రెస్, టీడీపీ ప్రజాప్రతినిధుల పేరిట గోత్రనామాలతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించబోమని తెలంగాణ అర్చక సమాఖ్య ప్రకటించింది. సోమవారం బీమా సిబ్బంది కూడా బంద్ పాటించారు. తమ శాఖలో సమ్మె గీతను దాటి విధులకు హాజరయ్యే వారి ఇళ్లకు కరెంట్ కోసేస్తామని విద్యుత్ జేఏసీ హెచ్చరించింది. 26 నుంచి మూడు రోజుల పాటు తెలంగాణ మంత్రుల ఇళ్లముందే పడక వేయాలని ఉద్యోగ సంఘాల జేఏసీ నిర్ణయించింది. సర్కారు దిగిరాకుంటే మిలిటెంట్ ఉద్యమం తప్పదని తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరాం పునరుద్ఘాటించారు.

## రైల్‌రోకో సక్సెస్

సకలజనుల సమ్మెలో భాగంగా శనివారం నుంచి తెలంగాణ అంతటా తలపెట్టిన 48గంటల రైల్‌రోకో, ఆటోల బంద్ కార్యాక్రమం తొలిరోజు సంపూర్ణంగా జరిగింది. ఆర్టీసీ బస్సుల బంద్ ఇప్పటికే కొనసాగుతోంది. ఇప్పుడు రైళ్లు, ఆటోలు కూడా లేకపోవడంతో పది జిల్లాల్లో రవాణా వ్యవస్థ దాదాపు పూర్తిగా స్థంభించిపోయింది.

వరంగల్ జిల్లాలో మూడు చోట్ల రైల్‌రోకో జరిగింది. ఈ జిల్లా మీదుగా వెళ్లే 174రైళ్లను ముందుగానే రైల్వేశాఖ రద్దు చేసింది. కాజీపేటలో జరిగిన రైల్‌రోకో ఆందోళనలో ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, బీజేపి నేత రాజేశ్వర్‌రావు, టీయూఎఫ్ నాయకులు దిలీప్‌కుమార్, విమలక్క తదితరులు పాల్గొన్నారు. భూపాలపల్లి, ములుగు, పర్వతగిరిలో నాయీబ్రాహ్మణులు రోడ్డుపైనే క్షౌరం పనులు చేసి నిరసన తెలిపారు. పరకాలలో మార్వాడీలు, తొర్రూరులో బుడిగాజంగాలు ర్యాలీ చేయగా, ములుగులో రజకులు రోడ్డుపైనే చాకిరేవు పెట్టారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే కవిత రాజీనామా కోరుతూ ఇంటి ముందు ఉద్యమకారులు ధర్నా చేశారు. ఖమ్మం జిల్లాలో రైల్‌రోకో జోరుగా జరిగింది. న్యూడెమాక్రసీ, టీఆర్ఎస్ నాయకులు ఖమ్మంలో రైలుపట్టాలపై ఆందోళన చేశారు. కలెక్టరేట్ ఎదురుగా రజక మహిళలు ర్యాలీ నిర్వహించి, చాకిరేవు పెట్టారు. సత్తుపల్లిలో రాజస్థానీయులు ర్యాలీ నిర్వహించారు. వైరాలో ఎమ్మెల్యే చంద్రావతి, కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేని ఆందోళనల్లో పాల్గొన్నారు. మెదక్ జిల్లాలో నాలుగుచోట్ల రైల్‌రోకో జరిగింది. తూప్రాన్ మండలం మనోహరాబాద్ స్టేషన్‌లో టీఆర్ఎస్ నాయకులు హరీష్‌రావు, చేగుంట మండలం వడియారంలో మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, రామలింగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, తెల్లాపూర్‌లో మెదక్ ఎంపీ విజయశాంతి, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, జహీరాబాద్‌లో

రఘునందన్ తదితరులు పట్టాలపై బైఠాయించారు. కొండపాకలో శ్రీరాంమహేష్ అనే ఆందోళనకారుడు సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. చిన్న శంకరపేటలో నాయీబ్రాహ్మణులు సోనియాగాంధీ దిష్టిబొమ్మకు క్షవరం చేశారు.

నల్గొండ జిల్లాలో సమ్మె, రైల్‌రోకో విజయవంతంగా కొనసాగింది. పెట్రోల్ బంకులు, మద్యం దుకాణాలు, ఆటోలు బంద్ అయ్యాయి. భువనగిరి రైల్‌రోకోలో బీజేపి నేత కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైల్‌రోకో విజయవంతమైంది. బీజేపీ నేత నాగూరావు, రతంగపాండురెడ్డి షాద్‌నగర్ రైలు పట్టాలపై నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్‌లో జరిగిన ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే నాగం మాట్లాడుతూ సమ్మెలో పాల్గొనని తెలంగాణ మంత్రుల భరతం పట్టాలని అన్నారు. కరీంనగర్ జిల్లాలో రైల్‌రోకో విజయవంతమైంది. కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి టీఆర్‌ఎస్ నేత ఈటెల రాజేందర్ రైలుపట్టాలపై బస చేశారు. పెద్దపల్లిలో బీజేపి రైలు పట్టాలపై వంటావార్పు, ధూంధాం నిర్వహించగా, పార్టీ నేత విద్యాసాగర్‌రావు, రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ నారదాసు, న్యూడెమాక్రసీ నేత రాజన్న పట్టాలపై బైఠాయించారు. కరీంనగర్‌లో నాయీబ్రాహ్మణులు, ఉడిపి హోటల్ యజమానులు, ఆటో కార్మికులు, ఫుట్‌వేర్ వ్యాపారులు, ఇతర సంఘాల వారు ర్యాలీలు నిర్వహించారు. వేములవాడ దేవాలయాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఆదిలాబాద్‌లో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్, మేడ్చెల్‌లలో జేఏసీ చైర్మన్ కోదండరాం రైల్‌రోకోల్లో పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లాలో రవాణా పూర్తిగా స్తంబించింది. అన్ని రైల్వేస్టేషన్లలో ఆందోళన కారులు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు.

### వాటర్‌బోర్డు జేఏసీ ఆవిర్భావం

గ్రేటర్ హైదరాబాద్ నగరానికి మంచినీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ నిర్వహిస్తున్న మెట్రోవాటర్ బోర్డు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఏర్పాటైంది. ఈమేరకు బోర్డులోని ఇంజనీరింగ్ సిబ్బంది, ఇతర విభాగాలకు సంబంధించిన 18 సంఘాలు ఏకమయ్యాయి. వాటర్‌బోర్డు జేఏసీ చైర్మన్‌గా జి.రాజేశ్వర్‌రావు, కోచైర్మన్‌గా నవీన్‌రెడ్డి, సెక్రటరీ జనరల్‌గా నాగభూషణం, ప్రచారకార్యదర్శిగా రాజశేఖర్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా వారు మేనేజింగ్ డైరెక్టర్ అథర్‌సిన్హాకు శనివారం వినతిపత్రం సమర్పించారు.

### గోదావరిఖనిలో ఫలించని డబుల్ ధమాకా!

సింగరేణిలో సమ్మె విఫలం చేయడానికి యాజమాన్యం వేసిన ఎత్తులు చిత్తయ్యాయి. శనివారం కంపెనీ వ్యాప్తంగా ఎక్కడా బొగ్గు ఉత్పత్తి జరగలేదు. ఒక రోజు డ్యూటీకి రెండు మస్టర్లు ఇస్తామంటూ కొత్తగూడెం రీజియన్లో యాజమాన్యం

చేసిన ప్రచారం బెడిసికొట్టింది. కొందరు ఓసీ ఆపరేటర్లు పోలీసులకు చిక్కకుండా స్వగ్రామాలకు వెళ్లారు. ఇప్పటికే సింగరేణిలో 12రోజుల సమ్మెతో 20లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగలేదు. రూ.300కోట్ల నష్టం వాటిల్లింది. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో సింగరేణిలో సమ్మె పూర్తిస్థాయిలో జరుగుతుండగా, ఖమ్మం జిల్లాలో డబుల్ మస్టర్ మంత్రం కాస్త పనిచేసినట్లు అధికారులు ప్రకటించారు.

## 25 సెప్టెంబరు 2011:

## ఢిల్లీ జేఏసీ అఖిలపక్ష భేటీలో తెలంగానం

తెలంగాణ ప్రజలంటే కాంగ్రెస్ అధిష్టానానికి చిన్నచూపని బీజేపి అధికార ప్రతినిధి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. కాబట్టే, తెంగాణ ఇవ్వకుండా కమిషన్లు, కమిటీలు అంటూ కాలయాపన చేస్తోందని, భారీ ఎత్తున ఉద్యమం జరుగుతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఆదివారం ఢిల్లీ జేఏసి ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ ప్రాంత ఎంపీల రాజీనామాలను ఎందుకు ఆమోదించటం లేదని స్పీకర్ మీరాకుమార్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేకే మాట్లాడుతూ..తెలంగాణలో నాలుగు కోట్ల మంది ప్రజలంతా ఎక్కడికి రావాలంటే అక్కడికి వచ్చి ఒకేసారి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, అప్పుడైనా కేంద్రం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తుందా? అని ప్రశ్నించారు. తాము రాజీనామా చేసినా స్పీకర్ పట్టించుకోకపోవడాన్ని నాగం తీవ్రంగా ఖండించారు. అసలు స్పీకర్ రాజ్యాంగం చదువుకున్నారా? అని ప్రశ్నించారు. సమైక్యరాష్ట్రంలో తెలంగాణకు అన్ని విధాలా అన్యాయం జరిగిందని ఎంపీ వివేక్ అన్నారు. నేషనల్ పాంథర్స్ పార్టీ అధినేత భీంసింగ్, ప్రొఫెసర్ తిరుమలి, తెలంగాణ జేఏసి సభ్యులు హమీద్ ఉల్ మహమ్మద్ ఖాన్, వెంకటస్వామి, చిన్నరాష్ట్రాల సాధన కమిటీ అద్యక్షుడు తోమర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల బందోబస్తు నడుమ గ్రూప్-1

సకల జనుల సమ్మె... పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్.. పరీక్ష జరుగుతుందా.. లేదా అనే చివరి నిమిషం దాకా కొనసాగిన ఉత్కంఠం మధ్య ఎట్టకేలకు తుపాకీ నీడన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ సమ్మె, ఆటోల బంద్, రైళ్ల బంద్ మధ్య పరీక్ష నిర్వహణ ప్రభుత్వానికి సవాలుగా మారినప్పటికీ పరీక్ష వాయిదా వేయాలని తెలంగాణ వాదులు డిమాండ్ చేస్తున్నప్పటికీ పోలీసు భద్రత మధ్య ప్రభుత్వం ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్ పరీక్ష నిర్వహించింది. వాస్తవానికి 54.55శాతం మంది అభ్యర్థులు హాజరైనప్పటికీ.. ప్రభుత్వం కొంత అత్యుత్సాహంతో 69.55శాతం హాజరైనట్లు ప్రకటన చేసింది. దీంతో సమ్మె ప్రభావం లేదని చెప్పడానికి సీఎం కార్యాలయం ప్రయత్నించింది

## 26 సెప్టెంబరు 2011:
## ఉద్రిక్తంగా ఉద్యమం.. అట్టుడికిన హైదరాబాద్

ఉద్యమం ఉద్వేగంగా సాగుతోంది. మెల్లమెల్లగా ఉద్రిక్తంగానూ మారుతోంది. ఒకే రోజు ఐదు సంఘటనలు రాజధాని నగరాన్ని గరంగరంగా మార్చాయి. 13రోజులుగా ఉధృతంగా, ఉద్వేగంగా సాగిన సమ్మె.. సోమవారం తొలిసారిగా 'ఉద్రిక్తం'గానూ జరిగింది. రవాణాశాఖలో అదనపు కమీషనర్ శ్రీనివాస్‌పై నేతల సమక్షంలోనే ఉద్యమకారులు చేయిచేసుకున్నారు. సకల సమ్మెపై వ్యాజ్యం వేసిన న్యాయవాది క్రిష్ణయ్యపై హైకోర్టు ఆవరణలో తెలంగాణ లాయర్లు దాడి చేశారు. ఎమ్మార్ కార్యాలయంలో తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ కార్యకర్తలు విధ్వంసం సృష్టించారు. తెలంగాణలో విద్యుత్ కోతలపై విద్యుత్ సౌధ ముందు నడిరోడ్డుపై నేతలు ధర్నా చేశారు. సచివాలయంలోనూ సీఎం కార్యాలయం ముందు బైఠాయించారు. ఒకదాని వెంట ఒకటిగా జరిగిన ఈ ఘటనలతో నగరం దద్దరిల్లింది. మరోవైపు.. సకల జనుల సమ్మెలో పాల్గొంటున్న తెలంగాణ ఉద్యోగులపై సర్కారు తీసుకుంటున్న చర్యలకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. నోటీసులు జారీ చేసిన ఉన్నతాధికారులకు సోమవారం ఉద్యమ సెగ తగిలింది. అటు రవాణా శాఖలో, ఇటు గ్రామాణాభివృద్ధిశాఖ పరిధిలోని కాంట్రాక్టు సిబ్బందికి జారీ చేసిన నోటీసులను నేతలు దగ్గరుండి ఉపసంహరింపజేశారు.

ఎమ్మార్, హైకోర్టుల్లో మినహా.. విద్యుత్ సౌధ, రవాణా శాఖ కార్యాలయం, గ్రామీణాభివృద్ధి శాఖ ఆఫీసు, సచివాలయంలో బైఠాయంపు ఘటనల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈటెల, కేటీఆర్ తదితరులతోపాటు.. అధికార పక్షానికి చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు పొన్నం ప్రభాకర్, మధుయాష్కీ, రాజయ్య, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా పాల్గొన్నారు. అధికారపక్ష నేతలు సీఎంని లక్ష్యంగా చేసుకుని మాటల తూటాలు ప్రయోగించారు. “ఒక మంత్రిగా సచివాలయంలోని సీఎం బ్లాక్ ముందు ధర్నా చేయాల్సి రావడం సిగ్గుచేటు.. ఇంత పెద్దఎత్తున ఉద్యమం సాగుతున్నా సీఎం పట్టనట్టు వ్యవహరించడం తగదు. ఆయనకు అంత అహంకారం పనికిరాదు” అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి విరుచుకుపడ్డారు. ఉద్యోగులకు ఏం జరిగినా సీఎం ఒక్కక్షణం కూడా సీటులో కూర్చోలేరని మధుయాష్కీ హెచ్చరించారు. ఏ ఒక్క ఉద్యోగిపై వేటు పడినా సర్కారును నడవనివ్వబోమని ఎంపీ రాజయ్య అన్నారు.

“కళ్లముందు సమ్మె ప్రభావం కనిపిస్తుండగా లేదని ఎలా చెబుతాను? అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. సమ్మె సడలుతోందంటూ తాను ఎలాంటి నివేదికనూ పంపలేదని సీఎం సుదీర్ఘ వివరణ ఇచ్చుకున్నారు. మరోవైపు కేంద్రం తెలంగాణపై సానుకూల నిర్ణయం తీసుకోకుంటే కొత్త పార్టీ పెట్టుకుంటామని మాజీ మంత్రి,

సీనియర్ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్ రెడ్డి హెచ్చరించారు.

గచ్చిబౌలీలోని ఎమ్మార్ ప్రాపర్టీస్ కార్యాలయంపై తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ దాడి చేసింది. 'మన రాజధాని మార్చ్' నిర్వహణలో భాగంగా విమలక్క నేతృత్వంలో ఆందోళనకారులు కార్యాలయంలో కంప్యూటర్లతోపాటు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం భవనంపైకి ఎక్కి సీమాంధ్ర వలస కుబేరులు కాజేసిన భూములను స్వాదీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

"దాడులు చేయాల్సింది ఉద్యోగులపై కాదు. సిగ్గూ శరం, చీమూ నెత్తురు లేని తెలంగాణ రాజకీయ నాయకత్వం మీద దాడి చేయాలి. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను బతకనీయొద్దు. వారిని ఎక్కడా తిరగనివ్వొద్దు" అని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఉద్యమంలో భాగస్వాములైన తెలంగాణ అర్చకులు మంగళవారం యాదగిరి గుట్ట, భద్రాచలం, వేములవాడ తదితర దేవస్థానాల్లో ఆర్జిత సేవలను నిలిపివేయనున్నారు. టికెట్లు, గదుల జారీ నిలిపివేస్తామని.. భక్తులకు ఉచిత దర్శనం కల్పిస్తామని ఆలయ ఉద్యోగులు ప్రకటించారు. ఇక.. తెలంగాణ ప్రాంతంలో సినిమా షూటింగ్‌లకు భద్రత కల్పించలేమని లొకేషన్ మార్చుకోవాలని నిర్మాతలకు పోలీసులు సూచిస్తున్నారు.

### నాచేతుల్లో ఏమీ లేదు: ఆజాద్

"తెలంగాణపై నేను చేసేదేమి లేదు. పార్టీ ఇంచార్జిగా సమస్యను ఒక కొలిక్కి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించాను. సీమాంధ్ర, తెలంగాణ నేతలతో చర్చలు జరిపాను. సీమాంధ్ర నాయకులు తమ మూడు ఆప్షన్లూ సమైక్యాంధ్రేనన్నారు. తెలంగాణ నాయకులు సైతం తమ మూడు ఆప్షన్లు తెలంగాణ ఏర్పాటేనని చెప్పారు. ఇలా ఎవరికి వారు మెట్టుదిగకపోతే.. నేను మాత్రం ఏమి చేయగలను?" అని సీఎంతో ఆజాద్ అన్నట్లు సమాచారం.

### అమలులోకి జీవో 177... సమ్మెపై చర్యలు ప్రారంభం

సకలజనుల సమ్మెపై సర్కారు దండోపాయం ప్రయోగించడం మొదలైంది. జీవో నెంబర్ 177ను మెల్లమెల్లగా బయటకి తీస్తోంది. గతంలో సహాయ నిరాకరణ సమయంలో జారీ చేసిన 177 ఉత్తర్వులను ఉద్యోగుల ఆందోళన కారణంగా అప్పట్లో ప్రభుత్వం నిలిపివేసింది. ఆ తర్వాత హైకోర్టు జోక్యం చేసుకుని ఈ ఉత్తర్వులను అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో హైకోర్టు ఆదేశాల మేరకేనంటూ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

### 27 సెప్టెంబరు 2011:

### లగడపాటి రాక.. రాజధానిలో ఉద్రిక్తత..

రాజధాని రగులుతూనే ఉంది. సోమవారం మొదలైన ఉద్రిక్తత మంగళవారం కూడా కొనసాగింది. ఉదయం భారీ భద్రత మధ్య సచివాలయానికి బయలుదేరిన

ఉద్యోగుల బస్సులపై దాడితో మొదలుకొని.. ఒక దాని తర్వాత ఒకటిగా చోటు చేసుకున్న సంఘటనలతో నగరం వేడెక్కింది. విజయవాడ ఎంపీ లగడపాటి రాజ్‌గోపాల్ రాకతో హైడ్రామా మొదలైంది. సోమవారం రవాణా శాఖ అదనపు కమిషనర్ శ్రీనివాస్‌పై దాడి జరిగిన నేపథ్యంలో.. లగడపాటి రాజ్‌గోపాల్ మంగళవారం ఆకస్మికంగా హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. శ్రీనివాస్‌ను పరామర్శించేందుకు ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లారు. ఈ సమాచారం తెలుసుకున్న ఉద్యోగ సంఘాల నేతలు, టీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. 'మాకు అనుమతి నిరాకరించి.. లగడపాటిని మాత్రం ఎలా లోపలికి పంపారు? అంటూ రవాణా శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. వీరి రాక గురించి ముందే తెలుసుకున్న పోలీసులు లగడపాటిని అరెస్టు చేసి అక్కడి నుంచి జూబ్లీహిల్స్ ఠాణాకు తరలించారు.

ఇక ఆర్టీఏ ఆఫీస్‌ను ముట్టడించిన ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య తీవ్ర పెనుగులాట జరిగింది. ఎమ్మెల్యేలు హరీష్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులను తరలిస్తున్న జీపును ఆందోళనకారులు అడ్డుకున్నారు. బీజేపి నేత విద్యాసాగర్‌రావు పోలీసు జీపుపైకి ఎక్కారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే విష్ణు జీపులోంచి దిగి ఆర్టీఏ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. వీరిని అతి కష్టం మీద పోలీసులు అదుపులోకి తీసుకుని బంజారాహిల్స్ స్టేషన్‌కు తరలించారు. లగడపాటి విజయవాడకు తరలించాల్సిందిగా జూబ్లీహిల్స్ స్టేషన్ ముందు ధర్నా చేస్తామంటూ హరీష్‌రావు పట్టుబట్టారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బంజారాహిల్స్ ఠాణా వద్దే హరీష్‌రావు తదితరులు బైఠాయించారు. మళ్లీ పోలీసులు, ఆందోళనకారులకు మధ్య తీవ్రస్థాయిలో తోపులాట జరిగింది. ఈ సంఘటనలో ఉద్యోగ సంఘాల నేత స్వామిగౌడ్ గాయపడ్డారు. ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు.

ఇక హరీష్‌రావు బైక్‌పై హెల్మెట్ పెట్టుకుని నాటకీయ ఫక్కీలో మింట్ కంపౌండ్‌లోని సీఎండీ కార్యాలయ ముట్టడికి ప్రయత్నించారు. ఇక్కడ కూడా పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ తోపులాటలో హరీష్‌రావు చొక్కా చిరిగిపోయింది. డిసీపీ స్టీఫెన్ రవీంద్ర తనపై దాడి చేశారని హరీష్ ఆరోపించారు. రవాణా అధికారిపై దాడి కేసులో టీఆర్ఎస్వీ నేత బాల్కసుమన్, మరొకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు.. స్వామిగౌడ్‌పై పోలీసుల దాడికి సంబంధించి నేతలు హక్కుల కమీషన్‌కు పిర్యాదు చేశారు. ఈ దాడికి నిరసనగా రాస్తారోకోలు నిర్వహించాలని టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పిలుపునిచ్చారు. ఉద్యమం పేరిట కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తెలంగాణ ప్రజలను నంజుకు తింటున్నారని లగడపాటి ధ్వజమెత్తారు. దాడికి గురైన అధికారి విజయవాడకు చెందిన వాడని, స్థానిక కాంగ్రెస్ నాయకుడికి అల్లుడైనందునే పరామర్శించేందుకు వెళ్లానని లగడపాటి చెప్పారు. అది కూడా తప్పేనా? అని ప్రశ్నించారు. ఇక.. 'నువ్వు ఆఫ్ట్రాల్ ఓ ఎంపీవి! హీరో అవుదామనుకోవద్దు' అని

టీకాంగ్రెస్ నేతలు లగడపాటిని హెచ్చరించారు. కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అన్ని ప్రైవేటు వాహనాలను ప్రజా రవాణాకు అనుమతించాలని సీఎం అధికారులకు సూచించారు.

## సచివాలయంలో డ్రైవర్లకు బ్రేక్

సచివాలయంలో తెలంగాణ వేడి రగిలింది. జంటనగరాల పరిధిలో డ్రైవర్లు సమ్మెలో ఉన్నందున.. మీరూ పని చేయొద్దంటూ అధికారులు, మంత్రుల వాహనాల డ్రైవర్లను తెలంగాణ ఉద్యోగులు అడ్డుకున్నారు. అధికారులను తీసుకొస్తున్న డ్రైవర్లను సచివాలయం ముఖద్వారం వద్ద ఉద్యమకారులు ఆపేశారు. చేసేది లేక డ్రైవర్లు వాహనాలను వదిలేసి.. దిగి వెళ్లిపోయారు. దాంతో కొందరు అధికారులు కాలిబాట పట్టారు. డ్రైవింగ్ వచ్చిన అధికారులు తమ వాహనాలను తామే నడుపుకుంటూ వెళ్లారు.

## 02 అక్టోబరు 2011:

## రాజ్‌ఘాట్‌లో జేఏసీ మౌనదీక్ష

తెలంగాణ విషయంలో కేంద్రం నాన్చుడు ధోరణిని నిరసిస్తూ.. జేఏసీ భాగస్వామ్యపక్షాలు ఆదివారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో 'మౌనదీక్ష'ను చేపట్టారు. "మరో నాలుగు రోజుల్లో దసరా పండుగ వస్తోంది. సకల జనుల సమ్మెతో ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. తెలంగాణ ప్రజలే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల సమ్మెను విరమించి ఉద్యోగులు విధుల్లో పాల్గొనాలి. తెలంగాణపై చర్చల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కారమయ్యేది కాదు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కొంత సమయం పడుతుంది. తెలంగాణ విడిపోవడం అంత సులభం కాదు. ఎవరి మనసు నొప్పించకుండా.. శాంతియుతంగా.. ఈ సమస్యపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అందుకే కొంత జాప్యం జరుగుతోంది" అని కాంగ్రెస్ ముఖ్యనేతలు చెబుతుంటే..

మరోవైపు.."తెలంగాణ వచ్చేదాకా సకల జనుల సమ్మెను కొనసాగిస్తాం. తెలంగాణ తప్ప హరిహర బ్రహ్మాదులు వచ్చినా సమ్మెను విరమించే ప్రసక్తే లేదు. ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది. సమ్మె మానండి. అనడంలో అర్థం లేదు. కోట్ల మంది ప్రజలు పాత్రధారులుగా సమ్మె జరుగుతోంది. కాంగ్రెస్ కోర్ కమిటీ ప్రతిపాదిస్తున్న సంప్రదింపులు, మెదడు లేని, అర్థంలేని ప్రతిపాదనలు, కాలయాపన ట్రిక్కులు. ఆజాద్ చిలకపలుకులు నమ్మడానికి మేం సిద్దంగా లేం. 11 ఏళ్ల తర్వాత కూడా చర్చలు ముగియవా? ఆజాద్ నివేదిక ఇచ్చిన తెల్లారో, మర్నాడో చెబుతామని చెప్పి.. మళ్లీ ఇప్పుడు సమయం కావాలనడం అర్థంపర్థం లేని విషయం" అని కేసీఆర్ మండిపడ్డారు.

### తెలంగాణ కోసం ఊరంతా ఉపవాసం

ఆ ఊరు గాంధీజయంతి రోజున తెలంగాణ ఉద్యమానికి ఓ కొత్త ఒరవడి తెచ్చింది. ఉద్యమ నిరసనల్లో భాగంగా రోడ్డుపై వంటావార్పు, ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు, రైల్‌రోకోలు నిర్వహించడం చూశాం.. కాని దీనికి భిన్నంగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి చిహ్నంగా ఆ ఊరి జనం వినూత్నంగా నిరసన తెలిపారు. తెలంగాణ కోసం మేము సైతం.. అంటూ తెల్లవారంగానే ఇళ్లకు తాళాలు వేసి పిల్లా జల్లా ముసలీ ముతకా అంతా కలిసి చావిడిలోకి వచ్చారు. జై తెలంగాణ అంటూ మూకుమ్మడిగా ఉపవాస దీక్ష చేపట్టారు. దాదాపు 3500 మంది సామూహిక ఉప వాస దీక్ష చేస్తున్నారనే వార్త గుప్పుమనగానే నాయకులు, ప్రజాసంఘాల నేతలు, ప్రతిఒక్కరూ ఆ ఊరిబాట పట్టారు. వరంగల్ జిల్లాలోని ముప్పారం. ముప్పారం గ్రామంలోని 3500 పై చిలుకు జనాభా చావిడి వద్ద ఒక రోజు ఉపవాస దీక్షకు కూర్చుంది.

### 03 అక్టోబరు 2011:

సకల జనుల సమ్మెకు మద్దతుగా నల్గొండ జిల్లా నకిరేకల్‌లో తెరాస నాయకుడు డా॥ చెఱుకు సుధాకర్ నాయకత్వంలో ఆంధ్రా బస్సులను అడ్డుకున్న ఉద్యమకారులు. పలు బస్సులు ధ్వంసం.

### 07 అక్టోబరు 2011:

### పండుగ పూటా సడలని సమ్మె

సకల జనుల సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరకుంది. దసరా రోజున తెలంగాణ జిల్లాల్లో కాంగ్రెస్ నాయకుల ముఖ చిత్రాలతో కూడిన దశకంఠుని విగ్రహాన్ని దహనం చేశారు. ఈ విగ్రహంలో సోనియా, ప్రణబ్, తెలంగాణ మంత్రులు, చంద్రబాబు, లగడపాటి తదితర నాయకుల ముఖచిత్రాలను ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లా మహబూబ్‌నగర్ ఎంపీ బలరాం నాయక్ సొంతూరి జనం నిలదీశారు. పర్వతగిరిలో ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సమ్మెలో ఉన్న ఆర్టీసీ కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. నిజామాబాద్‌లో టీచర్స్ జేఏసి నాయకులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. తెలంగాణ ద్రోహుల చిత్రపటాలను టపాసులతో పేల్చారు. బోధన్‌లో దీక్షలు కొనసాగాయి. నవీపేటలో మైనార్టీలు ర్యాలీ నిర్వహించారు. మోర్తాడ్‌లో టీటీ జేఏసి అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఆర్మూర్‌లో సీనియర్ సిటిజన్స్ ర్యాలీ నిర్వహించారు. కామారెడ్డిలో ఆర్యసమాజ్ సభ్యులు ఆందోళన చేశారు.

కరీంనగర్ జిల్లా పెగడపల్లిలో కుల సంఘాలు, జగిత్యాలలో ఉద్యోగులు ర్యాలీ చేపట్టారు. ఇల్లంతకుంట, ముస్తాబాద్‌లో ముస్లీంల ర్యాలీ జరుగగా గంభీరావు పేటలో ఉపాధ్యాయులు మోకాళ్లపై నిరసన తెలిపారు. గోదావరిఖని సింగరేణి

ఓసీపి–3లో ప్రైవేటు కంపెనీతో పనిచేయించేందుకు యాజమాన్యం ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. పోలీసులు 18మందిని అరెస్టు చేశారు. దీనిని నిరసిస్తూ ఓసీపీ–4లో కార్మిక నేతలు ధర్నాకు దిగారు. హుస్నాబాద్‌లో ఆర్టీసీ కార్మికులు ర్యాలీ తీశారు. నాలుగో తరగతి ఉద్యోగులకు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు రూ.లక్షన్నర ఆర్థిక సహాయం చేశారు. వేములవాడలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మల్యాల నుంచి పద్మశాలీలు పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో ఆర్టీసీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఉట్నూర్‌లోని పాన్‌షాప్, హోటళ్ల యాజమానులు ర్యాలీ నిర్వహించారు. నార్నూర్‌లో ఎంపీ రాథోడ్ రమేష్‌ను ఘెరావ్ చేశారు. రాజీనామా చేయాలని కాళ్లు మొక్కారు. ఎంపీ రాథోడ్ తన రాజీనామా పత్రాన్ని స్పీకర్‌కు పంపించండని జేఏసి నాయకులకు ఇచ్చారు. నిర్మల్‌లో ముస్లీం జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దిలావర్‌పూర్‌లో ధూంధాంతో పాటు వంటావార్పు నిర్వహించారు.

మెదక్ జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే నర్సారెడ్డి రాజీనామా చేయాలని ప్రభుత్వ ఉద్యోగి గౌసొద్దీన్ సెల్ టవర్ ఎక్కారు. నర్సాపూర్‌లో ముస్లీంలు ప్రదర్శన నిర్వహించగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులకు గడ్డాలు గీచి నిరసన తెలిపారు. నల్గొండ జిల్లా సూర్యాపేట, చౌటుప్పల్, హుజూర్‌నగర్‌లలో ముస్లీం మైనార్టీలు ర్యాలీలు నిర్వహించారు. నిడమనూరులో మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి ఉద్యోగులు సమ్మె విరమించాలని కోరారు. ఎమ్మెల్యే దామోదర్‌రెడ్డి తెలంగాణ మంత్రులంతా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నందుకు నిరసనగా ఆ ప్రదేశాన్ని శుక్రవారం పాలతో శుద్ధి చేశారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసనను వ్యక్తం చేశారు.

**10 అక్టోబరు 2011:**

## ఆర్టీసీ సమ్మెపై తీవ్ర గందరగోళం

తెలంగాణలో 22 రోజులుగా ఆగిన ఆర్టీసీ చక్రంను ఎన్‌ఎంయూ బస్టాండ్ వరకు తీసుకొస్తే.. ఆ సంఘం తెలంగాణ ఫోరం నేతలు అక్కడే బ్రేకులు వేశారు. సమ్మె 'వాయిదా' వేస్తున్నట్లు ఎన్‌ఎంయూ అగ్రనేతలు ప్రకటించగా మాట చెప్పేందుకు మీరెవరంటూ టీ–ఫోరం నాయకులు ప్రశ్నించారు. దీంతో.. సమ్మె విరమణపై తీవ్ర గందరగోళం నెలకొంది. సకల జనుల సమ్మె 28వ రోజైన సోమవారం కీలక పరిణామాలు జరిగాయి. సమ్మెను విరమింపజేసే దిశగా సర్కారు చర్యలు ముమ్మరం చేసింది. ఈ చర్యలు ఆర్టీసీ వరకు మాత్రమే.. అది కూడా ఫలించాయో, లేదో అనే సందిగ్ధం మధ్య ముగిశాయి. చర్చల్లో భాగంగా ప్రభుత్వం ఆర్టీసీపై, ఆర్టీసీ కార్మికులపై

వరాల జల్లు కురిపించింది. మెజారిటీ నిర్ణయం ప్రకారం సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ఎన్‌ఎంయూ అగ్రనేత మహమూద్ ప్రకటించారు. కానీ.. ఎన్‌ఎంయూ తెలంగాణ నేతలు అశ్వత్థామరెడ్డి, థామస్‌రెడ్డి ఈ ప్రకటనతో విభేదించారు. తెలంగాణ వచ్చేదాకా సమ్మె ఆగదని తేల్చి చెప్పారు.

**ఒప్పందం ఇదీ...**

మోటారు వాహనాల పన్నుల చెల్లింపు నుంచి ఆర్టీసీకి ఏడాదిపాటు మినహాయింపు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో ఆర్టీసీకి రూ. 375కోట్ల మేరకు వెసులుబాటు కలగనుంది.

ఆరు వేల మందికిపైగా ఉన్న కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను నవంబర్‌లోగా క్రమబద్ధీకరించనున్నాం

సమ్మె కాలాన్ని అడ్వాన్స్ లీవ్‌గా పరిగణించనున్నారు. అలాగే ఇంక్రిమెంట్ల మంజూరుకు కూడా సమ్మె కాలాన్ని పరిగణలోకి తీసుకోబోరు. ఇది కార్మికులకు వెసులుబాటు కల్పిస్తుందని ఎండీ చెప్పారు.

రెగ్యులర్ కార్మికులకు రూ. 15వేలు, కాంట్రాక్టు కార్మికులకు రూ. 10వేలు చోప్పున అడ్వాన్సులు చెల్లించనున్నారు. అలాగే, రూ. 3వేల చొప్పున పండుగ అడ్వాన్సుల కింద చెల్లించనున్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో ఈ చెల్లింపులు జరుగుతాయని ఎండీ ప్రసాదరావు తెలిపారు.

ఎర్న్‌డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను కూడా వచ్చే నెలలో చెల్లించనున్నారు.

వివిధ సందర్భాలలో కార్మికులపై నమోదైన కేసులను ఎత్తివేసే విషయంలో కూడా ప్రభుత్వం సానుకూలం వ్యక్తం చేసింది.

**11 అక్టోబరు 2011:**

ఉద్యోగుల మహాధర్నాతో దద్దరిల్లిన హైదరాబాద్

తెలంగాణ ఉద్యోగులు కదం తొక్కారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు పెట్టేంత వరకూ ఉద్యమం ఆగబోదని తేల్చి చెప్పారు. తమ లక్ష్యం నెరవేర్చుకుంటామని ప్రకటించారు. ఇప్పటివరకూ సహనంగా వ్యవహరిస్తున్నామని, తమ ఉద్యమాన్ని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు. పార్లమెంటులో తెలంగాణ బిల్లును తక్షణమే పెట్టాలని డిమాండ్‌తో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తెలంగాణ ఉద్యోగుల జేఏసి మంగళవారం నిర్వహించిన 'మహాధర్నా'కు వివిధ జిల్లాలనుంచి పెద్దఎత్తున ఉద్యోగులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ప్రారంభమైన బహిరంగ సభ సాయంత్రం 5గంటల వరకు కొనసాగింది. గద్దర్, విమలక్క, ఆమని, గోరేటి ఎంకన్న,

రసమయి, స్వర్ణ, చైతన్య తదితరుల గీతాలు సభ ఆద్యంతం అలరించాయి. టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కోదండరాం, విద్యాసాగర్‌రావు తదితరులు మహాధర్నాలో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా రవాణా, ఎక్సైజ్, అటవీశాఖల ఉద్యోగులు నేరుగా యూనిఫాంతోనే మహాధర్నాలో పాల్గొన్నారు. దాదాపు వెయ్యి మంది ఉద్యోగులు యూనిఫాంలో కవాతు చేసుకుంటూ మహాధర్నా ప్రాంగణం వద్దకు వచ్చి సంఘీభావాన్ని ప్రకటించారు.

"స్వామిగౌడ్, విఠల్ ఏం దేశద్రోహం చేశారు? వారిపై కేసులు ఎత్తివేసి నాపై ఎన్ని కేసులైనా పెట్టుకోండి.. నన్ను జైల్లో పెట్టి చూడండి. ఏమవుతుందో! 15, 16, 17 తేదీల్లో నిర్వహించే రైల్‌రోకోలో లక్షలాది మంది పట్టాలపైకి వస్తారు. ప్రతి నలుగురిలో ఒకరు ఉద్యమంలో పాల్గొంటే.. కోటి మందిని అరెస్టు చేసి జైలులో పెట్టి సాదుతావా?" అని సీఎం కిరణ్‌పై కేసీఆర్ నిప్పులు చెరిగారు. తెలంగాణకు అన్ని వర్గాల మద్దతు లభించిందని సకల జనుల సమ్మెపై తెలంగాణ ప్రజా ఫ్రంట్ గద్దర్ అన్నారు. ఉద్యమ నేతలను అరెస్టు చేస్తుంటే కాంగ్రెస్, టీడీపీ నేతలు ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

**14 అక్టోబరు 2011:**

**కరీంనగర్‌లో ఉపాధ్యాయ మహాగర్జన**

కరీంనగర్ సర్కస్ గ్రౌండ్స్‌లో తెలంగాణ ఉపాధ్యాయ జేఏసి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ మహాగర్జన, రసమయి ధూంధాం జరిగింది. ఈ సభలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమాన్ని ఏ శక్తి అణచివేయలేదని అన్నారు. రైలుపట్టాలపైకి లక్షలాది మంది వస్తారని దమ్ముంటే రైల్‌రోకోను ఆపాలంటూ డీజీపీకి, ప్రభుత్వానికి సవాల్ విసిరారు. 'పోలీసుల్లారా మీకోసం 14ఎఫ్‌ను రద్దు చేయించింది ఈ తెలంగాణ ఉద్యమమే. గన్నులు, లాఠీలు డౌన్ చేసి సకల జనుల సమ్మెలో పాల్గొనండి. ముఖ్యమంత్రిపై తిరుగుబాటు చేస్తే.. ఢిల్లీ దిగి వచ్చి తెలంగాణ ఇస్తుంది' అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్‌రావు, ప్రొ.ఖాసీం, టీటీ జేఏసి రాష్ట్ర నాయకులు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

**15 అక్టోబరు 2011:**

**రైలురోకోపై సర్కారు ఉక్కుపాదం – తెలంగాణ అరెస్ట్**

తెలంగాణ పట్టాలెక్కింది. పట్టాల వెంబడి రైలు కూత స్థానంలో జై తెలంగాణ నినాదం ఎలుగెత్తింది. అరెస్టులు, తోపులాటలు, ఉద్రిక్తతలు, తీవ్ర నిర్బంధం నడుమ.. శనివారం తొలిరోజు రైల్‌రోకో జరిగింది. వందల్లో కేసులు, వేలల్లో అరెస్టులతో తెలంగాణకు సంకెళ్లు పడ్డాయి. మొదటి నుంచి హెచ్చరిస్తున్నట్లుగానే రైల్‌రోకోపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పట్టాలెక్కిన వారిని పట్టుకుని వదిలేసేలా కాకుండా..

రిమాండుకు పంపించేందుకు అవకాశమున్న రైల్వే చట్టాన్ని ప్రయోగించింది. శుక్ర వారం రాత్రి నుంచే మొదలుపెట్టిన అరెస్టులు, నిర్బంధాలను శనివారం మరింత తీవ్రం చేసింది. పొన్నం ప్రభాకర్‌తో సహా పలువురు అధికార పార్టీ ఎంపీలు, అనేక మంది ప్రజాప్రతినిధులపై రైల్వే చట్టం కింద కేసులు పెట్టింది. రిమాండుకు సైతం పంపింది. ఏడు రైళ్లను నడిపి చూపించింది. రాజధానిలో ఎంఎంటీఎస్ సర్వీసులను నడిపింది. రైల్‌రోకోకు పిలుపునిచ్చిన టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, జేఏసి చైర్మన్ కోదండరాం, స్వామిగౌడ్, బీజేపి నేత దత్తాత్రేయ తదితరులపై నిజామాబాద్, రంగారెడ్డి జిల్లా తాండూరు, హైదరాబాద్‌లలో రైల్వే చట్టాల కింద మూడు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. తెలంగాణవ్యాప్తంగా సుమారు 2200 మందిని పోలీసులు అరెస్టు చేశారు. 250 మందిపై రైల్వే చట్టం కింద కేసు పెట్టారు. హైదరాబాద్‌లోనే 81 కేసులు నమోదయ్యాయి. 185 మందిని అరెస్టు చేశారు. రైల్వే చట్టం కింద మరో నాలుగు కేసులు నమోదు చేసి, 88 మందిని అరెస్టు చేశారు. ఎంపీలు పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, విజయశాంతి, హరీష్‌రావు, కేసీఆర్ కుమార్తె కవితతో సహా అనేక మంది ప్రముఖులను రైల్వే చట్టం కింద అరెస్టు చేశారు. పట్టా ఎక్కిన ప్రతి నేతపైనా ఆ చట్టం ప్రయోగించారు. హరీష్‌రావు, కేటీఆర్‌లపై పోలీసులను దూషించిన నేరంపైనా కేసు పెట్టారు.

ఇక.. ఎంపీలు మధుయాష్కీ, రాజయ్య, మంద జగన్నాథం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బలరాం నాయక్, గుత్తా సుఖేందర్‌రెడ్డిలతో పాటు అనేకమందిని పట్టాలదాకా.. వెళ్లకుండానే పోలీసులు అరెస్టు చేశారు. పొన్నం ప్రభాకర్, జీవన్‌రెడ్డిలకు న్యాయస్థానం 14 రోజుల రిమాండు విధించింది. రైల్‌రోకో సందర్భంగా పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జీవన్‌రెడ్డి, హరీష్‌రావు, కేటీఆర్ తదితరులు పలుమార్లు పోలీసుల కన్నుగప్పారు. నిర్బంధాన్ని తప్పించుకుని ముందుకు వెళ్లారు. మెదక్ జిల్లా సుంకాపూర్ స్టేషన్‌లో రైల్వే టికెట్ కౌంటర్‌ను శనివారం తెల్లవారుజామున ఆందోళ నకారులు ధ్వంసం చేశారు. వరంగల్ జిల్లా మహబూబాబాద్ మరోమారు వేడెక్కింది. పోలీస్ స్టేషన్‌పై ఆందోళనకారులు రాళ్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో ఎస్ఐ యూసఫ్ జానీ మహమ్మద్, ఆయన గన్‌మెన్ గాయపడ్డారు. వరంగల్ జిల్లా గేట్‌పల్లి, ఎలుగూరు, నెక్కొండ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు 80 ట్రాక్ క్లిప్పులు తొలగించారు. పెద్దపల్లి వద్ద కూడా వంద ఫిష్‌ప్లేట్ల రింగులు తప్పించారు. అయితే.. రైల్‌రోకో శాంతియుతంగా జరిగిందని, మఫ్టీలో ఉన్న పోలీసులే ఫిష్‌ప్లేట్లు తొలగించారని జేఏసి చైర్మన్ కోదండరాం ఆరోపించారు. రైల్వే అడిషనల్ డీజీ కౌముది హెలికాప్టర్ ద్వారా రైల్వే పట్టాల వెంబడి సర్వే చేశారు. డీజీపి దినేశ్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.

శాంతి భద్రతల అడిషనల్ డీజీ ఎస్ఏ హుడా, ఐజీ అనురాధ, హైదరాబాద్,

సైబరాబాద్ కమీషనర్లు ఏకే ఖాన్, ద్వారకా తిరుమలరావు, రైల్వే ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. పలు రైళ్లను పునరుద్ధరించారు. రైల్‌రోకోను సమర్థవంతంగా అడ్డుకోగలిగామని పోలీసులు భావిస్తున్నారు. గతంలో లాగా రైలు పట్టాల వెంబడి వంటా వార్పు, ఎడ్లబండ్లు పెట్టడం వంటి సంఘటనలు జరగలేదని.. పరిసర గ్రామాల ప్రజలను పట్టాలపైకి రాకుండా నిలువరించగలిగామని పోలీసులు చెబుతున్నారు. రైల్‌రోకోలో మిగిలిన రెండు రోజులూ ఇలాగే కట్టుడిట్టమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించుకున్నారు.

### ఆర్టీసీ సమ్మె విరమణ

ఆర్టీసీ కార్మికుల సమ్మె వాయిదా పడింది. శనివారం రాత్రి నుంచే పలు బస్సు సర్వీసులు రోడ్డుపైకి వచ్చాయి. ప్రజలు, కార్మికుల ఇబ్బందుల దృష్ట్యా సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ఆర్టీసీలోని తెలంగాణ ఎన్ఎంయూ ఫోరం, తెలంగాణ కార్మికుల జేఏసి ప్రకటించాయి. శనివారం ఉదయం నుంచి వేగంగా జరిగిన పరిణామాలు సమ్మె వాయిదా నిర్ణయానికి దారితీశాయి. ఆర్టీసీలోని ప్రధాన కార్మిక సంఘం ఎన్ఎంయూ లోని తెలంగాణ ఫోరం, మరో ఏడు సంఘాలతో కూడిన తెలంగాణ ఆర్టీసీ కార్మికుల జేఏసీలు విడివిడిగా సమావేశమయ్యాయి. అనంతరం ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు అశ్వత్థామరెడ్డి, థామస్‌రెడ్డి, హన్మంతు, తెలంగాణ జేఏసి తరపున దొంత ఆనందం, ఆర్.యాదయ్య, రాజిరెడ్డి తదితరులు మంత్రి బోత్స, ఆర్టీసి ఎండీ ప్రసాదరావులతో సమావేశమయ్యారు. అనంతరం జేఏసి చైర్మన్ కోదండరాంతో సమావేశమయ్యారు. దాదాపు గంటపాటు సాగిన సమాలోచనల అనంతరం, సమ్మె నుంచి ఆర్టీసి కార్మికులకు మినహాయింపు నిర్ణయం తీసుకున్నారు. సమ్మెను వాయిదా వేస్తున్నట్లు కోదండరాం సమక్షంలో అధికారికంగా ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులు 27 రోజుల పాటు ధైర్యం, తెగువతో సమ్మె చేశారని, ప్రజలకు ఇబ్బందిని, కార్మికులపై ఒత్తిడిని తగ్గించడానికే సమ్మె వాయిదా వేస్తున్నట్లు కార్మికసంఘాల నేతలు ప్రకటించారు.

## 16 అక్టోబరు 2011:

### రైల్‌రోకో రెండో రోజు ఉద్రిక్తం

తెలంగాణలో రైల్‌రోకో రెండో రోజు కాస్త జోరు తగ్గినా పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. ఆదివారం భారీ బందోబస్తు మధ్య రైళ్లు యథావిధిగా నడిచినా ప్రయాణీకులు లేక వెలవెల బోయాయి. ప్యాసింజర్ రైళ్లలో కూడా ప్రయాణీకులు పెద్దగా కన్పించలేదు. పలుచోట్ల ముఖ్యమంత్రి కిరణ్, డీజీపి దిష్టిబొమ్మలను దహనం చేశారు. సకల జనుల సమ్మె 34వ రోజుకు చేరింది. సమ్మె నుండి ఆర్టీసీ సిబ్బంది వైదొలగడంతో బస్సు సర్వీసులు దాదాపు పూర్తి స్థాయిలో నడిచాయి. కరీంనగర్ జిల్లాలో రెండో రోజు ముందస్తు అరెస్టులు జరిగాయి. పెద్దపల్లి, రామగుండంలలో రైల్‌రోకో చేయబోయిన

ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. జమ్మికుంటలో 20 మందిని అరెస్టు చేశారు. ఎల్కతుర్తి మండలం బావుపేట రైల్వే సిగ్నల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించారు. దండెపల్లిలో ట్రాక్‌పైకి వెళ్లి ప్రదర్శన నిర్వహించారు. నల్గొండ రైల్వేస్టేషన్ వద్ద జేఏసి టెంట్లను పోలీసుల కూల్చివేయడం తోపాటు నాయకులను అరెస్టు చేశారు. ఎమ్మెల్యే విద్యాసాగర్ అరెస్టును నిరసిస్తూ ఆయన అనుచరులు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు.

మిర్యాలగూడలో 100 మంది కాంగ్రేస్ కార్యకర్తలను అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే విజయసింహారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. టీఆర్ఎస్ నేత అమరెందర్ రెడ్డిని గృహనిర్భంధంలో ఉంచారు. భువనగిరిలో హెలికాప్టర్‌తో ఏరియల్ సర్వే నిర్వహించారు. వరంగల్‌లో స్టేషన్ ముట్టడికి ప్రయత్నించిన మున్నూరు కాపులపై లాఠీచార్జి చేశారు. పట్టాలపైకి ఎడ్లబండ్లపై వచ్చేందుకు వారు ప్రయత్నించగా దొరికినవారిని దొరికినట్లుగా చితకబాదారు. లాఠీచార్జిలో 10మంది తీవ్రంగా గాయపడ్డారు. రక్తం కారుతున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి మళ్లీ కొట్టారు. ఆదిలాబాద్ జిల్లాలో పట్టాలపైకి ఎవ్వరూ వెళ్లలేదు. నేతలను కోర్టుకు తీసుకొస్తున్న పోలీస్ వాహనాన్ని ఆందోళనకారులు ధ్వంసం చేశారు. రామకృష్ణాపూర్ రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా చేయబోయిన ఎమ్మెల్యే ఓదెలుతో సహా 30 మందిని అరెస్టు చేశారు. వారిని స్టేషన్‌కు తరలిస్తుండగా అడ్డుకునేందుకు దారి వెంట పెట్రోల్ చల్లి మంటలు రేపారు. మందమర్రి రైల్వేస్టేషన్ వద్ద 50 మందిని అరెస్టు చేశారు. జిల్లా కోర్టు ఎదుట జ్యూడిషియల్ ఉద్యోగులు మోకాళ్లపై నడిచి, రోడ్లను ఊడ్చి నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట టీఎన్జీవోలు ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో వంటావార్పు నిర్వహించి భోజనాలు చేశారు.

నిజామాబాద్ జిల్లాలో బిక్కనూర్ మండలం పలమర్ల, తిప్పాపూర్ మధ్యన రైల్వేట్రాక్ ఫిష్‌పేట్లను తొలగించారు. దీంతో కాచీగూడ–నాందేడ్ రైలు కొంత సేపు ఆగిపోయింది. సికింద్రాబాద్–బోధన్ ఫ్యాసింజర్ రైలు పోలీసు ఎస్కార్ట్‌తో నడిచింది. నేతలను అరెస్టు చేసి ఉద్యమాన్ని అణచివేస్తున్నారనే మనస్తాపంతో సదాశివనగర్ కన్నాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ రాంచందర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లాలో కాజీపేట–విజయవాడ ఫ్యాసింజర్ మినహా ఏ ఒక్క రైలు నడవలేదు. గాంధీ నగర్ వద్ద గూడ్స్‌రైలును అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య సహా 50 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఖమ్మం రైల్వేస్టేషన్ ముట్టడికి ప్రయత్నించిన ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో సీపీఐ జిల్లా కార్యదర్శి హెమంతరావు స్పృహకోల్పోగా ఆసుపత్రికి తరలించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి జానారెడ్డిపై ఉద్యోగ జేఏసి తీవ్రస్థాయిలో మండిపడింది. రైల్‌రోకో సందర్భంగా, వరుసగా రెండోరోజు జూపల్లిని పోలీసులు

అరెస్టు చేశారు. ఆదివారం జిల్లాలో 103 మందిని అరెస్టు చేశారు. ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో పట్టణంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. మంత్రి జానారెడ్డి దిష్టిబొమ్మకు బీజేపి నేతలు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. పాలమూరు యూనివర్సిటీ వద్ద డీజీపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. శనివారం రైలురోకో సందర్భంగా అరెస్టు చేసిన పీడీఎస్‌యూ నేతలక ఆదివారం బెయిల్ లభించింది.

షాద్‌నగర్‌లో ఉపాధ్యాయసంఘాలు, వనపర్తిలో గౌడసంఘం, కొడంగల్‌లో విద్యుత్ శాఖ సిబ్బంది, కోస్గిలో కురుమ యాదవులు ర్యాలీలు నిర్వహించారు. పెబ్బేరులో పోలీసులు చేతికి పూలు ఇచ్చి ఉద్యమానికి సహకరించాలని జేఏసి నాయకులు కోరారు. గద్వాలలో శాంతిర్యాలీ నిర్వహించారు. అయిజలో రేషన్ డీలర్లు ర్యాలీ నిర్వహించారు. మెదక్ జిల్లాలో రైల్‌రోకో చేపట్టేందుకు జహీరాబాద్ వచ్చిన టీఆర్ఎస్ నేత భూపాల్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేటలో టీఎన్జివోలు, టీటీజేఏసి ఆధ్వర్యంలో రాస్తారోకో, మౌనప్రదర్శన నిర్వహించారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. రంగారెడ్డి జిల్లాలో రైల్‌రోకోలో పాల్గొనకుండా పలువురు జేఏసి నేతలను ముందుగానే అరెస్టు చేశారు. వికారాబాద్‌లో ఇద్దరు యువకులు పెట్రోల్‌పోసి ఆర్టీసీ బస్సులకు నిప్పంటించారు. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మర్పల్లి మండలం కొత్లాపూర్‌లో ఆర్టీసీ బస్సుపై దాడిచేసి అద్దాలు పగులగొట్టారు.

## ముట్టడిలో మంత్రులు

తెలంగాణ మంత్రులపై ముప్పేట దాడి. ఇటు సొంత పార్టీ నాయకులు, అటు తెలంగాణ జేఏసి నేతలు, మధ్యలో ప్రతిపక్ష టీడీపీ! విడివిడిగానే అయినా మూకుమ్మడిగా దాడి చేశారు. ముఖ్యమంత్రితో అంటకాగుతున్నారని ఆరోపించారు. ప్రజలు ఛీకొట్టినా పదవులను పట్టుకుని వేలాడుతున్నారని, సీమాంధ్ర ఎంపీ కావూరీ సాంబశివరావు వ్యాఖ్యలను అక్షర సత్యం చేస్తున్నారని దుమ్మెత్తి పోశారు. సమ్మెను ఉపసంహరించుకోవాలని కోరడం తెలంగాణ ప్రజలకు , ఉద్యమానికి ద్రోహం చేయడమేనని ధ్వజమెత్తారు. “తెలంగాణకు ద్రోహులు ఎవరో కాదు.. ఈ ప్రాంత మంత్రులే! వారిది శకుని పాత్ర! సమ్మె విరమించాలని చెప్పిన మంత్రులకు ప్రజలే బుద్ధి చెప్తారు. తెలంగాణవైపా? ముఖ్యమంత్రివైపా? మంత్రులు తేల్చుకోవాలి..! రాజీనామాలు చేసి వారు ఉద్యమంలోకి రావాలి!” అని మండిపడ్డారు. సమ్మెను విరమించాలని చెప్పిన జానారెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వివిధ జిల్లాల్లో ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. తక్షణమే మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇక తెలంగాణ మంత్రులే లక్ష్యంగా తమ కార్యచరణ ఉంటుందని జేఏసి చైర్మన్ కోదండరాం స్పష్టం చేశారు. రాజీనామా చేయకపోతే అమరుల శాపాలు తగులుతాయని కేసీఆర్ శపించారు

**17 అక్టోబరు 2011:**

**బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి గెలుపు**

నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో టీఆర్ఎస్ ఘనవిజయం సాధించింది. ఇన్నాళ్లు టీడీపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో టీఆర్ఎస్ తరపున పోటీచేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయకేతనం ఎగరవేశారు. కాంగ్రేస్ అభ్యర్థిపై 50వేల ఓట్ల మెజారిటీ సాధించారు అయితే, అశించినంత ఆధిక్యం రాకపోవడం గులాభీ పార్టీకి నిరాశ కలిగించింది. కాంగ్రేస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌పై సిట్టింగ్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి 49,889 ఓట్ల మెజారిటీ లభించింది.

**సమ్మెలోకి హైకోర్టు ఉద్యోగులు**

సకల జనుల సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ హైకోర్టులోని తెలంగాణ ఉద్యోగులు విధులు బహిష్కరించారు. హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తమరావు మాట్లాడుతూ.. తమ ఉద్యమం జుడిషియరీకి, న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా కాదని, సీమాంధ్ర ఉద్యోగులు తమతో కలిసి వచ్చి సహకరించాలని ఉద్యోగుల నేతలు కోరారు.

**23 అక్టోబరు 2011:**

**విరమణ బాటలో పాలిటెక్నిక్ లెక్చరర్లు**

సకల జనుల సమ్మెలో పాల్గొంటున్న పాలిటెక్నిక్‌ల అధ్యాపకులు ఆందోళన వీడి విధులకు హాజరుకానున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్ట్యా సమ్మెను వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ పాలిటెక్నిక్ గెజిటెడ్ అధికారుల, అధ్యాపకుల సంఘాలు తెలిపాయి. సచివాలయంలో శనివారం ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహతో భేటీ అనంతరం సోమవారం నుంచి(24వ తేదీ) విధులకు హాజరవుతామని వారు తెలిపారు. సెలవుకాలంలో కూడా పనిచేసి, సకాలంలో సిలబస్ పూర్తి చేస్తామని వారు హామీ ఇవ్వగా, సెలవు దినాలను కూడా ఆన్‌డ్యూటీగా పరిగణిస్తామని రాజనర్సింహ వాగ్దానం చేశారు.

**సమ్మె ఆగినా ఉద్యమం ఆగదు: కోదండరాం**

సింగరేణి దారిలో విద్యుత్ ఉద్యోగులు సమ్మె విరమిస్తారనుకున్న సమయంలో.. తెలంగాణ ఉద్యమం కొత్త మలుపు తిరిగింది. శుక్రవారం రాత్రి విద్యుత్ ఉద్యోగులు (టీఈఈ) జేఏసి యాజమాన్యంతో జరిపిన చర్చలు విఫలమవడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసి నిర్ణయించింది. టీఈఈజేఏసి సమన్వయ కర్త రఘు విద్యుత్ సౌధలో 72 గంటల నిరాహార దీక్షకు శనివారం కూర్చున్నారు. తెలంగాణ జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం మాట్లాడుతూ.. సమ్మెను భగ్నం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఒకటి రెండు సంస్థలను చూపి ఉద్యమం పని అయిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

“సమ్మె ఆగినా ఉద్యమం ఆగదు. ఉద్యమంలో ఉన్న ఏ ఒక్కరూ ఒంటరి కారు త్వరలోనే విద్యార్థులు సైతం ఉద్యమంలోకి వస్తున్నారు. నవంబర్ మొదటి వారంలో ‘తెలంగాణ మార్చ్’ నిర్వహిస్తాం” అని తెలిపారు.

ఈ దీక్షలో తెలంగాణ ఉద్యోగుల జేఏసి నేత స్వామిగౌడ్ మాట్లాడుతూ. సీమాంధ్ర అధికారులు సమ్మె భగ్నానికి కుట్ర చేస్తున్నారన్నారు. ఉద్యమం మరింత తీవ్రం అవుతుందని స్పష్టం చేశారు. అవసరమైతే మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా వంటి అత్యవసర సేవల్ని నిలిపివేయడానికి ఉద్యోగులు సిద్దంగా ఉన్నారని హెచ్చరించారు. రాష్ట్ర ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన వచ్చేవరకు ఉద్యమం కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

**24 అక్టోబరు 2011:**

**సకల జనుల సమ్మె సమాప్తం**

గత నెల 13న మొదలైన సమ్మె 42 రోజుల పాటు సాగింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేదాకా చర్చలే చర్చలు! ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఒకసారి, ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహతో రెండు సార్లు చర్చించి.. చివరగా ముఖ్యమంత్రితో సమావేశమై అక్కడి నుంచి రాజకీయ జేఏసితో సంప్రదింపులు జరిపి.. అర్ధరాత్రి సమయంలో సమ్మె విరమణపై అధికారిక ప్రకటన చేశారు. తొమ్మిది అంశాలపై సర్కారుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ‘సమ్మె తాత్కాలికంగా మాత్రమే ఆగింది. ఉద్యమం ఆగలేదు’ అని రాత్రి 11 గంటల సమయంలో జేఏసి చైర్మన్ కోదండరాం ప్రకటించారు. ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర అలాగే ఉంటుందని, ఎప్పుడు అవసరమైతే అప్పుడు తిరిగి సమ్మె చేసేందుకు ఉద్యోగ సంఘాలన్నీ సిద్దంగా ఉన్నాయని స్పష్టం చేశారు. తమకు తెలంగాణ తెచ్చే సత్తాలేదని తొలి నుంచి చెబుతూనే ఉన్నామని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తట్టి లేపడమే లక్ష్యంగా సమ్మె చేశామని స్వామిగౌడ్ ప్రకటించారు.

**ఒప్పందంలోని 9 అంశాలు ఇవే...**

1. సహాయ నిరాకరణ సందర్భంగా ఈ ఏడాది మార్చి 4న కుదిరిన ఒప్పందం ప్రకారం.. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుపై పర్యవేక్షణకు ప్రభుత్వం రిటైర్డ్ హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఒక కమీషన్ ఏర్పాటు చేస్తుంది. ఒక వేళ.. రిటైర్డ్ హైకోర్టు జడ్జి అందుబాటులో లేకపోతే, కమీషన్‌కు రిటైర్డ్ జిల్లా జడ్జి నేతృత్వం వహిస్తారు.

2. ‘ఎస్మా’ విషయానికి వస్తే.. సమ్మె కాలంలో ఈ చట్టాన్ని అమలు చేయనే లేదు. కొన్ని శాఖల్లో ఎస్మా కింద సమ్మెను నిషేధిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌ల ఉప సంహరణ విషయాన్ని సంబంధిత నిబంధనలు, ప్రస్తుత పరిస్థితుల మేరకు పరిశీలించడం జరుగుతుంది.

3. ఉద్యోగులపై నమోదైన కేసులను ఎత్తివేయాలనే అభ్యర్థనకు సంబంధించి.. ఆ ఉద్యోగి ప్రత్యక్ష ప్రమేయంలేని క్రిమినల్ కేసులను ఉపసంహరించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

4. జీవో నెంబర్ 177 రద్దు విషయంలో కోర్టు పరిధిలో ఉంది. దీనిపై ప్రభుత్వం అడ్వకేట్ జనరల్‌ను సంప్రదించి, తదుపరి చర్యలు తీసుకుంటుంది.

5. సకల జనుల సమ్మె సమయంలో జరిగిన డిప్యుటేషన్లు, ట్రాన్స్‌ఫర్లకు సంబంధించి.. తిరిగి తమను అదే స్థానాల్లో నియమించాలనే అభ్యర్థనలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలిస్తుంది.

6. సకల జనుల సమ్మెలో భాగంగా విధులకు గైర్హాజరైన కాలాన్ని 'సగం వేతనంతో కూడిన సెలవు'తో సహా, మరేదైనా సెలవుగా పరిగణించి, విధుల్లో ఉన్నట్లుగా భావించాలని ఉద్యోగులు కోరారు. ఈ విన్నపాన్ని ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ సలహా, హైకోర్టు ఆదేశాల మేరకు పరిశీలిస్తుంది.

7. నిబంధనల ప్రకారం ప్రభుత్వం 'నో వర్క్ – నో పే'ను అమలు చేయాల్సి ఉంది. అయితే.. పండుగలు, సమ్మె కాలంలో జీతాలు నష్టపోయి ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్పెషల్ అడ్వాన్స్ చెల్లిస్తుంది. ఈ స్పెషల్ అడ్వాన్స్ గరిష్టంగా ఒక నెల జీతానికి మించదు. ఈ అడ్వాన్స్‌ను తిరిగి ఎలా రికవరీ చేయాలనే దానిపై టీజేఏసితో చర్చించి నిర్ణయం తీసుకుంటుంది.

8. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగులను తిరిగి నియమించాల్సిందిగా సంబంధిత ఏజెన్సీలను ప్రభుత్వం కోరుతుంది. అది కూడా.. సమ్మె కాలంలో తీవ్ర అనుచిత ప్రవర్తనకు పాల్పడని వారిని మాత్రమే!

9. పై అంశాల నేపథ్యంలో, మంగళవారం (25.10.2011) నుంచి తిరిగి విధుల్లో చేరేందుకు టీజేఏసి అంగీకరించి, హామీ ఇచ్చింది.

**31 అక్టోబరు 2011:**

**'బక్రీద్ కే బాద్': తెలంగాణపై చిదంబరం**

'దీపావళి, బక్రీద్ తర్వాత చర్యలుంటాయని ఆజాద్ చెప్పారు కదా! బక్రీద్ తర్వాత వెంటనే నిర్ణయం దిశగా కదలిక ఉంటుంది' అని కేంద్ర హోం మంత్రి తెలంగాణ విషయమై వ్యాఖ్యానించారు. దీపావళికి కొలిక్కి వస్తుందనుకున్నారు. కానీ.. కాంగ్రెస్ బక్రీదు పండుగ ముగిసిన తర్వాత వెంటనే.. తెలంగాణపై నిర్ణయం తీసుకునే దిశగా కదులుతామని చిదంబరం ప్రకటించారు.

**01 నవంబరు 2011:**

**కోమటిరెడ్డి అమరణ దీక్ష ప్రారంభం**

మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణ కోసం ఆమరణ నిరాహార

దీక్షకు దిగారు. మంగళవారం ఆయన స్వగృహం నుంచి వేలాది మంది తెలంగాణ వాదులతో ర్యాలీగా నల్గొండ క్లాక్‌టవర్ సెంటర్ వద్దనున్న దీక్షా శిబిరానికి చేరుకున్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఆత్మబలిదానం చేసుకున్న కాసోజు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ కోమటిరెడ్డికి తిలకం దిద్ది పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. టిఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉద్యోగ జేఏసిల రాష్ట్ర నేతలు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఇప్పుడు రాకపోతే ఇంకెప్పటికీ రాదని స్పష్టం చేశారు. సకల జనుల సమ్మెతో రగిలిన వేడిని కొనసాగిం చేందుకే తాను దీక్షకు దిగానని ప్రకటించారు. ఈ మొండి ప్రభుత్వం తప్పుడు నివేదిక లు పంపడంతోనే తెలంగాణ ఏర్పాటులో జాప్యం జరుగుతోందని అన్నారు.

### ఢిల్లీలో కొండా లక్ష్మణ్ బాపూజీ సత్యాగ్రహ దీక్ష ప్రారంభం

జెండాలను, అజెండాలను పక్కన పెట్టి తెలంగాణ నేతలంతా కలిసి పోరాడితేనే ప్రత్యేక రాష్ట్రం సాకారం అవుతుందని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ అన్నారు. పదేళ్ల కాలంలో తొమ్మిది సార్లు మాట ఇచ్చి తప్పిందంటూ కాంగ్రేస్ పార్టీపై ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికైనా హామీని నిలబెట్టుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్నారు. ఇదే డిమాండ్‌తో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మంగళవారం ఆయన సత్యాగ్రహ దీక్ష ప్రారంభించారు. వారం పాటు కొనసాగనున్న ఈ దీక్షలో ఆయనతో పాటు మరో 12 మంది స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొంటున్నారు.

### 02 నవంబరు 2011:

తెరాస నాయకుడు డా॥ చెఱుకు సుధాకర్‌ను పిడి యాక్ట్ కింద నల్గొండ జిల్లాలో అరెస్టు చేసిన పోలీసులు వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

### 07 నవంబరు 2011:

### కొండా లక్ష్మణ్ బాపూజీ సత్యాగ్రహ దీక్ష విరమణ

తెలంగాణ వచ్చే వరకు స్వాతంత్ర్య సమరయోధుల సత్యాగ్రహం వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉంటుందని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రకటించారు. జంతర్‌మంతర్ వద్ద వారం రోజులుగా దీక్ష చేస్తున్న స్వాతంత్ర్య సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ, డాక్టర్ బోయినపల్లి వెంకటరమారావు, కొలను శివారెడ్డిలు తమ సత్యాగ్రహాన్ని సోమవారం విరమించారు. అనంతరం కొండా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఈనెల 10న హైదరాబాద్‌లో స్వాతంత్ర్య సమరయోధుల సమావేశం జరుగుతుందని, 13న తెలంగాణ, సీమాంధ్రులకు చెందిన అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో రౌండ్ టేబుల్ సదస్సు జరుగుతుందని ప్రకటించారు. ఈనెల 22 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు దీక్ష చేస్తారని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు దీక్ష చేస్తారన్నారు.

టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ ఏర్పాటు ముఖ్యం కాదని, ఎన్నికలే ఆయన అజెండా అని కొండా అన్నారు. టీఆర్ఎస్‌కి తెలంగాణ ముఖ్యం కాదు. లేదంటే వారు మాతోపాటు దీక్షలో కలిసేవారు. వారికి కాంగ్రేస్ నాయకులతో ఒప్పందం ఉంది. రాజీనామాలను ప్రోత్సాహించడం, ఎన్నికలు వస్తే ఓట్లు, సీట్లు, నోట్లు.. ఇదే వారికి ముఖ్యమని విమర్శించారు.

**09 నవంబరు 2011:**

**కోమటిరెడ్డి దీక్ష విరమణ**

తెలంగాణ ఏర్పాటు కోరుతూ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం మధ్యాహ్నం 1.40 గంటలకు విరమించారు. నల్గొండలో ఈనెల 1న ఆయన ప్రారంభించిన దీక్షను ఆదివారం పోలీసులు భగ్నం చేసి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా ఆయన ఆస్పత్రిలోనే దీక్షను కొనసాగించారు. దీక్ష విరమింపజేయడానికి నాలుగు రోజులుగా పార్టీ నేతలు చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. ఈమేరకు కాంగ్రేస్ ఎంపీలు కేకే, గుత్తా, రాజ్‌గోపాల్‌రెడ్డి, మందా, బలరాం నాయక్, మంత్రి సారయ్య, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జేఏసి చైర్మన్ కోదండరాం, శ్రీనివాస్‌గౌడ్ తదితరుల సమక్షంలో ఆయన దీక్ష విరమించారు. ఢిల్లీలో ఆత్మబలిదానం చేసిన యాదిరెడ్డి తల్లి చంద్రమ్మ చేతుల మీదుగా ఆయనకు నిమ్మరసం ఇప్పించారు.

**15 నవంబరు 2011:**

**ఎంపీల రాజీనామాల తిరస్కరణ**

10 మంది కాంగ్రేస్, ఇద్దరేసి టీడీపీ, టీఆర్ఎస్ సభ్యుల చొప్పున మొత్తం 14 మంది ఎంపీల రాజీనామాలు లోక్‌సభ స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. వీరిలో రాజమోహన్‌రెడ్డి తప్పించి మిగితా 13 మంది తెలంగాణ కోసమే రాజీనామా చేశామని ప్రకటించారు. వాటిపై ఆగస్టు ఒకటి లోపే నిర్ణయం తీసుకుంటామని మీరాకుమార్ చెప్పినా అలా జరగలేదు. ఆక్టోబర్‌లో కాంగ్రేస్ ఎంపీలందరినీ ఆమె ఒకసారి పిలిపించి రాజీనామాలకు కారణాలను తెలుసుకున్నారు. విడివిడిగా కూడా వారి అభిప్రాయాలు విన్నారు. అయితే రాజీనామాలు నిబంధనల మేరకు లేకపోవడం, ఎంపీలు లోక్‌సభకు రావడం, ప్రశ్నలడగడం, కమిటీ భేటీల్లో పాల్గొని విదేశీ పర్యటనలకూ వెళ్లడం, సభ్యులు చెప్పిన కారణాలతో స్పీకర్ సంతృప్తి చెందకపోవడం వంటి కారణాలతో అందులో 12 మంది రాజీనామాలను స్పీకర్ మీరాకుమార్ తిరస్కరించారు. భవనగిరి కాంగ్రేస్ ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజీనామాను పెండింగ్‌లో ఉంచారు. మరికొద్ది రోజుల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకోవడం

గమనార్హం.

**03 డిసెంబరు 2011:**

**చంద్రబాబు దండయాత్రకు అనుమతివద్దు**

రైతుపోరుబాట పేరుమీద తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు వరంగల్ జిల్లాలో చేపట్టిన దండయాత్రకు పోలీసుల అనుమతిని ఇవ్వవద్దని కోరుతూ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ జేయేసీ లేఖరాసింది.

**07 డిసెంబర్ 2011:**

పిడి యాక్ట్ కింద ప్రభుత్వం అరెస్టు చేసిన తెరాస నాయకుడు డా॥ చెఱుకు సుధాకర్‌ను 36 రోజుల జైలు జీవితం తర్వాత వరంగల్ సెంట్రల్ జైలు నుండి హైకోర్టు ఆదేశాల మేరకు విడుదలయ్యారు.

**10 డిసెంబరు 2011:**

**జేఏసీ 'తెలంగాణ జాగరణ'**

కేంద్రం తెలంగాణ ప్రకటన చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జేఏసి ఆద్వర్యంలో ఇందిరాపార్కు వద్ద శుక్రవారం రాత్రి తెలంగాణ జాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. 'ఆ పీఆర్పీ వాళ్లు ఒక్కటై మీటింగ్ పెట్టుకున్నరు ఎంతో ఎంటో ఇచ్చారట, ఎపీపీఎస్సీ పరీక్ష పేపరు లీక్ అయిందిగానీ, వారికి ఎంత ఇచ్చారో లీక్ అవల! ఎంఐఎంకైతే ఏమిచ్చారో అందరికీ తెలుసు. ఒక్క జగన్ కోసం 17 మంది ఎమ్మెల్యేలు ఎంత గట్టిగా నిలబడ్డరు. కానీ, మన ఎమ్మెల్యేలనూ చూశాం. వీళ్లకూ కొంచెం ఇచ్చారట. యాభై లక్షలు.. కొందరికైతే కోటి రూపాలయలకు పోయిందట. అరె! అవిశ్వాస తీర్మానం సమయంలో తెలంగాణ కాంగ్రేస్ ఎమ్మెల్యేలు మిగిలిన వారి మాదిరి ఒక్కటై కనీసం తమ విలువను కూడా పెంచుకోలేకపోయారని కోదండరాం ఎద్దేవా చేశారు.

**16 డిసెంబరు 2011:**

**నళిని దీక్ష విరమణ**

మాజీ డీఎస్పీ నళిని శుక్రవారం సాయంత్రం దీక్షను విరమించారు. లోక్‌సభలో తెలంగాణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈనెల 9 నుంచి ఆమె నిరవధిక దీక్ష చేపట్టారు. బీజేపి ఎంపీ ప్రకాశ్ జవదేకర్, సీపీఐ ఎంపీ అజీజ్‌పాషా, తెలంగాణ అమరవీరుల కుటుంబాల సభ్యులు కొబ్బరినీళ్లు ఇచ్చి నళిని దీక్షను విరమింపజేశారు. అనంతరం ఢిల్లీ పోలీసులు నళినిని ఆర్ఎంఎల్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా నళిని మాట్లాడుతూ.. కాంగ్రేస్ కుట్రకు బలికావద్దని దీక్ష విరమించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ జేఏసి

కన్వీనర్ రామకృష్ణారెడ్డి, పాంథర్‌పార్టీ అధ్యక్షుడు భీంసింగ్, సామాజిక తెలంగాణ ఓబీసీ జేఏసి నేత జయప్రసాద్, తెలంగాణ విద్యార్థి ఐక్యవేదిక అద్యక్షుడు కె.మహేష్ పాల్గొన్నారు.

### 18 డిసెంబర్ 2011

తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (ఇండియా) ఆధ్వర్యంలో కరీంనగర్ రెవెన్యూ గార్డెన్స్‌లో నాలుగవ ప్రవాసీ తెలంగాణ దివస్ కార్యక్రమం.

### 06 జనవరి 2012:

రైతుపోరుబాట పేరుమీద వరంగల్ జిల్లా పాలకుర్తిలో చంద్రబాబు దండయాత్ర

### తెలంగాణవాదులపై బాబు ఆగ్రహం

'చిల్లర పనులు చేస్తే చిల్లర మనుషులుగా మిగులుతారు తప్ప.. ఇంకేం లేదు.. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదు' అంటూ తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుదు తెలంగాణవాదులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు పోరుబాట కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా పాలకుర్తిలో శుక్రవారం సాయంత్రం జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. ఉద్రిక్త పరిస్థితుల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పాలకుర్తిలో సభ నిర్వహించారు. చంద్రబాబు లేచి నిలబడి మైక్ అందుకోగానే ఒక్కసారిగా లేచి నిలబడ్డారు. సభలో అలజడి చెలరేగింది. ప్రజలు లేచి నిలబడి జై తెలంగాణ అంటూ నినాదాలు చేస్తూ, జెండాలు ప్రదర్శించారు. చెప్పులు, బూట్లు, వాటర్ బాటిళ్లు విసిరారు. ఒక చెప్పు వేదికపై పడింది. దీంతో చంద్రబాబు తీవ్ర అసహనానికి లోనై.. 'మీ దాడులకు మేం భయపడం. ఇక్కడే మా కార్యకర్తలు సైతం ఉన్నారు' అంటూ వారిని బెదిరించారు. చంద్రబాబు మాట్లాడేటప్పుడు చెప్పులు, బూట్లు విసిరిన కేయూ జేఏసి, తెలంగాణవాదులను బాబు వెంట వచ్చిన పచ్చదండు చితక్కొట్టింది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుంటుండగానే.. మరోవైపు విద్యార్థుల చొక్కాలు చింపి.. కిందపడేసి కాళ్లతో తొక్కి విచక్షణ రహితంగా దాడి చేశారు. మహిళలను సైతం వదిలిపెట్టలేదు. దీంతో ఒక మహిళ స్పృహ తప్పి పడిపోయింది. ఈ కారణంగా సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.

### చంద్రదండు స్వైరవిహారం ... లాఠీచార్జీల మధ్య చంద్రబాబు పర్యటన

ఓరుగల్లు జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుదు శుక్రవారం నిర్వహించిన రైతు పోరుబాట.. జనంపై పోరుబాటగా మారింది! హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు ఖాకీల లాఠీచార్జీలు.. బాష్పవాయుగోళాలు.. చంద్రదండు దాడులతో హోరెత్తిపోయింది. రోడ్లపై రయ్.. మంటూ దూసుకెళ్లిన ఓపెన్ టాప్ జీపులు.. వాటిలో చంద్రసేన అరుపులు.. నినాదాలు.. వారి చేతుల్లో దుడ్డుకర్రలు.. రాడ్లు జనాన్ని బెంబేలెత్తించాయి. మొత్తమ్మీద రైతుల కోసం అంటూ జరిపిన ఈ పోరుబాటలో

దారిపొడవునా రైతులు, సామాన్య ప్రజలు ఎక్కడా కనిపించలేదు. యాత్ర ఆసాంతం బారులు తీరిన వాహనాలు.. వాటినిండా నాయకులు.. పార్టీ శ్రేణులు దర్శనమిచ్చాయి. 150 వాహనాలతో యాత్రకు వచ్చిన బాబుకు జనగామ చేరేటప్పటికీ కాన్వాయ్‌లో వెయ్యికిపైగా వాహనాలు చేరాయి. నల్గొండ జిల్లా ఆలేరులో, వరంగల్ జిల్లా జనగామలో తెలంగాణవాదులు, టీఆర్ఎస్ నేతలు బాబును నిలదీసి ప్రయత్నం చేసినా పోలీసు బలగాలు, చంద్రదండు విచక్షణారహితంగా దాడులకు దిగాయి. ఉదయం తార్నాకలో నిరసన తెలిపిన ఓయూ విద్యార్థులపై పోలీసులు 9 రౌండ్ల బాష్పవాయు ప్రయోగించారు. జనగామలో బాబు కాన్వాయ్‌పై తెలంగాణవాదులు రాళ్ల వర్షం కురిపించారు. పోలీసులు వారిపై లాఠీచార్జి చేశారు.

లక్ష్మక్కపల్లి దాటిన తర్వాత వచ్చిన జేకే తండాలో వేరుశనగ పంటను పరిశీలించడానికి చంద్రబాబు ఓ పొలంలోకి వెళ్లారు. చంద్రబాబుకు సెక్యూరిటీగా పోలీసులు, నేతలు, కార్యకర్తలు కూడా ఆ చేనులోకి వెళ్లారు. వీరి తొక్కుడుతో పంటంతా నాశనమైంది. కొందరు నేతలు వేరుశనగ కాయలను పీకి తిన్నారు. దాని పక్కనే ఉన్న కంది చేనును కూడా టీడీపీ కార్యకర్తలు లూటీ చేశారు. బాబు పోరుబాటకు వరంగల్ జిల్లాలో వేల సంఖ్యలో పోలీసు బలగాలు రక్షణ కల్పించాయి. మొత్తం 4 వేలకు పైగా సిబ్బందిని కేటాయించారు. వీరిలో అదనపు ఎస్పీ 1, డీఎస్పీలు 12, సీఐలు 44, ఎస్సైలు 117, ఏఎస్సైలు/హెడ్‌కానిస్టేబుళ్లు 200, కానిస్టేబుళ్లు 1588, మహిళా కానిస్టేబుళ్లు 83, హోంగార్డులు 600, క్విక్ రియాక్షన్ టీమ్ 800, ఆర్పీఎఫ్ 108, సీఆర్పీఎఫ్ 800, జిల్లా గార్డులు 300 ఉన్నారు. వీరితోపాటు సీమాంధ్ర జిల్లాలనుండి తరలించుకున్న వందలాదిమంది 'చంద్రదండు' కార్యకర్తలు కూడా ఆయనకు రక్షణగా పనిచేసారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళితుల సాధికారికత అంశంపై సదస్సు..

ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ పారిశ్రామిక ప్రాంతంలో ర్యాలీ, బహిరంగసభ నిర్వహించారు.

**07 జనవరి 2012:**

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం డైరీ-2012 ఆవిష్కరణ

**08 జనవరి 2012:**

తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సు, టివివి-2012 డైరీ ఆవిష్కరణ

**10 జనవరి 2012:**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో వైసీపీ నేత బాజిరెడ్డి గోవర్దన్ ఆధ్వర్యంలో వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి రైతు సమస్యలపై ఓదార్పు దీక్ష, తీవ్రంగా ప్రతిఘటించిన తెలంగాణ ఉద్యమకారులు – పోలీసుల దౌర్జన్యం. జేయేసీ చైర్మెన్ గోపాల్‌శర్మ గృహనిర్భంధం, జేయేసీ అధికార ప్రతినిధి వి. ప్రభాకర్‌తోసహా పలువురు న్యూడెమెక్రసీ నాయకులను అరెస్టు చేసిన ఆర్మూర్ పోలీసులు.

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బిఎస్ఎన్ఎల్ జేయేసీ ఏర్పాటు సభ.

**12 జనవరి 2012:**

వైఎస్ జగన్ ఓదార్పుదీక్షా శిబిరంపై మహిళా ఉద్యమకారులు, యువకులు దాడి, తీవ్ర ఉద్రిక్తత. ఉద్యమకారులపై కర్రలతో దాడిచేసిన జగన్, బాజిరెడ్డిగోవర్దన్ అనుచరులు – మధ్యలోనే దీక్షాశిబిరాన్ని ఎత్తివేసిన నిర్వాహకులు

**15 జనవరి 2012:**

జేయేసీ వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ కోలా జనార్ధన్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు. ప్రమాదంలో ఒక కన్నును శాశ్వితంగా కోలోయిన జనార్ధన్ – ఆసుపత్రిలో పలువురి పరామర్శ.

**19 జనవరి 2012:**

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'తెలంగాణ పోరు యాత్ర' ప్రారంభం

తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్, జిల్లా అధ్యక్షుడు ఎ. విజయకుమార్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లాలో మాంగనీస్ గనుల అక్రమ తవ్వకాలపై అధ్యయనం.

**20 జనవరి 2012:**

బంజారాహిల్స్, రోడ్‌నెంబర్ 14లోని లోటస్‌పాండ్‌లో తెలంగాణ జేయేసీ విస్రృతస్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం, హాజరైన కెసీఆర్ – భవిష్యత్తు ఉద్యమ రూపాలపై విస్తృతచర్చ. రాష్ట్ర సాధన ఉద్యమంపై మేథోమథనం జరగాలని కెసీఆర్ సూచన. చర్చను రెండవరోజుకూడా కొనసాగించాలని సూచన.

**21 జనవరి 2012:**

లోటస్‌పాండ్‌లో రెండవరోజు కొనసాగిన తెలంగాణ జేయేసీ విస్తృతస్థాయి స్టీరింగ్‌కమిటీ సమావేశం. రాష్ట్రస్థాయి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయం. సమావేశంలో కెసిఆర్, కోదండరామ్, అల్లం నారాయణ, మల్లేపల్లి లక్ష్మయ్య, ఈటల రాజేందర్, హరీష్‌రావు, కెటిఆర్, కవితతోపాటు పలువురు ప్రముఖుల హాజరు.

**31 జనవరి 2012:**

తెలంగాణలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు జేయేసీ ఆధ్వర్యంలో ధర్నాలు.

**03 ఫిబ్రవరి 2012:**

రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో రూపొందిన 'యమలోకంలో జై తెలంగాణ' సినిమా విడుదల.

**09 ఫిబ్రవరి 2012:**

**ముగిసిన బీజేపి 'తెలంగాణ పోరుయాత్ర'**

తెలంగాణ రాష్ట్ర సాధనకోసం బీజేపీ చేపట్టిన తెలంగాణ పోరుయాత్ర గురువారం భద్రాచలంలో లాంఛనంగా ముగిసింది. తెలంగాణ తమతోనే సాధ్యమన్న నినాదంతో గత నెల 19న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రారంభించిన యాత్ర తొమ్మిది జిల్లాల గుండా 22 రోజుల పాటు సాగింది. భద్రాద్రి రాముని పూజలు, గోదావరి తల్లి విగ్రహావిష్కరణ, స్థానిక నాయకత్వంతో భేటి అనంతరం పట్టణంలో పార్టీ నేత శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన బహిరంగసభా జరిగింది. జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం, సీనియర్ సంపాదకులు పొత్తూరి వెంకటేశ్వర్‌రావు, విద్యుత్ సంఘాల జేఏసి నేత రఘు, పార్టీ నేతలు బండారు దత్తాత్రేయ, వై.లక్ష్మీనారాయణ, వివిధ సంఘాల నేతలు ప్రసంగించారు. సభలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు రావెళ్ల వెంకట రామారావు, సుగుణ దంపతులను సన్మానించారు. తెలంగాణకు అడ్డంకిగా ఉన్న కాంగ్రేస్, టీడీపీలను గ్రామాల నుంచి పారదోలి జేఏసీలను ఏర్పాటు చేసుకోవాలని కోదండరాం పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పడితే ఢిల్లీ స్థాయిలో బేరసారాలు కుదరవనే ల్యాంకో రాజ్‌గోపాల్ లాంటి సీమాంధ్ర కాంట్రాక్టర్లు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సకల జనుల సమ్మె స్ఫూర్తితో గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ఉద్దేశించిన శ్రీకృష్ణ కమిటీ నివేదికలోని 8వ అధ్యాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మూడు తరాల ఉద్యమాన్ని ముంచేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదన్నారు. కాంగ్రేస్ బుద్ధి తెచ్చుకుని ఇప్పుడైనా తెలంగాణ ఇవ్వకపోతే 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చి ఇస్తామని దత్తాత్రేయ చెప్పారు.

**14 ఫిబ్రవరి 2012:**

తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఓపెన్‌కాస్ట్ బొగ్గగనుల ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన నాయకులు. బాధితులతో ప్రత్యేక సమావేశాలు. టీవీవీ నాయకులు పిట్టల రవీందర్, గురిజాల రవీందర్ రావు, పొడెటి సంజీవ్, తదితరులతోకూడిన ఈ బృందం శ్రావణ్‌పల్లి, ఇందారం, తదితర ఓపెన్‌కాస్ట్ ప్రభావిత గ్రామాలను సందర్శించారు.

**16 ఫిబ్రవరి 2012:**

**ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల**

రాష్ట్రంలో ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. మార్చి 18న ఉప ఎన్నికలు జరుగుతాయి. ఫలితాలు మార్చి 21న వెలువడుతాయి. ఈనెల 22న నోటీఫికేషన్ జారీ అవుతుంది. రాష్ట్రంలోని 5 జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఏడు శాసనసభ స్థానాలు.. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, కొవ్వూరు, స్టేషన్ ఘన్‌పూర్, కొల్లాపూర్, అదిలాబాద్, కామారెడ్డిలో ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో నెల్లూరు జిల్లాలోని ఒక్క కొవ్వూరు స్థానం తప్పించి మిగితావన్నీ తెలంగాణ జిల్లాలోనివి కావడం గమనార్హం.

**ఉద్యోగులకు అండగా పోరాడుతాం: జేఏసీ**

సకల జనుల సమ్మెలో పాల్గొన్న తెలంగాణ ఉద్యోగులకు అండగా పోరాడాలని టీజేఏసీ నిర్ణయించింది. జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాం అధ్యక్షతన గురువారం స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సకల జనుల సమ్మె విరమణ సందర్భంగా ఉద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయకపోగా వేధింపులను పెంచుతున్నదని పలువురు ఉద్యోగసంఘాల నేతలు చెప్పారు. ఈ విషయమై సమ్మె చేస్తామంటూ ప్రభుత్వానికి నోటీసు అందజేశామన్నారు. మార్చి 3, 4 తేదీల్లో జరిగే కలెక్టరేట్ల ముట్టడిని, 6న ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను భారీగా చేపట్టాలని నిర్ణయించారు. మార్చి రెండో వారం తర్వాత జరిగే ఉద్యోగ సంఘాల పోరాటాన్ని పెద్దఎత్తున చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

**19 ఫిబ్రవరి 2012:**

తెలంగాణ సాధన కోసం తెలంగాణ నెటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.

**21 ఫిబ్రవరి 2012:**

**జేఏసీలో పాలమూరు లొల్లి**

తెలంగాణ జేఏసీలో పాలమూరు లొల్లి కొనసాగుతోంది. ఉప ఎన్నికలు జరిగే ఐదు స్థానాలపై జేఏసీలోని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నా ఒక్క మహబూబ్‌నగర్ స్థానంపై టీఆర్ఎస్, బీజేపీలు పట్టువీడడం లేదు. దీంతో ఈ రెండు పార్టీల మధ్య సమన్వయం కుదర్చడానికి జేఏసీ స్టీరింగ్ కమిటీ మంగళవారం సమావేశమైంది. దీనికి చైర్మన్ కోదండరాం అధ్యక్షత వహించగా, టీఆర్ఎస్, బీజేపీ, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ విషయమై జేఏసీ నేతలు జోక్యం చేసుకుని ప్రధాన పార్టీల మధ్య ఐక్యత దెబ్బతింటే ఉద్యమానికి విఘాతం కలుగుతుందని, టీఆర్ఎస్, బీజేపీ

నేతలు కలిసి చర్చించుకుని ఏకాభిప్రాయానికి రావాలని సూచించారు. పార్టీల అగ్రనేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఇరుపార్టీల ప్రతినిధులు చెప్పారు.

**23 ఫిబ్రవరి 2012:**

ఉపఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ నేటినుండి ప్రారంభం

**24 ఫిబ్రవరి 2012:**

ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో తెలంగాణలో వందేళ్ల దళిత ఉద్యమ చరిత్ర పై ప్రత్యేక సదస్సు.

**29 ఫిబ్రవరి 2012:**

నామినేషన్ల దాఖలుకు చివరిరోజు–ముగిసిన నామినేషన్ల పర్వం

**01 మార్చి 2012:**

తెలంగాణ జేయేసీ ముఖ్య నాయకులతో భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులతో ఎన్.కె.ఎం. గ్రాండ్ హెూటల్‌లో ప్రత్యేక సమావేశం. పలు అంశాలపై చర్చ.

**08 మార్చి 2012:**

తెలంగాణ వ్యాపితంగా హెూలీ వేడుకలు, ఉద్యమస్ఫూర్తితో నిర్వహించిన జేయేసీలు

**10 మార్చి 2012:**

**మిలియన్ మార్చ్‌కు ఏడాది**

మిలియన్ మార్చ్‌కు ఏడాది దాటిన సందర్భంగా రూపొందించిన 'తెలంగాణ మిలియన్ మార్చ్' పుస్తకాన్ని ట్యాంక్‌బండ్‌పై ఉన్న సురవరం ప్రతాపరెడ్డి విగ్రహం వద్ద ఆవిష్కరిస్తామని తెలంగాణ జేఏసీ, తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ప్రకటించాయి. దీని కవరేజీ కోసం అక్కడకు వెళ్లిన మీడియా ప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు. ఏదోవిధంగా విగ్రహం వద్దకు చేరుకున్న విలేకరులను అదుపులోకి తీసుకున్నారు. మీడియాను నియంత్రించడంపై నిలదీసిన జర్నలిస్టుల పట్ల దురుసుగా వ్యవహరిస్తూ, పోలీసు వాహనాల్లోనే నిర్బంధించి ట్యాంక్‌బండ్ బయట వదిలేశారు. ఇంతలో అటుగా వాహనంలో వెళ్తున్న తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌గౌడ్‌ను పోలీసులు వెంటాడారు. సురవరం విగ్రహం దాటిన తర్వాత వాహనాన్ని ఆపారు. తనను వెంటబడి ఆపాల్సిన అవసరం ఏంటని ఆయన నిలదీయడంతో పోలీసులు మిన్నకుండిపోయారు. ట్యాంక్‌బండ్‌పై వేలాదిమంది పోలీసులు యూనిఫారంలోనూ, మఫ్టీలోనూ మోహరించారు. సురవరం విగ్రహాన్ని రోప్‌పార్టీతో చుట్టుముట్టారు. తెలంగాణవాదులు

ఎవరూ ఆ దరిదాపుల్లోకి రాకుండా జాగ్రత్తపడ్డారు. అయితే వేలాదిమంది భద్రతాదళాల పోలీసులకన్నుగప్పి ద్విచక్రవాహనంపై ట్యాంక్‌బండ్‌పైన అంబేడ్కర్ విగ్రహంవద్దకు చేరుకున్న జేఏసి సమన్వయకర్త పిట్టల రవీందర్ సాయుధపోలీసులు అడ్డుకుంటున్నప్పటికీ 'మిలియన్‌మార్చ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసులు జేయేసీ నాయకులు పిట్టల రవీందర్, శేషురాంనాయక్, విజయకుమార్, తదితరులను అక్కడే అరెస్టు చేశారు. వారిని పోలీసు వాహనాల్లో నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వేలాదిమంది పోలీసులు ట్యాంక్‌బండ్‌ను చుట్టుముట్టినా అక్కడికి ఊపేగింపుగా చేరుకున్న తెలంగాణ ఉద్యమకారులు సురవరం ప్రతాపరెడ్డి విగ్రహం దగ్గరనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సామాన్య పౌరుల్లాగానే కార్లు మార్చి కొందరు, మోటారుబైకులపై మరికొందరు తెలంగాణవాదులు ఒక్కసారిగా సురవరం విగ్రహం దగ్గరకు చేరుకున్నారు. ప్రొ.హరగోపాల్, జేఏసీ కో–చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య, నేతలు శ్రీధర్‌రావు దేశ్‌పాండే, జర్నలిస్టుల సంఘాల నేతలు రమణ, పల్లె రవికుమార్ తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 'జై తెలంగాణ' అని నినదించారు. తేరుకున్న పోలీసులు వారిని కూడా అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంటతర్వాత వారందరినీ స్వంతపూచీకత్తుపై విడుదల చేసారు. అనంతరం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'మిలియన్ మార్చ్' స్ఫూర్తి సభను నిర్వహించి, పోలీసులు ఉద్యమకారులపై అమలు జరుపుతున్న నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు.

**16 మార్చి 2012:**

హుజూరాబాద్ డివిజన్‌లోని మాణిక్యాపూర్‌లో కామ్రేడ్ సాహు 19వ వర్ధంతి సభ, హాజరైన విద్యావంతుల వేదిక నాయకులు పిట్టల రవీందర్, ఆవునూరి సమ్మయ్య, జె. రవీందర్, ముక్కెరరాజు తదితరులు.

**18 మార్చి 2012:**

ఉపఎన్నికల పోలింగ్

**21 మార్చి 2012:**

**ఉప ఎన్నికల ఫలితాలు**

అధికార కాంగ్రెస్, విపక్ష టీడీపీలను ఉప పోరులో ఓటర్లు ఉతికి ఆరేశారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా అధికారంలో కొనసాగుతూ వస్తున్న ఆ రెండు పార్టీలనూ మూకుమ్మడిగా తిరస్కరించారు. తెలంగాణలో కారు, ఆటో దెబ్బకు చేయి చితికిపోయింది. సైకిల్ నుజ్జునుజ్జయింది. ఆరు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్, బీజేపీలతో పాటు స్వతంత్ర అభ్యర్థి నాగం జనార్ధన్‌రెడ్డి కొట్టిన చావుదెబ్బకు టీడీపీ, కాంగ్రెస్‌లు ఆగమయ్యాయి. తెలంగాణలో ప్రత్యేక వాదం గెలిచింది. టీఆర్ఎస్ నాలుగు స్థానాలను దక్కించుకోగా.. బీజేపీ ఒక స్థానంతో పాటు నాగం ఒక స్థానంలో

విజయబావుటా ఎగరేశారు. అదిలాబాద్, కామారెడ్డి, కొల్లాపూర్, స్టేషన్‌ఘన్‌పూర్ సీట్లు టీఆర్ఎస్ కైవసమయ్యాయి. మహబూబ్‌నగర్‌లో టీఆర్ఎస్‌కు షాకిస్తూ బీజేపీ అనూహ్యంగా విజయం సాధించింది. నాగర్‌కర్నూల్‌లో నాగం జనార్ధన్‌రెడ్డి దెబ్బకు టీడీపీ చిత్తయింది.

### 24 మార్చి 2013:

### తెలంగాణ కోసం భోజ్యానాయక్ ఆత్మహత్య

తెలంగాణ కోసం మరో బలిదానం. లునావత్ భోజ్యానాయక్ అనే ఎంబీఏ విద్యార్థి హన్మకొండలో శనివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జరుగుతున్న జాప్యం, స్థానిక టీడీపీ, కాంగ్రెస్ నేతల తీరుపై కలత చెంది.. 'ఐ వాంట్ తెలంగాణ' 'జై తెలంగాణ' అని నినదిస్తూ స్థానిక సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు, విద్యార్థులు తెలిపారు. వెంటనే ఆయనపై ఇసుక చల్లి మంటలార్పారు. పోలీసులు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి ఎనిమిదిన్నర సమయంలో మృతి చెందాడు. మరణానికి గంట ముందు చివరి మాటల్లో కూడా తెలంగాణ కోసమే తపించాడు. తన ఆత్మహత్యకు తెలంగాణ టీడీపీ, కాంగ్రెస్ నేతల తీరే కారణమన్నారు. తుదిశ్వాసకు గంట ముందు ఆయన మాటలు.. "తెలంగాణ తప్ప నాకింకేమొద్దు. ఎన్నో ఏండ్ల నుంచి కష్టనష్టాలకు ఎదురు నిలిచినం. ఎంత సదువుకున్నా ఉద్యోగాలొస్తలెవ్వు. నా చావుతోనన్న తెలంగాణ ఇవ్వాలె. కాంగ్రెస్, టీడీపీ నేతల తీరు వల్లనే నేను ఆత్మహత్యకు ప్రయత్నించిన. ముఖ్యంగా వరంగల్ నేతలు గండ్ర వెంకటరమణారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు మాటలు నన్ను బాగా బాధించినై. ఒంట్లో ఓపిక, శక్తి లేకున్నా జై తెలంగాణ అంటున్న. నా చావుతోనన్న కేంద్రం దిగి రావాలె. ప్రత్యేక రాష్ట్రమియ్యాలె" అని అన్నారు. బోజ్యాకు ప్రస్తుతం పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఇంతలోనే ఇంత ఘాతుకం జరిగిపోయిందంటూ తల్లిదండ్రులు మంగ్తి, నామానాయక్ గుండెలవిసేలా రోదిస్తున్నారు. 'గట్క, తాటిపండ్లు, బుక్కెడంత బువ్వ తిని, ఓ పూట ఉపాసముండి కొడుకును ఇంత పెద్దగ సదివించిన. ఎట్లనన్న కాపాడుండ్రయ్యా' అంటూ ఆ మాతృమూర్తి ఎంజీఎం డాక్టర్ల కాళ్లావేళ్లా పడటం చూసి అంతా కంటతడి పెట్టారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఫత్తేపూర్ శివారు లూనావత్ తండాకు చెందిన నామా, మూడేళ్ల క్రితం వీఆర్ తండాకు వలసవచ్చాడు. ఎకరం భూమిని సాగు చేసుకుంటూ కూలీకి వెళ్తూ కొడుకులను చదివిస్తున్నాడు. మంగ్తి లూనావత్ తండాలో వార్డు సభ్యురాలిగా(టీఆర్ఎస్) కూడా పని చేశారు.

### జేఏసీ బంద్ పిలుపు

భూక్యా మృతికి సంతాపసూచకంగా ఆదివారం తెలంగాణ బంద్‌కు కాకతీయ

వర్సిటీ జేఏసీ పిలుపునిచ్చింది. తెలంగాణ కాంగ్రెస్, టీడీపీ నేతల వైఖరితోనే విద్యార్థులు, యువకులు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని జేఏసీ చైర్మన్ సాధు రాజేశ్ మండిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా వ్యాపార, వాణిజ్య తదితర వర్గాలన్నీ స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు. టీజేఏసీ జిల్లా చైర్మన్ ప్రొ.టి.పాపిరెడ్డి కూడా ఆదివారం వరంగల్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు.

**25 మార్చి 2013:**

**భోజ్యానాయక్ అంతిమయాత్రలో ఉద్రిక్తత**

తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకున్న వరంగల్ జిల్లాకు చెందిన ఎంబీఏ విద్యార్థి భోజ్యానాయక్ అంతిమయాత్ర ఆదివారం ఉద్రిక్తతల మధ్య సాగింది. ఓ వైపు అంతిమయాత్ర, మరోవైపు నగరంలోని కాంగ్రెస్ టీడీపీ నేతల ఇళ్లు, కార్యాలయా లపై దాడుల పరంపర కొనసాగుతూ వచ్చింది. శనివారం రాత్రి ఆత్మబలిదానం చేసుకున్న బోజ్యానాయక్ మృతదేహానికి ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం ఉదయం పోస్ట్‌మార్టం నిర్వహించారు. అక్కడ బోజ్యాకుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన టీడీపీ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు సోదరుడు ప్రదీప్‌రావుపై దాడితో ఆరంభమైన ఆందోళన పథం.. నాయక్ మృతదేహం హన్మకొండ అమరవీరుల స్థూపం చేరేవరకు సాగింది. అక్కడ గండ్ర వెంకటరమణారెడ్డి ఇంటిపై ఆందోళనకారులు రాళ్లతో దాడికి దిగారు. ఇంటిలో ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం డీసీసీ భవన్‌పై కూడా నిరసనకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. మహిళలు కాంగ్రెస్‌పార్టీ ఫ్లెక్సీలను చించి పారేశారు. రెవెన్యూ గెస్ట్‌హౌజ్ సమీపంలో బృందాలుగా విడిపోయిన ఆందోళనకారులు మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంటిపై దాడి చేసారు. రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణికి చెందిన హోటల్‌పై రాళ్లతో దాడి చేసారు. మార్గమధ్యంలో రాజీవ్‌గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలపై కూడా రాళ్లు, చెప్పులతో దాడులు చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు పలుమార్లు ఆందోళనకారులపై లాఠీచార్జీ చేశారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం బోజ్యానాయక్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. సంతాపసూచకంగా వరంగల్ జిల్లా బంద్ ప్రశాంతంగా సంపూర్ణంగా ముగిసింది.

**26 మార్చి 2012:**

తెలంగాణ వ్యాపితంగా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల దిష్టిబొమ్మల దహనం. హన్మకొండలో ఆటోడ్రైవర్ రాజమౌళి సజీవదహనానికి యత్నం. హిమాయత్‌నగర్‌లోని ప్రజాఫ్రంట్ కార్యాలయంలో గద్దర్, వేదకుమార్, తదితర నాయకులను కలిసిన జేయేసీ నాయకులు కోదండరామ్, పిట్టల రవీందర్.

**27 మార్చి 2012:**

తెలంగాణ ఏర్పాటు విషయంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యవైఖరికి నిరసనగా తెలంగాణ వ్యాపితంగా బంద్. ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరుతూ తెలంగాణ వ్యాపితంగా అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి.

**03 ఏప్రిల్ 2012:**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో అమరవీరుల స్థూపం నుండి ధర్నాచౌక్ (గీతా భవన్ చౌరస్తా) వరకు జిల్లా జేయేసీ ఆధ్వర్యంలో శాంతిర్యాలీ. బహిరంగసభ. పాల్గొని ప్రసంగించిన రాష్ట్ర జేయేసీ కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్, జిల్లా జేయేసీ చైర్మన్ బొత్తా వెంకటమల్లయ్య, తదితరులు.

**04 ఏప్రిల్ 2012:**

శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని కాంగ్రేస్, టీడీపీ ఎమ్మెల్యేలకు ఈనెల 24వ తేదీ జేఏసీ డెడ్‌లైన్. తిరస్కరించిన రెండు పార్టీల నేతలు.

ఈనెల 24వ తేదీలోగా తెలంగాణపై కాంగ్రేస్, టీడీపీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని తెలంగాణ జేఏసీ డిమాండ్ చేసింది. తెలంగాణ జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం హైదరాబాద్‌లో బుధవారం చైర్మన్ కోదండరాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నాయిని నర్సింహారెడ్డి, డాక్టర్ రాజేశ్వర్‌రావు, కె.గోవర్ధన్, జేఏసీ నేతలు స్వామిగౌడ్, దేవిప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, విఠల్, దయాకర్, కత్తి వెంకటస్వామి, పిట్టల రవీందర్ తదితరులు హాజరయ్యారు. సమావేశ నిర్ణయాలను కోదండరాం మీడియాకు వివరిస్తూ.. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యేలోపు కాంగ్రేస్, టీడీపీలు తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తెలంగాణపై మోసం చేస్తున్న కాంగ్రేస్‌ను, దాగుడు మూతలాడుతున్న టీడీపీని లక్ష్యంగా చేసుకుని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని కోదండరాం హెచ్చరించారు. ఆ రెండు పార్టీల వైఖరిని నిరసిస్తూ ఈనెల 10 నుంచి 20 దాకా ర్యాలీలు, నిరసన ప్రదర్శన చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జానారెడ్డిలే ఆత్మహత్యలకు బాధ్యులని కోదండరాం పేర్కొన్నారు. రాయల తెలంగాణ అంటూ తేనెతుట్టును కదిలించొద్దని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని చెప్పారు.

**11 ఏప్రిల్ 2012:**

తెలంగాణ జేయేసీ రాష్ట్ర కమిటీ తరఫున రంగారెడ్డి జిల్లా వికారాబాద్, తాండూర్, పరిగి, చేవెళ్ల మీదుగా 'ఉద్యమ యాత్ర' ప్రారంభం

**12 ఏప్రిల్ 2012:**

తెలంగాణ జేయేసీ 'ఉద్యమ యాత్ర' రెండవరోజు మెదక్ జిల్లాలో పర్యటన.

**01 మే 2012:**

**కోదండరాంను దించేద్దాం... కేసీఆర్ అన్నది నిజమే..**

తెలంగాణ జేఏసీ చైర్మన్ పదవి నుంచి కోదండరాంను దించేద్దామని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిపాదించిన మాట నిజమేనని జేఏసీ భాగస్వామ్య సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు పోటు సూర్యం ధ్రువీకరించారు. ఈ మేరకు టీఆర్ఎస్ చీఫ్ నాలుగైదు జిల్లాల జేఏసీ చైర్మన్లకు ఫోన్లు చేసింది కూడా వాస్తవమేనని స్పష్టం చేశారు. జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు కూడా అయిన సూర్యం సోమవారం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ వైఖరిపై విరుచుకుపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భాగస్వామి జేఏసీలోని మూడు పార్టీల్లో ఒకటైన న్యూడెమాక్రసీ, కేసీఆర్‌పై బహిరంగంగా ధ్వజమెత్తడం ఇదే తొలిసారి. 'జేఏసీ అనేది ఒక ఉమ్మడి వేదిక. జేఏసీ దాని చైర్మన్ కోదండరాం.. ఎప్పుడూ స్వతంత్రంగానే ఉండాలి. అందుకు భిన్నంగా మా పార్టీకి జేఏసీ అనుబంధం.. మేం చెప్పిందే చేయాలని ఎవరైనా చెబితే.. అది దాని స్వతంత్రతను ధ్వంసం చేయడమే అవుతుంది. ఇలాంటి చర్యల్ని మా పార్టీ అంగీకరించదు. అలాగే తనపై పెత్తందారి విధానాలను రుద్దాలని ప్రయత్నించే వారిని జేఏసీ గట్టిగా ప్రశ్నించకపోతే, దానికి పుట్టగతులుండవు. నేడు జేఏసీ ప్రశ్నించకుండా ఉండే పరిస్థితి లేదు. కచ్చితంగా ప్రశ్నిస్తుంది. ఎవరో ఒకరి అజమాయిషీని జేఏసీ భరించే పరిస్థితి లేదు' అని సూర్యం చెప్పారు.

**02 మే 2012:**

**పరకాలపై జేఏసీ సమాలోచనలు**

జేఏసీ చైర్మన్‌ను మార్చేద్దామని కేసీఆర్ పిలుపు ఇచ్చినట్లు కథనాలు వచ్చిన నేపథ్యంలో ఇటీవల జేఏసీ కోర్‌కమిటీ అత్యవసరంగా భేటీ అయింది. ఏయే జిల్లాల జేఏసీ చైర్మన్‌లను కేసీఆర్ పిలుపు అందిందో వారందరినీ హైదరాబాద్‌కు పిలిపించి చర్చించారు. సికింద్రాబాద్ లోని తెలంగాణ ఫిలించాంబర్‌లో సమావేశమయ్యారు. జేఏసీపై కేసీఆర్ వైఖరి, ఇటీవలి తెలంగాణ ఉద్యమ పరిణామాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాంతో పాటు మల్లెపల్లి లక్ష్మయ్య, స్వామిగౌడ్, పిట్టల రవీందర్, విఠల్, దేవిప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, రఘు, నల్గొండ, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాల జేఏసీ చైర్మన్లు వెంకటేశ్వర్లు, పాపిరెడ్డి, సీతారామారావు, ఆశోక్‌కుమార్, గోపాల్‌శర్మ ఈ భేటీకి హాజరయ్యారు. తెలంగాణ నినాదాన్ని వినిపించే పార్టీలన్నీ ఒక్కతాటిపై నిలవడం ద్వారా ప్రజలకు ఐక్యతా సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉందని జేఏసీ అభిప్రాయ పడింది. వాటిని అలా నిలపడానికి జేఏసీ ప్రయత్నించాలని, లేకపోతే తానే రంగంలోకి దిగి వాటి మద్దతును పొందేందుకు సిద్ధపడాలని ఇందులో స్థూలంగా ఒక నిర్ణయం

తీసుకున్నారు. ఇందులో భాగంగా అవసరమైతే పరకాల ఉప ఎన్నికలో అన్ని పార్టీల తరపున ఉమ్మడి అభ్యర్థిని నిలిపేందుకు టీఆర్ఎస్, బీజేపీ సహా జేఏసీ భాగస్వామ్య పార్టీలను ఒప్పించాలని, అది కుదరనపుడు జేఏసీ తరపున అభ్యర్థిని ప్రకటించాలని, అదీ సాధ్యం కాకపోతే పాలమూరు తరహాలో తటస్థంగా ఉండాలని జేఏసీ నిర్ణయించింది.

**04 మే 2012:**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డితో జేయేసీ నేతలు కోదండరామ్, పిట్టల రవీందర్, తదితరుల ప్రత్యేక సమావేశం. పరకాల ఉప ఎన్నికల్లో జేయేసీ అనుసరించబోయే వైఖరిపై చర్చించినట్లు సమాచారం.

**05 మే 2012:**

బిజేపీ సీనియర్ నేత నల్లోల ఇంద్రసేనారెడ్డితో జేయేసీ కో-చైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య నివాసంలో జేయేసీ నాయకులు కోదండరామ్, పిట్టల రవీందర్ ప్రత్యేక భేటీ. ఉప ఎన్నికల్లో పరకాల సీటుపై చర్చించినట్లు సమాచారం.

**14 మే 2012:**

**కోదండరాంను దించేద్దాం.. స్వామిగౌడ్‌ను తెచ్చేద్దాం: కేసీఆర్**

తెలంగాణ జేఏసీ చైర్మన్‌గా టీఎన్జీవో అధ్యక్షుడు స్వామిగౌడ్ నియామకానికి తెరవెనక యత్నాలు మొదలయ్యాయి. ప్రొ.కోదండరాంను తప్పించడానికి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. పరకాల ఉప ఎన్నికల్లో తమ మద్దతు పొందడానికే కేసీఆర్ ఈ ఎత్తుగడ వేస్తున్నట్లు తొలుత భావించిన జేఏసీ వర్గాలు, కోదండరాంను దించడానికి ఆయన సీరియస్‌గా చేస్తున్న యత్నాలు తెలిసి కంగుతిన్నారు. జేఏసీ భాగస్వాములుగా ఉన్న ఉద్యోగ సంఘాల నేతలు కె.స్వామిగౌడ్, దేవిప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, విఠల్ ఆదివారం కేసీఆర్‌ను ఆయన నివాసంలో కలిశారు. 'బీజేపీ, కోదండరాం తీరుతో తెలంగాణ ఉద్యమానికి, టీఆర్ఎస్‌కి ముస్లింలు దూరమయ్యారు. బీసీలు కూడా దూరమవుతున్నారు. ఆయనను జేఏసీ చైర్మన్ పదవి నుంచి తప్పించాల్సిందే. లేకపోతే కష్టం. కోదండరాం మెతక వైఖరితో ఇబ్బందులొస్తున్నాయ్. రెడ్డి సామాజిక వర్గంతో కలిసి ఆయన రాజకీయం చేస్తున్నట్లు నాకు ఖచ్చితమైన సమాచారం ఉంది' అని తెలిపారు. రెండు, మూడు నెలల్లో పదవీ విరమణ చేయనున్న స్వామిగౌడ్‌కు జేఏసీ చైర్మన్ పదవిని అప్పగిద్దామని చెప్పారు. కోదండరాంను పదవి నుంచి దించే విషయంలో సమస్యలు రాకుండా, ఆయన తనంతట తానుగా పదవి నుంచి తప్పుకునేలా ఒత్తిడి పెంచాలన్నారు. విమర్శలతో ఉక్కిరిబిక్కిరి చేస్తే ఆయనే తట్టుకోలేక వైదొలుగుతారని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. పరకాల ఉప ఎన్నికల తర్వాత ఈ మార్పు చేద్దామన్నారు. ఈ విషయంలో ఉద్యోగ సంఘాలేవీ అడ్డురా వద్దన్నారు. బీసీ అయిన స్వామిగౌడ్‌ను జేఏసీ చైర్మన్ చేస్తే అంగీకరించక పోవటమనే

ప్రశ్నే ఉత్పన్నం కాదని చెప్పారు. టీఆర్ఎస్ తరపున 2014 ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ స్థానానికి పోటీపై దృష్టి పెట్టాలని కూడా స్వామిగౌడ్‌కు కేసీఆర్ సూచించారు. తాజా పరిణామాల నేపథ్యంలో కోదండరాంకు కేసీఆర్ వ్యతిరేక వర్గం నుంచి అంతర్గతంగా అనూహ్యమద్దతు లభిస్తోంది. పార్టీలకతీతంగా కూడా ఆయనకు చాలామంది బాసటగా నిలుస్తున్నారు. 'గడిచిన మూడేళ్లలో ఉద్యమం కోసం ఆయన ఆస్తులు అమ్ముకున్నారు. పాలమూరు ఉప ఎన్నికల్లో బీజేపీ విమర్శలపై స్పందించకపోవడం తప్పేనని అంగీకరించారు. అయినా ఆయన నిజాయితీకి కేసీఆర్ సహా అందరూ నిందలు వేయడమే బహుమానమా?' అని జేఏసీ ముఖ్యనేత ఒకరు వ్యాఖ్యానించారు.

**15 మే 2012:**

**కోదండరాంకే జేఏసీ అండ–8 గంటలపాటు ఉత్కంఠ భరితంగా మీటింగ్**

**కె.సి.ఆర్. వైఖరిపై ఫైర్, సీటీకాలేజీలో సమావేశం**

'ప్రతీసారీ మెడపై కత్తిపెడతారా? ఓడిపోతే మాపైనే నెడతారా?.. పరకాలలో మద్దతు కోరుతున్న టీఆర్ఎస్, బీజేపీల పట్ల తెలంగాణ జేఏసీలోని మెజారిటీ సభ్యులు అసహనం ప్రదర్శించిన తీరిది. రాజకీయ పార్టీల నీడ నుంచి బయటకు వచ్చి స్వతంత్రంగా ఎదుగుదామని జేఏసీ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చారు. అందుకు పరకాల ఉప ఎన్నికనే వేదిక చేసుకుందామని ప్రతిపాదించారు. జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరా నాయకత్వానికే వారంతా మద్ధతు పలికారు. 'మా చైర్మన్‌ను తొలగించేది ఎవరంటూ టీఆర్ఎస్ పెద్దలను నేరుగా సవాల్ చేశారు. పరకాలపై వైఖరిని నిర్ణయించుకునేందుకు మంగళవారం సిటీ కాలేజీలో జరిగిన జేఏసీ భేటీ.. భాగస్వామ్య పక్షాల వైఖరిని తూర్పారబట్టినట్లు తెలిసింది. అభ్యర్థుల ఖరారుపై ఏ దశలోనూ తమను సంప్రదించని ఆయా పార్టీల అధినాయకత్వాలు, ఓటమిపాలైతే మాత్రం నెపాన్ని జేఏసీపై నెట్టటాన్ని మెజారిటీ నేతలు తప్పుబట్టారు. జేఏసీ చైర్మన్ పదవి నుంచి కోదండరాంను తప్పించడానికి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు చర్చకు రాగా జేఏసీ ముక్తకంఠంతో కోదండరాంకు మద్ధతు పలికింది. 'ఆయనను తీసేవారెవరు?. కోదండరాం నాయకత్వానికే మా మద్ధతు. భవిష్యత్తులోనూ ఆయన నేతృత్వంలోనే జేఏసీ ఉద్యమిస్తుంది' అని తేల్చి చెప్పారు. పరకాల ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్‌కే మద్దతు ఇవ్వాలని ఉద్యోగ సంఘాలకు చెందిన నేతలు కె.స్వామిగౌడ్, దేవిప్రసాద్, కత్తి వెంకటస్వామి, రంగారెడ్డి జిల్లా జేఏసీకి చెందిన ఒక ప్రతినిధి గట్టిగా పట్టుబట్టారు. రెండు పార్టీలు అవసరమేనని మరికొందరు వాదించారు. అదే సమయంలో జగన్‌పార్టీ అభ్యర్థి కొండా సురేఖ బలంగా ఉన్నందున తటస్థ వైఖరి కూడా సరికాదని నేతలంతా అభిప్రాయపడ్డారు. అయితే శాస్త్రీయ కారణాలు చూపకుండా ఏదో ఒక భాగస్వామ్య పార్టీకి మద్దతు

ప్రకటిస్తే విమర్శలు వచ్చే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని, మెజార్టీ ప్రజలు కోరుకున్న పార్టీకే మద్దతు ఇవ్వాలని తుదకు జేఏసీ నిర్ణయించింది. కోదండరాంకు తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్ పూర్తిగా మద్దతు నిలిచారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ కొంత అడ్డుకునే ప్రయత్నం చేయగా, మెజార్టీ సభ్యులు కోదండవైపే నిలిచారు. 'జేఏసీ చైర్మన్ పదవి నుంచి కోదండరాంను ఎవరు తీసేస్తారు? ఎవరికో భయపడితే జేఏసీ ఫినీష్ అవుతుంది. జేఏసీని చంపే ప్రయత్నాలు జరుగు తున్నాయి. నాయకత్వాన్ని దెబ్బతీసే కుట్ర జరుగుతోంది.. భాగస్వామ్య పార్టీలు 2014 ఎన్నికల కోసం లైన్ క్లియర్ చేసుకుంటున్నాయ్. అందుకు జేఏసీ ఎందుకు పావుగా ఉపయోగపడాలి? రేపు భాగస్వామ్య ప్రజా సంఘాల్లోని వారు కూడా ఎన్నికల్లో పోటీ చేసి జేఏసీ మద్దతు కోరితే ఎలా' అని నేతలు ప్రశ్నించారు. ఈ మేరకు పరకాల ఉప ఎన్నికల తర్వాత జేఏసీకి భాగస్వామ్య రాజకీయ పార్టీలను దూరం పెట్టాలనే కీలక నిర్ణయం తీసుకున్నారు. అన్ని రకాల సంఘాలను కలుపుకొని స్వతంత్రంగా ఎదగాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను పరకాల ఉప ఎన్నికల తర్వాత ఆచరణలో పెట్టాలని తీర్మానించారు. కాగా, భేటీకి భాగస్వామ్య టీఆర్ఎస్, బీజేపీ, న్యూడెమాక్రసీ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించలేదు.

**24 మే 2012:**

ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నాగం జనార్ధన్ రెడ్డిని కలిసిన జేయేసీ నాయకులు కోదండరామ్, పిట్టల రవీందర్, తదితరులు.

**26 మే 2012:**

**మానుకోట స్ఫూర్తి యాత్ర ప్రారంభం**

2010 మే 28నాడు జరిగిన మానుకోటప్రజా ప్రతిఘటన సంఘటనను గుర్తుకుచేసుకుంటూ ఉద్యమ ప్రజల్లో స్ఫూర్తిని నింపేందుకు ఉద్దేశించిన మానుకోట స్ఫూర్తి యాత్రను జేయేసీ చైర్మెన్ కోదండరామ్ మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రారంభించారు. స్థానిక జేయేసీ చైర్మెన్ డాక్టర్ డోలి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల జేయేసీ నాయకులు కె. స్వామిగౌడ్, శ్రీనివాసగౌడ్, దేవీప్రసాద్, సి. విఠల్, కత్తి వెంకటస్వామి, పిట్టల రవీందర్, అద్దంకి దయాకర్, రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

**27 మే 2012:**

మానుకోట స్ఫూర్తి యాత్ర రెండవరోజు నెక్కొండ, సంగెం, పరకాల, భూపాలపల్లి మండలాలలో కొనసాగింది.

**28 మే 2012:**

మానుకోట స్ఫూర్తి యాత్ర మూడవరోజు సాయంత్రం హన్మకొండకు చేరుకున్నది.

ఖాజీపేట సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో ముగింపు సభ జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేవరకూ మానుకోట ప్రజాప్రతిఘటన అందించిన స్ఫూర్తితో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని వక్తలు పేర్కొన్నారు.

**29 మే 2012:**

## పరకాలలో టీఆర్ఎస్‌కే జేఏసీ మద్ధతు

మొత్తానికి పరకాల ఉప ఎన్నికలో తెలంగాణ జేఏసీ మద్ధతు వ్యవహారం తేలింది. 'ప్రజాభిప్రాయం మేరకు మా మద్ధతు టీఆర్ఎస్‌కే' అని జేఏసీ చైర్మన్ కోదండరాం స్పష్టం చేశారు. కానీ, ఈ మద్దతు ఈ ఉప ఎన్నికల వరకే, అదీ పరకాలకు మాత్రమే పరిమితమని పేర్కొన్నారు. ఒక పార్టీ మెప్పుకోసమో.. మరో పార్టీపై వ్యతిరేకతతోనో ఈ నిర్ణయం తీసుకోలేదని వివరించారు. పరకాల ఉప ఎన్నికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన జేఏసీ సబ్ కమిటీ మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని జేఏసీ కార్యాలయంలో సమావేశమైంది. జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశమై సబ్ కమిటీ సమర్పించిన నివేదికపై చర్చించింది. అనంతరం నిర్ణయాలను జేఏసీ నేతలు మల్లెపల్లి లక్ష్మయ్య, అద్దంకి దయాకర్, పిట్టల రవీందర్, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులతో కలిసి కోదండరాం మీడియాకు వివరించారు.

తెలంగాణ కోసం ప్రజాప్రతినిధులు రాజీనామా చేసిన సందర్భాల్లో తప్ప ఇకపై ఏ ఎన్నికల్లోనూ జోక్యం చేసుకోవద్దని తెలంగాణ జేఏసీ నిర్ణయించింది. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా స్వతంత్రంగా ఎదగాలని మరోసారి తీర్మానించింది. పరకాల ఉప ఎన్నికలపై ఏర్పాటైన జేఏసీ సబ్ కమిటీ, తర్వాత జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం.. పరకాల ఎన్నికల తరువాత ఇక రాజకీయాలతో, పార్టీలతో నిమిత్తం లేకుండా ఎదగాలని తీర్మానించింది. ఈ తీర్మానం ఈనెల 15 సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి నాందిగా జేఏసీ వర్గాలు చెబుతున్నాయి.

**30 మే 2012:**

## కేసీఆర్‌కు భయపడే జేఏసీ మద్ధతు: కిషన్‌రెడ్డి ఆరోపణ

టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఒత్తిడి మేరకే పరకాల ఎన్నికల్లో తెలంగాణ జేఏసీ.. టీఆర్ఎస్‌కు మద్ధతు ప్రకటించిందని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. టీఆర్ఎస్ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు జేఏసీ పూర్తిగా లొంగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగస్వాములైన తమకు మాట వరుసకైనా చెప్పకుండా ఏకపక్ష నిర్ణయం తీసకుందని విమర్శించారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సర్వే ప్రకారమే పరకాలలో టీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నామని చెబుతున్న జేఏసీ నేతలు.. మహబూబ్‌నగర్ ఎన్నికల్లోనూ అనేక సర్వేలు టీఆర్ఎస్‌కే మొదటి స్థానమని చెప్పినా ఎందుకు మద్దతు ప్రకటించలేదని

ప్రశ్నించారు. పరకాలలో ఓడిపోతే పరువు పోతుందన్న అభద్రతాభావంతో టీఆర్ఎస్ జేఏసీపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు. ఒకప్పుడు జేఏసీ చైర్మన్ కోదండరాంను తొలగిస్తామంటూ ఇదే టీఆర్ఎస్ ప్రకటిస్తే.. బీజేపీ ఆయనకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. పరస్పర సిద్ధాంత వైరుధ్యాలున్న పార్టీలతో ఏర్పడిన జేఏసీ తటస్థంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

**పరకాలలో జేఏసీ సర్వే అవాస్తవం: ఔటా**

ఉప ఎన్నికలు జరుగుతున్న పరకాలలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు సర్వే చేశారనడం అవాస్తవమని ఉస్మానియా వర్సిటీ టీచర్ల సంఘం (ఔటా) స్పష్టం చేసింది. ఆ ప్రజాభిప్రాయ సేకరణ మేరకే ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు మద్ధతిస్తున్నట్లు తెలంగాణ రాజకీయ జేఏసీ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఔటా అధ్యక్షుడు సత్యనారాయణ, సలహాదారు లక్ష్మణ్ మాట్లాడారు. జేఏసీ ఏర్పాటు మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలతో పార్టీలు, సంఘాలను దూరం చేసుకుంటున్నారు. ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ మద్ధతునిస్తూ దాన్ని ఓయూ అధ్యాపకులకు అంటగట్టడం అన్యాయమని వారు పేర్కొన్నారు. తెలంగాణ జేఏసీని టీఆర్ఎస్ అనుబంధ సంస్థగా మార్చారని ఆరోపించారు. జేఏసీ తటస్థంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పరకాలలో టీఆర్ఎస్‌కు మద్ధతివ్వాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**03 జూన్ 2012:**

ఆదిలాబాద్ జిల్లా జేయేసీ ఆధ్వర్యంలో నిర్మల్ సమీపంలోని గంజాల్ హైవే టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో జేయేసీ చైర్మెన్ కోదండరామ్, జిల్లా జేయేసీ కో-ఆర్డినేటర్ ఏ. విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు. టోల్‌ప్లాజావద్ద విధించే పన్నులనుండి స్థానికులకు, పల్లెవెలుగు బస్సులకు మినహాయింపు ఇవ్వాలన్న జేయేసీ డిమాండుపై జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించి అంగీకరించారు.

**15 జూన్ 2012:**

**పరకాలలో టీఆర్ఎస్ గెలుపు**

పది రౌండ్ల వరకు టీఆర్ఎస్‌దే ఆధిక్యం, 11వ రౌండ్లో ఒక్కసారిగా సీన్ మారింది. అక్కడి నుంచి ఒక్కో రౌండ్‌కూ టీఆర్ఎస్ మెజారిటీ భారీగా తగ్గుతూ వచ్చింది. టెన్షన్.. టెన్షన్.. ఊపిరి బిగపట్టి మరీ ఎదురు చూపులు! తొలుత ఆరువేల మెజారిటీ సాధించిన టీఆర్ఎస్ ఒక సందర్భంలో.. ఓటమి అంచుల వరకూ వెళ్లింది. చివరి రౌండ్‌లో స్వల్ప మెజార్టీ (1562)తో ఎలాగో గట్టెక్కింది. మొత్తం 1,57,167

ఓట్లు పోలవగా.. కాంగ్రెస్ అభ్యర్థికి కేవలం 5099 ఓట్లు రావడం ఆ పార్టీ దుస్థితిని కళ్లకు కడుతోంది. ఇక, పాలమూరు తర్వాత భారీగా ఆశలు పెట్టుకున్న బీజేపీకి కేవలం 9వేల పైచిలుకు ఓట్లు మాత్రమే లభించాయి. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలిచినా, నైతిక విజయం తనదేనని వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి కొండా సురేఖ ప్రకటించారు. తెలంగాణ వాదంతో బరిలోకి దిగిన టీఆర్ఎస్, బీజేపీలకు వచ్చిన ఓట్ల కంటే.. వైఎస్ఆర్‌సీపీ, టీడీపీలకు వచ్చిన ఓట్లు 20వేలకు పైగా ఉండడం టీఆర్ఎస్‌కు మింగుడు పడని అంశం. రాజీనామాల ద్వారా వచ్చే ఎన్నికల్లో తప్ప ఇతరత్రా టీఆర్ఎస్ గెలుపు అంత సులువు కాదని స్పష్టమైందని అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణవాదం తగ్గిందా? లేక టీఆర్ఎస్ బలం తగ్గిందా? అనే చర్చ జోరుగా సాగుతోంది. అన్నింటి కంటే మించి తెలంగాణ జేఏసీ బహిరంగ మద్దతు ప్రకటించినా టీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ దక్కకపోవడం పరిశీలకులను ఆశ్చర్యపరుస్తోంది. తాజా గెలుపుతో అసెంబ్లీలో టీఆర్ఎస్ బలం 17కు చేరుకుంది. స్వతంత్ర ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణతో కలిసి మొత్తం 18 మంది ఆ పార్టీ తరపున సభలో గొంతు వినిపిస్తున్నారు. 2009లో టీడీపీతో కలిసి పోటీచేయగా టీఆర్ఎస్‌కు 10సీట్లు వచ్చాయి. అనంతర ఉద్యమ ప్రభావం, వరుస ఉప ఎన్నికల ఫలితంగా ఎమ్మెల్యే సంఖ్య పెరుగుతూ వస్తోంది.

తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతి వారం ప్రారంభం.

**21 జూన్ 2012:**

తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్, బాగ్‌లింగంపల్లిలో జయశంకర్ వర్ధంతి సభ.

**24 జూన్ 2012:**

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర మహాసభ.

తెలంగాణ నెటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ప్రస్తుత రాజకీయాలు, తెలంగాణ ఉద్యమం భవిష్యత్తు ప్రణాళిక అనే అంశంపై సదస్సు.

**28 జూన్ 2012:**

సింగరేణిలో గుర్తింపు కార్మికసంఘం వెరిఫికేషన్ ఎన్నికలు, గుర్తింపు సంఘంగా తెలంగాణ రాష్ట్ర సమితి అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టిజిబికెఎస్) ఎన్నిక.

**04 జూలై 2012:**

హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో దొడ్డికొమురయ్య 66వ వర్ధంతి సభ.

**07 జూలై 2012:**

**సెప్టెంబర్ 30న తెలంగాణ మార్చ్: జేఏసీ**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రం సాధించడానికి తెలంగాణ మార్చ్ పేరుతో సెప్టెంబర్ 30న 'ఛలో హైదరాబాద్' నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాం వెల్లడించారు. ఈనెల 20న జిల్లా జేఏసీల విస్తృత స్థాయి సమావేశాలు జరిపి.. వ్యూహాన్ని సిద్ధం చేస్తామన్నారు. ఉద్యమ నిర్మాణం, పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలనూ చర్చిస్తామని శనివారం జేఏసీ స్టీరింగ్ కమిటీ విస్తృతస్థాయి భేటీ అనంతరం విలేకరులకు తెలిపారు. ఈనెల 21 నుంచి 30 వరకు ఉద్యమ విస్తరణ ఉంటుందని, ఆగస్టు 1 నుంచి 85 రోజులు వరుసగా ప్రచార కార్యక్రమాలు, ఆందోళనలు ఉంటాయని నేతలు సూర్యం, గోవర్ధన్, ఉద్యోగ-ప్రజా సంఘాల నేతలు కె.స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, విఠల్, మల్లెపల్లి లక్ష్మయ్య, అద్దంకి దయాకర్, కత్తి వెంకటస్వామి, పిట్టల రవీందర్, రఘు, మణిపాల్‌రెడ్డిలతో పాటు, జేఏసీ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. 'టీఆర్ఎస్, బీజేపీ జేఏసీలోనే ఉన్నాయి. ఉంటాయి. భవిష్యత్తులోనూ కలిసే పనిచేస్తామ'ని కోదండరాం చెప్పారు.

జగన్‌పార్టీకి తెలంగాణలో స్థానం లేకుండా చేయాలని నిర్ణయించినట్లు కోదండరాం తెలిపారు. సీమాంధ్ర పాలకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్న టికాంగ్రెస్, టీటీడీపీ, జగన్ పార్టీలను ఎండగడుతూ ప్రజలను కదిలించాలని తీర్మానించినట్లు చెప్పారు. సీమాంధ్ర పాలకుల జేబు సంస్థగా కాంగ్రెస్ పార్టీ మారిందని కోదండరాం విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మటానికి లేదని, పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టేవరకు, ప్రత్యేక రాష్ట్రం సాధించే వరకు కొసదాకా సంఘటితంగా కొట్లాడాలని సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. స్వతంత్రంగా ఉన్నామనే సంకేతాలను జనంలోకి బలంగా పంపాలని జేఏసీ నిర్ణయించింది. ఈ మేరకే 'ఛలో హైదరాబాద్' నిర్వహించాలని నిర్ణయించినట్లు జేఏసీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి,

**10 జూలై 2012:**

తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులతో తెలంగాణ జేయేసీ ప్రత్యేక సమావేశం. సికిందరాబాద్‌లోని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో జేయేసీ నాయకులు అద్దంకి దయాకర్, పిట్టల రవీందర్, విజయేందర్‌రెడ్డి, పలువురు ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

**12 జూలై 2012:**

రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో తెలంగాణలోని అన్ని పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు తెలంగాణ డిమాండు కోసం ఒత్తిడి తేవాలని కోరుతూ తెలంగాణ జేయేసీ ఒక బహిరంగలేఖను అన్ని రాజకీయ పార్టీలకు విడుదల చేసింది.

**18 జూలై 2012:**

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ భవన్ వద్ద భారీ ధర్నా.

**19 జూలై 2012:**

'భూమిపుత్రుల పాదయాత్ర' పేరుతో తెలంగాణ ప్రైవేట్ సెక్టార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యాత్రను నిర్లహించింది.

**23 జూలై 2012:**

**సిరిసిల్ల ఓ రణక్షేత్రం.. విజయమ్మ దీక్షకు చెప్పులు, చీపుళ్లతో స్వాగతం**

హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు 140 కిలోమీటర్లు. సిరిసిల్లలో చేనేత దీక్షకు సోమవారం ఉదయం 7.25 గంటలకు లోటస్‌పాండ్‌లోని తన నివాసంలో బయలుదేరిన వైసీపీ గౌరవాధ్యక్షురాలు దాదాపు ఏడు గంటల ప్రయాణం అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు సిరిసిల్లకు చేరుకున్నారు. టీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు.. ఆందోళనలు, చీపుర్లు, చెప్పుల స్వాగతాలు, పోలీసులు లాఠీచార్జీలు, సిద్ధిపేటలో బాష్పవాయు ప్రయోగం, రహదారి అంతటా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు... దీంతో, చేనేత దీక్ష కాస్తా గంటన్నర పాటు చేనేత ధర్నాగా మారింది. ఇక విజయలక్ష్మి పర్యటనను అడ్డుకోవడానికి తెలంగాణ భవన్ నుంచి లోటస్‌పాండ్‌కు ర్యాలీగా వెళుతున్న టీఆర్ఎస్వీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. తెలంగాణ భవన్లోకే పోలీసులు చొచ్చుకురావడాన్ని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సచివాలయంలో నిరసన వ్యక్తం చేసి సీఎంకు ఫిర్యాదు చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ విద్యార్థి జేఏసీ నేతలు మంగళవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తే.. టీఆర్ఎస్ నేతలు కరీంనగర్ బంద్‌కు పిలుపునిచ్చారు. టీఆర్ఎస్, జేఏసీ అడుగడుగునా అడ్డు తెలిపినా సిరిసిల్లకు చేరుకుని ధర్నాను విజయవంతం చేశామన్న ఆనందం వైసీపీ పార్టీలో వ్యక్తమవుతుంటే.. విజయలక్ష్మికి అడుగడుగునా నిరసన తెలిపామని, అయినా పరకాల వచ్చినపుడే అడ్డుకుని ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని టీఆర్ఎస్ మథనపడుతోంది.

**లాఠీచార్జిలో 20 మందికి గాయాలు**

విజయలక్ష్మి దీక్షకు టీఆర్ఎస్, జేఏసీ నేతలు అడ్డు తగలడంతో పోలీసులు పెద్దఎత్తున లాఠీచార్జీ చేశారు. ధర్నా వేదిక వద్ద చెప్పులు, కోడిగుడ్లు విసరడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. దీంతో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడినవారిని కేటీఆర్ పరామర్శించారు. కాగా, వైఎస్ విజయలక్ష్మి సిరిసిల్ల పర్యటన సందర్భంగా సిద్ధిపేటలో ఆమెను అడ్డుకున్న టీఆర్ఎస్ శ్రేణులపై బాష్పవాయువు ప్రయోగించిన పోలీసులపై హెడ్‌క్వార్టర్స్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీనిపై తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని వరంగల్ డీఐజీకి ఆదేశాలు జారీ చేశారు.

**24 జూలై 2012:**

పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో తెలంగాణ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రథమ వార్షికోత్సం.

**30 జూలై 2012:**

**అంతిమ యుద్ధానికి సిద్ధం కావాలి – పిట్టల రవీందర్ పిలుపు**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అంతిమ యుద్ధానికి సిద్ధంగా ఉండాలని తెలంగాణ జేఏసి రాష్ట్ర కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్ పేర్కొన్నారు. స్థానిక ఎన్.బి.ఎన్ ఫంక్షన్ హాలులో జరిగిన జిల్లా జేఏసి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యమప్రచారానికి రాష్ట్ర జేఏసి కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, డోర్ స్టిక్కర్లు, కళాకారులతో ప్రతీ గ్రామాన్ని కదిలించి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని వివరించారు. సెప్టెంబర్ 30న జరిగే చలో హైదరాబాద్ తెలంగాణ మార్చ్ మరో చరిత్ర సృష్టిస్తుందని, ఈ సారీ కేంద్రప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. సెప్టెంబర్ 15లోపు మండల కమిటీలను బలోపేతం చేసి, గ్రామ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. ప్రతీ గ్రామం నుండి ఐదుగురు సభ్యుల చోప్పున సమీకరించి అన్ని గ్రామాల కార్యకర్తలతో ప్రత్యేక శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జేఏసి నాయకులు, నియోజక వర్గ ఇంచార్జీలు, నగరకమిటీ నాయకులు, విద్యార్థి జేఏసి నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో 'క్విట్ తెలంగాణ'**

తెలంగాణలోని ఉద్యోగాలు స్థానికులకే దక్కాలని కోరుతూ తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మచ్చా విద్యాసాగర్ పాల్గొని ప్రసంగించారు. సింగరేణిలో 80శాతం ఉద్యోగాల్లో తెలంగాణ వారికి వాటా ఇవ్వాలని, కేటీపిఎస్, నవభారత్ ఫ్యాక్టరీలలో ఈ ప్రాంత నిరుద్యోగులకే ఇవ్వాలని అన్నారు. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీ, సింగరేణి మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాఫ్రంట్ ప్రధాన కార్యదర్శి జగన్న, సహాయ కార్యదర్శి ద్వారక, జిల్లా ఉపాధ్యక్షుడు కప్ప జానిబాబు, ఎ.సైదులు, మోతె మల్లయ్య, విద్యార్థి జేఏసి నాయకులు శ్రీనివాస్, రవి, అరుణ, శివ తదితరులు పాల్గొన్నారు.

**31 జూలై 2012:**

తెలంగాణ ఎన్జీవోస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ జేయేసీ కన్వీనర్ కనకమామిడి స్వామి గౌడ్ ఉద్యోగ విరమణ సందర్భంగా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో భారీ ఎత్తున ఆత్మీయ సత్కారం. కెసిఆర్‌తోసహా పలువురు ప్రముఖుల హాజరు. స్వామిగౌడ్‌ను టిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన కె.సీ.ఆర్.

**05 ఆగస్టు 2012:**

హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'సింగిడి' సదస్సు

**06 ఆగస్టు 2012:**

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం సెనేట్‌హాల్‌లో ప్రొఫెసర్ కుసుంబ సీతారామారావు అధ్యక్షతన తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సదస్సు. హాజరైన వరవరరావు, హరగోపాల్, కోదండరామ్, రేవతి, డాక్టర్ రాజగోపాల్, మల్లేపల్లి లక్ష్మయ్య, డాక్టర్ టి. పాపిరెడ్డి, పిట్టల రవీందర్, దంటు కనకదుర్గ, తదితరులు.

**07 ఆగస్టు 2012:**

**కాంగ్రేస్‌కో ఖతం కరో, తెలంగాణ హాసిల్ కరో**

కాంగ్రేస్ తెలంగాణ ఇస్తదో, చస్తదో తేల్చుకోవాలని రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం బీజేపి ఆధ్వర్యంలో 'తెలంగాణ ఎట్లొస్తది?' అనే అంశం పై తెలంగాణ ఉద్యమ సంఘాల సదస్సు నిర్వహించారు. ఇందులో వివిధ ప్రజా సంఘాల నాయకులు, రాజకీయనాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. కాంగ్రేస్ నాయకులను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. బోనాల పండుగ రోజు అందరం కలిసిపోయినట్లు శత్రువుపైన దాడి చేసేందుకు సిద్ధం కావాలని ఆయన విజ్ఞప్తిచేశారు. నేటినుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాలలో తెలంగాణ అంశంపై చర్చించేందుకు పట్టుబట్టాలన్నారు.

బీజేపి అధ్యక్షుడు జీ.కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ కాంగ్రేస్ పార్లమెంట్‌లో బిల్లు పెడితే 165మంది బీజేపి సభ్యులు బేషరతుగా మద్దతిస్తారన్నారు. కాంగ్రేస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలకోసమే సాగదీసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కేంద్రమాజీ మంత్రి సి.హెచ్.విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17న జైల్‌భరో దినంగా పిలుపునిస్తే కేంద్రం దిగొస్తుందన్నారు. ఉద్యోగసంఘాల మాజీ నేత స్వామిగౌడ్ మాట్లాడుతూ బీజేపి కాంగ్రేస్‌ను విమర్శించేందుకే ఎక్కువ ఆసక్తి చూపుతోందని, పార్లమెంట్‌లో బిల్లు పెట్టడంలో ఆసక్తి చూపాలని అన్నారు.

తెలంగాణ నగార సమితి అధ్యక్షుడు నాగం జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి ఇండ్లకే పరిమితమైన నాయకుల భరతంపట్లాలని కోరారు.

సెప్టెంబర్ 30న జరిగే తెలంగాణ మార్చ్‌ను విజయవంతం చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నానని, 50లక్షల మందితో హైదరాబాద్‌ను దిగ్బంధం చేయాలని అన్నారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం నేత అల్లంనారాయణ మాట్లాడుతూ తెలంగాణ కోసం అన్ని వర్గాలు ఏకమై ప్రళయం సృష్టించేందుకు సిద్ధంకావాలని అన్నారు. నీటి పారుదల నిపుణులు విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఇవ్వాల్సిన రాజకీయ అనివార్యతను సృష్టించాలని అన్నారు. జేఏసి కన్వీనర్ మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ అన్ని విషయాలలో ఐక్యత చాటిచెప్పే నాయకులు, తెలంగాణ విషయంలో ఐక్యతను చూపకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ మాల మహానాడు చైర్మన్ అద్దెంకి దయాకర్ మాట్లాడుతూ ఉద్యమం నివురుగప్పిన నిప్పులా ఉందని దాని సెగ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా చేయాలని అన్నారు.

బీజేపి సీనియర్ నేత బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ వ్యక్తిగత ప్రతిష్టలు పక్కనబెట్టి 'డూ ఆర్ డై' అన్నట్లుగా ముందుకుసాగాలని కోరారు. ఎమ్మెల్సీ చుక్కారామయ్య మాట్లాడుతూ సీమాంధ్ర పెట్టుబడిదారుల మూలాలను దెబ్బతీయాలని అన్నారు. కాంగ్రెస్ మనలో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తుందని, రాజకీయ జేఏసిని విచ్ఛిన్నం చేసే ప్రయత్నిస్తోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, తెలంగాణ యునైటెడ్‌ఫ్రంట్ నేతలు కేశవరావ్‌జాదవ్, విమలక్క, జేయేసీ సమన్వయకర్త పిట్టల రవీందర్‌లతో పాటు వివిధ సంఘాల నాయకులు, తెలంగాణ రచయితలు, తెలంగాణవాదులు  పాల్గొన్నారు.

ప్రముఖ సాహితీవేత్త సామల సదాశివ అనారోగ్యంతో ఆదిలాబాద్‌లో మృతి

**11 ఆగస్టు 2012:**

**మా ఉద్యోగాలు మాకే దక్కాలి: భూమిపుత్రుల పాదయాత్ర**

శనివారం చర్లపల్లిలోని తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం, తెలంగాణ జేఏసి సంయుక్తంగా భూమి పుత్రుల పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీష్‌రావు మాట్లాడుతూ... భూమి, నీళ్లు మావి.. ఉద్యోగాలు మీకా? మాకు మాత్రం కాలుష్యమా? ఎందుకీ వివక్ష అని ప్రశ్నించారు. ప్రైవేటు రంగంలోనూ 80శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో ఉద్యోగాలు అక్కడివారికే దక్కినప్పుడు, మాతెలంగాణ ఉద్యోగాలు మాకే దక్కాలని అన్నారు. చంద్రబాబు తెలంగాణకు వ్యతిరేకం కాదా? మీ హెరిటేజ్‌లో ఎంతమంది తెలంగాణ వాళ్లు పనిచేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

తెలంగాణ  జేఏసి  చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వడం న్యాయసమ్మతమని రాజ్యాంగంలోని 371డి.లో స్పష్టంగా

పేర్కొన్నా..దాన్ని అమలు చేయడం లేదని అన్నారు. వనరులను కోల్పోయి నిరాశ్రయులైన స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని జాతీయ లేబర్ కమీషన్ పేర్కొన్నా.. ఇక్కడ మాత్రం అమలు కావడం లేదన్నారు. ఇకపై ప్రతి జిల్లాలోనూ భూమిపుత్రుల పాదయాత్రను నిర్వహిస్తామని చెప్పారు. ఈ పాదయాత్రలో జేఏసి కో చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, ఉద్యోగ సంఘాల నేత శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసత్యం, తెలంగాణ పారిశ్రామిక వేత్తల ప్రతినిధలు గోపాల్‌రావు, శంకరాచారి, డాక్టర్ల జేఏసి, ఆర్టీసీ జేఏసి, తెలంగాణ ప్రైవేటు లెక్చరర్ల జేఏసిల నేతలు, టీఆర్ఎస్ నాయకులు బేతి సుభాష్‌రెడ్డి, చంద్రారెడ్డి, బేతాళ బాలరాజ్, కాసం మహిపాల్‌రెడ్డి, అనుముల నర్సింహారెడ్డి, మహిళానేతలు తదితరులు పాల్గొన్నారు.

## 14 ఆగస్టు 2012:

## తెలంగాణ కోసం సాయుధ పోరాటం: ముగ్గురి అరెస్టు

'సాయుధ పోరాటం ద్వారానే ప్రత్యేక తెలంగాణ నినాదంతో ఆయుధాలు పట్టిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరు తెలంగాణ కోసం ఒక మిలిటెంట్ గ్రూపును తయారు చేసి.. ఇరు ప్రాంతాల మంత్రుల హత్యకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. దసర్ల శ్రీశైలం, కొడప శంకర్, మడావి కృష్ణ అనే ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి ఒక పిస్టల్, రెండు తపంచలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బిజినేపల్లి మండలం బోయాపూర్‌కు చెందిన దసర్ల శ్రీశైలం ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్‌బీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఓయూ స్వతంత్ర జేఏసీ కోకన్వీనర్‌గా పనిచేస్తూ యూనివర్సిటీలో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నారు. మంత్రులు డీకె.అరుణ, జానారెడ్డిలకు ఫోన్లు చేసి బెదిరించాడు. ఈ కేసుల్లో అరెస్టు అయిన శ్రీశైలం బెయిల్‌పై విడుదలయ్యాడు. తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకోకుండా హత్యలు చేయాలనే నిర్ణయానికి వచ్చాడు. 10 మందితో కలిసి ఒక గ్రూపును ఏర్పాటు చేశాడు. ఆదిలాబాద్ మండలంలోని హాథీగుట్టకు చెందిన కొడప శంకర్, ఇంద్రవెల్లి మండలంలోని వాలుగొండకు చెందిన మదావి కృష్ణ, శ్రీశైలం కలిసి తిరుగుతుండగా.. మంగళవారం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. 'మంత్రి డీకే అరుణను ఫోన్‌లో బెదిరించిన తర్వాత ఆమె అనుచరులు నాపై దాడికి ప్రయత్నించారు. తెలంగాణ కోసం ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడంతో.. సాయుధ పోరాటం చేసేందుకే ఆయుధాలు కొన్నాం. సకల జనుల సమ్మె జరిగినా తెలంగాణ రాలేదు. తెలంగాణ కోసం రాజకీయ నేతలు చిత్తశుద్ధితో పనిచేయడం లేదు. అందువల్లే, సాయుధ పోరాటం ద్వారా తెలంగాణను సాధించాలనే లక్ష్యంతో ఒక గ్రూపు తయారు చేశా' అని శ్రీశైలం చెప్పాడు.

**16 ఆగస్టు 2012:**

సి.పి.ఐ అగ్రనేతలతో జేయేసీ నాయకుల ప్రత్యేక సమావేశం. సాగరహారం (తెలంగాణ మార్చ్ కార్యక్రమానికి సహకరించాలని వినతి.

**17 ఆగస్టు 2012:**

**అంబర్‌పేట టూ నిర్మల్ పాదయాత్ర ప్రారంభం**

తెలంగాణ ప్రజలకు సమైక్య రాష్ట్రంలో జరుగిన అన్యాయాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంబర్‌పేట నియోజకవర్గం జేఏసి ఆధ్వర్యంలో అంబర్‌పేట నుంచి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ వరకు 220కిలోమీటర్ల మేర సాగే పాదయాత్రను గురువారం జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం జెండా ఊపి ప్రారంభించారు. అంబర్‌పేట మహంకాళి దేవాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పొల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 30న జరిగే 'తెలంగాణ మార్చ్'ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాదయాత్రను నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ జేఏసి కోకన్వినర్ ఉప్పు సుధాకర్‌ను జేఏసి నేతలు అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని ఇతర జేఏసీలు తమతమ ప్రాంతాలలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం సుధాకర్ నాయకత్వంలో అంబర్‌పేట నియోజకవర్గ జేఏసి చైర్మన్ రాజాగౌడ్, కన్వినర్ రూబీస్టీవెన్‌సన్, నాయకులు పర్కాల శ్రీకాంత్, టీ.వెంకముదిరాజ్, మిర్యాల రవీందర్, జహంగీర్, సూర్యవంశీ, మహేశ్‌యాదవ్, రవీందర్, వీరయ్యలు పాదయాత్రలో నిర్మల్‌కు బయలుదేరి వెళ్లారు.

**20 ఆగస్టు 2012:**

విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో న్యూడెమెక్రసీ నాయకులతో జేయేసీ నేతల ప్రత్యేక సమావేశం. తెలంగాణ మార్చ్ కార్యక్రమంలో అనుసరించాల్సి వ్యూహంపై ప్రత్యేక చర్చ. పాల్గొన్న జేయేసీ నేతలు కోదండరామ్, మల్లేపల్లి లక్ష్మయ్య, పిట్టల రవీందర్, న్యూడెమోక్రసీ నాయకులు సూర్యం, కె. గోవర్ధన్, వి.సంధ్య, జాన్సీ, తదితరులు

**22 ఆగస్టు 2012:**

**విద్యుత్ దీక్ష... టీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు**

తెలంగాణలో విద్యుత్ కోతలను నిరసిస్తూ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం విద్యుత్ సౌధ వద్ద నిరవధిక దీక్షకు దిగారు. రైతులకు 7గంటలు విద్యుత్ ఇస్తామని ట్రాన్స్‌కో అధికారులు ఇచ్చిన హామిని అమలుచేయనందున ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈటెల రాజేందర్, టీ.హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం అరవిందరెడ్డి, కావేటి సమ్మయ్య, నల్లాల ఓదెలు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, గంప గోవర్ధన్, టి.రాజయ్య, దాస్యం వినయభాస్కర్, ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావులు మంగళవారం ఉదయం

విద్యుత్ సౌధకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు వారిని అరెస్టు చేసి బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో స్టేషన్ ఆవరణలోనే అరెస్టయిన నేతలు దీక్షకు దిగారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు దీక్ష కొనసాగిస్తామని ప్రకటించారు.

ఒక పక్క పోలీసులు ఎమ్మెల్యేలను అరెస్టు చేస్తుండగా, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, ఏనుగు రవీందర్‌రెడ్డిలు ఉద్యోగులు వెళ్లే దారిగుండా విద్యుత్‌సౌధాలోకి ప్రవేశించారు. ఆరో అంతస్తులో ఉన్న సీఎండీ ఆఫీసురూంలోకి చేరుకున్నారు. సీఎండీ హీరాలాల్ సమారియాతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. సీఎండీ, పక్కగది అయిన జేఎండీ రమేష్ ఆఫీస్‌రూంలోని రెస్ట్‌రూంలోకి వెళ్లి గడియ పెట్టుకున్నారు. అనంతరం సమాచారం తెలుసుకున్న అధికారులు ఆ ఇద్దరు ఎమ్మెల్యేలతో పలుమార్లు ఫోన్‌లో చర్చలు జరిపారు. ట్రాన్స్ అధికారులు ఒక హామీ పత్రాన్ని వారికి పంపించినా వారు బయటకు రాలేదు. సీఎం నుంచి స్పష్టమైన హామీ ఇస్తే తప్ప తాము బయటకు రామని పట్టుబట్టారు. సాయింత్రం ఉద్యోగుల డ్యూటీ సమయం ముగిసిన తర్వాత 5గంటలకు పోలీసులు ఆగది కిటికీ గుండా గదిలోకి ప్రవేశించి వారిని అరెస్టు చేసి గోల్కొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు. బొల్లారం పోలీస్ స్టేషన్‌లో దీక్ష కొనసాగిస్తున్న టీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ నేత శంకర్‌రావు సంఘీభావం తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే వంటావార్పు నిర్వహించి బోజనాలు చేశారు. రాత్రి పోలీసుస్టేషన్‌లోనే నేతలు నిద్రించారు.

**అరెస్టలపై సర్వత్రా నిరసనలు:**

రైతులకు 7గంటలు విద్యుత్ సరఫరా చేయాలని ఆందోళన చేపట్టిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణలోని పలు ప్రాంతాలలో టీఆర్ఎస్ కార్యకర్తలు నిరాహార దీక్షలు, దిష్టిబొమ్మదహనాలు, రాస్తారోకోలు నిర్వహించారు.

**ఎమ్మెల్యేలను విడిచిపెట్టండి: టీజేఏసి**

ప్రజా సమస్యలపై న్యాయబద్ధంగా ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ జేఏసి డిమాండ్ చేసింది. రైతులు ఎదుర్కొంటున్న కరెంటు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంలో ఎమ్మెల్యేలు చేస్తున్న దీక్షను భగ్నం చేసి అరెస్టు చేయడం అక్రమమన్నారు. అరెస్టు చేసిన ఎమ్యెల్యేలను విడుదల చేయాలని, కరెంటు సమస్యలపై వెంటనే ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ జేఏసి డిమాండ్ చేసింది. బుధవారం తెలంగాణ జేఏసి ఆధ్వర్యం లో హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రితో మాట్లాడతానని ఆమె హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. అరెస్టయిన

ఎమ్మెల్యేలలో వినయభాస్కర్, ఏనుగు రవీందర్‌రెడ్డిలను రాత్రిపూట జైలుకు తరలించడాన్ని వారు తప్పుబట్టారు.

తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో వేదిక జిల్లా అధ్యక్షుడు ముక్కెర రాజు అధ్యక్షతన సదస్సు. హాజరైన విద్యుత్ జేయేసీ నాయకులు కె. రఘు, విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిట్టల రవీందర్, జిల్లా జేయేసీ చైర్మెన్ బి. వెంకటమల్లయ్య, తదితరులు.

**27 ఆగస్టు 2012:**

**86శాతం ప్రజలు 'తెలంగాణ' కోరుకుంటున్నారు.: ఎన్డీటీవి సర్వే**

ఎన్డీటీవి మిడ్ టర్మ్ పోల్ పేరిట చేపట్టిన మధ్యంతర ఎన్నికల సర్వేలో తెలంగాణ తథ్యమని తేల్చిచెప్పింది. ఈ సర్వేలో తెలంగాణలో 86శాతం మంది ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకుంటున్నట్లు సర్వే ఫలితాలలో వెల్లడించింది. ఇప్పటికిప్పుడు మధ్యంతర ఎన్నికలు వస్తే తెలంగాణ రాష్ట్ర సమితి తెలంగాణలో 10 లోక్ సభ స్థానాలను గెల్చుకుంటుందని సర్వే నిర్ధారించింది. జగన్‌పై ఉన్న అవినీతి ఆరోపణలు విషయంలో ఎన్డీటీవి చేసిన సర్వేలో 74శాతం మంది ప్రజలు సబబే అని, 26శాతం మంది సబబు కాదని అని అనుకుంటున్నట్లు సర్వే తెలిపింది. ప్రస్తుత పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్‌లో మధ్యంతర ఎన్నికలు వస్తే రాష్ట్రంలో ఉన్న 42 లోక్ సభ స్థానాలకు గాను వైఎస్సార్‌సీపీ 21, టీఆర్ఎస్ 10, కాంగ్రెస్ 09, ఇతరులు 2 స్థానాలు పొందే అవకాశం ఉన్నట్లు సర్వేఫలితాలు చూపించారు.

**03 సెప్టెంబరు 2012:**

రాష్ట్ర బిజెపి ఆధ్వర్యంలో న్యూఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద జి. కిషన్‌రెడ్డి నిర్వహించతలపెట్టిన తెలంగాణ పోరుదీక్షలో పాల్గొనేందుకు ఢిల్లీకి బయలుదేరి వెళ్లిన జేయేసీ నేతలు.

**04 సెప్టెంబరు 2012:**

**ముగిసిన సీపీఐ ప్రజా పోరుయాత్ర**

గత నెల 25న ఖమ్మం జిల్లా పాల్వంచలో ప్రారంభమైన సీపీఐ ప్రజా పోరు యాత్ర సోమవారం వరంగల్ జిల్లా హన్మకొండ బహిరంగ సభతో ముగిసింది. హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ముగింపు సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని కృతనిశ్చయంతో ఉన్నప్పుడు, ప్రజలు అదే తమ ఆకాంక్ష అని పోరాటాలు చేస్తున్నపుడు ప్రజాభీష్టం మేరకు తెలంగాణను ఏర్పాటు చేయడం మినహా ప్రత్యామ్నాయం లేదని ఆయన విస్పష్టంగా చెప్పారు. భారత రాజ్యాంగాని సవరించైనా తెలంగాణను ఇవ్వాలని

ఆయన ఉద్ఘాటించారు. పోరుయాత్రకు ఇది ముగింపు కావచ్చు కాని పోరాటానికి ఇది ఆరంభం, తెలంగాణ వచ్చే వరకు ఈపోరాటం కొనసాగుతుందన్నారు. తెలంగాణ, సీమాంధ్ర ప్రజలు శత్రువులుగా కాకుండా సోదరులుగా విడిపోవాలని సీపీఐ కోరుకుంటోందన్నారు.

పోరుయాత్ర రథసారధి సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నారాయణ మాట్లాడుతూ... తెలంగాణ కోసం 800 మంది అమాయకులు ఆత్మహత్యలు చేసుకోవడానికి కేంద్రమే కారణమని, అందుకు కేంద్రంపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో పక్కపక్కనే కూర్చునే లగడపాటి, టీజీ వెంకటేశ్, మధుయాష్కీలు అక్కడోమాట, ఇక్కడో మాట చెప్తున్నారంటే వీరు అక్రమ సంసారం చేస్తున్నట్లేనని అన్నారు. కాంగ్రెస్, టీడీపీలు మూడు ప్రాంతాల్లో మూడు రకాలుగా మాట్లాడుతున్నారని కాని సీపీఐది 23జిల్లాల్లోనూ ఒకే మాట ఉంటుందని అన్నారు.

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బి.జే.పీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి నేతృత్వంలో ప్రారంభమైన తెలంగాణపోరుదీక్ష, హాజరైన బి.జె.పీ జాతీయ నేతలు, తెలంగాణ జేయేసీ నాయకులు, వేలాదిమంది పార్టీ కార్యకర్తలు.

### 05 సెప్టెంబరు 2012:

### ఢిల్లీలో తెలంగాణ మార్చ్ ఉద్రిక్తం

తెలంగాణ రాష్ట్ర సాధనకోసం బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన మూడు రోజుల తెలంగాణ పోరు దీక్షలో భాగంగా రెండో రోజు దీక్షా స్థలం జంతర్‌మంతర్ నుంచి ప్రధాని నివాసానికి చేపట్టిన 'తెలంగాణ మార్చ్' తో ఢిల్లీ వీధులు దద్దరిల్లాయి. పోలీసుల అత్యుత్సాహం హింసాత్మకంగా మారింది. దాదాపు రెండు వేల మంది బీజేపి నాయకులు, కార్యకర్తలు పార్లమెంట్ వీధి మీదుగా ప్రధాని మన్మోహన్ సింగ్ నివాసానికి బయల్దేరగా, పోలీసులు మధ్యలో నిలువరించారు పార్లమెంట్ అదనపు పోలీసు కమీషనర్ కార్యాలయం వద్ద మూడు అంచెల బారికేడ్లు ఏర్పాటు చేసి, నీటి ఫిరంగులతో అడ్డుకున్నారు. బాష్పవాయుగోళాలు ప్రయోగించి ర్యాలీని అడ్డుకున్నారు. ఈక్రమంలో పార్లమెంటు వీధి రెండు గంటల పాటు రణరంగాన్ని తలపించింది. కార్యకర్తలు, మహిళలు బారీకేడ్లను తోసుకొని ముందుకు వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో ఢిల్లీ పోలీసులు లాఠీ చార్జి చేయగా పలువురు కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ర్యాలీని కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిదులకు సైతం గాయాలయ్యాయి. ర్యాలీకి నాయకత్వం వహించిన నిజామాబాద్ ఎమ్మెల్యే యండల లక్ష్మీనారాయణతో పాటు, మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు రతన్‌పాల్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రావుల రామ్‌నాథ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్డే

దేవేందర్‌రెడ్డి, పలువురు కార్యకర్తలకు తీవ్ర గాయాలుకాగా వారిని రాంమనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించారు.

**07 సెప్టెంబరు 2012:**

**తెలంగాణ మార్చ్‌కు విస్తృత ప్రచారం: కోదండరాం**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఈనెల 30న హైదరాబాద్‌లో తెలంగాణ రాజకీయ జేఏసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'తెలంగాణ మార్చ్'కు విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. గురువారం సికింద్రాబాద్‌లోని తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో జేఏసి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం కోదండరాం విలేకరులతో మాట్లాడుతూ... 'ఇంటికో మనిషి –చేతిలో జెండా – ఛలో హైదరాబాద్' నినాదంతో తెలంగాణ వ్యాప్తంగా మార్చ్‌కు గ్రామ గ్రామాన చైతన్య పరుస్తామన్నారు. ఈసమావేశంలో తెలంగాణ మార్చ్ కార్యాచరణను ప్రకటించారు. సర్వత్రా ఉత్కంఠత నెలకొన్న తెలంగాణ మార్చ్‌ను ఎక్కడ, ఎలా నిర్వహిస్తారు? అన్న అంశాన్ని కొంతకాలం రహస్యంగానే ఉంచుతామని కోదండరాం తెలిపారు.

**తెలంగాణ మార్చ్ ప్రచార షెడ్యూలు:**

ఈనెల 9న ఉదయం 9:30కి ఉస్మానియా విశ్వవిద్యాలయం పక్కన మాణికేశ్వర్‌నగర్ నుంచి ర్యాలీ

సకల జనుల సమ్మె జరిగి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా 13వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో పునరంకిత దీక్షలు

తెలంగాణ మార్చ్ కోసం 10వ తేదీ నుంచి అన్ని జిల్లాల్లో సన్నాహక కార్యక్రమాలు

ఈనెల 16న కరీంనగర్ కవాతు పేరుతో ర్యాలీ.

ఈనెల 17న తెలంగాణ వ్యాప్తంగా విలీన దినోత్సవం నిర్వహించాలి.

మార్చ్‌ను శాంతిభద్రతల సమస్యగా చూడవద్దని, తెలంగాణ ప్రజలు శాంతియుతంగా తమ ఆకాంక్షలను వెల్లడించే ప్రయత్నం చేస్తున్నారని కోదండరాం అన్నారు. దీనిపైనే గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. నెలాఖరులోగా కేంద్రం తెలంగాణపై స్పష్టమైన ప్రకటన చేసినట్లయితే 'తెలంగాణ మార్చ్'ను విజయోత్సవంగా నిర్వహిస్తామన్నారు. ఇదేవిషయాన్ని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసినపుడు వారికి వివరించినట్లు తెలిపారు.

**08 సెప్టెంబరు 2012:**

తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ రచయితల వేదిక మరియు

తెలంగాణ జర్నలిస్టుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో "మిత్రజనం పాటల సవ్వడి". విమలక్క నాయకత్వంలో రోజంతా మార్మోగిన పాట.

**13 సెప్టెంబరు 2012:**

## నక్సల్స్ ఎక్కడున్నారో చెప్పండి?

తెలంగాణ వస్తే నక్సల్ సమస్య పెరుగుతుందన్న కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే వ్యాఖ్యలపై తెలంగాణ రాజకీయ, ప్రజా సంఘాల జేఏసి ప్రశ్నించింది. రాష్ట్రంలో నక్సల్స్ తెలంగాణ ప్రాంతంలో ఉన్నారా? ఆంధ్ర ప్రాంతంలో ఉన్నారా? తేల్చి చెప్పాలని వెల్లడించింది. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసి కోచైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఆంధ్ర ప్రాంతంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాల్లో నక్సల్స్ ఉన్నారని అధికారులు, సీమాంధ్ర ప్రతినిధులు చెప్పిన మాటలు విని మాట్లాడవద్దని సూచించారు. ఉద్యమంలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటుందన్న రీతిలో ప్రభుత్వం మాట్లాడుతోందని జీవవైవిధ్య సదస్సుతో తమకెలాంటి సంబంధం లేదన్నారు.

ప్రత్యేక రాష్ట్రం వస్తేనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని జేఏసి నేత శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలంగాణ మార్చ్‌కు రావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ సంఘాలనేత విఠల్ మాట్లాడుతూ బీబీనగర్ నిమ్స్‌కు తెలంగాణ డైరెక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జేఏసి నాయకులు 'తెలంగాణ మార్చ్' వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

**మార్చ్‌ను విజయవంతం చేస్తాం: విద్యార్థి జేఏసి**

తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఈనెల 30న రాజకీయ జేఏసి చేపట్టిన తెలంగాణ మార్చ్‌ను విజయవంతం చేస్తామని తెలంగాణ విద్యార్థి జేఏసి ప్రకటించింది. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల న్యూసెమినార్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. తెలంగాణ మార్చ్‌ను విజయవంతం చేయడానికి ఈనెల 13నుంచి 28వరకు ఉద్యమ కార్యచరణను ప్రకటించారు. ఈనెల

13న 'తెలంగాణ జాగో' పేరుతో తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థుల ర్యాలీలు

15న కళాశాలల నుంచి అమరవీరుల స్థూపం వరకు కవాతు

17న తెలంగాణ ఆత్మగౌరవ జెండాల ఎగురవేత

19న వినాయక మండపాల వద్ద టీజేఏసి జెండాల ఏర్పాటు, రాష్ట్రసాధనకు పూజలు

24న జిల్లా కేంద్రాలు, యూనివర్సిటీల్లో సత్యాగ్రహ దీక్షలు

26న తెలంగాణ అంతటా బైక్ ర్యాలీలు

28న తెలంగాణద్రోహుల ఫ్లెక్సీల నిమజ్జనం

30న మార్చ్ సందర్భంగా రాజ్‌భవన్ ముట్టడి

అక్టోబర్ 1న ప్రపంచ జీవవైవిధ్య సదస్సును అడ్డుకోవడం

ఈ సమావేశంలో జేఏసి అధ్యక్షుడు పున్నకైలాస్, ప్రధాన కార్యదర్శి కరాటే రాజు, అధికార ప్రతినిధి తుంగబాలు, రాష్ట్ర కోఆర్డినేటర్ ఎల్.నెహ్రూ నాయక్, గ్రేటర్ నాయకులు వల్లమల్ల కృష్ణ, మైనార్టీ నాయకులు ఖలీల్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు రామారావు గౌడ్, తెలంగాణ గిరిజన విద్యార్థి సంఘం నేత జీ.శంకర్‌నాయక్, ఓయూ జేఏసి చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, ఎస్.కిశోర్, మైనార్టీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఎండీ ఆక్విల్, సలీం, మాల విద్యార్థి సంఘం నేత సతీష్‌కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**14 సెప్టెంబరు 2012:**

**మార్చ్ ప్రకటనతోనే ఢిల్లీలో కదలికలు: పునరంకిత దీక్షలో నేతలు**

ఈనెల 30న హైదరాబాద్‌లో తెలంగాణ మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించిన తర్వాతనే కేంద్రంలో కదలిక వచ్చిందన్నారు. ఢిల్లీలో జరుగుతున్న రాజకీయ ప్రక్రియ తెలంగాణ ప్రజల ఉద్యమ సెగల ఫలితమేనని తెలంగాణ రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సకల జనుల సమ్మెకు ఏడాది గడిచిన సందర్భంగా ఇందిరాపార్కు వద్ద ఉద్యోగుల సంఘం బుధవారం నిర్వహించిన పునరంకిత దీక్షకు కోదండరాం హాజరై మాట్లాడారు. గత ఏడాది సెప్టెంబర్ 13 నుంచి అక్టోబర్ 24వరకు జరిగిన సకల జనుల సమ్మె ప్రపంచ ఉద్యమాల చరిత్రలో నిలిచిపోయిం దన్నారు. అదే స్ఫూర్తితో ఈనెల 30న గాంధీ చూపిన శాంతి బాటలో తెలంగాణ మార్చ్ నిర్వహించి తీరుతామని అన్నారు.

మాజీ ఎంపీ కే.కేశవరావు మాట్లాడుతూ.. ఉద్యమంలోకి రాని నాయకులను ప్రజలే చూసుకుంటరని అన్నారు. కాంగ్రెస్ ఇప్పుడే తెలంగాణ ఇస్తుందని చెప్పలేనని, కేసీఆర్ బాధ్యత గల మనిషని, ఆయన చెప్పేది విందామని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. టీఆర్ఎస్ నాయకులు ఈటెల రాజేందర్, హరీష్‌రావులు మాట్లాడుతూ లగడపాటి రాజ్‌గోపాల్ వంటి ఆంధ్ర నేతలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అడ్డుపడుతుంటే తెలంగాణ మంత్రులు ఎందుకు నోళ్లుమెదపడం లేదని ప్రశ్నించారు. నగారా అధ్యక్షుడు నాగం జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపి నేతలు లేఖ ఇవ్వడంతో పాటు ఇంతకాలం తెలంగాణ ప్రజలను మోసం చేసినందుకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈనెల 17లోగా కాంగ్రెస్, టీడీపీలు తెలంగాణపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సకల జనుల సమ్మెకాలంలో నాతో పాటు మరో ఐదుగురు మంత్రులు రాజీనామాలు చేసివుంటే ఆనాడే తెలంగాణ

ఏర్పాటయ్యేదని అన్నారు. తెలంగాణ ప్రాంత మంత్రులే తెలంగాణ ద్రోహులని విమర్శించారు.

కార్యక్రమంలో బీజేపి సీనియర్‌నేత బండారు దత్తాత్రేయ, టీజేఏసి కన్వీనర్ స్వామీగౌడ్, కోచైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, ఉద్యోగ సంఘాల నేతలు దేవీప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, విఠల్, రవీందర్‌రెడ్డి, కృష్ణాయాదవ్, మహిళా నాయకురాలు రేచల్, మమత, ఉపాధ్యాయ సంఘం నాయకులు మణిపాల్‌రెడ్డి, రసమయి, ఆర్టీసీ సంఘనేత అశ్వధ్ధామరెడ్డి, దొంతు ఆనందం, విద్యార్థి జేఏసి నేత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## టీయూఎఫ్ బస్సు యాత్ర ప్రారంభం

ఈనెల 30న హైదరాబాద్‌లో తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'తెలంగాణ జన ప్రతిఘటన భేరి'కి తరలిరావాలని ప్రచారం నిర్వహించేందుకు బస్సుయాత్రను చేపట్టారు. గురువారం గన్‌పార్కులో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించి అక్కడి నుంచి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈబస్సు యాత్రను ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ జెండా ఊపి ప్రారంభించారు. టీయూఎఫ్ నాయకురాలు విమలక్క మాట్లాడుతూ ఈనెల 22వరకు తెలంగాణలోని అన్ని జిల్లాలలో ఈబస్సు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణలో ప్రజలందరినీ ఉద్యమం దిశగా ఏకం చేయడానికి ఈబస్సు యాత్ర ఉపయోగపడుతుందని ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. సెప్టెంబర్ 30న జరిగే శాంతియుత ఉద్యమానికి, ప్రభుత్వం పోలీసులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ, కె.కేశవరావు, దేవీప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, వేదకుమార్, దిలీప్‌కుమార్, పాశం యాదగిరి, కిషన్‌రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

## 16 సెప్టెంబరు 2012:

## కరీంనగర్‌కు జనం కవాతు

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ రాష్ట్ర జేఏసి తలపెట్టిన తెలంగాణ మార్చ్ ఎలా ఉంటుందో తెలియజేయడానికి, మార్చ్‌కు చైతన్యపర్చడానికి ఆదివారం కరీంనగర్‌లో కవాతును నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జేయేసీ సమన్వయకర్త పిట్టల రవీందర్ నాయకత్వం వహించారు. జేఏసి పిలుపుమేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విద్యార్థులు, కరీంనగర్‌లోని అన్ని నియోజకవర్గాలు, మండలాల నుంచి జేఏసీ నాయకులు, సీపీఐ, టీఆర్ఎస్, బీజేపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కరీంనగర్ రోడ్లన్ని జనసంద్రాలై, జైతెలంగాణ నినాదాలతో మార్మోగాయి. ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం జెండా ఊపి కవాతును ప్రారంభించారు. కళాకారుల పాటలు, ఆటలతో

సుమారు ఆరు కిలోమీటర్ల పొడవున కవాతు జనంతో నిండిపోయింది. కవాతులో తెలుపు (జేఏసి), ఎరుపు (సీపీఐ), గులాభీ (టీఆర్ఎస్), కాశాయం (బీజేపి), పసుపు (టీడీపి)ఇలా వివిధ రంగుల జెండాలు కనువిందు చేశాయి. జిల్లా నలుమూలల నుంచి మధ్యాహ్నం 12గంటలకే జనం నగరంలోని సత్యలక్ష్మి గార్డెన్స్‌కు చేరుకున్నారు.

కోర్టు చౌరస్తానుంచి న్యాయవాదులు, తెలంగాణ ఎల్డర్స్ ఫోరం తరుపున సీనియర్ సిటిజన్స్, ముస్లీం జమాతె ఇస్లామీ హింద్ నాయకులు, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు, తట్టా, చెమ్మాస్‌లతో సింగరేణి కార్మికులు, బోనాలతో మహిళలు, పెద్దపల్లి రాఘవపురం ఒగ్గుడోలు కళాకారులు, తెలంగాణ ఆర్టీసి మజ్దూర్ యూనియన్, ప్రైవేటు కళాశాలల సంఘం, తెలంగాణ రీజనల్ టీచర్స్ యూనియన్, హుజురాబాద్ స్పందన సొసైటీ, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం, డాక్టర్, ఇంజనీర్స్ జేఏసీలు, వివిధ విద్యార్థి సంఘాలు, వివిధ ప్రాంతాలనుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులు బైక్‌లపై ర్యాలీగా తరలివచ్చారు. ఎన్టీఆర్ చైక్ నుంచి మూడు గంటలకు ప్రారంభమైన కవాతు సుమారు ఆరు కిలోమీటర్ల మేర రోడ్లన్నీ తెలంగాణ వాదులతో నిండిపోయి జైతెలంగాణ నినాదాలతో సర్కస్‌గ్రౌండ్ వరకు ఉత్సాహంగా ర్యాలీ సాగింది. ఇది తెలంగాణ మార్చ్ ఎలా ఉండబోతోందో కవాతు రుచి చూపించింది. అనంతరం సాయంత్రం సర్కస్ గ్రౌండ్‌లో జిల్లా జేయేసీ చైర్మెన్ బొత్తా వెంకటమల్లయ్య అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేయేసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పిట్టల రవీందర్, జిల్లా కన్వీనర్ జె. రవీందర్, జిల్లా కో-ఆర్డినేటర్ జున్నోజు వెంకటేశ్వర్లు, తదితరులు నాయకత్వం వహించారు. పలువురు రాష్ట్ర జేయేసీ నాయకులు హాజరయ్యారు.

**అన్ని జిల్లాల్లో కవాతు నిర్వహిస్తాం**

కరీంనగర్‌లో కవాతు భారీఎత్తున విజయవంతం అయిందని, దీని స్ఫూర్తిగా అన్ని జిల్లాల్లో ఇలాంటి కవాతులను నిర్వహించి తెలంగాణ మార్చ్‌కు తరలివచ్చేలా ప్రజల్లో చైతన్యాన్ని పెంచుతామని జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం సాయంత్రం కవాతు అనంతరం స్థానిక సర్కస్‌గ్రౌండ్స్‌లో జరిగిన బహిరం గసభలో ఆయన మాట్లాడుతూ ఆక్టోబర్ 1నుంచి జీవవైవిద్యసదస్సు, 29న గణేశ్ నిమజ్జనం ఉన్నందున 30న మార్చ్‌కు అనుమతి ఇవ్వలేమని ప్రభుత్వం చెప్పడం సరైం ది కాదన్నారు. తెలంగాణలో శాంతిభద్రతల సమస్య లేదని ఆంధ్రా పాలకులే సమస్యగా మారారని అన్నారు. రాష్ట్ర సాధనలో మంత్రి శ్రీధర్‌బాబు బాధ్యత తీసుకోవాలని కోరా రు. కవాతు సందర్భంగా శ్రీపాదరావు విగ్రహం వద్ద చోటుచేసుకున్న సంఘటనను గుర్తుచేశారు. ఉద్యమానికి ద్రోహం చేసేందుకు ప్రయత్నం చేస్తే తన తండ్రికి పట్టినగతే తనకూ పడుతుందని శ్రీధర్‌బాబుపై మండిపడ్డాడు. ఈనెల 30న ఆంధ్రపెత్తనాన్ని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయాలన్నారు. కరెంటు కోతలు, ఎరువుల కొరతలు,

సమస్యలకు సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అసమర్ధపాలన కారణమని అని విమర్శించారు.

**17 సెప్టెంబరు 2012:**

**ఓయూలో మళ్లీ ఉద్రిక్తత**

ఓయూ మరోసారి ఉద్రిక్తంగా మారింది. తెలంగాణ విలీనదినంగా అధికారి కంగా నిర్వహించాలన్న డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి విద్యార్థులు బయల్దేరారు. కానీ, అందుకు అనుమతి లేదంటూ పోలీసులు వారిని ఎన్‌సీసీ గేటు వద్దే అడ్డుకుని గేట్లు మూసేశారు. దీంతో కోపోద్రిక్తులైన విద్యార్థులు పోలీసులపై రాళ్లు రువ్వారు. వారిని అదుపు చేసేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించాల్సి వచ్చింది. ఈ వరుస సంఘటనలతో దాదాపు మూడు గంటలపాటు ఎన్‌సీసీ గేటు వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

1000 రోజులకు చేరిన భూపాలపల్లి రిలేనిరాహారదీక్షలు. రమేష్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు.

**18 సెప్టెంబరు 2012:**

**నల్గొండలో కళాకారుల 'అరుణ' కవాతు**

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కళాకారుల కవాతు నిర్వహించి అనంతరం బహిరంగ సభ ఏర్పాటుచేశారు. మార్చ్‌ను విజయవంతం చేయాలని చేపట్టిన ఈ కవాతుకు నగరంలో విశేష స్పందన లభించింది. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపల్లి లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా పదిజిల్లాల్లో కవాతుకు భారీగా తరలివస్తున్నారని, మార్చ్ విజయవంతానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని దీంతో స్పష్టంగా తెలుస్తున్నదని అన్నారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ఇక మిగిలింది దంచుడు కార్యక్రమమేనని అన్నారు. న్యూడెమాక్రసీ కేంద్ర నాయకులు సూర్యం మాట్లాడుతూ ఉద్యమానికి ద్రోహం చేసిన నాయకులను తెలంగాణలో అడుగుపెట్టనీయ వద్దని పిలుపునిచ్చారు. ప్రగతీశీల మహిళా సంఘం అధ్యక్షురాలు వి.సంధ్య మాట్లాడుతూ జానారెడ్డి కాలు తెలంగాణలో, బుర్ర సీమాంధ్రలో ఉందన్నారు. సీమాంధ్ర నాయకుల మోచేతీనీళ్లు తాగుతున్న దానం నాగేందర్, ముఖేష్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, తలసానిని తరిమికొట్టాలని ఆమె అన్నారు. ఎర్రరమేశ్, వసంత, విజయ, గంట కావ్య, విజయలక్ష్మి, పుష్ప, సీత పాల్గొన్నారు.

**21 సెప్టెంబరు 2012:**

**తెలంగాణ బాపూజీ ఇక లేరు**

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు మాజీ మంత్రి

కొండా లక్ష్మణ్ బాపూజీ ఈరోజు ఉదయం 9.30గంటలకు కన్నుమూశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొని జైలు శిక్ష అనుభవించిన బాపూజీ వయస్సు 98 సంవత్సరాలు. బాపూజీ ఆదిలాబాద్ జిల్లా వాంఖిడి గ్రామంలో 1915లో సెప్టెంబర్ 27న జన్మించారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ నేడు ఆయన స్వగృహంలో కన్నుమూశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తన జీవితాన్ని ధారపోశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యమం తారాస్థాయికి చేరిన సమయంలో 1969లో ఆయన మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం రాజీనామా చేసిన మొట్టమొదటి మంత్రిగా కొండా లక్ష్మణ్‌బాపూజీ చరిత్ర సృష్టించారు.

మహిళా జేయేసీ ఏర్పాటు ప్రయత్నాల్లో భాగంగా సికింద్రాబాద్‌లోని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌లో వి. సంధ్య అధ్యక్షతన ప్రత్యేక సమావేశం.

**22 సెప్టెంబరు 2012:**

**మార్చ్‌కు మద్దతుగా నల్గొండలో భారీ ర్యాలీ**

ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలో తెలంగాణ జాగృతి, బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య(బీడీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సావర్కర్ నగర్ నుండి రెండు వేల మంది విద్యార్థులతో రామాలయం, రామగిరి సెంటర్ మీదుగా తెలంగాణ చౌక్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ చౌక్‌లో జరిగిన విద్యార్థి పోరు యాత్ర సభను నిర్వహించారు. ఈసభలో జాగృతి జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, బీడీఎస్ఎఫ్ అధ్యక్షుడు సైదులు గౌడ్‌లు మాట్లాడుతూ ఈనెల 30లోపు తెలంగాణపై కేంద్రం ప్రకటన చేయకపోతే హైదరాబాద్‌ను లక్షలాది మందితో దిగ్బంధం చేస్తామని, సీమాంధ్ర పాలకుల భరతం పడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్, టీడీపి నాయకులు తెలంగాణ మార్చ్‌లో ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని లేదంటే వారిని రాజకీయంగా పాతరేస్తామని హెచ్చరించారు. తెలంగాణ మార్చ్‌కు విద్యార్థులు ఇంటికొకరు చొప్పున తరలివచ్చి తెలంగాణ ఆకాంక్షను బలంగా వినిపించాలని, సీమాంధ్రనాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాలని వారు విజ్ఞప్తి చేశారు.

1000 రోజులకు చేరిన బోధన్‌లో రిలే నిరాహారదీక్షలు. గోపాల్‌రెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న దీక్షలు.

**23 సెప్టెంబరు 2012:**

సిద్దిపేట జేయేసీ ఆధ్వర్యంలో 1000 రోజులకు చేరిన రిలేనిరాహార దీక్షలు.

డాక్టర్ పాపయ్య నాయకత్వంలో కొనసాగుతున్న దీక్షలు.

స్థానిక జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ మార్చ్ విజయవంతం చేయాలని కోరుతూ పెద్దపెల్లి పట్టణంలో భారీ ర్యాలీ. నాయకత్వం వహించిన జేఏసీ చైర్మన్ తేజనమూర్తి, డొంకెన రవి, తదితరులు.

**24 సెప్టెంబరు 2012:**

**'సాగరహారం'గా ట్యాంక్‌బండ్‌పై 'తెలంగాణ మార్చ్'**

ట్యాంక్‌బండ్, నక్లెస్‌రోడ్డుపైనే 'తెలంగాణ మార్చ్'ను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ప్రకటించారు. సోమవారం టీఎన్జీవో భవన్‌లో జేఏసి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం కోదండరాం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ మార్చ్‌కు 'సాగరహారం' అనే పేరును ఖరారు చేశామన్నారు. కవాతు శాంతియుతంగా నిర్వహించాలని ఆయన కోరారు.

**25 సెప్టెంబరు 2012:**

**విగ్రహ ధ్వంసం కేసులో విమలక్క అరెస్టు**

కాసుబ్రహ్మానందరెడ్డి విగ్రహం ధ్వంసం కేసులో తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ నాయకురాలు విమలక్కను సోమవారం ఉదయం బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమెపై 147, 148, 149, 435, 427, 332, 304 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వైద్యపరీక్షలు జరిపించిన అనంతరం నాంపల్లి కోర్టులో ఆమెకు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేశారు.

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని కొంతమంది ఇటీవల ధ్వంసం చేశారు. దీనిపై పోలీసుల విచారణ కొనసాగుతుండగా, ఆ విగ్రహాన్ని ధ్వంసం చేసింది తమ కార్యకర్తలేనని టీయూఎఫ్ నాయకురాలు విమలక్క ప్రకటించారు. కాసు తెలంగాణ ద్రోహి కావటం వల్లనే ఈ చర్యకు పాల్పడినట్లు తెలియజేశారు. దీంతో పోలీసులు దోమలగూడ ప్రాంతంలోని ఆమె నివాసంలో అరెస్టు చేశారు.

**తెలంగాణపై రాష్ట్రపతికి ప్రముఖుల విన్నపం**

ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ మార్చ్‌ను శాంతియుతంగా జరుపుకునేందుకు అవకాశం కల్పించాలని రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి హైదరాబాద్ నగర సామాజిక ప్రముఖులు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, హైదరాబాద్ ఫోరం ఫర్ తెలంగాణ, ప్రోగ్రసివ్ తెలంగాణ ఫౌండేషన్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మార్చ్‌ను అడ్డుకునే హక్కు పోలీసులకు లేదని, ఈవిషయంలో రాష్ట్రపతి జోక్యం చేసుకొని మార్చ్ నిర్వహణకు సహకరించాలని

వారు కోరారు. జీవవైవిధ్య సదస్సు పేరుతో మార్చ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజల హక్కులను, స్వేచ్ఛను హరించాలని యూఎన్‌వో సదస్సు చెప్పిందా అంటూ ప్రశ్నించారు. ఈనెల 17న ఉపముఖ్యమంత్రితో సహా 13మంది తెలంగాణ మంత్రులు లేఖరాసిన విషయాన్ని మీదృష్టికి తెస్తున్నాం. సెప్టెంబర్ 30నాటి తెలంగాణ కవాతుకు పలువురు కాంగ్రెస్ ఎంపీలు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. అందువల్ల చివరగా మీదృష్టికి తెచ్చేదేమంటే.. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోవడం చాలా అపాయకరం. ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం నడుచుకొనేలా కేంద్రప్రభుత్వం ద్వారా మార్గనిర్దేశాలు జారీ చేయించండని కోరారు.

**లేఖలో సంతకం చేసిన వారు:**

1. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి (సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి)
2. ప్రొఫెసర్ సీహెచ్.హనుమంతరావు (హైదరాబాద్ వర్సిటీ వైస్‌ఛాన్సలర్)
3. జస్టిస్ సర్దార్ అలీఖాన్
4. జస్టిస్ ఉపేంద్రలాల్ (రాష్ట్ర హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి)
5. అజీజ్ పాషా (మాజీ ఎంపీ)
6. చుక్కారామయ్య (ఎమ్మెల్సీ)
7. కేఆర్ వేణుగోపాల్ (రిటైర్డ్ ఐఏఎస్)
8. నరేంద్ర లూథర్ (రాష్ట్ర ప్రభుత్త మాజీ కార్యదర్శి)
9. ఎ.గోపాలకిషన్ (మెడిసిటి అసుపత్రి డైరెక్టర్)
10. పీఎం భార్గవ (సీసీఎంబీ వ్యవస్థాపక నిర్దేశకులు)
11. హెచ్ రాజేంద్రప్రసాద్ (చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్)
12. బూర్గుల నర్సింగ్‌రావు (స్వాతంత్ర్య సమరయోధులు)
13. మహబూబ్ ఆలంఖాన్ (మైనార్టీ కమీషన్ మాజీ అధ్యక్షుడు)
14. జహీరుద్దీన్ అలీఖాన్ (సియాసత్ ఎడిటర్)
15. రమా మెల్కొటే (ఓయూ మాజీ ప్రొఫెసర్)
16. హమీద్ మహ్మద్‌ఖాన్ (మూవ్‌మెంట్ ఆఫ్ పీస్ అండ్ జస్టిస్)
17. బి.నర్సింగరావు (సినీదర్శకులు)
18. విఠల్‌రాజన్
19. వి.కొండల్‌రావు (రచయిత)
20. పొత్తూరి వెంకటేశ్వరరావు (సీనీయర్ పాత్రికేయుడు)

**27 సెప్టెంబరు 2012:**

**సచివాలయం వద్ద 144 సెక్షన్**

సచివాలయం ప్రాంగణంలో అధికారులు 144 సెక్షన్ విధించారు. బహిరంగ సభల నిర్వహణ, నినాదాలు, ఊరేగింపులు, ప్రదర్శనలపై నిషేధం విధించారు. ఈపరిస్థితి నవంబర్ 18వరకు కొనసాగనున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేస్తామని సీపీ అనురాగ్ శర్మ ప్రకటించారు. సీబ్లాక్‌లోని ముఖ్యమంత్రి పేషీ ఎదుట ఎక్కువగా ధర్నాలు, పికెటింగ్‌లు, ర్యాలీలు, నిరసనలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఈ 144 సెక్షన్ విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల సచివాలయ ప్రాంగణంలో 5గురు, అంతకంటే ఎక్కువ మంది గుమిగూడి కన్పించడం, నినాదాలు, ప్రదర్శనలు, ఆందోళనలు చేయడం నిషేదించబడతాయి.

**తెలంగాణ మార్చ్‌కు అనుమతి ఇవ్వలేం**

ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ మార్చ్ సాగరహారానికి అనుమతిని ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఎమ్మెల్యేలు ఈరోజు మధ్యాహ్నం డీజీపి దినేష్‌రెడ్డిని కలిశారు. టీఆర్ఎస్ , బీజేపి, సీపీఐకి చెందిన 12మంది ఎమ్మెల్యేలతో పాటు జేఏసి నేతలు డీజీపిని కలిశారు. అయితే తెలంగాణ మార్చ్‌కు అనుమతిని డీజీపీ నిరాకరించారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తిపై దినేష్‌రెడ్డి స్పందిస్తూ శాంతిభద్రతల దృష్ట్యా అనుమతిని ఇవ్వలేమని తేల్చిచెప్పారు.

అనంతరం ఇదే విషయమై హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యేలు కలిసి మార్చ్‌లో ప్రత్యక్షంగా పాల్గొనాలని కోరారు. అయితే సీఎంతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారని టీఆర్ఎస్ ఎల్పీ నేత ఈటెల రాజేందర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా తెలంగాణ మార్చ్‌లో పాల్గొంటున్నామని, అలాగే తెలంగాణ ప్రాంతంలోని మిగితా పార్టీల ఎమ్మెల్యేలు కూడా పాల్గొని మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మార్చ్‌కు అనుమతి ఇవ్వకపోతే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వందే పూర్తి బాధ్యత అని ఆయన హెచ్చరించారు.

**ఓయూలో కొనసాగుతున్న ఉద్రిక్తత...**

కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి సందర్భంగా ఓయూ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈర్యాలీ ఉస్మానియా క్యాంపస్ నుండి జలదృశ్యం వరకు నిర్వహించి, అక్కడ బాపూజీకి నివాళులు అర్పించాలని విద్యార్థులు ర్యాలీగా బయల్దేరారు. ర్యాలీని ఎన్‌సీసీ గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ర్యాలీకి అనుమతి లేదని క్యాంపస్ దాటికి బయటకు వెళ్లేందుకు అనుమతించమని పోలీసులు పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ర్యాలీ నిర్వహించి తీరుతామని విద్యార్థులు

పట్టుబట్టారు. విద్యార్థులు గేటు వద్దే కొండాలక్ష్మణ్‌బాపూజీ ఆశయాలను కొనసాగిస్తామని, తెలంగాణ సాధించేవరకు ఉద్యమాన్ని నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రెండు నిమిషాల వరకు మౌనం పాటించారు. గంట వరకు ప్రశాంతంగా ఉన్న విద్యార్థులు ఎంతకీ పోలీసులు కవాతుకు నిర్వహించడానికి, గేటు దాటడానికి అనుమతి ఇవ్వకపోవడంతో విద్యార్థులు పోలీసులపై రాళ్ల వర్షం కురిపించారు. దీంతో పోలీసులు విద్యార్థులపై టియర్‌గ్యాస్‌ను ప్రయోగించారు.

**అనుమతి ఇచ్చారు.. అరెస్టు చేశారు**

ఈనెల 30న తెలంగాణ మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఈరోజు జరుగనున్న బహిరంగ సభను రద్దు చేసి, నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన న్యూడెమాక్రసీ నేత అప్పారావు మీడియాతో మాట్లాడుతూ ఈసభను నిర్వహించేందుకు ముందస్తుగా తాము అనుమతి తీసుకున్నామని, పోలీసు అధికారులు ఈసభకు అనుమతిని ఇచ్చారని దాంతో నేడు సభను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈరోజు మధ్యాహ్నం మరికొద్దిసేపట్లో సభ ప్రారంభమయ్యే తరుణంలో పోలీసులు ఏర్పాట్లన్నిటినీ తొలగించాలని, పై అధికారుల నుంచి అనుమతిని రద్దుచేయాలని ఆదేశాలు వచ్చాయని అంటూ నిర్వాహకులను అదుపులోకి తీసుకొని సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈఅరెస్టులను తెలంగాణవాదులు తీవ్రంగా ఖండిస్తున్నారు. వరంగల్ పట్టణం మొత్తం పోలీసుల వలయంలో బంధీ అయింది. ఎక్కడ చూసినా సాయుధులైన పోలీసులు కన్పిస్తున్నారు. పట్టణంలో యుద్ధవాతావరణం కన్పిస్తోంది. అప్పారావు అరెస్టుపై పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య మాట్లాడుతూ తాను కూడా ఈసభలో వక్తగా పాల్గొనాల్సి ఉందని కాని సభను రద్దుచేసి అక్రమంగా నేతలను అరెస్టు చేస్తున్నారన్న విషయం తెలిసి మార్గమధ్యంలోనే వెనెక్కి తిరిగి వెళ్లాల్సి వచ్చిందన్నారు. అనుమతి తీసుకున్నప్పటికి దాన్ని రద్దు చేసామని ప్రకటించటం శోచనీయమని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే చర్యలను ప్రభుత్వం మానుకోవాలని ఆమె సూచించారు. మార్చ్‌ను అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగితుందని విమర్శించారు. తెలంగాణ వాదులు ఈనిర్భంధాలపై తీవ్రంగా నిరసన తెలుపుతున్నారు. అరచేతిని అడ్డుపెట్టి ఏవిధంగానైతే సూరీడును ఆపలేరో, అదేవిధంగా ఉప్పెనలా ఎగుస్తున్న తెలంగాణ ఉద్యమాన్ని పోలీసులతో అపలేరని, అణచాలని ప్రయత్నిస్తే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

**28 సెప్టెంబరు 2012:**

**సీఎం గ్రీన్‌సిగ్నల్... నక్లెస్‌రోడ్‌లో సాగరహారానికి ‘సై’**

తెలంగాణ మార్చ్ (సాగరహారం)కు ప్రభుత్వం ఎట్టకేలకు అనుమతినిచ్చింది.

ట్యాంక్‌బండ్‌కు బదులు వేదికను నక్లెస్‌రోడ్‌కు మార్చుకోవాలని సూచించింది. సెప్టెంబర్ 30న మధ్యాహ్నం 3గంటల నుండి 7గంటల వరకు మార్చ్‌ను నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. తెలంగాణ మార్చ్ సందర్భంగా ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగవని తెలంగాణ జేఏసి లిఖితపూర్వక హామీ ఇవ్వడంతో ప్రభుత్వం దిగివచ్చింది.

సంజీవయ్య పార్కునుంచి నక్లెస్‌రోడ్డు వరకు అనుమతి ఇవ్వడంతో మంత్రులు జానారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సారయ్య, ఇంచార్జి డీజీపి దినేష్‌రెడ్డి, నగరపోలీస్ కమీషనర్‌లతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. గతకొద్ది రోజులుగా జేఏసి నేతలు అనుమతి కోసం ప్రయత్నిస్తుండగా నిమజ్జనం, జీవవైవిధ్య సదస్సు, అలాగే ఇంతకు ముందు మిలియన్ మార్చ్ సంఘటనల నేపథ్యంలో ప్రభుత్వం మార్చ్‌కు అనుమతి ఇవ్వడానికి నిరాకరించింది. అయితే తెలంగాణ మంత్రులు, జేఏసి, ప్రజాసంఘాల ఒత్తిడి మేరకు ఈరోజు సాయంత్రం అందరితో చర్చించిన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఎట్టకేలకు కొన్ని షరతులతో కూడిన అనుమతిని ప్రకటించారు.

సమావేశం అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా తెలంగాణ రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ మార్చ్‌కు అనుమతి సాధించడం అద్భుతమైన విజయమని, అలాగే శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా మార్చ్‌ను నిర్వహించి విజయవంతం చేయాలని తెలంగాణవాదులను కోరారు. మార్చ్‌ను గాంధేయవాదంలోనే నిర్వహిస్తామని, మాటతప్పేది లేదని టీఎన్జీవో నేతలు పేర్కొన్నారు.

టీఆర్ఎస్ ఎల్పీ నేత ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ఇప్పటికే బైండోవర్ల పేరిట ఎవరెవరిపై కేసులు నమోదు చేశారో వాటన్నిటినీ రద్దుచేయాలని, అరెస్టు చేసిన వారందరిని కూడా బేషరతుగా విడుదల చేయాలని, హైదరాబాద్‌కు వచ్చే దారులన్నీ దిగ్బంధం చేశారని వాటిన వెంటనే ఎత్తివేయాలని, మార్చ్‌ను నిర్వహించుకునేందుకు శాంతియుత వాతావరణాన్ని కల్పించాలని కోరగా వీటన్నిటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నగార సమితి నేత నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మార్చ్‌కు అనుమతిని సాధించేందుకు కృషిచేసిన తెలంగాణ మంత్రులను ఆయన అభినందించారు. తెలంగాణ మార్చ్‌కు అనుమతి ఇవ్వడంతో తెలంగాణ వాదుల్లో ఆనందం వ్యక్తం అయింది. మార్చ్‌నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై తెలంగాణ జేఏసి స్టీరింగ్ కమిటీ చర్చించింది.

### పోలీసుల దిగ్భంధంలో భాగ్యనగరం

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా పోలీసులు, సాయుధ దళాలు

కన్పిస్తున్నాయి. నగరంలో అడుగడుగునా పోలీసులు కన్పిస్తున్నారు. ప్రధాన రహదారులపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈనెల 29న వినాయక నిమజ్జనం, 30న తెలంగాణ మార్చ్, మరుసటి రోజు నుంచి ప్రపంచ జీవవైవిద్య సదస్సు జరుగనున్న నేపథ్యంలో ఎక్కడా అవాంచనీయ సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరం అంతటా పోలీసులతో యుద్ధవాతావరణాన్ని తలపిస్తోంది.

నగర పోలీసులే కాకుండా, జిల్లాల నుంచి, ఇతర రాష్ట్రాలనుంచి అదనపు బలగాలను భారీగా నగరానికి తరలించారు. తెలంగాణ మార్చ్‌కు అనుమతి ఇవ్వలేమని ప్రభుత్వం, ఎలాగైనా మార్చ్‌ను జరిపితీరుతామని తెలంగాణ వాదులు ప్రకటనలు చేస్తుండడంతో నగరంలో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. మార్చ్‌కు అనుమతి లేదని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఇంచార్జి డీజీపి ప్రకటించారు.

మార్చ్‌కు ఒక్కొక్కరుగా అన్ని వర్గాలనుంచి మద్ధతు పెరుగుతుండడంతో ఎలాగైనా మార్చ్‌ను నిర్వహిస్తారని ప్రభుత్వానికి అర్థమైపోయింది. దీంతో నగరం లోపల, చుట్టూ భారీగా సాయుధ బలగాలను మోహరించి, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. మార్చ్‌కు వెళ్తున్నారనే అనుమానం వచ్చిన వారిని అదుపులోకి తీసుకోవడం, లేదా వెనెక్కి పంపిస్తున్నారు. వివిధ పార్టీల, జేఏసిల, ప్రజాసంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టుచేసి బైండోవర్ చేస్తున్నారు. మార్చ్‌కు గడువు సమీపిస్తున్నకొద్దీ తెలంగాణ అంతటా ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని త్వరగా ముగించి, తెలంగాణ మార్చ్‌ను కట్టడి చేయాలనే వ్యూహంతో చర్యలు చేపడు తున్నట్లు డీజీపి దినేష్‌రెడ్డి ప్రకటించారు.

**29 సెప్టెంబరు 2012:**

**అన్ని ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు**

తెలంగాణ మార్చ్‌ను సాకుగా చూపిస్తూ రేపు ఎంఎంటీఎస్ రైళ్లను దక్షణమధ్య రైల్వే శాఖ రద్దు చేసింది. సబర్బన్ రైల్వే సర్వీసులను, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రద్దు చేస్తున్నట్లు సమాచారం. నగరంలో అన్ని ఎంఎంటీఎస్ రైళ్లతో పాటు నిర్వాహక కారణాలను సాకుగా చూపి కొన్ని ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. నాందేడ్ – హైదరాబాద్, కాచిగూడ – బోధన్, మనుగూరు – సికింద్రా బాద్ ప్యాసింజర్లతో పాటు మరికొన్ని ప్యాసింజర్లను రద్దు చేస్తున్నట్లు దక్షణ మధ్య రైల్వే ప్రకటించింది.

రైళ్లు రద్దుచేయడం ద్వారా తెలంగాణ మార్చ్‌కు జనం తాకిడిని కొంతమేరకు తగ్గించవచ్చనే ఆలోచనతోనే ఈనిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. కాగా దీనిపై తెలంగాణవాదులు స్పందిస్తూ రైళ్లు, బస్సు సర్వీసులను నిలిపివేయడం, పోలీసుల

అరెస్టులు, బైండోవర్లు ఉద్యమాన్ని అణచలేవని, ఎలాగైనా మార్చ్‌లో పాల్గొని తీరుతామని, హైదరాబాద్‌కు చేరుకోవడానికి ఎటువంటి నిర్బంధాలనైనా తెంచుకుని ఉప్పెనలా వస్తామని, మార్చ్‌ను విజయవంతం చేసితీరుతామని స్పష్టంచేస్తున్నారు.

**జేఏసి కోఆర్డినేటర్ పిట్టల రవీందర్ కిడ్నాప్... రహస్యప్రాంతానికి తరలింపు**

తెలంగాణ మార్చ్ నేపథ్యంలో తెలంగాణ రాజకీయ జేఏసి సమన్వయకర్త పిట్టల రవీందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిన్న మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో న్యూఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బయలుదేరిన పిట్టల రవీందర్‌ను మార్గమధ్యంలో అరెస్టు చేయగా, పోలీసులు ఆయనను ఎక్కడికి తరలించారనేది సమాచారం బయటకు రాలేదు. నేటి ఉదయం వరకు కూడా పిట్టల రవీందర్‌ను ఎక్కడ ఉంచారనేది అటు కుటుంబ సభ్యులకు గాని, ఇటు జేఏసి వర్గాలకు కాని చెప్పడం లేదు. దీంతో ఇరువురిలో ఆందోళన వ్యక్తం అవుతోంది.

విషయం తెలుసుకున్న జేఏసి నేతలు ఈసంఘటనను తీవ్రంగా ఖండించారు. వెంటనే పిట్టల రవీందర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓవైపు మార్చ్‌ను నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతినిస్తూ, జేఏసిలో చురుకుగా పనిచేసే నేతలపై నిర్భంధకాండను కొనసాగించడం సరికాదని, జేఏసి నుంచి లిఖిత పూర్వక హామీ ఇచ్చినప్పటికీ ఇలాంటి చర్యలకు పాల్పడడం బాధాకరమని జేఏసి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సీమాంధ్ర ప్రభుత్వం ఎలాగైనా తెలంగాణ మార్చ్‌ను విఫలం చేసే ప్రయత్నంలో భాగంగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని పలువురు తెలంగాణ వాదులు మండిపడుతున్నారు. తెలంగాణ మార్చ్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించాలని పిట్టల రవీందర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తే సహించేది లేదని హెచ్చరిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉస్మానియా క్యాంపస్‌లో భారీ బహిరంగ సభ. మందకృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో పాల్గొన్న అన్ని పార్టీల నాయకులు.

**30 సెప్టెంబరు 2012:**

**జనసంద్రమైన నక్లెస్‌రోడ్**

నక్లెస్‌రోడ్‌లో నిర్వహిస్తున్న సాగరహారానికి ఒక్కరొక్కరుగా నేతలు, కార్యకర్తలు, వివిధ సంఘాలు వచ్చి చేరుకుంటున్నారు. పోలసులు ఎన్ని నిర్బంధాలకు గురి చేసినప్పటికీ బారికేడ్లను, ఇనుపకంచెలను తెంచుకొని వేదిక వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 2గంటల వరకే సభాప్రాంగణం వద్ద ఇసుకవేస్తేరాలనంత జనం చేరుకున్నారు. నక్లెస్ రోడ్ ప్రాంతమంతా జన సముద్రాన్ని తలపిస్తోంది. తెలంగాణ జెండాలు, వివిధ పార్టీల జెండాలతో అక్కడ తెలంగాణ ఆకాంక్షలు రెపరెపలాడు

తున్నాయి. తెలంగాణ నినాదాలతో ఆ ప్రాంత మంతా మార్మోగిపోతోంది. రసమయి బృందం తెలంగాణ ఆట పాటలతో ఉద్రూతలూగిస్తున్నారు. న్యూడెమాక్రసీ, బీజేపి, టీఆర్ఎస్ పార్టీల శ్రేణులు ర్యాలీలుగా నక్లెస్ రోడ్‌కు తరలివచ్చారు. ర్యాలీగా వస్తున్న వారిపై పోలీసులు లాఠీచార్జీ చేయడం, టియర్‌గ్యాస్ ప్రయోగించడం, బారికేడ్లను, ముళ్లకంచెలను అడ్డుగా పెట్టినప్పటికీ వాటన్నింటిని ఛేదించుకొని వేదికవద్దకు చేరుకున్నారు.

## ఓయూలో కొనసాగుతున్న ఉద్రిక్తత

తెలంగాణ మార్చ్‌కు నక్లెస్‌రోడ్‌కి ర్యాలీకి వెళ్లడానికి ప్రయత్నించిన ఓయూ విద్యార్థులను పోలీసులు ఎన్‌సీసీ గేటు వద్ద అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య భీకర పోరు కొనసాగుతుంది. సాగరహారం కార్యక్రమం ప్రారంభమైనప్పటికీ అక్కడికి వెళ్లడానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో విద్యార్థులు కోపోద్రిక్తులై పోలీసులపై రాళ్ల వర్షం కురిపిస్తున్నారు. దీంతో పోలీసులు విద్యార్థులను చెదరగొట్టడానికి బాష్పవాయు గోళాలను ప్రయోగిస్తున్నారు. దీంతో కొంత విద్యార్థులకు తీవ్రగాయాలయినట్లు సమాచారం. మార్చ్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పటికి నక్లెస్ రోడ్‌కు చేరుకోవడానికి అనుమతించకపోవడం ఏంటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఐదుగురి కంటే ఎక్కువ సంఖ్యలో గుంపుగా బయటకు వెళ్లడానికి అనుమతి లేదని పోలీసులు చెబుతున్నారు. ర్యాలీగా వెళ్తామని తమకు అనుమతించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే కొంత మంది నక్లెస్ రోడ్‌కు చేరుకున్నట్లు సమాచారం. అయనప్పటికీ ర్యాలీగా వెళ్లాలని విద్యార్థులు పట్టుబట్టడంతో ఉదయం నుంచి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం యుద్ధభూమిని తలపిస్తోంది. ఎప్పుడు ఏంజరుగుతుందో తెలియదు. పోలీసులు నిర్విరామంగా టియర్‌గ్యాస్‌ను ప్రయోగిస్తూనే ఉన్నారు.

## తెలంగాణ వచ్చేదాకా నక్లెస్‌రోడ్‌లోనే ఉందాం: కోదండరాం

రేపటివరకు నక్లెస్‌రోడ్‌లోనే ఉందామని జేఏసి నేతలు ప్రకటించారు. ప్రభుత్వం తెలంగాణ మార్చ్‌కు అనుమతి ఇచ్చికూడా తెలంగాణవాదులను స్వేచ్ఛగా పాల్గొనకుండా నిర్బంధాలకు గురిచేయడం, ఓయూ విద్యార్థులను తెలంగాణ మార్చ్‌లో పాల్గొనడానికి అనుమతి ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈరాత్రికి, రేపు తెల్లారేవరకు ఇక్కడే ఉండాలని తెలంగాణపై స్పష్టమైన వైఖరిని ప్రకటించేవరకు ఇక్కడినుండి కదిలేది లేదని జేఏసి తన నిర్ణయాన్ని వేదికపైన ప్రకటించింది. ప్రభుత్వం ఇచ్చిన సమయం రాత్రి 7గంటలు దాటినప్పటికీ ఎవ్వరూ కదలవద్దని, ఇక్కడే శాంతియుతంగా కూర్చోని నిరసన తెలపాలని ప్రొఫెసర్ కోదండరాం వేదికపైనుంచి పిలుపునిచ్చారు. స్వామిగౌడ్ మాట్లాడుతూ పైనుంచి హెలికాప్టర్ ద్వారా బాంబులు కురిపించినా సరే ధైర్యంగా

కదలకుండా ఉండి తెలంగాణ సాధనకోరకు ఆఖరిపోరాటాన్ని చేద్దామని కోరారు. ఓవైపు వర్షం కురుస్తున్నప్పటికీ అందరూ తెలంగాణ సాధనకొరకు దీక్షగా కూర్చున్నారు. ప్రస్తుతం నక్లెస్‌రోడ్‌లో జలవిహార్ వద్ద కొనసాగుతున్న సాగరహారం (తెలంగాణ మార్చ్) జనసంద్రమైంది.

### ముగిసిన సాగరహారం... రేపు రాస్తారోకో....

తెలంగాణ మార్చ్‌ను నిలిపివేస్తున్నట్లు జేఏసి నేతలు రాత్రి 11.30గంటలకు ప్రకటించారు. సోమవారం తెలంగాణ వ్యాప్తంగా రాస్తారోకోలు, అక్టోబర్ 2న ఇందిరాపార్కు వద్ద నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలంగాణ జేఏసి ప్రకటించారు. జేఏసి ముఖ్యనేతలు త్వరలోనే ఆమరణ దీక్షను చేపట్టనున్నట్లు తెలిపారు. బుధవారం జేఏసి స్టీరింగ్ కమిటీ సమావేశం కానుంది. జేఏసిలో చర్చించిన తర్వాత ఆమరణ దీక్ష తేదీలను ఖరారు చేయనున్నారు. ఇక నుంచి మంత్రులపైనే పోరాటం చేయనున్నట్లు తెలంగాణ జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ప్రకటించారు. మార్చ్ సందర్భంగా ప్రభుత్వమే హింసకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితులలో మార్చ్‌ను కొనసాగించలేమని, తెస్తే తెలంగాణ తేవాలి లేదా పదవులకు రాజీనామా చేయాలని, అప్పటివరకు మంత్రులదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ గెలిచిందని, ప్రభుత్వం ఓడిందని జేఏసి నేత మల్లెపల్లి లక్ష్మయ్య అన్నారు. మార్చ్‌కు సహకరించిన మీడియా వారికి జేఏసి సమన్వయకర్త పిట్టల రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

### 02 అక్టోబరు 2012:

### తెలంగాణ మార్చ్ ఘటనలపై కేసులు

తెలంగాణ మార్చ్ నిర్వాహకులపై పీడీయాక్ట్ ప్రయోగించారు. మార్చ్ ఘటనలపై ఇప్పటి వరకు ప్రభుత్వం 35కేసులను నమోదు చేసింది. ఉద్యమ అణచివేతకు పీడీ యాక్ట్‌ను ప్రయోగించడం ఇది మూడోసారి. ఓవైపు అనుమతి ఇస్తూనే మరోవైపు నిర్బంధకాండను కొనసాగించిన ప్రభుత్వం ఇప్పుడు కేసుల పేరుతో మరోసారి ఉద్య మాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇప్పటికే కోదండరాం, గద్దర్ విమలక్క, శ్రీనివాస్‌గౌడ్, స్వామిగౌడ్, దేవీప్రసాద్, విఠల్‌లతో పాటు 14మందిపై పీడీయాక్ట్‌తో పాటు ఐపీసీ 148, 149, 435, 427 సెక్షన్ల కింద కసులు నమోదే చేశారు. వాహనాల ద్వంసంపై 21, కేంద్ర ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంపై 5కేసులు, ఓయూ ఘటనలపై 7. పోలీసుల పై దాడి చేసినందుకు 2 కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా చెదురు మదురు సంఘటనలను సాకుగా చూపి ప్రభుత్వం కేసులంటూ ఉద్యమకారులను ఇబ్బందులకు గురుచేస్తున్నారని మండిపడుతున్నారు. ఉద్యమకారుల ముసుగులో కొన్ని శక్తులు విద్దంసానికి దిగే ప్రమాదం ఉందని ముందే చెప్పినా

పోలీసులు సరైన సెక్యూరిటీ ఇవ్వలేదని జేఏసి నేతలు అంటున్నారు. అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణవాదులు హెచ్చరిస్తున్నారు.

### ముగిసిన టీజేఏసి మౌనదీక్ష

తెలంగాణ మార్చ్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిరసనగా గాంధీ జయంతి సందర్భంగా బాపుఘాట్ వద్ద తెలంగాణ రాజకీయ జేఏసి చేపట్టిన మౌనదీక్ష మధ్యాహ్నం 1.30గంటలకు ముగిసింది. తెలంగాణ మార్చ్‌లో పోలీసుల నిర్బంధకాండను నిరసిస్తూ ఈరోజు ఉదయం 11గంటల ప్రాంతంలో బాపూజీకి నివాళులు అర్పించిన అనంతరం మౌనదీక్షను ప్రారంభించారు. ఈదీక్షలో జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంతో పాటు జేఏసినేతలు స్వామీగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పిట్టల రవీందర్, దేవీప్రసాద్, రసమయి బాలకిషన్, విఠల్, అద్దంకి దయాకర్‌లతో ఉద్యోగ, విద్యార్థి, విద్యుత్ ఉద్యోగుల జేఏసి నేతలతో పాటు పలువురు తెలంగాణ వాదులు పాల్గొన్నారు. ఉద్యమంలో శాంతియుతంగా పాల్గొంటున్న ఉద్యోగులు, విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం, కాల్పులు జరపడం, అక్రమంగా కేసులు పెట్టి ఉద్యమాన్ని అణిచివేయాలని ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్ర మంత్రి షిండే వ్యాఖ్యలను ఈసందర్భంగా తీవ్రంగా ఖండించారు. త్వరలోనే జేఏసి స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తామని తెలిపారు.

### 04 అక్టోబరు 2012:

### కేంద్రం చెప్పిందే చేశాం... శ్రీకృష్ణ కమిటీ

కేంద్ర ప్రభుత్వంపై జస్టిస్ శ్రీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ ఇచ్చిన నివేదికలో పేర్కొన్న సూచనలు మా సొంత ఆలోచనలు కావని, కేంద్రం చెప్పినట్లుగానే చేశామని ఇప్పుడు తమపై నెట్టడం సరైందికాదని జస్టిస్ శ్రీకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సమస్య ఇంత జఠిలం కావడానికి రాజకీయ నేతలే కారణమన్నారు. తెలంగాణపై తాము ఇచ్చిన నివేదిక స్పష్టంగా ఉందని, నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమేనన్నారు.

తెలంగాణ మార్చ్ విజయవంతం చేయడంలో సహకరించిన బిజెపి, సిపిఐ, టిఆర్ఎస్ పార్టీల నాయకులు ఈ రోజు తెలంగాణ జేయేసీ ముఖ్య నాయకులు కలిసి తమ కృతజ్ఞతలను తెలియజేసారు.

### 05 అక్టోబరు 2012:

### ట్యాంకుబండ్‌పై మళ్లీ సీమాంధ్ర విగ్రహాలు

సీమాంధ్ర సర్కార్ తెలంగాణవాదుల అభ్యంతరాలను పెడచెవిన పెట్టింది.

కూల్‌గా తనపనిని తాను కానిచ్చుకుంటోంది. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణవాదులు కూల్చి వేసిన సీమాంధ్ర విగ్రహాలను పున:ప్రతిష్ఠించింది. మిలియన్ మార్చ్ సందర్భంగా తెలంగాణవాదుల చేతిలో ధ్వంసమైన సీమాంధ్రకు చెందిన వ్యక్తుల విగ్రహాలను తిరిగి ప్రతిష్ఠించింది. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాలు మళ్లీ పెట్టిన విగ్రహాలలో ఉన్నాయి. కాగా అర్ధరాత్రి దొంగచాటుగా ప్రభుత్వం సీమాంధ్రుల విగ్రహాలను ప్రతిష్ఠించిందని, ఓవైపు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరగుతున్న తరుణంలో విగ్రహాలను మళ్లీ స్థాపించి తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టేందుకే సీఎం ప్రయత్నిస్తున్నారని తెలంగాణవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ట్యాంక్‌బండ్‌కు చేరిన కొమురంభీం విగ్రహం

ప్రముఖ నిజాం వ్యతిరేక పోరాట యోధుడు కొమరంభీం విగ్రహం ఎట్టకేలకు ట్యాంక్‌బండ్‌కు చేరుకుంది. నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించడానికి గెరిల్లా పోరాటం చేసిన కొమరంభీం విగ్రహం ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠిస్తుండడంతో తెలంగాణవాదుల కలసాకారం కానుంది.

### 06 అక్టోబరు 2012:

### మధుయాస్కీ నివాసంలో కాంగ్రెస్ ఎంపీలతో జేఏసీ సమావేశం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో రానున్న పార్లమెంటు సమావేశాల సందర్భంగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు అనుసరించవలసిన వ్యూహాన్ని చర్చించేందుకు తెలంగాణ జేఏసీ నాయకులు కాంగ్రెస్ ఎంపీలతో మధుయాస్కీ నివాసంలో సమావేశమయ్యారు.

### 07 అక్టోబరు 2012:

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పూర్తిస్థాయిలో భాగస్వాములయ్యేందుకు తెలంగాణ రాష్ట్రీయ జనతా దళ్ (టీ.ఆర్.జే.డీ)ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు హైదరాబాద్‌లో ప్రకటించారు.

### 09 అక్టోబరు 2012:

తెలంగాణ మార్చ్ కార్యక్రమం విజయవంతమైన నేపథ్యంలో తెలంగాణ జేఏసీ రెట్టించిన ఉత్సాహంతో కనిపిస్తున్నది. ఉద్యమంలో అలసిపోయిన నేతలకు ఒకరోజు ఆటవిడుపుగా ఘట్‌కేసర్ ప్రాంతంలోని ఒక ప్రైవేటు ఫాంహౌజ్‌లో తెలంగాణ జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక విందు సమావేశాన్ని నిర్వహించారు.

### 13 అక్టోబరు 2012:

### నంది అవార్డుల్లో తెలంగాణ

శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2011 సినిమా నంది అవార్డులలో

తెలంగాణ మార్మోగింది. తెలంగాణ ఉద్యమంతో, చరిత్రతో సంబంధమున్న అంశాలలో నంది అవార్డుల పంట పండింది. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తెరకెక్కిన 'జైబోలో తెలంగాణ' చిత్రం ఉత్తమ జాతీయ సమగ్రతా చిత్రంగా నంది అవార్డుకు ఎంపికైంది. కాగా ఈచిత్రానికి దర్శకత్వం వహించిన ఎన్.శంకర్ ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. అంతేకాకుండా తెలంగాణ ఉద్యమంలో అణువణువునా మార్మోగి ఉద్యమకారులను ఉర్రూతలూగించిన 'పొడుస్తున్న పొద్దుమీద...' పాటను పాడిన ప్రజాగాయకుడు గద్దర్ ఉత్తమ గాయకుడిగా నంది అవార్డుకు ఎంపికచేశారు. ఇలా జైబోలో తెలంగాణ చిత్ర యూనిట్‌కు మూడు నంది అవార్డులు దక్కడం విశేషం.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఇతివృత్తంలో తెరకెక్కిన మరో చిత్రం 'రాజన్న' ఈచిత్రం ఉత్తమ ద్వితీయ చిత్రంగా నంది అవార్డుకు ఎంపికైంది. ఈచిత్రంలో నటించిన అక్కినేని నాగార్జున స్పెషల్ జ్యూరీ అవార్డు దక్కించుకోగా, ఇదే చిత్రంలో అద్భుతంగా నటించిన బేబి అన్ని ఉత్తమ బాలనటి అవార్డుకు ఎంపికైంది. ఇదే చిత్రంలో 'అమ్మ అవని..' పాటకు ఉత్తమ గాయనిగా మాలవికకు అవార్డు దక్కింది. ఇలా రాజన్న చిత్రానికి ఏడు నందులు దక్కాయి.

ఉద్యమ నేపథ్యంలో రూపొందిన పోరు తెలంగాణలోని 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా... అనే పాట రాసిన మచ్చపల్లి సురేందర్‌కు ఉత్తమ గేయరచయితగా అవార్డు దక్కింది. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తెరకెక్కిన మరో చిత్రం 'ఇంకెన్నాళ్లు'లో అద్భుత నటనకు గాను సుజాతారెడ్డికి ఉత్తమ సహాయనటి అవార్డు దక్కింది. తెలంగాణ చరిత్ర, ఉద్యమ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రాలకు పదుల సంఖ్యలో నంది అవార్డులు దక్కడం విశేషం.

### 16 అక్టోబరు 2012:

### ప్రధాని పర్యటన సందర్భంగా జేఏసి నిరసన దీక్ష

తెలంగాణ ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వ విశ్వాసఘాతుకానికి తెలంగాణ వాదులు నిరసన దీక్ష చేపట్టారు. తెలంగాణ నగారా సమితి ఆధ్వర్యంలో ఈరోజు ఇందిరాపార్కు వద్ద చేపట్టిన నిరసన దీక్షలో జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, నగారా సమితి అధ్యక్షుడు నాగం జనార్ధన్‌రెడ్డి, టీఆర్ఎస్ నేతలు ఈటెల రాజేందర్, టి.హరీష్‌రావు, కాంగ్రెస్ నేత కె.కేశవరావులతో పాటు బీజేపి నేత బండారు దత్తాత్రేయ, సీపీఐ నేతలు, జేఏసి నేతలు, తెలంగాణ వాదులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కోదండరాం మాట్లాడుతూ కేంద్రం తెలంగాణ అంశంపై నాన్చుడు ధోరణి అవలంబిస్తోందని, ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలకు మంత్రులు దూరంగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ఏరాష్ట్ర ఏర్పాటు కూడా ప్రభుత్వాలు తెచ్చివ్వలేదని, అన్ని పోరాటాలతో సాధించుకున్నవేనని, అలాగే తెలంగాణ రాష్ట్రాన్ని

కూడా పోరాటాలతోనే సాధించుకోవాలని ఆయన అన్నారు.

తెలంగాణ అంశాన్ని నక్సలైట్ల సమస్యతో పోల్చుతూ కేంద్ర హోంమంత్రి షిండే చేసిన వ్యాఖ్యలపై నగారా సంస్థ అధ్యక్షుడు నాగం జనార్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నక్సలైట్ల సమస్య తెలంగాణకు చెందింది కాదని, దేశవ్యాప్తంగా ఈసమస్య ఉందని దాన్ని తెలంగాణతో ముడిపెట్టడం సరికాదని నాగం అన్నారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రజల మనోభావాలను గౌరవించని ప్రధాని ఉండడం సిగ్గుపడాల్సిన విషయమని అన్నారు. ఈదీక్షలకు తెలంగాణ ఉద్యో గసంఘాలు, ప్రజా సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. అనంతరం నాయకులంతా ప్రధానిని కలిసేందుకు బయలుదేరగా పోలీసులు వారిని అరెస్టు చేశారు.

**తెలంగాణ వ్యాప్తంగా జర్నలిస్టుల రాస్తారోకో**

కొన్ని మీడియా సంస్థలపై సీమాంధ్ర ప్రభుత్వం చూపిన వివక్షపై తెలంగాణ ప్రాంత జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వి6, హెచ్ఎంటీవి, టీన్యూస్, నమస్తే తెలంగాణ దినపత్రిక జర్నలిస్టుల పాస్‌లను తిరస్కరించడం మీడియా స్వేచ్ఛను హరించడమేనని జర్నిలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదిజిల్లాల్లో ప్రధాన కూడళ్లలో ధర్నాలకు, రాస్తారోకోలకు దిగారు. మీడియా వివక్షపై సమాచార శాఖ మంత్రి అయిన డీకే అరుణ సమాధానం చెప్పాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిమాండుతో తెలంగాణ నగారా నాయకుడు నాగం జనార్ధన్ రెడ్డి ఇందిరాపార్క్‌వద్ద ఒకరోజు దీక్షాశిబిరాన్ని నిర్వహించారు.

**17 అక్టోబరు 2012:**

**సీఎం, డీజీపి క్షమాపణ చెప్పాలి: అల్లం నారాయణ**

నిన్న ప్రధాని పర్యటన సందర్భంగా తెలంగాణ మీడియాపై వివక్షకు నిరసనగా జర్నలిస్టులు గన్‌పార్క్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీని పోలీసులు ఓవరాక్షన్‌తో అడ్డుకోవడంతో పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య తోపులాట జరిగింది. జర్నలిస్టులను, రాజకీయ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న నమస్తే తెలంగాణ ఎడిటర్ అల్లం నారాయణ, జేఏసి చైర్మన్ కోదండరాం, కోచైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, టీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డిలతో పాటు వందలాది మంది తెలంగాణ జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. గన్‌పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు శాంతియుతంగా ర్యాలీగా బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ర్యాలీని పోలీసులు ముందుకు కదలనీయకపోవడంతో జర్నలిస్టులు అసెంబ్లీవైపు దూసుకెళ్లారు. దీంతో పోలీసులు వారిని వెంటపడి తరిమితరిమి పట్టుకుని వ్యాన్లల్లో ఎక్కించారు. మహిళా జర్నలిస్టుల పట్ల పోలీసులు దురుసుగా

ప్రవర్తించారు. పోలీసుల తీరుపై యావత్ తెలంగాణ ప్రజానీకం మండిపడుతున్నారు. జర్నలిస్టుల అరెస్టును తెలంగాణ ప్రజాసంఘాలు, రాజకీయ, విద్యార్థి, న్యాయవాదుల, ఉపాధ్యాయ జేఏసీలు తీవ్రంగా ఖండించాయి. పదిరోజుల్లోపు డీజీపి, సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో తెలంగాణ మార్చ్‌ను తలపించేలా కలం కవాతును నిర్వహిస్తామని తెలంగాణ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు అల్లం నారాయణ హెచ్చరించారు.

రాజధానిలో జరిగిన జీవవైవిధ్య సదస్సుకు హాజరవుతున్న ప్రధాని మన్మోహన్ సింగ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన తెలంగాణ మాల మహానాడు నాయకుల అరెస్టు, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలింపు.

**22 అక్టోబరు 2012:**

**జేఏసి నేతల అరెస్టు**

చంద్రబాబు పాదయాత్రకు నిరసన తెలిపేందుకు రాజోలీకి వెళ్తున్న జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, ఉద్యోగ సంఘాల నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కోదండరాం, శ్రీనివాస్‌గౌడ్, స్వామీగౌడ్, దేవీప్రసాద్‌లతో పాటు పలువురు శాంతినగర్ నుంచి రాజోలీకి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారంతా అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులకు జేఏసి నేతలకు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులకు, సీమాంధ్ర నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తాము శాంతియుతంగా ర్యాలీ చేస్తున్నామని జేఏసి నేతలు చెప్పినప్పటికీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన జేఏసి నేతలను కాలినడకన కొత్తకోట పోలీసుస్టేషన్‌కు తరలిస్తుండగా కోదండరాం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

తెలంగాణపై దండయాత్ర చేస్తున్న చంద్రబాబు యాత్రను నిరసించినందుకు శాంతినగర్‌లో టీజేఏసి నేతలను అరెస్టు చేయడం అక్రమం అని టీఎన్జీవో అధ్యక్షుడు దేవీప్రసాద్ విమర్శించారు. ఈఅక్రమ అరెస్టులకు టీడీపీ పార్టీనే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. యాత్రపేరుతో తెలంగాణలో దండయాత్ర చేస్తున్న బాబుకు అండగా నిలిచిన ప్రభుత్వం నిరసన తెలుపుతున్న ప్రజలపై అణచివేత, కేసులతో వేధించడం తగదన్నారు.

**26 అక్టోబరు 2012:**

**మార్చ్ సాక్షిగా ఇది సర్కారీ హత్యే: జేఏసి**

తెలంగాణ కవాతులో పాల్గొని పోలీసులు ప్రయోగించిన బాష్పవాయువు కారణంగా అస్వస్థతకు గురైన తెలంగాణ వాది గుడి రాజిరెడ్డి(42) గత 25రోజులుగా చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. ఆయనది ముమ్మాటికీ సర్కారీ హత్యేనని,

న్యాయవిచారణ జరిపించాలని తెలంగాణవాదులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాజకీయ జేఏసి సెప్టెంబర్ 30న నక్లెస్‌రోడ్‌లో నిర్వహించిన తెలంగాణ మార్చ్ (సాగరహారం)లో రాజిరెడ్డి పాల్గొన్నారు. మార్చ్‌కు తరలివస్తున్న జనవాహినిని అడ్డుకోవడానికి ప్రభుత్వం కుట్రలో భాగంగా పోలీసులను ఉసిగొల్పారు. వేదిక సమీపంలో పోలీసులు ప్రయోగించిన బాష్పవాయు కారణంగా అక్కడే ఉన్న రాజిరెడ్డి ఆ విషవాయువు ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అదే రోజు ప్రాథమిక చికిత్స కోసం కూకట్‌పల్లిలో ఓఆసుపత్రికి తరలించారు.

ఈనెల 17న మెడిసిటీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ గురువారం మధ్యాహ్నం 2.30గంటలకు మృతి చెందాడు. పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న టీజేఏసి చైర్మన్ కోదండరాంతోపాటు పలువురు జేఏసి ప్రతినిధులు, తెలంగాణవాదులు మెడిసిటీ ఆసుపత్రికి చేరుకోగా అప్పటికే రాజిరెడ్డి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకున్న తెలంగాణవాదులు మృతదేహాన్ని గన్‌పార్క్‌కు తరలించేందుకు ప్రయత్నించగా ప్రభుత్వం అనుమతించలేదు.

రాజిరెడ్డి స్వగ్రామం కరీంనగర్‌జిల్లా రామగుండం మండలం పెద్దంపేట. కొన్నేళ్ల క్రితం ఉపాధికోసం హైదరాబాద్‌కు వచ్చాడు. కూకట్‌పల్లిలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. రాజిరెడ్డి మరణంపై న్యాయవిచారణ జరపాలని తెలంగాణవాదులు డిమాండ్ చేస్తున్నారు. నేడు కూకట్‌పల్లిలో నిర్వహించే రాజిరెడ్డి అంత్యక్రియలకు వేలాదిగా తరలిరావాలని తెలంగాణవాదులకు జేఏసి పిలుపునిచ్చింది.

### 30 అక్టోబరు 2012:

### కదం తొక్కిన తెలంగాణ కలాలు

సీమాంధ్ర సర్కారు వివక్షకు నిరసనగా మంగళవారం తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ జర్నలిస్టుల 'ఆత్మగౌరవ ర్యాలీ'ని నిర్వహించారు. ఈర్యాలీ సుందరయ్య పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు సాగింది. ఈర్యాలీలో తెలంగాణ పదిజిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, తెలంగాణవాదులు పాల్గొన్నారు. అనంతరం ఇందిరాపార్కు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈసందర్భంగా టీజేఎఫ్ అధ్యక్షుడు అల్లం నారాయణ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత జర్నలిస్టుల ఉనికిని లేకుండా చేసేందుకు సీమాంధ్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టులపై చూపిన పక్షపాత వైఖరికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో జర్నలిస్టులు ప్రజల ఆకాంక్షను ఎక్కడ తెలియజేస్తారోననే భయంతోనే సీమాంధ్ర సర్కారు వారిని లోనికి అనుమతించలేదన్నారు.

మీడియాలో ప్రాంతాల వారిగా చిచ్చుపెట్టడం ప్రభుత్వ దమనకాండకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈకార్యక్రమంలో ప్రజాగాయకుడు గద్దర్, టీఆర్ఎస్ ఎల్పీ నేత ఈటెల రాజేందర్, నగారా సమితి అధ్యక్షుడు నాగం జనార్ధన్‌రెడ్డి, బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చుక్కారామయ్య, ఉద్యోగ సంఘాల నేతలు దేవిప్రసాద్, స్వామిగౌడ్, విఠల్, శ్రీనివాస్‌గౌడ్, జేయేసీ నాయకుడు పిట్టల రవీందర్, ప్రజాఫ్రంట్ నేతలు వేదకుమార్, సీపీఐ కార్యదర్శి నారాయణలతో పాటు కళాకారులు, జర్నలిస్టులు, తెలంగాణవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 01 నవంబరు 2012:

## కోదండరాం గృహనిర్భంధం

నవంబర్ 1 ఆంధ్రప్రదేశ్ అవతరణను నిరసిస్తూ ఈరోజును విద్రోహదినంగా పాటిస్తూ, నల్లబ్యాడ్జీలతో, నల్ల జెండాలతో నిరసన తెలుపాలని తెలంగాణ రాజకీయ జేఏసి పిలుపునిచ్చిన నేపథ్యంలో నేటి ఉదయం టీజేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం గృహ నిర్భంధం చేశారు. ఇంటినుంచి బయటకు వెల్లకుండా, ఎటువంటి నిరసన కార్యక్రమాల్లో పాల్గొనకుండా నిర్భంధించారు. ఈసందర్భంగా కోదండరాం ఇంటికి చేరుకున్న మీడియాతో ఆయన మాట్లాడారు. అరెస్టులతో ఉద్యమాన్ని అపలేరని, నిరసన తెలిపే హక్కు ప్రతీ పౌరునికి ఉంటుందన్న విషయం ప్రభుత్వం మరిచిపోతుందని అన్నారు. తనను ఎందుకు గృహ నిర్భంధం చేశారో కూడా పోలీసులు చెప్పే పరిస్థితిలో లేరంటే ఈసమైక్య రాష్ట్రంలో తెలంగాణ వాదులపై ప్రభుత్వ వ్యవహరిస్తున్న తీరుకు ఇది నిదర్శనమన్నారు. అయన ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో జేఏసి నాయకులు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ వాదులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రభుత్వ దమన నీతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## నాగం అరెస్టు... ఐదు గంటలు దీక్ష...

హైదరాబాద్‌లోని తార్నాకలో గృహనిర్భంధం చేసిన రాజకీయ జేఏసి చైర్మన్ కోదండరాంను పరామర్శించి వస్తున్న తెలంగాణ నగార సమితి అధ్యక్షుడు నాగం జనార్ధన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి కాచిగూడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఉద్యోగసంఘాలు, న్యాయవాద జేఏసి, వివిధ పార్టీల నాయకులు మండిపడ్డారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆయనను పరామర్శించారు. జైతెలంగాణ అంటే దేశద్రోహం కేసు పెడుతారా? అని నాగం పోలీసులను ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతీ ఒక్కరికి స్వేచ్ఛ ఉందని తనను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్‌లోనే దీక్షకు దిగారు. ఆయనకు మద్ధతుగా రాజకీయ జేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, బీజేపి నేత బండారు దత్తాత్రేయ, ఉద్యోగ సంఘాల నేతలు పోలీసు స్టేషన్‌లో బైఠాయించారు. తన అరెస్టుకు

కారణం రాత పూర్వకంగా ఇవ్వాలని నాగం డిమాండ్ చేశారు. ఐదు గంటలపాటు దీక్ష కొనసాగించగా ఎట్టకేలకు పోలీసులు దిగి వచ్చి ఎఫ్ఐఆర్ కాపీని నాగం జనార్ధన్‌రెడ్డికి అందివ్వడంతో దీక్షను విరమించారు. నిరసన తెలిపినందుకే తనపై 'దేశ ద్రోహం' కేసు నమోదు చేశారని, దీనిపై తాను న్యాయపోరాటం చేస్తానని, స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు నాగం ప్రకటించారు.

**ఓయూలో ఉద్రిక్తత**

ఆంధ్రప్రదేశ్ అవతరించిన నవంబర్ 1వ తేదీని 'తెలంగాణ విద్రోహ దినం'గా పాటించాలని జేఏసి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఉస్మానియాలో నేడు చికటి దినంగా పాటిస్తున్నారు. ఓయూ విద్యార్థులు నిరసన తెలిపేందుకు ర్యాలీగా బయలుదేరగా, ఎన్‌సీసీ గేట్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులకు, పోలీసులకు మద్య తోపులాట జరిగింది. పోలీసులు ర్యాలీగా వెళ్లడానికి అనుమతివ్వకపోవడంతో ఎన్‌సీసీ గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో విద్యార్థులు అక్కడే బైఠాయించారు. వర్షం పడుతున్నప్పటికీ విద్యార్థులు అక్కడే కూర్చొని నినాదాలు చేశారు. ఇప్పటికే విద్యార్థులపై పోలీసులు నాలుగు రౌండ్లు బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. అయినప్పటికీ విద్యార్థులు వెనక్కు తగ్గేదిలేదని, ఎక్కడైతే రాష్ట్ర అవతరణ ఉత్సవాలు జరుగుతున్నాయో అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతామని పట్టుబట్టడంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది.

**02 నవంబరు 2012:**

తెలంగాణ జేయేసీలో ముఖ్యనాయకుడు, అడ్వకేట్స్ జేయేసీ కన్వీనర్ రాజేందర్ రెడ్డి నివాసంలో తెలంగాణ జేయేసీ ముఖ్యనేతలతో ప్రత్యేక సమావేశం జరిగింది. జేయేసీలో కొంతమంది నాయకులు వ్యక్తిగత ప్రచారంకోసం చెలాయిస్తున్న ఆధిపత్య ధోరణులపై పలువురు ప్రశ్నించినట్లు సమాచారం. ఉద్యమ ప్రయోజనాలకోసం సర్దుకుపోవాలని కోదండరాం సముదాయించినట్లు తెలిసింది.

**12 నవంబరు 2012:**

వరంగల్ జిల్లా భూపాలపల్లిలో 'సింగరేణి భూమిపుత్రుల సంఘం' ఆవిర్భావసభ. ముఖ్యఅతిథిగా జేయేసీ సమన్వయకర్త పిట్టల రవీందర్, అతిథులుగా టి.ఆర్.ఎస్. నాయకులు సిరికొండ మధుసూధనాచారి, మాజీ డిజిపి పేర్వారం రాములు.

**20 నవంబరు 2012:**

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ డెమోక్రాటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆవిర్భావ సభ.

**21 నవంబరు 2012:**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణతో జేయేసీ

నాయకులు ప్రత్యేక సమావేశం. జమాతె–ఇస్లామీ–హింద్ రాష్ట్ర అధ్యక్షునితో సాయంత్రం జేయేసీ నాయకుల ములాఖత్.

**12 డిసెంబరు 2012:**

ఆదిలాబాద్ జిల్లాలో రెండవ రోజు పర్యటనలో భాగంగా భైంసా పట్టణానికి చేరుకున్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడును అడ్డుకున్న తెలంగాణ మాల మహానాడు కార్యకర్తలు. పలువురు నాయకుల అరెస్టు.

**22 డిసెంబరు 2012:**

**ధూంధాం దశాబ్ది ఉత్సవాల్లో పోటెత్తిన పాట**

ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో ధూంధాం దశాబ్ది ఉత్సవాలను శనివారం ఉదయం ప్రజాగాయకుడు గూడ అంజయ్య, గద్దర్, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రజాకళాకారిణి విమలపై అక్రమ కేసులను నిరసిస్తూ ధూంధాం దశాబ్ది ఉత్సవాలను నిరసన సభలుగా నిర్వహిస్తున్నట్లు ధూంధాం అధ్యక్షుడు రసమయి బాలకిషన్ తెలిపారు. విమలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, బేషరతుగా విడుదల చేయాలని, తెలంగాణ భాషను పట్టించుకోని ప్రపంచ తెలుగు మహాసభలను బహిష్కరించాలని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ, తెలంగాణ ఇవ్వడానికి కాంగ్రెస్ సిద్ధంగా లేదని, తెలంగాణకు ప్రధాన శత్రువు కాంగ్రెస్సేనని అన్నారు. ధూంధాం గొప్ప సాంస్కృతిక ఉద్యమమన్నారు. అనంతరం 'తెలంగాణ పాట–గతం–వర్తమానం–భవిష్యత్తు'పై చర్చ జరిగింది. డప్పు రమేష్, అందెశ్రీ, ధూంధాం కార్యదర్శి అంతడపుల నాగరాజు, మిట్టపల్లి సురేందర్, పుష్ప తదితరులు తమ ఆటపాటలతో సభికులను అలరించారు. ధూంధాంలో వందలాది మంది కళాకారులు కళారూపాలతో అలరించారు. తెలంగాణ ఉద్యమకారులు 'ఆంధ్రోడు' అంటూ మాట్లాడొద్దని, ఆంధ్ర ప్రజలకు కూడా ఆత్మ గౌరవం ఉంటుందని సినీ దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కేకే, జేఏసీ చైర్మన్ కోదండరాం, టీఆర్ఎస్ నేతలు ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే నాగం, బీజేపీ నేత కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**24 డిసెంబరు 2012:**

"ప్రపంచ తెలుగు మహాసభలను బహిష్కరిద్దాం" పేరుతో తెలంగాణ రచయితల వేదిక, పాలమూరు అధ్యయన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నిరసన సభ, హాజరైన విప్లవ కవి వరవరరావు.

**27 డిసెంబరు 2012:**

**అఖిలపక్ష భేటీకి వెళ్లేది వీరే**

టీడీపీ – యనమల రామకృష్ణుడు, కడియం శ్రీహరి

టీఆర్ఎస్ – కేసీఆర్, నాయిని నర్సింహారెడ్డి
వైసీపీ – మైసూరారెడ్డి, కేకే మహేందర్‌రెడ్డి
బీజేపీ – కిషన్‌రెడ్డి, హరిబాబు
సీపీఐ – నారాయణ, గుండా మల్లేష్
సీపీఎం – రాఘవులు, జూలకంటి రంగారెడ్డి
ఎంఐఎం – అక్బరుద్దీన్, అసదుద్దీన్
కాంగ్రెస్ – కేఆర్ సురేశ్‌రెడ్డి, గాదె వెంకటరెడ్డి

**వ్యతిరేకించే పార్టీలే లక్ష్యం: కోదండరాం**

రాజకీయ పార్టీలపై ప్రజలకు విశ్వాసం పోయిందని, దాన్ని తిరిగి పొందాలంటే అఖిలపక్ష భేటీలో అన్ని పార్టీలూ తెలంగాణకు అనుకూల వైఖరి ప్రకటించాలని టీజేఏసీ అధ్యక్షుడు కోదండరాం పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్‌లో తెలంగాణ విద్యార్థి పరిషత్ రెండు రోజుల పాటు నిర్వహించిన మహా ధర్నా గురువారం రాత్రి ముగిసింది. దీక్షా శిబిరాన్ని కోదండరాం సందర్శించారు. అఖిలపక్షంలో తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడే పార్టీలనే తాము లక్ష్యంగా చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం లేని పక్షంలో మార్చిలో ఛలో అసెంబ్లీ చేపడతామన్నారు.

**26 డిసెంబరు 2012:**

తెలంగాణ వ్యాపితంగా మండల కేంద్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా జేయేసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు

**27 డిసెంబరు 2012:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్‌వద్ద ధర్నా

**28 డిసెంబరు 2012:**

**నెల లోపే.. తెలంగాణకు పరిష్కారం: షిండే**

ఎన్నాళ్లో... వేచిన ఉదయం, రానే వచ్చింది. ఢిల్లీలో వణికించే చలిలో వాడి వేడిగా అఖిలపక్ష సమావేశం జరిగింది. తెలంగాణ సమస్య పరిష్కారం దిశగా ఒక అడుగు ముందుకు పడింది. ఎవరు ఏమిటో తేలిపోయింది. కేంద్రం వైఖరి ఏమిటో కూడా నెల రోజుల్లో తేలిపోతుంది. 'నెలలోపు పరిష్కారం చూపిస్తాం' అని కేంద్ర హోంమంత్రి షిండే స్పష్టం చేశారు. ఆయన.. నెల రోజుల్లోపు కేంద్రం తెలంగాణపై తుది నిర్ణయం ప్రకటిస్తుందని ముక్తాయించారు. ఇదే అఖరి సమావేశం అని కూడా స్పష్టం చేశారు. 'నెలంటే నెల కాదు.. ఆరు రోజుల్లోపు, ఎనిమిది రోజుల్లోపు కూడా కావచ్చు' అని కూడా తెలిపారు. అయితే.. కేంద్ర హోంశాఖ తరపున ప్రెస్

ఇన్‌ఫర్మేషన్‌బ్యూరో విడుదల చేసిన ప్రకటనలో మాత్రం నెలరోజుల గడువు గురించి స్పష్టత ఇవ్వలేదు. 'నెలలోపు నిర్ణయం తీసుకోవాలని కొందరు కోరారు' అని మాత్రమే అందులో తెలిపారు.

**అఖిలపక్ష సమావేశంలో ఎవరేమన్నారంటే...**

బీజేపీ: రాష్ట్రాన్ని విభజించి తీరాల్సిందే! తెలంగాణ ఇవ్వాల్సిందే. వెంటనే నిర్ణయం తీసుకుని పార్లమెంటులో బిల్లు పెట్టండి. మాకు 165 మంది ఎంపీల బలముంది. బిల్లును మేం బలపరుస్తాం. – కిషన్‌రెడ్డి, బీజేపీ ప్రతినిధి

సీపీఐ: రాష్ట్ర విభజన తక్షణం జరగాలి. ఈ జాప్యం, ఉద్యమాల కారణంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు నష్టపోతున్నాయి. రాష్ట్రాన్ని ఎంత త్వరగా విభజిస్తే అంత మంచిది. **–నారాయణ, సీపీఐ**

సీపీఎం: రాష్ట్రం సమైక్యంగా ఉండాలన్నదే మా పార్టీ విధానం. ఇదే విషయాన్ని ఇంతకు ముందూ చెప్పాం. ఇప్పుడూ చెబుతున్నాం. తెలంగాణ సమస్య కారణంగా రాష్ట్రంలో అనిశ్చితి నెలకొంది. రాష్ట్రాభివృద్ధి నాశనమవుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా ఎవరూ ముందుకు రావటం లేదు. ఇరు ప్రాంతాల మధ్య వైషమ్యాలు పెరుగుతున్నాయి. కాబట్టి తక్షణం కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. **–రాఘవులు, సీపీఎం**

టీఆర్ఎస్: తెలంగాణ సమస్య ఎన్నో ఏళ్లుగా నానుతోంది. మా పార్టీ పుట్టిందే ప్రత్యేక రాష్ట్రం కోసం. తెలంగాణ ఇచ్చేది లేనిదీ కేంద్రం తేల్చేయాలి. ఇవ్వలేకుంటే అదే విషయాన్ని చెప్పాలి. తెలంగాణలో ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ ప్రకటన చేశారు. పార్లమెంట్‌లో చేసిన ప్రకటనను అమలు చేయకుండా వెనక్కు పోయిన సంఘటన చరిత్రలో ఇదొక్కటే. తెలంగాణపై అటో ఇటో త్వరగా తేల్చేయాల్సిందే. **–కేసీఆర్, టీఆర్ఎస్**

టీడీపీ: తెలంగాణకు మా పార్టీ అనుకూలమంటూ 2008లో ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖ ఇచ్చాం. ఆ లేఖను మేం వెనక్కి తీసుకోలేదు. దాని ప్రకారం సమస్యను పరిష్కరించాలంటూ 27న చంద్రబాబు మరో లేఖ రాశారు. దానిని కూడా మేం సీల్డు కవర్‌లో అందిస్తున్నాం. –యనమల రామకృష్ణుడు, **(టీడీపీ)**

టీడీపీ తెలంగాణ ఏర్పాటుకు సుముఖంగా ఉంది. ఈ విషయం యనమల రామకృష్ణుడు చెప్పినా, నేను చెప్పినా ఒకటే. ఇదే మా పార్టీ వైఖరి.

**–కడియం శ్రీహరి(టీడీపీ)**

ఎంఐఎం: రాష్ట్రం సమైక్యంగా ఉండాలన్నదే మా అభిప్రాయం. ఒక వేళ రాష్ట్రాన్ని విభజించాల్సి వస్తే రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలతో హైదరాబాద్ రాజధానిగా రాయల తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి. తెలంగాణ అంశంపై

ప్రణబ్ ముఖర్జీ కమిటీకి మేం లేఖ ఇచ్చాం. తర్వాత శ్రీకృష్ణ కమిటీకి కూడా అభిప్రాయం చెప్పాం. చిదంబరం ఏర్పాటు చేసిన రెండు సమావేశాలకు హాజరయ్యాం. రాష్ట్రంలో ముస్లింల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే విభజనపై నిర్ణయం తీసుకోవాలి. **–అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం**

వైఎస్సార్ కాంగ్రెస్: తిరుపతిలో తెలుగు మహాసభలు జరుగుతున్నందున నేను తెలుగులోనే మాట్లాడుతాను. మా పార్టీ ప్లీనరీలో చెప్పినట్లుగా తెలంగాణ సెంటిమెంటును మేం గౌరవిస్తున్నాం. రాజ్యాంగంలోని మూడో అధికరణ ప్రకారం రాష్ట్రాన్ని విభజించాలన్నా, కలిపి ఉంచాలన్నా సర్వాధికారాలు కేంద్రానికే ఉన్నాయి. అయినప్పటికీ నిర్ణయం తీసుకోకుండా.. ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. అన్ని విషయాలు, సమస్యలు పరిగణలోకి తీసుకుని, ఎవరికీ అన్యాయం జరగకుండా త్వరితగతిన ఒక తండ్రిలా కేంద్రమే అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని చూపించాలి.

**–మైసూరారెడ్డి, వైసీపీ**

కాంగ్రెస్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజనకు సుముఖంగా ఉంది.

**–కేఆర్ సురేశ్‌రెడ్డి(కాంగ్రెస్)**

కాదు. నెహ్రూ, ఇందిరాగాంధీల కాలం నుంచి తెలంగాణపై కాంగ్రెస్ పార్టీ వైఖరి ముందు నుంచి స్పష్టంగా ఉంది. రాష్ట్రం సమైక్యంగా ఉండాలన్నదే నా అభిప్రాయం. **–గాదె వెంకటరెడ్డి (కాంగ్రెస్)**

**29 డిసెంబరు 2012:**

తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో తెలంగాణ బంద్

**05 జనవరి 2013:**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం బోర్‌గాం గ్రామంలో ఏనుగు భూమారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన టిఆర్ఎస్ నేత ఈటెల రాజేందర్, జేయేసీ కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్.

**07 జనవరి 2013:**

తెలంగాణ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ నాయకుల కారణంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అనవరసర జాప్యం జరుగుతున్నదని, ప్రత్యామ్నాయ రాజకీయాలే ఇందుకు పరిష్కారమార్గమని ... టంకశాల అశోక్ రచించిన 'తెలంగాణ ఎందుకు ఆలశ్యమవుతున్నది!?' పుస్తకావిష్కరణ సభలో వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రచురించిన ఈ పుస్తకావిష్కరణ సభకు మల్లేపల్లి లక్ష్మయ్య అధ్యక్షత వహించగా చుక్కా రామయ్య, హరగోపాల్, కోదండరామ్, కె. శ్రీనివాస్, అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, పిట్టల రవీందర్,

ఎన్. వేణుగోపాల్‌తదితరులు ప్రసంగించారు.

**09 జనవరి 2013**

హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో మున్సిపల్ డైరి–2013 ఆవిష్కరణ సభ. హాజరైన ప్రముఖులు.

**17 జనవరి 2013:**

గన్‌పార్క్ వద్ద తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో మౌనదీక్ష.

**18 జనవరి 2013:**

తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేయేసీ ఆధ్వర్యంలో మింట్‌కాంపౌండ్‌లో తెలంగాణ అమరవీరుల స్మృతి దీక్ష.

**23 జనవరి 2013:**

**షిండే గడువుపై ఆజాద్ వాయిదా ప్రకటన**

తెలంగాణ కోసం పట్టువదలని విక్రమార్కుల్లా పట్టుబట్టిన తెలంగాణ నేతలకు కాంగ్రేస్ భేతాళుడు మరోసారి ఆశాభంగం కలిగించాడు. నెలంటే నెలకాదని వెక్కిరిస్తూ మరోసారి చెట్టెక్కి కూర్చున్నాడు. నెలంటే నెలకాదు. వారమంటే వారమూ కాదు. ఔనంటే ఔననీ కాదు. కాదంటే కాదనీ కాదు అంటూ రాష్ట్ర కాంగ్రేస్ వ్యవహారాల ఇంచార్జి గులాం నబీ ఆజాద్ కొత్త నిర్వచనాలు చెప్పారు. తెలంగాణపై నెల రోజుల్లో నిర్ణయం తీసకుంటామని గత నెల కేంద్ర హోంమంత్రి హోదాలో సుశీల్ కుమార్ షిండే ప్రకటించగా.. అదంతా తూచ్ అని ఆజాద్ తేల్చేశారు.

'ఒక నెల అంటే 30 రోజులు కాదు.. పది రోజులు తక్కువ కావచ్చు.. ఇరవై రోజులు ఎక్కువ కావొచ్చు.' 'నేనేమంటానంటే.. దీనిని దురుద్దేశంతో ఊహించొద్దు. ఒక్కోసారి మనం రేపు అంటాం. అంటే అది రేప్పొద్దున్నే అని అర్థం కాదు. ఇది చాలా సముచితం.. ఈ సమస్యను ఎంత వీలైతే అంత త్వరగా పరిష్కరించాలని మేం చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం.' 'డెడ్‌లైన్ ఉండరాదు. ఒక్కోసారి వారం అంటే ఏడు రోజులు కాదు. కొన్ని సార్లు అది రెండు వారాలు కూడా కావొచ్చు. తుది గడువు అంటూ ఏమీ చెప్పలేం' 'మనం తేదీలకు కట్టుబడొద్దు. ఇది మేం తప్పకుండా పరిష్కరించాల్సిన, చాలా ముఖ్యమైన అంశం. జాతీయస్థాయిలోనూ, అధిష్టానం స్థాయిలోనూ ఈ సమస్యను పరిష్కరించనివ్వండి. అలా నాలుగు గోడల మధ్య సమస్యను పరిష్కరించేందుకు 30 రోజులు, 35 రోజులు లేదంటే 40 రోజులు పట్టొచ్చు. సారాంశం ఏమంటే ఈ సమస్యను పరిష్కరించాలని మేం నిర్ణయించాం. కాబట్టి మీడియా గానీ, ఇరు ప్రాంతాలకు చెందిన నాయకులు గానీ ఒక నెల అంటే 30 రోజులే అని అనుకోవద్దు. మీ ప్రశ్నకు సమాధానం ఏమంటే.. ఈ అంశాన్ని మేం ఎంత త్వరగా

వీలైతే అంత త్వరగా పరిష్కరించాలని నిర్ణయించాం' 'బహుశా మీరు హెూంమంత్రిపై కూడా ఇలాగే ఒత్తిడి చేసి ఆయనతో ప్రకటన చేయించి ఉండొచ్చు. కానీ, నేను మాత్రం ఒత్తిడికి గురయ్యేవాడిని కాదు. కొందరు నాయకులు మీరెందుకు నిర్ణయిం చరు? అన్నారు. సరే మేం ఒక నెలలో చేసేందుకు ప్రయత్నిస్తాం అని హెూంమంత్రి అన్నారు. అయినా ఇది చాలా సంక్లిష్టమైన సమస్య. వారంలో సగం రోజులు మేం అక్కడ జైపూర్ చింతన్ శిబిర్‌లో ఉన్నాం. మళ్లీ ఎల్లుండి నుంచి వారంలో సగం రోజులు సెలవులు ఉన్నాయి. కాబట్టి, జాతీయ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఒక సమస్యను పరిష్కరిస్తున్నపుడు, దాని ప్రభావం ఒక ప్రాంత రాజకీయాలపై పడుతున్నపుడు 28వ తేదీని నిర్ణయిస్తామని ప్రకటించాం కదా అని చెప్పి కచ్చితంగా 28నే నిర్ణయం తీసుకోకూడదు. పది రోజులు తక్కువ కావొచ్చు.. లేదంటే 20 రోజులు ఎక్కువ కావొచ్చు. అయితే ఒకటి మాత్రం వాస్తవం. ఈ సమస్య ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా పరిష్కరించాలని మేం నిర్ణయించాం.' – గులాం నబీ ఆజాద్, కేంద్ర మంత్రి.

**24 జనవరి 2013**

మెడికల్ జేయేసీ ఆధ్వర్యంలో వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ సాధన దీక్షా సదస్సు. హాజరైన జేయేసీ చైర్మన్ కోదండరాం, కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్ తదితరులు.

**25 జనవరి 2013:**

**సమర దీక్షకు అనుమతి నిరాకరణ**

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును డిమాండ్ చేస్తూ తెలంగాణ జేఏసీ తలపెట్టిన 36గంటల 'సమరదీక్ష'కు పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినా.. ఇందిరాపార్కు వద్ద ఆదివారం సాయంత్రం నుంచి దీక్ష చేపట్టాలని జేఏసీ నాయకులు నిర్ణయించుకున్నారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో భేటీ అయిన నేతలు.. దీక్షకు అనుమతి కోసం హైదరాబాద్ పోలీసు కమీషనర్ అనురాగ్‌శర్మను కలిశారు. 'పరిస్థితులు బాగోలేదు. ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో అనుమతి ఇవ్వలేం.' అని ఆయన స్పష్టం చేశారు. దీనిపై జేఏసీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. దీక్ష నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. ఆంక్షలు కాదని దీక్షకు దిగితే ఏం చేయాలన్న వ్యూహాన్ని పోలీసులు సిద్ధం చేసుకున్నారు. శనివారం రాత్రి నుంచే బలగాలను మోహరించే పనిలో పడ్డారు. ఇందిరాపార్కు వద్దకు వచ్చేవారిని ఎక్కడికక్కడే అడ్డుకునేందుకు పోలీసులు ప్రణాళికలు రూపొందించారు. నగరంలో పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి 'స్టాండ్ టు కాల్' (బందోబస్తుకు సిద్ధంగా ఉండాలనే ఆదేశం) ఇచ్చారు. పోలీసులు దీక్షకు నిరాకరించడంతో జేఏసీ నేతలు హెూంమంత్రి సబితారెడ్డిని కలిసి అనుమతి కోరారు. జేఏసీ చైర్మన్ కోదండరాం, టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, ఉద్యోగుల సంఘ

నాయకులు దేవిప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, అద్దంకి దయాకర్ తదితరులు హోంమంత్రిని కలిశారు. పోలీసులు అడ్డుకున్నా సరే ఎట్టి పరిస్థితుల్లోనూ సమర దీక్ష చేసి తీరుతామని కోదండరాం స్పష్టం చేశారు.

**27 జనవరి 2013:**

**సమర దీక్షకు అనుమతి.. అరెస్టులు**

'సమరదీక్షకు అనుమతి తెచ్చుకోవడానికే తెలంగాణ నేతలు సమరం చేయాల్సి వచ్చింది. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలంగాణ జేఏసీ కార్యాలయం వద్ద జేఏసీ నేతలు, అసెంబ్లీ ప్రాంగణంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇందిరాపార్కు వద్ద వివిధ సంఘాల నేతలు, ఓయూలో విద్యార్థులు, బర్కత్‌పురాలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ నేతలు ఆందోళనలు నిర్వహించారు. అనుమతి నిరాకరణతో ఆదివారం మధ్యాహ్నం వరకు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముట్టడులు, ధర్నాలు, అరెస్టులతో ఆదివారం హైదరాబాద్ అట్టుడికింది.

అయితే ఎమ్మెల్సీ చుక్కా రామయ్య, ప్రజా గాయకుడు గద్దర్, టీజేఏసీ నాయకుడు మల్లెపల్లి లక్ష్మయ్యలు హోంమంత్రి సబితారెడ్డితో చర్చలు జరపడం... మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సమర దీక్షకు అనుమతి రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మరోవైపు ఉదయమే గన్‌పార్కు వద్దకు వచ్చిన టీఆర్ఎస్ నేతలు కేటీఆర్, స్వామిగౌడ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఇక, సమర దీక్ష నేపథ్యంలో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఉద్విగ్నత నెలకొంది. ఆదివారం ఉదయానికే జేఏసీ శ్రేణులు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తమ కార్యాలయానికి చేరుకున్నారు. గేటు వద్దే అరెస్టుకు బలగాలు సిద్ధంగా ఉండడంతో జేఏసీ నేతలు కార్యాలయం వద్దే చర్చలు జరిపారు. అరగంటలో ప్రభుత్వ అనుమతి ఇప్పించకపోతే తమ ఎత్తుగడలను వేరే విధంగా అమలు చేస్తామని హోంమంత్రిని కోదండరాం హెచ్చరించారు. దీక్షకు వస్తున్న తెలంగాణ వాదులను అరెస్టు చేశారని, వారిని విడుదల చేసే వరకు క్వార్టర్స్‌లోనే బైఠాయించి నిరసన తెలుపుతామని కోదండరాం సహా పలువురు నేతలు ప్రకటించారు. అదే సమయంలో, ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను పోలీసులు అష్టదిగ్బంధనం చేశారు. పోలీసుల వలయాన్ని ఛేధించుకుని వందలాదిమంది ఉద్యమకారులు రహస్యమార్గాలలో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని జేయేసీ కార్యాలయంవద్దకు చేరుకున్నారు.

ఒకవైపు అరెస్టులు కొనసాగుతుండగానే, ధర్నా చౌక్ ప్రాంతానికి చేరేందుకు ప్రయత్నిస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి నగర శివార్లలోని కంచన్‌బాగ్, బొల్లారం పోలీసు స్టేషన్లకు తరలించారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ నుంచి బైక్ ర్యాలీగా రాజ్‌భవన్ ముట్టడికి బయలుదేరిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. విద్యార్థులు రాళ్ల వర్షం కురిపించడంతో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. దీంతో, సుమారు

గంటపాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. బాష్పవాయుగోళాలు తగిలి ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. మరోవైపు ఖైరతాబాద్ చేరుకున్న విద్యార్థులను రాజ్‌భవన్‌వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, పోలీసులు, విద్యార్థుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీమాంధ్ర తొత్తుగా మారిన నరసింహన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్కుకు బయలుదేరిన సుమారు 200 మంది లెక్చరర్స్ ఫోరం నాయకులు, విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, ఇందిరాపార్కుకు తరలి వస్తున్న మూవ్‌మెంట్ ఫర్ పీస్, ఏపీసీఎల్‌సీ, ఆటో డ్రైవర్స్ యూనియన్, సీపీఎం, రిటైర్డ్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్, లెక్చరర్స్ జేఏసీ, న్యాయవాదుల జేఏసీ తదితర నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలుసార్లు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, సమర దీక్షకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేత కిషన్‌రెడ్డి, ఇతర నేతలు దత్తాత్రేయ, బద్దం బాల్‌రెడ్డి తదితరులను పోలీసులు బర్కత్‌పురలో అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

హెూంమంత్రితో చర్చించిన అనంతరం చుక్కా రామయ్య మీడియాతో మాట్లాడుతూ, దీక్షకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ప్రకటించారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు ఇందిరాపార్కు వద్ద సమర దీక్ష నిర్వహించుకోవచ్చని హెూంమంత్రి అనుమతి ఇచ్చారని, దీక్షా స్థలి వద్ద 2000 మందికి మించకుండా చూడాలని, వేదిక స్థలాన్ని మార్చవద్దని , ఆస్తుల నష్టానికి దిగవద్దని, పూర్తి శాంతియుతంగా దీక్షను నిర్వహించాలని సూచించారని తెలిపారు. మీడియాపై కూడా ఆంక్షలు విధిస్తూ అడ్డుకునే ప్రయత్నాన్ని పోలీసులు చేస్తున్నారని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని గద్దర్ ఆరోపించారు. ఇప్పటి వరకు అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని హెూంమంత్రిని, సీపీని కోరామని మల్లెపల్లి లక్ష్మయ్య తెలిపారు.

**ఇక కాంగ్రెస్‌పైనే పోరాటం: సమరదీక్షలో నేతలు**

కేంద్ర మంత్రులు ఆజాద్, షిండే ప్రకటనల తర్వాత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తుందా? ఎగ్గొడుతుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయని తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరాం చెప్పారు. ఇంకా ముఖ్యమంత్రితోనూ. పీసీసీ చీఫ్‌తోనూ మాట్లాడాలని చెబుతూ కేంద్రం మరోసారి సాచివేత ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇంకా ఏమి మాట్లాడాలి? ఎవరితో మాట్లాడాలి? ఎంత సమయం పడుతుందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను వంచించి, మోసం చేసిన కాంగ్రెస్‌పైనే పోరాడాలని పిలుపునిచ్చారు. ఇందిరాపార్కు వద్ద ఏర్పాటు చేసిన సమరదీక్ష శిబిరంలో ఆదివారం రాత్రి కోదండరాం ఉద్వేగంగా మాట్లాడారు. తెలంగాణ మంత్రులు తమ

పదవులకు రాజీనామా చేసి ప్రభుత్వం నుంచి బయటకి రావాలని డిమాండ్ చేశారు. తమతో కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రాంతం వారు దీక్షలు చేసేందుకు కూడా ప్రభుత్వం అనుమతి కోసం ప్రాధేయపడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షకు అనుమతి కోసం ఈనెల 17న దరఖాస్తు చేశామని, ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఉంటే ఈ పరిస్థితి వచ్చేదా అని ప్రశ్నించారు.

'ముఖ్యమంత్రి సోదరుడు సంతోష్‌రెడ్డి టికెట్ కొని ఇస్తేనే కొంతమంది తెలంగాణ మంత్రులు ఢిల్లీకి వెళ్లారు. వారు వెళ్లింది తెలంగాణ కోసమా? ఆంధ్రా కోసమా చెప్పాలి' అని హరీష్‌రావు ప్రశ్నించారు. మంత్రులు రాజీనామా చేయకపోతే భవిష్యత్తులో వారి కుమారులు, మనుమలు కూడా తల దించుకునే పరిస్థితి వస్తుందని, వారు తలదించుకునేలా చేస్తారా, తల ఎత్తుకునేలా చేస్తారా అన్న విషయాన్ని వారే తేల్చుకోవాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో బిల్లు పెడితే మద్దతు ఇస్తామని, లేకపోతే కాంగ్రెస్ ద్రోహిగా మిగులుతుందని బీజేపీ ఎమ్మెల్యే లక్ష్మినారాయణ హెచ్చరించారు. ఉద్యమానికి అడ్డుగోడగా నిలిచిన మంత్రులను సాంఘీక బహిష్కరణ చేయాలని న్యూడెమాక్రసీ నేత సూర్యం పిలుపునిచ్చారు.

సభ ప్రారంభానికి ముందు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. సమర దీక్షకు అనుమతి కోసం సుధీర్ఘ పోరాటం చేయాల్సి వచ్చిందని, దీక్షలో పాల్గొనేవారు శాంతియుతంగా ఉండాలని, గడువులోగా ముగించాలని సూచించారు. తెలంగాణను దోచుకుంటున్న వారిపైనే తమ పోరాటమని, ఉద్యమానికి వక్రభాష్యాలు చెప్పవద్దని చుక్కా రామయ్య కోరారు.

## సమరదీక్షలో టీకాంగ్రెస్ ఎంపీలపై దాడికి యత్నం

ప్రత్యేక తెలంగాణ కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ప్రారంభమైన సమరదీక్షలో ఆదివారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీక్షకు మద్దతు తెలిపేందుకు అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత కె.కేశవరావు, ఎంపీలు పొన్నం ప్రభాకర్, వివేక్‌లపై దాడి చేసేందుకు తెలంగాణవాదులు ప్రయత్నించారు. రాత్రి సుమారు పదిన్నర గంటల సమయంలో ఇందిరాపార్కు వద్దకు చేరుకున్న కేశవరావు, పొన్నం ప్రభాకర్‌ల కార్ల అద్దాలు ధ్వంసం చేసి చుట్టుముట్టారు. పార్టీ పదవులకు రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. వేదిక ఎక్కవద్దంటూ కొందరు నిరసన తెలిపారు. ఈ సమయంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కేటీఆర్, హరీష్‌రావు, జేఏసీ చైర్మన్ కోదండరాం తదితరులు ఆందోళనకారులను శాంతింపజేశారు. సంఘీభావం తెలపడానికి వచ్చిన వారిని అడ్డుకోవడం సరైందికాదని కేటీఆర్ అన్నారు. అడ్డుకోవాల్సిన వారు కాంగ్రెస్‌లో చాలా మంది ఉన్నారని పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్ నేతలుగా రాలేదని, తెలంగాణ బిడ్డలుగా దీక్షకు సంఘీభావం తెలియజేయడానికే ఇక్కడకు వచ్చామని పొన్నం చెప్పారు.

## 28 జనవరి 2013:
## సమరదీక్షలో కేసీఆర్ నిప్పులు

తెలంగాణను దోచుకున్న సీమాంధ్రులు.. పిశాచులు, రాక్షసులు, దోపిడీ దొంగలేనని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. అలా ఒక్కసారి కాదు.. వెయ్యిసార్లు అంటామన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన సమరదీక్షలో కేసీఆర్ సోమవారం ముగింపు ఉపన్యాసం చేశారు. సీమాంధ్ర నేతలు, సీమాంధ్రులు, టీ.కాంగ్రెస్ నాయకులపై విరుచుకుపడ్డారు. 'నీళ్లు, ఉద్యోగాలు, నిధులు ఎత్తుకుపోయిన వాళ్లను దోపిడీ దొంగలనక ఏమంటారు? 50–60 ఏళ్లుగా పట్టిపీడిస్తున్న వాళ్లను పిశాచులు, రాక్షసులు అనక ఏమంటారు? ఒక్కసారి కాదు ఉండవల్లి.. వెయ్యిసార్లు అంటాం. దెయ్యంపడితే పోయే వరకు వేప మండలతో కొడుతారు. దెయ్యం దిగి తెలంగాణ ఇచ్చేదాకా ఇట్లనే అంట. ఇజ్జత్, పౌరుషం ఉంటే తెలంగాణ తీర్మానం చేసి నడవండి. లేకపోతే ఇదే బజారు బతుకులవుతాయి' అని హెచ్చరించారు. సోనియా అండ్ కంపెనీ తెలంగాణ విషయంలో నీచాతినీచంగా, ప్రపంచమే ఛీ అనేలా నిస్సిగ్గుగా వ్యవహరించిందని మండిపడ్డారు. 'తెలంగాణ సాధన కోసం ఈ దిక్కుమాలిన దేశంలో ఎన్ని ఉపవాసాలు, దీక్షలు చేయాలి? అని ప్రశ్నించారు. 'ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులంటే ఎలా ఉండాలి? ఉపన్యాసకులు, గాయకులు వారిని బేవార్సుగాళ్లు, బట్టేబాజీగాళ్లు అంటుంటే బాధ అనిపిస్తోంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులకు దక్కే గౌరవం ఇదా?... థూ.. అని వ్యాఖ్యానించారు.

'ఇక్కడ దీక్ష జరుగుతుంటే అక్కడ జానారెడ్డి చాంబర్‌లో తెలంగాణ మంత్రులు మీటింగ్ పెట్టుకున్నరట. ఇంకా జానారెడ్డి సన్నాసి రాజీనామా చేయడట. ఎంత తిట్టినా, ఉమ్మేసినా వారికి ఇజ్జత్ మానం ఉందా? అప్పుడు నేను, జానారెడ్డి కలిసి జేఏసీ పెట్టినా.. రాజీనామాలు చేస్తామని చెప్పి చూపించి పారిపీకితివి' అని ఎద్దేవా చేశారు. 'మీకు చీమూ నెత్తురు, సిగ్గు, లజ్జ ఉంటే పదవులు, పార్టీకి రాజీనామా చేసి ప్రజల్లోకి, ఉద్యమంలోకి రావాలి' అని చెప్పారు.

'వట్టప్పుడు ఆంధ్రోళ్లు తియ్యగ పుల్లగ మంచిగ మాట్లాడుతరు. అదే కేంద్రంలో తెలంగాణపై ఏదైనా కదలిక వచ్చిందంటే.. జట్టు కట్టి, డబ్బు సంచులతో ఢిల్లీకి వెళ్తారు' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. రాజమండ్రిలో ఉండవల్లి అరుణ్‌కుమార్ నిర్వహించిన జై ఆంధ్రప్రదేశ్ సభను దిక్కుమాలిన సభగా అభివర్ణించారు. తెలంగాణ కోసం ఢిల్లీపై ఒత్తిడి పెంచుతుండగానే.. సీమాంధ్రులు అడ్డుకున్నారన్నారు.

'ఆంధ్రోళ్లు మంచి మాటలకు ఎందుకు పోతారు? మద్రాసు నుంచి ఆంధ్రా విడిపోయినపుడు కూడా జంధ్యాల పాపయ్య శాస్త్రి వంటి కవితలు రాసే ఆంధ్రోళ్లు రాజాజీని బొడ్డింక, నామాలకాకి అని తిట్టారు. ఇప్పుడు హైదరాబాద్ కోసం

ఎలా మాట్లాడారో, అప్పుడు మద్రాసుకోసం అట్లా మాట్లాడారు. ఆంధ్రోళ్ల కిరికిరితో రాజాజీ సహనం కోల్పోయారు. దీంతో ఆయన ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుపై జీవో వెలుబడిన వెంటనే.. ఆంధ్రా కుక్కల్లారా మద్రాసు ఖాళీచేసి వెళ్లిపోండి అన్నారు. ఇప్పుడు ఆంధ్రోళ్లను అట్ల అంటేనే పోతరు. వాళ్లు పోయేదాకా అట్లనే అనాలి' అని కేసీఆర్ అన్నారు.

## ఆదాయం ఇక్కడ, ఖర్చు అక్కడ

రాష్ట్ర ఖజానాకు 2011-12లో ఆంధ్రా కంటే తెలంగాణ నుంచి ప్రభుత్వానికి మూడు రెట్ల ఎక్కువ ఆదాయం వచ్చిందని కేసీఆర్ తెలిపారు. 'తెలంగాణ నుంచి రూ. 39,900 కోట్ల ఆదాయం వస్తే, ఆంధ్రా నుంచి రూ. 13, 178 కోట్లు వచ్చింది. ఆదాయం ఇక్కడ, ఖర్చు అక్కడ. తినమరిగినోళ్లు ఇక్కడి నుంచి పొమ్మంటే పోతరా?' అని వ్యాఖ్యానించారు. 'గతంలో నేను ఈ లెక్కలు ఓ సభలో చెబితే.. ఆంధ్రా వాళ్లు కిరికిరి పెడుతారని, కొడుకులు మాట్లాడుతరని చూసిన, ఎవడైనా మాట్లాడితే ఈడ్చి బండకు కొడుతామని చూసిన. కానీ, ఒక్కడు మాట్లాడలే.. కుక్కిన పేనుల్లా ఉన్నరు' అని అన్నారు. 'కేటాయింపులు తెలంగాణకు, దోచుకుపోయేది వాళ్లు. ఉండవల్లీ దమ్మున్నటే సమాధానం చెప్పు? అనుమతులులేని కండలేరు, సోమశిల కట్టలేదా? బాజాప్తా శ్రీశైలం వద్ద పోలీసు బందోబస్తు పెట్టి 138 టీఎంసీలను ఆపే ఆనకట్టలు కట్టుకోలేదా? ఎవని సొమ్ము తింటున్నారు? ఎవరి నీళ్లు తాగుతున్నారు'? అని ప్రశ్నించారు. స్నేహం, కలిసి ఉండటం అనేవి పరస్పర విశ్వాసంపై ఆధారపడి ఉంటాయన్నారు. ఆ విశ్వాసం కోల్పోయిన తర్వాత కూడా కలిసి ఉండాలని జబర్దస్తీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో భార్యాభర్తలు కూడా విడిపోయే చట్టాలున్నాయన్నారు.

'తెలంగాణ కోసం చాలా ప్రయత్నాలు చేశాం. చేయని పోరాటం లేదు. పార్లమెంటులో అందరూ సభ్యులకు అక్కడున్న చప్రాసీ 'నమస్తే సాబ్' అంటారు. నేనూ, విజయశాంతి కనిపిస్తే మాత్రం 'జై తెలంగాణ' అంటారు. ఆ చప్రాసీకి ఉన్న దమాక్ కూడా ప్రధానికి లేదు. ఇది ప్రజాస్వామ్యమా దేశమా? నమ్మాలా?' అని కేసీఆర్ ప్రశ్నించారు. 50-55 ఏళ్లుగా ఉద్యమం జరుగుతున్నా స్పందించడంలేదంటూ.. 'ఇవి ప్రభుత్వాలా? దున్నపోతు రాజ్యాలా? ప్రజాస్వామ్య దేశమైతే భారత ప్రభుత్వం ఎందుకు గుర్తించదు?' అని ప్రశ్నించారు. 'మొన్న కాంగ్రెస్ సన్నాసులు నన్ను ఢిల్లీకి పిలిస్తే వెళ్లాను. పార్టీని కాంగ్రెస్‌లో కలపమన్నారు. తెలంగాణ కోసం పార్టీని కలుపుత.. మీ బొంద మీద పెట్టుకోపో అన్న.. అయినా కాంగ్రెస్ సన్నాసులు తెలంగాణ ఇవ్వలేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణను ముందుగాల ముంచినోడే నెహ్రూ. 1969 ఉద్యమకారులను చంపింది ఇందిరాగాంధీ. ఇప్పుడు రాచిరంపాన పెడుతున్నది సోనియాగాంధీ. మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు శాపంగా మారింది. ఈ ప్రాంతాన్ని సర్వనాశనం చేసింది. దోపిడీదారులుగా దోచుకుంది' అని మండిపడ్డారు. 'మొన్న షిండే, ఆజాద్ అంటరు.. తెలంగాణపై తేల్చడానికి ఇంకా సంప్రదింపులు

అవసరమట. వీనింట్ల పీనుగెళ్ల.. ఇంకెన్నేళ్లు? ఎన్ని కమిటీలు?' అని ప్రశ్నించారు.

జేఏసీ తలపెట్టిన సమర దీక్ష అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుందని పోలీసులు పేర్కొన్నారంటూ కేసీఆర్ మండిపడ్డారు. 'తెలంగాణ వాళ్లను కష్టాలు పెడుతున్నారు. సమర దీక్షకు భార్యాభర్త వస్తే ఇద్దరినీ చెరొక పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఇది సంస్కారమా? కడుపు మండి ఒక మాట అంటే ఈ రకంగా వ్యవహరిస్తారా?' అని మండిపడ్డారు. '12ఏళ్ల నుంచి ఉద్యమాన్ని నడిపిస్తున్నాం. ఎన్నడైనా ఎవన్నైనా కొట్టినమా? తన్నినమా? ఎవని ఆస్తినైనా పగలగొట్టినమా? ఓపికతో ఉంటున్నాం. మమ్మల్ని మేమే చంపుకుంటున్నాం. మాకు మేమే ఉపవాసం ఉంటున్నాం. కాలబెట్టుకుని చనిపోతున్నాం. ఎవరినైనా చంపామా? ఈ వేదిక నుంచి సీఎం, డీజీపీలకు ఒకటే చెబుతున్నాం. తెలంగాణ ఉద్యమం ప్రజాస్వామిక ఆకాంక్ష, న్యాయమైన డిమాండ్. శాంతియుతంగా నిర్వహిస్తున్న ఉద్యమానికి పిచ్చి పిచ్చి ఆటంకాలు కలిగిస్తే.. మీ చేతులు, కాళ్లే కాలుతాయి బిడ్డా' అని హెచ్చరించారు. ఈ పిచ్చకుంట్ల బెదిరింపులు ఎంతకాలమంటూ ఎమ్మెల్యేల అరెస్టులపై ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజలకు ముందుకు సాగటమే కర్తవ్యమని, రాష్ట్ర సాధన తప్ప మరో మార్గంలేదన్నారు. సమైక్య పాలనలో తెలంగాణ వారికి ఏ రంగంలోనూ న్యాయం జరగదని చెప్పారు.

శాసనసభ బడ్జెట్ సమావేశాల సమయంలో ఛలో హైదరాబాద్ కాకుండా ఛలో అసెంబ్లీ ఉంటుందని, దీనికి లక్షలాదిగా తరలివచ్చి, తెలంగాణ ఐక్యత చూపిద్దామని పిలుపునిచ్చారు. 'ఇప్పటికే కొన్ని కార్యక్రమాలు అనుకున్నాం. వారం లేదా కొద్ది రోజుల తర్వాత జేఏసీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తాం. మేధావులతోనూ చర్చించి కాంగ్రెస్‌పై ఒత్తిడి పెంచి, కేంద్రం మెడలు వంచడానికి ఏ పంథాలో ముందుకెళ్లాలనే కార్యాచరణను త్వరలో జేఏసీ ప్రకటిస్తుంది' అని చెప్పారు. కేసీఆర్ ప్రసంగిస్తుండగా తెలంగాణ వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారని ఎవరో చెప్పటంతో ఆయన ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 'ఈ కిరికిరి పనులతో ఆపితే ఆగేదా ఈ ఉద్యమం, ప్రభుత్వానిది ఎంత ఇరుకైన, చిల్లర మనస్తత్వమో దీంతోనే అర్థమవుతోంది. కేసీఆర్ స్పీచ్ టీవీల్లో రాకుండా ఆపితే ఏమైతది? ఇప్పుడు తెలంగాణ ఏకమైంది. ఒక్క కేసీఆర్, కోదండరాం కాదు.. ఆదిలాబాద్ జిల్లాలోని ఓ ప్రాథమిక పాఠశాల విద్యార్థి కూడా తెలంగాణ గురించి గంట కొట్టినట్టు గంట సేపు చెబుతాడు. అంత పరిపక్వ స్థాయిలో ఉంది తెలంగాణ ఉద్యమం' అని తెలిపారు.

### కాంగ్రెస్‌కో ఖతమ్ కరో.. : కోదండరాం పిలుపు

'కాంగ్రెస్‌కో ఖతం కరో.. ఇది తెలంగాణ జేఏసీ తాజా నినాదం. టార్గెట్ కాంగ్రెస్ అంటూ జేఏసీ ఉద్యమ కార్యాచరణకు సన్నద్ధమైంది. తెలంగాణ కాంగ్రెస్ నేతలను రాజకీయంగా బహిష్కరించాలని, వారిని మనుషులుగా చూడరాదని

పిలుపునిచ్చింది. సమరదీక్షా వేదిక నుంచి తెలంగాణ జేఏసీ నేతలు అధికార కాంగ్రేస్‌పై యుద్ధబేరి మోగించారు. 'జై తెలంగాణ! యెయ్ కాంగ్రేస్!! అనే కొత్త నినాదానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ సాధనకు కేంద్రంపై ఒత్తిడి చేయడమే లక్ష్యంగా ఇందిరాపార్కు వద్ద ప్రారంభించిన 36గంటల సమరదీక్ష సోమవారం సాయంత్రం ముగిసింది. దీక్షలో భాగంగా అత్యవసరంగా సమావేశమైన జేఏసీ స్టీరింగ్ కమిటీ.. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా తెలంగాణ కాంగ్రేస్ నేతలు అందరినీ రాజకీయ బహిష్కరణ చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఇదే విషయాన్ని జేఏసీ చైర్మన్ కోదండరాం సమరదీక్షా వేదిక నుంచి ప్రకటించారు. భవిష్యత్తు కార్యాచరణనూ ప్రకటించారు.

'కాంగ్రేస్‌కో ఖతం కరో.. తెలంగాణకో హసిల్ కరో' నినాదంతో ఉద్యమంలో కలిసి రాని కాంగ్రేస్ నేతలే లక్ష్యంగా పోరాటం ఉంటుందని చెప్పారు. ఆంధ్రా భూతాన్ని వదలగొట్టేలా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. వారు మన వేదిక వద్దకు రావద్దు. వారి వేదికలకు మనం వెళ్లేది లేదు. తటస్థ వేదికల్లో వారున్నా వెళ్లేది లేదు. అని కోదండరాం స్పష్టం చేశారు. కాంగ్రేస్ నేతలు ఊరికి రావద్దు అంటూ అన్ని గ్రామాల్లో వాల్ పోస్టర్లు వేస్తామన్నారు. కాంగ్రేస్ నేతలు సిగ్గుపడేలా భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ఉంటుందని హెచ్చరించారు. ఆ పార్టీలోనే ఉంటారా? మాతో కలిసి వస్తారా? అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన ఉండాలనుకుంటే.. తెలంగాణ మంత్రులు రాజీనామా చేయాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీని వీడి జేఏసీ ఇచ్చే ఉద్యమ కర్యాచరణలో పాల్గొనాలని డిమాండ్ చేశారు. టీడీపీ, వైసీపీ నేతలు సైతం స్పష్టమైన వైఖరితో ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ జరిగే సమయంలో చలో అసెంబ్లీని నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ నుంచి కర్నూలుకు, విజయవాడకు వెళ్లే జాతీయ రహదారుల దిగ్బంధం కార్యాక్రమం చేపడతామన్నారు. 'ఇక వెనక్కు వెళ్లేది లేదు. సమ్మక్క–సారక్క, పాపన్న, ఇటీవల ఆత్మబలిదానాలు చేసుకున్న వెయ్యి మంది త్యాగాల స్ఫూర్తితో, సమరశీలతతో ఉద్యమిద్దాం' అని పిలుపునిచ్చారు. సకల జనుల సమ్మె వంటి ఉద్యమాలు ఉంటాయని చెప్పారు. తెలంగాణపై ఇక ఎలాంటి సంప్రదింపులు అవసరం లేదు. కేంద్రం సీమాంధ్ర నేతల చేతుల్లోకి వెళ్లింది. సీమాంధ్ర కాంట్రాక్టర్ల ఒత్తిళ్లకు తలొగ్గింది' అని ఆరోపించారు.

### 29 జనవరి 2013:

### కేంద్ర మంత్రులపై 420 కేసు

కేంద్ర మంత్రులు షిండే, చిదంబరం, గులాంనబీ ఆజాద్‌లపై ఐపీసీ సెక్షన్లు 420, 150ఎ కింద కేసులు నమోదు చేసి ఫిబ్రవరి 28లోగా నివేదిక సమర్పించాలని చైతన్యపురి పోలీసులను కోర్టు ఆదేశించింది. తెలంగాణ ఏర్పాటుపై పరస్పర విరుద్ధ

ప్రకటనలు చేస్తూ కేంద్ర మంత్రులు తెలంగాణ ప్రజలను మోసగించారని రంగారెడ్డి జిల్లా కోర్టులో మధు అనే న్యాయవాది ప్రైవేటు పిటీషన్ దాఖలు చేశారు.

## ధైర్యముంటే అరెస్టు చేయండి: కోదండరాం

కేసులతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని జేఏసీ చైర్మన్ కోదండరాం ఉద్ఘాటించారు. 'ధైర్యం ఉంటే అరెస్టు చేయ్! నీ ఇంటి వద్దే నిలబడి ఉంటాం. ఎప్పుడైనా అరెస్టు చేసుకో' అంటూ సీఎంకు సవాల్ విసిరారు. హామీలను విస్మరిస్తే అడిగే హక్కు ఎవరికైనా ఉంటుంది. దీని నుంచి ఎంతటి వారికైనా మినహాయింపు ఉండదు అని స్పష్టం చేశారు. 'రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో ఉన్నాం. ఆర్టికల్ 15, 16, 17 ప్రకారం అగ్రనేతలు, మాలాంటి వారు, పౌరులు అందరూ సమానులే. ప్రధాని మంత్రిని తిట్టడానికి హెూదా, ప్రతిపత్తి అవసరం లేదు' అని కోదండరాం తెలిపారు. ఆజాద్, షిండే ప్రకటనల అనంతరం తెలంగాణ ప్రాంతంలో నలుగురు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. 'ఆ నలుగురు చావులకు కారణం మీరు కాదా? బుధవారం ఆత్మహత్య చేసుకున్న బీటెక్ విద్యార్థి దినేశ్ తల్లిదండ్రులకు ఏం సమాధానం చెబుతారు?' అని నిలదీశారు. తమ ఆత్మహత్యలకు కారణం వీరే అంటూ సూసైడ్ నోట్లు ఉన్నాయని.. బాధ్యులపై ఎందుకు కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. తెలంగాణను వ్యతిరేకిస్తూ, సీమాంధ్రులను కాపాడుతూ.. సీఎం కిరణ్, బొత్స, ఉండవల్లి అరుణ్‌కుమార్ ఉద్యమాన్ని అణిచివేసే కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

తెలంగాణ ఉద్యోగులు పనిచేయడం లేదంటూ కొందరు మంత్రులు సీఎం వద్ద ప్రస్తావించినట్లు వచ్చిన వార్తలపై శ్రీనివాస్‌గౌడ్ తీవ్రంగా స్పందించారు. '70శాతం ఆదాయం తెలంగాణ నుంచే వస్తోంది. మేం పనిచేయకపోతే ఇదేలా సాధ్యమైంది? ప్రభుత్వ పథాకలను మెరుగ్గా అమలు చేస్తున్నారంటూ సీఎం కితాబిచ్చారు' అని తెలిపారు. తిన్నదరక్క ఉద్యమం చేయడంలేదని.. ఓవైపు ఉద్యోగం, మరోవైపు ఉద్యమం చేస్తున్నామన్నారు. సీమాంధ్రనేతలపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విఠల్ ప్రశ్నించారు. సైన్యాన్ని తయారు చేస్తామన్న మంత్రి టీజీ, మానవబాంబులవుతామన్న పయ్యావుల కేశవ్, ఖాసీం రజ్వీతో పోల్చిన ఎంపీ ఉండవల్లి, తెలంగాణ వారిని జోకర్లుగా, విలన్లుగా చూపిన సినీ రంగ ప్రముఖులపై ఎందుకు కేసులు నమోదు కాలేదని ప్రశ్నించారు.

### 07 ఫిబ్రవరి 2013:

తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల జేయేసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమం-భవిష్యత్ కార్యాచరణ అనే అంశంపై హన్మకొండలో ప్రత్యేక సదస్సు హాజరైన జేయేసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పిట్టల రవీందర్, శివాజీ తదితరులు.

**09 ఫిబ్రవరి 2013**

తెలంగాణ విద్యావంతుల వేదిక గ్రేటర్ హైదరాబాద్ మూడవ మహాసభ కొత్త పేట (దిల్‌సుఖ్‌నగర్) లో జరిగింది. విప్లవ కవి వరవరరావు ముఖ్య వక్తగా హాజరైనారు.

**10 ఫిబ్రవరి 2013:**

తెలంగాణ విద్యావంతుల వేదిక విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం సికింద్రాబాద్‌లోని ఫిల్మ్‌చాంబర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు 7 గంటల పాటు సుదీర్ఘంగా జరిగింది.

**17 ఫిబ్రవరి 2013:**

గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మల్లేపల్లి రాజం మెమోరియల్ సెమినార్ లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ముఖ్యోపన్యాసం చేస్తూ తెలంగాణ రాష్ట్ర డిమాండ్ రాజ్యాంగ బద్ధమైనదన్నారు.

**21 ఫిబ్రవరి 2013:**

హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో భారీ విస్ఫోటం 16 మంది మృతి.

**22 ఫిబ్రవరి 2013**

సడక్ బంద్ కార్యక్రమాన్ని వాయిదా వేసి, మార్చి మూడవవారంలో నిర్వహించాలని నేడు జరిగిన జేయేసీ స్టీరింగ్ కమిటిలో నిర్ణయం.

**23 ఫిబ్రవరి 2013:**

తెలంగాణ ఎన్‌జీవోస్ కార్యాలయ భవన్‌లో జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశం. అన్ని జిల్లాలలో మహిళా జేయేసీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం.

**26 ఫిబ్రవరి 2013:**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ విద్యావంతుల వేదిక సదస్సు.

**27 ఫిబ్రవరి 2013:**

హైదరాబాద్‌ను దేశానికి రెండవ రాజధానిగా చేయాలన్న ప్రతిపాదనలను నిరసిస్తూ తెలంగాణ విద్యావంతుల వేదిక గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు.

**01 మార్చి 2013:**

సికింద్రాబాద్‌లోని తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో వి. సంధ్య అధ్యక్షతన జరిగిన తెలంగాణ జేయేసీ మహిళా విభాగం సమావేశం.

**02 మార్చి 2013:**

మార్చి 21వ తేదీన సడక్ బంద్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జేయేసీ

కార్యాలయంలో నేడు జరిగిన తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశం నిర్ణయించినట్లు జేయేసీ కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్ ప్రకటించారు.

**05 మార్చి 2013:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా నవతరం పార్టీ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన ప్రత్యేక సదస్సుకు తెలంగాణ విద్యావంతుల వేదిక తరపున హాజరై ప్రసంగించిన శ్రీధర్ దేశ్‌పాండే.

**10 మార్చి 2013:**

"మిలియన్ మార్చి డే" సందర్భాన్ని గుర్తుకు చేసుకుంటూ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు. పిట్టల రవీందర్ సంపాదకత్వంలో వెలువరించిన "తెలంగాణ మార్చ్" (సాగరహారం) పుస్తకా విష్కరణ.

**17 మార్చి 2013:**

తెలంగాణ విద్యావంతుల వేదిక ఆదిలాబాద్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో భైంసా పట్టణంలో ప్రత్యేక శిక్షణ శిబిరం. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురిజాల రవీందర్‌రావు, టిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి తదితరులు హాజరు.

**20 మార్చి 2013:**

**సడక్ బంద్‌కు పోలీసుల ఆంక్షలు**

తెలంగాణ ఏర్పాటును డిమాండ్ చేస్తూ తెలంగాణ జేఏసి మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన 'సడక్ బంద్'కు తెలంగాణ అన్ని జిల్లాల నుంచి తెలంగాణవాదులు, ఉద్యమకారులు భారీ సంఖ్యలో పాల్గొనేందుకు సమాయత్తమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అనుమతి నిరాకరించడమే కాకుండా, సడక్ బంద్‌ను విఫలం చేసేందుకు సర్కారు తీవ్రమైన ఆంక్షలు విధించింది. గురువారం హైదరాబాద్–కర్నూల్ జాతీయ రహదారిపై భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించింది. జిల్లాల్లో తెలంగాణవాదులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధించారు. జిల్లాల్లో అన్ని ప్రధాన రహదారుల వెంట పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. సడక్ బంద్‌కు తరలివెళ్తున్న నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

**21 మార్చి 2013:**

**సడక్ బంద్ సక్సెస్.. పలువురి నేతల అరెస్టు**

టీజేఏసి పిలుపు మేరకు శంషాబాద్ నుంచి ఆలంపూర్ వరకు 44వ నెంబర్

జాతీయ రహదారిని తెలంగాణవాదులు దిగ్బందించి సడక్ బంద్‌ను సక్సెస్ చేశారు. భారీగా మోహరించిన పోలీసుల కళ్లుగప్పి నిర్ధేశించుకున్న పాయింట్ల వద్దకు చేరుకున్న తెలంగాణవాదులు జై తెలంగాణ నినాదాలు చేశారు. ముందస్తు అరెస్టులు, బైండోవర్లతో కట్టడి చేయగలమని ప్రభుత్వం భావించినా.. ఉద్యమ రథసారథులు టీజేఏసి చైర్మన్ కోదండరాం, టీఆర్ఎస్ ఎల్పీ నేత ఈటెల రాజేందర్, ఉద్యోగ జేఏసి నేత శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ జితెందర్ రెడ్డి సహా ముఖ్య నాయకత్వాన్ని అరెస్టు చేశారు. 1777 మంది కార్యకర్తలను అరెస్టు చేసి 57 కేసులు నమోదు చేశారు. ఇంత నిర్బంధాన్ని సైతం ఛేధించుకుని సడక్ బంద్‌ను విజయవంతం చేయడాన్ని జీర్ణించుకోని పోలీసులు వివిధ ప్రాంతాలలో ఉద్యమకారులపై రెచ్చిపోయి విచక్షణా రహితంగా లాఠీచార్జి చేశారు.

ఆలంపూర్: సడక్ బంద్ కార్యక్రమం సందర్భంగా గురువారం ఉదయం టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈటెల రాజేందర్, జూపల్లి, జితెందర్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్ టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. వారిని పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే అక్కడికి టీజేఏసి చైర్మన్ కోదండరాం, కోకన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ టోల్‌గేట్ వద్దకు రావడంతో పోలీసులు వారిని అడ్డుకొని బలవంతంగా అరెస్టు చేసి కర్నూల్ జిల్లా మీదుగా రాజోలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చెన్నూర్ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య ఆధ్వర్యంలో దాదాపు 200 మంది కార్యకర్తలు పొలాల వెంట పరుగెత్తుతూ టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే అరవిందరెడ్డి, న్యాయవాదుల జేఏసి నేత రాజేందర్‌రెడ్డి, సిపిఐ నాయకుడు చాడ వెంకటరెడ్డిలతో పాటు పలువురిని ఆలంపూర్ టోల్‌గేట్ వద్ద అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు.

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ కేంద్రంలో పోలీసుల ఆంక్షలు కొనసాగుతున్నప్పటికీ ఎల్కిచెర్ల, గొప్లాపూర్, పోతులమడుగు, శేరిపల్లి గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి సడక్ బంద్‌లో పాల్గొన్నారు. ఈ కేంద్రంలో ఆందోళన నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు సోమారపు సత్యనారాయణ, వినయ్‌భాస్కర్, విద్యాసాగర్, ఎన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు వేదకుమార్, రత్నమాల, డాట్స్ నర్సయ్యలను పోలీసులు అరెస్టు చేసి బిజినేపల్లి, జడ్చర్ల, భూత్పూర్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

కొత్తకోట: మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై రైతులు ఎడ్ల బండ్లతో రహదారిని దిగ్బంధించారు. కంగుతిన్న పోలీసులు ఎడ్లబండ్లను రహదారి నుంచి పక్కకు తొలగించేందుకు నానాతంటాలు పడ్డారు. రాణిపేట గ్రామం నుంచి రహదారిపైకి వచ్చిన ఎమ్మెల్యే రాజయ్య, భిక్షపతి, జోగు రామన్న, కొప్పుల ఈశ్వర్, టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి అశ్వద్ధామరెడ్డిలు రహదారిపై టైర్లను తగులబెట్టి నిరసన వ్యక్తం చేయగా వీరిని పోలీసులు అదుపులోకి

తీసుకున్నారు.

పాలమాకుల: రంగారెడ్డి జిల్లా పాలమాకుల సడక్ బంద్ సందర్భంగా జనసంద్రాన్ని తలపించింది. పాలమాకుల సభావేదిక వద్ద ఉదయం 6గంటలకే వేలాదిగా తెలంగాణవాదులు తరలివచ్చారు. ముందస్తు వ్యూహం ప్రకారం శంషాబాద్‌లో బసచేసిన ఉద్యమకారులు ఉదయం 8గంటలకు టీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుతో కలిసి సభావేదిక దగ్గర్లోని ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నేతలంతా రోడ్డుపై బైఠాయించి నాలుగు గంటల పాటు పూర్తిగా రహదారిని స్తంబింపజేశారు. దేశపతి, రసమయి, సాయిచంద్ కళాకారుల బృందం ఆటాపాటలతో సభాప్రాంగణం హోరెత్తింది. అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. మధ్యాహ్నానికి వేదిక వద్దకు వేలాదిగా పోలీసు బలగాలు చేరుకుని బలవంతంగా ఉద్యమకారులను అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో టీఆర్ఎస్ నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, టీఆర్ఎస్ మహిళా నాయకురాలు తుల ఉమ, పీవోడబ్ల్యూ నేత సంధ్య తదితరులు ఉన్నారు. కాగా మహబూబ్‌నగర్ జిల్లా తిమ్మాపూర్‌లో జిల్లా జేఏసి, సీపిఐనేతలు చల్మారెడ్డి, బాలమల్లేశ్, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ఎమ్మెల్సీ చంద్రశేఖర్, మస్కు నర్సింహాలను అరెస్టు చేసి కొత్తపేట పీఎస్‌కు తరలించారు. సడక్‌బంద్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్, నాగం జనార్థన్‌రెడ్డి, బద్దం బాల్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, మల్లారెడ్డి, బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో పోలీసులు, తెలంగాణవాదుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఉదయం నుంచే జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్నవారిని పోలీసులు అరెస్టు చేశారు. మాచారం గ్రామం వద్ద టీఆర్ఎస్ నేత లక్ష్మారెడ్డిని అరెస్టు చేసి తిమ్మాజీపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలానగర్ వద్ద టీయూఎఫ్ నాయకురాలు విమలక్క, దాస్‌రాంనాయక్, రాజాపూర్ వద్ద ఎమ్మెల్సీలు జనార్థన్, కూన రవీందర్, పీఆర్టీయూ నేత వెంకటరెడ్డిలు సడక్ బంద్‌ను నిర్వహించారు. గొల్లపల్లి వద్ద బీజేపీ నాయకులు, జడ్చర్ల క్రాస్ రోడ్ వద్ద న్యూడెమాక్రసీ నేతలు ధర్నాకు చేపట్టగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్, కొత్తూరు, తిమ్మాపూర్ ప్రాంతాలలో పోలీసుల ఓవర్‌యాక్షన్ వల్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. సడక్‌బంద్‌లో పాల్గొనేందుకు అన్నారం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కేటీఆర్, హరీశ్వర్‌రెడ్డి, యండల లక్ష్మీనారాయణ, గుండా మల్లేష్, ఎమ్మెల్సీ నారదాసులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసు వాహనాలను వెళ్లనీయకుండా గ్రామస్థులు ట్రాక్టర్లను, ప్రొక్లెయినర్లను రహదారికి అడ్డంగా పెట్టారు. షాద్‌నగర్‌లో న్యాయవాదులు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. బాలానగర్‌లో రోడ్డుకు అడ్డంగా టైర్లను వేసి తగులబెట్టారు.

### ఓయూలో ఉద్రిక్తత

టీజేఏసి పిలుపు మేరకు సడక్ బంద్‌లో పాల్గొనేందుకు బయలుదేరిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులను ఎన్‌సిసి గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. విద్యార్థి నేతలను అరెస్టు చేసి నల్లకుంట పీఎస్‌కు తరలించారు. పోలీసులపైకి విద్యార్థులు రాళ్లు విసరడంతో ఉద్రిక్తత తలెత్తింది. పోలీసుల వైఖరితో ఆగ్రహం చెందిన విద్యార్థులు రోడ్డుపై ఉన్న సింటెక్స్ డబ్బాకు నిప్పంటించారు. పోలీసుల కళ్లుగప్పి సడక్ బంద్‌లో పాల్గొన్న విద్యార్థులను శంషాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎన్‌సిసి గేటు వద్ద సిఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

కో–చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య అధ్యక్షతన తెలంగాణ జేయేసీ అత్యవసర సమావేశం. సడక్‌బంద్ సందర్భంగా ప్రభుత్వం ప్రయోగించిన నిర్భందాన్ని తీవ్రంగా ఖండించిన జేయేసీ భాగస్వామ్య పార్టీలు. ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనానికి నిర్ణయం.

### 22 మార్చి 2013:

### అరెస్టులకు నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా ఆందోళనలు

సడక్ బంద్ సందర్భంగా గురువారం తెలంగాణ ఉద్యమనాయకులను, తెలంగాణవాదులను అరెస్టు చేసి జైళ్లలో నిర్బంధించడాన్ని నిరసిస్తూ తెలంగాణ పది జిల్లాల్లో నిరసనలు హోరెత్తాయి. తెలంగాణ వ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు, దిష్టిబొమ్మ దహనాలను నిర్వహించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ విద్యావంతుల వేదిక నిజామాబాద్ జిల్లా మహాసభ, నూతన కార్యవర్గం ఎన్నిక.

### 23 మార్చి 2013:

### అరెస్టులపై ఆగ్రహం... కోదండరాం సహా పలువురికి బెయిల్

సికింద్రాబాద్‌లోని తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 6 గంటలపాటు సాగిన జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశం. సడక్ బంద్ సందర్భంగా ప్రభుత్వం ప్రయోగించిన నిర్భందం పట్ల నిరసన.

సడక్ బంద్ సందర్భంగా అరెస్టయి మహబూబ్‌నగర్ జిల్లా జైలులో ఉన్న టీజేఏసి చైర్మన్ కోదండరాం, శ్రీనివాస్‌గౌడ్, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈటెల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, జితెందర్ రెడ్డిలతో పాటు మరో ముగ్గురికి శనివారం ఆలంపూర్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో అరెస్టయిన ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య, టీఆర్ఎస్ నేతలు గట్టు తిమ్మప్ప, రవికుమార్‌లు శనివారం కోర్టులో లొంగిపోగా

వీరికి బెయిల్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది. బెయిల్‌పై విడుదలైన కోదండరాం మాట్లాడుతూ 'అరెస్టులకు బెదిరేవాళ్లం కాదు.. ప్రజలకు హామీ ఇస్తున్నాం. ఉద్యమాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్తాం. పార్లమెంటు, అసెంబ్లీలో తెలంగాణ అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్యేలకు, ఎంపీలకు అభినందనలు తెలుపుతున్నాం' అని అన్నారు.

**24 మార్చి 2013:**

నోమా గార్డెన్స్‌లో తెలంగాణ విద్యావంతుల వేదిక నాలుగవ రాష్ట్ర మహాసభ. గౌరవ అధ్యక్షునిగా కోదండరాం, అధ్యక్షునిగా మల్లెపల్లి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్ మరోసారి ఎన్నిక.

**27 మార్చి 2013:**

తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమ స్ఫూర్తితో హెూళీ వేడుకలు.

**30 మార్చి 2013:**

టిఎన్‌జీవో భవన్‌లో జరిగిన తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశంలో సడక్ బంద్ వైఫల్యాలపై సీరియస్ చర్చ. జేయేసీ అగ్రనాయకులు అనుసరించిన ఏకపక్ష వైఖరిపై పలువురి అభ్యంతరాలు.

**19 ఏప్రిల్ 2013:**

**'సంసద్ యాత్ర – ఛలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ**

ఈనెల 29, 30 తేదీలలో తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహిం చతలపెట్టిన 'సంసద్ యాత్ర – ఛలో ఢిల్లీ' పోస్టర్‌ను జేయేసీ కార్యాలయంలో శు క్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో జేయేసీ నాయకులు ఆవిష్కరించారు. 'పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టిస్తారా? లేక ప్రజల్లో దోషులుగా నిలుస్తారా !?' అనే విషయాన్ని తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ నాయకులు తేల్చుకోవాలని జేయేసీ చైర్మెన్ కోదండరామ్ హెచ్చరించారు. 'సంసద్ యాత్ర – ఛలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జేయేసీ నాయకులు వి. శ్రీనివాస్‌గౌడ్, అద్దంకి దయాకర్, రసమయి బాలకిషన్, పిట్టల రవీందర్, వెంకటేశం, దానకర్ణాచారి, మాదు సత్యం, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**23 ఏప్రిల్ 2013:**

**'సంసద్ యాత్ర – ఛలో ఢిల్లీ' కి జేయేసీ ప్రత్యేక రైలు**

ఈ నెల 29, 30 తేదీలలో రెండురోజులపాటు ఢిల్లీలో తెలంగాణ జేయేసీ తలపెట్టిన 'సంసద్ యాత్ర – ఛలో ఢిల్లీ' యాత్రకు ఉద్యమకారులను తరలించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రత్యేక రైలును కేటాయించేందుకు అంగీకరించినట్లు

తెలంగాణ జేయేసీ కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్ మీడియాకు తెలిపారు.

**25 ఏప్రిల్ 2013:**

**'తెలంగాణ ఎక్స్‌ప్రెస్'గా ఢిల్లీకి ప్రత్యేక రైలు**

'సంసద్ యాత్ర – ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఉద్యమ కారులను తరలించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలుకు 'తెలంగాణ ఎక్స్‌ప్రెస్'గా నామకరణం చేసారు. ఈ ప్రత్యేక రైలులో సెకండ్‌క్లాస్ స్లీపర్ కోచ్‌లకు చెందిన 22 బోగీలను ఏర్పాటు చేసినట్లు, ఈ ప్రత్యేక రైలులో ప్రయాణిస్తున్న ఉద్యమకారులకు భోజన సౌకర్యాలు రైలులోనే సమకూర్చేందుకు ప్రత్యేకంగా ప్యాంట్రీకార్ బోగీని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు జేయేసీ కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్ తెలిపారు.

**27 ఏప్రిల్ 2013:**

'సంసద్ యాత్ర – ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ నుండి ఢిల్లీ వెడుతున్న ఉద్యమకారులకు సంబంధించిన 'తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ రోజు సాయంత్రం 6 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి జేయేసీ చైర్మెన్ యం. కోదండరాం జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు 29వతేదీ ఉదయం ఐదుగంటలకు నిజాముద్దీన్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది.

**28 ఏప్రిల్ 2013:**

**ఢిల్లీకి బయలుదేరిన జేయేసీ నాయకులు**

సంసద్ యాత్రలో పాల్గొనేందుకు తెలంగాణ జేయేసీ చైర్మెన్ ప్రొఫెసర్ యం. కోదండరాంతోపాటు పలువురు జేయేసీ నాయకులు ఈ రోజు ఉదయం విమానంలో హైదరాబాద్ నుండి ఢిల్లీకి బయలుదేరివెళ్లారు. ఈ నెల 30న తిరిగి వీరంతా నగరానికి చేరుకుంటారు.

**29 ఏప్రిల్ 2013:**

న్యూఢిల్లీ జంతర్‌మంతర్‌లో జేయేసీ ఆధ్వర్యంలో "సత్యాగ్రహదీక్ష" ప్రారంభం. హాజరైన జాతీయ పార్టీల నాయకులు, పలువురు మేధావులు.

**30 ఏప్రిల్ 2013:**

ముగిసిన జేయేసీ "సత్యాగ్రహదీక్ష". పార్లమెంట్ భవన్‌వైపు దూసుకెళ్ళిన తెలంగాణ ఉద్యమకారులు. ఏఐసిసి కార్యాలయం ముందు ధర్నా.

**01 మే 2013:**

హన్మకొండలోని అంబేద్కర్ చౌరస్తాలోని తెలంగాణ మహాజన జేయేసీ ఆధ్వర్యంలో ప్రారంభమైన నిరాహారదీక్ష శిబిరం.

**02 మే 2013:**

సంసద్ యాత్ర నుండి తిరిగి వచ్చిన తెలంగాణ స్టేట్ ఎక్స్‌ప్రెస్ రైలు. స్వాగతం పలికిన జేయేసీ నాయకులు.

27 మే 2013:

జేయేసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఇనుప ఖనిజ పరిరక్షణ యాత్ర గన్‌పార్క్ నుండి ప్రారంభం. కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గ్రామాల సందర్శన. పలు చోట్ల సమావేశాలు.

**28 మే 2013:**

రెండవ రోజు జేయేసీ ఆధ్వర్యంలో వరంగల్ నుండి బయలు దేరిన తెలంగాణ ఇనుప ఖనిజ పరిరక్షణ యాత్ర నర్సంపేట, గూడూరులలో సభలు, మహబూబాబాద్‌లో "మానుకోట ప్రజా ప్రతిఘటన" స్ఫూర్తి సభ. సాయంత్రం బయ్యారంలో భారీ బహిరంగ సభ.

**29 మే 2013:**

టిఎన్‌జీవో భవన్‌లో తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశం. జూన్ 14న 'ఛలో అసెంబ్లీ' నిర్వహించాలని నిర్ణయం.

**01 జూన్ 2013:**

తెలంగాణ జేయేసీ నిర్వహించ తలపెట్టిన 'ఛలో అసెంబ్లీ' పోస్టర్ ఆవిష్కరణ.

**02 జూన్ 2013**

టిఆర్‌ఎస్ పార్టీలో చేరిన పలువురు పార్లమెంటు సభ్యులు.

**03 జూన్ 2013:**

బిజెపి భారీ బహిరంగ సభ. బిజెపిలో చేరి నాగం జనార్ధన్ రెడ్డి, తెలంగాణ నగారా బిజెపిలో విలీనం.

బిజెపి జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్‌తో తెలంగాణ జేయేసీ ముఖ్యనాయకుల ప్రత్యేక సమావేశం.

**13 జూన్ 2013:**

**'ఛలో అసెంబ్లీ'కి అడుగడుగునా అడ్డంకులు**

జూన్ 14న తెలంగాణ రాజకీయ జేఏసి ఇచ్చిన 'ఛలో అసెంబ్లీ' పిలుపు మేరకు తెలంగాణ పది జిల్లాల నుండి ఉద్యమకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను చాటాలని దృఢ సంకల్పంతో వారం ముందుగానే సిద్ధమయ్యారు. గతంలో మిలియన్ మార్చ్, సాగరహారం, సడక్ బంద్ వంటి ఉద్యమ

కార్యక్రమాల్లో తెలంగాణవాదులు లక్షల సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం.. అలాగే గత పదిహేను రోజుల ముందు నుంచే జిల్లాల్లో ఛలో అసెంబ్లీ విజయవంతం చేయడానికి జేఏసి నిర్వహిస్తున్న సన్నాహక సమావేశాలను బట్టి గతంలో కంటే ఛలో అసెంబ్లీకి అనూహ్య స్పందన రానుందని భావించిన సీమాంధ్ర సర్కారు జిల్లాల నుండి తెలంగాణవాదులను హైదరాబాద్‌కు రాకుండా ఉండేందుకు బైండోవర్లు, ముందస్తు అరెస్టులు చేసి వేలాది మందిని నిర్బంధించింది. అంతే కాకుండా రాజధానిలోని ప్రధాన రహదారులన్నింటిని మూసేసి, నగరాన్ని పోలీసులతో నింపేసింది.

### ఆదిలాబాద్ జిల్లా...

### వేయి మందికి పైగా బైండోవర్లు, అరెస్టులు

'ఛలో అసెంబ్లీ'లో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుండి బయలుదేరి వెళ్తున్న టిజేఏసి, టీఆర్ఎస్, బీజేపి, సీపిఐ నేతలను, కార్యకర్తలను తెలంగాణవాదులను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టు చేసి ఠాణాలకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టులను నిరసిస్తూ తెలంగాణ వాదులు ఎక్కడికక్కడే బైఠాయించారు. అదిలాబాద్ పోలీస్ స్టేషన్‌లో మాక్ అసెంబ్లీని, ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. పలు చోట్ల జోరుగా వర్షం పడుతున్నప్పటికీ రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ కృష్ణారావు, జగన్మోహన్‌రావు, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ రెడ్డి, పలువురు జేఏసి నేతలను, ఉద్యోగులను, న్యాయవాదులను, విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన నేతలు ఎంపీ వివేకానంద, ఎమ్మెల్యేలు జోగు రామన్న, నల్లాల ఓదెలు, గడ్డం అరవిందరెడ్డి, గుండా మల్లేష్ సహా పలువురు నేతలు రాజధానిలో కదం తొక్కారు. సిర్పూర్ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య ఏకంగా అసెంబ్లీ భవనంపై నల్లజెండా ఎగరేసి సంచలనం సృష్టించారు.

### కరీంనగర్ జిల్లా...

### నిర్బంధంలో 2884 మంది ఉద్యమకారులు

జిల్లా వ్యాప్తంగా 'ఛలో అసెంబ్లీ'కి బయలుదేరి వెళుతున్న 2884 మంది ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలుచోట్ల అరెస్టులు కొనసాగుతున్నప్పటికీ ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకోలతో నిరసన తెలిపారు. సిరిసిల్ల, ముస్తాబాద్, గంభీరావుపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఛలో అసెంబ్లీ సందర్భంగా పోలీసుల ఆదేశాల మేరకు బల్క్ ఎస్ఎంఎస్‌లు ఆయా కంపెనీలు నిషేధించాయి. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాను, టీవీ ప్రసారాలను కూడా నిలిపివేశారు. టీఆర్ఎస్

నేత ఈద శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. టీఆర్‌ఎస్ నేతలు ఎడ్ల అశోక్, హరిప్రసాద్, కలర్ సత్తన్న, మహిళా నాయకురాలు రేవతిరావు సహా పలువురిని అరెస్టు చేయడంతో పోలీసు స్టేషన్‌లోనే మాక్ అసెంబ్లీని నిర్వహించారు. కెప్టెన్ లక్ష్మికాంతారావు, గుజ్జుల రామకృష్ణారెడ్డిలను గృహనిర్బంధం చేయగా, జేఏసి నాయకురాలు సుంకె యశోదతో పాటు పలువురు మహిళలను, జాగృతి నాయకులు తిరుపతిరావు, టీఆర్‌ఎస్ నేతలు మనోహర్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పలువురు బీజేపి, న్యూడెమాక్రసీ నేతలను, కార్యకర్తలను, విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో జరిగిన లాఠీచార్జిలో జిల్లాకు చెందిన నేతలు సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తీవ్రంగా, బీజేపి నేత సీహెచ్ విద్యాసాగర్‌రావు సహా పలువురు స్వల్పంగా గాయపడ్డారు. ఎంపీ వివేక్, మాజీ ఎంపీ వినోద్‌లను నిజాం క్లబ్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్సీ స్వామీగౌడ్, సుధాకర్‌రెడ్డిలను జూబ్లీబస్‌స్టేషన్ వద్ద అరెస్టు చేశారు. అసెంబ్లీ ఆవరణలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఈటెల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, కెటీఆర్, సోమారపు సత్యనారాయణ, గంగుల కమలాకర్, రమేష్, విద్యాసాగర్‌రావులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

**ఖమ్మం జిల్లా...**

**125 కేసులు... 1024 మంది అరెస్టు...**

ఛలో అసెంబ్లీకి నాలుగు రోజుల ముందు నుంచే జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారుల బైండోవర్లు, అరెస్టుల పర్వం మొదలైంది. జిల్లా పోలీసు శాఖ 125 కేసులు పెట్టగా, వాటిలో 1024 మందిని అరెస్టు చేసునట్లు ప్రకటించింది. అరెస్టులను నిరసిస్తూ పలు చోట్ల ధర్నాలు, రాస్తారోకోలు జరిగాయి. అరెస్టయిన నేతలు పోలీసు స్టేషన్లలోనే మాక్ అసెంబ్లీ నిర్వహించారు. అశ్వారావుపేటలో న్యూడెమాక్రసీ ఆధ్వర్యంలో ర్యాలీ, దమ్ముపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, కోల్‌బెల్ట్ ప్రాంతంలో సింగరేణి కార్మికులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఖమ్మంలో న్యూడెమాక్రసీ నేత పోటు రంగారావును అరెస్టు చేశారు. ఇంతటి నిర్బంధంలో కూడా పకడ్బంధీ వ్యూహాలతో పోలీసుల కన్నుగప్పి రాజధానికి చేరుకున్న జిల్లాకు చెందిన నేతలు బొమ్మెర రామ్మూర్తి, రామారావు, రాజేందర్‌సహా 15 మందిని వారు బసచేసిన హోటల్‌లోనే పోలీసులు అరెస్టు చేసి ముషీరాబాద్ స్టేషన్‌కు తరలించారు. సిపిఐ నేతలు సిద్ది వెంకటేశ్వర్లు, బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ హిమాయత్‌నగర్ చౌరస్తా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లాకు చెందిన శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావును అసెంబ్లీ ప్రాంగణంలో అరెస్టు చేశారు.

**మహబూబ్‌నగర్ జిల్లా...**

**173 కేసులు.. 2317 మంది బైండోవర్...**

ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలివెళుతున్న తెలంగాణవాదులను జిల్లా వ్యాప్తంగా పోలీసులు అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురిని అరెస్టు చేసి 173 కేసులు నమోదు చేసి, 2317 మందిని ఆయా తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. ఎక్కడికక్కడ పోలీసులు తనిఖీ నిర్వహిస్తూ ఉద్యమకారులను అడ్డుకోవడానికి విశ్వప్రయత్నం చేశారు. టీజేఏసి, టీఆర్ఎస్, బీజేపి, సిపిఐ, టీడీపీ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీలతో పాటు తెలంగాణవాదులను అడ్డుకుని అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులకు నిరసనగా పలు ప్రాంతాలలో ఉద్యమకారులు ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అన్ని నిర్బంధాలను దాటుకుని ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లాలోని ఆయా పార్టీల నేతలు హైదరాబాద్‌కు చేరుకోగా వారిని నగర పోలీసులు అరెస్టు చేశారు. బషీర్‌బాగ్ వద్ద టీఆర్ఎస్ నాయకులు విఠల్‌రావు ఆర్యా, లకిడికాపూల్ వద్ద టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు జితేందర్‌రెడ్డి, అసెంబ్లీ వద్ద కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు, నిరంజన్‌రెడ్డిలను, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే నాగం జనార్థన్‌రెడ్డిలను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. టీఆర్ఎస్ జిల్లా నాయకులు బెక్కం జనార్థన్, టీజేఏసి జిల్లా చైర్మన్ రాజేందర్‌రెడ్డిలను నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జాగృతి అధ్యక్షురాలు కవితతో అసెంబ్లీవైపు కు దూసుకెళుతున్న విద్యార్థి జేఏసి నాయకులు మున్నూర్ రవి, సుధీప్, పొలా శ్రీశ్రీ, సంతోష్‌లతో సహా 300 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అశోక్‌నగర్ చౌరస్తా వద్ద జేఏసి చైర్మన్ కోదండరాంతో పాటు ఇందిరాపార్కువైపుకు వెళుతున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, టీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నరాములు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**మెదక్ జిల్లా...**

**847 మంది అరెస్టు.. 1117 మంది బైండోవర్...**

టీజేఏసి పిలుపు మేరకు మెదక్ జిల్లా నుంచి వేలాది మంది తెలంగాణవాదులు ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలివెళ్లి మరోసారి తెలంగాణ ఆకాంక్షను చాటిచెప్పారు. జిల్లాలో గత నాలుగు రోజులుగా పోలీసులు నిర్బంధకాండ కొనసాగించారు. జిల్లా వ్యాప్తంగా 847 మంది టీఆర్ఎస్, జేఏసి, తెలంగాణవాదులను పోలీసులు అరెస్టు చేయగా, మొత్తం 1117 మందిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేశారు. ఎస్పీ విజయ్‌కుమార్ శుక్రవారం సిద్ధిపేట, నర్సాపూర్, కొల్చారం, కుకునూర్‌పల్లి, తూప్రాన్‌ల వద్ద పోలీసు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ తెలంగాణ

వాదులు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేశారు. ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ పలుచోట్ల దర్నాలు, రాస్తారోకోలు, ప్రభుత్వం, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. సంగారెడ్డిలో న్యాయవాదులు విధుల బహిష్కరించి సీఎం కిరణ్‌కు పిండ ప్రధానం చేశారు. అన్ని అవాంతరాలను దాటుకుని ప్రైవేటు, ఆర్టీసీ, ద్విచక్రవాహనాలలో జిల్లా నుంచి జేఏసి, టీఆర్ఎస్, బీజేపి, సిపిఐ, న్యూడెమాక్రసీతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు ఛలో అసెంబ్లీకి తరలివెళ్లారు. జిల్లా నుంచి టీఆర్ఎస్ నేత హరీష్‌రావు అసెంబ్లీ ఆవరణలో నిరసన వ్యక్తంచేసి అరెస్టు కాగా, మెదక్ ఎంపీ విజయశాంతి అసెంబ్లీకి దూసుకెళుతున్న సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రామలింగారెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, కొత్త ప్రభాకర్‌రెడ్డితో సహా పలువురిని హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని ఆయా పరిధిలోని ఠాణాలకు తరలించారు.

**నల్గొండ జిల్లా...**

### 1695 మంది అరెస్టు... 2515 మంది బైండోవర్

ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి జిల్లా నుంచి ఎవరూ వెళ్లకుండా పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించి.. నిర్బంధకాండను కొనసాగించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 1695 మందిని అరెస్టు చేయగా, 2515మందిని బైండోవర్ చేశారు. అద్దె వాహనాలు, ప్రైవేటు స్కూల్ బస్సులు ఇవ్వకుండా పోలీసులు నిషేధం విధించారు. జిల్లా పోలీసు యంత్రాంగం హైదరాబాద్‌కు వెళ్లే దారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని పట్టణాలతో పాటు గ్రామాలలో కూడా అరెస్టులు చేశారు. పోలీసుల వైఖరికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నకిరేకల్‌లో టీఆర్ఎస్ నాయకుడు చెరుకు సుధాకర్, వేముల వీరేశం ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. నూతనకల్‌లో టీఆర్ఎస్, బీజేపి, సీపీఐ, జేఏసినాయకులు రాస్తారోకో చేశారు. పెన్‌పహాడ్ పోలీసుస్టేషన్‌లో నిర్బంధించిన టీఆర్ఎస్ సూర్యాపేట ఇంచార్జి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తదితరులు మాక్ అసెంబ్లీని నిర్వహించారు. ఇదిలా ఉండగా పోలీసుల ఆంక్షలను ఛేధించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న ఆలేరు, భువనగిరి సెగ్మెంట్ల తెలంగాణవాదులను నగర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందులో టీఎన్‌జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ నేతలు వంగాల వెంకటేశ్వర్లు, రాజవర్ధన్‌రెడ్డి ఉన్నారు. భువనగిరికి చెందిన టీఆర్ఎస్ నేత మొలుగు లక్ష్మయ్య టియర్‌గ్యాస్ సెల్ తగిలి గాయపడ్డాడు. ముక్దుంభవన్ వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లేపల్లి ఆదిరెడ్డితో పాలు పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచనపల్లి జవహర్‌లాల్,

ధర్మార్జునరెడ్డిల నాయకత్వంలో అసెంబ్లీ వైపుకు ర్యాలీగా వెళుతున్న జిల్లా న్యాయవాదులను పోలీసు అరెస్టు చేశారు.

### నిజామాబాద్ జిల్లా...

### 648 మంది అరెస్టు... 1600 మంది బైండోవర్

టీజేఏసి పిలుపునిచ్చిన 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమంలో పాల్గొనడానికి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా జేఏసి, టీఆర్ఎస్, బీజేపి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు, తెలంగాణవాదులు వేలాదిమంది పోరుబిడ్డలు నగరానికి వెళ్లే ప్రయత్నం చేశారు. కాగా, ప్రభుత్వం పోలీసు ఆంక్షల నేపథ్యంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 648 మందిని ముందస్తు చర్యల క్రింద అరెస్టు చేయగా, 1600 మంది బైండోవర్ చేశారు. పోలీసుల అదుపులో ఉన్న పోరుబిడ్డలు ఠాణాలనే పోరుకేంద్రాలుగా చేసుకుని మాక్ అసెంబ్లీని నిర్వహించి సీమాంధ్ర పాలకుల నైజాన్ని నిరసించారు. తాడ్వాయి, బాన్సువాడ, సదాశివనగర్ పోలీస్‌స్టేషన్లలో మాక్ అసెంబ్లీ నిర్వహించగా, వర్నిలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి కిషన్ సహా పలువురు వన్‌టౌన్‌లో మోకాళ్లపై నిల్చొని నిరసనను తెలిపారు. పోలీసుల కళ్లుగప్పి కంజర మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబేదార్, రవీందర్, శ్రీహరిఆచార్య, మధుసూదన్, శశిధర్‌రెడ్డి తదితరులను డిచ్‌పల్లి పోలీసులు వెంబడించి ఇందల్‌వాయి వద్ద అరెస్టు చేశారు. కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో బీజేపి, టీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజులు పోలీసులు తమ నిర్బంధకాండను కొనసాగించినా వందలాది మంది తెలంగాణ వాదులు జిల్లా నుండి హైదరాబాద్‌కు చేరుకుని ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను చాటారు. జాగృతి అధ్యక్షురాలు కవిత, టీఆర్ఎస్ జిల్లా నేతలు బస్వా లక్ష్మీనర్సయ్య, జాగృతి నేత సునీల్‌తో పాటు జిల్లాకు చెందిన 30 మంది ఇందిరాపార్కుకు చేరకునే ప్రయత్నం చేయగా వీరిని గాంధీనగర్ ఎల్ఐసీ చౌరస్తా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని ముషీరాబాద్ ఠాణాకు తరలించగా, పోలీసుల కళ్లుగప్పి బయటపడ్డారు. టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆలూరు గంగారెడ్డిని అశోక్‌నగర్ క్రాస్‌రోడ్ వద్ద అరెస్టు చేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ గోపాల్‌శర్మ, ఉద్యోగ జేఏసి చైర్మన్ గైని గంగారాం, తెలంగాణ శంకర్ ఇందిరాపార్కు వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కామారెడ్డి జేఏసి చైర్మన్ జగన్నాథం, టీఆర్ఎస్ నాయకులు కె. తిర్మల్‌రెడ్డి, వేణుగోపాల్‌గౌడ్ సహా పలువురు న్యాయవాదులు, పీడీఎస్‌యూ నాయకులు కార్యకర్తలపై అశోక్‌నగర్ వద్ద పోలీసులు లాఠీచార్జి చేశారు. డాక్టర్ల జేఏసి చైర్మన్ బాపురెడ్డి నిజామాబాద్ నుంచి రవివర్మ అనే తెలంగాణవాదిని పేషెంట్‌గా తీసుకొని ఆంబులెన్స్ సైరన్ మోగించుకుంటూ పోలీస్ చెక్‌పోస్టులను దాటుకొని హైదరాబాద్‌కు చేరు

కున్నారు. ఇందిరాపార్కు వెళ్లే ప్రయత్నంలో బాపురెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు ఆశా నారాయణ, మోహన్, హైమద్‌తోపాటు పలువురిని గాంధీనగర్‌లో బారికేడ్లు దాటుకుని వెళు తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అసెంబ్లీ ఆవరణలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు యండల లక్ష్మీనారాయణ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, గంప గోవ ర్ధన్‌లు సీఎం దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. మొత్తానికి అసెంబ్లీ లోపల, బయట జిల్లాకు చెందిన పోరుబిడ్డలు తెలంగాణ ఆకాంక్షను చాటిచెప్పారు.

**రంగారెడ్డి జిల్లా...**

**624 మంది అరెస్టు... వేయ్యికి పైగా బైండోవర్...**

టీజేఏసి తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి సర్కారు గతంలో ఎన్నడూ లేనివిధంగా నిర్బంధకాండను కొనసాగించింది. నాలుగు రోజుల ముందు నుంచే బైండోవర్లు ప్రారంభించగా జిల్లా వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా బైండోవరు చేయగా, 624 మంది ఉద్యమకారులను అరెస్టు చేశారు. దీంతో ఎక్కడివారక్కడే నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆందోళనకు దిగారు. జిల్లాలో 9 చెక్‌పోస్టుల వద్ద పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి ఉద్య మకారులను అడ్డుకున్నారు. అయినా జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లిన తెలంగాణవాదులు హైదరాబాద్‌కు చేరకుని ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వికారాబాద్‌కు చెందిన టీఆర్‌ఎస్వీ నాయకులు మంచనపల్లి సురేష్, టీఆర్ఎస్ కార్మిక నేత బి.కృష్ణయ్యలు లాఠీచార్జిలో గాయాలపాలయ్యారు. షాబాద్-శంషాబాద్ రహదారిని పోలీసులు పూర్తిగా స్తంబింపజేశారు. ఇబ్రహీపట్నం టీఆర్ఎస్ ఇంచార్జి వంగేటి లక్ష్మారెడ్డి, హయత్‌నగర్ నాయకుడు బల్‌దేవరెడ్డి, పొగాకు నర్సింహాతో పాటు పలువురిని ఇందిరాపార్కు వద్దకు చేరుకోగానే పోలీసులు అరెస్టు చేసి ముషీరాబాద్ ఠాణాకు తరలించారు. బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలో మహేశ్వరం మండల బీజేపి నాయకులు, కార్యకర్తలు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరగా వారిని మార్గమధ్యంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి అసెంబ్లీ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు.

**వరంగల్ జిల్లా...**

**644 మంది అరెస్టు.. 1771 మంది బైండోవర్..**

తెలంగాణ జేఏసి పిలుపు మేరకు ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసింది పోరుజిల్లా ఓరుగల్లు. ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విఫలం చేయడానికి పోలీసులు జిల్లా వ్యాప్తంగా నిర్బంధాన్ని విధించింది. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 1771 మంది ఉద్యమకారులను బైండోవర్ చేశారు.

మరో 644 మందిని సెక్షన్ 151కింద అరెస్టు చేశారు. రైల్వేస్టేషన్లు, బస్టాండులలో పికెట్‌లు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడే అరెస్టులు చేశారు. టీఆర్ఎస్, బీజేపి, సీపీఐ, న్యూడెమాక్రసీ, జేఏసి, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులను, కార్యకర్తలను, తెలంగాణవాదులను అడ్డుకొని హైదరాబాద్‌కు వెళ్లకుండా నిర్బంధించారు. పోలీసు దమనకాండపై తెలంగాణవాదులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. మండలాలు, గ్రామాల్లో ధర్నా, రాస్తారోకోలు చేపట్టి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కొన్ని చోట్ల పోలీసు స్టేషన్లలోనే మాక్ అసెంబ్లీ నిర్వహించారు. బీజేపి శ్రేణులు ఛలో అసెంబ్లీకి వెళ్లేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసి పోలీసులు పార్టీ కార్యాలయంలోనే గేట్లు మూసి వారిని నిర్బంధించారు. టీడీపీ శ్రేణులను పోలీస్‌హెడ్ క్వార్టర్స్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీఎన్జీవో నాయకులను గృహనిర్బంధంలో ఉంచారు. విద్యార్థి సంఘాలు అంబెద్కర్ సెంటర్‌లో సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. అక్రమ అరెస్టులకు నిరసనగా మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట తెలంగాణవాదులు ధర్నా నిర్వహించారు. కేసముద్రంలో బీజేపి రాస్తారోకో నిర్వహించింది. డోర్నకల్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థి జేఏసి నేత యాకూబ్‌రెడ్డి అరెస్టు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నర్సంపేట, నెక్కొండలలో అరెస్టులకు నిరసనగా పోలీస్‌స్టేషన్‌లను ముట్టడించారు. చెన్నారావుపేటలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేయగా, తొర్రూర్ సబ్ డివిజన్‌లో జేఏసి నేతల అరెస్టును నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా తీవ్ర నిర్బంధం అమలులో ఉన్న ప్పటికీ వందలాది మంది తమతమ వ్యూహాలతో చాకచక్యంగా హైదరాబాద్ చేరుకొని ఛలో అసెంబ్లీలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అసెంబ్లీ భవనంపైకి ఎక్కి నల్లజెండాను ఎగురవేసి నిరసన తెలిపారు. తెలంగాణ పోరుబిడ్డ రహిమున్నీసా బారికేడ్లను, పోలీసు అష్టదిగ్బంధాలను దాటుకుని అసెంబ్లీ రెండో గేటు వద్దకు చేరుకుని 'జై తెలంగాణ' నినాదమిచ్చి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ఎలుగెత్తిచాటింది. ఉస్మానియా క్యాంపస్‌లో పోలీసుల బాష్పవాయుగోళాలకు ఎదురు నిలిచి జిల్లాకు చెందిన బానోతు కృష్ణ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు.

## హైదరాబాద్ నగరంలో ఛలో అసెంబ్లీ...

1176 మంది అరెస్టు... అరెస్టయిన వారిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు..

తెలంగాణ పది జిల్లాల్లో వేల సంఖ్యలో బైండోవర్లు.. అరెస్టులు.. తనిఖీలు.. ఓవైపు కొనసాగుతుండగానే.. తెలంగాణ రాజకీయ జేఏసి ఇచ్చిన పిలుపు మేరకు ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో తెలంగాణ పోరుబిడ్డలు పాల్గొని ఇనుప కంచెలు దాటుకుని, అసెంబ్లీ ముందుకు చేరుకుని లక్ష్యాన్ని సాధించారు. శుక్రవారం నగరం నలువైపుల నుండి దూసుకొస్తున్న ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టులు చేసి ఠాణాలలో బంధించారు. హైదరాబాద్ నగరంలో 700 మందిని, సైబరాబాద్

పరిధిలో 476 మందిని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీలో రోజంతా యుద్ధం కొనసాగింది. ఓయూ క్యాంపస్‌లో బాష్పవాయు మేఘాలు కమ్ముకుపోయాయి. పలువురు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. నగరంలో ఎక్కడ చూసినా పోలీసుల లాఠీచార్జీలు అయినా ఆగని జై తెలంగాణ నినాదాలు.

హైదరాబాద్‌లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగిన పరిణామాలు

7.45 : సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ వద్ద ఎమ్మెల్సీ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే రామలింగారెడ్డి అరెస్టు

8.30 : డిజిపి కార్యాలయం మీదుగా అసెంబ్లీ మొదటి గేటు నుంచి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించిన 30 విద్యార్థులను పోలీసులు చుట్టుముట్టడంతో తప్పించుకోగా వారిని గన్‌పార్క్ వద్ద అరెస్టు చేశారు.

10.40 : డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ నేతృత్వంలో 100 మంది తెలంగాణవాదులు అసెంబ్లీని ముట్టడికి ప్రయత్నించి, గన్‌పార్క్ వద్ద ధర్నాకు దిగడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.

10.50 : గ్రేటర్ టీఆర్ఎస్ కార్యదర్శి టీ.జీవన్‌సింగ్ అరెస్టు చేశారు.

11.00 : ఇందిరాపార్కు వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్టు. సిపిఐ కార్యకర్తల అరెస్టు చేశారు.

11.05 : టీఆర్ఎస్వీ ఓయూ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి ఆవాల హరిబాబు అరెస్టు చేశారు.

11.30 : లిబర్టీ వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అరెస్టు చేశారు.

11.35 : అసెంబ్లీ గేట్-1, 2 వద్ద ఆందోళనకు దిగిన టీఆర్ఎస్, బీజేపి, సీపీఐ ఎమ్మెల్యేల అరెస్టు చేశారు.

12.06 : నార్సింగ్ ఠాణా ఎక్కిన బీజేపి నాయకుల అరెస్టు చేశారు.

12.15 : ఇందిరాపార్కు వద్ద అరుణోదయ సాంస్కృతి సమాఖ్య నాయకురాలు విమలక్క అరెస్టు, అశోక్‌నగర్ వద్ద జేఏసి నేత మల్లెపల్లి లక్ష్మయ్య అరెస్టు చేశారు.

12.20 : గోషామహల్ వద్ద మంగళ్‌హాట్ కార్పోరేటర్ రాజాసింగ్ అరెస్టు చేశారు.

12.30 : అశోక్ నగర్ చౌరస్తాలో బీజేపి నేతలు విద్యాసాగర్‌రావు, నల్లు ఇంద్ర సేనారెడ్డి అరెస్టు చేశారు.

12.40 : ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద బీజేపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, బండారు దత్తాత్రేయ, రామస్వామిలను అరెస్టు చేశారు.

12.45 : తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవిప్రసాద్‌ను అరెస్టు చేశారు.

1.00 : అశోక్‌నగర్ చౌరస్తా నుండి ఇందిరాపార్కు వైపు వెళ్తున్న టీజేఏసి చైర్మన్ కోదండరాం, ఉద్యోగ సంఘాల నేత శ్రీనివాస్‌గౌడ్ లను అరెస్టు చేశారు.

1.15 : అశోక్‌నగర్‌లో టీఆర్ఎస్ పోలిట్‌బ్యూరో సభ్యుడు మధుసూదనాచారి అరెస్టు చేశారు.

1.30 : ఇందిరాపార్కు వద్ద టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రవన్‌కుమార్ అరెస్టు చేయడానికి యత్నించగా, అస్వస్థతకు గురైన శ్రవణ్ సొమ్మసిల్లి పడిపోయాడు.

2.00 : నిజాంక్లబ్ వద్ద ఎంపీలు మందా జగన్నాథం, వివేక్, తెరాస నేతలు వినోద్, జితెందర్‌రెడ్డి లను అరెస్టు చేశారు.

2.30 : గన్‌పార్క్ వద్ద మెదక్ ఎంపీ విజయశాంతి, తెలంగాణ బ్రాహ్మణ సంఘం నాయకులను అరెస్టు చేశారు.

3.00 : తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు గంథం అంజన్న, కార్యదర్శి కుర్మయ్య లను అరెస్టు చేశారు.

3.30 : టీజేఎఫ్ అధ్యక్షులు అల్లం నారాయణ, పల్లె రవికుమార్, కట్టా శేఖర్‌రెడ్డి, మార్కండేయలను అరెస్టు చేశారు.

3.35 : అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ పోరుబిడ్డ రహిమున్నీసాను అరెస్టు చేశారు.

4.00 : అసెంబ్లీ ప్రాంగణంలో 70 మంది అడ్వకేట్ జేఏసి నేతలను అరెస్టు చేశారు.

**21 జూన్ 2013**

టివివి ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాపితంగా జయశంకర్ స్ఫూర్తి సభలు

**23 జూన్ 2013:**

టివివి ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జయశంకర్ స్ఫూర్తిసభ

**26 జూన్ 2013:**

జాతీయపార్టీల రాష్ట్ర నాయకులతో జేయేసీ సమావేశం ఫిల్మ్ ఛాంబర్‌లో ...

**28 జూన్ 2013:**

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో జేయేసీ ముఖ్య నాయకుల భేటి. పలుకీల

కాంశాలపై చర్చ.

## 29 జూన్ 2013:

## ప్రజాకోర్టులో 'ఛలో అసెంబ్లీ'...

జూన్ 14, 2013న తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ తలపెట్టిన 'ఛలో అసెంబ్లీ'ని అణచివేసేందుకు ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరుపై తేది జూన్ 29, 2013, శనివారం రోజున మాసాబ్‌ట్యాంక్‌లోని వెటర్నరీ భవన్‌లో 'ప్రజాకోర్టు'ను నిర్వహించారు. ఈ ప్రజాకోర్టులో జస్టిస్ ఇస్మాయిల్, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, హన్స్ ఇండియా రెసిడెంట్ ఎడిటర్ టంకశాల అశోక్‌లు ప్యానల్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. న్యాయవాదుల జేఏసి కో–కన్వీనర్ రాజేందర్‌రెడ్డి సమన్వయకర్తగా, జేయేసీ కోఆర్డినేటర్ పిట్టల రవీందర్ సంధానకర్తగా వ్యవహరించారు. 'ఛలో అసెంబ్లీ' సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వం, పోలీసు నిర్బంధకాండలో తీవ్ర అవమానాలకు, గాయాలకు గురైన తెలంగాణవాదులు తమకు ఎదురైన అనుభవాలను ప్యానల్ కమిటీ ముందు వివరించారు.

'ఛలో అసెంబ్లీ' పిలుపుకు ఇదీ.. నేపథ్యం : రాజేందర్‌రెడ్డి, అడ్వకేట్ జేఏసి

జూన్ 14న టీజేఏసి ఛలో అసెంబ్లీకి ఎందుకు పిలుపునివ్వాల్సి వచ్చిందో, గడిచిన అరవై సంవత్సరాలలో తెలంగాణకు ఏయే అన్యాయాలు జరిగాయో తదితర విషయాలను తొలుత అడ్వకేట్ జేఏసి చైర్మన్ రాజేందర్‌రెడ్డి సంక్షిప్తంగా ప్రజాకోర్టుకు వివరించారు. 'ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రం ఏర్పాటు జరిగింది. అప్పటి నుండి గత ఆరు దశాబ్దాలకు పైగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. ఆ పోరాటాల ఫలితంగానే కేంద్రం డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై ప్రకటన చేసింది. అనంతరం డిసెంబర్ 23న కేంద్రం మాట మార్చింది. ఆ నేపథ్యంలోనే తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భవించింది. కేంద్రం ఇచ్చిన మాట తప్పడంతో తెలంగాణలో వెయ్యి మందికి పైగా ఆత్మార్పణం చేశారు. బాధ్యత గల పాలకులు ఇచ్చిన మాట తప్పడంతో వారిని ప్రశ్నించే నేపథ్యంలోనే జేఏసి 'ఛలో అసెంబ్లీ'కి పిలుపునివ్వడం జరిగింది. కాని ప్రభుత్వం అనుమతివ్వకపోగా, అతి దారుణంగా పోలీసుయాక్షన్‌తో ఉద్యమకారులపై పాశవికంగా దాడికి పాల్పడింది. ప్రభుత్వం తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణలో విఫలమైంది. కావన 'ప్రజాకోర్టు'ను ఆశ్రయిస్తున్నాం.' అని రాజేందర్‌రెడ్డి వివరించారు.

### పోలీసుల తీరుతో కాసేపు ఊపిరి ఆడలేదు: ప్రొ॥ కోదండరాం

జూన్ 14న నిర్వహించిన ఛలో అసెంబ్లీ కార్యక్రమం.. మొదటిదీ కాదు.. చివరదీ కాబోదని అన్నారు. తెలంగాణ ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మాట తప్పిన కారణంగా అనివార్య పరిస్థితుల్లో ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చామని

తెలిపారు. ప్రభుత్వం అనుమతి నిరాకరించినట్లు లిఖిత పూర్వకంగా తెలియజేయకుండా అక్రమ నిర్బంధాన్ని కొనసాగించిందని తెలిపారు. యుద్ధంలో శత్రువులను చట్టుముట్టినట్లు మోహరించి చితకబాదారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు కూడా ఇవ్వరా? మనిషన్నాక కొట్లాడకుండా ఉంటారా..?' అని ప్రశ్నించారు. ఉద్యమ కారులను అరెస్టు చేస్తూ మర్మాంగాలపై దాడి చేశారని, గొంతునొక్కుతూ, కడుపులో చేతులు పెట్టి తిప్పుతూ చెప్పుకోలేని విధంగా తనపై పోలీసులు దాడి చేశారని అన్నారు. పోలీసుల తీరుతో తనకు కొద్దిసేపు ఊపిరి ఆడలేదని అన్నారు. జేఏసి స్టీరింగ్ కమిటీ సభ్యులందరి ఫోన్లను ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రజాకోర్టు ఇచ్చే నివేదిక అన్ని కోర్టులతో పాటు అంతర్జాతీయ సమాజానికి కూడా చేరుతుందని చెప్పారు.

**శాసన సభ్యుల హక్కులను కాలరాశారు:కె.తారకరామారావు (టీఆర్ఎస్ ఎమ్మెల్యే)**

'ఛలో అసెంబ్లీ' సందర్భంగా తెలంగాణ శాసనసభ్యులకు కూడా తమ హక్కులను వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని తెరాస శాసనసభ్యులు కె.తారకరామారావు అన్నారు. అనుమతి కోసం ఎన్నో రకాలుగా ప్రయత్నించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ అనుమతి లేకుండానే పోలీసులు తమను అరెస్టు చేసినట్లు తెలిపారు. గోల్కొండ పోలీస్ స్టేషన్లో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తుంటే నిరోధించారని తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యేల హక్కుల ఉల్లంఘన జరిగిందని ప్రజాకోర్టుకు కేటీఆర్ వివరించారు.

**పోలీసులు ఇట్లే ప్రవర్తిస్తారన్నారు: ఉప్పల ప్రభాకర్, నిజామాబాద్**

ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి మూడు రోజుల ముందుగానే జూన్ 11న తనతోపాటు 40 మందిని నిజామాబాద్ బసవ గార్డెన్స్‌లో అక్రమంగా నిర్బంధించారని నిజామాబాద్‌కు చెందిన ఉప్పల ప్రభాకర్ అన్నారు. 14వ తేదీ వరకు అక్కడే నిర్బంధించారు. అక్కడే మాక్ అసెంబ్లీ నిర్వహించడానికి ప్రయత్నించాము కాని పోలీసులు దాన్ని నిరోధించారు. బసవ గార్డెన్స్ గేటుకు తాళాలు వేసారు. తన కుటుంబ సభ్యులకు కూడా తనను ఎక్కడ నిర్బంధించి తెలుపలేదు. పై అధికారులు చెప్పినట్లు చేస్తున్నాం అని మాత్రమే సమాధానం చెప్పేవారన్నారు. తమను 24 గంటల తర్వాత కోర్టులో ఎందుకు హాజరు పరచడం లేదని ప్రశ్నిస్తే.. చట్టాలు పుస్తకాల్లో ఉంటాయి.. పోలీసులు ఇట్లాగే ప్రవర్తిస్తారని దురుసుగా సమాధానం చెప్పినట్లు ప్రజాకోర్టుకు వివరించారు. 14వ తేది సాయంత్రం 6గంటలకు తమను వదిలేసినట్లు తెలిపారు.

**పోలీసులు చెప్పుతో కొడతామన్నారు: బోడ జంగయ్య,కీసర మండలం చేర్యాల్**

జేఏసి ఇచ్చిన పిలుపుమేరకు మేము ఛలోఅసెంబ్లీలో పాల్గొనడానికి మా గ్రామం

నుండి బయలుదేరగా, పోలీసులు వారిని ఆపే ప్రయత్నం చేసినప్పటికీ అశోక్‌నగర్ వద్దకు చేరుకున్నట్లు కీసర మండలం చేర్యాల గ్రామానికి చెందిన బోడ జంగయ్య తెలిపారు. అశోక్‌నగర్ వద్ద ఉన్న పోలీసులు వారిని చెప్పుతో కొడుతామని, తెలంగాణ లం... కొడుకులను అంటూ నానా బూతులు తిట్టారని ఆయన వివరించాడు. 12 మంది పోలీసులు లాఠీలతో చితకబాదినట్లు తెలిపాడు. తన ఒంటిపై ఉన్న లాఠీదెబ్బల గుర్తులను చూపించాడు. తన గాయలకు సంబంధించిన ఫోటోలను ప్రజాకోర్టుకు అందజేశాడు. మూడు గంటల పాటు పోలీసులు తమ వాహనంలో తిప్పి 3గంటల తర్వాత వారిని వదిలేసినట్లు జంగయ్య వివరించాడు.

## టియర్ గ్యాస్ షెల్ పేలి తీవ్రంగా గాయపడ్డ 8వ తరగతి విద్యార్థి సంతోష్‌రెడ్డి

జూన్ 16న బల్వంత్‌రెడ్డి అనే ప్రైవేటు ఉద్యోగి కుమారుడు సంతోష్‌రెడ్డి టియర్ గ్యాస్ షెల్ పేలి తీవ్రంగా గాయపడ్డాడు. 8వ తరగతి చదువుతున్న సంతోష్‌రెడ్డి తన ఇంటి వద్ద ఆడుకుంటుండగా అక్కడ పడి ఉన్న టియర్ గ్యాస్ షెల్‌ను పట్టుకున్నాడు. దాంతో అది పేలి బాలుడి చేతులకు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ఘటనలో మరో బాలుడికి రెండు కళ్లు కూడా పోయినట్లు సంతోష్‌రెడ్డి ప్రజాకోర్టుకు వివరించాడు.

## పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు: యాకూబ్ రెడ్డి, వరంగల్

ఛలో అసెంబ్లీలో పాల్గొనకుండా తనను పోలీసులు అదుపులోకి తీసుకొని హింసించారని వరంగల్ జిల్లా బీమారంకు చెందిన యాకూబ్ రెడ్డి తెలిపారు. గతంలో సెప్టెంబర్ 7, 2011న రాష్ట్ర మంత్రిని అడ్డుకున్నప్పుడు పోలీసులు తనను అరెస్టు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు పెట్టడమే కాకుండా, తనపై అనేక కేసులు నమోదు చేసినట్లు వివరించాడు. పోలీసులు తనను ప్రతీ రోజు హింసిస్తున్నారని, వెన్నుపూస బొక్కలు విరిగిపోయి పది నిమిషాల కన్నా ఎక్కువ సేపు నిలబడలేని స్థితిలో ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశాడు.

## ఠాణాలోనే ఉండమన్నారు: లక్ష్మారెడ్డి, ఘట్‌కేసర్

'నేను ఇంట్లో ఉండగానే ఉదయం 7గంటలకే ఇద్దరు పోలీసులు మా ఇంటికి వచ్చి నన్ను పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్లారు. అక్కడ సిఐ నన్ను పోలీస్‌స్టేషన్‌లోనే ఉండమని చెప్పాడు. నాపై ఎలాంటి కేసులు ఏ పోలీస్ స్టేషన్‌లోనూ పెండింగ్‌లో లేవు. కాని పోలీసులు నన్ను ఇంటికి వెళ్లడానికి అనుమతించలేదు' అని ఘట్‌కేసర్ జేఏసి కన్వీనర్ లక్ష్మారెడ్డి ప్రజాకోర్టుకు వివరించారు.

మసీదుకి వెళ్లనివ్వలేదు: హమీద్ మహ్మద్ ఖాన్, ఆయోధ్యనగర్ కాలని, హైదరాబాద్

జూన్ 14న మసీదులో తమని ప్రార్ధన చేసుకోవడానికి పోలీసులు అనుమతించలేదని అయోధ్యనగర్ కాలనీకి చెందిన హమీద్ మహ్మద్ ఖాన్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ, అసెంబ్లీ సమీపంలోని మసీదుల్లో 2వేల నుండి 1500 మంది వరకు ప్రార్థనలు చేస్తారు. కాని 14న 50 మంది కూడా ప్రార్థనలు చేయలేక పోయారని తెలిపారు. తమకు ప్రాథమిక హక్కును కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీచోట బారికేడ్లు పెట్టడంతో తాము తమ ప్రాంతాలకు వెళ్లలేకపోయామని అన్నారు. ఈ ప్రభుత్వం, పోలీసుల ద్వారా తమను మసీదులకు పోకుండా అడ్డుకుందని, పోలీసులు తమ బాధను పట్టించుకోకపోవడంతో, ప్రజాకోర్టు దృష్టికి తీసుకొచ్చినట్లు మహ్మద్ ఖాన్ తెలిపారు.

**రెండు రోజులు నిర్బంధించారు: సత్తయ్య, సదాశివపేట**

'నేను వికలాంగుడిని, పోలీసులు మా ఇంటిపై దాడి చేసి నన్ను అరెస్టు చేసి స్టేషన్‌కి తీసుకెళ్లారు. జూన్ 13న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి తీసుకెళ్లిన నన్ను మళ్లీ జూన్ 14న రాత్రి 11 గంటలకు వదిలిపెట్టారు. నాతో పాటు మరో 13 మంది కూడా ఉన్నారు. పోలీసులు తెలంగాణకు సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొనకుండా నన్ను అడ్డుకుంటున్నారు. దయచేసి నాకు న్యాయం చేయండి.' అని సదాశివపేట జేఏసి కన్వీనర్ సత్తయ్య ప్రజాకోర్టు ముందు వాపోయారు.

**మా కార్యకర్త చేయి విరగ్గొట్టారు: రామనర్సింహారావు, సిపిఐ నాయకులు**

మేము టిజేఏసిలో భాగస్వాములం కాకపోయినా ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనాలనుకున్నాం. ప్రభుత్వ ప్రజలకు జవాబుదారిగా ఉండాలి. ఇందిరాపార్కు వద్ద నిరసన తెలుపుకోవచ్చని ప్రభుత్వమే చెప్పింది. అయినా 144 సెక్షన్ ఎందుకు విధించినట్లు? ఇందిరాపార్కు వద్దకు రావడానికి ఎందుకు నిరాకరించినట్లు? పోలీసులు సిపిఐ కార్యాలయంపై దాడి చేశారు. పోలీసుల దాడిలో పట్టణ కార్యదర్శి బోస్ కంటికి గాయమైంది, కరీంనగర్ సిపిఐ కార్యదర్శి మర్రి వెంకటస్వామి చేయి విరిగిందని రామానర్సింహారావు ప్రజాకోర్టుకు వివరించారు.

**మా పార్టీ ఆఫీస్ వద్ద మఫ్టీలో పోలీసుల గస్తీ: కె.గోవర్ధన్, న్యూడెమాక్రసీ నాయకులు**

'జూన్ 10వ తేదీ నుంచే పోలీసులు మా కార్యాలయం చుట్టూ పోలీసులు గస్తీ కాసారు. పోలీసులు అర్థరాత్రి మా ఇంటికి వచ్చి అన్ని గదులు వెదికారు. మా కార్యాలయంపై దాడి చేసి అక్కడ ఉన్న వారిని ఇబ్బందులకు గురిచేశారు. తెలంగాణలోని 9 జిల్లాల్లో మా పార్టీకి చెందిన 1500 మందిని నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మఫ్టీలో ఉన్న పోలీసులు మూడు రోజుల పాటు మా కార్యాలయం పరిసరాల్లో కాపు కాసి ఒక్కరిని కూడా ఆఫీస్‌లోకి

రానివ్వలేదు. ఈ ప్రభుత్వం తెలంగాణలో పౌరహక్కులను కాలరాసింది' అని సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్ ప్రజాకోర్టుకు వివరించారు.

### కోర్టు ఆదేశాలను కాదని మళ్లీ అరెస్టు చేశారు: మారుతి సాగర్, జర్నలిస్ట్, కుత్బుల్లాపూర్

మొదట జీడిమెట్ల పోలీసులు మధ్యాహ్నం 12గంటలకు తనను అదుపులోకి తీసుకొని తహసీల్దారు ముందు బైండోవర్ చేసి ఒక ఫంక్షన్‌హాల్‌కు తరలించారని కుత్బుల్లాపూర్ జేఏసి చైర్మన్ మారుతి సాగర్ తెలిపారు. అయితే తాము హైకోర్టులో రిట్‌పిటీషన్ వేయడంతో తనను వదిలిపెట్టాలని కోర్టు ఆదేశాలు జారి చేసినట్లు వివరించారు. అయినా మళ్లీ తనను బాలానగర్ పోలీసులు అరెస్టు చేసి సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని అన్నారు. జూన్ 12 నుంచి 14వ తేదీ వరకు ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్బంధించినట్లు మారుతి ప్రజాకోర్టుకు వివరించారు.

### పోలీసులు హింసిస్తున్నారు: రహిమున్నీసా బేగం, హన్మకొండ

'నన్ను పోలీసులు హింసిస్తున్నారు. నాపై ఇప్పటికే 150 కేసులు నమోదు చేశారు. పోలీసులు నన్ను జూన్ 10న బైండోవర్ చేశారు. నన్ను అరెస్టు చేసినప్పుడు మహిళా పోలీసులు ఒక్కరు కూడా లేరు. పోలీసులు నన్ను, నాభర్తను చిత్రహింసలు పెడుతున్నారు. అవహేలన చేస్తున్నారు.' అని హన్మకొండకు చెందిన టీఆర్ఎస్ మహిళా నాయకురాలు రహిమున్నీసాబేగం ప్రజాకోర్టుకు వివరించింది.

### ఉద్యమంలో పాల్గొనవద్దని పోలీసులు హెచ్చరించారు: శ్రీనివాస్ పటేల్

జూన్ 4వ తేది నుంచే నగరంలోని అనేక పోలీస్‌స్టేషన్లకు చెందిన పోలీసులు తన ఇంటికి వస్తున్నారని జూబ్లీహిల్స్ జేఏసి చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అన్నారు. జూబ్లీహిల్స్, ఎస్.ఆర్.నగర్, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసులు తనను ఛలోఅసెంబ్లీ కార్యక్రమానికి 10 రోజుల ముందు నుంచే వెంబడిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనవద్దని జూబ్లీహిల్స్ సిఐ హెచ్చరించినట్లు తెలిపారు. సనత్‌నగర్ పోలీసులు ఉదయం 11గంటల నుండి రాత్రి 11గంటల వరకు పిఎస్‌లో నిర్బంధించినట్లు వెల్లడించారు. రూ.10వేల జరిమాన కడతావా లేదా 6నెలలు శిక్ష అనుభవిస్తావా అంటూ పోలీసులు అడిగారని తెలిపారు. పోలీసులు తమను ఉగ్ర వాదుల కంటే హీనంగా చూస్తున్నారని ప్రజాకోర్టులో వాపోయారు.

### నాలుగు రోజులు బంధించారు: బి.తిరుమల రావు, ఖమ్మం

జూన్ 11న బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీధర్ రెడ్డితో పాటు 6గురు కార్యకర్తలను అరెస్టు చేసి ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనకుండా నిర్బంధించారని ఖమ్మం జిల్లాకు చెందిన బి.తిరుమల రావు తెలిపారు. తమను నాలుగు రోజుల పాటు బంధించి జూన్ 14న సాయంత్రం వదిలిపెట్టినట్లు తెలిపారు. పోలీసులు తన ఫోన్‌ను

ట్యాప్ చేసినట్లు ప్రజాకోర్టుకు వివరించారు.

**మళ్లీ మళ్లీ బైండోవర్లు చేశారు: నందగిరి శ్రీను, ఖమ్మం.**

మఫ్టీలో ఉన్న ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తనతో పాటు రంగరాజును హుజుర్‌నగర్ వద్ద జూన్ 12వ తేదీన అరెస్టు చేసినట్లు నందగిరి శ్రీనివాస్ తెలిపారు. తమను కోర్టులో హాజరుపర్చాలని అడగామన్నారు. మరోసారి 13న, ఇంకోసారి 14న తమను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు ఆయన ప్రజాకోర్టుకు వివరించారు.

**అక్రమ కేసులు బనాయించారు: సుభప్రద్ పటేల్, విద్యార్థి జేఏసి**

జూన్ 10వ తేదీన తనతో పాటు మరో 23 మంది విద్యార్థులను బైండోవరు చేసినట్లు విద్యార్థి జేఏసి సమన్వయకర్త సుభప్రద్‌పటేల్ తెలిపారు. వారిని సిసిఎస్‌లో చిన్న గదిలో ఉంచి తాళం వేసినట్లు తెలిపారు. అక్కడ తమకు కనీస సౌకర్యాలు కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. వారి సెల్ ఫోన్లను తీసుకొని వాటిని స్విచ్ ఆఫ్ చేసి సీజ్ చేసి, అనంతరం వారిని ఫలక్‌నమా పోలీస్ ట్రెయినింగ్ సెంటర్ వద్దకు తరలించినట్లు చెప్పారు. జూన్ 14న వారిపై అక్రమంగా అనేక కేసులు నమోదు చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై రాష్ట్ర మానవహక్కుల సంఘానికి పిర్యాదు చేసినట్లు సుభప్రద్ ప్రజాకోర్టుకు వివరించారు.

**పోలీసుల దాష్టీకానికి ఇవిగో వీడియో సాక్షాలు: రవికిరణ్, జహీరాబాద్**

ఛలో అసెంబ్లీ సందర్భంగా పోలీసుల దమనకాండకు వీడియో క్లిప్పింగ్‌లు సాక్షాలుగా నిలుస్తున్నాయని మెదక్ జిల్లా జహీరాబాద్‌కు చెందిన వ్యాపారి ఎన్.రవికిరణ్ తెలిపారు. పోలీసుల వ్యవహరించిన తీరుపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**పౌరహక్కులకు భంగం కలిగించారు: జి.వెంకటేశ్వర్లు, అడ్వకేట్, నల్గొండ**

నల్గొండ జిల్లాలో పోలీసులు పెద్ద సంఖ్యలో తెలంగాణవాదులను బైండోవర్లు చేసినట్లు నల్గొండ జిల్లా జేఏసి చైర్మన్ అడ్వకేట్ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. జూన్ 11న బైండోవర్ చేసినప్పటికీ, 12వ తేదీన శాంతియుత ర్యాలీ నిర్వహించడానికి అనుమతి కోరినట్లు తెలిపారు. అయినప్పటికీ తమను పోలీసులు అరెస్టు చేసి గంట సేపటి తర్వాత వదిలేసారన్నారు. మఫ్టీలో ఉన్న పోలీసులు ఉదయం 7గంటలకే తన ఇంటికి వచ్చి బలవంతంగా తీసుకెళ్లినట్లు తెలిపారు. 2515 మందిని బైండోవర్ చేయడమే కాకుండా నల్గొండ నుండి హైదరాబాద్‌కు వెళ్లే మార్గంలో 13 పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమకు రూం కేటాయించిన హోటల్ మేనేజర్‌ను సైతం పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వెంకటేశ్వర్లు ప్రజాకోర్టుకు వివరించారు.

**విచక్షణా రహితంగా లాఠీచార్జి చేశారు: యాటకార్ల సాయన్న, ఉపాధ్యాయుడు, నిర్మల్**

జూన్ 13న ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు తాము బయలుదేరినప్పుడు పోలీసులు తమపై విఛక్షణా రహితంగా లాఠీచార్జి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు అదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున వై.సాయన్న తెలిపారు. జై తెలంగాణ అన్నందుకే మమ్మల్ని చితకబాదినట్లు ఆయన ప్రజాకోర్టుకు వివరించారు.

**కోదండరాం అరెస్టుకు నిరసన వ్యక్తం చేసినందుకే... : యం.డి. ఉమర్ ఖాన్, అటోవర్కర్స్ యూనియన్‌నాయకులు, సికింద్రాబాద్**

ఛలో అసెంబ్లీ సందర్భంగా టీజేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మేము ర్యాలీ నిర్వహిస్తుంటే పోలీసులు లాఠీ చార్జీ చేసినట్లు వారసిగూడకు చెందిన అటో వర్కర్స్ యూనియన్ నాయకులు యం.డి.ఉమర్‌ఖాన్ తెలిపారు. పోలీసులు పేల్చిన బాష్పవాయు గోళం తాకి తాను తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. ఆ గాయాలతో గత 20 రోజులుగా తాను ఆటో నడపలేకపోతున్నానని, తన కుటుంబ పోషణ కష్టంగా మారిందని ప్రజాకోర్టుకు ఉమర్‌ఖాన్ వివరించారు.

**టియర్ గ్యాస్ షెల్ నా ఎడమ కంటిని పోగొట్టింది: కృష్ణనాయక్, వరంగల్ జిల్లా**

ఉదయం 9గంటలకు హాస్టల్‌కి వెళుతుండగా అకస్మాత్తుగా ఒక బాష్పవాయు గోళం తాకడంతో అక్కడికక్కడే స్పృహ కోల్పోయినట్లు పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ చేస్తున్న విద్యార్థి కృష్ణనాయక్ తెలిపారు. తాను మూడు రోజుల వరకు స్పృహలోకి రాలేదన్నారు. ఏడు రోజుల పాటు యశోద హాస్పటల్‌లో చికిత్స చేయించుకోగా, తన ఎడమ కంటిలో రక్తం గడ్డకట్టిందని, దంతాలకు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. తాను ఇప్పటికే రూ.2.5 లక్షల రూపాయలు ట్రీట్‌మెంట్‌కు ఖర్చయినట్లు తెలిపారు. తాను ఎలాంటి ఉద్యమాలలో పాల్గొనకపోయినప్పటికీ ప్రభుత్వ, పోలీసుల తీరుతో తీవ్రంగా నష్టపోయానని వాపోయాడు. ఇంకా తాను పూర్తిగా కోలుకోలేదని ప్రజాకోర్టు వివరించారు.

**మహిళా పోలీసులు లేకుండానే మహిళలపై దాడులా..?: సుమలత శర్మ, బేగంపేట**

జూన్ 12న నేను వంటగదిలో ఉండగా పోలీసులు తన ఇంటిని చుట్టుముట్టి, మహిళా పోలీసులు లేకుండా తనను అరెస్టు చేసి కొద్ది నిమిషాలలో పంపిస్తామని చెప్పి గంటల పాటు స్టేషన్‌లోనే నిర్బంధించినట్లు సుమలత శర్మ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో కూడా మహిళా పోలీసులు లేరని, రాత్రి 10 గంటల వరకు తనను అక్కడే

ఉంచినట్లు తెలిపారు. ఆ మరుసటి రోజు ఉదయాన్నే మళ్ళీ పోలీసులు తనను అరెస్టు చేసి మధ్యాహ్నం 12గంటల తర్వాత బోయిన్‌పల్లి పిఎస్‌కి తరలించి రాత్రి 11.45గంటలకు విడిచిపెట్టగా, అక్కడ కూడా మహిళా పోలీసులు డ్యూటీలో లేరని వివరించారు. చివరకు జూన్ 14న సాయంత్రం విడిచిపెట్టారని, మూడు రోజుల పాటు భోజనం కూడా పెట్టకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసినట్లు, అవహేలనగా మాట్లాడినట్లు సుమలత ప్రజాకోర్టు ఆవేదన వ్యక్తం చేశారు.

**మా స్కూల్ బస్సులను పోలీసులు పట్టుకెళ్లారు: గురిజాల రవీందర్‌రావు, మంచిర్యాల**

జూన్ 10వ తేదీ నుంచే పోలీసులు మా ఇంటికి రావడం మొదలు పెట్టారని, తాను ఛలో అసెంబ్లీలో పాల్గొనబోనని చెప్పినప్పటికీ పోలీసులు వేధించారని అదిలాబాద్ జిల్లా మంచిర్యాలకు చెందిన పాఠశాల కరస్పాండెంట్ గురిజాల రవీందర్‌రావు తెలిపారు. తన పాఠశాలకు చెందిన బస్సులను ముఖ్యమంత్రి సభలకు తీసుకున్నారని, కాని ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి మాత్రం ఇవ్వకూడదని హెచ్చరించినట్లు తెలిపారు. బస్సు డ్రైవర్ కుటుంబ సభ్యులను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. తనతో పాటు 2500 మందిని బైండోవర్ చేసినట్లు ప్రజాకోర్టులో వివరించారు.

**మహిళలని కూడా చూడలేదు: కమరున్నీసా బేగం, టీఆర్ఎస్ మహిళా నాయకురాలు**

జూన్ 9 నుంచి  జూన్ 13 వరకు రహస్యంగా షెల్టర్ తీసుకుని ఉండి, పెండ్లి పత్రికలు పంచుతున్నట్లు అసెంబ్లీ దగ్గర వరకు వెళ్లామని, మహిళలని కూడా చూడకుండా పోలీసులు తమపై లాఠీ చార్జి చేస్తూ అరెస్టు చేసి గోషామహల్ పిఎస్‌కు తరలించినట్లు కమరున్నీసా బేగం తెలిపారు. కొంత మంది పోలీసులు తమను అవమానకరమైన పదాలతో దూషించినట్లు ఆమె ప్రజాకోర్టుకు వివరించారు. తెలంగాణ కొరకు చావడానికైనా సిద్ధమేనన్నారు.

**కుటుంబ సభ్యులను కూడా వేధించారు:డోలి సత్యనారాయణ, మహబూబాబాద్**

స్థానిక డిఎస్పీ తెలంగాణవాదులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని మహబూబాబాద్‌కి చెందిన లెక్చరర్ డోలి సత్యనారాయణ తెలిపారు. పోలీసులు తమ ఇళ్లలో బెడ్‌రూంల వరకు చొరబడి అరెస్టులు చేసినట్లు తెలిపారు. ఉద్యమకారులను లక్ష్యంగా చేసుకోవడమే కాకుండా వారి కుటుంబ సభ్యులను కూడా వేధించినట్లు ఆయన తెలిపారు. తమ వద్ద 8 మండలాలోని 230 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. జూన్ 12న తన అబ్బాయిని కళాశాలలో చేర్పించేందుకు హైదరాబాద్‌కు వెళుతుండగా మధ్యలోని తనను పోలీసులు అరెస్టు చేసి, తన కుటుంబాన్ని రోడ్డుపై

వదిలేసి వెళ్లినట్లు ప్రజాకోర్టుకు సత్యనారాయణ వివరించారు.

**కోదండరాం గొంతు నొక్కే ప్రయత్నం చేశారు: ఉప్పు సుధాకర్**

ఛలో అసెంబ్లీ కార్యక్రమం సందర్భంగా సీమాంధ్ర పోలీసులు టీజేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం గొంతు నులిమేయడానికి ప్రయత్నించారన్న విషయాన్ని విశ్రాంత బ్యాంకు ఉద్యోగి ఉప్పు సుధాకర్ ప్రజాకోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

**శ్రీకృష్ణ కమిటీలోని 8వ చాప్టర్‌ని అమలు చేశారు: మాడభూషి శ్రీధర్**

ప్రజాకోర్టులో ఛలో అసెంబ్లీ సందర్భంగా పోలీసుల దమనకాండకు గురైన 26 మంది నుండి వాంగ్మూలాలను నమోదు చేసినట్లు ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ తెలిపారు. గతంలో కంటే చలో అసెంబ్లీ సందర్భంగా పోలీసులు ఎక్కువ మందిని నిర్బంధించినట్లు అభిప్రాయపడ్డారు. ఎవరు కొట్టారు? ఎందుకు కొట్టారు? ఎందుకు అరెస్టు చేసారో తెలియకుండా పోలీసులు వ్యవహరించినట్లు శ్రీధర్ పేర్కొన్నారు. మహిళలను అరెస్టు చేసిన క్రమంలో ఎక్కడా మహిళా పోలీసులు లేకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసేందుకు శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన 8వ అధ్యాయాన్ని పోలీసులు అమలు చేసినట్లు కనిపిస్తున్నదని, రాజ్యాంగం, సీఆర్‌పిసిలకు ఎక్కడా దొరకకుండా, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డారని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా ఉల్లంఘించినట్లు తెలిపారు.

**ఇరుపక్షాల వాదనలు వినకుండా తీర్పు చెప్పలేం: జస్టిస్ ఇస్మాయిల్**

ప్రజాకోర్టుకు ప్యానెల్ కమిటీ సభ్యులుగా వ్యవహరించిన జస్టిస్ ఇస్మాయిల్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. బాధితుల పరిస్థితి చూస్తుంటే దయనీయంగా ఉందని, మానవహక్కుల ఉల్లంఘన కనబడుతోందని పేర్కొన్నారు. ఇక్కడ ఒక పక్షం మాత్రమే తమ వాదన చెబుతున్నందున, అవతలి పక్షం లేకుండా న్యాయశాస్త్ర ప్రాథమిక సూత్రాల ప్రకారం తీర్పు చెప్పలేమని అన్నారు.

**హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన పోలీసు అధికారులకు లేఖలు: టంకశాల అశోక్**

ఛలో అసెంబ్లీ సందర్భంగా ప్రజా హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిని పోలీసు అధికారులకు లేఖ రాస్తామని, వారి సమాధానం వచ్చాక ఒక సమగ్ర నివేదిక తయారు చేసి మీడియాకు విడుదల చేయనున్నట్లు సంపాదకులు టంకశాల అశోక్ తెలిపారు. ప్రజాకోర్టులో వెల్లడైన అభిప్రాయాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అడ్వకేట్ జేఏసి కన్వీనర్ రాజేందర్‌రెడ్డి కోరారు. సమగ్ర నివేదికను రూపొందించిన తర్వాత దానిని రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసులకు, కోర్టుకు ఇవ్వనున్నట్లు వివరించారు.

**30 జూన్ 2013:**

తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్‌తోనే సాధ్యం నినాదంతో తెలంగాణ కాంగ్రెస్

ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో తెలంగాణ సాధన సభ.

**04 జూలై 2013:**

**ఢిల్లీలో జేఏసి రౌండ్ టేబుల్ సమావేశం**

హైదరాబాద్ రాజధానిగా పది జిల్లాలతో తెలంగాణ రాష్ట్రాన్ని తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం టీజేఏసి ఆధ్వర్యంలో 'ఎ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పొలిటికల్ పార్టీస్ ఆన్ డిమాండ్ ఆఫ్ సపరేట్ స్టేట్ ఆఫ్ తెలంగాణ' అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. రాయల తెలంగాణ ప్రతిపాదనను తిరస్కరిస్తూ, తమకు హైదరాబాద్ రాజధానిగా పది జిల్లాలతో కూడిన తెలంగాణ మాత్రమే కావాలని డిమాండ్ చేస్తూ తక్షణం దీనిపై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈమేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో బీజేపి, సీపీఐ, టీఆర్ఎస్, జేడీ(యు), ఆర్‌జెడి, ఆర్ఎల్‌డి, ఎన్‌సిపీ, ఆల్ ఇండియా ఫార్వార్డ్‌బ్లాక్, ఆమ్‌ఆద్మీపార్టీ, సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ, జమ్మూకాశ్మీర్ పాంథర్స్ తదితర 12 పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీజేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం ప్రసంగంతో మొదలైన ఈ రౌండ్ టేబుల్ సమావేశం కెకె ప్రసంగంతో ముగిసింది.

**ఆకాంక్షలను కాలరాస్తున్న కేంద్రం: కోదండరాం**

తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను గుప్పెడు మంది సీమాంధ్ర పెట్టుబడి దారుల ఒత్తిడికి తలొగ్గిన యూపీఏ ప్రభుత్వం కాలరాస్తున్నదని కోదండరాం విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో చేపట్టిన సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం తదితర ప్రజాఉద్యమాలు నడిచిన తీరును వివరిస్తున్నప్పుడు సమావేశంలో చప్పట్లు మార్మోగాయి. ఈ దేశంలో ప్రజాస్వామ్యం చచ్చిపోయిందనడానికి తెలంగాణ ప్రజల పట్ల పాలకులు వ్యవహరిస్తున్న తీరే నిదర్శనమన్నారు.

**ఉద్యమం అందరిది...: బండారు దత్తాత్రేయ**

తెలంగాణ ఉద్యమం ఏదో ఒక ప్రత్యేక పార్టీకి మాత్రమే చెందిందనుకోవడం పొరపాటని, తెలంగాణ ఉద్యమం మొత్తం ప్రజల ఉద్యమమని బీజేపి సీనియర్ నేత బండారు దత్తాత్రేయ అన్నారు. తెలంగాణను ప్రకటించేందుకు కాంగ్రెస్‌కు ఇదే ఆఖరు మోకా అన్నారు. ఈ సమయం దాటితే ఎన్నికల తర్వాత మూడు నెలల్లోపు తామే తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలలోపు తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి ప్రకటిస్తే తాము భేషరతుగా మద్దతు ఇస్తామన్నారు.

**తెలంగాణ ఏర్పాటు తక్షణ అవసరం: దేవేంద్ర ఆది, ఎన్సీపీ.**

తెలంగాణ రాష్ట్రం తక్షణ అవసరమని ఎన్సీపీ నేత, ఎంపీ దేవేంద్ర ఆది స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల భాష, సంస్కృతి ఆంధ్రా సంస్కృతికి పొంతన కుదరలేదన్నారు. దేశంలో అన్ని పార్టీలు తెలంగాణకు మద్దతిస్తున్నా కాంగ్రెస్ పార్టీ ఎందుకు నిర్లక్ష్యం

చేస్తున్నదో అర్థం కావటం లేదన్నారు. తమ నేత శరద్‌పవార్ తెలంగాణకు మొదటి నుంచి మద్దతుగా నిలిచారని తెలిపారు.

**కాంగ్రెస్ తీరుతో సమస్య జటిలం: అపర్ణ, సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ**

ప్యాకేజీలంటూ, రాయల తెలంగాణ అంటూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నదని, తన వైఖరితో సమస్య మరింత జటిలం చేస్తున్నదని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ నేత అపర్ణ అరోపించారు.

**తెలంగాణను మోసం చేస్తున్న కాంగ్రెస్: అరుణ్ శ్రీ వాత్సవ, జేడీ(యు)**

తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా మోసం చేస్తోందని జనతాదళ్ (యు) నేత అరుణ్ శ్రీవాత్సవ అన్నారు. 2014కు ముందే తెలంగాణ ప్రకటన చేయాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆర్ఎల్‌డి నేత జావిద్ ఇక్బాల్ మాట్లాడుతూ తాము తెలంగాణకు మొదటి నుంచి మద్దతుగా నలిచామని, తెలంగాణ ఏర్పాటుకోసం పోరాడేందుకు ఆ ప్రాంతంలో ప్రత్యేక పార్టీ శాఖను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నేత ప్రొఫెసర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వేలమంది బలిదానాలవుతున్నా జాతీయ మీడియా విస్మరించడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్వార్డ్ బ్లాక్ నేత దేవరాజన్ మాట్లాడుతూ 30కోట్ల జనాభా కల్గిన ఆమెరికాకు 50 రాష్ట్రాలుండగా, 120 కోట్ల జనాభా కల్గిన భారత్‌కు మరిన్ని రాష్ట్రాలుండాల్సిన అవసరం ఉందన్నారు.

**జాతీయ మీడియా పాత్ర ప్రశ్నార్థకం: హరగోపాల్**

విదేశాల్లో ఆందోళన గురించి గంటల కొద్దీ చర్చించే జాతీయ మీడియా తెలంగాణ ఉద్యమం గురించి దేశప్రజలకు ఎందుకు తెలియజేయడం లేదని హరగోపాల్ ప్రశ్నించారు. జేఏసి పిలుపునిస్తే లక్షలాది ప్రజలు ఉద్యమంలోకి దిగుతున్నా, ఆ విషయం దేశానికి ఎందుకు తెలియనివ్వడం లేదని అన్నారు.

**04 జూలై 2013:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో జాతీయ పార్టీల నాయకులతో కొత్తఢిల్లీలో రౌండ్‌టేబుల్ సమావేశం.

**09 జూలై 2013:**

నోమా ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ జేయేసీ విస్తృత స్థాయి స్టీరింగ్ కమిటి సమావేశం. హాజరైన కెసిఆర్.

**13 జూలై 2013:**

విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో 'తెలంగాణ సమాలోచన' ప్రారంభం

**14 జూలై 2013:**

విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో 'తెలంగాణ సమాలోచన' ముగింపు

**19 జూలై 2013:**

జేయేసీ ఆధ్వర్యంలో 'జన చైతన్య యాత్ర' ప్రారంభం

**25 జూలై 2013:**

జేయేసీ తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు గ్రేటర్ హైదరాబాద్ జేయేసీ కమిటి సన్నాహక సమావేశం.

**30 జూలై 2013:**

యుపిఏ అనుమతితో సిడబ్ల్యుసి తెలంగాణకు అనుకూలంగా తీర్మాణం - ప్రకటన

తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి ప్రత్యేక సమావేశం. కాంగ్రెస్ అనుకూల నిర్ణయం పట్ల హర్షం. గన్‌పార్కు వద్ద అమరులకు నివాళి.

**31 జూలై 2013:**

టివివి ఆధ్వర్యంలో ఎస్.వి.కె.లో 'తెలంగాణ రాష్ట్రం–వర్తమాన సవాళ్లు' సదస్సు.

**06 ఆగస్టు 2013:**

తెలంగాణ వ్యాప్తంగా ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి ఉత్సవాలు. తెలంగాణ పారిశ్రామిక వేత్తల సమాఖ్య ఆధ్వర్యంలో చర్లపల్లిలో జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ.

**07 ఆగస్టు 2013:**

నాచారంలోని ఎఎన్ఆర్ గార్డెన్స్‌లో రోజంతా జరిగిన తెలంగాణ జేయేసీ విస్త ృత స్థాయి సమావేశం. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అనుకూల తదనంతర పరిణామాలపై సుదీర్ఘ చర్చ.

**08 ఆగస్టు 2013:**

సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రౌండ్ టేబుల్ సమావేశం.

**09 ఆగస్టు 2013:**

పార్లమెంటులో బిల్లు పెట్టే వరకు పోరాటం - తెవివే నాయకుడు పిట్టల రవీందర్

యూపిఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించినంత మాత్రాన

శాంతించేదిలేదని, పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెవివే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్ స్పష్టం చేశారు. మంచిర్యాలలోని సీవీరామన్ పీజీ కాలేజీలో 'తెలంగాణ సమగ్ర నిర్మాణం – మన కర్తవ్యం' అనే అంశంపై సదస్సు జరిగింది. కాంగ్రెస్ ప్రకటన రాగానే సీమాంధ్రలో బూటకపు ఉద్యమాన్ని లేవనెత్తి అయోమయానికి గురిచేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని అన్నారు. సీమాంధ్రకు అనుకూలంగా వ్యవహరిస్తున్న సీఎం కిరణ్ తన పదవికి రాజీనామా చేసేలా తెలంగాణ మంత్రులు ఉద్యమించాలని సూచించారు. సచివాలయంలో సీమాంధ్ర ఉద్యోగులు ర్యాలీ తీస్తుంటే, గతంలో తాము చెప్పినట్టుగా సచివాలయంలో సీమాంధ్ర ఉద్యోగుల సంఖ్య 80శాతానికి పైగా ఉందన్న విషయం రుజువైందని అన్నారు. ఈ కార్యక్రమంలో టివివి నాయకులు గురిజాల రవీందర్‌రావు, పోడేటి సంజీవ్, దొంతి లింగారెడ్డి, ఎ.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

**11 ఆగస్టు 2013:**

## సమైక్యవాదం ఒక భావన మాత్రమే

సమైక్యవాదం అనేది ఒక భావన మాత్రమేనని అది ఉద్యమం కాదని టీజేఏసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 11న జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొన్నారు. హైదరాబాద్ లేని తెలంగాణ ఇంజన్‌లేని రైలు వంటిదన్నారు. త్యాగాలు, ఉద్యమాల ఫలితంగా వచ్చిన ప్రకటనను అడ్డుకోవడానికి సీమాంధ్రులు కృత్రిమ ఉద్యమాన్ని నడుపుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పడితే కరెంటు కొరత ఏర్పడుతుందని సీఎం ప్రస్తావించడం విడ్డూరమన్నారు. తెలంగాణలో సమృద్ధిగా వనరులున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో దేశపతి శ్రీనివాస్, టీయూటీఎస్ నాయకులు స్వామిరెడ్డి, మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తెవివే నాయకులు విజయ్‌కుమార్, జేఏసి నాయకులు కె.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

**16 ఆగస్టు 2013:**

జేయేసీ చైర్మన్ కోదండరాం, కోచైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ఢిల్లీకి రహస్యంగా వెళ్ళినట్లు వార్తలు.

## నర్సంపేటలో భారీ శాంతిర్యాలీ

హైదరాబాద్‌లో ఉండే ఉద్యోగులు, సీమాంధ్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భరోసా కల్పించడం కోసం రాష్ట్ర జేఏసి పిలుపుమేరకు నర్సంపేటలో జేఏసి నాయకులు అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆగస్టు 16న భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ఏర్పాటును అడ్డుకుంటున్నారని తెలుసుకున్న విద్యార్థులు, యువకులు, జేఏసి శ్రేణులు, తెలంగాణవాదులు ఉప్పెనలా తరలిరావడంతో నర్సంపేట

పోటెత్తింది. పట్టణంలోని వరంగల్ క్రాస్ రోడ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగిన ఈ ర్యాలీకి తరలివచ్చిన జనంతో ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది.

**17 ఆగస్టు 2013:**

**ఉమ్మడి రాజధాని వెనుక కేంద్రం కుట్ర**

హైదరాబాద్‌ను కేంద్ర పాలితప్రాంతంగా చేయడానికే కేంద్రప్రభుత్వం కుట్రపూరితంగా పదేళ్ల ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను ప్రకటించిందని వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ ఆరోపించారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో తెలంగాణ సాధన, సమస్యలు, మందున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు అనే అంశంపై సదస్సును నిర్వహించారు. సిడబ్ల్యూసి నిర్ణయం తర్వాత ఇంతవరకు కేబినెట్ చర్చలో తెలంగాణ ఊసే ఎత్తని కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పదేళ్ల పాటు హైదరాబాద్‌లో రెండు రాష్ట్రాల పాలన జరగడం అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త టీపీఎఫ్ నాయకుడు ఎర్రంరెడ్డి నర్సింహారెడ్డి, టీఎన్జీవోస్ నాయకులు జనగాం కుమారస్వామి, గొడిశాల శ్రీనివాస్, ఉదయ్‌సింగ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జేయేసీ నాయకులు కోదండరాం, శ్రీనివాస్‌గౌడ్ ఢిల్లీ పర్యటనపై మీడియాలో దుమారం.

**18 ఆగస్టు 2013:**

'రాష్ట్ర విభజనను ఆహ్వానిద్దాం–ఉభయ రాష్ట్రాల ప్రజల మధ్య శాంతి, సుహృద్భావాన్ని కాపాడుకుందాం, మూడు ప్రాంతాల సామాన్య ప్రజల అభివృద్ధికి కృషి చేద్దాం, వినాశకర, విధ్వంసకర స్వార్థ రాజకీయఎత్తుగడలను తిప్పికొడదాం' అనే రాజకీయ ప్రకటనతో సీమాంధ్ర డెవెలప్‌మెంట్ ఫోరం, ఆంధ్ర జర్నలిస్టుల ఫోరం, బహజన కెరటాలు, కావడికుండలు కవుల వేదిక, మట్టిపూలు–ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రచయిత్రుల వేదిక, హర్యాలీ ముస్లీం రచయితల వేదిక, సావిత్రీబాయిపూలే అధ్యయన వేదిక, హైదరాబాద్ ఫోరం ఫర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సోమాజీగూడా ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

**19 ఆగస్టు 2013:**

విభజనకు సహకరించండి–శాంతిని కాపాడండి అనే నినాదంతో తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కువద్ద 'శాంతిదీక్ష' ప్రారంభం.

**20 ఆగస్టు 2013:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శాంతిదీక్ష' రెండవ రోజు తెలంగాణ పెన్షనర్స్ జేయేసీతో పాటు పలు సంఘాలు పాల్గొన్నాయి.

తెలంగాణ జేయేసీ ముఖ్యనాయకుల ప్రత్యేక సమావేశంలో కోదండరాం ఢిల్లీ పర్యటనపై చర్చ.

**21 ఆగస్టు 2013:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శాంతిదీక్ష' మూడవ రోజు తెలంగాణ ఇంజనీర్స్ జేయేసీతో పాటు పలు సంఘాలు పాల్గొన్నాయి.

**22 ఆగస్టు 2013:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శాంతిదీక్ష' నాలుగవ రోజు తెలంగాణ జాగృతితో పాటు పలు సంఘాలు పాల్గొన్నాయి.

జాతీయ పార్టీల రాష్ట్ర బాధ్యుతలతో సికింద్రాబాద్‌లోని తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో తెలంగాణ జేయేసీ నాయకుల ప్రత్యేక సమావేశం.

**23 ఆగస్టు 2013:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శాంతిదీక్ష' ఐదవ రోజు తెలంగాణ ఆర్టీసీ–తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టియంయు) కార్మికులతో పాటు పలు సంఘాలు పాల్గొన్నాయి.

తెలంగాణ విద్యావంతుల వేదిక, రంగారెడ్డి జిల్లా సదస్సు పరిగిలో జరిగింది. జేయేసీ చైర్మన్ కోదండరాం, వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్, స్థానిక ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**24 ఆగస్టు 2013:**

ఇందిరాపార్కు వద్ద బిజేపి ఆధ్వర్యంలో ఒకరోజు దీక్ష. ఫలితంగా జేయేసీ నిర్వహిస్తున్న ఆరవరోజు శాంతి దీక్షను డాక్టర్ జేయేసీ నిర్వహణలో గాంధీ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించారు.

**27 ఆగస్టు 2013:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో శాంతి ర్యాలీలు, దీక్షలు నిర్వహించాలని టిఎన్‌జీవో భవన్‌లో నేడు ఉదయం నిర్వహించిన తెలంగాణ జేయేసీ స్టీరింగ్‌కమిటిలో నిర్వహించారు.

**28 ఆగస్టు 2013:**

తెలంగాణ జేయేసీ జిల్లా ఇంచార్జీలు, కార్యక్రమాల కమిటి సభ్యుల సంయుక్త సమావేశం జేయేసీ కార్యాలయంలో జరిగింది. జిల్లా నిర్వహించే శాంతి ర్యాలీలు, దీక్షలు విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

**29 ఆగస్టు 2013:**

ముదిరాజ్ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ మాజీ మేయర్ కొరివి

కృష్ణస్వామి ముదిరాజ్ 120 జయంతి ఉత్సవాన్ని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో "హమారా హైదరాబాద్" నినాదంతో నిర్వహించారు.

### 01 సెప్టెంబరు 2013:

### తెలంగాణ ఉద్యమం ఓ పోరాటం

కేకే మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో కనకాచారి స్మారకోపన్యాసాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 'నూతన తెలంగాణ కొన్ని ఆలోచనలు' అనే అంశంపై ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్ ప్రధాన ప్రసంగం చేశారు. తెలంగాణ ఉద్యమం ఓ పోరాటమైతే, సమైక్యవాద ఉద్యమం ఓ పెద్ద జోక్ అని అన్నారు. కాంట్రాక్టర్లు హైదరాబాద్ సమస్యను భూతద్దంలో పెట్టి సీమాంధ్ర ప్రజలను భయపెడుతున్నారని అన్నారు. 'తెలంగాణ ఉద్యమాల చరిత్ర – ఓ పరిశీలన' అనే అంశంపై టీజెఎఫ్ కన్వీనర్ అల్లం నారాయణ, 'తెలంగాణ చరిత్రలో మహబూబ్‌నగర్' అనే అంశంపై సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్‌లు ప్రసంగించారు.

### మూడు ప్రాంతాల ఉద్యమ నేతల ఉమ్మడి సదస్సు

సూర్యాపేటలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు ప్రాంతాల ఉద్యమ నేతల ఉమ్మడి సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న టీజేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో ప్రజాస్వామికీకరణ జరుగుతందన్నారు. మూడు ప్రాంతాల్లో అభివృద్ధికి అవకాశం కలుగుతుందని అన్నారు. బహుజనాంధ్ర ఉద్యమ నేత పల్నాటి శ్రీరాములు మాట్లాడుతూ సమైక్యాంధ్ర బూటకం.. కమ్మ, రెడ్డిల నాటకమన్నారు. రాయలసీమ అధ్యయన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ భూమన్ మాట్లాడుతూ తెలంగాణ వేరైతే రాయలసీమ, సర్కారాంధ్ర కలసి ఉండటం అసంభవమన్నారు. రాయలసీమ జేఏసి కన్వీనర్ ఎంవి రమణారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో రెవెన్యూ ఉందంటూ అది ఉమ్మడి రాజధాని కావాలని కోరడం సమంజసం కాదన్నారు. ఈ సదస్సులో తెలంగాణ సెటిలర్స్ ఫోరం కన్వీనర్ కాట్రడడ్డ ప్రసూన, నీటిపారుదల రంగ నిపుణులు విద్యాసాగర్‌రావు, ఇంద్రసేనారెడ్డి, వేదాసు వెంకయ్య, రఘు, అద్దంకి దయాకర్, మీలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జేయేసీ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిరాపార్కు వరకు భారీ ఎత్తున శాంతి ర్యాలి నిర్వహించారు.

### 02 సెప్టెంబరు 2013:

తెలంగాణ జేయేసీ రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా జేయేసీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో భారీ ర్యాలి నిర్వహించి కలెక్టరేట్ల ముందు దీక్షలు చేపట్టారు.

**03 సెప్టెంబరు 2013:**

తెలంగాణ జేయేసీ రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా జేయేసీ ఆధ్వర్యంలో నిజామాబాద్ పట్టణంలో భారీ ర్యాలి నిర్వహించి కలెక్టరేట్ల ముందు దీక్షలు చేపట్టారు.

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో పట్టణంలో వేలాది మందితో భారీ ర్యాలి, మానవహారం నిర్వహించి బహిరంగ సభ ఏర్పాటుచేసారు. జేయేసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పిట్టల రవీందర్‌తో పాటు స్థానిక నాయకులు ఆవునూరి సమ్మయ్య, జున్నోజు రవీందర్, ముక్కెర రాజు, ఈశ్వర్‌రెడ్డి, హన్మంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**04 సెప్టెంబరు 2013:**

**ముల్కీ అమరుల సంస్మరణ ర్యాలీ**

‘ముల్కీ అమరవీరుల స్ఫూర్తిగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుందాం’ అంటూ వివిధ సంఘాల నేతలు, విద్యార్థులు జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 4న భారీ ర్యాలీ నిర్వమించారు. కరీంనగర్‌లో నిర్వహించిన శాంతి దీక్షకు సంఘీభావంగా కొనసాగిన ర్యాలీలో వేలాదిగా తెలంగాణవాదులు పాల్గొని మద్దతు తెలిపారు. ర్యాలీ టీఎన్జీవోస్ కార్యాలయం నుంచి ఉద్యోగులు నగరంలోని తెలంగాణ చౌక్ మీదుగా పెద్ద ఎత్తున తెలంగాణ నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో కళాశాల విద్యార్థులు, టీఎస్‌జేఏసి నాయకులు, ముదిరాజ్ అధ్యయన వేదిక, సిపిఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ, ప్రైవేటు జూనియర్ మేనేజ్‌మెంట్ ఆసోసియేషన్, ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్, దళిత ఐక్యవేదిక సమితి, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఉద్యోగులు, న్యాయవాదుల జేఏసి తదితర సంఘాల ఆధ్వర్యంలో శాంతి దీక్షకు మద్దతుగా ర్యాలీగా తరలివచ్చారు. కలెక్టరేట్ ఎదుట టీఎన్జీవో ఆధ్వర్యంలో జేఏసి జిల్లా చైర్మన్ వెంకటమల్లయ్య ఆధ్యక్షతన నిర్వహించిన ‘శాంతి దీక్ష’లో టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు దేవీప్రసాద్, కారెం రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జేఏసి కోచైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, జేఏసి కోఆర్డినేటర్ పిట్టల రవీందర్, జిల్లా జేయేసీ నాయకులు జున్నోజు రవీందర్, జక్కోజు వెంకటేశ్వర్లు, మహిళా జేఏసి నాయకులు సుంకె యశోద, శారదారెడ్డి, తుమ్మల సుమిత్ర, టీఎంయూ నాయకులు థామస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**05 సెప్టెంబరు 2013:**

తెలంగాణ జేయేసీ రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా జేయేసీ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో భారీ ర్యాలి నిర్వహించి కలెక్టరేట్ల ముందు దీక్షలు చేపట్టారు.

తెలంగాణ జేయేసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటి సమావేశం టిఎన్‌జీవో భవన్‌లో

జరిగింది. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో వైఎస్ జగన్ ఆధ్వర్యంలో "సేవ్ ఆంధ్ర ప్రదేశ్" పేరిట భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న సందర్భంగా ఆదే రోజున (సెప్టెంబర్ 7న) తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు జేయేసీ చైర్మన్ కోదండరాం ప్రకటించారు.

## 06 సెప్టెంబరు 2013:

### తెలంగాణ బంద్‌కు జేఏసి పిలుపు

రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు తెలంగాణ జేఏసి ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన శాంతి ర్యాలీకి అనుమతి ఇవ్వకపోవడం, ఏపీఎన్జీవోలు తలపెట్టిన 'సేవ్ ఆంధ్రప్రదేశ్' సభకు అనుమతి ఇవ్వడాన్ని నిరసిస్తూ తెలంగాణ జేఏసి ఒక రోజు బంద్‌కు పిలుపునిచ్చింది. శుక్రవారం అర్థరాత్రి నుంచి శనివారం అర్థరాత్రి వరకు తెలంగాణ వ్యాప్తంగా బంద్ నిర్వహించాలని కోరింది.

రేపటి బంద్‌కు మద్దతుగా జేయేసీ ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో భారీగా ర్యాలీలు, ప్రదర్శనలు.

## 07 సెప్టెంబరు 2013:

### తెలంగాణ బంద్ విజయవంతం

రాజకీయ జేఏసి పిలుపు మేరకు శనివారం నిర్వహించిన బంద్ విజయ వంతమైంది. తెలంగాణ జిల్లాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు బంద్‌ను పాటించాయి. ఆర్టీసీ బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసన వ్యక్తం చేశారు. పలు ప్రాంతాలలో సిఎం, డీజీపీ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

### 'సేవ్ ఆంధ్రప్రదేశ్' సభలో సీమాంధ్ర పైశాచికం

సభ ఉద్యోగుల హక్కుల కోసమేనని చెప్పి వేదికపై మిత్ర, గజల్ శ్రీనివాస్, సత్యవాణి, వంగపండు, కారెం శివాజీ వంటి అనేక మంది ఉద్యోగేతరులను అనుమతించడంపై తెలంగాణవాదులు మండిపడ్డారు. సభకు వచ్చిన కొందరు సమైక్య వాదులు తెలంగాణ విద్యార్థులు బాలరాజు యాదవ్‌పై, కానిస్టేబుల్ శ్రీనివాస్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపర్చడాన్ని పలువురు తెలంగాణ వాదులు ఖండించారు. నిజాం కళాశాల ముందు నుంచి ర్యాలీగా వెళుతున్న సమైక్యవాదులు తెలంగాణ విద్యార్థుల పీకలు కోస్తామంటూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారు. ఈ చర్యతో ఆగ్రహించిన నిజాం కాలేజీ విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జీ చేశారు. అటు ఓయూలోనూ శాంతి ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించిన విద్యార్థులపై పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. జై తెలంగాణ అన్నందుకు వారిపై

తీవ్రంగా దాడి చేయడం దేనికి నిదర్శనమని పలువురు ప్రశ్నించారు.

ఈ రోజు జరుగుతున్న తెలంగాణ బంద్, సేవ్ ఆంధ్రప్రదేశ్ బహిరంగ సభ సందర్భంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు జేయేసీ ముఖ్యనాయకులందరు టిఎన్‌జీవో భవన్ సమాలోచనలు జరిపారు.

**11 సెప్టెంబరు 2013:**

**టీజేఎఫ్ విస్తృతస్థాయి సమావేశం**

భెల్ చౌరస్తా సమీపంలోని జేవీఎన్ గార్డెన్‌లో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిజేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం మాట్లాడుతూ పది జిల్లాల తెలంగాణనే ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రం కోరుకునే హక్కు ఇక్కడి ప్రజలకుందని, కాని బలవంతంగా కలిసి ఉండాలనే హక్కు సీమాంధ్రులకు లేదన్నారు. మీడియాలో తెలంగాణపై కొనసాగుతున్న వివక్షకు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎఫ్ కన్వీనర్ అల్లం నారాయణ, జేఏసీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**13 సెప్టెంబరు 2013:**

ఉస్మానియా లైబ్రరీ హాల్‌లో తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సెమినార్ జరిగింది.

**14 సెప్టెంబరు 2013:**

నాచారంలోని నోమా గార్డెన్స్‌లో తెలంగాణ జేయేసీ విస్తృత స్థాయి స్టీరింగ్ కమిటి సమావేశం. హాజరైన కెసిఆర్.

**16 సెప్టెంబరు 2013:**

సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఎకానమీ ఫ్రంట్ ఆవిర్భావ సభ.

**20 సెప్టెంబర్ 2013:**

సింగరేణిలో డిస్మిస్డ్ కార్మికుల పోరుయాత్ర ఆదిలాబాద్ జిల్లా గోలేటి నుండి నేడు ప్రారంభమైంది.

**21 సెప్టెంబరు 2013:**

**సకల జనభేరికి పోలీసుల అనుమతి**

తెలంగాణ జేఏసి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29న నిజాం కళాశాల మైదానంలో నిర్వహించే సభకు పోలీసుల అనుమతి లభించింది. 'సకలజన భేరి' పేరున నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అనుమతిని మంజూరు చేసినట్లు డీసీపీ కమలాసన్ రెడ్డి శనివారం ప్రకటించారు.

**22 సెప్టెంబరు 2013:**

రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌లో తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో "తెలంగాణ సమాలోచన సదస్సు".

**24 సెప్టెంబరు 2013**

తెలంగాణ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో విస్తృతంగా సకల జనభేరి సన్నాహక సదస్సులు.

**25 సెప్టెంబరు 2013:**

**తెలంగాణ విద్యార్థి సంఘాలతో టీజేఏసి సమావేశం**

సకల జనులభేరి సన్నాహాలపై బుధవారం టీజీవో భవన్‌లో తెలంగాణ విద్యార్థి సంఘాల జేఏసితో టీజేఏసి నేతలు సమావేశమయ్యారు. శ్రీనివాస్ గౌడ్, విఠల్, రాజేందర్‌రెడ్డి, దయాకర్, రసమయిబాలకిషన్, పిట్టల రవీందర్‌లతో పాటు విద్యార్థి నేతలు పిడమర్తి రవి, పున్నా కైలాస్, గాదరి కిషోర్, పుల్లారావు, మర్రి అనిల్, అంజియాదవ్, రాకేశ్, బాలు, వి.కృష్ణ, శ్రీహరినాయక్, జగన్, ఎన్.కిషోర్, వెంకటేశ్, శంకర్‌నాయక్, శివాగౌడ్, అంబెద్కర్, రాజేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ స్వప్నం సాకారమవుతోందని అన్నారు. సకలజనభేరిని విజయవంతం చేసేందుకు విద్యార్థులు పెద్దఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థి నేతలు మాట్లాడుతూ సకలజన బేరికి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. సకలజన భేరికి సన్నాహకంగా ఈనెల 26, 27, 28తేదీల్లో అన్ని జిల్లా మండల, డివిజన్ కేంద్రాల్లో సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సకలజన భేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

**27 సెప్టెంబరు 2013:**

జిల్లా మహిళా జేయేసీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిల్మ్‌భవన్‌లో 'మహిళా జనభేరి' సదస్సు జరిగింది. కరీంనగర్ జిల్లా మహిళా జేయేసీ చైర్మెన్ సుంకె యశోద అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బిజెపి మహిళామోర్చా రాష్ట్ర నాయకురాలు బల్మూరి వనిత, టిఆర్ఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు తుల ఉమతోపాటు జిల్లా మహిళా జేయేసీ కన్వీనర్ కోట శారద, సమన్వయకర్త తుమ్మల సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

**బీజేపి 'తెలంగాణ గర్జన'**

శనివారం మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 'తెలంగాణ గర్జన' సభను నిర్వహించారు. ఈ సభలో జేఏసి చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రాన్ని విభజిస్తే

మూడు సమస్యలు వస్తాయని సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి వివరిస్తున్నారని, కాని రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచితే 30 సమస్యలు వస్తాయని అన్నారు. తెలంగాణలో బతుకమ్మ సంబరాలు మొదలవుతున్నాయని, ఈ సమయంలో బీజేపీ జాతీయ నాయకురాలు సుష్మాస్వరాజ్ తెలంగాణకు 'బతుకమ్మ'లా వచ్చారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి సమైక్యాంధ్ర అనవచ్చుగాని, తెలంగాణ కానిస్టేబుల్ మాత్రం జై తెలంగాణ అనేందుకు వీలు లేదా? అని కోదండరాం ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**28 సెప్టెంబరు 2013:**

హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ మైదానంలో లక్షలాదిమందితో 'సకలజనభేరి' బహిరంగసభ తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో జరిగింది.

**డిమాండ్స్**

1) తెలంగాణ బిల్లును పార్లమెంటులో వెంటనే ఆమోదించి, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి.

2)హైదరాబాద్ రాజధానిగా పది జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలి.

3) హైదరాబాద్‌పై సంపూర్ణ హక్కులు తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే ఉండాలి.

4) తెలంగాణపై 'సిడబ్ల్యుసి' ప్రకటించిన తీర్మాణాన్ని వెంటనే అమలు చేసే విధంగా తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ నాయకులు బాధ్యత వహించాలి.

**29 సెప్టెంబరు 2013:**

**'సకలజన భేరి'లో మార్మోగిన తెలంగాణ నినాదం**

హైదరాబాద్ నిజాం కళాశాల మైదానంలో ఆదివారం టీజేఏసి ఆధ్వర్యంలో నిర్వహించిన 'సకలజన భేరి' ప్రశాంతంగా విజయవంతమైంది. ఈ సభకు ఊహించినదాని కంటే ఎక్కువగా జనం హాజరయ్యారు. సభ ప్రారంభమయ్యే సమయం కంటే ముందే సభాస్థలం పూర్తిగా నిండిపోగా దానికి రెట్టింపు జనం నగరంలోని రహదారుల వెంటే ఉండిపోవాల్సి వచ్చింది. టీఎన్జీవో భవన్ నుంచి ఉద్యోగులు దేవీప్రసాద్, రవీందర్‌రెడ్డిల నేతృత్వంలో, టీజీవో భవన్ నుంచి శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో, గ్రూపు-1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ నాయకత్వంలో పలువురు అధికారులు, సచివాలయం జేఏసి నేతలు శ్రావణ్‌కుమార్, సురేష్‌కుమార్, రాజ్‌కుమార్‌గుప్తాల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యోగులు భారీ ర్యాలీగా సభకు తరలివచ్చారు. గాయకులు రసమయి బాలకిషన్, అందెశ్రీ, సాయిచంద్,

చిన్నారి నక్షత్ర, వరంగల్ విజయ, అరుణోదయ ఇతర కళాకారుల బృందం ఆలపించిన తెలంగాణ ఉద్యమ గీతాలు సభకు హాజరైన జనాలను ఉర్రూతలూగించారు. ఈ సభకు తెలంగాణ పది జిల్లాల నుంచి విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాలు భారీగా తరలివచ్చాయి. ప్రత్యేక వేషాధారణలతో, నృత్యాలతో సభ ఆద్యంతం ఆసక్తి కల్గించింది. ఈ సందర్భంగా జేఏసి చైర్మన్ ప్రొ.కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణపై సీమాంధ్ర పెత్తనం పోవాలన్నారు. విభజన పరిణామాలపై సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి అసత్యాలు, అర్ధసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణను అడ్డుకుంటున్న సీమాంధ్ర పాలకులు తమ ఓర్పును, సహనాన్ని ఇంకా పరీక్షించవద్దని హెచ్చరించారు. డీజీపీగా దినేష్‌రెడ్డి పదవీకాలాన్ని పొడగించడం కుదరదని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణకు శుభవార్తగా చెబుతూ, డీజీపీ పీడ విరగడైందన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ రాజధానిగా పది జిల్లాలతో కూడిన తెలంగాణ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. యూపీఏ ఇవ్వకపోతే బీజేపీ, ఇతర పార్టీల రూపంలో జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయం ఉందని అన్నారు. తెలంగాణతో పెట్టుకుంటే అంతే సంగతులని సీఎం కిరణ్‌ను హెచ్చరించారు. తెలంగాణతో గోక్కున్న వాళ్లెవరూ ఇంతవరకూ ముందుకు సాగలేదని గుర్తుచేశారు. ఆంధ్రలో మేధావి అనేవాడు ఉన్నా డా? రెండు ప్రాంతాల మధ్య ఎప్పుడో మానసికంగా విభజన వచ్చిందని ఇంకా కలిసి ఉండాలని కోరడం మూర్ఖత్వం అని అన్నారు. ఆంధ్రలో పుట్టిన వాళ్లంతా తెలంగాణకు ద్రోహులేనని, తెలంగాణను దోచుకోవాలని చూసేవాళ్లేనని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు గొప్పవాళ్లు కాబట్టే విభజన తర్వాత కూడా హైదరాబాద్ కొద్దికాలం ఉమ్మడి రాజధానిగా ఒప్పుకున్నారని అన్నారు. చంద్రబాబు, జగన్ పార్టీల వైఖరులను విమర్శిం చారు.

## 03 అక్టోబరు 2013:

## సిడబ్ల్యూసి తీర్మానాన్ని యథాతథంగా ఆమోదించిన కేంద్ర కేబినెట్

జులై 30న సిడబ్ల్యూసి తీర్మానం చేసినట్లుగానే హైదరాబాద్ సహా పది జిల్లాలతో కూడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌ను పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉంచాలని తీర్మానించింది. గురువారం సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ నివాసంలో జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పాటుకు మంత్రివర్గం అనుమతి కోరుతూ హెూంమంత్రి సుశీల్‌కుమార్ షిండే పెట్టిన నోట్ ఆమోదం పొందినట్లు అధికారికంగా హెూంమంత్రి ప్రకటించారు. కాగా తెలంగాణ నోట్‌కు మంత్రివర్గ ఆమోదం పొందిన వెంటనే రాష్ట్ర విభజన ప్రక్రియ ప్రారంభమైనట్లేనని రాష్ట్ర కాంగ్రెస్

వ్యవహారాల ఇంచార్జి దిగ్విజయ్ సింగ్ ప్రకటించారు. కేబినెట్ నోట్‌కు, ఆంటోని కమిటీకి సంబంధం లేదని స్పష్టంచేశారు.

**04 అక్టోబరు 2013:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా కేంద్ర క్యాబినెట్ తీర్మాణం చేయడంపై తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశం స్వాగతించింది.

**08 అక్టోబరు 2013:**

**నోట్ తయారీకి మంత్రుల బృందం ఏర్పాటు**

రాష్ట్రవిభజనపై కసరత్తు చేసే నిమిత్తం కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఏడుగురు సభ్యులతో కూడిన మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది.

**మంత్రుల బృందం:**

1. సుశీల్‌కుమార్ షిండే (హోంశాఖ)
2. ఆంటోని (రక్షణ శాఖ)
3. చిదంబరం (ఆర్థిక శాఖ)
4. గులాంనబీ ఆజాద్ (ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం)
5. వీరప్పమొయిలీ (చమురు శాఖ)
6. జైరాం రమేష్ (గ్రామీణాభివృద్ధి)
7. వి.నారాయణ స్వామి (సిబ్బంది వ్యవహారాలు, ప్రధాని కార్యాలయ మంత్రి)

**10 అక్టోబరు 2013:**

అసెంబ్లీకి తీర్మానం రాదు.. బిల్లు మాత్రమే వస్తుంది: షిండే

రాష్ట్రవిభజన అంశంపై అసెంబ్లీకి తీర్మానం పంపడం ఉండదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేవలం విభజనకు సంబంధించిన ముసాయిదా బిల్లు మాత్రమే వెళుతుందని హోంశాఖా మంత్రి సుశీల్‌కుమార్ షిండే వివరించారు. అది కూడా ముసాయిదా బిల్లు రాష్ట్రపతి ద్వారా ఒక్కసారి మాత్రమే అసెంబ్లీకి పంపి అభిప్రాయం తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. నివేదికను సాధ్యమైనంత త్వరగా రూపొందించడానికే మంత్రివర్గ ఉపసంఘానికి గడువు విధించలేదని తెలిపారు.

**11 అక్టోబరు 2013:**

**జీవోఎం మొదటి భేటి**

కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే నేతృత్వంలో కేంద్ర మంత్రుల బృందం శుక్రవారం నార్త్‌బ్లాక్‌లోని హోంమంత్రిత్వ శాఖ కార్యాలయంలో మొదటి సమావేశం జరిగింది. దాదాపు 45 నిమిషాలసేపు జరిగిన ఈ సమావేశంలో

రాష్ట్రవిభజన ప్రక్రియ విధివిధానాల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. ఈ సమావేశానికి విదేశీ పర్యటనలో ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి పి.చిదంబరం, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రక్షణ మంత్రి ఏ.కే.ఆంటోని మినహా మిగిలిన అయిదుగురు మంత్రులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయాన్ని అమలు చేయడంలో జీవోఎంకు కేంద్ర మంత్రివర్గం నిర్దేశించిన 11 పరిశీలనాంశాలకు సంబంధించిన వివరాలతో సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖలతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా సమాచారాన్ని కోరాలని నిర్ణయించింది. వీరప్పమొయిలీ న్యాయపరమైన అంశాలు, చిదంబరం ఆర్థికపరమైన అంశాలు, షిండే హైదరాబాద్, శాంతిభద్రతలు, ఏకే ఆంటోని రక్షణ, సరిహద్దులు, నియోజకవర్గాల కేటాయింపులు, జైరాం రమేష్ జలవనరులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ నివేదిక, నారాయణస్వామి ఉద్యోగులు, ఐఏఎస్‌ల పంపిణీ, ఆజాద్ వైద్యం, విద్య, ఉపాధి రంగాలకు సంబంధించిన విషయాలపై అధ్యయనం చేయనున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ అమరుల తల్లుల కడుపుకోత మహాసభ. భారీగా తరలివచ్చిన అమరవీరుల కుటుంబాలు.

**16 అక్టోబరు 2013:**

జేయేసీ కార్యలయంలో జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశం జరిగింది. టిఓఆర్ (టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్)లో పొందుపర్చిన అంశాలపై చర్చించారు.

**17 అక్టోబరు 2013:**

సికింద్రాబాద్‌లోని తెలంగాణ ఫిల్మ్‌చాంబర్‌లో తెలంగాణ జేయేసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల దాకా జరిగిన ఈ సమావేశంలో కేంద్రానికి సమర్పించే 11 అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై దేవీ ప్రసాద్, విఠల్, వ్యవసాయ రంగ సమస్యలపై కోదండరాం, మల్లెపల్లి, విద్యుత్ రంగంపై కె.రఘు, సింగరేణిపై పిట్టల రవీందర్, తదితరులు తమ ప్రతిపాదనలను వినిపించారు.

**18 అక్టోబరు 2013:**

తెలంగాణ జేయేసీ తరపున కేంద్రం నియమించిన గ్రూప్ ఆఫ్ మినిష్టర్స్ కమిటికి రూపొందించిన నివేదికకు ఆయా రంగాలకు సంబందించిన నిపుణులు తుది మెరుగులు దిద్ది నివేదికను సిద్ధం చేసారు.

**19 అక్టోబరు 2013:**

**జీవోఎంకు టీజేఏసి నివేదిక**

హైదరాబాద్ తాత్కాలిక రాజధాని, నీటి పంపకం, ఉద్యోగుల అంశాలపై విభజన సమయంలో అప్రమత్తంగా, నిశితంగా ఉంటామని తెలంగాణ జేఏసి

ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ప్రధానమైన 11 అంశాలపై కేంద్ర మంత్రివర్గ బృందంకు నివేదిక పంపినట్లు జేఏసి చైర్మన్ ఎం.కోదండరాం ప్రకటించారు.

1956 నవంబర్ 1 నాటికి ముందు తెలంగాణలో ఉన్న స్థిర, చరాస్తులను తెలంగాణ రాష్ట్రానికి చెందినవిగా పేర్కొనాలని, వాటిని ఉమ్మడి ఆస్తులుగా పరిగణించరాదని స్పష్టం చేసింది. ఆ తర్వాత ఏర్పడ్డ ఆస్తుల పంపిణీకి మాత్రమే ప్రాతిపదిక ఉండాలని పేర్కొంది. భూమి, భవనాల్లాంటి స్థిరాస్తులు ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతానికే చెందడం ఆనవాయితీ అని గుర్తుచేసింది.

ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌ను కేంద్రం తీసుకున్న నేపథ్యంలో అక్కడి ఏపీ భవన్‌ను తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున 2013 మార్చి వరకు చేసిన రూ.1,54,789 కోట్ల అప్పులో రూ.45,000 కోట్లను తెలంగాణకు పంపిణీ చేయాలి. మిగితా అప్పును 'ఏ ప్రాంతంలో పెట్టుబడి పెట్టారు. ఏ ప్రాంతానికి ప్రయోజనం కలిగింది' అనే ప్రాతిపదికన పంచాలి.

సెక్యూరిటీలు, జాతీయ విపత్తు స్పందన నిధి పెట్టుబడులను ఏ ప్రాంతంలో సహాయ చర్యలకు వ్యయం చేశారో అదే ప్రాతిపదికన పంపిణీ చేయాలి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే దాకా ఎలాంటి కొత్త ప్రాజెక్టులూ చేపట్టరాదు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కేటాయింపులకు మించి అదనంగా వ్యయం చేయరాదు.

హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం రావడానికి కారణం అది రాష్ట్ర రాజధాని కావడమే. చమురు తదితర కంపెనీలు, సంస్థలు వ్యాట్‌ను హైదరాబాద్‌లోనే చెల్లిస్తున్నాయి. విభజన తర్వాత అవన్నీ కొత్త రాష్ట్రంలో నమోదు చేసుకోవడంతో పాటు ఆ రాష్ట్రంలోనే వ్యాట్ చెల్లిస్తారు. కాబట్టి హైదరాబాద్ ఆదాయాన్ని విక్రయ ప్రాంతం, వినియోగ ప్రాంతం, ఎక్కడ ఆస్తి ఉన్నదనే ప్రాతిపదిక ఆధారంగా పంపిణీ చేయాలి.

**27 అక్టోబరు 2013:**

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ ఎత్తున జరిగిన తెలంగాణ విశ్వబ్రాహ్మణ పోరు గర్జన.

**28 అక్టోబరు 2013:**

**శాంతిభద్రతలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు**

రాష్ట్రవిభజన నేపథ్యంలో తలెత్తే శాంతిభద్రతల సమస్యలను ఏవిధంగా

ఎదుర్కొనాలనే దానిపై కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఉన్నతాధికారులతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. టాస్క్‌ఫోర్స్‌కు రిటైర్డ్ ఐపీఎస్, ప్రస్తుతం కేంద్ర హోంమంత్రిత్వశాఖ సెక్యూరిటీ విభాగంలో సలహాదారుగా పనిచేస్తున్న కె.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేంద్ర హోంశాఖ అదనపు కార్యదర్శి రాజీవ్‌శర్మ, జాతీయ దర్యాప్తు సంస్థ అదనపు డీజీ ఎన్.ఆర్.వాసన్, మధ్యప్రదేశ్ అదనపు డీజీ డి.ఎం.మిత్ర, ఒడిశా ఇంటలిజెన్స్ అదనపు డీజీ అభయ్‌కుమార్, సరిహద్దు భద్రతా దళం ఐజీ సంతోశ్ మెహ్రా, సీఆర్‌పీఎఫ్ ఐజీ జుల్ఫికర్ హాసన్, హోంశాఖ పర్సనల్ డైరెక్టర్ శంతను, బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీఐజీ అన్నుమన్‌యాదవ్‌లు ఉన్నారు. వీరు అక్టోబర్ 30, 31వ తేదీల్లో సీఎస్ మహంతితో సమావేశమై అఖిల భారత కేడర్ అధికారుల పంపిణీపై చర్చిస్తారు.

**31 అక్టోబరు 2013:**

**జీవోఎం విధివిధానాలపై అభిప్రాయాలు చెప్పాలని పార్టీలకే కేంద్రం లేఖలు**

రాష్ట్రవిభజనకు సంబంధించి కేంద్ర మంత్రుల బృందానికి నిర్ధేశించిన విధివిధానాలపై అభిప్రాయాలు తెలపాల్సిందిగా రాష్ట్రానికి చెందిన 8 రాజకీయ పార్టీలను కేంద్ర హోంశాఖ కోరింది. వాటిపై నవంబర్ 5లోగా సూచనలు, సలహాలను ఆహ్వానిస్తూ జీవోఎం విధివిధానాల ప్రతిని లేఖకు జతచేసి పార్టీ కార్యాలయాలకు ఫ్యాక్స్ ద్వారా పంపించారు.

**01 నవంబరు 2013:**

తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో గన్‌పార్కు వద్ద తెలంగాణ విద్రోహదినం.

**06 నవంబరు 2013:**

**12న జీవోఎంతో చర్చకు ఐదు పార్టీలకు పిలుపు**

రాష్ట్ర విభజనపై ఏర్పాటైన జీవోఎంతో చర్చించేందుకు నవంబర్ 12న ఢిల్లీకి రావాలని కేంద్ర హోంశాఖ కేవలం ఐదు పార్టీ (కాంగ్రేస్, బీజేపి, టీఆర్ఎస్, ఎం.ఐ.ఎం.,సిపిఐ)లను ఆహ్వానించింది. విభజనను వ్యతిరేకిస్తూ జీవోఎంను బహిష్కరించిన వైసీపీలతో పాటు స్పష్టతలేని టీడీపీని కూడా చర్చలకు పిలువలేదు.

కొత్తగూడెంలోని రుద్రంపూర్ జేయేసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆచార్య జయశంకర్ విగ్రహం, అమరవీరుల స్మారక స్థూపం ఆవిష్కరణ.

**7 నవంబరు 2013:**

కొత్తఢిల్లీలో తెలంగాణ అంశంపై గ్రూప్ ఆప్ మినిష్టర్స్ ప్రత్యేక భేటి.

**08 నవంబరు 2013:**

కాకతీయ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో బియ్యాల జనార్ధన్‌రావు స్మారక

ట్రస్టు ఆధ్వర్యంలో సదస్సు.

**12 నవంబరు 2013:**

**జీవోఎంతో విడివిడిగా పార్టీల భేటీలు**

**కాంగ్రెస్:**

డిప్యూటీ సీఎం రాజనర్సింహా: హైదరాబాద్‌ను పదేళ్లపాటు కాకుండా ఐదేళ్ల పాటే ఉమ్మడి రాజధానిగా చేయాలి. ఉమ్మడి రాజధానిని కేవలం హైదరాబాద్ రెవెన్యూ జిల్లాకు మాత్రమే పరిమితం చేయాలి. సీడబ్ల్యూసీ తీర్మానం ప్రకారం పదిజిల్లాలతో కూడిన తెలంగాణను ఏర్పాటు చేయాలి. గోదావరిపై రెగ్యులేటరీ అథారిటీ అవసరం లేదు. కేంద్రీకృత విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

వట్టి వసంతకుమార్: సీమాంధ్ర ప్రజల మనోభావాలను జీవోఎంకు రాతపూర్వకంగా తెలియజేశానని తెలిపారు. విభజన నిర్ణయంపై పునరాలోచన చేయాలి.

**టీ.ఆర్.ఎస్:**

కేసీఆర్: ఉమ్మడి రాజధానిగా ఐదేళ్లు చాలు. హైదరాబాద్ రెవెన్యూను పంపిణీ చేసే ప్రతిపాదన అమానుషం. శాంతిభద్రతల బాధ్యత రాష్ట్రానికే ఉండాలి. నదీజలాలపై సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయాలి. మిగతా 28 రాష్ట్రాలకు ఏ పద్ధతి ఉందో అదే పద్ధతి తెలంగాణకు ఉండాలి.

**ఎం.ఐ.ఎం.**

అసదుద్దీన్ ఓవైసీ: అనంత, కర్నూలు జిల్లాలను కలిపి రాయల తెలంగాణ ఏర్పాటు చేయాలి. ఉమ్మడి రాజధాని వద్దు. ఖైరతాబాద్ మండలానికే 'తాత్కాలిక రాజధాని'ని పరిమితం చేయాలి.

**బీజేపి:**

కిషన్‌రెడ్డి: పార్టీల వైఖరిని కోరిన 11 అంశాలపై ముందు కాంగ్రెస్ పార్టీ తన వైఖరేమిటో చెప్పాలి. వచ్చే శీతాకాల సమావేశాల్లో బిల్లును ఆమోదింపజేయాలని కోరారు.

**సీపీఎం.**

నారాయణ: పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిలో ఒకే ప్రభుత్వం శాంతిభద్రతలను పరిరక్షించడం సాధ్యం కాదని, అలాగనీ యూటీగా మారిస్తే అది సమస్యకు పరిష్కారమివ్వదని అందుకే ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి దానికి శాంతిభద్రతల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించాలని కోరారు.

**29 నవంబరు 2013:**

'తెలంగాణ విద్యావంతుల వేదిక' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్

ప్రెస్‌క్లబ్‌లో 'సంపూర్ణ తెలంగాణ సాధన సదస్సు' జరిగింది. శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జేయేసీ చైర్మెన్ ప్రొఫెసర్ యం. కోదండరామ్, నమస్తే తెలంగాణ ఎడిటర్ అల్లం నారాయణ, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్ తదితరులు ప్రసంగించారు.

**01 డిసెంబరు 2013:**

రైలులో ఢిల్లీకి బయలుదేరిన తెలంగాణ జేయేసీ ప్రతినిధుల బృందం.

**03 డిసెంబరు 2013:**

రాజ్‌ఘాట్‌లోని మహాత్మాగాంధీ సమాధి వద్ద జేయేసీ నాయకుల సత్యాగ్రహ దీక్ష. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, శరద్‌యాదవ్, రాజ్‌నాథ్‌సింగ్‌లో జేయేసీ ప్రతినిధుల భేటి.

**04 డిసెంబరు 2013:**

ఢిల్లీలోని ఎపి భవన్‌లో తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి ప్రత్యేక సమావేశం.

ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు.

**05 డిసెంబరు 2013:**

**రాయల తెలంగాణను వ్యతిరేకిస్తూ తెలంగాణ బంద్**

రాయల తెలంగాణ ప్రతిపాదనలకు నిరసనగా గురువారం తలపెట్టిన బంద్ విజయవంతమైంది. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన బంద్ పిలుపుకు తెలంగాణ రాజకీయ జేఏసితో పాటు పలు తెలంగాణ సంఘాలు సంపూర్ణంగా మద్ధతు తెలిపాయి. సంపూర్ణ తెలంగాణలో ఏమాత్రం తేడా వచ్చినా తీవ్ర పరిణామాలకు జేఏసి పిలుపునివ్వాల్సి ఉంటుందని ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ హెచ్చరించారు.

**తెలంగాణ ముసాయిదా బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు 2013 ముసాయిదాకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 10 జిల్లాలతో తెలంగాణ, మిగిలిన 13 జిల్లాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటాయి. పదేళ్లపాటు జీహెచ్‌ఎంసీ ఉమ్మడి రాజధానిగా ఖరారు చేస్తూ శాంతిభద్రతలు తెలంగాణ గవర్నర్‌కు అప్పగిస్తున్నట్లు బిల్లులో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నివాసంలో కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. సుమారు మూడు గంటలకు పైగా సుధీర్ఘంగా కొనసాగిన ఈ సమావేశంలో జీవోఎం రూపొందించిన బిల్లుపై కూలంకషంగా చర్చించారు. అనంతరం హోంమంత్రి షిండే మీడియాతో మాట్లాడుతూ బిల్లులోని ముఖ్యాంశాలను వివరించారు.

**జాతీయ నాయకులను కలిసిన జేయేసీ బృందం.**

తెలంగాణ జేయేసీ అగ్రనాయకులు పార్లమెంటులో బిజేపీ అగ్రనేతలు

సుష్మస్వరాజ్, వెంకయ్యనాయుడు తదితరులను విడివిడిగా కలుసుకున్నారు. హెూంమంత్రి సుశీల్ కుమార్ షిండే, రాష్ట్రీయ లోక్‌దల్ నాయకుడు అజిత్‌సింగ్ తదితరులను కూడా కలుసుకున్నారు.

**06 డిసెంబరు 2013:**

**రాష్ట్రపతి భవన్‌కు తెలంగాణ బిల్లు**

కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లు-2013 శుక్రవారం రాత్రి రాష్ట్రపతి భవన్‌కు చేరినట్లు ఢిల్లీలో వార్తలు వచ్చాయి. ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు శుక్రవారం రాత్రి విభజన బిల్లుతో కూడిన ఫైలు కేంద్ర హెూంశాఖ కార్యాలయం నుంచి రాష్ట్రపతి సచివాలయానికి వెళ్లినట్లు సమాచారం.

ఢిల్లీలోని ఎపి భవన్‌లో తెలంగాణ జేయేసీ నేతలు నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతిలో కాంగ్రెస్ ఎంపీలు మధుయాష్కి, డా॥ వివేక్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి శరద్‌పవార్‌ను ఈ సందర్భంగా జేయేసీ నాయకులు కలుసుకున్నారు.

**11 డిసెంబరు 2013:**

తెలంగాణ జేయేసీ విస్తృతస్థాయి స్టీరింగ్ కమిటి సమావేశం గృహకల్పలోని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘ భవనంలో జరిగింది. టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కూడా హాజరైనారు.

**12 డిసెంబరు 2013:**

**హైదరాబాద్ చేరిన తెలంగాణ బిల్లు**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లు - 2013 పై శాసనసభ అభిప్రాయం చెప్పడానికి జనవరి 23వరకు రాష్ట్రపతి గడువు ఇస్తూ రాష్ట్రానికి బిల్లును పంపించారు. ఇది గురువారం సాయంత్రం 6గంటలకు రాష్ట్ర ప్రభుత్వానికి అందింది. కేంద్ర హెూంశాఖ సంయుక్త కార్యదర్శి సురేష్‌కుమార్ బిల్లు ప్రతులను ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.కె.మహంతికి స్వయంగా అందజేశారు.

**16 డిసెంబరు 2013:**

**అసెంబ్లీలో తెలంగాణ బిల్లు**

తెలంగాణ ముసాయిదా బిల్లును సోమవారం రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలిలో ప్రవేశపెట్టారు. సభాపతి నాదేండ్ల మనోహర్ ఉదయం 10గంటలకు సభలో ప్రవేశపెడుతూ రాష్ట్రపతి ఆదేశాల మేరకు బిల్లును సభలో ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రపతి నుంచి శాసనసభకు వచ్చిన లేఖను, బిల్లులోని ప్రధానమైన అంశాలను శాసనసభ కార్యదర్శి రాజ సదారాం చదివి వినిపించారు. సభ వాయిదా అనంతరం సీమాంధ్ర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలంగాణ బిల్లు ప్రతులను చించివేయడం,

కాల్చేయడంతో తెలంగాణ, సీమాంధ్ర ప్రజాప్రతినిధుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు చర్చను ప్రారంభించాల్సిందిగా స్పీకర్‌ను కోరారు. అధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ విపక్షనేత చంద్రబాబు పేరును పిలవగా ఆయన సభలో లేరు. అప్పటికే సీమాంధ్రనేతలు స్పీకర్ పోడియం వద్ద ఆందోళన చేస్తుండగా సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ ప్రకటించారు.

**18 డిసెంబరు 2013:**

**జనవరి 3కు అసెంబ్లీ సమావేశాలు వాయిదా**

తెలంగాణ ముసాయిదా బిల్లుపై చర్చించాలనే అజెండాతో సమావేశమైన రాష్ట్ర శాసనసభ బుధవారం ఎలాంటి చర్చలేకుండానే సభ మూడు సార్లు వాయిదా పడింది. ఎంతకీ సభ ఆర్డర్‌లోకి రాకపోవడంతో బిల్లుపై ఎలాంటి చర్చ జరగకుండానే జనవరి 3వ తేదీ వరకు వాయిదా పడింది. తెలంగాణ బిల్లుపై రాష్ట్రపతి ఇచ్చిన గడువు 23వ తేదీ వరకు ఉండడంతో జనవరిలో ప్రత్యేకంగా బిల్లుపై చర్చ జరపాలని నిర్ణయించారు.

**03 జనవరి 2014:**

**ఎలాంటి చర్చ లేకుండానే సభ వాయిదా**

జనవరి 3, శుక్రవారం ఉదయం 9గంటలకు ప్రారంభమైన సభ మూడు వాయిదాలతో మొత్తం 15 నిమిషాలు మాత్రమే నడిచింది. సీమాంధ్ర ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి నినాదాలు చేయడంతో సభ చివరకు శనివారానికి వాయదా పడింది.

**తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం**

తెలంగాణ ప్రాంత కాంగ్రెస్, టిడిపి, బిజెపి, టిఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో సమావేశమై తెలంగాణ బిల్లుపై చర్చకు పట్టుబట్టాలని, సమైక్య తీర్మానాన్ని ఐక్యంగా వ్యతిరేకించాలని నిర్ణయించారు.

**04 జనవరి 2014:**

**శాసనసభ సోమవారానికి వాయిదా**

సమైక్య, తెలంగాణ నినాదాలతో రెండో రోజైన శనివారం కూడా శాసనసభ స్తంభించింది. మూడు దఫాలుగా కేవలం పది నిమిషాల పాటు మాత్రమే సభ కొనసాగి చివరికి సోమవారానికి వాయిదా పడింది.

**06 జనవరి 2014:**

సోమవారం సభలో ఎలాంటి చర్చ జరగకుండానే వాయిదా పడింది. అనంతరం నిర్వహించిన బిఏసి సమావేశంలో ప్రాంతాల వారిగా వాదనలు వినిపించడంతో ఏకాభిప్రాయం కుదరక అర్థాంతరంగా సమావేశం ముగించారు. రాష్ట్ర విభజన బిల్లుకు

శాసనసభ్యులెవరైనా సవరణలు సూచించదలిస్తే క్లాజుల వారిగా వారి అభ్యంతరాలను జనవరి 10వ తేదీలోగా ఇవ్వాలని స్పీకర్ మనోహర్ ప్రకటించారు.

**07 జనవరి 2014:**

**సంపూర్ణ తెలంగాణ సాధన దీక్ష**

ఇందిరాపార్కులో మంగళవారం తెలంగాణ జేఏసి 'సంపూర్ణ తెలంగాణ సాధన దీక్ష'ను నిర్వహించింది. రాష్ట్ర శాసన సభలో బిల్లుపై చర్చ జరపలేకుంటే విభజన బిల్లును వెంటనే ఢిల్లీకి వెనెక్కి పంపాలని టిజేఏసి చైర్మన్ కోదండరాం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దీక్షలో బిల్లులో చేపట్టాల్సిన 13 సవరణలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

**సవరణలు:**

1. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా పదేళ్లు కాకుండా రెండేళ్లు తాత్కాలిక రాజధానిగా ఉండాలి.

2. ఉమ్మడి రాజధానిలో గవర్నర్‌కు శాంతిభద్రతలు అప్పగించడం సమంజసం కాదు. పూర్తి అధికారాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే ఉండాలి. గవర్నర్‌కు అధికారాలు లేనపుడు సలహాదారులు అవసరం లేదు.

3. ఉమ్మడి హైకోర్టు కాకుండా రాష్ట్ర విభజనతోనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు చేయాలి.

4. రాష్ట్రం బయట ఉన్న ఆస్తులను జనాభా ప్రాతిపదికన కాకుండా ఏపీ భవన్‌ను తెలంగాణకే ఇవ్వాలి.

5. స్థానికత ఆధారంగా పెన్షనర్లను కేటాయించాలి.

6. ఉద్యోగుల బట్వాడాలో స్థానికతను ప్రామాణికంగా తీసుకునేలా బిల్లులో మార్గదర్శకాలు రూపొందించాలి.

7. ఆస్తులతోపాటు కార్పోరేషన్లను కూడా రాష్ట్రాల వారిగానే కేటాయించాలి.

8. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 45 రోజుల్లోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఏర్పాటు చేయాలి.

9. కొత్త ప్రాజెక్టుల అనుమతిని అపెక్స్ కౌన్సిల్‌కు ఇవ్వకుండా.. ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలి.

10. గోదావరి జలాల పంపిణీలో ఎలాంటి వివాదాలు లేనందున దానికి ప్రత్యేకంగా బోర్డు అవసరం లేదు.

11. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బోర్డు కార్యాలయం హైదరాబాద్‌లోనే ఉండాలి.

12. విద్యుత్తు విషయంలో తెలంగాణ కోటాపై ఎలాంటి అభ్యంతరం లేదు.

కానీ పంపిణీ విషయంలో హేతుబద్ధత కొరవడింది. 12వ షెడ్యూలును సవరించాలి.

13. ఉమ్మడి ప్రవేశ పరీక్షల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి.

**08 జనవరి 2014:**

**బిల్లుపై చర్చ ప్రారంభం**

రాష్ట్ర విభజన బిల్లుపై ఎట్టకేలకు బుధవారం మధ్యాహ్నం స్పీకర్ ఆదేశాల మేరకు మంత్రి వట్టి వసంత కుమార్ బిల్లుపై చర్చను ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తుండగానే వైకాపా సభ్యులు నినాదాలు చేస్తూ బిల్లు ప్రతులను చించి హంగామా చేయడంతో సభ గురువారానికి వాయిదా పడింది.

**09 జనవరి 2014:**

**వాడీ వేడీ చర్చ**

శాసనసభ, శాసనమండలిలో తెలంగాణ బిల్లుపై చర్చ వాడీవేడీగా సాగింది. మొదట వైకాపా సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది. అనంతరం టిడిపి, కాంగ్రేస్, టిఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం సాగింది.

**10 జనవరి 2014:**

**కొనసాగిన చర్చ**

రెండో రోజు చర్చలో కాంగ్రేస్ నుంచి గండ్ర వెంకటరమణారెడ్డి, టిఆర్ఎస్ నుంచి ఈటెల రాజేందర్, సిపిఐ నుంచి గుండా మల్లేష్‌లు మాట్లాడారు. ఓటింగ్ పెట్టనందుకు నిరసనగా వైకాపా వాకౌట్ చేసింది. నేను ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగాను 53 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్నాను. నేను తెలంగాణ వాసినా? సీమాంధ్ర వాసినా? అంటూ సిఎం కిరణ్ సభలో ప్రశ్నించారు.

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన "తెలంగాణ స్టోర్స్" (మన అంగడి)

**18 జనవరి 2014:**

**బిల్లుపై సభలో పలువురి అభిప్రాయం**

రాష్ట్ర విభజన బిల్లుపై శనివారం అసెంబ్లీలో లోక్‌సత్తా అధినేత జెపి నారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు అవసరాన్ని వివరించారు. అటు మండలిలో కూడా టిఆర్ఎస్ సభ్యుడు స్వామిగౌడ్, వైకాపా సభ్యుడు ఆదిరెడ్డి అప్పారావు, పిడిఎఫ్ సభ్యుడు బాలసుబ్రమణ్యం, దిలీప్‌కుమార్ బిల్లుపై వారి అభిప్రాయాలను తెలిపారు.

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి)లో జయశంకర్ స్ఫూర్తితో తెలంగాణ పునర్నిర్మాణం పై సదస్సు నిర్వహించిన తెలంగాణ నెటిజన్స్ ఫోరం. హాజరైన విప్లవ కవి వరవరరావు, జేయేసీ చైర్మన్ కోదండరాం తదితరులు.

**19 జనవరి 2014:**

**శాసనమండలిలో బిల్లుపై చర్చ**

ఆదివారం బిల్లుపై వాడీవేడి చర్చ జరిగింది. గాదె శ్రీనివాసుల నాయుడు, దిలీప్‌కుమార్, మంత్రి శైలజానాథ్, పాలడుగు వెంకట్రావు, పొంగులేటి సుధాకర్‌లు బిల్లుపై అభిప్రాయాన్ని తెలిపారు.

**20 జనవరి 2014:**

**బిల్లుకు 9039 సవరణలు, అభిప్రాయాలు**

సోమవారం తెలంగాణ బిల్లుపై శాసన సభ్యులు తెలియజేసిన అభిప్రాయాలను, సవరణలను క్రోడీకరించి ఈమేరకు ఒక సిడిని శాసనసభలో సోమవారం అందజేశారు. సిడిలో మొత్తం 9039 సవరణలు, అభిప్రాయాలు, సూచనలు ఉన్నాయి. క్లాజుల వారిగా ఎవరెవరు ఏమి సూచించారో పేర్కొన్నారు.

**శాసనసభ ఆవరణలో అంబెద్కర్ విగ్రహ ఆవిష్కరణ**

అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబెద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ నర్సింహన్ సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ మనోహర్, సీఎం కిరణ్, మండలి చైర్మన్ చక్రపాణి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు

**21 జనవరి 2014:**

**బిల్లుపై కొనసాగిన చర్చ**

సోమవారం కొద్దిసేపు మాట్లాడిన ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ తన ప్రసంగాన్ని మంగళవారం కొనసాగించారు. తెలంగాణ బిల్లుపై టిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.టి.ఆర్ సుధీర్ఘ ప్రసంగం చేశారు.

**22 జనవరి 2014:**

**విభజన బిల్లుపై సభలో సి.ఎం.కిరణ్**

రాష్ట్ర విభజన బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు కిరణ్‌కుమార్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. ఈ సమయంలో తాను ముఖ్యమంత్రిగా ఉండటం దురదృష్టకరమన్నారు. కాగా సభానాయకుడిగా బిల్లును వ్యతిరేకిస్తే తాము సమర్థించేది లేదని మంత్రి జానారెడ్డి స్పష్టం చేశారు. సి.ఎం. చెప్పే ఏ అంశాల్లోనూ తెలంగాణ మంత్రుల భాగస్వామ్యం లేదని మంత్రి జానా స్పష్టం చేశారు.

**23 జనవరి 2014:**

**బిల్లుపై చర్చకు మరోవారం గడుపు పెంపు**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై శాసనసభలో చర్చించేందుకు రాష్ట్రపతి ఇచ్చిన గడువు జనవరి 23తో ముగుస్తుండడంతో ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు మరో వారం పొడిగిస్తూ జనవరి 30వరకు గడువు ఇస్తున్నట్లు ఈమేరకు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ

ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్రవిభజన బిల్లుపై సిఎం కిరణ్ రెండో రోజు తన ప్రసంగాన్ని కొనసాగించారు.

**24 జనవరి 2014:**

శుక్రవారం బిల్లుపై శాసనసభలో తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా ఎమ్మెల్యేలు మహేందర్‌రెడ్డి(టిడిపి), కుంజా సత్యవతి(కాంగ్రేస్), వినయ్‌భాస్కర్ (టిఆర్ఎస్), రేవంత్‌రెడ్డి(టిడిపి), రత్నం(టిడిపి), నల్లాల ఓదెలు(టిఆర్ఎస్), సుద్దాల దేవయ్య(టిడిపి), అబ్రహం(కాంగ్రేస్), శ్రీధర్ (కాంగ్రేస్), ప్రతాపరెడ్డి(కాంగ్రేస్), లింగయ్య(కాంగ్రేస్), జోగు రామన్న(టిఆర్ఎస్), కె.విద్యాసాగర్‌రావు(టిఆర్ఎస్), వూకె అబ్బయ్య(టిడిపి), రాములు(టిడిపి), కిషన్‌రెడ్డి (బిజెపి)లు ప్రసంగించారు.

**25 జనవరి 2014:**

**బిల్లు తిరస్కరిస్తూ తీర్మానానికి స్పీకర్‌కు సిఎం నోటీసు**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును తిరస్కరిస్తూనే దానిని పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు సిఫార్సు చేయొద్దని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసే తీర్మానాన్ని శాసనసభలో తేవడానికి వీలుగా స్పీకర్, మండలి చైర్మన్లకు సిఎం కిరణ్ నోటీసిచ్చారు.

శనివారం శాసనసభలో సిఎం ప్రసంగం తర్వాత ప్రతిపక్షనేత చంద్రబాబు బిల్లుపై ప్రసంగించారు. బిల్లును తిప్పి పంపే అధికారం అసెంబ్లీకి ఉందన్నారు. బిల్లును ముందే ఎందుకు తిప్పి పంపలేదని సిఎంను చంద్రబాబు ప్రశ్నించారు.

**26 జనవరి 2014:**

**గాంధీభవన్‌లో సిఎంకు తెలంగాణ సెగ**

గణతంత్ర వేడుకల్లో భాగంగా గాంధీభవన్‌లో జాతీయ పతాకావిష్కరణ అనంతరం సిఎం డౌన్‌డౌన్, ఆంధ్రా కాంగ్రేస్ గో బ్యాక్ అంటూ తెలంగాణ కాంగ్రేస్ నాయకులు నినాదాలు చేయడంతో సిఎం అక్కడి నుండి వెళ్లిపోయారు.

**27 జనవరి 2014:**

**సిఎం నోటీసుకు సభలో తీవ్ర నిరసన**

రాష్ట్ర విభజన బిల్లు తిరస్కరణపై ముఖ్యమంత్రి నోటీసు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం తెలంగాణ ప్రాంతానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు స్పీకర్ వెల్‌లోకి దూసెకెళ్లి సిఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభ ఎటువంటి చర్చ జరగకుండానే మంగళవారానికి వాయిదా పడింది.

**28 జనవరి 2014:**

**సభలో వాయిదాల పర్వం**

బిల్లును తిరస్కరించాలని సిఎం ఇచ్చిన నోటీసును తిరస్కరించాలని కోరుతూ తెలంగాణకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు జై తెలంగాణ నినాదాలతో

హోరెత్తించారు. పలు సార్లు వాయిదా పడిన సభ పరిస్థితిలో మార్పులేకపోవడంతో బుధవారానికి వాయిదా పడింది. అనంతరం బిఏసి సమావేశం జరిగింది. సభానాయకుడి హోదాలో సిఎం కిరణ్ ఇచ్చిన తీర్మానంపై సభ అభిప్రాయం తీసుకోవాల్సిందేనని బిఏసిలో స్పీకర్ నాదేండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

**29 జనవరి 2014:**

**సభలో తెలంగాణ సభ్యుల నిరసన**

సిఎం ఇచ్చిన నోటీసును తిరస్కరించాలంటూ బుధవారం ఇటు శాసనసభలోను, అటు శాసనమండలిలోను తెలంగాణ సభ్యులు, మంత్రులు పట్టుబట్టడంతో మూడోరోజు కూడా ఉభయసభల్లో ఎలాంటి చర్చలేకుండానే గురువారానికి వాయిదా పడ్డాయి.

**30 జనవరి 2014:**

బిల్లుపై అసెంబ్లీలో ముగిసిన చర్చ

తెలంగాణ బిల్లుపై అసెంబ్లీలో చేపట్టిన చర్చ గురువారంతో ముగిసింది. సభ గందరగోళంలో ఉండగానే స్పీకర్ సీఎం ఇచ్చిన తీర్మానాన్ని మూజువాణి వోటుతో ఆమోదించినట్టు ప్రకటించారు. కాగా సిఎం కిరణ్ ఆడిన డ్రామా ముగిసిందని ఆ తీర్మానానికి విలువ లేదని ఉపముఖ్యమంత్రి దామోదర నర్సింహ వ్యాఖ్యానించారు.

**01 ఫిబ్రవరి 2014:**

తెలంగాణ బిల్లు అసెంబ్లీ కార్యదర్శి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చేరింది.

**02 ఫిబ్రవరి 2014:**

తెలంగాణ ఎన్నారై ఫోరం (తేనా) సహకారంతో తెలంగాణ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆంధ్ర సారస్వత పరిషత్ హాల్‌లో తెలంగాణ తోవలు పుస్తకావిష్కరణ.

**03 ఫిబ్రవరి 2014:**

తెలంగాణ బిల్లుపై శాసనసభ చర్చల సారాంశపు నివేదిక సోమవారం ఢిల్లీకి చేరుకుంది. పరిపాలనశాఖ డిప్యూటీ సెక్రటరీ లలితాంబికా నేతృత్వంలోని అధికారుల బృందం వీటిని భారీ భద్రత నడుమ తొలుత ఢిల్లీలోని ఎపిభవన్‌కు అక్కడినుండి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యాలయానికి తరలించారు.

ఢిల్లీలో బిజెపి అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన టిడిపి అధినేత చంద్రబాబు సమన్యాయం చేయాలని డిమాండ్.

**04 ఫిబ్రవరి 2014:**

ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ను కలిసిన టిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు బిల్లులో చేపట్టాల్సిన సవరణలపై చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డితో చర్చలు జరిపారు.

బిజేపి అగ్రనేతలు అధ్వాని, సుష్మాస్వరాజ్, ఆర్జేడినేత లాలుప్రసాద్ యాదవ్, ఎస్పీనేత ములాయం సింగ్‌ని కలిసిన టిడిపి అధినేత చంద్రబాబు సమన్యాయం

చేయాలని కోరారు.

**టిజేఏసి స్టీరింగ్ కమిటీ సమావేశం**

బిజేపి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ జేఏసి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ ప్రజలను గందరగోళ పరిచేలా కొందరు ప్రయత్నిస్తున్నట్లు, బిజేపి తెలంగాణ విషయంలో స్పష్టంగా ఉందని జేఏసి చైర్మన్ కోదండరాం, బిజేపినేత కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెచ్చేందుకు జేఏసి భాగస్వామ్య పక్షాలన్నీ ప్రయత్నించాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.

**05 ఫిబ్రవరి 2014:**

**ప్రారంభమైన పార్లమెంట్ ఉభయసభలు**

రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా సిఎం కిరణ్ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో మౌనదీక్ష. దీక్షకు బయలుదేరుతున్న సిఎంకు ఎపిభవన్‌లో నిరసన తెలిపిన తెలంగాణ మంత్రులు, నాయకులపై పోలీసుల దౌర్జన్యం.

రాష్ట్రపతిని కలిసిన సిఎం కిరణ్ రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని వినతి.

ప్రధాని మన్మోహన్‌ను వేర్వేరుగా కలిసిన తెలంగాణకు చెందిన మంత్రులు, కాంగ్రేస్, టిడిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు.

ముంబాయిలో శివసేన అధినేత ఉద్ధవ్‌థాకరేను కలిసిన చంద్రబాబు విభజన అభ్యంతరకరమన్నారు.

థాకరే ఇంటిముందు ధర్నా చేసిన ముంబాయిలోని తెలంగాణవాదులు.

విభజనను ఆపాలని కోరుతూ రాష్ట్రపతి ప్రణబ్‌ను కలిసిన వైకాపా అధినేత వైఎస్.జగన్ మరియు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు.

సిఎం కిరణ్‌ను బర్తరఫ్ చేయాలని కోరుతూ ఎపిభవన్‌లోని అంబెద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ టిడిపి నేతలు ధర్నా నిర్వహించారు.

**06 ఫిబ్రవరి 2014:**

తెలంగాణ బిల్లుకు గురువారం జీవోఎం ఆమోద ముద్రవేసింది.

తెలంగాణ, సమైక్యాంధ్ర నినాదాలతో పార్లమెంట్ ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెడితే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన సిఎం కిరణ్‌కుమార్ రెడ్డి.

సమన్యాయం చేయాలని జయలలిత, కరుణానిధిలను కలిసిన చంద్రబాబు.

బిజేపి జాతీయ అధ్యక్షున్ని కలిసిన కేసీఆర్ బిల్లుకు మద్ధతిచ్చేందుకు హామి.

రాష్ట్రపతిని కలిసిన తెలంగాణ కాంగ్రేస్ నేతలు తెలంగాణ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి.

**07 ఫిబ్రవరి 2014:**

బిల్లుకు వ్యతిరేకంగా వేసిన 9పిటీషన్లను శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది.

రాష్ట్ర విభజన బిల్లుకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోద ముద్ర వేసింది. రాయల తెలంగాణ, హైదరాబాద్ యూటీని చేసే ప్రతిపాదనలను కేబినెట్ తోసిపుచ్చింది. పోలవరం ప్రాజెక్టు కోసం భద్రాచలం పట్టణం మినహా 7మండలాలను సీమాంధ్రలో కలపాలని కేబినెట్ నిర్ణయం. బిల్లులో ప్రభుత్వ పరంగా 32 సవరణలు తీసుకురావాలని కేబినెట్ నిర్ణయించింది.

టిఆర్ఎస్ పార్టీ తరపున తొలి రాజ్యసభ సభ్యునిగా కె.కేశవరావు ఎన్నికయ్యాడు.

తెలంగాణ బిల్లును ఆంధ్రప్రదేశ్ చట్టసభలు తిరస్కరించినప్పటికీ వాటికి పార్లమెంట్ కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని, ఈమేరకు రాజ్యాంగం స్పష్టతనిచ్చిందని కేంద్ర హెూంశాఖ పత్రాలలో వెల్లడించింది.

**08 ఫిబ్రవరి 2014:**

భద్రాచలం డివిజన్‌లోని ముంపు గ్రామాలను సీమాంధ్రలో కలపాలనే కేటినెట్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం విద్యార్థి జేఏసి నేతలు ఏపిభవన్‌లోని అంబెద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. వీరికి సంఘీభావం తెలపడానికి వచ్చిన రేణుకా చౌదరిని వారు అడ్డుకున్నారు.

**10 ఫిబ్రవరి 2014**

తెలంగాణ, సమైక్యాంధ్ర నినాదాలతో ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి.

కోల్‌కతాలో మమతా బెనర్జీని కలిసిన టిడిపి అధినేత చంద్రబాబు.

**11 ఫిబ్రవరి 2014:**

ఎపి భవన్‌లో లోక్‌సత్తా అధినేత జెపి నారాయణను అడ్డుకున్న తెలంగాణ న్యాయవాదులు.

సీమాంధ్రకు చెందిన 6గురు ఎంపీలు సబ్బంహరి, హర్షకుమార్, ఉండవల్లి అరుణ్‌కుమార్, లగడపాటి రాజ్‌గోపాల్, రాయపాటి సాంబశివరావు, సాయిప్రతాప్‌లను పార్టీనుండి బహిష్కరిస్తూ కాంగ్రేస్‌పార్టీ అధిష్టానం ప్రకటించింది.

బిల్లులోపభూయిష్టంగా ఉందని బిజేపి అగ్రనేత అద్వాని అన్నారు.

వామపక్ష నేతలు ప్రకాశ్ కారత్, ఏబి బర్ధన్‌లను కలిసిన చంద్రబాబు

బిల్లును లోక్‌సభలో ప్రవేశపెడితే వెల్‌లోనే ఆత్మాహుతి చేసుకుంటానన్న సబ్బం హరి.

**12 ఫిబ్రవరి 2014:**

తెలంగాణ బిల్లు విషయంలో రాజ్యాంగ సవరణ అవసరం లేదని కేంద్ర

న్యాయశాఖ అభిప్రాయాన్ని వెల్లడించింది.

రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం లోక్‌సభ గురువారానికి వాయిదా.

లోక్‌సభలో సహచర మంత్రుల ప్రవర్తనతో తన హృదయం ముక్కలైందంటూ ఆవేదన వ్యక్తం చేసిన ప్రధాని మన్మోహన్.

పోలవరం ముంపు గ్రామాల సంఖ్యను 134కు తగ్గిస్తూ మరో సవరణ చేసిన కేంద్ర కేబినెట్.

**13 ఫిబ్రవరి 2014:**

లోక్‌సభలో మధ్యాహ్నం 12గంటలకు సభావ్యవహారాల జాబితాలోని 20ఏ అంశం అయిన తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే.

లోక్‌సభలో పెప్పర్ స్ప్రే చల్లిన ఎంపీ లగడపాటి రాజ్‌గోపాల్ స్పీకర్‌తో సహా పలువురు సభ్యులకు అస్వస్థత, వెల్‌లోకి దూసుకువచ్చిన ఎంపీలలో 16 మందిని సస్పెండ్ చేసిన స్పీకర్.

సభలో బిల్లు ప్రవేశపెట్టలేదన్న ప్రతిపక్షనేత సుష్మాస్వరాజ్.

ప్రజలందరూ సంయమనం పాటించాలన్న కేసీఆర్.

విభజన వల్ల ఎవరి హక్కులకూ భంగం వాటిల్లదని స్పష్టం చేసిన ఏపి హైకోర్టు. బిల్లును వ్యతిరేకిస్తూ న్యాయవాది పి.వి.కృష్ణయ్య దాఖలు చేసిన పిటీషన్‌పై గురువారం హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

**14 ఫిబ్రవరి 2014:**

లోక్‌సభలో సీమాంధ్ర ఎంపీలు  వ్యవహరించిన తీరు ఉగ్రవాదుల దాడిలా ఉందని జేఏసి చైర్మన్ కోదండరాం అన్నారు. శుక్రవారం లోక్‌సభలో ఉద్యోగసంఘాల నేతలు దేవిప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, విఠల్, రఘులతో కలిసి ఆయన సష్మాస్వరాజ్‌తో మాట్లాడి తెలంగాణ బిల్లుకు మద్ధతివ్వాలని విజ్ఞప్తి చేశారు.

దేశం నుండే విడిపోతామని వ్యాఖ్యానించిన టిడిపి ఎంపీలు వేణుగోపాల్‌రెడ్డి, సుజనా చౌదరి, సీఎం రమేష్‌లు.

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బిసి మహాసభ డైరీ ఆవిష్కరణ సభ. మెట్టుకాడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సదస్సులో జేయేసీ చైర్మన్ కోదండరాం, కో-చైర్మన్ విఠల్ పాల్గొన్నారు.

**15 ఫిబ్రవరి 2014:**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ ఖమ్మం జిల్లా పోచవరం వద్ద శనివారం కొండరెడ్లు ఆందోళన చేపట్టారు. ప్రాజెక్టు కింద ముంపుకు గురయ్యే గ్రామాల సంఖ్య తాజాగా 264గా సంబంధిత శాఖ తేల్చింది.

**16 ఫిబ్రవరి 2014:**

నరేంద్రమోడీ, ములాయం సింగ్, శరద్‌యాదవ్‌లను వేర్వేరుగా కలిసిన టిడిపి

అధినేత చంద్రబాబు.

**17 ఫిబ్రవరి 2014:**

సేవ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఢిల్లీలో ఎపిఎన్జీవోలు, వైఎస్ జగన్‌లు వేర్వేరుగా ధర్నా కార్యక్రమాలు

సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికమంత్రి పి.చిదంబరం.

**18 ఫిబ్రవరి 2014:**

తెలంగాణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం. లోక్‌సభ ప్రత్యక్ష ప్రసారాల నిలిపివేత. మధ్యాహ్నం 3గంటల నుంచి 4.20గంటల వరకు అధికార, ప్రతిపక్షాలు సంపూర్ణ మద్ధతుతో 35సవరణలతో కూడిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

బిల్లుపై చర్చ సందర్భంగా తెలుగులో ప్రసంగం ప్రారంభించిన సుష్మా, చిన్నమ్మనూ గుర్తుపెట్టుకోవాలని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

తెలంగాణ వ్యాప్తంగా సంబరాలు, సోనియాకు, సుష్మాస్వరాజ్‌కు పలువురు కృతజ్ఞతలు

లోక్‌సభలో మంగళవారం తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన అనంతరం టిజేఏసి చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ ఇది తెలంగాణ ప్రజల విజయమన్నారు. ప్రాంతాలుగా విడిపోతున్నా ప్రజలుగా సోదరభావంతో కలిసుండాలని ఆయన పిలుపునిచ్చారు. బిల్లు ఆమోదానికి సహకరించిన అన్ని పక్షాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బిల్లుకు 400 మందికి పైగా ఎంపీలు మద్ధతు తెలిపారని వినోద్ పేర్కొన్నారు.

**19 ఫిబ్రవరి 2014:**

మంగళవారం లోక్‌సభలో ఆమోదం పొందిన తెలంగాణ బిల్లు బుధవారం రాజ్యసభకు వచ్చినట్లు రాజ్యసభ సెక్రటరీ జనరల్ కె.షరీఫ్ తెలియజేశారు. ఈ సమయంలో టిడిపి ఎంపీ సీఎం రమేష్ సెక్రటరీ జనరల్ చేతుల్లోని కాగితాలను లాక్కునేందుకు ఆయనపై కలబడ్డాడు. అనంతరం రమేష్ క్షమాపణలు చెప్పాడు.

సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తన పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.

బిల్లుకు కొత్త సవరణలు లేకుండా రాజ్యసభలో ఆమోదానికి సహకరించాలని ప్రధాని మన్మోహన్, బిజేపి నేత అరుణ్‌జైట్లీలకు కేసీఆర్ విజ్ఞప్తి.

బిజేపి సవరణలకు పట్టుబట్టడంతో బుధవారం రాజ్యసభలో తెలంగాణ బిల్లుపై చర్చ జరగలేదు.

**20 ఫిబ్రవరి 2014:**

రాజ్యసభలో తెలంగాణ బిల్లుకు ఆమోదం. గురువారం బిల్లుపై చర్చ ప్రారంభించిన రాజ్యసభ 12సార్లు వాయిదా పడింది. చివరకు 4.40గంటలకు ప్రధాని ప్రసంగం పూర్తికాగానే డిప్యూటీ స్పీకర్ కురియన్ మూజువాణి ఓటుతో బిల్లును

ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు.

ఇది ఒకరి గెలుపు, మరొకరి ఓటమి కాదని అందరం కలిసిఉందామని కేసీఆర్ ప్రకటించారు. బిల్లు ఆమోదానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**తెలంగాణ వ్యాప్తంగా సంబరాలు**

తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరింది. సహకరించిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపిన జేఏసి చైర్మన్ కోదండరాం. మొదటి నుంచి మాకు అండగా నిలిచిన మన్మోహన్, సోనియా, రాజ్‌నాథ్, సుష్మా, అరుణ్‌జైట్లీ, సురవరం, అజిత్‌సింగ్, శరద్‌పవార్, పాశ్వాన్, మాయావతిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాము అనుకున్న సవరణలు ఆశించిన రీతిలో రాలేదని, మార్పుల కోసం పోరాడతామన్నారు.

**21 ఫిబ్రవరి 2014:**

సోనియాకు కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ కాంగ్రెస్, జేఏసి నేతలు.

సీమాంధ్ర ప్రజలతో మరింత సోదరభావంతో మెలగాలని సోనియా సూచన

**22 ఫిబ్రవరి 2014:**

హైదరాబాద్‌కు చేరుకున్న జేఏసి నేతలు, గన్‌పార్క్ వద్ద నివాళులర్పించారు. విద్యుత్ సౌధలో విజయోత్సవ సభ నిర్వహించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో బాగస్వాములు కావాలని తెలంగాణ ప్రజలకు కోదండరాం పిలుపునిచ్చారు.

**23 ఫిబ్రవరి 2014:**

హైదరాబాద్‌కు చేరుకున్న తెలంగాణ కాంగ్రెస్ నేతలు.

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో చేపట్టిన తెలంగాణ సాధన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1519వ రోజున విరమించారు.

**24 ఫిబ్రవరి 2014:**

శ్రీనివాస్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించిన తెలంగాణ డివిజనల్ అకౌంట్స్ అధికారులు. తెలంగాణ పునర్నిర్మాణంలో గెజిటెడ్ అధికారులు కీలకపాత్ర పోషిస్తారన్న శ్రీనివాస్‌గౌడ్.

తెలంగాణ జిల్లాల్లో సీమాంధ్రులు హాయిగా జీవించవచ్చునని, వారి పట్ల తమకెలాంటి వ్యతిరేక భావం లేదని టిఎన్జీవో అధ్యక్షుడు దేవిప్రసాద్ సచివాలయంలో విలేకరులతో అన్నారు.

**25 ఫిబ్రవరి 2014:**

ఉద్యోగుల విభజనకు సంబంధించి కేంద్రం అనుసరిస్తున్న మార్గదర్శకాలు ఆందోళనకరంగా ఉన్నాయని టిఎన్జీవో అధ్యక్షుడు దేవిప్రసాద్ అన్నారు.

**26 ఫిబ్రవరి 2014:**

హైదరాబాద్‌కు చేరుకున్న టిఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఘనంగా స్వాగతం

పలికిన తెలంగాణవాదులు. గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళులర్పించారు.

స్థానికత ఆధారంగా ఉద్యోగుల విభజన జరగాలని టిఎన్జీవో డిమాండ్ చేసింది.

పార్లమెంటు ఆమోదించిన తెలంగాణ బిల్లు న్యాయశాఖ తుది పరిశీలన తర్వాత బుధవారం హోంశాఖకు చేరింది.

**28 ఫిబ్రవరి 2014:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్ర కెబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి పదవికి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేయడం, ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటుకు అధికార కాంగ్రెస్ పార్టీ సిద్ధపడక పోవడంతో 41 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరోసారి కేంద్ర పాలనలోకి వెలుతుంది. జూన్ 2తో గడువు ముగియనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీని సుప్తచేతనావస్థలో వుంచాలని కూడా కేంద్ర కేబినెట్ నిర్ణయించింది.

కెసిఆర్ సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరిన టిడిపి ఎమ్మెల్యేలు మహేందర్‌రెడ్డి, రత్నం, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడిన కెసిఆర్ టిఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలా వద్దా అనే విషయంలో ప్రజల అభిప్రాయం మేరకే నడుచుకుంటానని ప్రకటించారు.

నాలుగున్న కోట్ల తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీకి కాంగ్రెస్ తరపున కృతజ్ఞతలు తెలిపేందుకు నల్లగొండ జిల్లా భువనగిరిలో నిర్వహించిన తొలి సభ భారీ సక్సెస్ అయింది. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో ఎంపీలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సరేష్‌షట్కార్, మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ సోనియా గాంధీని తెలంగాణ ప్రజల దేవతగా అభివర్ణించారు.

సీమాంధ్రకు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీతో తెలంగాణ పరిశ్రమకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని తెలంగాణ పారిశ్రామికవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య మండలుల సమాఖ్య (ఫ్యాప్సీ), తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య, అభివృద్ధి ఫోరంల ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి' అనే అంశంపై సదస్సు జరిగింది. తెలంగాణ పారిశ్రామిక వేత్తల ఫోరం అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఫాప్సీ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అధ్యక్షుడు ఎ.పి.కె. రెడ్డి, పెద్దపల్లి ఎం.పి. డా॥ జి. వివేకానంద, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కుమార్, పరిశ్రమల శాఖ మంత్రి జె. గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**01 మార్చి 2014:**

తెలంగాణ బిల్లుపై రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ప్రారంభం. గవర్నర్ చేతికి పాలనా బాధ్యతలు

టిజేఏసి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ పునర్నిర్మాణంలో

జేఏసి భాగస్వామి అవుతుందని కోదండరాం ప్రకటించారు. తెలంగాణ వ్యాప్తంగా విజయోత్సవ సభలు నిర్వహిస్తామని, విభజన సందర్భంగా జరిగే పంపకాలను పరిశీలించేందుకు సబ్‌కమిటీలను ఏర్పాటు చేస్తామని, జేయేసీ సభ్యుల్లో ఎవరైనా ఎన్నికల్లో పోటీచేసేందుకు వ్యక్తిగతంగా వారికున్న స్వేచ్ఛను జేయేసీ గౌరవిస్తుందని ఆయన స్పష్టం చేసారు.

భారతీయ జనతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్ (74) సికింద్రాబాద్‌లోని యశోద ఆసుత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు.

**02 మార్చి 2014:**

చట్టరూపం దాల్చిన తెలంగాణ బిల్లు, కేంద్ర హెూంశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన గెజిట్.

భద్రాచలం డివిజన్‌లోని ఏడు మండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రలో కలుపుతూ కేబినెట్ నిర్ణయం. సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న కేసీఆర్.

అమరుల బలిదానాలు సోనియాగాంధి హృదయాన్ని కదిలించాయని, సోనియా గాంధి పట్టుదలవల్లే తెలంగాణ బిల్లు ఆమోదం పొందిందని, నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన ఘనత సోనియాగాంధీదేనని పిసిసి మాజీ ఛీఫ్, ఎమ్మెల్సీ డి. శ్రీనివాస్ నిజామాబాద్ కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన సభలో అన్నారు.

ప్రజల క్షేమాన్ని, సుఖశాంతులను ఆకాంక్షిచేవారు బ్రాహ్మణులేనని, ప్రస్తుత కాలంలో బ్రాహ్మణులకు సమాజంలో సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం వుందని పౌరసరఫరాల శాఖ మాజీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన తెలంగాణ ఐక్యబ్రాహ్మణ రాజకీయ చైతన్య సదస్సులో మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మికాంతారావు, కటకం మృత్యుంజయం, నమస్తే తెలంగాణ సి.యం.డి లక్ష్మిరాజం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు కృషి జరగాలని రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డి) నేత చౌదరి జయంత్‌సింగ్ అన్నారు. పన్నెండు వందల మంది తెలంగాణ అమరవీరుల త్యాగాల వల్ల తెలంగాణ ఏర్పడిందని ఇక్కడి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన తెలంగాణ సామాజిక యుద్ధభేరి సభలో మాట్లాడుతూ అన్నారు. జమ్మూకాశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రొ॥ భీంసింగ్, ఎమ్మెల్సీ కపివాయి దిలీప్‌కుమార్, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ కో–చైర్మన్ విమలక్క, జేయేసీ కో–చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, ప్రొ॥ కేశవరావు జాదవ్, ప్రొ॥ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రం భౌగోళికంగా విడిపోయినా రెండు రాష్ట్రాల ప్రజలందరు మానసికంగా కలిసివుండాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 80వ దశకం ఫ్రెండ్స్ ఆఫ్ ఉస్మానియా యూనివర్శిటి ఆధ్వర్యంలో జరిగిన ఫోరం ఫర్ సోషల్ ఛేంజ్ సద

స్సులో వక్తలు పిలుపునిచ్చారు. గద్దర్, హరగోపాల్, ఘంటా చక్రపాణి, ప్రొ॥ భూమన్, అల్లం నారాయణ, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, నమస్తె తెలంగాణ సిఇఓ కట్టా శేఖర్‌రెడ్డి, టిఎన్‌జివో అధ్యక్షుడు దేవీ ప్రసాద్, జర్నలిస్టు రత్నమాల, ప్రొ॥ లక్ష్మణ్ తదితరులు మాట్లాడారు.

**03 మార్చి 2014:**

టిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పిన కేసీఆర్. టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ, లెజిస్లేచర్ పార్టీ, పొలిట్‌బ్యూరో, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం తెలంగాణ భవన్‌లో ఆరు గంటలపాటు సుదీర్ఘంగా జరిగింది. రానున్న ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తుల ప్రాతిపాదనపై చర్చించడానికి పార్టీ సెక్రెటరీ జనరల్ కె. కేశవరావు నేతృత్వంలో నాయిని నర్సింహారెడ్డి, ఈటెల రాజేందర్, బోయినపల్లి వినోద్‌కుమార్, కడియం శ్రీహరిలతో కూడిన ఐదుగురు సభ్యుల కమిటిని కె.సి.ఆర్. ఈ సందర్భంగా ప్రకటించారు.

రాష్ట్రంలోని పది నగర కార్పోరేషన్లు, 146 మున్సిపాలిటీలకు ఒకే విడతలో మార్చి 30వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో తెలంగాణలో 53 మున్సిపాలిటీలు, 1399 వార్డులున్నాయి. ఎన్నికల షెడ్యూలును రాష్ట్ర రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పి. రమాకాంత్‌రెడ్డి నేడు ప్రకటించారు. మార్చి 10న నామినేషన్ల స్వీకరణ మొదలు, 14న నామినేష్ల దాఖలుకు చివరి రోజు, 15న నామినేష్ల పరిశీలన, 18 వరకు ఉపసంహరణకు గడువు. 30న ఎన్నికలు. ఏప్రిల్ 1న అవసరమైన చోట్ల రీపోలింగ్.

**04 మార్చి 2014:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన అపాయింటెడ్ డే (రాష్ట్ర అవతరణ)ను కేంద్ర ప్రభుత్వం జూన్ 2గా ప్రకటించింది. 29వ రాష్ట్రంగా భారతదేశంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆరోజు నుండి ఉనికిలోకి వస్తుందని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. అవశేష ఆంధ్రప్రదేశ్‌కూ అదే ఆవిర్భావ తేది... ఎన్నికలు ముగియగానే రెండు ప్రభుత్వాలు ఏర్పాటు అవుతాయి.

ఎన్నికల్లో పోటీచేయడం తనకు చేతకాదని, ప్రభుత్వాన్ని మెడలు వంచి పనిచేయించడమే తమ కర్తవ్యమని తెలంగాణ జేయేసీ చైర్మన్ ప్రొ॥ కోదండరాం ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో జరిగిన సభలో స్పష్టం చేసారు.

**3 మార్చి 2014:**

సార్వత్రిక ఎన్నికల సమరానికి మోగిన నగారా .. దేశ వ్యాప్తంగా 81 కోట్ల ఓటర్లు ... 9 విడతలుగా పోలింగ్ .. 72 రోజుల పాటు కొనసాగనున్న ఎన్నికల ప్రక్రియ... ఏప్రిల్ 7, 9, 10, 12, 17, 24, 30, మే 7, 12 తేదీలలో పోలింగ్... మే 16న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి. భారతదేశంలో మొట్టమొదటి సారిగా "నోటా" అమలు ఈ ఎన్నికల నుండి అమలు చేస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం

సిఈసి సంపత్ ప్రకటించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు విడతలుగా పోలింగ్. తెలంగాణలో ఏప్రిల్30, సీమాంధ్రలో మే 7. ఎన్నికలు ముగిసాక, ఫలితాల తర్వాత రెండు రాష్ట్రాలకు వేర్వేరు అసెంబ్లీలు ఏర్పాటు.

తెలంగాణ రాష్ట్రంలో 17 లోకసభ, 119 అసెంబ్లీ స్థానాలకు 7వ విడత పోలింగ్... ఏప్రిల్ 2న నోటిఫికేషన్ విడుదల... ఏప్రిల్ 9 వరకు నామినేషన్ల దాఖలు, ఏప్రిల్ 10న నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 12 వరకు ఉపసంహరణ గడువు, ఏప్రిల్ 30న పోలింగ్, మే 16 ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి.

**6 మార్చి 2014:**

హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండులో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో "తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సదస్సు" రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. జేయేసీ చైర్మన్ కోదండరాంతో పాటు బిజెపి ఉద్యమ కమిటి చైర్మన్ డా॥ టి. రాజేశ్వర్‌రావు, బిజెపి సీనియర్ నాయకులు బండారు దత్తాత్రేయ, నాగం జనార్ధన్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, అశోక్‌కుమార్ యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎస్. కుమార్, జేయేసీ నాయకులు మల్లెపల్లి లక్ష్మయ్య, రాజేందర్‌రెడ్డి, పిట్టల రవీందర్, అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

**7 మార్చి 2014:**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును కోర్టుల్లో అడ్డుకుంటామని భీషణ ప్రతిజ్ఞలు చేసిన సమైక్యవాదులకు సర్వోన్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. రాష్ట్ర విభజనపై స్టే ఇవ్వలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జూన్ 2న ఏర్పాటు కానున్న తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకోవాలని సీమాంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు దాఖలు చేసిన అభ్యర్థనలను సుప్రీంకోర్టు తిరస్కరించింది.

ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఆధునిక కాలానికి అనుగుణమైన కొత్త ఆలోచనలు చేయాలని కేంద్ర సమాచార శాఖా మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి సూచించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్, డెమోక్రసీ డయలాగ్స్ సంస్థలు సంయుక్తంగా "21వ శతాబ్దంలో ప్రజాస్వామ్యం – సామ్యవాదం – దృక్కోణాలు" అనే అంశంపై నేడు ఇక్కడ ప్రారంభమయిన నాలుగు రోజుల అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి, వెనిజులా సామాజిక శాస్త్రవేత్త మార్తా హెర్నేకర్, ఆర్థికవేత్త అమియాకుమార్ బాగ్చీ, ప్రజాగాయకుడు గద్దర్, విమలక్క, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపల్లి లక్ష్మయ్య ప్రారంభ సమావేశానికి అధ్యక్షత వహించారు.

**9 మార్చి 2014:**

ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో సమైక్య కుట్రలపై కలాలను ఝుళిపించి

గళాలను వినిపించిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియూడబ్ల్యూజె)గా ఆవిర్భవించింది. హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన "జర్నలిస్టుల జాతర" సందర్భంగా పది జిల్లాల నుంచి వేల సంఖ్యలో హాజరైన తెలంగాణ పాత్రికేయుల సమక్షంలో టిఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు టియూడబ్ల్యూజె లోగోను ఆవిష్కరించారు. ఎవరి ఆధిపత్య పీఠాలు కదిలినా తమకు సంబంధం లేదని, తెలంగాణ ప్రజల కోసం అంకితమై పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అవుతామని సభకు అధ్యక్షత వహించిన అల్లం నారాయణ ప్రకటించారు.

**10 మార్చి 2014:**

స్థానిక సంస్థల్లో భాగమైన జిల్లాపరిషత్, మండల పరిషత్తు, జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలు ఏప్రిల్ 6న, పార్టీల ప్రాతిపదికన ఒకే విడతలో నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు 50,907 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. 22 జిల్లా పరిషత్తు, 1096 మండల పరిషత్తు, 1096 జెడ్పీటిసీ, 16,589 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 17న ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. జిల్లాల్లో నోటిఫికేషన్ విడుదల మార్చి 17న, నామినేషన్ల దాఖలు గడువు మార్చి 20వరకు, నామినేషన్ల పరిశీలన మార్చి 21న, ఉపసంహరణ గడువు మార్చి 24 వరకు, పోలింగ్ ఏప్రిల్ 6, రీపోలింగ్ (అవసరమైన చోట్ల) ఏప్రిల్ 7 ఉంటుదని ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

తెలంగాణ విక్టరీ, విజన్ డాక్యుమెంట్లకు రూపకల్పన చేసేందుకు తెలంగాణ జేయేసీ చైర్మన్ కోదండరాం ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసారు. తెలంగాణ పునర్నిర్మాణం, అభివృద్ధి, ఆదివాసీ హక్కుల పరిరక్షణ, విద్యుత్తు, నీటిపారుదల తదితర రంగాల్లో తీసురావాల్సిన మార్పులు, సమస్యల పరిష్కార మార్గాలపై చర్చించి నివేదికలను రూపొందించే బాధ్యతలను జేయేసీ కో-చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్యకు అప్పగిస్తూ నేడు ఇక్కడ జరిగిన జేయేసీ స్టీరింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రానికి దళితునికే ముఖ్యమంత్రి పదవిని అప్పగిస్తామని, ఎన్నికల పొత్తులపై అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుందని, ఏ పార్టీతో పొత్తులేకున్నా స్వతంత్రంగా గెలిచే సత్తా కాంగ్రెస్ పార్టీకి వుందని కేంద్ర మంత్రి జైరాం రమేష్ వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటులో తెలంగాణ బిల్లు సాధించిన విషయంలో టిఆర్ఎస్ పార్టీకి ఎలాంటి పాత్రలేదని, తెలంగాణ జేయేసీ నాయకులకు రానున్న ఎన్నికల్లో పార్టీ టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తామని ఆయన అన్నారు.

**11 మార్చి 2014:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షునిగా మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యను ఏఐసిసి ప్రతినిధులు నేడు ఢిల్లీలో ప్రకటించారు. టిపిసిసి కార్యనిర్వాహక

అధ్యక్షునిగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రచారకమిటి చైర్మన్‌గా దామోదర రాజనర్సింహ, మేనిఫెస్టో కమిటి చైర్మన్‌గా దుద్దిల్ల శ్రీధర్‌బాబులతో పాటు 23 మంది సభ్యులతో ఎన్నికల కమిటీని ఎఐసిసి ప్రకటించింది.

ఇచ్చిన మాట మేరకు తెలంగాణను తెచ్చామని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్  హైదరాబాద్ నిజాం కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన సభలో అన్నారు.

కొత్త రాష్ట్రంలో ఆర్టీసి పూర్వవైభవం పొందుతుందని, సంస్థ లాభాల బాటలో నడుస్తుందని ఇందుకోసం ఆర్టీసిని తెలంగాణ ప్రభుత్వంలో విలీనం చేయాలని కోదండరాం డిమాండ్ చేసారు. తెలంగాణ ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్ల సంఘం ఆధ్వర్యంలో "తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఆర్టీసీ పాత్ర" అంశంపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల  సంఘం భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు అశ్వత్థామరెడ్డి, థామస్‌రెడ్డి, టిజిఓ చైర్మన్ వి. శ్రీనివాస్‌గౌడ్, టిఎన్‌జివో అధ్యక్షుడు జి. దేవిప్రసాద్, ప్రధాన కార్యదర్శి కారం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణాలోని అమరవీరుల కుటుంబాలను ఆదుకునేందుకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం తరపున ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందజేస్తామని గెజిటెడ్ అధికారుల సంఘం చైర్మన్ వి. శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాలు ప్రపంచంలోనే ఎక్కడా జరగలేదని, ఉద్యమానికి ఊతమిచ్చి రాష్ట్రానికి పట్టంగట్టిన ఘనత కళాకారుల పాటలకే దక్కిందని జేయేసీ చైర్మన్ కోదండరాం అన్నారు. నల్గొండ జిల్లా సూర్యపేటలోని గాంధీ పార్కులో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 5వ రాష్ట్ర మహాసభలు రాష్ట్ర అధ్యక్షుడు పి. నాగన్న అధ్యక్షతన జరిగాయి. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, జిల్లా జేయేసీ చైర్మన్ జి. వెంకటేశ్వర్లు, విద్యావంతుల వేదిక నాయకులు ధర్మార్జున్  తదితరులు పాల్గొన్నారు,

**12 మార్చి 2014:**

తెలంగాణాలోని మేధావులు, విద్యావంతులు, ఆలోచనాపరులు, ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఉద్యమకారులు రాజకీయాల్లోకి రావాలని, ప్రభుత్వంలో భాగస్వామ్యం కావాలని టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఆహ్వానించారు. ఆయన నివాసంలో జేయేసీ చైర్మన్ కోదండరాం, టిఎన్‌జివో అధ్యక్షుడు జి. దేవీప్రసాద్‌లు ప్రత్యేకంగా కెసిఆర్‌ను కలిసినపుడు ఆయన ఈ వాఖ్యలు చేసారు. తెలంగాణ పునర్నిర్మాణంలో జేయేసీ బాధ్యత ఇంకా పూర్తిచేసుకోవాల్సి వుందని, అందువల్ల ఎన్నికల్లో తాను పోటీ చేయలేనని తన మీద నమ్మకంతో తనకు సీటు కేటాయిస్తానని ప్రకటించినందుకు కెసిఆర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కోదండరాం ప్రకటించారు. ఉద్యమంలో

కీలక బాధ్యతలు నిర్వహించిన తెలంగాణ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన అవసరం ఉందని, ఉద్యోగుల పంపిణీలో రానున్న కాలం అత్యంత కీలకమని అందువల్ల తాము ఎన్నికలలో పాల్గొనేందుకు సిద్ధంగా లేమని టిఎన్‌జివో అధ్యక్షుడు జి. దేవీప్రసాద్ స్పష్టం చేసారు.

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజమండ్రిలోని జెమినీ గార్డెన్స్‌లో జరిగిన బహిరంగ సభలో "జై సమైఖ్యాంధ్ర పార్టీ" ని ప్రకటించారు.

**14 మార్చి 2014:**

భారతదేశం నుండి కాంగ్రెస్ పార్టీని సమూలంగా తరిమికొట్టాలని హైదరాబాద్ లోని హైటెక్ సిటి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో సినీ హీరో పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు మేం ఎందుకు క్షమాపణ చెప్పాలని, తెలంగాణ జాగృతి వసూళ్ల వ్యవహారంపై జాగృతి అధ్యక్షురాలు కవిత లెక్కలు చెప్పాలని, నా మూడు పెళ్లిల్ల గురించి మాట్లాడే వారు... ఒక్క పెళ్లి చేసుకొని ముప్ఫైమందితో తిరగవచ్చా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటుకు తాను అనుకూలమే అయినప్పటికి రాష్ట్రాన్ని విభజించిన తీరుపై అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో సచివాలయ జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని టియూడబ్ల్యూజె అధ్యక్షుడు, నమస్తే తెలంగాణ ఎడిటర్ అల్లం నారాయణ అన్నారు. టియూడబ్ల్యూజె సచివాలయ శాఖ ఆవిర్భావ సదస్సు సెక్రెటేరియట్‌లోని జె–బ్లాకులో జరిగింది. ఈ సదస్సులో సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పద్మాచారి, టియూడబ్ల్యూజె రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లె రవికుమార్, నేతలు రమేశ్ హజారే, యం.వి. రమణ, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, సీనియర్ జర్నలిస్టులు పి.వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**15 మార్చి 2014:**

రాజేంద్రనగర్‌లో తెలంగాణ న్యాయవాదుల జేయేసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ సభ ఘనంగా జరిగింది. తెలంగాణ జిల్లాల నుండి న్యాయవాదులు పెద్దఎత్తున సభకు తరలివచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ న్యాయవాదుల జేయేసీ కన్వీనర్ రాజేందర్‌రెడ్డిని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. అరుణోదయ కళాకారులు తమ ఆటపాటలతో స్ఫూర్తినింపారు, పాటలకు అనుగుణంగా న్యాయవాదులు నృత్యం చేసారు. ఉద్యమంలో న్యాయవాదులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, తెలంగాణాలోని న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని సభలో మాట్లాడిన వక్తలు కోరారు.

**16 మార్చి 2014:**

తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక పది రోజుల్లో సిద్ధమౌతుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక కమిటి చైర్మన్ దుద్దిల్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్

మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్నికల ప్రణాళిక రూపకల్పనలో భాగంగా తెలంగాణ జేయేసీ నాయకులు, పార్టీకి చెందిన ఎస్టీ, మైనార్టీ, ఓబీసీ నాయకులతో సమావేశ మయ్యారు.

ప్రజల కోసం త్యాగాలు చేసిన వారితో తెలంగాణ తొలి ప్రభుత్వం ఏర్పాటు కావాలని తెరాస శాసనసభాపక్ష నేత ఈటెల రాజేందర్ ఆకాంక్షించారు. తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద జరిగిన “తెలంగాణ ఉపాధ్యాయ భేరి” సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం జరుగుతున్న దశలో అధికారం అనుభవించిన వాళ్లే తిగిరి అధికారంలోకి వస్తే, పోరాటాలు చేసిన ప్రజల ఆకాంక్షలు నెరవేరవని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. న్యూడెమోక్రసీ నేత కె. గోవర్ధన్, ప్రజాగాయకుడు గద్దర్, టఫ్ నాయకురాలు విమలక్క, టిటిఎఫ్ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా అధికారంలోకి రాబోయే ప్రభుత్వం ప్రపంచంలోనే ఎత్తైన అమరవీరుల స్థూపాన్ని హైదరాబాద్‌లో నిర్మించాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. విఠల్ వికారాబాద్ పట్టణంలో జరిగిన ‘ఉద్యోగుల డైరీ’ ఆవిష్కరణ సభలో కోరారు.

తెలంగాణ రాష్ట్ర సమితి చెపుతున్న తెలంగాణ పునర్నిర్మాణం అంటే... గడీల నిర్మాణమేనని కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటి అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ విమర్శించారు. తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు, తెలంగాణ జేయేసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, ఓయు జేయేసీ నాయకుడు శశాంక్‌లను పార్టీ కండువా కప్పి ఆయన కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చినందుకు కృతజ్ఞతగానే తాను కాంగ్రెస్‌లో చేరానని అద్దంకి దయాకర్ ఈ సందర్భంగా చెప్పారు.

యుద్ధం చేసేవాళ్లకే కత్తి ఇవ్వాలని, తెలంగాణ కోసం పనిచేసే, తెలంగాణ అభివృద్ధి కోసం కొట్లాడే పార్టీకే తెలంగాణ ప్రజలు ఓటు వేయాలని తెరాస అధ్యక్షుడు కెసిఆర్ విజ్ఞప్తి చేసారు. గాడిదలకు గడ్డివేసి ఆవుల దగ్గర పాలు పిండితే ఉపయోగం వుండదని, తెరాస నిఖార్సయిన తెలంగాణ పార్టీయని స్పష్టంచేసారు. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు, జేయేసీ కో–చైర్మన్ వి. శ్రీనివాస్‌గౌడ్, ‘తెలంగాణ ధూంధాం’ వ్యవస్థాపకుడు రసమయి బాలకిషన్ టిఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కెసిఆర్ మాట్లాడారు.

**17 మార్చి 2014:**

ఖమ్మం జిల్లా వైఎస్ఆర్సీపి కీలక నేత జలగం వెంకట్రావు, కరీంనగర్ జిల్లా మంథని నియోజవర్గానికి చెందిన పుట్ట మధు కేసీఆర్ సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు.

**18 మార్చి 2014:**

వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళితో పాటు మాజీ డిజిపి జయచంద్రారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన కాంగ్రెస్, టిడిపి నేతలు జగదీశ్వర్‌రెడ్డి, కోదండరాంరెడ్డి, బుచ్చిరెడ్డి, సత్తార్‌ఖాన్ తదితరులు కెసిఆర్ సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు.

జూన్ 1వ తేదీ అర్థరాత్రే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఖాతాలు, ఆర్థిక లావాదేవీలన్నీ మూసి వేయాలని కేంద్ర హెూంశాఖ కార్యదర్శి అనిల్‌గోస్వామి ఆదేశించారు. రెండు రాష్ట్రాలకు ఆ రోజునుండే వేర్వేరు ఖాతాలు అమలులోకి తేవాలని సూచించారు.

**19 మార్చి 2014:**

పోలవరం ప్రాజెక్టు డిజైన్ మార్చాల్సిందేనని, డిజైన్ మార్చకపోతే పోలవరం ప్రాజెక్టు కట్టనిచ్చేదిలేదని, పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే ఏడు మండలాలు తెలంగాణలోనే వుంచాలని, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ప్రస్తుతం ఇంటర్‌వెల్ మాత్రమేనని రాష్ట్ర పునర్నిర్మాణమే క్లైమాక్స్‌గా వుండబోతున్నదని టిఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్‌రావు తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో అన్నారు.

**20 మార్చి 2014:**

పోలవరం ప్రాజెక్టు కింద ఏడు మండలాలు సీమాంధ్రలో కలుపుతూ కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు నిరసనగా, ఈ ఏడు మండలాలను తెలంగాణ రాష్ట్రంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా కుక్కనూరు మండలంలో పోలవరం ముంపుప్రాంత రక్షణ కమిటి ఆధ్వర్యంలో ప్రాదేశిక ఎన్నికలను బహిష్కరించారు. నామినేషన్ల గడువు ముగిసినప్పటికి ఈ మండలంలో ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు.

**22 మార్చి 2014:**

ఎంతో మంది అమరుల త్యాగాల పునాదులపైన ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో బడుగుబలహీన, దళిత, మైనార్టీ, ఆదివాసీ, వెనుకబడిన తరగుతులకు విధాన నిర్ణయాలలో, పరిపాలనలో భాగస్వామ్యం కల్పించాలని తెలంగాణ జేయేసీ చైర్మన్ కోదండరాం డిమాండ్ చేసారు. కాకతీయ విశ్వవిద్యాలయం పరిశోధకుల సంఘం వరంగల్‌లో నిర్వహించిన తెలంగాణ సదస్సులో కోదండరాం మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజలను మోసం చేసే రాజకీయ శక్తుల పట్ల తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇందుకోసం గ్రామస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించడానికి విద్యార్థులు ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. "తెలంగాణ రాష్ట్రం సమస్యలు-సవాళ్లు-విశ్వవిద్యాలయాల పాత్ర" అనే అంశం ఇక్కడ జరిగిన చర్చావేదికలో తెలంగాణ రాజకీయ విశ్లేషకులు వి. ప్రకాశ్, ప్రొ॥ ఘంటా చక్రపాణి, డాక్టర్ సి. ఖాసీం, ప్రొ॥ సీతారాం నాయక్, ప్రొ॥ కె.సీతారామారావు, ప్రొ॥ పి.సాంబయ్య, ప్రొ॥ సి.హెచ్. దినేష్‌కుమార్, డా॥ వీసం నారాయణ, పరిశోధకుల సంఘం అధ్యక్షుడు సి.హెచ్.

శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

"తెలంగాణ కోసం ఉద్యమించినవారిని వదిలేసి, గెలుపు గుర్రాల పేరిట ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి టికెట్లు కేటాయిస్తారా? మరి ఉద్యమకారులు ఏం కావాలి. టిఆర్ఎస్‌లోకి ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి ఇస్తున్న ప్రాధాన్యం తెలంగాణ ఉద్యమకారులను బాధపెడుతున్నది. మానుకోటలో ఉద్యమకారులపై దాడులు చేయించిన కొండా దంపతులను పార్టీలో చేర్చుకొని, వారికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు ఇస్తారా? తాండూరులో ఉద్యమకారులపై దాడులు జరిపి, టిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లాంటి వారు పార్టీలోకి ఎందుకు? తెలంగాణ ఉద్యమంతో సంబంధంలేని వారిని ఎన్నికల్లో నిలబెడితే సంక్షోభం వస్తుంది" అని టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌ను ఉద్దేశించి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు డాక్టర్ చెఱుకు సుధాకర్ ఘాటైన వ్యాఖ్యలు చేసారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం తన అనుచరులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**23 మార్చి 2014:**

"మనం ఎన్నుకున్న ప్రభుత్వం ఎంతమంచిదైనా మనల్ని మర్చిపోదని నమ్మకమేంటి? దీన్ని దృష్టిలో వుంచుకునే బయట వుండి ఈ ప్రభుత్వాలకు వాటి బాధ్యతలను గుర్తుచేయాల్సిన అవసరం సంఘాలకు వుంది. నిన్న మొన్నటి వరకు కేసులు పెట్టించినవాళ్లే జెండాలు మార్చుకొని వస్తున్నారు. దీని వల్ల అనుమానాలు మరింత బలపడుతున్నాయని" తెలంగాణ జేయేసీ చైర్మన్ కోదండరాం ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఆర్టీసీ ఎస్టీ, ఎస్సీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు.

వచ్చే ఎన్నికల్లో మెదక్ జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం స్థానం నుండి టిఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

దేశవ్యాప్తంగా వివిధ జైళ్లలో సుదీర్ఘ కాలంగా శిక్ష అనుభవిస్తున్న రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలని కమిటి ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సిఆర్‌పిపి), దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పిడిఎం)లు సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడిన వక్తలు డిమాండ్ చేసారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 83వ వర్ధంతిని పురస్కరించుకొని మార్చి 23 నుండి 29 వరకు 'రాజకీయ ఖైదీల హక్కుల పోరాటం వారం'గా నిర్వహిస్తున్న ఆ సంస్థలు, అందులో భాగంగా ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు.

**24 మార్చి 2014:**

తెలంగాణ టిడిపి ఎన్నికల కమిటి అధ్యక్షునిగా ఎల్.రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎర్రబెల్లి దయాకర్‌రావు, కన్వీనర్‌గా మోత్కుపల్లి నర్సింహులు, అడ్వైజర్‌గా టి. దేవేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా రమేశ్‌రాథోడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నామా నాగాశ్వర్ రావు, మేనిఫెస్టో కమిటి కన్వీనర్‌గా రావుల

చంద్రశేఖర్ రెడ్డిలను పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తన నివాసంలో మీడియాకు వెల్లడించారు.

**27 మార్చి 2014:**

పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అనంతరమే జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికల ఫలితాలను వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశాలను జారీ చేసింది.

తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటి (జేయేసీ) నాయకులకు ఎన్నికల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉద్యమానికి సారధ్యం వహించిన వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇస్తే అన్ని వర్గాలకు గుర్తింపు ఇచ్చినట్లవుతుందని ఆ పార్టీ భావిస్తున్నది. ఈ మేరకు జేయేసీ నేతలు కూడా కొందరు టికెట్ల కోసం ప్రయత్నిస్తుండగా, మరికొందరు ఎన్నికలకు దూరంగా ఉంటామని ప్రకటించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు మల్లెపల్లి లక్ష్మయ్యను పెద్దపల్లి లోకసభ స్థానం నుండి బరిలోకి దింపాలని భావించిన కాంగ్రెస్ ఆ దిశగా చర్చలు కూడా జరిపింది. అయితే ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశ్యంగాని, ఆసక్తిగాని తనకు లేదని మల్లెపల్లి లక్ష్మయ్య కాంగ్రెస్ నాయకులకు స్పష్టం చేసినట్లు సమాచారం.

**28 మార్చి 2014:**

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్‌లో పార్టీ కండువా కప్పుకొని తెలుగుదేశంలో చేరారు. తెలంగాణ తెలుగు దేశం పార్టీ ప్రచార కమిటి బాధ్యతలను ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు కృష్ణయ్యకు అప్పగించారు.

మల్కాజిగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, మెదక్ జిల్లా జగ్దేవ్‌పూర్ మండలం ఎర్రవెల్లిలోని కెసిఆర్ ఫాంహౌజ్‌లో కెసిఆర్‌ను కలిసి టిఆర్ఎస్ పార్టీలో చేరారు.

**29 మార్చి 2014:**

గతంలో ఏ పార్టీలు కూడా ప్రజలకు చేయని విధంగా ఎన్నికల మేనిఫెస్టోను రూపొందిస్తున్నామని, కొత్తరాష్ట్రం, కొత్తనాయకత్వం, సరికొత్త పంథాలో తమ మేనిఫెస్టో వుంటుందని టిఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు ప్రకటించారు.

**30 మార్చి 2014:**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో భారీగా 78 శాతం పోలింగ్ నమోదయ్యింది.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో రాజకీయ పార్టీలకు సూచిస్తూ తెలంగాణ జేయేసీ హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో "ప్రజా మేనిఫెస్టో"ను ప్రకటించింది. అభివృద్ధి సాధించినపుడే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం నెరవేరుతుందని, లక్ష్య సాధన దిశగా ఏంచేయాలో వివరిస్తూ రూపొందించిన 16 అంశాల నివేదికను జేయేసీ విడుదల చేసింది.

రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా మల్కాజిగిరి పార్లమెంటు స్థానం నుండి పోటీ చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ కె. నాగేశ్వర్ ప్రకటించారు. తనకు ఓటు వేయడంతో పాటు 10 రూపాయలు విరాళంగా ఇచ్చి ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించాలని కోరారు.

**31 మార్చి 2014:**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చింది ముఖ్యమంత్రి పోస్టు కోసం కాదని, దారిద్ర్య రేఖకు దిగువనవున్న పేదల బతుకులను బాగుచేసేందుకేనని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి. వెంకటస్వామి అన్నారు. కెసిఆర్ పదేపదే ప్రకటిస్తున్నట్లుగా తెలంగాణ ఉద్యమం పన్నెండేళ్లనాటిది కాదని, అరవై ఏండ్లుగా నడుస్తున్నదని, ఎంతో మంది అమరవీరుల త్యాగాలవల్లనే ఇది సిద్ధించిందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సోనియా గాంధీ వల్లనే జరిగిందని, వెయ్యిమంది కెసిఆర్‌లు వచ్చినా అది సాధ్యపడేది కాదని కాంగ్రెస్ సీనియర్ నేత యం. సత్యనారాయణ రావు అన్నారు. కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు పొన్నం ప్రభాకర్ లోకసభలో మాట్లాడిన ప్రసంగాలతో రూపొందిన 'నా తెలంగాణ–నా ప్రజలు' పుస్తకాన్ని హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. మాజీ స్పీకర్ కె.ఆర్. సురేష్‌రెడ్డి, రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, జేయేసీ చైర్మన్ ప్రొఫెసర్ యం. కోదండరాం, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి నియోజకవర్గ పార్లమెంటు సభ్యుడు డా॥ జి. వివేక్, ఆయన సోదరుడు మాజీ మంత్రి జి. వినోద్ సోనియాగాంధీ సమక్షంలో న్యూఢిల్లీలోని ఆమె నివాసంలో కలిసి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**01 ఏప్రిల్ 2014:**

అధికారం చేపట్టాక రాజకీయ అవినీతిని పూర్తిగా అంతం చేస్తానని,ఈ దిశగా అవినీతికి పాల్పడితే స్వంత కొడుకైనా, కూతురినైనా జైలుకు పంపిస్తానని మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన భారీ బహిరంగసభలో టిఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఇంతకాలం రాజకీయనాయకులు బొక్కిన అక్రమ నిధులను విచారణ జరిపి కక్కిస్తానని హామీఇచ్చారు. నెల రోజుల తర్వాత తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, కొత్త ప్రభుత్వంలో అవినీతికి తావులేదని అన్నారు.

మున్సిపల్ ఎన్నికల ఫలితాలను ఏప్రిల్ 9వ తేదీన లెక్కించి ఫలితాలు ప్రకటించాలని హైకోర్టు ఆదేశించింది.

**02 ఏప్రిల్ 2014:**

రాష్ట్రంలో తొలిదశ సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ నేడు విడుదలయ్యింది. తెలంగాణలోని 17 పార్లమెంటు, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీచేసే అభ్యర్థుల నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు.

"తెలంగాణను అభివృద్ధి చేసింది నేనేనని, నేను లేఖ ఇవ్వడంవల్లనే కేంద్రం

తెలంగాణ ఇచ్చిందని, తెలంగాణ గడ్డను వదిలిపెట్టి వెళ్లేది లేదని, తెలంగాణలో సామాజిక న్యాయం కోసం బిసిని ముఖ్యమంత్రిని చేయడాన్ని సవాలుగా తీసుకున్నానని" వరంగల్‌లో జరిగిన 'ప్రజాగర్జన' సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

**03 ఏప్రిల్ 2014:**

తనపై హత్యాయత్నం జరిగి 17ఏండ్లు కావస్తున్నప్పటికి దాడిచేసిన వారిని ఇంతవరకు పట్టుకోలేదని ప్రజాగాయకుడు గద్దర్ రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. 1997 ఏప్రిల్ 6న గ్రీన్‌టైగర్స్ పేరుతో కొందరు అగంతకులు గద్దర్‌పై కాల్పులు జరిపారు.

**04 ఏప్రిల్ 2014:**

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ నుండి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయనున్న 69 మంది అభ్యర్థులతో తెలంగాణ రాష్ట్ర సమితి తొలిజాబితాను నేడు విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో ప్రజల అభిప్రాయం మేరకే ఒంటరిగా పోటీచేస్తున్నామని కెసిఆర్ ప్రకటించారు. టిఆర్ఎస్ ప్రకటించిన టికెట్లలో ఓసీలకు 32, బిసిలకు 16, రిజర్వు స్థానాల్లో ఎస్సీ, ఎస్టీలకు 20 సీట్లు, మైనార్టీలకు 1 స్థానం వున్నాయి.

వైఎస్ఆర్‌సిపికి చెందిన బాజిరెడ్డి గోవర్ధన్ (నిజామాబాద్), సిపిఐకి చెందిన వైరా ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు కెసిఆర్ నివాసంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను కెసిఆర్ విడుదల చేసారు.

సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా నిలవాలని, సోనియాగాంధీకి కృతజ్ఞ తను చాటుకోవాలని పిసిసి మాజీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్ (డిఎస్) తెలంగాణ జేయే సీ నాయకులను కోరారు. తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కెసిఆర్ వ్యవహార శైలి వల్ల కొత్త రాష్ట్రంలో రాజకీయంగా గందరగోళ పరిస్థితి ఏర్పడే ప్రమాదముందని, దీనిని నివారించేందుకు సహకరించాలని అన్నారు. జేయేసీ చైర్మన్ కోదండరాం, ఇత ర నేతలు సి.విఠల్, రాజేందర్‌రెడ్డి తదితరులతో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన నివాసంలో డి.శ్రీనివాస్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణ ఏర్పాటుకు కారణమయిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవడం ఈ ప్రాంత ప్రజల బాధ్యతని, ఆమెకు రాజకీయ, నైతిక మద్ధతు ఇవ్వాల్సిన అవసరం ఉందని డిఎస్ కోరారు.

**05 ఏప్రిల్ 2014:**

అఖిల భారత కాంగ్రెస్ కమిటి తెలంగాణలోని 16 లోక్‌సభ, 110 అసెంబ్లీ స్థానాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం లోకసభ స్థానాన్ని సిపిఐకి కేటాయించేందుకు రిజర్వులో ఉంచారు.

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టియూడబ్ల్యూజె) ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్‌దప్రెస్ కార్యక్రమంలో జేయేసీ చైర్మన్

కోదండరాం మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన జూన్ 30 తర్వాత మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలను సమీక్షించ వలసిన అవరముందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐజేయు సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్, మాజీ సెక్రెటరీ జనరల్ కె. శ్రీనివాస్‌రెడ్డి, టియూడబ్ల్యూజె అధ్యక్షుడు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలి తదితరులు పాల్గొన్నారు.

**06 ఏప్రిల్ 2014:**

రాష్ట్ర వ్యాప్తంగా జెడ్పీటీసీ, ఎంపిటీసీలకు జరిగిన తొలివిడత ఎన్నికలు చెదురుమొదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసాయి. ఈ ఎన్నికల్లో 80 శాతానికిపైగా ఓటింగ్ నమోదయ్యింది.

తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ మధ్య ఎట్టకేలకు సార్వత్రిక ఎన్నికలకు పొత్తు ఖరారైంది. ఈ పొత్తుతో ఎన్‌డిఎలోకి తెలుగు దేశం పార్టీ మరోసారి చేరుతున్నట్లయ్యింది. తెలంగాణలో బిజెపికి 8 పార్లమెంటు స్థానాలు, 47 అసెంబ్లీ స్థానాలు ఇస్తున్నట్లు టిడిపి నేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

**07 ఏప్రిల్ 2014:**

తెలంగాణలో అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘ కసరత్తు చేసిన కాంగ్రెస్ 111 స్థానాలకు జాబితాను ప్రకటించింది. నామినేషన్ల గడువుకు కేవలం మరో రెండు రోజుల సమయం ఉందనగా జాబితాను వెల్లడించింది. మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో సిపిఐతో అవగాహనకు వచ్చిన సీట్లను వదిలిపెట్టి మిగిలిన స్థానాల్లో (కోదాడ) మినహా) తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఈ జాబితా ప్రకారం సిపిఐకి 7 అసెంబ్లీ స్థానాలు కేటాయించినట్లు స్పష్టమవుతున్నది. 8 మంది సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. వీరిలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శంకర్రావులు కూడా ఉన్నారు. మొత్తంమీద 45 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు లభించాయి.

**08 ఏప్రిల్ 2014:**

తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మెదక్ జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు, మెదక్ లోకసభ స్థానానికి కూడా పోటీచేయనున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది.

నల్లగొండ జిల్లాకు చెందిన సిపిఎం పార్టీ శాసనసభ పక్షనేత నోముల నర్సింహయ్య కెసిఆర్ సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరారు.

**09 ఏప్రిల్ 2014:**

భారతీయ జనతాపార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఆలె నరేంద్ర (68) తీవ్ర అనారోగ్యంతో నాంపల్లి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు.

మెదక్ లోక్‌సభ, గజ్వేల్ శాసనసభ నియోజకవర్గాలకు టిఆర్ఎస్ అధినేత కె.

చంద్రశేఖర్‌రావు నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా అఫిడవిట్‌లో ఆస్తి – అప్పుల వివరాలు వెల్లడించారు. స్వార్జిత ఆస్తుల విలువ 8 కోట్ల 65 లక్షలు కాగా, రుణాలు 7 కోట్ల 87 లక్షలున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చేతిలో వున్న డబ్బు రూ.9.90 లక్షలు అయితే, ఆయా బ్యాంకుల్లో మొత్తం రూ.44,66,327 నగదు ఉన్నట్లు తెలిపారు. జగ్‌దేవ్‌పూర్ మండలంలోని ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో మొత్తం 37.7 ఎకరాల భూమి తన పేరున ఉందని, దీని ప్రస్తుత మార్కెట్ విలువ 4.05 కోట్లుగా తెలిపారు.

**11 ఏప్రిల్ 2014:**

రాష్ట్ర వ్యాప్తంగా తుదిదశ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ చెదురుముదురు సంఘటనలు మినహా నేడు ప్రశాంతంగా ముగిసాయి. దాదాపు 85 శాతం పోలింగ్ నమోదయ్యింది.

**12 ఏప్రిల్ 2014:**

టిఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు డా॥ దాసోజు శ్రవణ్‌కుమార్ గాంధీభవన్‌లో కేంద్ర మంత్రి జైరాం రమేశ్, టిపిసిసి అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

**13 ఏప్రిల్ 2014:**

తెలంగాణ రాష్ట్ర సమితి నూటికి నూరు శాతం సెక్యులర్ పార్టీయని, ఎట్టిపరిస్థితిలోనూ ఎన్డీయే కూటమిలో చేరే ప్రసక్తేలేదని, మతతత్వ పార్టీలతో చేతులు కలుపబోమని, కాంగ్రెస్‌వాళ్లతో కలుపొద్దని చెప్పింది తెలంగాణ సమాజమేనని టిఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో టిఆర్ఎస్ ఎన్నికల శంఖారావం బహిరంగ సభలో ప్రసంగించారు.

రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ జేయేసీ స్టీరింగ్ కమిటి సమావేశాలకు జేయేసీ భాగస్వాములుగా వున్న రాజకీయ పార్టీలను ఆహ్వానించ బోమని తెలంగాణ జేయేసీ స్టేట్ కో–ఆర్డినేటర్ పిట్టల రవీందర్ తెలిపారు.

ప్రజల సంక్షేమం కోసం ఉపయోగపడేరీతిలోనే మౌళిక సదుపాయాల కల్పనకు ప్రతి ఒక్కరు ఉద్యమించాలని, మార్కెట్ మాయా ప్రపంచంలో కొట్టుకపోవద్దని విప్లవ కవి వరవరరావు పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన డిటిఎఫ్ జిల్లా విద్యా మహాసభలో ఆయన పాల్గొన్నారు.

తెలంగాణలో వేళ్లూనుకున్న కార్పోరేట్ శక్తుల కట్టడితోనే తెలంగాణ పునర్నిర్మాణం సాధ్యమని జేయేసీ చైర్మన్ కోదండరాం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో మొదలైన డిటిఎఫ్ జిల్లా మహాసభలకు హాజరై “తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం – ప్రజల ఆకాంక్షలు” అనే అంశంపై మాట్లాడుతూ అన్నారు.

**14 ఏప్రిల్ 2014:**

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తే తెలంగాణ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వరాదని నేడు

జరిగిన తెలంగాణ జేయేసీ విస్తృతస్థాయి సమావేశంలో నిర్ణయించారు.

తెలంగాణ జేయేసీలో కన్వీనర్‌గా పనిచేసిన కె. స్వామిగౌడ్ టిఆర్ఎస్‌లో చేరడంతో ఖాళీఅయిన కన్వీనర్ పదవికి టిఎన్‌జివో అధ్యక్షుడు జి. దేవిప్రసాద్‌రావును నామినేట్ చేసారు. అదేవిధంగా కో–చైర్మన్‌పదవిలో ఉన్న వి. శ్రీనివాస్‌గౌడ్ కూడా రాజకీయాల్లోకి వెళ్లడంతో ఆయన స్థానంలో తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి. విఠల్‌ను నియమించారు. అధికార ప్రతినిధులుగా కారం రవీందర్‌రెడ్డి, కె. రఘు, హమీద్ మహ్మద్‌ఖాన్‌లకు బాధ్యతలు అప్పగించారు. కో–కన్వీనర్‌లుగా మణిపాల్ రెడ్డి, గడ్డం జ్ఞానేశ్వర్, నల్లపు ప్రహ్లాద్, వెంకటేశం, దానకర్ణాచారిలను నియమించారు.

**15 ఏప్రిల్ 2014:**

దేశాన్ని కాంగ్రెస్‌నుంచి విముక్తి చేసేందుకే ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్నామని బిజెపి తెలంగాణ శాఖ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. టియూడబ్ల్యూజె ఏర్పాటుచేసిన 'మీట్‌దప్రెస్' కార్యక్రమంలో మాట్లాడుతూ రావణున్ని హతమార్చేందుకు రామునికి వానరులు ఎలా ఉపయోగపడ్డారో, కాంగ్రెస్ నుంచి దేశాన్ని విముక్తం చేసేందుకు ఇతర పార్టీలను అట్లాగే ఉపయోగించుకుంటామన్నారు. టియూడబ్ల్యూజె నాయకులు క్రాంతి కుమార్, పల్లె రవికుమార్, పి.వి. శ్రీనివాస్, రమేశ్‌హజారే, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**16 ఏప్రిల్ 2014:**

పది జిల్లాలకు చెందిన నాలుగు కోట్ల ప్రజల చిరకాల స్వప్నం అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను తెలంగాణ రాష్ట్ర సమితి పుట్టక ముందే కాంగ్రెస్‌పార్టీ గుర్తించిందని, ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చామని, ఎన్ని ఆవంతరాలు ఏర్పడినా ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో మనస్ఫూర్తిగా మద్దతు ఇచ్చి గెలిపించాలని ఆ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ కోరారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ మైదానంలో టిపిసిసి చీఫ్ పొన్నాల లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు.

కేంద్ర ప్రభుత్వం ఆంక్షలతో కూడిన తెలంగాణ రాష్ట్రాన్ని మాత్రమే ఇచ్చిందని, టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే సంపూర్ణ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటామని ఆ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరిగిన ఎన్నికల బహిరంగసభలో ఆయన మాట్లాడారు.

**17 ఏప్రిల్ 2014:**

ప్రజాస్వామిక దేశంలో రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ప్రచారానికి విస్తృతంగా డబ్బును ఖర్చు చేస్తున్నాయని, దీనిని అరికట్టలేకపోవడం దేశదౌర్భాగ్యమని, దేశంలోనే అత్యధికంగా మనరాష్ట్రంలో ధన ప్రవాహం కొనసాగుతున్నదని, ఇప్పటికే రూ.103 కోట్లు స్వాధీనం చేసుకున్నామని, పార్టీలు, అభ్యర్థుల వ్యవహారశైలితో రాష్ట్రం బద్నాం అవుతున్నదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి బన్వర్‌లాల్ ఆవేదన వ్యక్తం చేసారు.

**18 ఏప్రిల్ 2014:**

తెలంగాణ రాష్ట్రానికి చివరిదాకా అడ్డంపడ్డ వైఎస్ఆర్సీపి, టిడిపిలను ఈ ఎన్నికల్లో ఓడించాలని తెలంగాణ జేయేసీ పిలుపునిచ్చింది. ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు విజ్ఞత ప్రదర్శిస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేసింది. టిఎన్జీవో కార్యాలయంలో జరిగిన జేయేసీ విస్తృతస్థాయి సమావేశం వివరాలను కోదండరాం మీడియాకు వివరించారు. తెలంగాణ ప్రజల ఎజెండాను సాధించుకోవాలంటే ఈ ఎన్నికల సందర్భంలో టీజేయేసీ తటస్థవైఖరిని అవలంబించడమే సరైన మార్గమని భావించినట్లు చెప్పారు. అయితే టిజేయేసీలోని వ్యక్తులు ఎవరైనా తమ వ్యక్తిగత రాజకీయ అభిప్రాయం మేరకు ఏ పార్టీ గెలుపుకోసమైనా కృషిచేయవచ్చని పేర్కొన్నారు.

**20 ఏప్రిల్ 2014:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించిగానీ, ఈ ప్రాంత ప్రజల సమస్యలపైగానీ, అమరవీరుల గురించి గానీ ఏనాడు మాట్లాడని టిఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య 'మీట్‌దిప్రెస్' కార్యక్రమంలో విమర్శించారు. డబ్బులకు టికెట్లు అమ్ముకొని తెలంగాణ ద్రోహులకు టికెట్లు ఇచ్చారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే కెసిఆర్ ఆస్తులపై విచారణ జరిపిస్తామన్నారు.

1981 ఏప్రిల్ 20న పోలీస్‌కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన గిరిజన, ఆదివాసీల అమరవీరుల సంస్మరణదినం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో ప్రశాంతంగా ముగిసింది.

**21 ఏప్రిల్ 2014:**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే బంగారు తెలంగాణ సాధించడం సాధ్యమని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పారు. మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో నేడు జరిగిన ఎన్నికల ప్రచార సభలలో పాల్గొన్న ఆయన యువతకు అన్ని రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని, మేడిన్ చైనా తరహాలో ఇకపై మేడిన్ తెలంగాణ వస్తువులనే కొనాలనే స్థాయికి కృషి చేస్తామని చెప్పారు.

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. 46వేల పోలింగ్ స్టేషన్ల నుంచి లైవ్‌వెబ్‌కాస్ట్ చేస్తున్నామని, ఈ మేరకు బిఎస్ఎన్ఎల్ అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు.

**22 ఏప్రిల్ 2014:**

సివిల్ సర్వీసెస్ అధికారుల (ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ తదితర) విభజనపై ప్రతిపాదనలు రూపొందించేందుకు ప్రత్యూష్‌సిన్హా నాయకత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటి ముఖ్యకార్యదర్శి మహంతితో హైదరాబాద్ సమావేశమై విధివిధానలపై చర్చించారు.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చుండూరు దళితుల ఊచకోత కేసులో

దోషులకు ప్రత్యేక కోర్టు విధించిన శిక్షలను రాష్ట్ర హైకోర్టు నేడు రద్దు చేసింది.

## 25 ఏప్రిల్ 2014

ఎన్నికల ప్రచారంలో తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నీ తానే అయి అభ్యర్థుల విజయం కోసం అహోరాత్రులు శ్రమిస్తున్న తీరుపట్ల దేశ, విదేశీ పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు, పోల్ సర్వే సంస్థలు ఆశ్చర్యాన్ని, విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణలోని మొత్తం పది జిల్లాల్లో హైటెక్ హంగులతో కనీసం రోజుకు పదికి తక్కువగాకుండా కెసిఆర్ ఎన్నికల సభలలో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొంటూ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను గుక్కతిప్పుకోకుండా చేస్తున్నారు. గ్రామస్థాయి కార్యకర్తలనుండి పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి నాయకులవరకు సమన్వయం సాధించేందుకు పార్టీపరంగా పటిష్టమైన వ్యవస్థను టిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసుకున్నది. కెసిఆర్ పాల్గొంటున్న సమావేశాలకు భారీ ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నప్పటికీ, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, పార్టీకి చెందిన స్థానిక నాయకులు పోటాపోటీగా ప్రజలను కెసిఆర్ సభలకు తరలిస్తున్నారు. ఎన్నికల ప్రచార సభల్లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలపై కెసిఆర్ తనదైన శైలిలో ప్రయోగిస్తున్న విసుర్లు, వాగ్బాణాలు, విమర్శలు సభికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఎన్నికల ప్రచార సభల్లో ప్రజలనుండి టిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యక్తమవుతున్న స్పందన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో టిఆర్ఎస్ పార్టీకి ఎలాంటి అడ్డంకులు కనిపించడంలేదని ఎన్నికల ప్రచార సరళిని పరిశీలిస్తున్న మీడియా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 29 ఏప్రిల్ 2015

కొత్తగా ఉనికిలోకి రానున్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తొలి వందరోజుల పాలనలో తమ ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్న పథకాలకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి జైరాం రమేష్ నేడిక్కడ మీడియాకు వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి సంసిద్ధులై ఉన్నారని అన్నారు. కొత్తగా ఏర్పాటవుతున్న తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రానున్న కాంగ్రెస్ పార్టీ వందరోజుల పరిపాలన కాలంలోనే ఇక్కడి ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు అవసరమైన చర్యలన్నింటినీ అమలు పరుస్తుందని ఆయన అన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడున్న పది జిల్లాల సంఖ్యను 20–జిల్లాలకు పెంచేందుకు అవసరమైన జిల్లాల పునర్వ్యవస్థీకరణ కమిటీని ఏర్పాటు చేస్తామని జైరాం రమేష్ చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును ఇప్పుడున్న 58 సంవత్సరాల గరిష్ట పరిమితి నుండి 60 సంవత్సరాలకు పెంచుతామని, రైతులకు సంబంధించిన రుణాలను గరిష్టంగా రెండు లక్షలమేరకు మాఫీ చేస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. డ్వాక్రా పొదుపు సంఘాలకు ఏకమొత్తంలో లక్ష రూపాయల పరపతి సౌకర్యాన్ని అమలుపరుస్తామని, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ కమీషన్‌ను వెంటనే ఏర్పాటు

చేసి 100రోజుల్లో లక్షఉద్యోగావకాశాలు కల్పిస్తామని జైరాం రమేష్ హామీ ఇచ్చారు.

తెలంగాణ రాష్ట్రంలో రేపు జరుగనున్న పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పదిజిల్లాల వ్యాపితంగా సుమారు 90వేల మంది పోలీసు, పారామిలిటరీ, బిఎస్ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్ తదితర కేంద్రబలగాలను రంగంలోకి దింపినట్లు డిజిపి ప్రసాదరావు నేడిక్కడ వెల్లడించారు.

**30 ఏప్రిల్ 2015**

కొత్తగా ఉనికిలోకి రాబోతున్న తెలంగాణ రాష్ట్రంలో నేడు జరిగిన సాధారణ ఎన్నికల్లో మొత్తం 72 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఈ ఎన్నికల సందర్భంగా చెదురుముదురు సంఘటనలు మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బన్వర్‌లాల్ ప్రకటించారు. నల్గొండ జిల్లాలో అత్యధికంగా 81శాతం, హైదరాబాద్ రాజధాని నగరంలో అత్యల్పంగా 53శాతం ఓటింగ్ నమోదైనట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీకి సంబంధించిన 119 స్థానాలకు గాను మొట్టమొదటిసారిగా విడిగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో మొత్తం 1669మంది అభ్యర్థులు, 17లోకసభ స్థానాలకు గాను 265 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 2కోట్ల 81లక్షల మంది ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోగా,వీరందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా మొత్తం 30, 518 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

**03 మే 2014:**

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర కమిటీకి నూతన అధ్యక్షురాలుగా వి. మమత, ఉపాధ్యక్షునిగా కె. పురుశోత్తమరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎ. సత్యనారాయణ, కోశాధికారిగా జి. విష్ణువర్ధన్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిజిఓ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వి. శ్రీనివాస్‌గౌడ్ ఈ సంఘానికి శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షునిగా కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మాణించారు. ప్రభుత్వ నిబంధనలు రూల్ నెం.3 (1)(ఈ) ప్రకారం వి. శ్రీనివాస్‌గౌడ్ ఇక నుంచి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘానికి అధ్యక్షునిగా కొనసాగడానికి వీలులేదని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కాగా హైదరాబాద్‌లో అక్రమంగా తిష్టవేసిన సీమాంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపాలంటే తెలంగాణలో కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలని, ఆయన నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కావాలని శ్రీనివాస్‌గౌడ్ ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అన్నారు.

ఇటీవల పార్లమెంటుకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర పరిధిలో 70.85 శాతం ఓటింగ్ నమోదయ్యింది. 2009 ఎన్నికల్తో పోలిస్తే ఇది 2.14 శాతం ఎక్కువ.

**04 మే 2014:**

తెలంగాణలో పోలింగ్ సందర్భంగా భారీ మొత్తంలో డబ్బు తరలింపునకు

సంబంధించి టీ–కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నిబంధనలకు విరుద్ధంగా ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వెల్లడించిన విజయవాడ మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్‌లపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బన్వర్‌లాల్ డిజిపి ప్రసాదరావుకు లేఖలు రాసారు.

**05 మే 2014:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనపై స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. అదే విధంగా జూన్ 2న నిర్ణయించిన 'అపాయింటెడ్ డే'ను కూడా వాయిదా వేయలేమని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యులు ఉండవల్లి అరుణ్‌కుమార్, సి.యం.రమేశ్, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, రాయపాటి సాంబశివరావు, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి, రఘురామ క్రిష్ణంరాజు, అడుసుమిల్లి జయప్రకాశ్, విశాలాంధ్ర మహాసభ తరుపున రవితేజ, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యం.ఎల్. శర్మ... ఇలా మొత్తం 23 పిటిషన్లు దాఖలయ్యాయి.

తెలంగాణ రాష్ట్రానికి టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆరే తొలి ముఖ్యమంత్రి అవుతారని, పుష్కరకాలంగా ఉద్యమం నడిపి తెలంగాణ రాష్ట్ర సాధనకు చొరవతీసుకున్న సమర్థుడిగా శాసన సభ్యులంతా ఆయననే ఎన్నుకుంటారని ఆ పార్టీ సెక్రెటరీ జనరల్ కె. కేశవరావు తెలిపారు. ఢిల్లీలో మీడియా మాట్లాడుతూ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలన్నింటిని నెరవేర్చడంలో ఆయనను మించిన సమర్థుడు పార్టీలో ఎవరూ లేరని కేశవరావు స్పష్టం చేసారు. దళితుడినే ముఖ్యమంత్రిని చేస్తారన్న కెసిఆర్ హామీని పాత్రికేయులు గుర్తుచేయగా కొత్త రాష్ట్రంలో సమర్థ నాయకత్వం అవసరమని, ఇప్పటికైనా దళితుల్లో కెసిఆర్‌లాగా సమర్థులు ఎవరైనా వుంటే తప్పకుండా అదే చేస్తామని అన్నారు.

**07 మే 2014:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినం (అపాయింటెడ్ డే)ను మే 16వ తేదీకి మార్చాలని కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర సమితి విజ్ఞప్తి చేసింది. తెలంగాణ రాష్ట్ర సమితి సెక్రెటరీ జనరల్ కె. కేశవరావు నేతృత్వంలోని పార్టీ ప్రతినిధుల బృందం ఈ మేరకు ఢిల్లీలో కేంద్రహోంశాఖ కార్యదర్శి అనిల్‌గోస్వామికి వినతి పత్రాన్ని అందజేసింది.

**09 మే 2014:**

ఎన్నికల అనంతరం కేంద్రంలో యూపీఏకే మద్దతు ఇస్తామని టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ప్రకటించారు. రాహుల్ ప్రధాని అభ్యర్థిత్వానికి అండగా నిలుస్తామన్నారు. అలా కాని పక్షంలో థర్డ్ ఫ్రంట్‌కు మద్దతు పలుకుతామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోను ఎన్డీయేకు మద్దతునిచ్చేది లేదని కెసిఆర్ స్పష్టం చేసారు. తెలంగాణ కల సాకారం చేసిన సోనియా గాంధీకి తాము జీవితాంతం కృతజ్ఞులమై వుంటామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో జరిగిన టిఆర్ఎస్ ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీమాంధ్రలో

జగన్ వందకు పైగా సీట్లు గెలుస్తున్నారని, చంద్రబాబు పరిస్థితి రెంటికి చెడ్డ రేవడేనని కెసిఆర్ ఎద్దేవా చేసారు.

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు.

నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధాలు కలిగివున్నారన్న ఆరోపణలపై ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసారు.

**10 మే 2014:**

తెలంగాణ రాష్ట్రం కోసం ఆర్థిక శాఖ రూపొందించిన 26 వేల కోట్ల రూపాయల బడ్జెట్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు. జూన్ 2 అపాయింటెడ్ డే తర్వాత కొత్త ప్రభుత్వాలకు ఆర్థిక పరమైన ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలికంగా ఈ ఏర్పాటు చేసారు. జూన్, జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలకు గాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలమధ్య 58:42 నిష్పత్తి ప్రకారం ఓటాన్‌అకౌంట్ బడ్జెట్‌ను విభజించారు.

**11 మే 2014:**

టిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కోనపురి రాములును గుర్తుతెలియని దుండగులు నల్గొండ పట్టణంలోని ఎంఎ బేగ్ ఫంక్షన్‌హాల్‌లో ఒక వివాహానికి హాజరైన సమయంలో తుపాకులతో కాల్చి చంపారు. ఆయన మాజీ మావోయిస్టు సాంబశివుని సోదరుడు. రాములు సోదరుడు కోనపురి ఐలయ్య అలియాస్ సాంబశివుని కూడా 2011 మార్చి 26న వలిగొండ మండలం సంగెం గ్రామంలో జరిగిన తెలంగాణ ధూంధాం కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తుండగా వేటకొడవళ్లతో వెంటాడి దాడిచేసి దారుణంగా నరికి చంపేసారు.

**12 మే 2014:**

తెలంగాణ వ్యాప్తంగా పురపాలక, నగరపాలక సంస్థలు కార్పోరేషన్లకు జరిగిన ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. తెలంగాణాలోని మూడు కార్పోరేషన్ల (నిజామాబాద్, కరీంనగర్, రామగుండం) పరిధిలో 150 డివిజన్లకు ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ 49 డివిజన్లు, టిఆర్ఎస్ 48 డివిజన్లు, స్వతంత్రులు 51 డివిజన్లలో విజయం సాధించగా టిడిపి కేవలం ఒకే ఒక డివిజన్‌లో విజయం సాధించింది. అదే విధంగా 53 మున్సిపాలిటీల పరిధిలో జరిగిన వార్డు సభ్యుల ఎన్నికల్లో కాంగ్రెస్-525, టిఆర్ఎస్-313, టిడిపి-162, వామపక్షాలు-44, ఇతరులు-350 స్థానాల్లో గెలుపొందారు. కాగా తెలంగాణలోని మొత్తం 53 మున్సిపాలిటీలలో అత్యధికంగా 21 మున్సిపాలిటీలలో 'హంగ్' కొనసాగనుంది. అయితే కాంగ్రెస్ 18 మున్సిపాలిటీలలో, టిఆర్ఎస్ 8 మున్సిపాలిటీలలో, టిడిపి 2, బిజెపి 2, ఎంఐఎం 1, బిఎస్‌పి 1 స్థానాల్లో మెజార్టీని సాధించాయి.

**13 మే 2014:**

తెలంగాణ ప్రాంతంలోని స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి తన అధిక్యతను నిలబెట్టుకున్నది. తెలంగాణలో మొత్తం జెడ్పీటీసీలు 444 స్థానాలుండగా 441 స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. అట్లాగే తెలంగాణలో మొత్తం 6,480 ఎంపిటీసీ స్థానాలుండగా 6,392 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 69 స్థానాలు పోటీ లేకుండా ఏకగ్రీవంగా కాగా 19 స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. ప్రకటించిన ఫలితాల ప్రకారం టిఆర్ఎస్ పార్టీకి 183 జెడ్పీటీసీ, 1828 ఎంపీటీసీ, 3 జిల్లా పరిషత్తులు (జెడ్పీ), 95 మండల ప్రజాపరిషత్తు (ఎంపిపి) స్థానాల్లో విజయం సాధించింది. కాగా కాంగ్రెస్ పార్టీ 161 జెడ్పీటీసీ, 2223 ఎంపీటీసీ, 2 జిల్లా పరిషత్తులు (జెడ్పీ), 84 మండల ప్రజాపరిషత్తు (ఎంపిపి) స్థానాల్లో విజయం సాధించింది. వైఎస్ఆర్సీపి 5 జెడ్పీటీసీ, 106 ఎంపీటీసీ, 0 జిల్లా పరిషత్తులు (జెడ్పీ), 2 మండల ప్రజాపరిషత్తు (ఎంపిపి) స్థానాల్లో విజయం సాధించింది. టిడిపి 50 జెడ్పీటీసీ, 998 ఎంపీటీసీ, 1 జిల్లా పరిషత్తులు (జెడ్పీ), 26 మండల ప్రజాపరిషత్తు (ఎంపిపి) స్థానాల్లో మెజార్టీ సాధించింది. బిజెపి 4 జెడ్పీటీసీ, 269 ఎంపీటీసీ, 0 జిల్లా పరిషత్తులు (జెడ్పీ), 0 మండల ప్రజాపరిషత్తు (ఎంపిపి) స్థానాల్లో విజయం సాధించింది. వామపక్షాలు 7 జెడ్పీటీసీ, 203 ఎంపీటీసీ, 0 జిల్లా పరిషత్తులు (జెడ్పీ), 5 మండల ప్రజాపరిషత్తు (ఎంపిపి) స్థానాల్లో విజయం సాధించింది. ఇతరులు 3 జెడ్పీటీసీ, 555 ఎంపీటీసీలు గెలుపొందారు. ఎంఐఎం పార్టీ కేవలం 18 ఎంపిటీసీ స్థానాల్లో మాత్రమే గెలుపొందింది.

**14 మే 2014:**

జూన్ 2వ తేదీ నుండి ఉనికిలోకి వచ్చే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఒకే గవర్నర్‌ను కొనసాగించాలని కేంద్ర హోంశాఖ చేసిన సిఫారసుకు ప్రధాన మంత్రి ఆమోదం తెలిపారు. ఇప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గవర్నర్‌గా కొనసాగుతన్న ఇ.ఎస్.ఎల్. నరసింహన్‌ను జూన్ 2వ తేదీ తర్వాత కూడా రెండు రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నగా కొనసాగించాలని కేంద్ర హోంశాఖ తన ఉత్తర్వులో పేర్కొంది.

**16 మే 2014:**

సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో దేశవ్యాప్తంగా నరేంద్రమోడి ప్రభంజనం భారతీయ జనతా పార్టీకి చరిత్రలో ఏనాడు ఎరుగని భారీ విజయాన్ని అందించింది. కేంద్రంలో సుమారు 25 సంవత్సరాల సంకీర్ణ శకం ముగిసి దేశ రాజకీయాల్లో ఒక పార్టీ స్వంత బలంమీద ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నది. మొత్తం 543 సీట్లకు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి 339 సీట్లను గెలుచుకుంది. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ కూటమి కేవలం 59 సీట్లకే పరిమితమైంది. స్వంతంగా బీజేపీ 285 సీట్లు సాధించగా కాంగ్రెస్ పార్టీకి స్వంతంగా

44 స్థానాలు మాత్రమే దక్కాయి.

కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రానికి జరిగిన తొలి ఎన్నికల్లో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశాన్ని తెలంగాణ ప్రజలు తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీకే అప్పగిస్తూ తమ ఓటు హక్కు ద్వారా స్పష్టమైన తీర్పును వెల్లడించారు. అసెంబ్లీ నియోజకవర్గ ఫలితాల్లో పార్టీలు సాధించిన సీట్ల వివరాలు: టిఆర్ఎస్–63, కాంగ్రెస్–21, టిడిపి–15, బిజెపి–5, ఎంఐఎం–7, వామపక్షాలు–2, వైఎస్సార్సీపి–3, బిఎస్పి–2, ఇండిపెండెంట్–1.

తెలంగాణ రాష్ట్రంలోని 17 లోకసభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టిఆర్ఎస్–11, కాంగ్రెస్–2, టిడిపి–1, బిజెపి–1, వైఎస్సార్సీపి–1, ఎంఐఎం–1 స్థానాలు గెలుచుకున్నాయి.

**17 మే 2014:**

టిఆర్ఎస్ శాసన సభా పక్షనేతగా పార్టీ అధినేత కె.చంద్రశేఖర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. దీనితో ఆయన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టడం ఖాయమైంది. తెలంగాణ భవన్‌లో జరిగిన టిఆర్ఎస్ ఎంపి, ఎమ్మెల్యేల విస్తృతస్థాయి సంయుక్త సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కెసిఆర్ పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలు ఈటెల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, కోవ లక్ష్మి బలపరిచారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఎంపీలంతా హర్షాతిరేకాలతో మద్దతు పలికారు. అనంతరం కెసిఆర్ మాట్లాడుతూ రాజకీయ అవినీతిని ఎట్టి పరిస్థితుల్లో సహించవద్దని, కడుపు నోరు కట్టుకొని ప్రజలకోసం పని చేద్దామని, హంగులు ఆర్భాటాలు లేకుండా నిరాడంబరంగా జీవిద్దామని పిలుపు నిచ్చారు. సంక్షేమం, ఉపాధి, వ్యవసాయ రంగాలకు తెలంగాణ ప్రభుత్వం అంకితమవు తుందని చెప్పారు. ప్రభుత్వ విధాన రూపకల్పనలో నిపుణులు, మేధావుల సూచనలను తీసుకుందామన్నారు.

**19 మే 2014:**

దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు వివిధ పత్రికల్లో కార్టూనిస్టుగా పనిచేసిన కంబాలపల్లి చంద్రశేఖర్ (49) ఆనారోగ్యంతో తెల్లవారుజామున కన్నుమూసారు. గత రెండేళ్లుగా స్టమక్ క్యాన్సర్‌తో బాధపడుతున్న శేఖర్ తెలుగు కార్టూనిస్టుల దినోత్సవానికి ఒక రోజు ముందుగా చనిపోవడం అభిమానులను విషాదంలో ముంచింది.

తెలంగాణ రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న టిఆర్ఎస్ పార్టీకి తమ పూర్తి మద్దతు ఉంటుందని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈటెల రాజెందర్, కెటిఆర్, టి.పద్మారావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు నాయిని నర్సింహారెడ్డి ఎంఐఎం పార్టీ కార్యాలయానికి వెళ్లి పార్టీ అధినేత ఓవైసీ, ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతో రెండున్నర గంటలపాటు

సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఓవైసీ ఇచ్చిన విందులో పాల్గొన్న అనంతరం విలేకరుల సమావేశంలో మద్దతు విషయాన్ని వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్రానికి తెలంగాణ పవర్ జనరేషన్ కార్పోరేషన్ (టీజెన్‌కో) ఆవిర్భవించింది. రాష్ట్ర విభజన ప్రక్రియలో భాగంగా మొట్టమొదట ఏర్పడిన కార్పోరేషన్‌గా టీజెన్‌కో చరిత్రలో నమోదు కావడం గమనార్హం.

**18 మే 2014:**

దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో కొత్త లోక్‌సభ ఏర్పాటు కోసం రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ప్రస్తుత 15వ లోక్‌సభను రద్దు చేసారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 85 (2బి)ని అనుసరించి లోక్‌సభను రద్దు చేయాలని క్యాబినెట్ చేసిన సిఫారసుపై రాష్ట్రపతి సంతకం చేసారు. కాగా సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన 543 మంది లోక్‌సభ సభ్యుల జాబితా రాష్ట్రపతికి చేరింది. త్వరలో ఏర్పాటు కానున్న 16వ లోక్‌సభలో సభ్యులు కానున్న ఎంపీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ వి.ఎస్.సంపత్ నేతృత్వంలోని బృందం రాష్ట్రపతి భవన్‌లో ప్రణబ్ ముఖర్జీని కలిసి సమర్పించారు.

**20 మే 2014:**

దేశాన్ని స్వంతబలంతో పాలించాలన్న బీజేపీ కలను అపూర్వ విజయంతో సాకారం చేసిన నరేంద్రమోడీని బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో బీజేపీ సీనియర్ నేత ఎల్.కె.అద్వానీ మోడీ పేరును ప్రతిపాదించగా పార్టీకి చెందిన ఎంపీలంతా బల్లలు చరిచి అంగీకారం తెలిపారు. ఆ తర్వాత జరిగిన సమావేశంలో ఎన్డీఏ మిత్రపక్షాలన్నీ మోడీని తమ నాయకునిగా ఎన్నుకున్నాయి. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీని కలిసిన బీజేపీ, ఎన్డీఏ నేతలు మోడీ నాయకత్వానికి మద్దతుగా లేఖలు సమర్పించారు. దానితో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా మోడీని రాష్ట్రపతి ఆహ్వానించారు. ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు.

**21 మే 2014:**

రాష్ట్ర విభజన తుదిఘట్టంలో ఉద్యోగ స్థానికత నిర్ధారణ, విభజన మార్గదర్శకాల్లో లోటుపాట్లు తదితర అంశాలపై తెలంగాణ ఉద్యోగులలో పెల్లుబుకుతున్న ఆందోళన నేపథ్యంలో ఉద్యోగుల స్థానికతను నిర్ధారించేందుకు ఎమ్మెల్యేలు హరీష్‌రావు, టి.మహేందర్ రెడ్డి, వి. శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ స్వామిగౌడ్, మరో ఇద్దరు ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కెసిఆర్ ప్రకటించారు.

తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులపై కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తివేయాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం డిమాండ్ చేసింది.

**22 మే 2014:**

తెలంగాణ సచివాలయంలో సీమాంధ్ర ఉద్యోగులను అనుమతించే ప్రసక్తే లేదని, తెలంగాణ రాష్ట్రానికి జూన్ 2 నుండి ఎంప్లాయిఫ్రెండ్లీ గవర్నమెంటు ఏర్పడ నున్నదని కెసిఆర్ బరోసా ఇచ్చారు. కొంపెల్లిలోని ఆర్డీ కన్‌వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేయేసీ ఆధ్వర్యంలో జరిగిన అభినందనసభలో కెసిఆర్ మాట్లాడుతూ "ఎవ్వని అయ్యకు తెలువకుండా సమస్యలు పరిష్కరించుకునే సంస్కృతి తెలంగాణకు ఉన్నది. ఒకవేళ సామరస్యంగా వినకపోతే, కొట్లాడాల్సివస్తే కొట్లాడేందుకు కెసిఆర్ సిద్ధం. ఏడికైతే గాడికాయె" అని టిఆర్ఎస్ అధినేత హెచ్చరించారు. ఉద్యమంనుంచి ఎదిగివచ్చిన కె.స్వామిగౌడ్, వి.శ్రీనివాస్‌గౌడ్‌లకు మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తామని, అవసరమైతే ఉద్యోగుల సంక్షేమానికి మంత్రివర్గంలో ప్రత్యేక శాఖను ఏర్పాటుచేస్తామని కెసిఆర్ హామీ ఇచ్చారు.

తెలంగాణ ఉద్యోగ సంఘాల జేయేసీ సెక్రెటరీ జనరల్, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, తెలంగాణ జేయేసీ కో–చైర్మన్ సి. విఠల్‌ను ఉద్యోగుల విభజనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించారు. ఆయన ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ శాఖలో సీనియర్ అసిస్టెంట్ హోదాలో పనిచేస్తున్నారు. విఠల్ స్థానికతలో పుట్టుపూర్వోత్తరాలతో సహా మెదక్ జిల్లా వాసిగా సర్వీసు బుక్‌లో స్పష్టంగా నమోదై వున్నది. ఏ నిబంధనల ప్రకారం చూసినా ఆయనను తెలంగాణ ప్రభుత్వానికి మాత్రమే కేటాయించాలి. ఇంటర్ ఎడ్యుకేషన్‌లో ఉద్యోగుల పంపిణిలో అనుసరించిన విధానంపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని విఠల్ హెచ్చరించారు.

ఉద్యోగుల విభజన సందర్భంలో ఉత్పన్నమయ్యే సమస్యలు పరిష్కరించేందుకు టిఆర్ఎస్ సారథ్యంలో "వార్ రూం"ను ఏర్పాటు చేసారు. టిఆర్ఎస్ కార్యాలయం (తెలంగాణ భవన్)లో నేటినుంచే "వార్ రూం" పనిచేయడం ప్రారంభిస్తుంది.

**25 మే 2014:**

ప్రపంచలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్టు శిఖరంపై తెలంగాణ బిడ్డలు విజయ పతాకాన్ని ఎగురవేశారు. నిరుపేద కుటుంబాల నుంచి వచ్చినా మొక్కవోని సంకల్పంతో అత్యున్నత శిఖరాన్ని అధిరోహించారు. ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా సాహసయాత్రను సాగించిన ఇందూరు (నిమాజాబాద్)కు చెందిన 13 ఏండ్ల మాలావత్ పూర్ణ, 18 ఏండ్ల ఖమ్మం విద్యార్థి ఆనంద్‌కుమార్ అత్యున్నత ఎవరెస్టు శిఖరంపై నిలబడి తెలంగాణ కీర్తిని, భారతదేశ ఖ్యాతిని నలుదిశలాచాటారు.

తెలంగాణ రాష్ట్రంలో మద్యంపాలసీని సమీక్షిస్తామని, తక్షణమే మద్దం బెల్టుషాపులను ఎత్తివేస్తామని నిజామాబాద్ ఎంపి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత స్పష్టం చేసారు. మద్యం వ్యసనానికి మూల కారణాలు ప్రభుత్వ ఎక్సైజ్ విధానంలో వున్నాయని, కెసిఆర్ నేతృత్వంలోని టిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడున్న మద్యం పాలసీని సమీక్షిస్తుందని, ఛీప్ లిక్కర్ పూర్తిగా నిర్మూలిస్తామని అన్నారు. మహిళల సంక్షేమం, భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తామని, మండలానికొక మహిళా పోలీస్

స్టేషన్ ఏర్పాటు చేస్తామని ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కవిత అన్నారు.

టిఆర్ఎస్ ప్రభుత్వం కొలువుతీరగానే తెలంగాణలోని భూములపై రీసర్వే నిర్వహిస్తామని టిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ తెలిపారు. తెలంగాణ తాసిల్దార్స్ అసోసియేషన్ కార్యాలయ ప్రారంభోత్సవ సభలో మాట్లాడిన కెటిఆర్ 1954లో నిర్వహించిన సర్వే తప్ప ఇంతవరకు తిరిగి సర్వే నిర్వహించలేదని, ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో వున్న వివరాలన్నీ తప్పులతడకగా వున్నాయన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల ఐక్యవేదిక చైర్మన్ కె.రాములు, తెలంగాణ తాసిల్దార్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి, తెలంగాణ ఉద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షుడు పద్మాచారి, యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఎస్.కుమారస్వామి, ప్రజాకవి, గాయకుడు గోరెటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**26 మే 2014:**

భారతదేశ 15వ ప్రధాన మంత్రిగా భారతీయ జనతా పార్టీకి చెందిన నరేంద్ర దామోదరదాస్ మోడి సాయంత్రం 6 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేసారు. రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ప్రధాన మంత్రితో పాటు మరో 45 మంది కేంద్ర క్యాబినెట్, సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిలో ఏడుగురు మహిళలున్నారు. ఈ కార్యక్రమానికి దక్షిణాసియా దేశాధినేతలు, దేశంలోని వివిఐపిలతో పాటు నాలుగువేల మంది అతిధులు హాజరైన ఈ కార్యక్రమం భారీవేడుకను తలపించింది. పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ ప్రత్యేక ఆకర్షణగా నిలువగా... ఆఫ్గనిస్థాన్ అధ్యక్షుడు హమీద్ ఖర్జాయ్, శ్రీలంక అధ్యక్షుడు మహింద్ర రాజపక్సే, భూటాన్ ప్రధాని షెరింగ్‌తోబ్గే, నేపాల్ ప్రధాని సుశీల్ కోయిరాలా, మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లాయమీన్ అబ్దుల్ గయూమ్, బంగ్లాదేశ్ పార్లమెంటు స్పీకర్ షిరిన్‌చౌదరి, మారిషస్ ప్రధాని నవీన్ రాం గులామ్ హాజరైనారు. స్థిరమైన, సుపరిపాలన అందిస్తామని ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మోడి హామిఇచ్చారు.

తాజా ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు స్థానంనుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు తన ఎంపి పదవికి ఢిల్లీలో రాజీనామా సమర్పించారు.

**27 మే 2014:**

ఖమ్మం జిల్లాలో చేపట్టిన పోలవరం భారీ ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే ఏడు మండలాలకు చెందిన 205 గ్రామాలను అవశేష ఆంధ్రప్రదేశ్‌లోనే కలిపేందుకు అవసరమయిన ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని కేంద్ర క్యాబినెట్ తొలి సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారు. అయితే ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తే ఊరుకునేది లేదని టిఆర్ఎస్ అధినేత, కాబోయే తెలంగాణ ముఖ్య మంత్రి ఢిల్లీలో హెచ్చరించారు.

### 29 మే 2014:

ఖమ్మం జిల్లాలో పోలవరం ముంపు మండలాలను సీమాంధ్రలో విలీనం చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఇచ్చిన బంద్ పిలుపునకు యావత్తు తెలంగాణ మద్దతు పలికింది. పది జిల్లాల్లో బంద్ సంపూర్ణంగా,చాలా ప్రశాంతంగా జరిగింది. కాగా ఈ ఆర్డినెన్స్ రద్దు కోరుతూ ఎమ్మెల్యే సున్నం రాజయ్య భద్రాచలంలో ఆమరణ నిరాహారదీక్షను చేపట్టారు.

నూతనంగా ఆవిర్భవించే తెలంగాణ రాష్ట్రంలో తొలి ప్రభత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా టిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును గవర్నర్ నరసింహం ఆహ్వానించారు. ఈమేరకు గవర్నర్ పంపిన అధికారిక లేఖ కెసిఆర్‌కు అందింది. జూన్ 2వ తేదీ అపాయింటెడ్ డే రోజున ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఆ లేఖలో కోరారు.

### 31 మే 2014

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనకు సంబంధించిన అన్ని అంశాల్లో రెండు రాష్ట్రాలకు మేలు జరిగేలా శాయశక్తులా యత్నించానని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ చెప్పారు. ఆస్తులు, అప్పుల పంపిణీ విషయంలో ఎలాంటి అపోహలు వద్దని, రానున్న రోజుల్లో ఇరురాష్ట్రాలమధ్యన ఎలాంటి సమస్యలు తలెత్తినా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంయమనంతో వ్యవహరించి పరస్పర సహకారంతో పరిష్కరించు కోవాలని ఆయన సూచించారు. గతంలో జరిగిన మంచి, చెడులను చరిత్రకే వదిలివేయాలని, గడిచిన నాలుగు సంవత్సరాల ఉద్యమ కాలంలో ఒక్క బుల్లెట్టుకూడా వాడలేదని గవర్నర్ నరసింహన్ మీడియాతో మాట్లాడుతూ గుర్తుకుచేసారు. తెలంగాణలో ఆదివారం అర్థరాత్రితో రాష్ట్రపతి పాలన ముగుస్తుందని ఈ సందర్భంగా గవర్నర్ తెలిపారు.

మాజీ పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి కమల్‌నాథ్ కొత్త లోకసభకు ప్రోటెం స్పీకర్‌గా నియమితులయ్యారు. కమల్‌నాథ్‌ను ప్రోటెం స్పీకర్‌గా రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ బాధ్యతలు అప్పగించారని పేర్కొంటూ లోకసభ కార్యదర్శి ఢిల్లీలో నోటిఫికేషన్ విడుదల చేసారు.

రాష్ట్ర ప్రభుత్వంలో రాజకీయ అవినీతికి తావులేకుండా, పారదర్శక పాలన అందించడం, ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ కార్యక్రమాలకు రూపకల్పన చేయడంకోసం వివిధ రంగాలనుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కనీసం 30 మంది మేథావులతో స్టేట్ అడ్వైజరీ కమిటీ (ఎస్.ఏ.సీ)ని ఏర్పాటు చేయనున్నట్లు టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సూత్రప్రాయంగా తెలిపారు. రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి నివాసంలో ఆయన వివిధ పత్రికలు, టెలివిజన్ ఛానెళ్లకు సంబంధించిన ఎడిటర్లు, సీనియర్ జర్నలిస్టులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

### 01 జూన్ 2014

బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పీ) పార్టీ తరపున ఆదిలాబాద్ జిల్లాలో పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలిచిన ఇంద్రకరణ్‌రెడ్డి (నిర్మల్), కోనేరు కోనప్ప (సిర్పూర్ కాగజ్‌నగర్) టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఆదివారం నాడు కలిసి మద్దతు ప్రకటించారు. బీఎస్పీ శాసనసభాపక్షాన్ని టీఆర్ఎస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు.

పోలవరం ముంపు ప్రాంతాలను సీమాంధ్రలో కలుపుతూ కేంద్రప్రభుత్వం ఆమోదించన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని డిమాండు చేస్తూ భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య చేపట్టిన ఆమరణ దీక్ష ఆదివారం నాడు నాలుగో రోజుకు చేరడంతో పోలీసులు దీక్షను భగ్నం చేసి, బలవంతంగా సున్నం రాజయ్యను ఆసుపత్రికి తరలించారు.

నూతన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రాజీవ్ శర్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1982 బ్యాచ్ ఐఎఎస్ అధికారి రాజీవ్‌శర్మ ప్రస్తుతం కేంద్ర హెూం శాఖ అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర తొలి పోలీస్ బాస్‌గా ఐపీఎస్ అధికారి అనురాగ్‌శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఇంఛార్జి డిజీపీగా ఆయనను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పీ.కే. మహంతి ఆదివారం ఉత్తర్వులు జారీచేసారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అనురాగ్ శర్మ రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్‌కు చెందిన ఐ.పి.ఎస్ అధికారి మమతారెడ్డిని వివాహమాడారు.

**02 జూన్ 2015**

రాజ్‌భవన్‌లో నేడు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 29వ రాష్ట్రంగా కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఉదయం 8.15 నిమిషాలకు ప్రమాణస్వీకారం చేసారు. ఆయనతోపాటు ఉపముఖ్యమంత్రులుగా ఎం.డీ. మహమూద్ అలీ, టీ. రాజయ్య, మంత్రులుగా నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తన్నీరు హరీష్‌రావు, కల్వకుంట్ల తారక రామారావు, పి. మహేందర్‌రెడ్డి, జోగు రామన్న, టి. జగదీశ్వర్‌రెడ్డి, టీ. పద్మారావులు కూడా ప్రమాణస్వీకారం చేసారు.

అనేక దశాబ్దాల ఉద్యమంతో సాధించుకున్న స్వరాష్ట్ర అభివృద్ధికి కూడా ఉద్య మ పంథానే అనుసరిస్తామని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రకటిం చారు. రాజకీయ అవినీతిని కూకటివేళ్లతో పెకిలించి, ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ తన ప్రభుత్వ లక్ష్యాలను, ప్రాధాన్యతలను వివరించారు.

***



నెక్లెస్ రోడ్‌లో సాగరహారం (తెలంగాణ మార్చ్)

(30 సెప్టెంబరు, 2012)





## పిట్టల రవీందర్

### ఇతర రచనలు

1) Fishful Thinking (2014)
2) తెలంగాణ ఉద్యమంలో... తెరవెనక దృశ్యాలు (2014)
3) సకల జనుల సమ్మెలో సింగరేణి ఒక పరిశీలన (2013)
4) తెలంగాణ మార్చ్ -సాగరహారం (2013)
5) తెలంగాణ మిలియన్ మార్చ్ (2012)
6) మానుకోట, మే 28 (2011)
7) భూమి పుండు (ఓపెన్‌కాస్ట్ గనులపై వ్యాస సంకలనం) (2010)
8) కాంగ్రెస్ ఐదేండ్ల పాలన - విద్రోహం, విధ్వంసం (2009)
9) బొగ్గు పొరల్లో (సింగరేణి గని కార్మికుల కవిత్వం) (2007)
10) సింగరేణి పరిణామాలు - పర్యవసానాలు (2007)
11) 'చర్చ' సంపాదకీయాలు (2004)
12) 'చర్చ' తెలంగాణ వ్యాసాలు (2004)
13) 'చర్చ' సింగరేణి వ్యాసాలు (2004)
14) సింగరేణిలో సంస్కరణలు - ఒక పరిశీలన (2004)

తెలంగాణ రాష్ట్ర సాధన

# ఉద్యమ డైరీ

(2009-2014)



అంతిమంగా తెలంగాణ ప్రజలు సుదీర్ఘకాలంపాటు అనేక రూపాల్లో కొనసాగించిన ఉద్యమం రాష్ట్ర సాధన లక్ష్యాన్ని అధిగమించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నది. అయితే ఉద్యమ క్రమంలో తెరమీదికి వచ్చిన అనేక అంశాలను, సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలందరూ సమిష్టిగా ఆలోచించి, అడుగులు కలపాల్సిఉన్నది. అరవై సంవత్సరాల సుదీర్ఘ కాలంపాటు కొనసాగిన అన్యాయాలు, నిర్లక్ష్యాలు, వివక్షలు, సమస్యలు స్వల్పవ్యవధిలోనే పరిష్కారం కావడం సాధ్యం కాదు. అయితే ఇందుకు అవసరమైన దీర్ఘకాలిక ప్రణాళిక, కార్యాచరణ రూపొందించుకోవాలి. ఇది జరగాలంటే తెలంగాణలో మిగిలిఉన్న సీమాంధ్ర ఆధిపత్య మూలాలు సమూలంగా తొలగి పోవాలి. సంపూర్ణతెలంగాణ రాష్ట్రంగా నిలదొక్కుకోవాలి. ఈ దిశలో ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పాలుపంచుకున్న **పిట్టల రవీందర్** ఏర్చి, కూర్చి అందిస్తున్న ఈ **'ఉద్యమ డైరీ'** ఉద్యమ క్రమాన్ని మన కళ్లముందు నిలుపుతుంది. ఉద్యమంలో జరిగిన పరిణామాలను గుర్తుకు చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చివరిదశ ఉద్యమ తీరుతెన్నులను ఎవరికివారుగా విశ్లేషించుకోవడానికి, అర్థం చేసుకోవడానికి ఈ **'ఉద్యమ డైరీ'** లో ఇచ్చిన సమాచారం ఒక ప్రామాణికంగా పనికి వస్తుంది. ఉద్యమ జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి, ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించడానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు. ప్రతి ఇంటిలో ఉండదగిన **'ఉద్యమ డైరీ'** ని అందిస్తున్న మిత్రుడు **పిట్టల రవీందర్‌**కు అభినందనలతో ...

**ప్రొ॥ యం. కోదండరాం**

**HOME LAND PUBLICATIONS PVT. LTD.**
# 5-9-22/4, Hillfort, Adarshanagar, Hyderabad, Ph.040-64525234